వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

అనుశాసన పర్వం - 2



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

9636

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
అనుశాసన పర్వం - 2

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
రామ-మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

అనుశాసన పర్వం - 2

ప్రథమ ముద్రణ : గీతా జయంతి (డిసెంబర్ 2010)

C 27495

20 సంపుటాల వెల : రూ. 720/-



ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

కీ॥శే॥ కొరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి



టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

కీ॥శే॥ బ్రహ్మశ్రీ పాలపర్తి వెంకట సుబ్బారావు

వారి ధర్మపత్ని పూర్ణాంబ

As a Hindu, every individual has to study,
observe, and realize the essence of

MAHABHARATHAM

An. Muthu Palaniappam
M. Meenakshi

As a Hindu, every individual has to study,
observe, and rea ˙ze the essence of

MAHABHARATHAM



M. Bala Subramanyam
Smt. Anbuchelvi

మానవులలో మానవత్వాన్ని పెంపొందించే

మహాభారతానికి మా నమస్కారం

సిరిగిరి దుర్గారావు

వారి ధర్మపత్ని శ్రీమతి శారద

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

అనుశాసన పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది 'అభిగమ్యకృతే దానం' అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా। సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా। ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా। ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.		శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.		శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే ఆలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంవయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్వ్యాయాసుః పురుషోత్తమాముజభవ శ్రీకన్దరా శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

---

* మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహ ఇచ్చాం అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
91.	నీమికి అత్రి ఉపదేశము - శ్రాద్ధములో త్యజింపదగిన వస్తు వివరణము.(45)*	21
92.	పితరుల ఆశీర్వచనము - వివరణ. (23)	23
93.	బిసస్తైన్యోపాఖ్యానము. (145+1 $\frac{1}{2}$)	25
94.	శపథవిధి. (54)	35
95.	గొడుగు, చెప్పుల పుట్టుక. (28)	39
96.	గొడుగు, చెప్పులు - దానఫలము. (22+175 $\frac{1}{2}$)	40
97.	బలిదాన విధి. (25)	49
98.	సువర్ణ, మను సంవాదము. (66+1)	50
99.	అగస్త్య భృగు సంవాదము. (29)	54
100.	నహుష పతనము. (41)	56
101.	రాజన్య చండాల సంవాదము. (29+1)	58
102.	హస్తి కూటము. (63)	60
103.	బ్రహ్మభగీరథ సంవాదము. (45)	66
104.	ఆయుష్యాఖ్యానము. (156+9 $\frac{1}{2}$)	69
105.	జ్యేష్ఠ కనిష్ఠ వృత్తి. (20)	78
106.	ఉపవాస విధి. (72)	80
107.	ఉపవాస వ్రత ఫలవర్ణనము. (144)	84
108.	మానస పార్థివతీర్థముల మహత్త్వము. (21+ $\frac{1}{2}$)	91
109.	విష్ణు ద్వాదశకము. (17)	93
110.	మార్గశీర్షమాస చంద్రవ్రతము. (10)	94
111.	సంసార చక్రము. (133)	95

* బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
112.	అన్నదాన మహిమ. (31+4)	102
113.	అహింసా ధర్మముల మహిమ. (11)	104
114.	హింసా మాంస భక్షణనింద. (19+2)	105
115.	మద్యమాంస పరిత్యాగ ఫలము. (76)	106
116.	అహింసాధర్మ ప్రశంస. (32)	111
117.	కీటోపాఖ్యానము - 1 (29)	113
118.	కీటోపాఖ్యానము - 2 (24)	114
119.	కీటోపాఖ్యానము - 3 (15)	116
120.	వ్యాసమైత్రేయ సంవాదము - దాన ప్రశంసా కర్మ రహస్యాలు (27)	117
121.	వ్యాసమైత్రేయ సంవాదము - అన్నదాన ప్రశంస (17)	119
122.	వ్యాసమైత్రేయ సంవాదము - గృహస్థ కర్తవ్యము (20)	120
123.	శాండిలీసుమనా సంవాదము - పతివ్రతా కర్తవ్యము (21+3 $\frac{1}{2}$)	121
124.	హరిణకృశకాఖ్యానము (39+28 $\frac{1}{2}$)	123
125.	పితృరహస్యము (84)	127
126.	దేవరహస్యము (50)	132
127.	ధర్మరహస్య వర్ణన (19)	135
128.	వాయువు ధర్మాధర్మములను వివరించుట. (11)	136
129.	లోమశరహస్యము (15)	137
130.	అరుంధతీ చిత్రగుప్తరహస్యము. (40)	138
131.	ప్రమథరహస్యము. (12)	140
132.	దిగ్గజరహస్యము. (17)	141
133.	మహాదేవరహస్యము. (9)	142
134.	స్కందదేవ రహస్యము (17)	143
135.	భోజ్య - అభోజ్యాన్న వివరణ. (21)	144

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
136.	అనుచిత భోజనప్రాయశ్చితము. (25)	145
137.	దానప్రశంస (32)	147
138.	పంచదాన వివరణము. (11)	148
139.	ఋషి శ్రీకృష్ణ సంభాషణము. (50+1)	149
140.	ఉమామహేశ్వర సంవాద ప్రారంభము. (51+6 $\frac{1}{2}$)	152
141.	ఉమామహేశ్వర సంవాదము - ప్రవృత్తి నివృత్తి ధర్మ నిరూపణము. (115+106 $\frac{1}{2}$)	156
142.	ఉమామహేశ్వర సంవాదము - 2. (59+37 $\frac{1}{2}$)	167
143.	వర్ణప్రాప్తిలో కర్మప్రాధాన్యము. (59)	173
144.	బంధనాది కారణములయిన శుభాశుభకర్మలను వర్ణించుట. (60)	176
145.	స్వర్గనరకాది ప్రాప్తికారణ వర్ణనము. (82+1273)	180
	రాజధర్మవర్ణనము.	184
	ఉమామహేశ్వర సంవాదము - విభిన్న మహత్త్వ విషయాల వివరణ.	199
	ప్రాణుల్లో భేదాలు, పూర్వ జన్మస్మృతి, దైవం పురుషార్థం, పునర్జన్మల వివరణం.	205
	యమలోక మార్గాలు - పాపుల నరకయాతనలు -	
	వారి కర్మల ననుసరించి వేర్వేరు జన్మలు.	208
	శుభాశుభకర్మలు - మద్యసేవన దోషము - మాంసభక్షణ దోషాదికము	212
	శ్రాద్ధవిధి - మూడు రకాల దానం - అయిదురకాల ఫలం.	225
	మరణించిన తరువాత శుభా శుభగతులు -	
	లక్షణాలు కర్తవ్యపాలన మరణం మహాఫలం.	228
	సాంఖ్యజ్ఞానము - అవ్యక్తము - చతుర్వింశతి తత్త్వాలు	236
	యోగధర్మ ప్రతిపాదన - ఫలము.	239
	పాశుపతయోగము - శివలింగపూజ.	241
146.	పార్వతి చేసిన స్త్రీ ధర్మవర్ణనము. (61+3)	243
147.	శ్రీకృష్ణమాహాత్మ్యము. (62)	247

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
148.	శ్రీకృష్ణుని మహిమను వర్ణించుట. (66)	250
149.	శ్రీవిష్ణు సహస్రనామస్తోత్రము. (142+2)	254
150.	గాయత్రీ జప ఫలము (82)	265
151.	బ్రాహ్మణ మహిమను వర్ణించుట. (23)	270
152.	కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని వలన వరాలు పొందటం. (28)	272
153.	బ్రాహ్మణ మహిమను వర్ణించుట. (19)	273
154.	బ్రాహ్మణోత్తముడైన ఉతథ్యుని ప్రభావము. (32)	275
155.	అగస్త్య వశిష్ఠుల ప్రభావవర్ణన. (26)	277
156.	అత్రి చ్యవన మహర్షుల ప్రభావము. (35)	278
157.	బ్రాహ్మణులు స్వర్గమాక్రమించిన కపులను బూడిద చేయుట. (27)	280
158.	కృష్ణుని మహిమను వర్ణించుట. (46)	282
159.	దుర్వాసుని చరిత్రము. (56)	286
160.	శ్రీకృష్ణుడు శంకరుని మహాత్మ్యమును వర్ణించుట. (44)	289
161.	శంకరుని మాహాత్మ్య వర్ణన. (29)	291
162.	ధర్మాధర్మఫలము - శిష్టాచార స్వరూపము. (62)	293
163.	అదృష్టప్రాధాన్యము - భీష్ముని వివరణము. (14)	297
164.	భీష్ముడు ధర్మానుష్ఠానమును సమర్థించుట. (15)	298
165.	నిత్యస్మరణీయ దేవతాదులు. (62)	299
166.	భీష్ముని అనుమతితో యుధిష్ఠిరుడు హస్తినకు చేరుట. (17)	302
	2. భీష్మస్వర్గారోహణ పర్వము - 2	
167.	భీష్ముడు ధర్మజునకు కర్తవ్యము నుపదేశించుట. (52)	303
168.	భీష్మ నిర్యాణము. (37)	306

। శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
అనుశాసన పర్వం - 2

91. నిమికి అత్రి ఉపదేశము - శ్రాద్ధములో త్యజింపదగిన వస్తు వివరణము.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. "శ్రాద్ధాన్ని ఎవరు, ఎప్పుడు కల్పించారు ? దాని స్వరూపమేమిటి ? భృగువు, అంగిరసుల కాలంలోనే ఉన్న దీనిని ఏ మహర్షి ప్రారంభించారు? శ్రాద్ధంలో ఏ ఏ కర్మలు నిషిద్ధాలు ? ఏ పండ్లు, ఏ మూలాలు నిషిద్ధాలు ? ఏ ఏ అన్నాన్ని పరిత్యజించాలి ? పితామహా! నాకు చెప్పవలసినది." భీష్ముడు చెప్తున్నాడు. "రాజా! శ్రాద్ధం ఎప్పుడు, ఎలా ప్రారంభమైందో, దాని స్వరూపమేమిటో, ఎవరు కల్పించారో చెపుతాను, విను. కౌరవ్యా! మహారాజా! ప్రతాపవంతుడైన పరమమహర్షి అత్రి. ఆయన బ్రహ్మకొడుకు. ఆయన వంశంలో దత్తాత్రేయుడు జన్మించాడు. దత్తాత్రేయుని కొడుకు నిమి. ఆయన తపోధనుడు. ఆ నిమికొడుకు శ్రీమంతుడు. అతడు తేజస్వి. ఆ శ్రీమంతుడు వేయి సంవత్సరాల పర్యంతమూ దుష్కర తపస్సు చేసి, కాలధర్మానికి లొంగి, చనిపోయాడు. నిమి శాస్త్రోక్తకర్మ ద్వారా, ఆశౌచం నుండి బయటపడి, పుత్రశోకపరాయణుడై ఎంతో దుఃఖించాడు.

ఆ తరువాత మహామతి అయిన నిమి చతుర్దశినాడు శ్రాద్ధానికి అవసరమైన సామగ్రిని సమకూర్చుకొని, పుత్రశోకంతోనే ఆ రాత్రి గడిపి తెల్లవారగానే మేల్కొన్నాడు. మేల్కొనగానే ఆయన మనస్సు పుత్రశోకంతో వ్యథ చెందింది. కానీ ఆయన బుద్ధి దూరంగా ప్రసరించగలది. ఆ బుద్ధితో మనస్సును శోకం నుండి తప్పించి, ఏకాగ్రతతో శ్రాద్ధకల్పాన్ని గూర్చి ఆలోచించాడు. శాస్త్రానుసారం శ్రాద్ధంలో వినియోగించవలసిన ఫలమూలాది భోజ్యపదార్థాలను, అన్నాలను, తన కుమారునకిష్టమైన పదార్థాలను, అన్నింటిని

మనసా నిశ్చయించి ఆ తపోధనుడు సమకూర్చుకొన్నాడు. ఆ మహాప్రాజ్ఞుడు అమావాస్యనాడు బ్రాహ్మణులను రప్పించి, పూజించి, తాను స్వయంగా ప్రదక్షిణాత్మకంగా మడిచి, దర్భాసనాలు తయారుచేసి పరిచాడు. ఆపై సమర్థుడైన ఆ నిమి ఏడుగురు విప్రులను ఒకేసారి భుజింపజేశాడు. ఉప్పులేని శ్యామాకాన్నాన్ని వారికి పెట్టాడు. ఆపై ఆ దర్భాసనాల మీద, భోక్తలుగా ఉన్న బ్రాహ్మణుల పాదాల క్రింద దక్షిణాగ్రంగా దర్భలను పరచి, తన ఎదుట కూడా దక్షిణాగ్రంగా దర్భల నుంచుకొని, పవిత్రాన్ని ధరించి, శుచియై, శ్రీమంతుని నామగోత్రాలను చెపుతూ దర్భలపై పిండప్రదానం చేశాడు. అదంతా ముగించి ఆ మునిశ్రేష్ఠుడు (నిమి) తనలో ధర్మసాంకర్య దోషమున్నదని తలచి తీవ్ర పశ్చాత్తాపంతో తపించిపోతూ ఇలా ఆలోచించాడు. "ఇంతకుముందు ఏ మునులూ చేయని పనిని నేను చేయవలసివచ్చింది చేశాను. బ్రాహ్మణులు నన్ను శాపంతో భస్మం చేయకుండా ఉంటారా ? అలా ఆలోచించి తమ వంశకర్తను స్మరించాడు. స్మరణమాత్రంతో తపోధనుడైన అత్రి అక్కడకు వచ్చాడు. అలా వచ్చి అవ్యయుడైన అత్రి పుత్రశోకంతో కృశించిన నిమిని చూసి, ప్రియవచనాలతో ఎంతగానో అనునయించాడు. "తపోధనా! నిమీ! నీవు సంకల్పించిన ఈ పితృ యజ్ఞంతో భయపడవద్దు. ఇది బ్రహ్మ తానే అందరికన్నా ముందుగా చూసిన ధర్మమిది. నీవు ఆ స్వయంభువు ప్రారంభించిన ధర్మాన్నే సంకల్పించావు. బ్రహ్మ తప్ప మరెవ్వడు ఈ శ్రాద్ధవిధిని ప్రవర్తింపజేయగలడు ?

కుమారా! ఇక నీకు బ్రహ్మ విధించిన ఉత్తమ శ్రాద్ధ విధిని గురించి చెపుతాను. ఇది విని, ఈ పద్ధతిలో శ్రాద్ధాన్ని అనుష్ఠించు. తపోధనా! ముందు మంత్రపూర్వకంగా అగ్నిని ప్రతిష్ఠించి, ఆపై అగ్నికి సోమునకు, వరుణునికి, పితరులతో పాటు నిత్యమూ వసించే విశ్వేదేవులకు వారి భాగాలను వారికి సమర్పించాలి. బ్రహ్మయే స్వయంగా వారికి భాగాలను ఏర్పరచాడు. ఆపై శ్రాద్ధానికి ఆధారంగా ఉన్న భూమిని, వైష్ణవి, కాశ్యపి, అక్షయ మొదలయిన పేర్లతో స్తుతించాలి. అనఘా! శ్రాద్ధానికై నీళ్లు తెచ్చేటప్పుడు జలాధిపతి అయిన వరుణుని స్తుతించాలి. ఆపై అగ్నిని, సోముని తృప్తిపరచాలి. బ్రహ్మ సృష్టించిన కొందరు దేవతలు పితృనామంతో ప్రసిద్ధులు. ఆ మహాభాగులకు ఉష్ణపులని కూడా పేరు. వారికి బ్రహ్మయే భాగం కల్పించాడు. వారిని శ్రాద్ధంతో అర్చిస్తే పితరులు పాపవిముక్తి నందగలరు. బ్రహ్మ ఆ రీతిగా శ్రాద్ధానికి అధికారులనుగా చేసిన పితరులు ఏడుగురు. విశ్వేదేవుల గురించి ముందే చెప్పాను. వారికందరికీ అగ్నియే ముఖం. యజ్ఞభాగస్వాములైన ఆ మహాత్ముల పేర్లు చెపుతాను. బలం, ధృతి, విపాప్ముడు, పుణ్యకృత్తు, పావనుడు,

పార్జిక్షేముడు, సమూహుడు, దివ్యసానువు, వివస్వంతుడు, వీర్యవంతుడు, హ్రీమంతుడు, కీర్తిమంతుడు, కృతుడు, జితాత్ముడు, మునివీర్యుడు, దీప్తరోముడు, భయంకరుడు, అనుకర్ముడు, ప్రతీతుడు, ప్రదాత, అంశుమంతుడు, శైలాభుడు, పరమక్రోధి, ధీగోప్తి, భూపతి, ప్రజుడు, వజ్రి, వరి, విశ్వేదేవుడు, విద్యుద్వర్చుడు, సోమవర్చుడు, సూర్యశ్రీ, సోమపుడు, సూర్యసావిత్రుడు, దత్తాత్ముడు, పుండరీయకుడు, ఉష్ణీనాభుడు, నభోదుడు, విశ్వాయువు, దీప్తి, చమూహరుడు, సురేశుడు, వ్యోమారి, శంకరుడు, భవుడు, ఈశుడు, కర్త, కృతి, దక్షుడు, భువనుడు, దివ్యకర్మకృత్తు, గణితుడు, పంచవీర్యుడు, ఆదిత్యుడు, రశ్మివంతుడు, సప్తకృత్తు, సోమవర్చుడు, విశ్వకృత్తు, కవి, అనుగోప్త, నప్త, ఈశ్వరుడు - ఈ రీతిగా సనాతనులైన విశ్వేదేవుల పేర్లు. ఈ మహాత్ములందరూ కాలగతి నెరిగినవారు.

శ్రాద్ధంలో వాడదగనివి ఇవి - కొర్రలు, పొల్లుధాన్యం, కూరలలో ఇంగువ, నీరుల్లి, వెల్లుల్లి, మునగ, సంపెంగ, ఎర్ర ముల్లంగి, గుమ్మడి, సొర, నల్ల ఉప్పు, గ్రామాల్లో పెరిగే తుంగముస్తె గుజ్జు, ప్రోక్షణచేయని పదార్థం, నల్లజీలకర్ర, బిడలవణం(ఉప్పులలో ఒకరకం) శీతపాకి (ఒకశాకం) మొలకెత్తిన పెసలు, పరికె గడ్డ మొదలయినవి శ్రాద్ధంలో నిషిద్ధాలు. శ్రాద్ధాలలో అన్నిరకాల ఉప్పులు, నేరేడు పళ్ళు నిషిద్ధాలు, తుమ్ము లేదా కన్నీళ్ళతో కలుషితమైన పదార్థం వాడరాదు. శ్రాద్ధసంబంధమైన హవ్యకవ్యాలలో సుదర్శన సోమలత నిషిద్ధం. విశ్వేదేవులు కానీ, పితరులు కానీ ఆ హవిస్సును అభినందించరు. పిండ ప్రదానవేళలో చండాలురు, శ్వపాకులను, అక్కడనుండి తొలగించాలి. వీరేకాక కాషాయవస్త్రధారి, కుష్ఠురోగి, పతితుడు, బ్రహ్మహత్య చేసినవాడు, వర్ణసాంకర్యం గల బ్రాహ్మణుడు, ధర్మభ్రష్టుడు - వీరు కూడా శ్రాద్ధసమయంలో అక్కడ లేకుండా చూడాలి. పూజ్యుడు, తపోధనుడు అయిన అత్రి తనవంశీయుడైన ఆ ఋషికి గతంలో ఆ రీతిగా చెప్పి పితామహుని దివ్యసభకు వెళ్ళిపోయాడు.

92. పితరుల ఆశీర్వచనము - వివరణ.

భీష్ముడు చెప్తున్నాడు. "ఆ విధంగా మొదట నిమి శ్రాద్ధ విధిని నిర్వహించాడు. ఆ తరువాత మహర్షులందరు శాస్త్రోక్తప్రకారంగా పితృయజ్ఞాన్ని చేస్తున్నారు. నిత్యమూ ధర్మవర్తనులు, నియతవ్రతులు అయిన ఋషులు పిండప్రదానాలు చేసి తీర్థజలాలతో తర్పణాలు కూడా చేయసాగారు. భారతా! నాల్గువర్ణాలవారు శ్రాద్ధంలో పిండప్రదానాలు చేయసాగారు. దేవతలు, పితరులు తృప్తి పడసాగారు. అన్నాన్ని జీర్ణం చేసికొనసాగారు.

కానీ అజీర్ణవ్యాధి ఆ దేవతలను, పితరులను బాధించింది. అప్పుడు శ్రాద్ధాన్న పీడితులైన వారు సోముని దగ్గరకు వెళ్ళారు. అజీర్ణపీడతో పితరులు సోముని దగ్గరకు వెళ్ళి "శ్రాద్ధాన్నంతో బాధపడుతున్నాం. మాకు శ్రేయస్సును కలిగించండి" అని పలికారు. "దేవతలారా! మీరు శ్రేయస్సు కోరుకొంటుంటే బ్రహ్మసదనానికి వెళ్ళండి. ఆయన మీకు శ్రేయస్సును కల్పించగలడు" అని సోముడు వారితో అన్నాడు. భారతా! ఆ దేవతలు సోముని మాటను బట్టి పితరులతో కలిసి మేరు పర్వత శిఖరంపై కూర్చొని ఉన్న బ్రహ్మ దగ్గరకు వెళ్ళారు. పితరులిలా అన్నారు. "భగవన్! శ్రాద్ధాన్నంతో మేము ఎంతో బాధపడుతున్నాం. దేవా! మమ్ము అనుగ్రహించు. మాకు శ్రేయస్సును కలిగించు." అలా అంటున్న వారి మాటలు విని బ్రహ్మ "నా ప్రక్కనున్న ఈ అగ్ని మీకు శ్రేయస్సును కలిగించగలడు" అన్నాడు. అగ్ని ఇలా అన్నాడు. "నాయనలారా! శ్రాద్ధభోజనం సమకూరినపుడు కలిసి భుజిద్దాం. నాతో కలిసి ఉండటం వలన మీరు అన్నాన్ని జీర్ణం చేసికొనగలరు. సందేహం లేదు. ఇది విన్న తరువాత పితరులు చింతను వీడారు. రాజా! ఈ కారణంగానే శ్రాద్ధంలో ముందు అగ్నికి తన భాగాన్ని ఇస్తారు. పురుషశ్రేష్ఠా! అగ్నికి ముందు హోమం చేసి, ఆపై పితరులకు పిండప్రదానం చేయటం వలన ఆ శ్రాద్ధ పిండాన్ని బ్రహ్మరాక్షసులు కూడా పాడుచేయలేరు. అగ్ని దేవుడు అక్కడుంటే రాక్షసులు తొలగిపోతారు. ముందు తండ్రికి పిండ ప్రదానం చేయాలి. ఆ తరువాత పితామహునకు, ఆ తరువాత ప్రపితామహునకు పిండప్రదానం చేయాలి. ఇది శ్రాద్ధవిధి. ప్రతి పిండాన్ని ప్రదానం చేసేటప్పుడు ఏకాగ్రతతో శ్రాద్ధంలో గాయత్రిని జపించాలి. పిండ ప్రదానవేళలో "అగ్నయే కవ్యవాహనాయ స్వాహా" అని అగ్నికి "సోమాయ పితృమతేస్వాహా" అని సోమునకు వారి భాగాలనివ్వాలి. రజస్వల కానీ రెండు చెవులు వినిపించని స్త్రీ కానీ శ్రాద్ధంలో ఉండరాదు. అన్య వంశంలో పుట్టిన స్త్రీని కూడా శ్రాద్ధకర్మలో స్వీకరింపరాదు. జలతర్పణ సమయంలో పితామహుల పేర్లను ఉచ్చరించాలి. నది దగ్గర పితరులకు పిండతర్పణ చేయాలి. ముందు తన వంశంలోనివారికి నీటితో తర్పణం చేసి, ఆపై మిత్రులు, సంబంధీకుల వంశంలోనివారికి జలాంజలిని ఇవ్వాలి. రంగురంగుల ఎద్దులు కట్టిన బండిపై నీటిని దాటుతుంటే, అతని పితరులు ఆ సమయంలో నావమీద నిలిచి ఆ జలాంజలిని త్రాగాలని కోరుకొంటారు. ఈ విషయం తెలిసినవారు నావపై ఉన్నప్పుడు సావధానులై పితరులకు జలాంజలిని సమర్పిస్తారు. నెలలో సగం గడచిన తర్వాత కృష్ణపక్షంలో (అమావాస్యనాడు) శ్రాద్ధాన్ని పెట్టాలి. ఆ పితృభక్తి వలన పుష్టి, ఆయుస్సు, బలం, సంపద కలుగుతాయి. కురుకులోత్తమా!

బ్రహ్మ, పులస్త్యుడు, వసిష్ఠుడు, పులహుడు, అంగిరుడు, క్రతువు, కశ్యపుడు – ఈ ఏడుగురు మహాయోగేశ్వరులు. వీరు పితరులు కూడా. రాజా! ఇది శ్రాద్ధవిధి. మరణించినవారు పిండ సంబంధంతో ప్రేతత్వం నుండి ముక్తి పొందుతారు. పురుషశ్రేష్ఠా! ఈ రీతిగా శాస్త్రానుసారంగా ముందుచెప్పిన శ్రాద్ధోత్పత్తిని వివరంగా చెప్పాను. ఇక దానాన్ని గురించి చెపుతాను.

93. బిసప్తైన్యోపాఖ్యానము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా! వ్రత నియమంగల బ్రాహ్మణులు ఎవరో ఒక బ్రాహ్మణుని కోరిక మేరకు శ్రాద్ధాన్ని భుజించటాన్ని ఎలా భావించాలి?" భీష్ముడు ఇలా చెప్పాడు. "యుధిష్ఠిరా! వేదవ్రతాలను పాటించనివారు ద్విజుని కోరికమేర శ్రాద్ధభోజనం చేయటం యుక్తమే. వేదవ్రతాలు పాటించేవారు. అలా భుజిస్తే వ్రతభంగమవుతుంది." యుధిష్ఠిరుడడిగాడు. "మామూలు మనుష్యులు ఉపవాసాన్నే తపస్సు అంటుంటారు. ఇహలోకంలో అదే తపస్సా? లేక తపస్సు అంటూ వేరొకటి ఉన్నదా ?" భీష్ముడు చెప్తున్నాడు. "కొందరు నెల రోజులు, కొందరు పదిహేను రోజులు ఉపవాసం చేసి తపస్సు అనుకొంటారు. అది నిరర్థకంగా శరీరాన్ని కష్టపెట్టడమే. అలా చేసినవాడు తపస్వీ కాడు. ధర్మవేత్తా కాడు. త్యాగసంపాదనమే ఉత్తమతపస్సుగా మిగులుతుంది. నిత్యోపవాసంతో పాటు బ్రహ్మచారి, ముని, వేదాధ్యాయి కూడా కావాలి. మనిషి ధర్మకాముడై గృహస్థుడు కావాలి. ఎప్పుడూ జాగరూకుడై ఉండాలి. మాంసాన్ని తినరాదు. పవిత్రంగా వేదపఠనం చేయాలి. నిత్యమూ సత్యాన్నే పలకాలి. సదా నిగ్రహంతో నిలవాలి. ఎప్పుడూ పవిత్రంగా అమృతాశి, విఘసాశి, అతిథిప్రియుడు అయి ఉండాలి.

యుధిష్ఠిరుడడిగాడు. "రాజా! నిత్యోపవాసి ఎలా కాగలడు ? బ్రహ్మచారి ఎలా కాగలడు ? విఘసాశి, అతిథిప్రియుడు ఎలా కాగలడు?" భీష్ముడు చెప్తున్నాడు. "కేవలం ఉదయం పూట , సాయంకాలం భుజిస్తూ మధ్యలో ఏమీ తిననివాడు నిత్యోపవాసి అవుతాడు. ఋతుకాలంలోనే భార్యతో సంగమించేవాడు బ్రహ్మచారి. నిత్యమూ దానశీలుడైన మానవుడు ఋతవాది కాగలడు. వ్యర్థంగా మాంసం తిననివాడు అమాంసాశి అవుతాడు. సదాదానం చేసేవాడు పవిత్రుడు. పగటిపూట నిదురించనివాడు జాగరూకుడు. యుధిష్ఠిరా! నిత్యమూ, భృత్యులు, అతిథులు భుజించిన తరువాత భుజించే నరుడు అమృతాశి అని గ్రహించు. బ్రాహ్మణులు తినకముందు తాను భుజించని నరుడు తన ఆ అభోజనవ్రతంతో

స్వర్గాన్ని గెలుచుకొంటాడు. దేవతలకు, పితరులకు, ఆశ్రితులకు పెట్టి మిగిలినదానినే తినేవాడు విఘసాశి. అటువంటివారికి బ్రహ్మసదనంలో అక్షయలోకాలు లభిస్తాయి. రాజా! అప్సరసలు, గంధర్వులు వారిసేవకై నిలిచి ఉంటారు. దేవతలతో అతిథులతో కలిసి పితృభాగాన్ని పెట్టి తాము భుజించేవారు పుత్రపౌత్రులతో ఆనందంగా గడుపుతారు. మరణానంతరం ఉత్తమగతిని పొందుతారు". యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా! బ్రాహ్మణులకు వివిధదానాలను ఇస్తుంటారు. ఆ దాతలో, ప్రతిగ్రహీతలో విశేషమేమిటి?" భీష్ముడు చెప్తున్నాడు. "సాధువు నుండి, అసాధువు నుండి కూడా ద్విజుడు దానాలు పడతాడు. గుణవంతుని నుండి స్వీకరిస్తే దోషం తక్కువ. నిర్గుణుని నుండి స్వీకరిస్తే మునిగిపోతాడు.

భారతా! ఈ విషయంలో కూడా వృషాదర్భి (ఒకరాజు) సప్తర్షుల మధ్య జరిగిన సంవాద రూపమైన పురాతనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. ఒకప్పుడు కశ్యపుడు, అత్రి, వసిష్ఠుడు, భరద్వాజుడు, గౌతముడు, విశ్వామిత్రుడు, జమదగ్ని పతివ్రత అయిన అరుంధతి - వీరంతా సమాధిద్వారా సనాతన బ్రహ్మలోకాన్ని పొందాలని తపస్సు చేస్తూ లోకంలో తిరగసాగారు. వారికి అందరికి సేవలు చేస్తూ ఒక దాసి ఉండేది. ఆమె పేరు గండ. ఆమెకు పశుసఖుడనే ఒక శూద్రుడు భర్త. కురునందనా! అప్పుడు తీవ్రమయిన అనావృష్టి ఏర్పడింది. లోకమంతా ఆకలితో బాధపడుతూ ఎంతో కష్టంతో ప్రాణాలు నిలుపుకొంటోంది. గతంలో శిబికొడుకైన శైబ్యుడు యజ్ఞంలో ఋత్విక్కులకు దక్షిణగా తన కుమారుని ఇచ్చివేశాడు. ఆ సమయంలోనే అల్పాయువైన ఆ రాజకుమారుడు చనిపోయాడు. ఆ మహర్షులు ఆకలితో తపిస్తూ ఆ శవాన్ని చుట్టుముట్టి నిలిచారు. వృషాదర్భి ఇలా అన్నాడు. "బ్రాహ్మణులు దానాన్ని పట్టడం నిందింపదగని వృత్తియే. దానం తీసికొనటం ఇప్పటి ఆకలి బాధనుండి మిమ్ము తరింప జేస్తుంది. పుష్టినిస్తుంది. తపోధనులారా! నా దగ్గరున్నది ఏదయినా కోరి తీసికోండి. నన్ను యాచించే బ్రాహ్మణులంటే నా కిష్టం. మీకు ఒక్కొక్కరికి ఒక్కొక్క వేయి ఆడు కంచరగాడిదలనిస్తాను. అందరికీ తెల్లని రోమాలు గలిగి, వేగంగా పయనించే, ఈనిన ఆవులను, ఆబోతులతో పాటు ఇస్తాను. అంతేగాక వంశభారాన్ని మోయగల పదివేల తెల్లని ఎద్దులను మీకు అందరికీ ఇస్తాను. ఆ ఎద్దులు బండిలాగగలవి. మీకందరకూ మంచి స్వభావం గల బలిసిన, తొలి ఈత పాడి ఆవులను కూడా ఇస్తాను. మంచి గ్రామాలను, ధాన్యాన్ని, రసాలను, యవలను, రత్నాలను, దుర్లభాలైన ఇతర వస్తువులను కూడా ఇస్తాను. ఇంకా ఏం కావాలి? తినదగని ఈ శవాన్ని తినాలని మనసుపెట్టకండి. మీ శరీరపుష్టికోసం ఇంకా ఏమివ్వమంటారు ?" ఋషులు ఇలా అన్నారు. రాజా! రాజులు ఇచ్చే వస్తువులు తినేటప్పుడు

తీయగా ఉంటాయి. పరిణామం విషతుల్యం. అది తెలిసి కూడా మమ్ములను ప్రలోభపెడతావెందుకు ? బ్రాహ్మణుల ఈ శరీరం దేవతల నివాసస్థానం. దేవతలందరూ దీనినాశ్రయించి ఉంటారు. బ్రాహ్మణుడు తపస్సుతో పవిత్రుడై ఆనందంగా ఉంటే దేవతలను తృప్తిపరచగలడు. బ్రాహ్మణుడు రోజంతా చేసిన తపస్సును రాజు నుండి తీసికొన్న వస్తువు వనాన్ని దావాగ్ని తగులబెట్టినట్లు నశింపజేస్తుంది. రాజా! ఈ దానం, నీవూ క్షేమంగా ఉండాలి. ఈ వస్తువులను యాచించే వారికే వాటినివ్వు" అని చెప్పి వారంతా మరోదారిన వెళ్ళిపోయారు. ఆపై రాజాదేశంతో ఆయన మంత్రులు అడవికి పోయి, మేడిపండ్లు కోసి, వాటిని దానం చేయసాగారు. మేడిపండ్లను, ఇతర ఫలాలను కూడా కోసి వాటిలోపల బంగారం పెట్టారు. రాజసేవకులు వాటిని తీసికొని ఆ బ్రాహ్మణుల కివ్వటానికి పరుగెత్తారు. ఆ పండ్లన్నీ బరువుగా ఉన్నాయి. అది గ్రహించి అత్రి ఇలా అన్నాడు. "ఇవి తీసికొనదగినవి కావు. మేము మందమతులం కాము. తెలివిలేనివారం కాము. ఇవి బంగారు పండ్లని తెలుసు. మేము తెలివితోనే ఉన్నాం. మేలుకొనియే ఉన్నాం. ఈ లోకంలో వీటిని తీసికొంటే పరలోకంలో వీటి చేదుఫలితాలను అనుభవించాలి. కాబట్టి ఇహపరాలలో సుఖాన్ని కోరేవారు వీటిని తీసికొనరాదు". వసిష్ఠుడిలా అన్నాడు. "ఒక బంగారు నాణేన్ని తీసికొంటే వేయి నాణేలను తీసికొనటంతో సమానం. ఆ స్థితిలో ఇన్నింటిని తీసికొంటే పాపిష్ఠిలోకాలలో పడవలసివస్తుంది." **కశ్యపుడిలా అన్నాడు. "భూమిపైని ధాన్యమంతా, యవలు, బంగారం, పశువులు, స్త్రీలు ఒక్కనికే లభించినా తృప్తి కలుగదు. కాబట్టి పండితుడు ఆశాశాంతినే కోరుకోవాలి". భరద్వాజుడిలా అన్నాడు. "జింకతో పాటు మొలిచిన జింకకొమ్ము దానితోపాటు పెరిగినట్టు మనిషి ఆశకూడా రోజురోజుకూ పెరుగుతూనే ఉంటుంది. దానికి పరిమితి లేదు." గౌతముడిలా అన్నాడు. "మనుష్యుని ఆశను పూర్తిచేయగల ద్రవ్యం ఈ లోకంలో లేదు. మనిషి ఆశ సముద్రం వంటిది. అది ఎప్పుడూ నిండదు."*** విశ్వామిత్రుడిలా

---

* యత్పృథివ్యాం వ్రీహియవం హిరణ్యం పశవః స్త్రియః ।
సర్వం తన్నాలమేకస్య తస్మాద్ విద్వాంఛమం చ రేత్ ॥ 40
ఉత్పన్నస్య రురోః శృంగం వర్ధమానస్య వర్ధతే ।
ప్రార్థనా పురుషస్యేవ తస్య మాత్రా న విద్యతే ॥ 41
న తల్లోకే ద్రవ్యమస్తి యల్లోకం ప్రతిపూరయేత్ ।
సముద్రకల్పః పురుషో న కదాచన పూర్యతే ॥ 42

అన్నాడు. "దేనికైనా కోరుతున్న మనిషికి ఆ కోరికతీరినా మరొక కోరిక కలుగుతూనే ఉంటుంది. ఆశ బాణంలాగా మనస్సును గాయపరుస్తూనే ఉంటుంది.

*అత్రి ఇలా అన్నాడు "కామోపభోగం వలన కామమెప్పుడూ తీరదు. హవిస్సుతో అగ్ని ప్రజ్వలించినట్లు కోరిక పెరుగుతూనే ఉంటుంది.**

జమదగ్ని ఇలా అన్నాడు. "దానం పట్టడంలోని నియంత్రణమే తపస్సును స్థిరంగా నిలుపుతుంది. అదే బ్రాహ్మణుని ధనం, లోభానికి లోనయితే అది నశించిపోతుంది." అరుంధతి ఇలా అన్నది. "ధర్మంకోసం ద్రవ్యాన్ని సమీకరించటం కొందరు అంగీకరించిన పక్షం. కానీ ద్రవ్యసమీకరణం కన్నా తపస్సమీకరణమే ఈ లోకంలో విశిష్టం."** గండ ఇలా అన్నది. "బలసంపన్నులైన నా యజమానులే ఈ తీవ్రభయంకరదానాన్ని తీసికొనటానికి భయపడుతున్నారు. ఇక నేనెంత ? నేను బలహీనురాలివలె ఎంతో భయపడుతున్నాను". పశుసఖుడిలా అన్నాడు. "ధర్మార్జితమయిన ధనం కన్నా గొప్పధనం ఏదీ లేదు. ఆ ధనాన్ని గూర్చి బ్రాహ్మణులకే తెలుసు. దాన్ని యథాతథంగా నేర్చుకొనటానికే నేను మంచి పండితుని సేవిస్తున్నాను." ఋషులు అన్నారు. "ఈ రీతిగా ఏదో ఒక నెపంతో (ఫల రూపంతో) బంగారాన్ని ఇవ్వజూపిన మీకు, మీ రాజుకు ఈ దానంతో పాటు క్షేమం గలగాలి." భీష్ముడు చెప్తున్నాడు. "ఆ రీతిగా పలికి వ్రతశీలుడైన ఋషులందరు బంగారం లోపలున్న ఆ పండ్లను తిరస్కరించి మరొకవైపు వెళ్ళిపోయారు". మంత్రులు (రాజుతో) ఇలా అన్నారు. "రాజా! ఆ మునులు మనం కపటంగా ప్రవర్తిస్తున్నామని శంకించి, ఆ పండ్లను తిరస్కరించి మరోవైపు వెళ్ళిపోయారు. తమకు తెలిసియే ఉంటుంది." తన సేవకులు అలా అనగానే వృషాదర్భి కోపించాడు. వారు చేసిన దానికి ప్రతీకారం చేయదలచి, ఇంటికి వెళ్ళాడు.

ఆ రాజు అలా వెళ్ళి, తీవ్ర నియమాలను పాటిస్తూ ఆహవనీయాగ్నిలో ఆభిచారిక మంత్రాలతో ఒక్కొక్క ఆహుతిని వేయసాగాడు. ఆ అగ్ని నుండి లోకభయంకరి అయిన

---

* న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥

**ప్రతిగ్రహే సంయమో వై తపో ధారయతే ధ్రువమ్ ।
తద్ ధనం బ్రాహ్మణస్యేహ లుభ్యమానస్య విస్రవేత్ ॥ 44
ధర్మార్థం సంచయో యో వై ద్రవ్యాణాం పక్షసమ్మతః ।
తపః సంచయ ఏవేహ విశిష్టో ద్రవ్యసంచయాత్ ॥ 45

కృత్య వెలువడింది. వృషాదర్భి దానికి యాతుధాని అని పేరుపెట్టాడు. కాలరాత్రివలె ఉన్న ఆ కృత్య చేతులు జోడించి, రాజు దగ్గరకు వచ్చి "ఏం చేయమంటారు" అని వృషాదర్భిరాజును అడిగింది. వృషాదర్భి ఇలా అన్నాడు. "వెళ్ళు. సప్తర్షుల దగ్గరకు వెళ్ళి, వారి పేర్లను, అరుంధతి పేరును, దాసి పేరును, దాసిభర్త పేరును తెలిసికొని మనసులో నిలుపుకొని, వారినందరినీ నాశనం చేయి. వారు నశించగానే నీ ఇష్టం వచ్చిన చోటుకు స్వేచ్ఛగా వెళ్ళు. 'అలాగే' అని రాజు ఆదేశాన్ని స్వీకరించి యాతుధానస్వరూపిణి అయిన ఆ కృత్య ఆ మహర్షులు తిరుగుతున్న వనానికి వెళ్ళింది. రాజా! అప్పుడు అత్రిమొదలయిన ఆ మహర్షులు ఆ వనంలో కందమూలాలను తింటూ తిరుగసాగారు.

ఆపై ఒకసారి కుక్కతో సహా సంచరిస్తున్న ఒక పరివ్రాజకుని చూశారు. ఆయన లావుగా ఉన్నాడు. ఆయన భుజాలు, చేతులు, కాళ్ళు, ముఖం, పొట్ట బాగా బలిసి ఉన్నాయి. సర్వావయవాలు బలిసి అందంగా ఉన్న ఆ సంన్యాసిని చూసి, అరుంధతి "మీరెప్పుడైనా ఇలా కాగలరా?" అని ఆ ఋషుల నడిగింది. వసిష్ఠుడిలా అన్నాడు. "మాకు వలె ఇతనికి అగ్నిహోత్రం ఇంకా పూర్తికాలేదని కానీ, ఉదయమూ సాయంకాలమూ హోమం చెయ్యాలని కానీ చింతలేదు. అందువలన కుక్కతోపాటు బలిసి ఉన్నాడు. అత్రి ఇలా అన్నాడు. "మాకు వలె ఇతనికి ఆకలి బాధవలన శక్తి ఉడిగిపోలేదు. కష్టపడి చేసిన వేదాధ్యయనం నశించలేదు. అందువలన కుక్కతోపాటు బలిసి ఉన్నాడు. విశ్వామిత్రుడిలా అన్నాడు. "మాకు వలె ఇతనికి తాను చదివిన సనాతన శాస్త్రం మరుపుకు రాలేదు. ధర్మం నశించలేదు. ఇతడు అలసుడు, ఆకలి మీదనే దృష్టిపెట్టిన మూర్ఖుడు. అందువలన కుక్కతో పాటు బలిసి ఉన్నాడు. జమదగ్ని ఇలా అన్నాడు. "మాకువలె ఇతనికి సంవత్సరానికి సరిపడ ఆహారాన్ని, ఇంధనాన్ని సంపాదించి పెట్టుక్కోవాలన్న చింతలేదు. అందువలన కుక్కతోపాటు బలిసి ఉన్నాడు". కశ్యపుడిలా అన్నాడు. "నలుగురు సోదరులు మమ్ము "దేహి, దేహి!" అని యాచిస్తుంటారు. ఇతనికాబాధలేదు. అందువలన కుక్కతో పాటు బలిసి ఉన్నాడు". భరద్వాజుడిలా అన్నాడు. "వివేకం లేని ఈ బ్రహ్మబంధువునకు మాకు వలె భార్య కళంకితమవుతుందేమో అన్న శోకం లేదు. అందువలన కుక్కతో పాటు బలిసి ఉన్నాడు". గౌతముడిలా అన్నాడు. "మాకు వలె ఇతనికి మూడు సంవత్సరాలు దర్భలతో చేసిన ముప్పేట ముంజెత్రాటిని గాని, మృగచర్మాన్ని గాని ధరించనవసరం లేదు. అందువలన కుక్కతోపాటు ఇతడు బలిసి ఉన్నాడు".

భీష్ముడు చెప్తున్నాడు. ఆపై ఆ పరివ్రాజకుడు మహర్షులను చూసి, కుక్కతో సహా వారి దగ్గరకు వచ్చి, యథోచితంగా వారి చేతులు స్పృశించాడు. ఆకలిని

పోగొట్టుకునేందుకు వారు చేస్తున్న వనభ్రమణాన్ని గురించి పరస్పరం చెప్పుకొంటూ వారంతా కలిసి బయలుదేరారు. వారు అందరూ ఒకే నిర్ణయంతో, ఒకే పనిమీద, ఫలమూలాలను సమీకరించుకొని, చేపట్టి అరణ్యాలలో తిరుగసాగారు. అలా తిరుగుతూ వారు ఒకసారి ఒక అందమైన సరస్సును చూశారు. స్వచ్ఛ జలంతో అది పవిత్రంగా ఉంది. దానిచుట్టూ దట్టంగా చెట్లు ఉన్నాయి. ఆ కొలను బాలభానునివలె ఎర్రగా ఉన్న కమలాలతో శోభిస్తోంది. వైడూర్యం వంటి వన్నెగల తామరాకులతో నిండి ఉంది. రకరకాల పక్షులు ఆ కొలనును సేవిస్తున్నాయి. దానికి ఒకటేదారి దానిలోని వస్తువులను తీసికొనటం కుదరదు. దిగటానికి చక్కని రేవులు ఉన్నాయి బురద లేదు. వృషాదర్భి ప్రయోగించిన భయంకరమైన కృత్య యాతుధాని ఆ కొలనును రక్షిస్తోంది. ఆ మహర్షులు అందరు పశుసఖుని సహాయంతో తామర తూళ్ళ కోసం కృత్యరక్షిస్తున్న ఆ కొలను దగ్గరకు వెళ్ళారు. చూడటానికి వికారంగా ఉన్న ఆ యాతుధానిని - కృత్యను - కొలను తీరంలో చూసి ఆ మహర్షులు ఆమెతో ఇలా అన్నారు. "ఒంటరిగా ఉన్నావు. నీవెవరు? ఎవరికోసం దేనికోసం ఈ కొలను తీరాన్ని ఆశ్రయించి ఉన్నావు? చెప్పు. నీవేం చేయదలచుకొన్నావు?"

యాతుధాని ఇలా అన్నది. "నేను నేనే. ఈ విషయంలో మీరు ఏ రీతిగానూ నన్ను ప్రశ్నించగూడదు. తపోధనులారా! ఈ కొలనుకు రక్షకురాలినిగా నన్ను మీరందరూ గ్రహించండి". ఋషులిలా అన్నారు. "మేమంతా ఆకలితో బాధపడుతున్నాం. మాకు తినటానికి మరొకటి లేదు. నీవు అంగీకరిస్తే అందరం తామరతూళ్ళు తీసికొంటాం." యాతుధాని అన్నది. మీరు స్వేచ్ఛగా ఇక్కడనుండి తామర తూళ్ళు తీసికొనవచ్చు. కానీ ఒక నియమం. ఒక్కొక్కరుగా మీ పేర్లు చెప్పి వివరించి ఆపై తీసికొనండి. జాగు చేయవద్దు." భీష్ముడు చెప్తున్నాడు. "ఆ యాతుధాని కృత్య అనీ, తమను చంపదలచిందనీ తెలిసి కూడా అత్రి ఆకలిని భరించలేక ఇలా అన్నాడు. అత్రి అంటున్నాడు. "కళ్యాణీ! కామాది శత్రువుల నుండి రక్షించేవాడు అరాత్రి. మృత్యువు నుండి కాపాడేవాడు అత్రి. ఇలా నేను ఆ రాత్రిని కాబట్టి అత్రిని పరమాత్మ జ్ఞానం లేనిస్థితి 'త్రి'. దానికి భిన్నుడను కాబట్టి అత్రిని, పరమాత్మజ్ఞానం గలవాడను కాబట్టి నేను అ రాత్రిని నాపేరును తెలిసికో. యాతుధాని అన్నది. "మహాతేజస్వీ! నీవు నాకు నీ పేరు యొక్క తాత్పర్యాన్ని చెప్పావు. కానీ అది నా మనస్సులో నిలిచేది కాదు. వెళ్ళు కొలనులో దిగు". వసిష్ఠుడిలా అన్నాడు. "నేను వసిష్ఠుడను, వరిష్ఠుడను, నేను గృహస్థాశ్రమంలో ఉండేవాడను. వసిష్ఠత్వం వలన, వాసత్వం వలన నన్ను వసిష్ఠునిగా గ్రహించు". యాతుధాని ఇలా అన్నది. "నీవు నీ

పేరును గురించి చేసిన వ్యాఖ్యానంలోని అక్షరాలను పలకటం కూడా కష్టంగా ఉంది. నేను గుర్తు పెట్టుకోలేను. వెళ్ళు. కొలనులో దిగు". కశ్యపుడిలా అన్నాడు. "కశ్యమంటే దేహం. దానిని•రక్షిస్తాను కాబట్టి కశ్యపుడను. కులమంటే శరీరం. ప్రతి శరీరాన్ని కాపాడే నేను కశ్యపుడను కువముడంటే సూర్యుడు. ఆయన నా స్వరూపమే. కాబట్టి నేను కువముడను కూడా. కాశపుష్పాల వంటి రంగునాది. కాబట్టి నేను కాశ్యుడను". యాతుధాని ఇలా అన్నది. "మహాతేజస్వీ! నీ పేరును గురించి నాకు ఏదో చెప్పావు. దానిని మనసులో పెట్టుకోలేను. వెళ్ళు. కొలనులో దిగు". భరద్వాజుడిలా అన్నాడు. "సుతులుకాని వారినీ, శిష్యులు కాని వారినీ భరిస్తాను. దేవతలను, ద్విజులను, భార్యను, ధ్వాజాన్ని (వర్ణసాంకర్యం) భరిస్తాను కాబట్టి నేను భరద్వాజుడను". యాతుధాని ఇలా అన్నది. "నీవు నీ పేరును గురించి చేసిన వ్యాఖ్యానంలోని అక్షరాలను పలకటం కూడా కష్టంగా ఉంది. గుర్తుపెట్టుకోలేను. వెళ్ళు కొలనులో దిగు".

గౌతముడిలా అన్నాడు. "కృత్యా' నేను (గోవులను (ఇంద్రియాలను) నియంత్రించాను. అందువల్ల గోదముడను. నేను పొగలేని నిప్పు వంటివాడను. సమదృష్టి గలిగినందువల్ల నీవు నన్ను నియంత్రించలేవు. నా శరీరకాంతి చీకటిని పారద్రోలగలదు. కాబట్టి గౌతముడను. గ్రహించు." యాతుధాని ఇలా అన్నది. "మహామునీ! నీ పేరును గురించి నీవు నాకు తాత్పర్యం చెప్పావు. కానీ అది నా మనస్సులో నిలిచేది కాదు. వెళ్ళు. కొలనులో దిగు." విశ్వామిత్రుడిలా అన్నాడు. "విశ్వేదేవులు నా మిత్రులు. నేను గోవులకు మిత్రుడను. యాతుధానీ ! అందువల్ల నన్ను విశ్వామిత్రుడంటారు. నా గురించి గ్రహించు" యాతుధాని అన్నది. "నీవు నీ పేరును గురించి చేసిన వ్యాఖ్యానంలోని అక్షరాలను పలకటం కూడా కష్టంగా ఉంది. నేను గుర్తుపెట్టుకోలేను. వెళ్ళు కొలనులో దిగు." జమదగ్ని ఇలా అన్నాడు. "కళ్యాణి! నేను జగత్తు అనగా దేవతల ఆహవనీయాగ్ని నుండి పుట్టినవాడను. కాబట్టి నేను జమదగ్నిగా ప్రఖ్యాతుడ నని గ్రహించు". యాతుధాని అన్నది "మహామునీ! నీ పేరును గురించి నీవు నాకు తాత్పర్యం చెప్పావు. కానీ అది నా మనస్సులో నిలిచేది కాదు. వెళ్ళు. కొలనులో దిగు." అరుంధతి ఇలా అన్నది. "నేను పర్వతాలను, భూమిని, స్వర్గ లోకాన్ని ధరించగలను. భర్తసమీపంలోనే ఉంటాను. ఆయన మనస్సు ననుసరించి నడుస్తాను. అందువల్ల నేను అరుంధతిని గ్రహించు". యాతుధాని అన్నది. "నీవు నీ పేరును గురించి చేసిన వ్యాఖ్యానంలోని అక్షరాలను పలకటం కూడా కష్టంగా ఉంది. నేను గుర్తుపెట్టుకోలేను. వెళ్ళు కొలనులో దిగు." గండ ఇలా అన్నది.

"అగ్ని నుండి పుట్టినదానా! గడి ధాతువు నుండి గండపదం పుట్టింది. అది ముఖంలోని ఒక భాగానికి (చెక్కిలికి) పేరు. ఆ చెక్కిలి ఎత్తుగా ఉన్నది కాబట్టి నా పేరు గండ అని తెలిసికో". యాతుధాని అన్నది. "నీవు నీ పేరును గురించి చేసిన వ్యాఖ్యానంలోని అక్షరాలను పలకటం కూడా కష్టంగా ఉంది. నేను గుర్తుపెట్టుకోలేను. వెళ్ళు. కొలనులో దిగు". పశుసఖుడిలా అన్నాడు. "అగ్ని సంభవా! నేను పశువులను రంజింపజేస్తాను. పశువులకు సదా మిత్రుడను. ఈ గుణాన్ని బట్టి నన్ను పశుసఖునిగా గ్రహించు". యాతుధాని అన్నది. "నీవు నీ పేరును గురించి చేసిన వ్యాఖ్యానంలోని అక్షరాలను పలకటం కూడా కష్టంగా ఉంది. నేను గుర్తుపెట్టుకోలేను. వెళ్ళు కొలనులో దిగు." శునస్సఖుడిలా అన్నాడు. "వీరంతా పేర్లు చెప్పినట్టు నా పేరు చెప్పటానికి నేను ఉత్సాహపడటం లేదు. యాతుధానీ ! పశుసఖుని మిత్రునిగా నన్ను తెలిసికో". యాతుధాని అన్నది. "సంశయాత్మక వచనాలతో నీవు నీ పేరు చెప్పావు. బ్రాహ్మణా! కానీ ఇప్పుడు మరల నీ పేరుచెప్పు." శునస్సఖుడిలా చెప్పాడు. "నేను ఒకసారి పేరు చెప్పాను. నీవు గ్రహించలేదు. కాబట్టి ఈ తప్పువలన నా త్రిదండం దెబ్బతిని వెంటనే బూడిదవైపో". అప్పుడు ఆ శునస్సఖుడు బ్రహ్మదండం వంటి తన దండంతో ఆమె తలపై కొట్టాడు. ఆ కృత్య నేలగూలి, బూడిదైపోయింది.

మహాబలశాలిని అయిన ఆ యాతుధానిని చంపి, శునస్సఖుడు త్రిదండాన్ని నేలపై పెట్టి, అక్కడే గడ్డిపై కూర్చున్నాడు. ఆపై ఆ మునులందరూ తామరలను, తామర తూళ్ళను స్వేచ్ఛగా తీసికొని ఆనందంగా కొలనులోనుండి బయటకు వచ్చారు. చాలా శ్రమతో వారు తామరతూళ్ళను కట్టలు కట్టారు. వాటిని కొలను ఒడ్డున పెట్టి, కొలనులో దిగి ఆ నీటితో తర్పణలు చేయసాగారు. ఆపై అందరూ ఆ నీటిలో నుండి లేచి ఒడ్డుకు వచ్చారు. ఆ పురుషోత్తములకు ఆ తామరతూళ్ళు కనిపించలేదు. ఋషులు ఇలా అన్నారు. "మనమంతా ఆకలితో ఉన్నాం. ఆహారాన్ని కోరుతున్నాం. ఈ దశలో ఏ క్రూరుడు పాపాత్ములమైన మన తామరతూళ్ళను దొంగిలించుకుపోయాడు ? శత్రుసూదనా! ఆ ద్విజోత్తములు ఒకరినొకరు అనుమానిస్తూ మాటాడసాగారు. చివరకు అందరూ ప్రమాణాలు చేయాలని నిర్ణయించుకొన్నారు. 'బాగానే ఉందని అందరూ అనుకొని అలసిపోయి, ఆకలితో పీడింపబడుతున్న వారందరూ శపథాలు చేయటానికి సిద్ధపడ్డారు. అత్రి ఇలా అన్నాడు. "తామరతూళ్ళను దొంగిలించినవాడు కాలితో గోవును తన్నిన పాపాన్ని, సూర్యునకు అభిముఖంగా మూత్రవిసర్జన చేసిన పాపాన్ని, అనధ్యయన కాలంలో అధ్యయనం చేసిన పాపాన్ని పొందుతాడు". వసిష్ఠుడిలా అన్నాడు. "తామరతూళ్ళను దొంగిలించినవాడు

అనధ్యయనకాలంలో అధ్యయనం చేసిన పాపాన్ని, కుక్కతో విహరించిన పాపాన్ని, సంన్యాసియై కామప్రవృత్తి గలవాడు పొందే పాపాన్ని పొందుతాడు. శరణాగతుని చంపిన పాపాన్ని, తనకుమార్తె ద్వారా జీవితాన్ని గడిపే పాపాన్ని రైతుల సొమ్మును అపహరించిన పాపాన్ని పొందుతాడు. కశ్యపుడిలా అన్నాడు. "తామరతూళ్ళను దొంగిలించినవాడు అన్నిచోట్ల అన్నీ మాటాడిన పాపాన్ని, ఇతరులు దానమని ఇచ్చిన సొమ్మును దొంగిలించిన పాపాన్ని, అబద్దపు సాక్ష్యం చెప్పినపాపాన్ని పొందుతాడు. తామరతూళ్ళు దొంగిలించినవాడు వ్యర్థంగా మాంసాన్ని తిన్న పాపాన్ని, దానం వ్యర్థం చేసిన పాపాన్ని, పగటిపూట స్త్రీతో సంగమించిన పాపాన్ని పొందుతాడు."

భరద్వాజుడిలా అన్నాడు. "తామరతూళ్ళను దొంగిలించినవాడు క్రూరుడు, ధర్మహీనుడు, స్త్రీలతో, దాయాదులతో, గోవులతో అనుచితంగా ప్రవర్తించేవాడు, బ్రాహ్మణుని పరాజితుని చేసినవాడు, పొందే పాపాన్ని పొందుతాడు. తామరతూళ్ళు దొంగిలించినవాడు గురువులకన్నా ఉన్నతాసనంపై కూర్చొని ఋగ్యజుస్సులను అధ్యయనం చేసినవాడు, చెత్తను అంటించిన అగ్నిలో హోమం చేసినవాడు పొందే పాపాన్ని పొందుతాడు. జమదగ్ని ఇలా అన్నాడు. "తామరతూళ్ళను దొంగిలించినవాడు నీటిలో మల విసర్జన చేసిన పాపం, గోవులకు ద్రోహం చేసిన పాపాన్ని, గోహత్యచేసిన పాపాన్ని, ఋతుకాలం కాని సమయంలో సంగమించిన పాపాన్ని పొందుతాడు. తామరతూళ్ళు దొంగిలించినవాడు ద్వేషింపదగినవాడు, భార్యపై ఆధారపడి జీవించేవాడు, బంధువులు దూరమయినవాడు, అందరితో గొడవపడేవాడు, పరస్పరం అతిధులుగా ఉండేవారు పొందే పాపాన్ని పొందుతాడు. గౌతముడిలా అన్నాడు. "తామరతూళ్ళు దొంగిలించినవాడు వేదాధ్యయనం చేసి వదలి వేసినవాడు, మూడు అగ్నులను పరిత్యజించినవాడు, సోమరస విక్రేత పొందే పాపాన్ని పొందుతాడు. తామరతూళ్ళు దొంగిలించినవాడు శూద్ర స్త్రీ సంపర్కం గలిగి, ఆ గ్రామంలో నివసిస్తూ, ఒకే బావి నీరు తెచ్చుకొనే బ్రాహ్మణుడు పొందే పాపాన్ని పొందుతాడు". విశ్వామిత్రుడిలా అన్నాడు. "తామరతూళ్ళు దొంగిలించినవాడు తాను జీవించి ఉండగా ఇతరులు తన గురువులను పోషింపవలసి వచ్చినవాడు గతిలేనివాడు. బహుపుత్రుడు పొందేపాపాన్ని పొందుతాడు. తామరతూళ్ళు దొంగిలించినవాడు అపవిత్రుడు, వేదాలను మిథ్యగా తలచేవాడు, సంపదతో అహంకరించినవాడు, బ్రాహ్మణుడై వ్యవసాయం చేసేవాడు, మాత్సర్యం గలవాడు పొందే పాపాన్ని పొందుతాడు. తామరతూళ్ళు దొంగిలించినవాడు వర్షాకాలంలో పరదేశయాత్ర చేసే వాడు, జీతానికి పనిచేసేవాడు, రాజపురోహితుడు, యాగం చేయని వానికి ఋత్విక్కుగా ఉండేవాడు - అటువంటి బ్రాహ్మణుడు పొందే పాపాన్ని పొందుతాడు."

అరుంధతి ఇలా అన్నది. "తామరతూళ్ళు దొంగిలించిన స్త్రీ నిత్యమూ అత్తగారిని పరాభవిస్తూ, భర్తకు మనఃభేదాన్ని కలిగిస్తూ, మధురపదార్థాలను ఒంటరిగా భుజించే స్త్రీ పొందే పాపాన్ని పొందుతుంది. తామరతూళ్ళు దొంగిలించిన స్త్రీ ఇంటివారిని అవమానించి దాయాదుల ఇళ్ళలో ఉంటూ, రోజు గడిచిపోయినా పేలపిండి తింటూ, భర్తకు పనికిరానిదై, క్షత్రియలక్షణాలు గల పుత్రులను కన్న బ్రాహ్మణ స్త్రీ పొందే పాపాన్ని పొందుతుంది. గండ ఇలా అన్నది. "తామరతూళ్ళు దొంగిలించిన స్త్రీ అసత్య వాదిని, నిత్యమూ బంధు విరోధిని, కన్యాశుల్కం తీసికొని కూతురు పెళ్ళిచేసిన స్త్రీ పొందే పాపాన్ని పొందుతుంది. తామరతూళ్ళు దొంగిలించిన స్త్రీ వండుకొని తానే తింటూ, దాస్యంతోనే వయస్సు ముదిరి పాపకర్మలతో మరణించిన స్త్రీ పొందే పాపాన్ని పొందుతుంది". పశుసఖుడిలా అన్నాడు. "తామరతూళ్ళు దొంగిలించినవాడు రాబోయే జన్మలో కూడా సేవకుల ఇంటిలోనే పుడతాడు. సంతానహీనుడై, దరిద్రుడై దేవతలకు నమస్కరించకుండా బ్రతుకుతాడు." శునస్సఖుడిలా అన్నాడు. "తామరతూళ్ళను దొంగిలించినవాడు బ్రహ్మ చర్యాన్ని ముగించుకొని వచ్చిన యజుర్వేద వేత్తకో, సామవేద పండితునికో కన్యాదానం చేస్తాడు. అధర్వ వేదాధ్యయనం పూర్తిచేసి స్నాతకుడవుతాడు". ఋషులిలా అన్నారు. "శునస్సఖా! నీ చేసిన శపథం బ్రాహ్మణులకు అభీష్టమైనది. కాబట్టి నీవే తామరతూళ్ళను దొంగిలించావని మా అందరి అభిప్రాయం"

శునస్సఖుడిలా అన్నాడు. "మీరన్నది నిజమే. అసత్యం కాదు. తామరతూళ్ళు నేనే దొంగిలించాను. మీరు తర్పణం చేస్తూ ఇటు గమనించనప్పుడు నేను వాటిని తీసి దాచాను. నేనే తామరతూళ్ళను దాచాను. ఇదిగో. ఇక్కడ చూడండి. అనఘులారా! పూజ్యులైన మిమ్ము పరీక్షింపగోరి నేనిలా చేశాను. మీ అందరినీ కాపాడటం కోసమే నేను వచ్చాను. ఆ యాతుధాని అతి క్రూరకృత్య. మిమ్ము చంపటానికి వచ్చింది. వృషాదర్భి ప్రయోగించిన కృత్య ఈమె. నేను చంపాను. తపోధనులారా! ఈమె అగ్నిలో పుట్టింది. దుష్టరాలు, పాపాత్మురాలు మిమ్ము హింసించగలది. అందువలననే నేను వచ్చాను. బ్రాహ్మణులారా! నేను ఇంద్రుడను. గ్రహించండి. మీరు లోభరహితులు కాబట్టి అన్ని కోరికలను తీర్చే అక్షయలోకాలను పొందగలరు. లేవండి. వెంటనే ఆ లోకాలను పొందండి. భీష్ముడు చెప్తున్నాడు. ఆపై మహర్షులు ప్రసన్నులై 'అలాగే' అని ఇంద్రునితో అని దేవేంద్రునితో పాటు స్వర్గలోకానికి వెళ్ళిపోయారు. ఈ రీతిగా ఆ మహాత్ములు ఎంతో ఆకలితో ఉన్నా, వివిధ భోగాలు అందుబాటులోనికి వచ్చినా, లోభంతో ఆ ప్రలోభాలకు

గురి కాక కడకు స్వర్గాన్ని పొందారు. కాబట్టి ఏ అవస్థలోనయినా నరుడు లోభాన్ని వీడాలి. రాజా! ఇదే ఉత్తమధర్మం. కాబట్టి లోభాన్ని వదలిపెట్టాలి. నరుడు ఈ పవిత్రచరిత్రను జనులమధ్యలో కీర్తిస్తూ, ధనాన్ని, అభీష్టాలను పొందగలడు. కష్టాలను తరించగలడు. పితరులు, ఋషులు, దేవతలు కూడా అతనికి ప్రసన్ను లవుతారు. ఆ మానవుడు కీర్తినీ, ధర్మాన్నీ, అర్థాన్నీ పొందగలడు. మరణానంతరం సద్గతిని పొందగలడు.

94. శపథవిధి.

భీష్ముడు చెప్తున్నాడు. ఈ విషయంలో తీర్థయాత్రలో శపథాలు చేసిన పురాతనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. దానిని విను. భరతసత్తమా! మహారాజా! గతంలో కొందరు రాజర్షులు, బ్రహ్మర్షులు ఇలాగే పద్మాలను దొంగిలించారు. పశ్చిమ సముద్రతీరంలోని ప్రభాసతీర్థంలో ఋషులెందరో కలిశారు. ఆ కలయికలో "మనమంతా అనేక పుణ్యతీర్థాలతో కూడిన సమస్త భూమండలంలో సంచరిద్దాం. అది మనందరి కోరిక. అందరం వెళదాం" అని నిర్ణయించుకొన్నారు. శుక్రుడు, అంగిరుడు, పండితుడైన కవి, అగస్త్యుడు, నారదుడు, పర్వతుడు, భృగువు, వసిష్ఠుడు, కశ్యపుడు, గౌతముడు, విశ్వామిత్రుడు, జమదగ్ని, గాలవముని, అష్టకుడు, భరద్వాజుడు, అరుంధతి, వాలఖిల్యులు, శిబి, దిలీపుడు, నహుషుడు, అంబరీషుడు, యయాతిరాజు, ధుంధుమారుడు, పూరుడు – ఈ బ్రహ్మర్షులు, రాజర్షులు వృత్రహంత అయిన ఇంద్రుని ముందు నిలుపుకొని, తీర్థాలనన్నింటినీ సేవిస్తూ మాఘ పూర్ణిమనాడు పుణ్యతీర్థమైన కౌశికీ నదీ తీరానికి చేరారు. అక్కడ అన్ని తీర్థాలలో స్నానమాడి, పాపవిముక్తులై పుణ్యప్రదమైన బ్రహ్మ సరస్సును చేరారు. ఆ దేవ తీర్థంలో అగ్నిసమానులై తామరతూళ్ళను, తామర పూలను ఆహారంగా స్వీకరించారు. రాజా! కొందరు ఋషులు అక్కడ తామరతూళ్ళను పీకసాగారు. కొందరు విప్రులు తామరతీగలను పెళ్ళగించసాగారు. అప్పుడు అగస్త్యుడు ఆ కొలనునుండి పీకి పెట్టుకొన్న కమలాలు అదృశ్యమైపోయాయి. అందరూ అది గమనించారు.

అప్పుడు అగస్త్యుడు ఆ ఋషివరు లందరితో ఇలా అన్నాడు. "నా అందమైన తామరలను ఎవరు తీశారు? మీ పై అనుమానంగా ఉంది. నా తామరలనివ్వండి. మీ వంటివారు తామరలను దొంగిలించరాదు. కాలం ధర్మవీరులను హింసిస్తుందని విన్నాను. అదిగో ఆ ధర్మపీడ ఇప్పుడు కలిగింది. కాబట్టి ఈ లోకంలో అధర్మం విస్తరించకముందే శాశ్వతంగా స్వర్గలోకానికి వెళదాం. రాబోయే రోజులలో బ్రాహ్మణులు గ్రామమధ్యంలో ఉచ్చైఃస్వరంతో శూద్రులకు వేదాలు వినిపిస్తారు. రాజులు వ్యావహారిక దృష్టితో ధర్మాలను

చూస్తారు. నేను పరలోకానికి వెళ్తాను. ఇకముందు గొప్పవారు కూడా మహాత్ములను తక్కువ చేసి, పరిహసిస్తారు. అజ్ఞానాంధకారం ఈ లోకంలో వ్యాపించకముందే శాశ్వతంగా పరలోకానికి వెళ్తాను. ఇకముందు బలవంతులైనవారు దుర్బలులను తమ భోగాలకు వినియోగించుకొంటారు. కాబట్టి శాశ్వతంగా పరలోకానికి వెళతాను. ఈ జీవసమూహాన్ని ఈ లోకంలో చూడాలని భావించటం లేదు. ఆ మాటలు విని ఆర్తులయిన ఋషులు అగస్త్యమునితో ఇలా అన్నారు. "మహర్షీ! మేము నీ కమలాలను దొంగిలించలేదు. మాపై అసత్యారోపణ చేయవద్దు. కావాలంటే తీవ్రప్రమాణాలు (శపథాలు) చేస్తాం." రాజా! ఆ మహర్షులు, రాజులు అలా నిశ్చయించుకొని, ధర్మదృష్టితో పుత్రపౌత్రులతో సహా వరుసగా శపథాలు చేయసాగారు.

భృగువిలా అన్నాడు. నీ కమలాలను దొంగిలించినవాడు తిట్లు తిని తిరిగి తిడతాడు. దెబ్బలు తిని తిరిగి కొడతాడు. పరుల పృష్ఠమాంసం తింటాడు (అటువంటి పాపాలు పొందుతాడు) వసిష్ఠుడిలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు స్వాధ్యాయవిముఖు డవుతాడు. కుక్కను వెంటబెట్టుకొని తిరుగుతాడు. నగరంలో భిక్షుకు డవుతాడు." కశ్యపుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు అన్ని తావులా అన్ని వస్తువులు కొంటాడు, అమ్ముతాడు. ఇతరులు తన దగ్గర దాచుకొన్న వస్తువులకు ఆశపడతాడు. దొంగసాక్ష్యాలు చెపుతాడు." గౌతముడిలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు అహంకారంతో, విషమబుద్ధితో జీవిస్తాడు. అయోగ్యులతో పాటు సంచరిస్తాడు. కర్షకుడు ఈర్ష్యాళువు అవుతాడు." అంగిరుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు అపవిత్రుడు, వేదనిందకుడు అవుతాడు. కుక్కను వెంటబెట్టుకొని తిరుగుతాడు. బ్రహ్మహత్యచేసి ప్రాయశ్చిత్తం లేకుండా బ్రతుకుతాడు." ధుంధుమారుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు మిత్రులపై కృతజ్ఞత లేని వాడవుతాడు. శూద్రజాతిలో పుడతాడు. సంపదలను ఒంటరిగానే భుజిస్తాడు." పూరువిలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు చికిత్సతో జీవిస్తాడు. భార్యపై ఆధారపడి బ్రతుకుతాడు. మామగారు అందించిన వృత్తితో జీవిస్తాడు". దిలీపుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు శూద్రస్త్రీ సంపర్కం గలిగి, ఆ గ్రామంలో నివసిస్తూ, ఒకే బావి నీరు తెచ్చుకొనే బ్రాహ్మణుడు పొందే లోకాలను పొందుతాడు.

శుక్రుడిలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు వృథా మాంసం తింటాడు. పగలు స్త్రీతో సంగమిస్తాడు. రాజ సేవకుడు అవుతాడు." జమదగ్ని ఇలా

అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు అనధ్యయన కాలంలో అధ్యయనం చేస్తాడు. మిత్రుని శ్రాద్ధంలో నియోగిస్తాడు. శూద్రశ్రాద్ధంలో భుజిస్తాడు." శిబి ఇలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు ఆహితాగ్ని కాకయే మరణిస్తాడు. యాగవిఘాతం చేస్తాడు. తపస్సులతో విరోధం పెట్టుకొంటాడు." యయాతి ఇలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు వ్రతశీలుడై ఉండి, ఋతుకాలం కాకపోయినా భార్యతో సంగమిస్తాడు. వేదాలను నిరాకరిస్తాడు." నహుషుడిలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు సంన్యాసియై కూడా ఇంటిలో ఉంటాడు. దీక్షితుడై కూడా కాముకుడవుతాడు. డబ్బు తీసికొని చదువు చెపుతాడు." అంబరీషుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు క్రూరుడు, ధర్మహీనుడు, స్త్రీలతో, దాయాదులతో, గోవులతో అశుచిగా ప్రవర్తించేవాడు, బ్రాహ్మణుని చంపినవాడు కాగలడు." నారదుడిలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు శరీరాన్నే ఆత్మగా భావిస్తాడు. హద్దులనతిక్రమించి శాస్త్రాలు చదువుతాడు. స్వరహీనంగా పదం పలుకుతాడు. పెద్దలను అవమానిస్తాడు." నాభాగుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు అసత్యవాది అవుతాడు. ఎప్పుడూ సజ్జనులతో విరోధిస్తాడు. శుల్కం తీసికొని కూతురు పెళ్ళి చేస్తాడు." కవి ఇలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు కాలితో గోవును తన్నినవాడు, సూర్యాభిముఖంగా మూత్ర విసర్జన చేసినవాడు, శరణాగతుని విడిచిపెట్టినవాడు కాగలడు."

విశ్వామిత్రుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు వైశ్యసేవకుడై వానలు పడకుండా చేస్తాడు. రాజపురోహితుడవుతాడు. యాగం చేయనివాని దగ్గర ఋత్విక్కుగా ఉంటాడు." పర్వతుడిలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు గ్రామంలో పెత్తందారి అవుతాడు. గాడిదపై స్వారీ చేస్తాడు. బ్రతుకుతెరువుకై కుక్కను వెంటబెట్టుకొని తిరుగుతాడు." భరద్వాజుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు క్రూరుడు, అసత్యవాది పొందే సమస్తపాపాన్ని ఎప్పుడూ అనుభవిస్తూ ఉంటాడు." అష్టకుడిలా అన్నాడు "నీ కమలాలను అపహరించిన రాజు బుద్ధిహీనుడు, స్వేచ్ఛాచారి అయి అధర్మంగా రాజ్యాన్ని పరిపాలిస్తాడు." గాలవుడిలా అన్నాడు. "నీ కమలాలను దొంగిలించినవాడు పాపిష్ఠులకన్నా ఎక్కువగా తిరస్కరింపదగినవాడు, తనవారికే అపకారం చేసేవాడు, దానమిచ్చి చెప్పుకొనేవాడు కాగలడు." అరుంధతి ఇలా అన్నది. "నీ కమలాలను అపహరించిన స్త్రీ అత్తను నిందించేదీ, భర్త మనస్సును కష్టపెట్టేదీ, ఒంటరిగా మధుర పదార్థాలను తినేది అవుతుంది." వాలఖిల్యులిలా అన్నారు. "నీ కమలాలను దొంగిలించినవాడు తన

బ్రతుకుతెరువుకై గ్రామద్వారం దగ్గర ఒంటికాలిపై నిలుస్తాడు. ధర్మమెరిగి కూడా పాటించడు." శునస్సఖుడిలా అన్నాడు. "నీ కమలాలను అపహరించినవాడు ద్విజుడు అగ్నిహోత్రాన్ని అనాదరించి సుఖంగా నిద్రిస్తుంటాడు. పరివ్రాజకుడై కూడా కామప్రవృత్తితో ఉంటాడు." సురభి ఇలా అన్నది. "నీ కమలాలను దొంగిలించిన దాని పాదాలు వెంట్రుకల త్రాటితో బంధింపబడతాయి. దాని పాలు కంచుగిన్నెలో పిండుతారు. మరో ఆవు దూడతో అది పాలిస్తుంది."

భీష్ముడిలా అన్నాడు. "కౌరవేంద్రా! ఇలా అందరూ రకరకాలుగా ప్రమాణాలు చేయగా సహస్రాక్షుడైన ఇంద్రుడు బాగా ప్రసన్నుడై కోపంతో ఉన్న అగస్త్యుని చూశాడు. రాజా! ఆ తరువాత ఇంద్రుడు బ్రహ్మర్షి దేవర్షి రాజర్షుల మధ్యలో, కోపంతో ఉన్న అగస్త్యమునిని సంబోధించి తన శపథాన్ని ఇలా ప్రకటించాడు. 'నీ కమలాలను దొంగిలించినవాడు బ్రహ్మచర్యాన్ని ముగించుకొని వచ్చిన యజుర్వేదవేత్తకో, సామవేదపండితునికో కన్యాదానం చేస్తాడు. అధర్వ వేదాధ్యయనం పూర్తిచేసి స్నాతకుడవుతాడు. నీ కమలాలను అపహరించినవాడు సర్వవేదాలను అధ్యయనం చేసి, పుణ్యశీలుడై, ధార్మికుడై, మరణానంతరం బ్రహ్మలోకానికి వెళతాడు. అగస్త్యుడిలా అన్నాడు. "ఇంద్రా! నీ శపథం ఆశీర్వాద రూపంలో ఉంది. నా కమలాలను నాకు ఇచ్చివేయి. ఇది సనాతనధర్మం. ఇంద్రుడిలా అన్నాడు. "స్వామీ! లోభంతో తమ కమలాలను తీసికొనలేదు. ధర్మాలను వినగోరి అపహరించాను. కోపపడవద్దు. నేనిప్పుడు మీ ద్వారా ఆర్షమూ, నిత్యమూ, అవ్యయమూ, అనామయమూ అయిన సనాతనధర్మాన్ని విన్నాను. ఇది సంసార సాగరాన్ని తరింపజేసే సేతువు. ధార్మికవచనాల ఉత్కర్షను పెంచుతుంది. పండితా! ద్విజశ్రేష్ఠా! ఇదిగో, నీ పద్మ సంపదను తీసికో, స్వామి! అనిందితా! నా తప్పు క్షమించాలి." ఇంద్రుడలా అనగానే తీవ్రకోపంతో ఉన్న ఆ ముని ప్రసన్నుడయ్యాడు. ధీమంతుడు తపస్వి అయిన తాను ఆ పద్మాన్ని స్వీకరించాడు. ఆపై వారు వనమార్గంలో మరల తీర్థాలకు బయలుదేరారు. పుణ్యతీర్థాలలో శరీరాలను ముంచి స్నానం చేశారు. ప్రతి పర్వదినాన ఈ ఆఖ్యానాన్ని సావధానుడై పరించినవాడు జ్ఞాని అయిన పుత్రుని పొందుతాడు. నిరాదరణకు గురికాడు. అతనికి ఏ ఆపదా కలుగదు. చింత ఉండదు. వార్ధక్యం మీద పడదు. రాగానికి లోనుకాక శ్రేయస్సును పొందగలడు. మరణానంతరం స్వర్గానికి వెళతాడు. నరోత్తమా! ఋషులు రక్షించే ఈ శాస్త్రాన్ని అధ్యయనం చేసినవాడు అవ్యయ బ్రహ్మలోకానికి పోతాడు.

95. గొడుగు, చెప్పుల పుట్టుక.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "భరతర్షభా! శ్రాద్ధకర్మలలో గొడుగు, చెప్పులు ఇస్తుంటారు. దీనినిలా ప్రవర్తింపజేసినదెవరు ? ఈ సంప్రదాయం ఎలా ఏర్పడింది ? ఎందుకిస్తున్నారు? శ్రాద్ధకర్మలలోనే కాక ఇతర పుణ్యకార్యాలలో కూడా ఇస్తుంటారు? అనేక కార్యక్రమాలలో పుణ్యం కోసమిస్తుంటారు గదా! రాజా! దీని తత్త్వాన్ని వివరంగా వినాలనుకొంటున్నాను.' భీష్ముడు చెప్తున్నాడు. "రాజా! గొడుగు, చెప్పులు దానమిచ్చే విషయాన్ని వివరంగా సావధానంగా విను. లోకంలో ఇది ఎలా ప్రారంభమయినదో, ఎలా వ్యాపించిందో చెపుతాను. రాజా! ఇది ఎలా అక్షయమైనదో, ఎలా పుణ్యప్రదమైనదో మొత్తం, నిశ్శేషంగా చెపుతాను.

ఈ విషయంలో జమదగ్నికి, మహాత్ముడైన సూర్యునకు మధ్య జరిగిన సంవాదం చెపుతాను. రాజా! ఒకప్పుడు భృగునందనుడైన జమదగ్ని వింటితో వినోదించసాగాడు. ఆపై ఆ అల్లెత్రాటి ధ్వని, బాణ ప్రయోగధ్వనులతో పరమానందపడి బాణాలను వదులుతూనే ఉన్నాడు. ఆమె తిరిగి తెస్తూనే ఉంది. రాజా! అలా జమదగ్ని క్రీడిస్తుండగానే మధ్యాహ్నమైంది. జ్యేష్ఠమాసపు సూర్యుడు నడి నెత్తికి వచ్చాడు. ఆ విప్రుడు బాణాలను వదలి రేణుకతో ఇలా అన్నాడు. "విశాలాక్షి! వెళ్ళు. వింటినుండి వెలువడిన ఈ బాణాలను తీసికొని రా! సుభ్రూ! వీటిని మరలా ప్రయోగిస్తాను. ఆ కాంత చెట్ల మధ్యలో వెళుతూ మధ్యమధ్య వాటి నీడలో నిలుస్తోంది. ఆమె తల, పాదాలు కాలుతున్నాయి. నల్లని కన్నులతో, శుభప్రదమయిన ఆ రేణుక ముహూర్తకాలం అక్కడ నిలిచి, భర్తశాపభయంతో మరల బాణాలను తెచ్చేందుకు వెళ్ళింది. ఆ యశస్విని ఆ బాణాలను తీసికొని వచ్చింది. అప్పుడు ఆ సుందరాంగి ఎంతో ఖేదానికి లోనైంది. కాళ్ళు కాలినందువల్ల కలిగిన దుఃఖాన్ని నియంత్రించుకొంటూ భర్తృభయంతో వణికిపోతూ భర్త దగ్గరకు వచ్చింది. ఆ ఋషి కోపంతో ఆ శుభాననను, రేణుకా! ఎందుకు ఆలస్యంగా వచ్చా"వని మాటిమాటికి అడిగాడు. రేణుక ఇలా అన్నది. "తపోధనా! నా శిరస్సు, పాదాలు కాలుతున్నాయి. సూర్యుని ఎండ నన్ను కదలనీయలేదు. అందువలన చెట్టునీడలో ఉన్నాను. బ్రహ్మస్వరూపా! ఈ కారణం వలన నేను ఆలస్యం చేశాను. ప్రభూ! తపోధనా! ఇది విని, నాపై కోపపడకండి." జమదగ్ని ఇలా అన్నాడు. "రేణుకా! దీప్తికిరణుడైన ఈ సూర్యుడు నీకు దుఃఖాన్ని కలిగించాడు. నా బాణాగ్ని తేజస్సుతో ఇప్పుడే బాణాలతో సూర్యుని పడగొడతాను."

భీష్ముడు చెప్తున్నాడు. "ఆ జమదగ్ని దివ్యధనుస్సును లాగి, అనేక బాణాలను

తీసికొని సూర్యుడు ఎటు కదిలితే అటు గురిపెట్టి నిలిచాడు. కొంతేయా! అలా సన్నద్ధుడైన జమదగ్నిని చూసి, సూర్యుడు ద్విజరూపంతో ఆయన దగ్గరకు వచ్చి, ఇలా అన్నాడు. సూర్యుడు ఏ తప్పు చేశాడు? సూర్యుడు ఆకాశంపై నిలిచి కిరణాలతో అక్కడక్కడి నీటిని గ్రహిస్తాడు. ఆ దివాకరుడు తాను తీసికొన్న జలాన్ని వర్షాకాలంలో వర్షిస్తాడు. బ్రాహ్మణా! దానితో మనుష్యులకు సుఖాన్ని కలిగించే అన్నం పుడుతుంది. అన్నమే ప్రాణాలు అని వేదాలు చెపుతాయి. బ్రాహ్మణా! అంతేగాక కిరణాలచే చుట్టబట్టి మేఘాల మాటుగా నిలిచి, ఈ సప్తద్వీపాలలోను వాన కురిపిస్తాడు. ప్రభూ! దానితో ఓషధులు, లతలు చివురిస్తాయి. పుష్పిస్తాయి. అదంతా వర్షంవలన జరిగేపనియే. అన్నం కూడా దానితోనే పుడుతుంది. జాతకర్మలు, వ్రతాలు, ఉపనయనాలు, గోదానాలు, వివాహాలు, యజ్ఞ సమృద్ధులు, శాస్త్రాలు, దానాలు, సంయోగం, ధనసమీకరణం – అన్నీ అన్నంతోనే, జరుగుతాయి. రమణీయపదార్థాలు, ఉత్పాదకాలైన పదార్థాలు అన్నీ అన్నం నుండి పుడతాయి. ఇది నీవెరిగినదే, అయినా చెపుతున్నాను. బ్రాహ్మణా! నేను చెప్పినదిదంతా నీకు తెలిసినదే. విప్రర్షీ! నిన్ను ప్రార్థిస్తున్నాను. సూర్యుని పడగొడితే నీకు లాభమేమిటి ?"

96. గొడుగు, చెప్పులు - దానఫలము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "సూర్యుడలా అభ్యర్థించినప్పుడు మునిసత్తముడు, మహాతేజస్వి అయిన జమదగ్ని ఏం చేశాడు?" భీష్ముడు చెపుతున్నాడు. "కురునందనా! సూర్యుడా రీతిగా ప్రాధేయపడినా అగ్నితేజస్వి అయిన ఆ జమదగ్నిముని శాంతించలేదు. రాజా! ఆ తరువాత బ్రాహ్మణరూపంలో ఉన్న సూర్యుడు చేతులు జోడించి, జమదగ్నికి నమస్కరించి, మధురమైన వాక్కుతో ఇలా అన్నాడు. "బ్రహ్మర్షీ! సూర్యుడు ఎప్పుడూ తిరుగుతూనే ఉంటాడు. నీవు కొట్టవలసిన లక్ష్యం చంచలం. సదా చలిస్తున్న సూర్యుని ఎలా ఛేదించగలవు ?" జమదగ్ని ఇలా బదులిచ్చాడు. "నీవు స్థిరంగా ఉన్నా, కదులుతున్నా జ్ఞాననేత్రంతో నిన్ను తెలిసికొనగలను. నిన్ను తప్పక శిక్షించి ఈ రోజు నీకు వినయాన్ని కలిగించాలి నేను. సూర్యా! మధ్యాహ్న కాలంలో అరనిముషంపాటు నీవు స్థిరంగా ఉంటావు. అప్పుడు నిన్ను ఛేదిస్తాను. ఈ విషయంలో నేను చింతించవలసిన పని లేదు." సూర్యుడిలా అన్నాడు. "బ్రహ్మర్షీ! ధన్విశ్రేష్ఠా! అనుమానం లేదు. నీవు నన్ను తప్పక బ్రద్దలు చేయగలవు. స్వామీ! అపరాధినైన నేను శరణుకోరి వచ్చానని గ్రహించు." భీష్ముడు చెప్తున్నాడు. "అప్పుడు పూజ్యుడైన జమదగ్ని నవ్వి, సూర్యునితో ఇలా అన్నాడు. "సూర్యా! నీవు

భయపడవలదు. నన్ను శరణుకోరి వచ్చావు గదా! శరణాగతుని చంపినవాడు బ్రాహ్మణులలోని ఋజుత్వాన్ని, భూమిలోని స్థిరత్వాన్ని, సోముని సౌమ్యాన్ని, వరుణుని గాంభీర్యాన్ని, అగ్ని దీప్తిని, మేరు పర్వతకాంతిని, సూర్యుని ప్రతాపాన్ని అతిక్రమించి ప్రవర్తించినట్లే. శరణాగతుని చంపినవాడు గురుపత్నితో సంగమించిన పాపాన్ని, బ్రహ్మహత్యాపాపాన్ని, సురాపాన పాపాన్ని పొందుతాడు. నాయనా! నీవు చేసిన అపరాధానికి పరిష్కారాన్ని గూర్చి ఆలోచించు. నీ కిరణాలతో తపించిన మార్గంపై సుఖంగా సాగిపోయే ఉపాయమాలోచించు" "అలా పలికి జమదగ్ని మౌనంగా ఉన్నాడు. అప్పుడు సూర్యుడు వెంటనే గొడుగు, చెప్పులను ఆ మహర్షికిచ్చాడు. సూర్యుడిలా అన్నాడు. "మహర్షీ! ఈ గొడుగు నా కిరణాలను నివారించగల శిరోరక్షకం. పాదాలను రక్షించటానికి ఈ చర్మపాదుకలను (చెప్పులను) పరిగ్రహించు. నేటినుండి ఈ లోకంలో ఇవి ప్రచారంలోనికి వస్తాయి. పుణ్యకర్మలన్నింటిలో వీటిని దానం చేయటం ఉత్తమాక్షయలోకాలను కలిగిస్తుంది. భీష్ముడు చెప్తున్నాడు. "ఇలా ఈ గొడుగు, చెప్పులు సూర్యుడు ప్రవర్తింపజేసినవి. భారతా! ఈ వస్తువులను దానం చేయటం మూడు లోకాలలోనూ పుణ్యప్రదమని చెప్పబడింది. కాబట్టి బ్రాహ్మణులకు మంచి గొడుగును, చెప్పులను దానమిమ్ము. అది మహాధర్మకార్యం. నాకు ఈ విషయంలో మరో ఆలోచన లేదు. వందకమ్ములు గల మంచి గొడుగును బ్రాహ్మణునకు ఇచ్చినవాడు మరణానంతరం పరలోక సుఖాలతో వర్ధిల్లుతాడు. ఆ దాత దేవతలచే, అప్సరసలచే, బ్రాహ్మణులచే పూజింపబడుతూ ఇంద్రలోకంలో వసిస్తాడు. మహాబాహూ! స్నాతకుడు, నియమపరుడు అయిన బ్రాహ్మణునకు కాళ్ళు మాడుతున్నప్పుడు చెప్పులను దానం చేసినవాడు మరణానంతరం దేవతలచే పూజింపబడు లోకాలను పొందుతాడు. భారతా! గోలోకంలో ఆనందంగా నివసిస్తాడు. భరతసత్తమా! ఇది గొడుగు, చెప్పులు దానం చేస్తే వచ్చే ఫలం. నేను నీకు పూర్తిగా చెప్పాను.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "పితామహా! శూద్రులకు ఈ లోకంలో సదా శుశ్రూషయే పరమధర్మమని చెప్పబడింది. ఆ సేవ ఏ కారణాలవలన, ఎన్ని విధాలుగా ఉంటుంది ? భరతర్షభా! శూద్రులకు సేవద్వారా ఏ లోకాలను పొందుతారు? భరతశ్రేష్ఠా! ధర్మలక్షణం నాకు చెప్పు భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయంలో బ్రహ్మవాది అయిన పరాశరుడు శూద్రులమీద కృపతో చెప్పిన పురాతనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. వృద్ధుడైన పరాశరుడు సర్వవర్ణాలపై అనుగ్రహ దృష్టితో శౌచాచారసంపన్నమై, అనామయమైన పవిత్రధర్మాన్ని ప్రతిపాదించాడు. తత్త్వవేత్త అయిన ఆ ముని తన ధర్మోపదేశమంతా యథాక్రమంగా శిష్యులకు నేర్పించాడు. అది అర్థవంతమైన ధర్మశాస్త్రమైంది పరాశరుడు చెప్తున్నాడు. "మనిషి జితేంద్రియుడై, నిగ్రహశీలియై, పవిత్రుడై, చాంచల్యరహితుడై,

బలశాలియై, ధైర్యవంతుడై, వాదవివాదాల జోలికి పోకుండా, లోభరహితుడై, దయామయుడై, సరళుడై, బ్రహ్మవాదియై, సదాచార తత్పరుడై, సర్వభూతహితాన్ని కోరుతూ, తన శరీరాన్ని ఆశ్రయించి ఉన్న కామక్రోధాలను, లోభాన్ని, మానమోహాలను, మదాన్ని జయించాలి. ఇవి తనకు ఆరుగురు శత్రువులు. ధీమంతుడైన మనుష్యుడు యథావిధిగా ధైర్యాన్ని పొంది, పెద్దలను సేవిస్తూ, అహంకార రహితుడై, మిగిలిన మూడు వర్ణాలకు నచ్చేటట్లు తన శక్తిని, బలాన్ని అనుసరించి, మనసా, వాచా, కర్మణా, నేత్రంద్వారా నియమాన్ని పాటిస్తూ శాంతచిత్తుడై నిగ్రహశీలుడై, జితేంద్రియుడై నిలవాలి. నిత్యమూ జ్ఞానులను అన్వేషిస్తూ, యజ్ఞశేషాన్ని భుజిస్తూ, తుమ్మెద పూలనుండి తేనెను సమీకరించినట్లు, వర్ణత్రయం నుండి భిక్షను స్వీకరిస్తూ భిక్షకుడు ధర్మాచరణ చేయాలి.విప్రులకు స్వాధ్యాయమే ధనం. క్షత్రియులకు బలమే ధనం. వైశ్యులకు వ్యవసాయం, వ్యాపారం ధనం, శూద్రులకు పరిచర్యయే ధనం. ఈ ధర్మాన్ని విచ్ఛిన్నం చేస్తే నరకానికి వెళ్ళవలసివస్తుంది. నరకం నుండి బయటపడిన తరువాత ధర్మరహితులు, దయాశూన్యులు అయిన ఆ మనుషులు మరల మ్లేచ్ఛులవుతారు. మరల పాపకృత్యాల ద్వారా నరకానికి వెళతారు. మరల జంతుజాతులలో జన్మిస్తారు. ప్రాచీనమైన వర్ణాశ్రమరూపమైన సన్మార్గాన్ని ఆశ్రయించి, అపమార్గాలనన్నింటినీ వీడి, స్వధర్మమార్గాన్ని అనుసరిస్తూ, సర్వప్రాణులపై దయజూపుతూ, క్రోధరహితుడై శాస్త్రోక్తవిధితో శ్రద్ధగా దేవతలను, బ్రాహ్మణులను పూజిస్తూ ఉండే వారికే యథావిధిగా, క్రమంగా ధర్మగ్రహణ విధానాన్ని, సేవా సంప్రాప్తిని చెప్పబోతున్నాను.

విశేషంగా శౌచాన్ని సంపాదించుకోవాలన్న కోరికగల వారికై శౌచప్రయోజనాలను అన్నింటినీ చెపుతాను. తత్త్వవేత్తలు మహాశౌచం వంటి విధులను సందర్భించి ఉన్నారు. అక్కడ శూద్రుడు భిక్షుకుల కోసమై మట్టినీ, ఇతర వస్తువులను సమకూర్చాలి. ధర్మజ్ఞులై కేవలం ధర్మాన్ని ఆశ్రయించి, జ్ఞానసంపన్నులై అందరిహితాన్ని కోరే భిక్షుకులు (సంన్యాసులు) సజ్జనుల బాటలో నిలిచి, పవిత్రమైన కల్పలతవంటి ప్రదేశాన్ని నిశ్చయించుకోవాలి. మనస్సును, ఇంద్రియాలను నియంత్రించిన ఆ సంన్యాసి నిర్జనమై, చాటు గల ప్రదేశాన్ని వెదకి, అక్కడ నీటనింపిన జలపాత్రను, బాగా పరీక్షించిన మట్టిని ఉంచాలి. ఆ నేలను బాగా పరీక్షించి, మౌనంగా మూత్రవిసర్జన చేయాలి. పగలయితే ఉత్తరాభిముఖుడై, రాత్రి అయితే దక్షిణాభిముఖుడై మూత్రాన్ని విసర్జించాలి. మలవిసర్జనకు ముందు ఆ భూమిని కప్పి ఉంచాలి శిరస్సుపై వస్త్రాన్ని కప్పు కోవాలి. శౌచ విధి ముగిసే దాకా ఏమీ మాటాడకూడదు. శౌచకర్మ ముగిసిన తరువాత ఆచమనం చేసి, వెళుతూ మాటడవచ్చు. శౌచం కోసం కూర్చున్నప్పుడు జలపాత్రను, మట్టిని దగ్గర ఉంచుకోవాలి. ధీరుడు కమండలాన్ని చేతితో పట్టుకొని కుడివైపు తొడలమధ్య పెట్టుకొని, సావధానంగా, మెల్లగా మూత్రవిసర్జన చేయాలి. ఆ తుంపురులు శరీరంపై పడరాదు. ఆ తరువాత విధి పూర్వకంగా శుద్ధజలాన్ని చేతితో తీసికొని, జాగ్రత్తగా కడుక్కోవాలి. మూత్రబిందువులు లోన మిగలరాదు, అపవిత్రమైన ఆ చేయి తొడలకు తగలరాదు. మలవిసర్జన తరువాత ప్రక్షాళన వేళలో క్రమంగా మూడుసార్లు గుదభాగాన మట్టిని అద్దాలి. నీటి బిందువులను బట్టలపై పడనీయకుండా ప్రక్షాళన చేసికోవాలి. ఎడమచేతిని పన్నెండుసార్లు, కుడిచేతిని మూడుమూడు సార్లు మట్టినద్ది కడుగుకోవాలి. బట్టలకు మలమంటితే శౌచం రెట్టింపు అవుతుంది. రెండుకాళ్ళను, రెండు చేతులను, రెండు తొడలను ప్రత్యేకించి శుభ్రం చేసికోవాలి. శౌచాన్ని పాటించకపోతే శరీరశుభ్రత విషయంలో సందేహం కలుగుతుంది.

కాబట్టి ఎలా చేస్తే శరీరశుద్ధి అవుతుందో తదనుగుణంగా ప్రవర్తించాలి. మట్టితో పాటు ఉప్పు, చవుడు కలిపి బట్టలను శుద్ధిచేయాలి. అంటుకొన్న అమేధ్యం, దాని వాసన పోయేటట్లు శుద్ధి చేయాలి. ఆపత్కాలంలో నాలుగుసార్లు కానీ మూడుసార్లు కానీ, రెండు సార్లు కానీ, కనీసం ఒక్కసారి మట్టిని అద్దాలి. దేశ కాలాలను బట్టి శౌచాచారాన్ని పూర్తిగా కానీ లఘువుగా కానీ పాటించాలి. ఈ రీతిగా ప్రతిదినమూ సోమరితనం లేకుండా శౌచాన్ని పాటించాలి. శుద్ధి సమయంలో రెండు కాళ్ళు కడుగుకొని తడబాటు లేకుండా, దిక్కులు చూడకుండా పని ముగించాలి కాళ్ళు కడుగుకొన్న తరువాత చేతులను పైనుండి క్రింది దాకా కడుగుకోవాలి ఆపై ఆచమించాలి. ఆచమించే సమయంలో మౌనంగా ఉండాలి. చప్పుడు చేయకుండా మూడుసార్లు నీరు త్రాగాలి. ఆచమించిన నీరు హృదయందాకా వెళ్ళాలి. ఆపై రెండు సార్లు ముఖం కడుగుకోవాలి. ఆపై ఇంద్రియరంధ్రాలను స్పృశించాలి. మొదటిసారి నీరు త్రాగినపుడు ఋగ్వేదం, రెండవసారి త్రాగినపుడు యజుర్వేదం, మూడవసారి త్రాగినపుడు సామవేదం ప్రసన్నమవుతాయి. మొదటిసారి ముఖసమ్మార్జనంతో అధర్వవేదం, రెండవసారి ముఖసమ్మార్జనంతో ఇతిహాస పురాణ స్మృతిదేవతలు ప్రసన్నులవుతారు. ముఖ సమ్మార్జనం తరువాత రెండు వ్రేళ్ళతో కళ్ళను స్పృశిస్తే సూర్యుడు, నాసికను స్పృశిస్తే వాయువు, చెవులను తాకితే దిక్కులు తృప్తినందుతాయి. ఆచమిస్తున్న వ్యక్తి తలమీద చేతిని పెట్టుకొన్నప్పుడు బ్రహ్మ, వైకి నీటిని చల్లినపుడు ఆకాశాధిష్ఠానదేవత తృప్తినందుతారు. తన కాళ్ళమీద నీళ్ళు పోసికొన్నపుడు విష్ణువు, ప్రసన్నుడవుతాడు. ఆచమించేటప్పుడు తూర్పుముఖంగా కానీ, ఉత్తర ముఖంగా కానీ నిలిచి, తన చేతులను మోకాళ్ళలోపల ఉంచి నీటిని తాకాలి. భోజనాది సర్వసమయాలలో కూడా ఇదే ఆచమన విధి.

పళ్ళమధ్య ఆహారం చిక్కుకొన్నప్పుడు తాను ఎంగిలి అయినట్లు గ్రహించి మరల ఆచమించాలి. శౌచాచార విధి ఇది. వస్తువును శుద్ధి చేయాలంటే వైన నీటిని చల్లాలి. శూద్రుడు ఇంటినుండి బయటకు వచ్చేటప్పుడు ఈ శౌచాచార విధినే పాటించాలి. తన హితాన్నీ, కీర్తినీ కోరుకొనే శూద్రుడు కూడా మనస్సును నియంత్రించుకొని, శౌచాచారాన్ని పాటిస్తూ సంన్యాసిని చేరి, సేవ చేయాలి. క్షత్రియులకు ఉత్సాహమే యజ్ఞం వైశ్యులు హవిస్సులతో యజ్ఞం చేయాలి. శూద్రులకు పరిచర్యయే యజ్ఞం. బ్రాహ్మణులకు జపమే యజ్ఞం. శూద్రులు శుశ్రూషతో జీవిస్తారు. వైశ్యులు వాణిజ్యంతో జీవిస్తారు. క్షత్రియులకు దుష్టులను నిగ్రహించటమే జీవనం. విప్రులకు స్వాధ్యాయమే జీవనం. విప్రుడు తపస్సుతో శోభిస్తాడు. రాజు పరిపాలనతో శోభిస్తాడు. వైశ్యుడు ఆతిథ్యంతో, శూద్రుడు సేవతో శోభిస్తారు శూద్రుడు మనస్సును అదుపులో నుంచుకొని నిత్యమూ మూడు వర్ణాలవారికీ సేవ చేయాలి. విశేషించి ఆశ్రమ వాసులకు. మూడు వర్ణాలకూ సేవ చేయలేని శూద్రుడు తనశక్తి, బుద్ధి, ధర్మం, శాస్త్రజ్ఞానాలను వినియోగించి ఆశ్రమవాసులను, విశేషించి సంన్యాసులను సేవించాలి. శాస్త్ర నిర్ణయాలలో నిపుణులయిన సజ్జనులు అన్ని ఆశ్రమాలకంటే సంన్యాసాశ్రమమే ప్రధానమని భావిస్తారు. శ్రుతి స్మృతివిధానాన్ని బట్టి శిష్టులు ఉపదేశించిన రీతిగా, అసమర్థులు (శాస్త్రనిర్ణయంలో) నడుచుకోవాలి. వారికదే ధర్మమని నిర్ణయం. తద్భిన్నంగా ప్రవర్తించిన మానవుడు శ్రేయస్సును పొందలేడు. కాబట్టి శూద్రుడు సంన్యాసులను సదా సేవిస్తూ ఆత్మహితాన్ని కల్గించుకోవాలి. ఇక్కడ మంచిపనులు చేస్తే మరణానంతరం వాటి ఫలితాన్ని అనుభవించవచ్చు చేయదలచిన పనిని అసూయలేకుండా చేయాలి.

అసూయతో చేస్తే ఈ లోకంలోనే దానిని పొందటం ఎంతో కష్టం. శూద్రుడు క్రోధాన్ని జయించి, ప్రియంగా మాటాడుతూ, సోమరితనాన్ని వీడి, మాత్సర్యం లేకుండా, సహనశీలుడై, శీలసంపన్నుడై, సత్యధర్మపరాయణుడై ఆపత్కాలంలో సంన్యాసుల ఆశ్రమానికి వెళ్ళి వారిని సేవించాలి. "ఇది నాకు పరమధర్మం. ఈ ధర్మంతోనే దుస్తరమయిన ఈ భీకర సంసారసాగరాన్ని తరిస్తాను. అనుమానం లేదు. నిశ్చయంగా దేహాన్ని త్యజించి ఉత్తమగతిని పొందుతాను. ఇంత కన్నా నాకు మరో కర్తవ్యం లేదు. ఇది సనాతనధర్మం. "ఈ రీతిగా ఆలోచించి శూద్రుడు బుద్ధిని ఏకాగ్రతతో నిలిపి, నిత్యమూ ఉత్తమమైన శుశ్రూషాధర్మాన్ని పాటించాలి. నియమపూర్వకంగా సేవాతత్పరుడై, యజ్ఞశిష్టమైన అన్నాన్ని తింటూ, మనస్సునూ, ఇంద్రియాలనూ నియంత్రించి కర్తవ్యాకర్తవ్యాలను గ్రహించాలి. సర్వకార్యాలలోనూ అవసరమైన పనులను చేసి, చూపించాలి. సంన్యాసికి ప్రీతి కలిగేటట్లు ఆయనపనులను చేసిపెట్టాలి. భిక్షువునకు హితకరం కాని పని చేయదగదు. శుభాన్ని కోరుకొనే శూద్రుడు నిత్యమూ సంన్యాసాశ్రమానికి విరుద్ధం కాక, ధర్మానుకూలంగా ఉండే పనిని ఏ సంకోచమూ లేకుండా చేయాలి. మనసా, వాచా, కర్మణా నిత్యమూ వారిని సంతోషపెట్టాలి. వారు నిలబడితే తాను నిలవాలి. వారు వెళుతుంటే అనుసరించాలి కూర్చుంటే కూర్చోవాలి. ఇలా నిత్యమూ వారిని అనుసరించి మెలగాలి. రాత్రి పనులను ముగించి ప్రతిదినమూ వారి ఆదేశాల మేరకు స్నానాదులను పూర్తిచేసి జలపాత్రను నీటితో నింపి పెట్టాలి. సంన్యాసి ఉన్న చోటుకు వెళ్ళి. నమస్కరించి, ఇంద్రియాలను అదుపులో నుంచుకొని అక్కడున్న పెద్దలకు నమస్కరించాలి. అలాగే స్వధర్మాన్ని పాటించే ఆచార్యాదులకు నమస్కరించి. అభివాదన చేసి, కుశల మడగాలి. తనకన్నా ముందే ఆశ్రమంలో చేరి, తనవలె పనిచేస్తున్న శూద్రునకు నమస్కరించాలి. ఇతర శూద్రులకు నమస్కరింపనవసరం లేదు.

ఇతరులెవ్వరూ లేపకముందే లేచి నియమపూర్వకంగా ప్రతిదినమూ లేచి, ఆశ్రమాన్ని ఊడ్చి (చిమ్మి) అలకాలి. ఆపై ధర్మానుసారంగా పూలు తెచ్చి పుష్పబలిని ఇవ్వాలి. ఆ తరువాత ఆశ్రమం నుండి వెలుపలికి వచ్చి, వెంటనే మరోపనిలో నిమగ్నం కావాలి. ఆశ్రమవాసుల స్వాధ్యాయానికి విఘాతం కలగని రీతిగా ప్రవర్తించాలి. విఘాతాన్ని కలిగిస్తే పాపం తగులుతుంది. వారు ప్రీతినందేటట్లు తనను తాను ఏకాగ్రతలో నిలుపుకోవాలి. "నేను మూడు వర్ణాలకు పరిచారకుడను. ఇది విహిత ధర్మం. ఇక దొరికిన దానితో జీవిస్తూ, ఆశ్రమంలో ఉన్న వృద్ధ సంన్యాసుల సేవా విషయంలో చెప్పేదేముంది?' అని ఆలోచించాలి. "వీతరాగులై కేవలం జ్ఞానదర్శనులైన సంన్యాసులకు విశేషంగా, నియమబద్ధంగా నేను సేవ చేయాలి"అనుకోవాలి. "వారి అనుగ్రహంవలన తపస్సువలన అభీష్టశుభగతిని పొందగలను" అలా నిశ్చయించుకొని సంన్యాసులను సేవించాలి. ఈ రీతిగా సంన్యాసులను సేవించిన శూద్రుడు పరమగతిని పొందగలడు. శుశ్రూష ద్వారా పొందగలగతిని దానంవలన గానీ, ఉపవాసాదులవలన గానీ పొందలేడు. ఎట్టువంటి నీటితో వస్త్రాన్ని ఉతికితే, ఆ నీటి స్వభావాన్ని బట్టి ఆ వస్త్రం అంతగా శుభ్రపడుతుంది. శూద్రుడు కూడా ఈ మార్గాన్నే అనుసరించి ఎటువంటి పురుషుని సేవిస్తే, ఆ కలయిక కారణంగా అంత త్వరగా అటువంటివాడు కాగలడు, సంశయం లేదు. కాబట్టి మనస్సును అదుపులో నుంచుకొని ప్రయత్నపూర్వకంగా సంన్యాసులను సేవించాలి. సంన్యాసులు మార్గాయాసంతో కృశించినా, వ్యాధిగ్రస్తులయినా ఆ ఆపదకాలంలో నియమపూర్వకంగా, ప్రయత్నపూర్వకంగా శుశ్రూష

చేయాలి. ఆ సమయంలో వారి దర్శనాన్ని, భిక్షాపాత్రను గమనించుకొంటూ, వారి అభిరుచిననుసరించి అన్ని పనులూ చేయాలి. ప్రాయశ్చిత్తం చేసికొనవలసిన అవసరం లేకుండా అన్ని పనులు చక్కబెట్టాలి. సంన్యాసులు వ్యాధుల బారినపడితే సంసిద్ధుడై వారి బట్టలు ఉతికి పెట్టాలి. మందులు తెచ్చి వారికి చికిత్స చేసే ప్రయత్నం చేయాలి. భిక్షాటనకై వెళ్ళాలి. పండితులయిన వైద్యుల దగ్గరకు పోయి రోగనివారణకై మందులు తెచ్చి ఇవ్వాలి.వైద్యుడు ప్రీతమనస్కుడై ఇచ్చిన మందులనే సంన్యాసి స్వీకరించాలి. మందును శ్రద్ధగా ఇవ్వాలి. శ్రద్ధగా స్వీకరించాలి. అప్పుడే ఆ ఔషధనేవ ధర్మబద్ధమవుతుంది. రోగాలను పోగొడుతుంది. శరీరం పడిపోయేదాకా ఇలా విధి పూర్వకంగా సేవ చేస్తూనే ఉండాలి. ధర్మోల్లంఘన చేసి సంన్యాసులతో ప్రతీకారాత్మకంగా ప్రవర్తించకూడదు. స్వాభావికంగానే ద్వంద్వాలు (సుఖదుఃఖాదులు) వచ్చి పోతుంటాయి. సమస్త పదార్థాలూ స్వభావాన్ననుసరించి పుట్టి, నశిస్తుంటాయి. గుణాత్మక పదార్థాలు సముద్రపు అలలవంటివి. పుట్టి మరల లీనమవుతుంటాయి. ధీమంతుడైన తత్త్వద్రష్ట ఈ విషయాన్ని గ్రహించి నీటిబొట్టు అంటని తామరాకువలె పాపమంటకుండా ఉంటాడు. అలసట లేకుండా సంన్యాసి సేవలో ప్రయత్నశీలుడై ఉండాలి శూద్రుడు. చిన్న, పెద్ద సేవలనన్నింటినీ చేస్తూ సంన్యాసికి సంతోషాన్ని కలిగించాలి. సంన్యాసి విషయంలో అపరాధం చేయరాదు, అవహేళన చేయదగదు. ఆయన మాటకెదురు చెప్పగూడదు. ఆయనకు కోపంవస్తే ప్రసన్నుని చేసికోవాలి.

శ్రేయోదాయక విషయాలనే మాటాడాలి. శ్రేయోదాయక కార్యాలనే ఆనందంగా చేయాలి. సంన్యాసి కోపిస్తే మాటాడకుండా మౌనంగా ఉండాలి. కావలసినది దొరికినా దొరకకపోయినా దొరికినదానితోనే జీవనాన్ని గడపాలి. సంన్యాసి కోపిష్ఠిని ఎటువంటి పదార్థాన్ని యాచించరాదు. స్థావరాలపై జంగమప్రాణులపై దయచూపాలి. తనను వలె అందరినీ భావిస్తూ సమదృష్టిని ప్రకటించాలి. సంన్యాసి పుణ్యతీర్థాలను సేవించాలి. నదీ తీరాలలో నివసించాలి. లేదా ఎవరూ లేని ఇంట విడిది చేయాలి. అడవిలో చెట్లక్రింద కానీ, పర్వతగుహలలో కాని నివసించాలి. ఎప్పుడూ అరణ్యాలలో సంచరించాలి. వేద రూపవన్నే ఆశ్రయించి, ఎక్కడగానీ ఒకటి లేదా రెండు రాత్రులుమించి ఉండదగదు. ఎక్కడ ఆసక్తితో ఉండరాదు. సంన్యాసి అరణ్యంలోని ఫలమూలాలను కానీ, ఎండిన ఆకులను కానీ తినాలి. ఆయనకు ఆహారం శరీరయాత్రకోసమే కానీ భోగం కోసం కాదు. ధర్మబద్ధంగా దొరికిందే తినాలి. కోరికతో ఏదీ తినరాదు. నడిచేటప్పుడు రెండు బారలవరకే భూమిమీద దృష్టి నిలపాలి. ఒకే రోజు క్రోసెడు దూరంకంటే ఎక్కువ ప్రయాణించరాదు. మానావమానాలను సమంగా గ్రహించాలి. మట్టిబెడ్డను, రాతిని, బంగారాన్ని ఒకటిగానే చూడాలి. సర్వప్రాణులకూ అభయమివ్వాలి. అందరికీ అభయాన్ని దక్షిణగా ఇవ్వాలి. ద్వంద్వాలకు లొంగరాదు ఎవరికీ నమస్కరించరాదు. సంసార సుఖాలు కానీ భార్యకానీ ఉండరాదు. మమకారం, అహంకారం ఉండదగదు. ఏ ప్రాణినీ ఆశ్రయించరాదు. పదార్థ స్వరూపాన్ని విచారించి, తత్త్వాన్ని గ్రహించాలి. సదా సత్యాసక్తుడు కావాలి. వైన కానీ, క్రిందకానీ, అడ్డంగా కానీ దేనిమీద కోరిక కలుగరాదు. ఈ రీతిగా యథావిధిగా యతిధర్మాన్ని పాటిస్తూ, కాలం పరిణమించినపుడు పండినపండు రాలిపడినట్లు తన దేహాన్ని పరిత్యజించి శాశ్వతబ్రహ్మలో లీనమవ్వాలి. ఆ బ్రహ్మ నిరామయం, అనాది, అనంతం, సత్త్వగుణోపేతం, అచేతనం, నిరక్షరం, బీజరహితం, నిరింద్రియం, జన్మరహితం, అజయ్యం, అక్షరం, అభేద్యం, సూక్ష్మం, నిర్గుణం, శక్తిమంతం, నిర్వికారం, భూతవర్తమాన

భవిష్య ద్రూపమైన కాలానికి అధిపతి, పరమేశ్వరుడు కూడా. అవ్యక్తం, పురుషుడు, క్షేత్రం కూడా తానే, దీని నెరిగినవాడు మోక్షాన్ని పొందగలడు. ఈ రీతిగా సంన్యాసి పాపాలను దహించివేసికొని, గూటిని వదలివెళ్ళే పక్షివలె, ఇక్కడే దేహాన్ని విడిచి, మోక్షాన్ని పొందాలి.

మనిషి శుభమైనా, అశుభమైనా చేసినదానిని అనుభవించాలి. కర్మచేయకుండా అనుభవం లేదు. చేసిన కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. శుభకర్మలను ఆచరించినవాడు శుభఫలితాలను పొందుతాడు. అశుభకర్మలను ఆచరించినవాడు అశుభ ఫలితాన్ని పొందుతాడు. తనకు మేలు జరగాలని కోరుకొనేవాడు శుభకర్మలనే ఆచరించాలి. అశుభకర్మలను వీడాలి. అప్పుడే శుభఫలితాలు పొందగలడు. కాబట్టి మనిషి జితేంద్రియుడై శాస్త్రజ్ఞానాన్ని సంపాదించాలి. ఆగమ జ్ఞానంతోనే అనామయమైన గతిని పొందగలడు. సాధుజనులు అన్వేషించే పరమగతి శాస్త్రాలలో కనిపిస్తుంది. ఆ స్థితికి చేరినవాడు అనంతదుఃఖాలను విడనాడి, అమృతత్వాన్ని పొందుతాడు. ఈ ధర్మాన్ని ఆశ్రయించిన వారు పాపులలో జన్మించిన పురుషులైనా, స్త్రీలైనా, వైశ్యులైనా, శూద్రులైనా పరమగతిని పొందగలరు. ఇక పండితుడైన బ్రాహ్మణుడు, చక్కగా చదువుకొన్న క్షత్రియుడు సద్గతిని పొందటంలో చెప్పవలసినదేముంది ? పాపం క్షీణించని దేహి జ్ఞానాన్ని పొందలేడు. జ్ఞానాన్ని పొందినవాడే కృతకృత్యుడు కాగలడు. జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పొందిన తరువాత కూడా గురుజనులపై అసూయ లేకుండా ఆంతకుముందువలె లేదా అంతకన్నా ఎక్కువ సావధానంతో మెలగాలి. శిష్యుడు గురువును పరిహసిస్తే గురువుకూడా తదనుగుణంగానే వారితో వ్యవహరిస్తాడు. అటువంటి శిష్యుని పాండిత్యమంతా వ్యర్థం. జ్ఞానం అజ్ఞానంగా పరిణమిస్తుంది. ఆ శిష్యుడు ఆ శుభమార్గాన్నే ఎన్నుకొని నరకానికి వెళతాడు. సంశయం లేదు. అతడి పుణ్యం నశిస్తుంది. జ్ఞానం అజ్ఞానమవుతుంది. అంతకుముందెప్పుడూ శుభకర్మలను చూసి ఉండని నరుడు శాస్త్రోక్తవిధానాన్ని చూడక అభిమానంతో మోహానికి లోనవుతాడు. దానితో తత్త్వజ్ఞానాన్ని పొందలేడు. కాబట్టి జ్ఞానం కారణంగా ఎవ్వడూ గర్వపడరాదు. జ్ఞానానికి ఫలం శమం. అందువల్ల శాంతికోసమే ఎప్పుడూ ప్రయత్నించాలి. మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించి, సదా సహనశీలుడై దోషదృష్టి లేకుండా గురుజనులను సేవించాలి. ధైర్యంతో ఉపస్థను, ఉదరాన్ని కాపాడుకోవాలి. కంటితో చేతులను, కాళ్ళను కాపాడుకోవాలి. మనస్సుతో ఇంద్రియార్థాలను కాపాడుకోవాలి. మనస్సును బుద్ధిపై నిలపాలి. శుభ్రంగా చాటుమాటుగా ఉన్న ప్రదేశాన్ని ఎన్నుకొని, అక్కడకు వెళ్ళి, ధైర్యంగా కూర్చొని శాస్త్రోక్తవిధానాన్ని అనుసరించి ధ్యానాన్ని చేయాలి. ఆ రీతిగా జ్ఞానయుక్తుడైన సాధకుడు హృదయంలోని పరమాత్మను చూడగలడు. ఆకాశంలో కిరణమాలి అయిన సూర్యుడు, మెరుపు ప్రకాశించినట్లు పొగలేని నిప్పువలె తేజస్వరూపంతో ప్రకాశించటం చూడవచ్చు. అలా హృదయదేశంలో స్థిరంగా ఉన్న అవ్యయశాశ్వత పరమేశ్వరుని చూడాలి. యోగరహితుడు దేహంలో నున్న మహేశ్వరుని చూడలేడు. యోగి మనస్సును హృదయంలో నిలిపి బుద్ధిద్వారా ఆ పరమాత్మను చూడవచ్చు.

ఈ రీతిగా హృదయ ధారణ చేయటం కుదరకపోతే యదాతథంగా యోగాన్ని ఆశ్రయించి సాంఖ్యశాస్త్రాన్ని అనుసరించి ఉపాసించవచ్చు. ఈ శరీరంలో అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, పంచభూతాలు, మనస్సు - ఈ పదహారు వికారాలున్నాయి అయిదు తన్మాత్రలు, మనస్సు, అహంకారం, అవ్యక్తం - ఇవన్నీ ప్రకృతులు. ఈ ఎనిమిది ప్రకృతులు, పదహారు వికారాలు -

ఈ ఇరవై నాలుగు తత్వాలను శరీరంలోని తత్వజ్ఞపురుషుడు గ్రహించాలి. ఈ రీతిగా ఈ శరీరబంధాన్ని అతిక్రమించిన వాడే సంసారసాగరాన్ని తరించగలడు. మరొకరీతిగా కుదరదు. జ్ఞానబుద్ధి గలవాడు దీనినే సాంఖ్యయోగంగా భావించాలి. ప్రతిదినమూ శాంతచిత్తుడై పవిత్రతను, హితాన్ని సాధించటానికై ఈ రీతిగానే తత్వ విచారం చేసి, తత్వాన్ని గ్రహించి, విముక్తినందుతాడు. శుద్ధమైన తత్వార్థాన్ని తెలిసినవాడు అవిచ్ఛిన్నమైన అద్వితీయమైన పరబ్రహ్మ అవుతాడు. మనుష్యుడు సజ్జనుల సమీపంలో నిలవాలి. విద్యాధికులను సేవించాలి. ఎవరి సహచర్యంలో ఉంటే అటువంటివాడే కాగలడు. నల్లటి పక్షి మేరు పర్వతాన్ని ఆశ్రయిస్తే బంగారువర్ణంతోనే మెరుస్తుంది కదా!"

భీష్ముడు చెప్తున్నాడు. అర్థవేత్త, మహాముని అయిన పరాశరుడు ఈ రీతిగా నాలుగు వర్ణాలకూ కర్తవ్యాన్ని విధించి, శుశ్రూషా సమాధుల ద్వారా పొందగల ఫలితాన్ని వివరించి, సావధానుడై తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. "లోకంలో మహాభాగులైన దేవతలు ఎటువంటి మహాత్ములకు తలవంచుతారు? అటువంటి ఋషులందరి గురించి యథాతథంగా వినగోరుతున్నాను". భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా! ఈ విషయంలో ప్రాచీన పద్ధతులనెరిగిన మహాప్రాజ్ఞులైన విప్రులు ఈ ఇతిహాసాన్ని ప్రశంసిస్తుంటారు. దానిని విను. ఇంద్రుడు వృత్రుని చంపి తిరిగివచ్చాడు. దేవతలు ఆయన ఎదుట నిలిచారు. మహర్షులు మహేంద్రుని స్తుతిస్తున్నారు. పచ్చని గుర్రాలు పూన్చిన రథంపై ఇంద్రుడు ఎంతో శోభిస్తూ కూర్చొని ఉన్నాడు. అప్పుడు మాతలి చేతులు జోడించి, దేవరాజయిన ఇంద్రునితో ఇలా అన్నాడు. మాతలి అడిగాడు. "స్వామీ! అందరూ నమస్కరించే దేవతలకు నీవు ముందు నిలిచేవాడివి. కానీ ఈ లోకంలో తమరు కూడా నమస్కరింపదగిన వారెవరైనా ఉన్నారా? నాకు చెప్పండి." "మాతలి మాటలు విని ఇంద్రుడు తనను ప్రశ్నించిన మాతలితో ఇలా అన్నాడు. 'మాతలీ! ధర్మార్థకామాలను గురించి ఆలోచిస్తూ కూడా ఎవరి బుద్ధి అధర్మంలో ప్రసరించదో వారికి నమస్కరిస్తాను. మాతలీ! రూపగుణ సంపద గలిగి, యువతుల మోహింపజేయగలిగి కూడా కామభోగాల నుండి వెనుకకు మరలిన వారికి నమస్కరిస్తాను. మాతలీ! తమకు లభించిన భోగాలతోనే తృప్తిపడుతూ, మంచిగా మాటాడుతూ, చక్కగా ప్రవచిస్తూ, అహంకారాన్ని, కోరికలను పరిత్యజించి, అందరి అర్ఘ్యాన్ని పొందదగినవారికి నమస్కరిస్తాను. మాతలీ! ధనం కానీ, విద్య కానీ, ఐశ్వర్యం కానీ ఎవరి బుద్ధిని చలింపజేయలేవో, ఒకవేళ బుద్ధి చలించినా దానినెవరు నిగ్రహించగలరో వారికి నమస్కరిస్తాను. మాతలీ! ప్రియభార్యతో కలిసి, పవిత్రంగా ఉంటూ, అగ్నిహోత్రాన్ని నిర్వహిస్తూ, ఇంటిలో పశుపాలన కూడా చేసే వారికి నమస్కరిస్తాను మాతలీ! ధర్మమూలకంగా అర్థకామాలను వృద్ధిపరచుకొని, నియమపూర్వకంగా ధర్మార్థాలను పాటించే వానికి నమస్కరిస్తాను. ధర్మమూలకంగా అర్థకామాలను పొందగోరే బ్రాహ్మణులకు, గోవులకు, పతివ్రతలైన స్త్రీలకు నేను నమస్కరిస్తాను. మాతలీ! తొలి వయస్సులో మానుషభోగాలననుభవించి, ఆపై తపస్సుతో స్వర్గాన్ని చేరినవారికి ఎప్పుడూ నమస్కరిస్తాను. భోగాలకు దూరంగా నిలిచి, విషయాసక్తిని విడిచి, ధర్మనిత్యులై, జితేంద్రియులై, సంన్యాసులై, కొండలవలె నిశ్చలంగా నిలిచేవారిని మనసా పూజిస్తాను. మాతలీ! జ్ఞానంచేత విద్యను పవిత్రం చేసికొని, రూఢమైన ధర్మమార్గాన్ని అభిలషిస్తూ, ఇతరుల మెప్పునందేటట్లు శౌచాన్ని పాటించేవారికి నమస్కరిస్తాను".

యుధిష్ఠిరుడు అడిగాడు. "భరతర్షభా! కురుపుంగవా! చెరువులను త్రవ్వించినందువలన వచ్చే ఫలితాలను నేడు నేను నీ నుండి వినగోరుతున్నాను." భీష్ముడు ఇలా చెప్తున్నాడు. "తటాకాన్ని త్రవ్వించినవాడు విచిత్ర ధాతువులతో శోభించే కుబేరునివలె దర్శనీయుడవుతాడు. మూడు లోకాలలోనూ పూజలనందుకొంటాడు. తటాకాలను త్రవ్వించటం గొప్పపని, కీర్తిని కలిగిస్తుంది. ఇహపరలోకాలలో మంచి స్థితిని కల్పిస్తుంది. అది కుమారుని ఇంటినీ, ధనాన్ని వృద్ధిపరుస్తుంది. తటాకం ధర్మార్థ కామఫలదాయకమని బుద్ధిమంతులు అంటారు. అది దేశంలో మూర్తీభవించిన పుణ్యస్వరూపం. అది ఉన్నచోటు ఆదేశానికే ఆశ్రయం. నాల్గురకాల ప్రాణులకూ (స్వేదజ, అండజ, ఉద్భిజ, జరాయుజాలకూ) ఉపయోగపడేది తటాకం. తటాకాలు అన్నీ కూడా ఉత్తమ సంపదలను కలిగించేవే. దేవతలు, మనుష్యులు, గంధర్వులు, పితరులు, నాగులు, రాక్షసులు, స్థావరప్రాణులు - అన్నీ తటాకాన్ని, ఆశ్రయిస్తాయి. కాబట్టి తటాకాలను త్రవ్వించటంలో ఉన్న గుణాలనన్నింటినీ నీకు చెపుతాను. ఆ విషయంలో ఋషులు ఉదాహరించి ఫలప్రాప్తిని గురించీ చెపుతాను. చెరువులో ఒక సంవత్సరం పాటు నీరు నిలిస్తే దానిని త్రవ్వించినవానికి ప్రతిదినమూ అగ్నిహోత్రాన్ని నిర్వహించిన ఫలితం దక్కుతుండని బుద్ధిమంతులన్నారు. గ్రీష్మకాలంలో తటాకంలో నీళ్ళుంటే దానిని త్రవ్వించినవానికి వాజపేయయాగ ఫలితం వస్తుందని ఋషులు చెప్పారు. గోవులు, సాధుజనులు నిత్యమూ నీరుత్రాగుతుంటే దానిని త్రవ్వించినవాడు తన వంశాన్ని ఉద్ధరిస్తాడు. దప్పికగొన్న గోవులు, మృగాలు, పక్షులు, మనుష్యులు తటాక జలాన్ని త్రాగుతుంటే దానిని త్రవ్వించినవానికి అశ్వమేధఫలం లభిస్తుంది. జలాశయంలో నీరు త్రాగి, స్నానమాడి, ఒడ్డుపై విశ్రమిస్తుంటే తటాకకర్త మరణానంతరం అక్షయలోకాలను పొందుతాడు. నాయనా! పరంతపా! జలం ఎంతో దుర్లభమైన వస్తువు. కాబట్టి జలదానంతో శాశ్వతసిద్ధి దక్కుతుంది. నువ్వులు, నీరు, దీపం, అన్నం, నివాసగృహం ఇవి మరణించిన వానికి దుర్లభాలు. కాబట్టి వీటిని దానం చేస్తే బంధువులతో కూడి ఆనందించవచ్చు. నరశార్దూలా! జలదానం అన్ని దానాలకన్నా గొప్పది. అన్ని దానాల కన్నా విశిష్టమైనది. కాబట్టి జలదానం తప్పక చేయాలి.

ఈ రీతిగా చెరువులు త్రవ్వించిన ఫలితం చెప్పాను. ఇక చెట్లు నాటడం వలన కలిగే ఫలం చెపుతాను. స్థావర ప్రాణులు ఆరు రకాలు. చెట్లు, పొదలు, లతలు, వల్లులు, త్వక్సారాలు, తృణజాతులు - ఇవి వృక్షజాతులు. వీటిని నాటడంలోని గుణాలు చెపుతాను. పనస, మామిడి మొదలయినవి చెట్లు. మందారం వంటివి పొదలు నాగిక, మలియ (తెగడ) వంటివి వల్లులు. మాలతి మొదలయిన లతలు. వెదురు, పోక వంటివి త్వక్సారాలు, పైర్లు తృణజాతులు. వీటిని నాటడం వలన మానవలోకంలో కీర్తి, మరణానంతరం స్వర్గంలో శుభఫలప్రాప్తి కలుగుతాయి. పితరుల మన్ననలు దొరుకుతాయి. దేవలోకానికి వెళ్ళిన తరువాత కూడా అతని పేరు నశించదు. భారతా! చెట్లు నాటినవాడు పూర్వీకులను, రాబోయే తరాలవారినీ కూడా తరింపజేస్తాడు. కాబట్టి చెట్లు నాటాలి. పిల్లలు లేనివారికి చెట్లే పిల్లలు. అనుమానం లేదు. చెట్లునాటిన వాడు పరలోకంలో స్వర్గంలో అవ్యయలోకాలను పొందుతాడు. నాయనా! చెట్లు పూలతో దేవతలను, పండ్లతో పితరులను, నీడతో అతిథులను పూజిస్తాయి. కిన్నరులు, నాగులు, రాక్షసులు, దేవతలు, గంధర్వులు, మానవులు, ఋషిగణాలు చెట్లను ఆశ్రయిస్తాయి. చెట్లు పుష్పఫలాలతో మానవులను తృప్తిపరుస్తాయి. చెట్లు దానం చేసినవారిని

పరలోకంలో పుత్రులవలె అవి తరింపజేస్తాయి. కాబట్టి శ్రేయస్కాముడు సదా తటాక తీరంలో చెట్లు నాటాలి. చెట్లను పిల్లలను వలె కాపాడాలి. అవి ధర్మదృష్టిలో పిల్లల వంటివే. చెరువులు త్రవ్వించినవాడు, చెట్లునాటినవాడు, ఇష్టయజ్ఞాలు చేసిన ద్విజుడు, సత్యవాదులు – వీరంతా స్వర్గలోకంలో వెలుగొందుతారు. కాబట్టి చెరువులు త్రవ్వించాలి. తోటలు కల్పించాలి. వివిధయాగాలను చేయాలి. శాస్త్రానుసారంగా సత్యాన్నే చెప్పాలి.

97. బలిదాన విధి.

యుధిష్ఠిరుడు అడిగాడు. "రాజా! భరతర్షభా! గార్హస్థ్య ధర్మాన్ని గురించి నాకు పూర్తిగా వివరంగా చెప్పు. ఈ లోకంలో మనుష్యుడు ఏం చేసి సమృద్ధిని పొందగలడు ?" భీష్ముడు చెప్తున్నాడు. "రాజా! భారతా! ఈ విషయమై వాసుదేవునకు, భూమికి మధ్య జరిగిన సంవాద రూపమైన ప్రాచీన గాథను తెలియజేస్తాను. భరతశ్రేష్ఠా! ప్రతాపవంతుడైన వాసుదేవుడు భూదేవిని స్తుతించి, ఇప్పుడు నీవు నన్ను అడిగినట్లే ఇలా అడిగాడు. "భూదేవీ! గార్హస్థ్యధర్మాన్ని ఆశ్రయించిన నేను కానీ, నా వంటివారు కానీ తప్పక చేయవలసిన పని ఏమిటి ? ఏం చేస్తే కృతకృత్యులం కాగలం ?" పృథివి ఇలా చెప్తోంది. "మాధవా! గృహస్థుడు ఋషులను, పితరులను, దేవతలను, మనుష్యులను సత్కరించాలి. సమర్చించాలి. ఎలా చేయాలో చెపుతా విను. నిత్యయజ్ఞాలతో దేవతలను, నిత్యాతిథ్యంతో మానవులను, నిత్యవేదాధ్యయనంతో పూజ్యులైన ఋషులను అర్చించి, ఆపై నిత్య భోజనాదికాలు చేయాలి. మధుసూదనా! స్వాధ్యాయంతో ఋషులు ప్రసన్నులవుతారు. ప్రతిదినమూ భోజనానికి ముందే అగ్నిహోత్రాన్ని, వైశ్యదేవబలికర్మను ముగించాలి. దానితో దేవతలు తృప్తిపడతారు. పితృప్రీతికై అన్నం, జలం, పాలు, ఫలమూలాలు మొదలయిన వాటితో ప్రతిదినమూ శ్రాద్ధాలు నిర్వహించాలి. వండిన అన్నం నుండి కొంత తీసికొని యథావిధిగా అగ్నిలో వైశ్వదేవాన్ని చేయాలి. ముందు అగ్నిసోములకు, తరువాత విశ్వేదేవులకు, ఆపై ధన్వంతరికి, ఆ వెనుక ప్రజాపతికి విడివిడిగా హోమం చేయాలి (ఆహుతుల నివ్వాలి).

ఈ రీతిగా క్రమంగా బలికర్మను ప్రయోగించాలి. మాధవా! దక్షిణదిక్కులో యమునకు, పశ్చిమదిక్కులో వరుణునకు, ఉత్తరదిక్కులో సోమునకు, మధ్యభాగంలో ప్రజాపతికి, ఈశాన్యంలో ధన్వంతరికి, తూర్పుదిక్కులో ఇంద్రునికి బలిని సమర్పించాలి. గృహద్వారంపై మనుష్యులకు (ఋషులకు) బలిని ఇవ్వాలి. మరుత్తులకు, దేవతలకు ఇంటిలోపల బలిని సమర్పించాలి. విశ్వేదేవులకు ఆకాశంలో బలిని అర్పించాలి. నిశాచరులకు,

భూతాలకు రాత్రివేళ బలినివ్వాలి. ఈ రీతిగా బలిసమర్పణను చక్కగా ముగించి, బ్రాహ్మణులకు యథావిధిగా భిక్ష నివ్వాలి. బ్రాహ్మణుడు దొరకక పోతే అన్నంలో కొంచెం తీసి, అగ్నిలో హోమం చేయాలి. పితరులకు శ్రాద్ధం పెట్టదలచిన రోజు ముందు శ్రాద్ధాన్ని ముగించాలి. శ్రాద్ధకర్మ ముగిసిన తరువాత పితరులకు తర్పణలివ్వాలి. ఆ తరువాత యథావిధిగా బలికర్మ, వైశ్వదేవం ముగించాలి. ఆ వెనుక బ్రాహ్మణులను సత్కరించాలి. మహారాజా! ఆ తరువాత సత్కార పూర్వకంగా, విశేషాన్నాలతో అతిథులకు కూడా భోజనం పెట్టాలి. దానితో మానవులను తృప్తిపరచవచ్చు. రోజూ ఇంట్లో ఉండనివాడు అతిథి. గురువుకు, తండ్రికి, ఆప్తమిత్రునకు, అతిథికి, "మా ఇంట ఈ వస్తువు ఉన్నది. స్వీకరించండి" అని ఎప్పుడూ నివేదించాలి. ఆపై వారు చెప్పినట్లు చేయాలి. ఇది విహిత ధర్మం. కృష్ణా! గృహస్థుడైన పురుషుడు సదా శిష్టాశియే (యజ్ఞం చేయగా మిగిలినది తినేవాడు) కావాలి. రాజు, ఋత్విక్కు, స్నాతకుడు, గురువు, మామ - వీరు సంవత్సరం తర్వాత ఇంటికి వస్తే వారిని మధుపర్కంతో అర్చించాలి. కుక్కలకోసం, చండాలుర కోసం, పక్షుల కోసం భూమిపై అన్నాన్ని పెట్టాలి. దీన్ని వైశ్వదేవమంటారు. ఉదయమూ, సాయంకాలమూ కూడా దీనిని అనుష్ఠించాలి. అసూయ లేకుండా ఈ గార్హస్థ్యధర్మాలను పాటించిన వాడు ఇహలోకంలో మహర్షుల వరాలను పొంది, మరణానంతరం పుణ్యలోకాలలో వెలుగొందుతాడు," భీష్ముడు చెప్తున్నాడు. ఇలా భూదేవి పలుకగా విని, ప్రతాపవంతుడైన వాసుదేవుడు నిత్యమూ అలాగే చేసేవాడు. నీవు కూడా ఇదే విధంగా ఆచరించు. రాజా! ఈ గృహస్థ ధర్మాన్ని పాటిస్తూ నీవు ఈ లోకంలో కీర్తిని పొంది, మరణానంతరం స్వర్గానికి వెళ్ళగలవు."

98. సువర్ణ, మను సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "భరతర్షభా! దీపదానమెటువంటిది ? ఎలా ప్రారంభమైంది ? దాని ఫలితమేమిటి ? నాకు చెప్పండి". భీష్ముడు చెప్తున్నాడు. "భారతా! ఈ విషయంలో కూడా ప్రజాపతి అయిన మానవుడు, సువర్ణునకు మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. భారతా! సువర్ణుడనే ఒక తపస్వి ఉండేవాడు. ఆయన శరీరచ్ఛాయ బంగారువన్నె. అందువలన ఆయనకు సువర్ణుడని ప్రసిద్ధి. ఆయన ఉత్తమవంశానికి చెందినవాడు. శీలగుణ సంపన్నుడు, స్వాధ్యాయ విషయంలో గొప్పగా పేరు బడ్డవాడు. తన గుణాలతో సద్వంశంలో పుట్టినవారినెందరినో మించిపోయాడు.

ఒకప్పుడు ఆ విప్రుడు మనువును చూశాడు. ఆయన దగ్గరకు వెళ్ళాడు ఆ ఇద్దరూ పరస్పరం కుశలప్రశ్నలు వేసికొన్నారు. ఆ తరువాత సత్యసంకల్పుడైన ఆ ఇద్దరూ బంగారు కొండ అయిన మేరువుపై, ఒక అందమైన శిలమీద కలిసి కూర్చున్నారు. అక్కడ ఆ ఇద్దరూ బ్రహ్మర్షులకు, దేవతలకు, దైత్యులకు, ప్రాచీన మహాత్ములకు సంబంధించిన వివిధ కథలను చెప్పుకొనసాగారు. అప్పుడు సువర్ణుడు స్వాయంభువమనువును ఇలా అడిగాడు. "ప్రజాపతీ! సర్వభూత హితం కోసం నేనడిగే ప్రశ్నకు సమాధానం చెప్పాలి. దేవతలను పూలతో పూజిస్తున్నాం గదా! ఇదేమిటి ? ఎలా పుట్టింది ? దాని ఫలమేమిటి ? ప్రయోజనమేమిటి ? నాకు చెప్పాలి."

మనువు ఇలా చెప్తున్నాడు. "ఈ విషయంలో కూడా మహాత్ములైన శుక్రబలులకు మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. విరోచన కుమారుడైన బలి మూడులోకాలను పరిపాలిస్తున్న సమయంలో భృగువంశభూషణుడైన శుక్రుడు ఆయన దగ్గరకు వచ్చాడు. విరివిగా దక్షిణల నిచ్చే ఆ రాక్షసరాజు - బలి శుక్రుని అర్ఘ్యాదులతో యథావిధిగా సమర్పించి, ఆపై ఆసనంపై కూర్చుండబెట్టి తానూ కూర్చున్నాడు. అక్కడ ఆ ఇద్దరి సంభాషణలో నీవడిగిన కథ ప్రస్తావనకు వచ్చింది. పూలను, ధూపదీపాలను దేవతలకు సమర్పించటం వలన ఫలితమేమిటన్న చర్చ వచ్చింది. అప్పుడు రాక్షసరాజు శుక్రుని ఈ మంచి ప్రశ్న అడిగాడు." బలి అడిగాడు. "బ్రహ్మ విత్తమా! ద్విజశ్రేష్ఠా! పూలను, ధూప దీపాలను ఇచ్చినందువలన ఫలమేమిటి ? తమరు చెప్పాలి". శుక్రుడిలా చెప్తున్నాడు. "ముందు తపస్సు పుట్టింది. ఆపై ధర్మం. ఈ రెండింటి మధ్యలో లతలు, ఓషధులు, పుట్టాయి." ఈ భూతలంపై రకరకాల సోమలతలు పుట్టాయి. అమృతమయాలు, విషమయాలు, ఇంకా వివిధ తృణజాతులు పుట్టాయి. మనస్సుకు వెంటనే ప్రీతిని, తృప్తిని కలిగించేది అమృతం. తన వాసనతో మనస్సును సర్వవిధాలా గ్లానికి గురిచేసేది విషం. అమృతం మంగళకరం. విషం అమంగళకరం. తెలిసికో. ఓషధులన్నీ అమృతాలే అగ్ని నుండి పుట్టిన తేజస్సు విషం. పూలు మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. శోభను, సంపత్తిని కలిగిస్తాయి. అందువలన పుణ్య పురుషులు వాటిని సుమనస్సులు అన్నారు. నరుడు పవిత్రుడై దేవతలకు పూలను సమర్పిస్తే దేవతలు ఆనందిస్తారు. ఆనందించి ఆ నరునికి పుష్టిని కలిగిస్తారు. ప్రభూ! రాక్షసరాజా! ఏ దేవతను ఉద్దేశించి పూలను సమర్పిస్తారో ఆ దేవత అతనికి ప్రసన్నమై మంగళాలను కల్పిస్తుంది. ఓషధులో అనేక రూపాలతో ఉంటాయి. కొన్ని ఉగ్రాలు, కొన్ని సౌమ్యాలు, కొన్ని తేజోవంతాలు. కొన్ని

సుందరయ్య గ్రంథాలయం సర్కిల్
A.C.No 96366

బాగా బలాన్ని కల్గించేవి. వాటినన్నింటినీ విడివిడిగా తెలిసికోవాలి. కొన్ని చెట్లు యజ్ఞానికి ఉపయోగపడేవి. కొన్ని ఉపయోపడనివి. వాటిని చెపుతా, విను. పుష్పమాలలో కొన్ని రాక్షసులకు నచ్చేవి. కొన్ని దేవతలకు ఇష్టమైనవి.

రాక్షసులకు, నాగులకు, యక్షులకు, మనుష్యులకు, పితరులకు నచ్చే ఓషధులను క్రమంగా చెపుతా విను. చెట్లు కొన్ని అరణ్యాలలో పెరుగుతాయి. కొన్ని గ్రామాలలో పెరుగుతాయి. భూమిని దున్ని నాటబడేవి కొన్ని. పర్వతాలలో తమంత తాము మొలిచేవి కొన్ని. కొన్ని ముళ్ళ చెట్లు. ముళ్ళు లేనివి కొన్ని. అన్నీ గంధ, రూప, రసాలతో కూడినవే. పూలవాసన రెండురకాలు. నచ్చేదీ, నచ్చనిదీ, మంచి వాసనగల పూలు దేవతల కిష్టమైనవని మనస్సులో పెట్టుకో. రాజా! ముళ్ళులేని చెట్లకు పూసే తెల్లని పూలు దేవతలకెప్పుడూ ఇష్టమైనవి. పద్మం, తులసి, జాజి - ఇవి సర్వపుష్పాలలోనూ విశిష్టమైనవి. విచక్షణ గల మనిషి నీటిలో పుట్టే తామరలు, కలువలు మొదలయిన పూలను గంధర్వులకు, నాగులకు, యక్షులకు సమర్పించాలి. శత్రువినాశనం కోసం చేసే అభిచార కర్మలలో ఎర్రని పూలు, చేదు, ముళ్ళు గల ఓషధులను వాడాలని అధర్వవేదం ప్రకటించింది. ముళ్ళు ఎక్కువగా ఉండి కోయటానికి కష్టమై, తీవ్రమైన వాసనతో బాగా ఎర్రగా లేదా నల్లగా ఉండే పూలను భూతప్రేతాలకు కానుక చేయాలి. రాజా! అందమైన రూపంతో, ఎంతో, మధురమైన రసంతో, మనస్సునకు ఆనందాన్ని కలిగించే పూలు మానవులకు ఇష్టం. శ్మశానంలో లేదా పాడుబడిన గుళ్ళలో పూసిన పూలును పుష్టి కర్మలలో కానీ, వివాహ సందర్భంలో కానీ, ఏకాంత, కార్యక్రమాలలో కానీ వాడరాదు. కొండచరియలపై పూసి, అందంగా, పరిమళ భరితంగా ఉన్న పూలను కడిగి, లేదా ప్రోక్షించి, స్మృతులలో చెప్పిన రీతిగా, యథాయోగ్యంగా దేవతలకు సమర్పించాలి. దేవతలు పరిమళంతో ఆనందిస్తారు. యక్షులు, రాక్షసులు చూడటంతో ఆనందిస్తారు. నాగులు వాటిని అనుభవించి ఆనందిస్తారు. మనుష్యులు ఈ మూడు రకాలుగా ఆనందిస్తారు. పూలు దేవతలను వెంటనే ప్రసన్నులను చేస్తాయి. సంకల్ప సిద్ధులైన ఆ దేవతలు ప్రీతినంది, మనుష్యుల కోరికలకు, మనస్సులకు నచ్చే భోగాలను కల్పించి, ఆనందింపజేస్తారు. దేవతలు ప్రసన్నులయితే మనుష్యులను ప్రసన్నంగా ఉంచుతారు. సత్కరిస్తే సత్కారాల నందిస్తారు. అవహేళన చేసి తిరస్కరించే అధమ మానవులను దహించివేస్తారు.

ఇకమీద ధూపదాన విధిని, దాని ఫలితాన్ని చెప్పబోతున్నాను. ధూపాలు వివిధంగా ఉంటాయి. కొన్ని మంచివి. కొన్ని చెడ్డవి. అవి చెపుతా గ్రహించు. ఆ ధూపాలు మూడు

రకాలు, బంక, చెక్క ముక్కలు, కృత్రిమాలు. వీటివాసనలు మంచి, చెడు అని రెండు రకాలు. వివరంగా విను. సల్లకీ వృక్షం తప్ప మిగిలిన అన్ని చెట్ల బంకతో వేసిన ధూపం దేవతల కిష్టం. వీటిలో గుగ్గులు సర్వశ్రేష్ఠమని నిర్ణయం. ఆ చెట్ల చెక్కముక్కలను కాలిస్తే వాసనలు వచ్చేవి సారులు. అగరు వీటిలో శ్రేష్ఠం. యక్షరాక్షస నాగజాతులకిది ఇష్టం. దైత్యులకు సల్లకి లేదా అటువంటి చెట్ల బంకతో వేసిన ధూపం ఇష్టం. సర్జరసాదులయిన గంధాలతో, మట్టితో, చెక్కతో చేసిన గంధాలు, చెరకుపాకం మొ। వానితో చేసిన గంధాలతో చేసిన గంధాలు మానవులకు ఇష్టం. ఇటువంటి ధూపాలు దేవతలకు, దానవులకు, భూతాలకు వెంటనే తృప్తి కలిగించేవి. ఇక విలాసార్థం ఉపయోగపడే ఇతర ధూపాలు మానవుల వినియోగం కోసం. దేవతలకు పూలను సమర్పిస్తే ఏ గుణాలు, లాభాలు కలుగుతాయన్నామో అవే గుణాలు, లాభాలు ధూప సమర్పణ వలన కూడా కలుగుతాయి. అవి దేవతలకు ప్రీతిని వర్ధిల్ల జేస్తాయి.

దీపదానం వలన కలిగే పరమోత్తమ ఫలయోగాన్ని చెపుతాను. ఎప్పుడు, ఎలా, ఎటువంటి దీపాలు ఎవరి ద్వారా సమర్పించాలో నీకు వివరిస్తాను. దీపం పైకి ప్రసరించే తేజస్సు, కాంతిని విస్తరింపజేసేది. కాబట్టి దీపప్రదానం రాజుల తేజస్సును పెంపొందింపజేస్తుంది. అంధకారం అంధతామిస్రమనే నరకం. దక్షిణాయనం కూడా అంధకార బంధురమే. ఉత్తరాయణం కాంతిమయం. అందువలన, అంధతామిస్ర నరకం నుండి తప్పించుకొనటానికి దీపదానం శ్రేష్ఠం. దీపజ్వాల పైకి ప్రసరిస్తుంది. అది చీకటికి మందు. కాబట్టి దీపదానం చేసినవాడు ఊర్ధ్వ గతిని పొందుతాడని నిశ్చయం. దేవతలు తేజస్సులు, కాంతిమంతులు, కాంతిని ప్రసరింపజేసేవారు. రాక్షసులు, తామసులు (చీకటిని మెచ్చేవారు) కాబట్టి దేవతాప్రీతికై దీపదానం చేయాలి. దీపదానం వలన నరుని కళ్ళు సమర్థాలవుతాయి. నరుడు కాంతిమంతుడవుతాడు. దీపదానానంతరం దీపాన్ని ఆర్పరాదు, మరొకచోటికి కొనిపోరాదు, నశింపజేయరాదు. దీపాన్ని హరించినవాడు గ్రుడ్డివాడవుతాడు. శోభాహీనుడవుతాడు. మరణానంతరం నరకానికి వెళతాడు. దీపదాత స్వర్గలోకంలో దీపమాలవలె వెలుగొందుతాడు. నేతితో దీపాన్ని వెలిగించి దానం చేయటం మొదటిపద్ధతి. ఓషధీరసాలతో వెలిగించటం రెండో పద్ధతి. తనకు పుష్టిని కోరుకొనే వాడు వస మేధస్సు, ఎముకలనుండి తీసిన నూనెతో దీపాలు వెలిగించరాదు. తనకు ఐశ్వర్యాన్ని అభిలషించేవాడు నిత్యమూ కొండలనుండి జారే ప్రవాహాల దగ్గర, అరణ్యంలో, దేవమందిరాలలో, కూడళ్ళలో, గోశాలలో, బ్రాహ్మణుల ఇంటిలో, దుర్గమ ప్రదేశాలలో దీపదానం చేయాలి. ఆ పవిత్రదీపదానం

ఐశ్వర్య ప్రదం. దీపాన్ని దానం చేసిన నరుడు వంశాన్ని దీపింపజేస్తాడు. శుద్ధచిత్తుడై వెలుగొందుతాడు. మరణానంతరం శాశ్వత జ్యోతిర్మయలోకాలను పొందుతాడు.

ఇక దేవతలకు, యక్షులకు, నాగులకు, మనుష్యులకు, భూతాలకు, రాక్షసులకు బలిని సమర్పించటం వలన కలిగే లాభాలనూ కర్మఫలాలనూ చెపుతాను. తాము తినకముందే దేవతలకు, అతిథులకు, బాలకులకు భోజనం పెట్టని విప్రులు నిర్భయంగా, అమంగళకార్యాలు చేసే రాక్షసులనే గ్రహించు. కాబట్టి గృహస్థుడు సోమరితనాన్ని వీడి, దేవతలను అర్చించి, శిరసానమస్కరించి, నియమపూర్వకంగా ముందుగా వారికి బలిని సమర్పించాలి. దేవతలు గృహస్థులిచ్చే బలులను స్వీకరించి, వారిని ఆశీర్వదిస్తారు. దేవతలు, పితరులు, యక్షులు, రాక్షసులు, నాగులు, బయటనుండి వచ్చిన ఇతరాతిథులు గృహస్థుని బలి సమర్పణతోనే జీవిస్తారు. వారు ప్రసన్నులై గృహస్థుని ఆయస్సుతో, కీర్తితో, ధనంతో ఆనందింపజేస్తారు. దేవతలకిచ్చే బలులలో పాలు, పెరుగు ఉండాలి. పవిత్రమై, సుగంధభరితమై, దర్శనీయమై ఉండాలి. బలి పూలతో కలిపి వాటిని సమర్పించాలి. యక్షరాక్షసులకిచ్చే బలులు రక్తమాంసాలతో కూడి ఉంటాయి. వాటితో పాటు కల్లు, సారాయి, పైన పేలాలతో అలంకరణ కూడా ఉంటాయి. తామరలతో, కలువలతో కూడిన బలులు నాగులకు ఎప్పుడూ ఇష్టం. భూతాలకై బెల్లంబాగా కలిపిన నువ్వులను సమర్పించాలి. దేవతలకు, ముందుగా బలిదానం చేసినవాడు ఉత్తమభోగాలనూ, బలాన్నీ, శక్తినీ పొందుతాడు. కాబట్టి దేవతలకు పూజా పురస్సరంగా ముందుగా బలి ఇవ్వాలి. గృహదేవతలు గృహస్థుని ఇంటిని ఎప్పుడూ ప్రకాశింపజేస్తారు. కాబట్టి శుభాన్నికోరే గృహస్థుడు బలిలోని ప్రథమభాగాన్ని గృహదేవతలకు సమర్పించాలి. ఈ రీతిగా భృగువంశీయుడైన శుక్రుడు బలిచక్రవర్తికి చెప్పాడు. మనువు సువర్ణునకు, సువర్ణుడు నారదునకు చెప్పారు. మహా తేజస్వీ! ఈ గుణాలను నారదుడు నాకు చెప్పాడు. నాయనా! నీవు కూడా ఇదంతా గ్రహించి ఈ లోకంలో ఆచరించు.

99. అగస్త్య భృగు సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "భరతశ్రేష్ఠా! పుష్పధూపదాతలు పొందే ఫలితాన్ని విన్నాను. బలిదానం చేసే వారు పొందే ఫలాన్ని మళ్ళీ చెప్పాలి. ధూపదాన దీపదానాల ఫలితమేమిటి ? గృహస్థులు ఎందుకోసం బలులను సమర్పిస్తారు ? భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయంలో కూడా నహుష, అగస్త్య, భృగు సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. మహారాజా! మహాతపస్వి, రాజర్షి అయిన నహుషుడు ఈలోకంలో

చేసిన పుణ్యకర్మ వలన దేవరాజు (ఇంద్రుడు) అయ్యాడు. రాజా! ఆ స్వర్గంలో నివసిస్తూ కూడా నహుషుడు నియమబద్ధంగా వివిధ దివ్యకర్మలను, మానుషకర్మలను అనుష్ఠించాడు. రాజా! మహాత్ముడైన ఆ నహుషుడు ఆ స్వర్గంలో కూడా మానవోచితాలైన క్రియలను, సనాతన దివ్య క్రియలను కొనసాగిస్తూనే ఉన్నాడు. మహాత్ముడైన నహుషుని ఇంట ప్రతిదినమూ అగ్నికార్యాలూ, సమిధలు, దర్భలు, పూలు, అన్నంతో పేలాలతో బలులు, ధూపదానమూ, దీపకర్మ - అన్నీ జరుగుతూనే ఉన్నాయి. స్వర్గంలో కూడా ఆ నహుషుడు జపయజ్ఞాలను, మనోయజ్ఞాలను చేస్తూనే ఉన్నాడు. అరిందమా! దేవరాజయిన ఆ నహుషుడు విధి పూర్వకంగా సర్వదేవతలను యథా న్యాయంగా, అంతకు ముందువలెనే అర్చిస్తున్నాడు. ఆ తరువాత "నేను ఇంద్రుడను" అనే భావం కలుగగానే నహుషుని అహంకారం ఆవేశించింది. దానితో ఆ రాజు చేస్తున్న క్రియలన్నీ నశించసాగాయి. వరదానమదంతో ఆ నహుషుడు ఋషులచే తన రథాన్ని లాగించసాగాడు. దానితో క్రియాఫలితాలు నశించి దుర్బలుడయ్యాడు. అలా అహంకారంతో మునిశ్రేష్ఠులయిన తపోధనులచే నహుషుడు రథాన్ని లాగిస్తూనే ఉన్నాడు. చాలా కాలం గడచిపోయింది. వంతులవారీగా ఋషులనందరినీ రథవాహకులుగా వినియోగించసాగాడు. భారతా! అప్పుడు అగస్త్యుని వంతు వచ్చింది. అప్పుడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు, మహాతేజస్వి అయిన భృగుడు, ఆశ్రమంలో ఉన్న అగస్త్యుని దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. "మహామునీ! దేవరాజుగా చెలామణి అవుతున్న దుర్మతి అయిన నహుషుని అవమానాలను మనమెందుకు సహించాలి?"

అగస్త్యుడు చెప్తున్నాడు. "మహామునీ! వరదుడైన బ్రహ్మ నహుషునకు వరాన్ని ఇచ్చిన విషయం మీకు తెలిసిందే కదా! ఇక నేనెలా శపించగలను? "నా కంటబడినవాడు నాకు లొంగిపోవా"లని బ్రహ్మను అడిగి నహుషుడు వరాన్ని పొందాడు. స్వర్గలోకానికి తాను వెళ్ళేటప్పుడే ఇది జరిగింది. కాబట్టి నేను అతనిని దహించలేదు. నీవూ అంతే సంశయంలేదు. మరే మహామునీ కూడా అతనిని దహించలేదు. పడగొట్టలేదు. స్వామీ! గతంలోనే మహాత్ముడైన బ్రహ్మ నహుషునకు అమృతపానానికి వరమిచ్చాడు. అందువలన మనం స్వర్గంనుండి నహుషుని పడగొట్టలేకపోతున్నాం. బ్రహ్మ ప్రజలకు దుఃఖాన్ని కలిగించే వరాన్ని నహుషునకిచ్చాడు. ఆ నరాధముడు బ్రాహ్మణులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. వాగ్మిశ్రేష్ఠా! ఆ స్థితిలో ఇప్పుడు మనం ఏం చేయాలో చెప్పు! నీవెలా చెపితే అలాగే చేస్తాను. సంశయించవద్దు".

భృగువిలా చెప్తున్నాడు. "బ్రహ్మ ఆదేశంతోనే నేను నీ దగ్గరకు వచ్చాను.

బలశాలి అయిన నహుషుడు దైవికంగా మోహానికి లొంగిపోయాడు. ఇప్పుడు ప్రతీకారం చేయవచ్చు. పరమదుర్మతి అయిన ఆ దేవేంద్రుడు నిన్ను ఈ రోజు రథానికి కడతాడు. ఈ రోజే విశృంఖలంగా ప్రవర్తిస్తున్న అతనిని నేను నా తేజస్సుతో ఇంద్రపదవినుండి తప్పిస్తాను. ఈరోజు నీవు చూస్తుండగానే పరమదుర్మతి అయిన ఇతనిని ఇంద్రపదవి నుండి తప్పించి, శతక్రతుని ఇంద్రపదవిలో నిలుపుతాను. ఈ రోజు మందమతి, పాడు దేవేంద్రుడు అయిన నహుషుడు దైవోపహత చిత్తుడై ఆత్మవినాశనం కోసం నిన్ను కాలితో తన్నుతాడు. ధర్మాన్ని అతిక్రమించి నిన్ను కాలితో తన్నినందుకు నేను తీవ్రంగా అసహనానికి లోనై ద్విజద్రోహి అయిన ఆ నహుషుని "పామువైపో" అని కోపంతో శపిస్తాను. మహామునీ! ఆ తర్వాత అందరి ధిక్కారాలతో తేజస్సును కోల్పోయిన ఆ దుర్బుద్ధిని - ఐశ్వర్య బలమోహితుడై, పాపకర్మల నాచరించిన ఆ నహుషుని నీవు చూస్తుండగానే నేలపై పడగొడతాను. మునీ! లేదా మీరెలా చెపితే అలా చేస్తాను". భృగువు అలా అనగానే అవ్యయుడు మిత్రా వరుణుల కుమారుడు అయిన అగస్త్యుడు పరమానందపడి చింతను విడనాడాడు".

100. నహుష పతనము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "నహుషుడు ఎలా విపత్తికి లోనయ్యాడు? ఎలా నేలగూల్చబడ్డాడు? ఇంద్రత్వాన్ని ఎలా కోల్పోయాడు? అది తమరు చెప్పాలి." భీష్ముడు చెప్తున్నాడు. "అగస్త్యుడు భృగువు అలా మాటాడుకొంటున్న సమయంలో కూడా మహాత్ముడైన ఆ నహుషుని దగ్గర దివ్యమానుష క్రియలన్నీ కొనసాగుతూనే ఉన్నాయి. అదే రీతిగా దీపదానాలు, సర్వోపకరణాలతో అన్నదానాలు, బలి కర్మ, వివిధ స్నానాదులు యథాపూర్వంగా జరుగుతూనే ఉన్నాయి. దేవలోకంలోనూ, మానవలోకంలోనూ పండితులు చెప్పిన సదాచారాలన్నీ మహాత్ముడైన ఆ దేవేంద్రుని (నహుషుని) ఇంట నిర్వహింపబడుతున్నాయి. రాజేంద్రా! ఆ క్రియలన్నీ కొనసాగుతుంటే గృహస్థులు సమృద్ధిని పొందుతారు. అలాగే ధూపదీపదానాలతో, దేవతా నమస్కారాలతో కూడా గృహస్థులు వర్ధిల్లుతారు. అన్నం సిద్ధమైన తరువాత ముందుగా అతిథికి భోజనం పెట్టినట్టు, గృహంలో దేవతలకై బలులు సమర్పించబడతాయి. దానితో దేవతలు ప్రసన్నులవుతారు. బలికర్మ చేసినందువలన గృహస్థుడు పొందిన సంతోషం కన్నా వందరెట్లు ఎక్కువగా దానిని గ్రహించిన దేవతలు తృప్తి పడతారు. ఈ రీతిగా సజ్జనులు తమకు లాభాన్ని కలిగిస్తుందని గ్రహించి, నమస్కార సహితంగా

ధూపదీపదానాలను చేస్తారు. పండితులు నీటితో స్నానం చేసి, దేవతోద్దేశంగా నమస్కారపురస్సరంగా చేసిన తర్పణాది కర్మతో దేవతలు, మహాభాగులైన పితరులు, ఋషులు, తపోధనులు ప్రసన్నులవుతారు. విధి పూర్వకంగా అర్చింపబడిన గృహదేవతలు అందరు కూడా తృప్తిపడతారు. ఇటువంటి ఆలోచనతోనే, నహుషనరపాలుడు గొప్పదైన సురేంద్రత్వాన్ని పొందికూడా ఈ అద్భుత పుణ్యకర్మలను చేస్తూనే ఉన్నాడు. ఆపై కొంతకాలం తర్వాత నహుషుని భాగ్యం క్షీణించే దశరాగానే వీటినన్నింటినీ పరిహసిస్తూ ఇటువంటి పాపకృత్యాల నారంభించాడు. ఆపై బలగర్వంతో దేవేంద్రుడు (నహుషుడు) క్షీణించసాగాడు. ధూపదీప జలదానాలను అంతకుముందువలె చేయటం మానాడు. ఆ తరువాత ఆయన యజ్ఞ స్థలంలో రాక్షసులు విడిది చేశారు. దానితో మహాబలుడైన నహుషుడు పరిహాస పూర్వకంగా సరస్వతీ నదీ తీరంలో ఉన్న అగస్త్యమునిని వేగంగా తన రథం లాగటానికి పిలిపించాడు. అప్పుడు మహాతేజస్వి అయిన భృగువు అగస్త్యునితో ఇలా అన్నాడు.

నీ కళ్ళు మూసికో. నీ జటలలో ప్రవేశిస్తాను. అలా అని అగస్త్యుడు నిశ్చలంగా నిలువగానే అచ్యుతుడు, మహాతేజస్వి అయిన ఆ భృగువు ఆ నహుషుని పడగొట్టడానికై అగస్త్యుని జటలలో ప్రవేశించాడు. ఆ తరువాత దేవేంద్రుడు (నహుషుడు) అగస్త్యుని వాహనంగా చేసికొనటానికి వచ్చాడు. రాజా! ఆ తరువాత అగస్త్యుడు సురపతితో ఇలా అన్నాడు. "నన్ను త్వరగా పూన్చు. మహామతీ! ఏ ప్రదేశానికి వెళ్ళాలి? సురాధిపా! ఎక్కడకు కొనిపొమ్మంటే అక్కడకు కొనిపోతాను." అగస్త్యుడలా అనగానే నహుషుడు ఆ మునిని రథానికి కట్టాడు. అగస్త్యుని జటలలో నున్న భృగువు ఎంతో ఆనందించాడు. ఆ సమయంలో ఆయన నహుషుని ఎదుటపడలేదు. మహాత్ముడైన ఆ నహుషునకు బ్రహ్మఇచ్చిన వరప్రభావం తెలిసినవాడు కాబట్టి అగస్త్యుడు తనను నహుషుడు రథానికి పూన్చినా కోపపడలేదు. భారతా! ఆ నహుషుడు అగస్త్యుని కొరడాతో అదిలించసాగాడు. ధర్మాత్ముడైన అగస్త్యుడు కోపించలేదు. ఆపై నహుషుడు కోపంతో తన ఎడమకాలితో అగస్త్యుని తలపై తన్నాడు. అగస్త్యుని తలపై కొట్టగానే జటలలో దాగి ఉన్న భృగువు తీవ్రంగా కోపించి పాపమనస్కుడైన నహుషుని ఇలా శపించాడు. "ఈ మహామునిని కోపంతో, కాలితో కొట్టావు. కాబట్టి వెంటనే పామువై నేలపై బడు, దుర్బుద్ధీ'. భరతర్షభా! కనిపించకుండా అగస్త్యుని జటలలో ఉన్న భృగువు అలా అనగానే నహుషుడు సర్పమై నేలపై పడ్డాడు. రాజా! ఒకవేళ నహుషుడు భృగువును చూసి ఉన్నట్లయితే, నహుషతేజః ప్రభావం వలన భృగువు ఆయనను పడగొట్టలేకపోయేవాడు. మహారాజా! ఆ నహుషుడు నేలపై పడి కూడా తన దానాలవలన,

తపస్సుల వలన, నియమాల వలన గతంలోని జ్ఞాపకాలను కోల్పోలేదు. అందువలన తన శాపానికి ముగింపు ఎలా ? అని భృగువును బ్రతిమలాడుకొన్నాడు. మహారాజా! ఆ తరువాత్ అగస్త్యుడు జాలి కలిగి నహుషుని శాపవిముక్తికై భృగువును ప్రార్థించాడు. భృగువు కూడా దయతో శాపాంతాన్ని ఇలా అనుగ్రహించాడు.

భృగువు ఇలా అన్నాడు. "కులదీపకుడై యుధిష్ఠిరుడనే రాజు జన్మించబోతున్నాడు. ఆయన నిన్ను శాపం నుండి విడిపిస్తాడు. అని చెప్పి భృగువు మాయమయ్యాడు. మహాతేజస్వి అయిన అగస్త్యుడు కూడా ఇంద్రుని పనిని ముగించి బ్రాహ్మణుల పూజలందుకొంటూ తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. రాజా! నీవు ఆ నహుషుని శాపం నుండి ఉద్ధరించావు గదా! నీవు చూస్తుండగానే ఆయన బ్రహ్మ సదనానికి చేరగలిగాడు. భృగువు ఆ రీతిగా నహుషుని నేలకు పడగొట్టి బ్రహ్మసదనానికి వెళ్ళి, బ్రహ్మకు నివేదించాడు. ఆ తరువాత బ్రహ్మ ఇంద్రుని, దేవతలను పిలిపించి దేవతలతో ఇలా అన్నాడు. "దేవతలారా! నా వరదానం వలన నహుషుడు రాజ్యం పొందాడు. అగస్త్యుడు కోపంతో ఆయనను భ్రష్టుని చేయగా భూతలానికి వెళ్ళిపోయాడు. దేవతలారా! రాజు లేకుండా ఎక్కడైనా ఉండటం వీలుకాదు. కాబట్టి మరల ఈ శక్తుని దేవేంద్రునిగా అభిషేకించండి. రాజా! పార్థా! బ్రహ్మ అలా పలుకగానే దేవతలు ఆనందంతో "అలాగే జరగనివ్వండి!" అని బదులుపలికారు. రాజశార్దూలా! పూజ్యుడైన బ్రహ్మచే అలా అభిషేకింపబడిన వాసవుడు అంతకుముందు వలె మరలా దేవేంద్రుడై శోభిల్లాడు. ఈ రీతిగా నహుషుని మర్యాదాతిక్రమణం వలన ఇటువంటిది జరిగింది. కానీ నహుషుడు ఆ దీపదానాది కర్మలవలననే సిద్ధిపొందాడు. కాబట్టి గృహస్థులు సాయంసమయంలో దీపదానం చేయాలి. దీపదాత మరణానంతరం దివ్యదృష్టిని పొందగలడు. దీపదాతలు పూర్ణచంద్రుని వలె ప్రకాశిస్తారు. ఎన్ని రెప్పపాట్ల కాలం దీపం వెలుగుతుందో అన్ని సంవత్సరాల వరకు దీపదాత అయిన నరుడు రూపవంతుడు, బలవంతుడు అవుతాడు.

101. రాజన్య చండాల సంవాదము.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. "భరతర్షభా! మూఢులై, బుద్ధిహీనులై, క్రూరకర్మాసక్తులై బ్రాహ్మణుల సొమ్మును, అపహరించే మానవులు ఎ లోకాలకు వెళతారు ?"

బలపూర్వకంగా బ్రాహ్మణుల సొమ్మును అపహరించటం పాపాలలో పెద్దది. ఆ పాపం చేసిన హీనబుద్ధులు ఇహపరాలలో సకుటుంబంగా నష్టపోతారు.

భారతా! ఈ విషయంలో కూడా చండాల, క్షత్ర, బంధు సంవాద రూపమైన

పురాతనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. రాజన్యుడిలా అన్నాడు. "చాండాలా! వృద్ధుడివలె ఉన్నావు. బాలుడివలె ప్రవర్తిస్తున్నావు. కుక్కలు, గాడిదలు రేపిన దుమ్మును సేవించేనీవు గోధూళితో ఎందుకు గాబరాపడుతున్నావు ? చాండాలురకై విహితమైన కర్మనే సాధువులు నిందిస్తుంటారు. కానీ నీవు గోధూళి కప్పిన శరీరాన్ని జలాశయంలో ఎందుకు ముంచుతున్నావు?" చాండాలుడు చెప్తున్నాడు. "రాజా! ఒకప్పుడు బ్రాహ్మణుని గోవుల దొంగతనం జరిగింది. వాటిని తీసుకొని వెళ్తుంటే ఆ ధూళి సోమరసంపై పడి దానిని అపవిత్రం చేసింది. ఆ సోమరసాన్ని త్రాగిన బ్రాహ్మణులు, యజమాని అయిన రాజు కూడా వెంటనే నరకానికి వెళ్ళారు. ఆ ధూళితో పాటు పాలబొట్లు కూడా సోమరసంలో పడ్డాయి. అందువలననే దానిని త్రాగిన రాజు బ్రాహ్మణులు అందరూ నరకంలో పడిపోయారు. ఆ గోవుల పాలు, నెయ్యి, పెరుగు త్రాగిన మనుష్యులు బ్రాహ్మణులు, క్షత్రియులు అందరూ నరకంలో ప్రవేశించారు. అపహరింపబడిన ఆ గోవులు ఇతర పశువులను చూస్తూ, వణికిపోతూ, సద్భావంతోనే తమను అపహరించిన దంపతులకు పాలనిచ్చాయి. అయినా పుత్రపౌత్రులతో పాటు వారు నశించారు. రాజా! నరాధిపా! అప్పుడు నేను బ్రహ్మచారినై, జితేంద్రియుడనై, అక్కడే ఉన్నాను. నా భిక్ష కూడా వాటి దుమ్ము పడి అపవిత్రమైంది. రాజా! అప్పుడు నేను ఆ అన్నాన్ని తిని చండాలుడనయ్యాను. బ్రాహ్మణుని సొమ్మును అపహరించిన రాజు కూడా నరకానికి వెళ్ళాడు. కాబట్టి బ్రాహ్మణుని సొమ్మును ఎప్పుడూ, కొంచెం కూడా అపహరించరదగదు. ధూళితో అపవిత్రమైన బ్రాహ్మణుని సొమ్మును భుజించిన నా స్థితి ఎలా అయినదో చూడు. అందువలననే పండితుడైన పురుషుడు సోమాన్ని కూడా అమ్మకూడదు. సోమవిక్రయాన్ని బుద్ధిమంతులు నిందిస్తారు. నాయనా! సోమాన్ని అమ్మినవారు, కొన్నవారు అందరూ కూడా యమలోకానికి పోయి రౌరవనరకంలోనికి వెళ్తారు. శ్రోత్రియుడైన బ్రాహ్మణుడు ధూళితో అపవిత్రమైన సోమరసాన్ని విధి పూర్వకంగా అమ్మినా, వడ్డీకి డబ్బుఇచ్చినా త్వరలోనే నశిస్తాడు. ముప్పది నరకాలలో పడి తనమలమే తినే పురుగు అవుతాడు. కుక్కలను పోషించటం, అభిమానపడటం, మిత్రస్త్రీతో సంగమించటం - ఈ మూడింటిని త్రాసులో పెట్టి ధర్మబద్ధంగా తూకంవేస్తే అభిమానమే బరువవుతుంది. ఈ కుక్కను చూడు. పాపిష్ఠిది. పాలిపోయి, తెల్లగా, దుర్బలంగా ఉంది. ఒకప్పుడు మనిషియే, ప్రాణులన్నింటిమీదా కోపించి ఈ గతిని పొందాడు.

నాయనా! నేను కూడా గతజన్మలో ధనసంపన్నమైన గొప్ప ఇంటిలోనే పుట్టాను. జ్ఞానవిజ్ఞాన పారంగతుడను. ఈ దోషాలు అన్నీ నాకు తెలుసు. అయినా అభిమానంతో ఎప్పుడూ సర్వప్రాణులపై క్రోధాన్ని ప్రదర్శిస్తూ, పశువుల పృష్ఠ మాంసాన్ని తినేవాడిని. ఆ

నడవడివలన, ఆ భక్షణం వలన నేను ఈ స్థితికి వచ్చాను. ఈ జన్మలో. కాలం ఎంత విపరీతమో చూడు. కొంగు అంటుకొన్న వాని వలె, తుమ్మెదలు పీడిస్తున్న వానివలె పరుగెత్తుతున్న నన్ను చూడు. రజోగుణానికి లోనై ఆవేశ రోషాలకు లొంగి తిరుగుతున్నాను. గృహస్థులు స్వాధ్యాయాల ద్వారానే తమ పాపం ఎంతదయినా సరే పోగొట్టుకొనగలరు. వివిధ దానాలచే కూడా పోగొట్టుకొనగలరు. పెద్దలు అలాగే చెప్పారు. రాజా! అలాగే సర్వసంగ వినిర్ముక్తుడై ఆశ్రమంలో ఉన్న విప్రుడు పాపంచేస్తే వేదాలు తరింపజేయగలవు. క్షత్రియశ్రేష్ఠా! నేను పాపజాతిలోనే పుట్టాను. ఎలా ముక్తినందగలనో నిశ్చయించుకొనలేకున్నాను. రాజా! గతజన్మలో చేసిన ఏ శుభకర్మ ఫలంగా నైనా నాకు గతం గుర్తుకు వస్తే, దాని ద్వారా నేను మోక్షాన్ని పొందాలనుకొంటున్నాను. సజ్జనశ్రేష్ఠా! నేను నీ శరణుకోరి, ఈ సందేహాన్ని అడుగుతున్నాను. సమాధానం చెప్పు. నేను చండాలత్వం నుండి ఎలా ముక్తినందగలను?" రాజన్యుడిలా అన్నాడు. "చాండాలా! మోక్షోపాయాన్ని చెపుతాను విను. బ్రాహ్మణులకై ప్రాణాలను పరిత్యజించు, దానితో ఇష్టగతిని పొందవచ్చు. ఈ శరీరాన్ని బ్రాహ్మణ సంరక్షణకై రణాగ్నిలో పచ్చిమాంసం తినే జంతువులకై ఆహుతి చేయి. అలా ప్రాణాలు వీడితేనే నీకు మోక్షం. మరొకరీతిగా మోక్షాన్ని పొందలేవు. భీష్ముడు చెప్తున్నాడు. "పరంతపా! రాజన్యుడలా చెప్పగానే ఆ చాండాలుడు బ్రాహ్మణ ధనరక్షణకై పోరాడుతూ ప్రాణాలను ఇష్టగతిని పొందాడు. మహాబాహూ! కుమారా! భరతర్షభా! కాబట్టి నీవు కూడా శాశ్వత గతిని కావాలనుకుంటే బ్రాహ్మణ ధనాన్ని రక్షించాలి.

102. హస్తి కూటము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "పితామహా! పుణ్యాత్ములు అందరూ మరణానంతరం ఒకే విధమైన లోకాలను పొందుతారా? లేక అక్కడ ఆ లోకాలలో భేదముంటుందా? అది నాకు చెప్పవలసినది." భీష్ముడు చెప్తున్నాడు. "కౌంతేయా! మానవులు తమ కర్మలననుసరించి విభిన్నలోకాలను పొందుతారు. పుణ్యం చేసినవారు పుణ్యలోకాలకు, పాపంచేసినవారు పాపలోకాలకు వెళతారు. నాయనా! ఈ విషయమై కూడా గౌతమ మునికి దేవేంద్రునకు మధ్య జరిగిన సంవాదరూపమైన పురాతనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. గౌతముడనే బ్రాహ్మణుడుండేవాడు. ఆయన మృదుస్వభావుడు. మనస్సును నిగ్రహించినవాడు. జితేంద్రియుడు. ఒక గొప్ప అడవిలో తల్లిలేని ఒక ఏనుగుపిల్ల కష్టపడుతుంటే చూసి దయతో దానిని పోషించాడు వ్రతశీలుడైన ఆ ముని. చాలాకాలం గడిచింది. ఆ ఏనుగు పిల్ల పెద్దదయింది. మహాబలాన్ని పొందింది. దాని కుంభస్థలం భిన్నమై మదజలం కారసాగింది.

పర్వతంతో సమానంగా ఉన్న ఆ మహాగజాన్ని ఒకరోజు ఇంద్రుడు ధృతరాష్ట్రుని రూపం ధరించి. ఆ ఏనుగును చెరబట్టాడు. మహాతపస్వి, నియతవ్రతుడు అయిన గౌతముడు ఆ ఏనుగు అపహరింపబడటం చూసి ధృతరాష్ట్ర రాజుతో ఇలా అన్నాడు. "కృతజ్ఞతా రహితుడా! ధృతరాష్ట్రా! నా ఈ ఏనుగును అపహరించవద్దు. ఇది నా బిడ్డ. కష్టపడి పెంచాను. సత్పురుషులు ఏడడుగుల నడక చేతనే మిత్రులంటారు. నిన్ను మిత్రద్రోహం పాపం అంటకూడదు. ఇది నాకు సమిధలు, జలం, తెచ్చిస్తుంది. ఎవ్వరూ లేనపుడు ఆశ్రమాన్ని రక్షిస్తుంది. గురుకులంలో ఉండి ఇదంతా నేర్చుకొన్నది. గురుసేవాతత్పరత గలది. ఇది విశిష్టం, జితేంద్రియం, కృతజ్ఞం, నాకు సతతమూ ప్రియమైనది. కాబట్టి రాజా! నేను విలపిస్తుండగా దీనిని నీవు అపహరింపదగదు."

ధృతరాష్ట్ర :- 'నీకు వేయి గోవులను ఇస్తాను. వందమంది దాసులను ఇస్తాను. అయిదు వందల బంగారు నాణేలు ఇస్తాను. మహర్షీ! ఇంకా వివిధ ధనాలను ఇస్తాను. మహర్షీ! బ్రాహ్మణునికి ఏనుగుతో ఏం పని."

గౌతమ :- "రాజా! గోవులను నీవే ఉంచుకో! దాసులు, బంగారు నాణేలు, వివిధ రత్నాలు నీవే ఉంచుకో! వివిధ ధనాలను నీవే ఉంచుకో. రాజా! బ్రాహ్మణునికి ధనంతో ఏం పని?"

ధృతరాష్ట్ర :- "బ్రాహ్మణులకు ఏనుగుల అవసరం లేదు. బ్రాహ్మణా! రాజులకు ఏనుగులు అవసరం. ఏనుగు నా వాహనం. ఈ శ్రేష్ఠ గజాన్ని నేను తీసికోవటం అధర్మం కాదు. గౌతమా! దీనిపై ఆశ వదులుకో".

గౌతమ :- "మహత్మా! ఎక్కడకు వెళ్ళి, పుణ్యకర్మలు చేసినవారు ఆనందిస్తారో, పాపకర్మలు చేసినవారు బాధపడతారో ఆ యమసదనంలో నేను నీ నుండి ఏనుగును తీసికొంటాను.

ధృతరాష్ట్ర :- "క్రియాశూన్యులు, నాస్తికులు, శ్రద్ధారహితులు, పాపాత్ములు, ఇంద్రియ లోలుపులు యమసదనానికి వెళ్ళి యాతనలు పొందుతారు. కానీ ధృతరాష్ట్రుడు అక్కడకు చేరాడు"

గౌతమ :- "యముని నగరం సంయమని. అది మనుష్యులను నియంత్రిస్తుంది. అక్కడ అసత్యం పలుకరు. సత్యమే మాటాడుతారు. అక్కడ బలహీనులు బలవంతులు తమకు చేసిన అన్యాయానికి బదులు తీర్చుకొంటారు. అక్కడ నేను నా ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "మహర్షీ! మదమత్తులై అక్కతో, తండ్రితో, తల్లితో శత్రువులతో వలె ప్రవర్తించే మనుషులు ఆ యమలోకానికి వెళతారు. కానీ ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు."

గౌతమ :- "మహాభాగ అయిన మందాకిని కుబేరుని రాజ్యంలో ప్రవహిస్తుంది. అదృష్టవంతులు అక్కడ ప్రవేశించగలరు. గంధర్వులు, యక్షులు, అప్సరసలు ఆ మందాకిని సేవిస్తారు. నా ఏనుగు అక్కడకు చేరవచ్చు. అక్కడ నా ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "అతిథి సేవాపరాయణులై, ఉత్తమ వ్రతశీలురై, బ్రాహ్మణులకు ఆశ్రయ మిచ్చేవారు, ఆశ్రితులకు పెట్టి మిగిలినదానినే తినేవారు మాత్రమే మందాకినీ తీరానికి వస్తె తెస్తారు."

గౌతమ :- "మేరు పర్వతం దగ్గర రమ్యమైన వనముంది. అది చక్కగా పుష్పించి ఉంటుంది. కిన్నర గీతనాదం అక్కడ వినిపిస్తుంది. అక్కడ అందమైన పెద్ద నేరేడు చెట్లు ఉంటాయి. అక్కడ నేను నా ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "మృదుస్వభావులై, సత్యశీలులై, బహుశాస్త్రపండితులై, సర్వభూతాలకు ఇష్టులై, ఇతిహాసపురాణాలను అధ్యయనం చేసి, మధుర పదార్థాలతో బ్రాహ్మణులకు భోజనాన్ని అర్పించే బ్రాహ్మణులు ఆ లోకానికి వెళ్ళగలరు. మహర్షీ! ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు. నీవెరిగిన లోకాలు ఇంకా ఉంటే చెప్పు. నేను త్వరగా వెళ్ళాలి."

గౌతమ :- "చక్కగా పుష్పించి, కిన్నర రాజసేవితమై, సదా నారదునకు, గంధర్వులకు, అప్సరసలకు ఆనందాన్ని, ప్రియాన్నీ, కలిగించే నందనవన మున్నది. అక్కడ నా ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "నృత్యగీత కుశలుడై, ఎప్పుడూ ఎవ్వరినీ యాచించ కుండా సజ్జనులతో కలిసి తిరిగేవారు ఆ లోకానికి వెళతారు. కానీ ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు."

గౌతమ :- "రాజా! రమణీయాలయిన ఉత్తరకురు ప్రాంతాలు ఉన్నాయి అక్కడ దేవతలతో కలిసి ఆనందంగా ఉంటారు. అక్కడ అగ్నినుండి, నీటినుండి పర్వతాల నుండి పుట్టిన దివ్యమానవులు నివసిస్తారు. అక్కడ ఇంద్రుడు కోరికలను కురిపిస్తాడు. స్త్రీలు స్వేచ్ఛగా సంచరిస్తారు. అక్కడకు స్త్రీలకు గానీ, పురుషులకు గానీ ఈర్ష్య ఉండదు. అక్కడ నా ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "సమస్త ప్రాణులయందు నిష్కాములై, మాంసాహారాన్ని వీడి, దండనీతిని వదలి, స్థావరజంగమప్రాణులను వేటినీ హింసించకుండా సర్వప్రాణులనూ

తమవలె భావిస్తూ, ఆశ, మమకారం, రాగం, పరిత్యజించి, లాభనష్టాలనూ, నిందాస్తుతులను, సమంగా భావించేవారు. ఆ లోకాలకు వెళతారు. కానీ ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు."

గౌతమ :- "ఇంకా సనాతనలోకాలు ఎన్నో ఉన్నాయి. అక్కడ పుణ్యగంధాలు వ్యాపిస్తాయి. అక్కడ రజోగుణం కానీ శోకం కానీ ఉండవు. మహాత్ముడైన సోముని లోకంలో అవి ఉంటాయి. అక్కడ నా ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "మహర్షీ! ఎప్పుడూ దానం చేయటమే కానీ దానాన్ని స్వీకరించనివారు, ఇతరుల పదార్థాలను ఎప్పుడూ స్వీకరించనివారు, యోగ్యులకు ఇవ్వరానిదంటూ ఏదీ లేనివారు, అందరికీ ఆతిథ్యమిచ్చేవారు, అందరినీ ప్రసన్నంగా చూసేవారు, క్షమాశీలులు, ఇతరులను నిందించనివారు, పుణ్యశీలులు, సర్వదా ఇతరులకు, అన్న సత్రం వంటివారు వెళ్ళే లోకాలవి. కానీ ధృతరాష్ట్రుడక్కడకు చేరడు.

గౌతమ :- "ఇంకా సనాతనలోకాలు ఎన్నో ఉన్నాయి. మహాత్ముడైన సూర్యుని స్థానాలవి. అక్కడ రజోగుణం. తమోగుణం, శోకం కనిపించవు. అక్కడ నేను నీనుండి నా ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "స్వాధ్యాయశీలురు, గురుశుశ్రూషాతత్పరులు, తపస్వులు, సువ్రతులు, సత్యసంధులు, గురువులకు ఎదురు చెప్పనివారు, సతత ప్రయత్న శీలురు, స్వయంగానే గురుకర్మలో లగ్నమయ్యేవారు, పవిత్రభావులు, మౌనవ్రతాన్ని పాటించేవారు, సత్యనిష్ఠులు, వేదవేత్తలు అయిన మహాత్ములు చేరగల లోకాలవి, కానీ మహర్షీ! ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు".

గౌతమ :- "మహాత్ముడైన వరుణరాజులోకంలో ఇంకా సనాతనలోకాలున్నాయి. పుణ్యగంధాలు కలిగి రజోగుణానికి, శోకానికి దూరమైనవి. అక్కడ నేను నీ నుండి ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "సదా చాతుర్మాస్యవ్రతాలను అనుష్ఠించే జనులు, వేలకొలది యాగాలను అనుష్ఠించేవారు, మూడు సంవత్సరాల పాటు వైదికవిధిననుసరించి ప్రతిదినమూ శ్రద్ధగా అగ్నిహోత్రాన్ని చేసిన బ్రాహ్మణులు, ధర్మభారాన్ని చక్కగా మోస్తూ, వేదోక్తమార్గంలో సుస్థిరంగా నిలిచిన ధర్మాత్ములు, మహాత్ములు వరుణలోకాలకు వెళతారు కానీ ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు."

గౌతమ :- "రాజా! ఇంద్రలోకాలు రజోగుణ శోకరహితాలు. మానవులందరూ వాటిని కోరుకొంటారు కానీ వాటిని పొందటం కష్టం. భూరితేజస్వి అయిన ఆ ఇంద్రుని భవనంలో ఈ నా ఏనుగును తీసికొంటాను".

ధృతరాష్ట్ర :- "నూరు సంవత్సరాలు బ్రతికిన శూరుడైన మనుష్యుడు, వేదాధ్యయనం చేసినవాడు, యజమాని, అప్రమత్తుడు - వీరంతా ఇంద్ర లోకానికి వెళతారు. కానీ ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు."

గౌతమ :- "స్వర్గలోక శిఖర భాగంలో ప్రజాపతికి సంబంధించిన గొప్ప లోకాలు ఉన్నాయి. అవి పుష్కలంగా శోకరహితంగా ఉంటాయి. సర్వ లోక ప్రాణులూ వాటిని కోరుకొంటాయి. అక్కడ నేను నీ నుండి ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "రాజసూయయాగంలో అభిషిక్తులై, ధర్మాత్ములై, ప్రజారక్షకులై, అశ్వమేధయాగం చేసి అవభృథస్నానంతో తడిసిన రాజులు ఆ లోకాలకు వెళతారు. కానీ ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు."

గౌతమ :- "ఆ లోకాలకు పైన గోలోకాలున్నాయి. అవి సనాతనాలు ప్రకాశవంతమైనవి. పుణ్యగంధాలు అక్కడుంటాయి. రజోగుణం కానీ, శోకంకానీ అక్కడుండవు. దుర్లభమూ, దుర్ధర్షమూ అయిన ఆ గోలోకంలో నా ఏనుగును తీసికొంటాను."

ధృతరాష్ట్ర :- "వేయి గోవులుండి ప్రతిసంవత్సరమూ వంద గోవులు దానమిచ్చేవాడు, లేదా వంద గోవులుండి తన శక్తినిబట్టి పది గోవులను దానమిచ్చేవాడు, లేదా పదో, అయిదో గోవులుండి వాటిలోనే ఒకదానిని ఇచ్చే దానశీలుడు, బ్రహ్మచర్యంతోనే శరీరాన్ని శిథిలం చేసికొనే విప్రులు, వేదవాణిని పరిరక్షించేవారు, మనస్సులై సదా తీర్థయాత్రలలో ఆసక్తి గలవారు ఆ గోలోకంలో నివసిస్తూ ఆనందిస్తారు. ప్రభాసం, మానససరోవరం, త్రిపుష్కరమహాసరోవరం, పవిత్రమైన నైమిషతీర్థం, బాహుదానది, కరతోయానది, గయ గయశిరస్సు, గంధ్ర ఇసుకగల విపాశ, కృష్ణ, గంగ, పంచనదం, మహాహ్రదం, గోమతి, కౌశికి, పంప, సరస్వతి, దృషద్వతి, యమున, ఈ తీర్థాలను చేరిన ధృతవ్రతులైన మహాత్ములే దివ్య శరీరధారులై, దివ్యమాలలను ధరించి ఆ లోకాలకు వెళతారు. అవి మంగళకరాలు, పుణ్యగంధభరితాలు. కానీ ధృతరాష్ట్రుడు అక్కడకు చేరడు."

గౌతమ :- "పుణ్యప్రదమైన బ్రహ్మలోకమున్నది. అక్కడ చలిభయం లేదు. ఉష్ణభయం లేదు. ఆకలి దప్పులుండవు. గ్లాని ఉండదు. సుఖదుఃఖాలు ఉండవు. అనిష్టుడు కానీ. ఇష్టుడు కానీ ఉండడు. బంధువు కానీ శత్రువు కానీ ఉండడు. జరామరణాలు లేవు. పుణ్యపాపాలు లేవు. సమృద్ధమై రజోగుణరహితమై, సత్త్వగుణ సంపన్నమైన లోకమది అక్కడ నా ఏనుగును నాకిస్తావు."

ధృతరాష్ట్ర :- "సర్వసంగవిముక్తులై, నియతమనస్కులై, నియమబద్ధంగా వ్రతాల నాచరిస్తూ, ఆధ్యాత్మజ్ఞాన యోగాసనాలతో కూడి, స్వర్గానికి వెళ్ళగలవారై, సాత్త్వికులైన

మనుష్యులు పవిత్రమైన బ్రహ్మలోకానికి వెళతారు. మహామునీ! నీ వక్కడ ధృతరాష్ట్రుని చూడలేవు.

గౌతమ :- "ఎక్కడ రథంతరం, బృహత్సామ గానం చేయబడతాయో, యాజకులు కమలాలతో యజ్ఞవేదిని ఎక్కడ ఆచ్ఛాదిస్తారో, సోమపానం చేసినవారు గుర్రాలపై ఎక్కడకు వెళతారో అక్కడ నేను నీనుండి ఏనుగును తీసికొంటాను. నీవు వృత్రుని చంపిన ఇంద్రుడవని నేను గ్రహించాను. సమస్తలోకాలను పరీక్షించటానికై తిరుగుతున్నావు. నేను మనస్సులోని ఆవేశంతో ఎప్పుడైనా వాచా నీ విషయంలో ఏ అపరాధమూ చేయలేదు కదా!"

శతక్రతుడు :- "నేను ఇంద్రుడనే, నీ ఏనుగును అపహరించి లౌకిక ప్రజాదృష్టిలో దోషినయ్యాను. కాబట్టి నీకు నమస్కరిస్తున్నాను. నన్ను ఆదేశించు. నీవు చెప్పినదంతా చేస్తాను."

గౌతమ :- "ఈ తెల్ల ఏనుగుగున్న నాకు పుత్రసమానం. ఇప్పుడు పది సంవత్సరాల బాలుడు. వనవాసంలో నాకు తోడు అదే. దానిని నీవు అపహరించావు. దేవేంద్రా! ఆ నా ఏనుగును నాకివ్వు".

శతక్రతుడు :- " బ్రాహ్మణోత్తమా! నీ కుమారుడైన ఆ ఏనుగు నీవైపే చూస్తూ వస్తోంది, ఇదిగో! వచ్చి నా పాదాలను తన తొండంతో ఆఘ్రాణిస్తోంది. నాకు శ్రేయస్సు కలిగించు. నీకు నమస్సు".

గౌతమ :- "సురేంద్రా! నీకు సదా ఇక్కడ నీ శ్రేయస్సును గూర్చి ఆలోచిస్తున్నాను. నిత్యమూ పూజిస్తున్నాను. శక్రా! నీవు కూడా నాకు శుభాన్ని కలిగించు. నీవిచ్చిన ఏనుగును స్వీకరిస్తున్నాను."

శతక్రతుడు :- "తమ హృదయగుహలలో వేదాలను పూర్తిగా నింపుకొన్న సత్యవాదులైన మహాత్ములలో, జ్ఞానులలో నీవు ముఖ్యుడవు. నీ శుభచింతనవలననే సమృద్ధినందాను. అందువలన నీకు ప్రసన్నుడనయ్యాను. బ్రాహ్మణా! ఆనందంగా చెప్తున్నాను. నీ కుమారుడైన ఈ ఏనుగును తీసికొని వెంటనే వెళ్ళు. ఇప్పుడే నీవు శాశ్వత పుణ్యలోకాలను పొందటానికి అర్హుడవయ్యావు."

పుత్రతుల్యమైన ఏనుగుతోపాటు గౌతముని ముందుంచుకొని ఇంద్రుడు సత్పురుషులతో సహా దురాసదమైన ఇంద్రలోకానికి వెళ్ళాడు. జితేంద్రియుడై నిత్యమూ ఈ వృత్తాంతాన్ని విన్నవాడు, చదివినవాడు గౌతమద్విజునివలె బ్రహ్మలోకాన్ని పొందుతాడు.

103. బ్రహ్మభగీరథ సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "వివిధ దానాలను, శాంతిని, సత్యాన్ని, అహింసను, తనభార్యతోనే తృప్తిపడటాన్ని, దాన ఫలాన్ని వివరించారు. పితామహుల అభిప్రాయంలో తపోబలాన్ని మించినదేమిటి ? తమ అభిప్రాయంలో తపస్సును మించినదేదైనా ఉంటే తెలియజేయవలసినది." భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా! ఎంత తపస్సు చేస్తే అంతటిలోకాలు ప్రాప్తిస్తాయి. కొంతేయా! నా అభిప్రాయంలో ఉపవాసాన్ని మించిన తపస్సు లేదు. ఈ విషయమై కూడా మహాత్ముడైన బ్రహ్మకు, భగీరథునకు మధ్య జరిగిన సంవాదరూపమైన పురాతనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. భారత! భగీరథుడు సురలోకాన్ని, గోలోకాన్ని, ఋషిలోకాన్ని కూడా అతిక్రమించి బ్రహ్మలోకానికి వెళ్ళాడు. రాజా! ఆ భగీరథుని చూసి బ్రహ్మ ఇలా అడిగాడు. "భగీరథా! చేరశక్యంకానీ ఈ బ్రహ్మలోకానికి నీవు ఎలా రాగలిగావు ? భగీరథా! దేవతలైనా, గంధర్వులైనా, మనుష్యులైనా తపస్సుతో తపించ కుండా ఇక్కడకు రాలేరు. నీవెలా వచ్చావు?

భగీరథుడు చెప్తున్నాడు. "పండితా! నేను బ్రాహ్మ వ్రతాన్ని స్వీకరించి నిత్యమూ లక్ష బంగారు నాణేలను బ్రాహ్మణులకు దానం చేశాను. కానీ ఆ దానఫలంతో నేనిక్కడకు రాలేదు. ఏక రాత్ర యజ్ఞాలను పదింటిని, పంచరాత్ర యజ్ఞాలను పదింటిని, ఏకాదశ రాత్రయజ్ఞాలను, పదకొండింటిని, వంద జ్యోతిష్టోమాలను నిర్వహించాను. కానీ ఆ ఫలంతో కూడా నేనిక్కడకు రాలేదు. ఘోరతపస్సు నాచరిస్తూ వంద సంవత్సరాలు ప్రతిదినమూ గంగా తీరంలో నివసించాను. అక్కడ వేయి కంచరగాడిదలను, లెక్కలేనంత మంది కన్యలను దానం చేశాను. కానీ ఆ ఫలంతో ఇక్కడకు రాలేదు. పుష్కరతీర్థంలో వందలవేలసార్లు లక్ష గుర్రాలను, రెండు లక్షల గోవులను బ్రాహ్మణులకు ఇచ్చాను. సువర్ణచంద్రహారాలు, బంగారు ఆభరణాలు అలంరించుకొన్న అరవైవేలమంది ఉత్తమ కన్యలను వేలసార్లు దానం చేశాను. ఆ ఫలంతో నేనిక్కడకు రాలేదు. లోకనాథా! గోసవయాగంలో ఒక్కొక్క బ్రాహ్మణునికి పది ఆవుల వంతున వంద కోట్ల పాడి ఆవులను దానమిచ్చాను. అదే రంగు దూడలను, బంగారు పాలపాత్రలను ఇచ్చాను. కానీ ఆఫలంతో ఇక్కడకు రాలేదు. సోమయాగ దీక్షితుడనై, ఒక్కొక్క బ్రాహ్మణునకు తొలి ఈత పాడియావులను పదింటిని, రోహిణీ జాతి గోవులను నూరింటిని ఇచ్చాను. బ్రహ్మా! పదిసార్లు పది పది లక్షల పాడి ఆవులను దానం చేశాను. కానీ ఆ ఫలంతో ఇక్కడకు రాలేదు. బాహ్లిక దేశంలో పుట్టిన లక్ష తెల్లని గుర్రాలను బంగారు మాలలతో అలంకరించి దానం చేశాను. కానీ ఆ

ఫలంతో ఇక్కడకు రాలేదు. బ్రహ్మా! ఒక్కొక్క యాగంలో ప్రతిదినమూ పదైనిమిది కోట్లు బంగారు నాణేలు దానం చేశాను కానీ ఆ ఫలంతో ఇక్కడకు రాలేదు. పితామహా! నల్లని చెవులు ఆకుపచ్చ రంగు గల గుర్రాలను బంగారు మూలలతో అలంకరించి, పదిహేడు కోట్లు దానం చేశాను. ఏడి కోలల వంటి దంతాలు, పద్మచిహ్నాలు గల పదిహేడు వేల పెద్దపెద్ద ఎనుగులను సువర్ణ మూలలతో అలంకరించి దానం చేశాను. దేవేశ్వరా. స్వచ్ఛసువర్ణ! భరణాలతో అలంకరించి, సువర్ణోపకరణాలు సమకూర్చి గుర్రాలు పూన్చిన పదిహేడు వేల రథాలను దానం చేశాను. పదిసార్లు వాజపేయయాగాన్ని నిర్వహించి, వేదాలలో దక్షిణగా విధించిన సర్వపదార్థాలను నేను దానం చేశాను. పితామహా! మెడలో పతకాలు ధరించి, పరాక్రమంతో యజ్ఞ విషయంలో ఇంద్రునివంటి వేలకొలది రాజులను యుద్ధంలో జయించి ఆ ధనంతో ఎనిమిది రాజసూయ యాగాలను అనుష్ఠించి, ఆ రాజులను బ్రాహ్మణులకు దానం ఇచ్చాను. కానీ ఆ ఫలంతో నేనిక్కడకు రాలేదు. జగత్పతీ! నేను ఇచ్చిన దక్షిణలతో గంగానది కప్పబడింది. కానీ ఆ ఫలంతో నేనిక్కడకు రాలేదు. ఆ సమయంలో వందల కొలది బంగారు నగలు అలంకరించిన రెండువేల గుర్రాలను వంద; వంద గ్రామాలను ఒక్కొక్క బ్రాహ్మణునికి ఇచ్చాను. ఆ విధంగా మూడుసార్లు ఇచ్చాను. పితామహా! ఆహారాన్ని నియంత్రించి, శాంతభావాన్ని పొంది, మౌనాన్ని పాటిస్తూ హిమాలయంపై చాలాకాలం తపస్సు చేశాను. ఆ తపఃఫలితంగా మహాదేవుడు భరింపరాని గంగాధారను తన తలపై భరించాడు కానీ నేను ఆ ఫలంతో కూడా ఇక్కడకు రాలేదు.

శమ్యాక్షేప యాగాలను చేశాను. పదివేల సాద్యస్కయాగాలను అనుష్ఠించాను. పదమూడు రోజులలో, పండ్రెండు రోజులలో ముగిసే యాగాలు చేశాను. పౌండరీక యాగాలు చేశాను. కానీ వాటి ఫలంతో ఇక్కడకు రాలేదు. తెల్లటి మూపురాలు గల ఎనిమిదివేల ఎద్దులను బ్రాహ్మణులకు దానం చేశాను. వాటి కొమ్ములకు బంగారు తొడుగులు ఉన్నాయి. మెడలో బంగారు హారాలు అలంకరించి గోవులను కూడా దానమిచ్చాను. అలసిపోకుండా అనేక మహాయాగాలు చేసి, బంగారు రత్నాల సమూహాలను, రత్న పర్వతాలను ధనధాన్య సమృద్ధమైన వేలకొలది గ్రామాలను వేలకొలది తొలి ఈత ఆవులను బ్రాహ్మణులకు దానం చేశాను. కానీ ఆ ఫలంతో ఇక్కడకు రాలేదు. బ్రహ్మా ! పదకొండు రోజులలో ముగిసే యాగాలను, ఇరవై రెండు రోజులలో ముగిసే యాగాలను సదక్షిణంగా నిర్వహించాను. అశ్వమేధ యాగాలు, పదహారుసార్లు ఆర్కాయణ యాగాలు

చేశాను. కానీ ఆ ఫలంతో ఇక్కడకు రాలేదు. నాలుగుక్రోసుల పొడవు, నాలుగు క్రోసుల వెడల్పు గల చంపకవృక్ష వనాలను, ప్రతి చెట్టును వస్త్రాలతో చుట్టి, రత్నాభరణాలతో అలంకరించి, కంఠప్రదేశంలో పతకాలను పెట్టి దానం చేశాను. కానీ ఆ దానాల ఫలంతో నేనిక్కడకు రాలేదు. ముప్పది సంవత్సరాల పాటు క్రోధరహితుడనై దుష్కరమైన తురాయణ వ్రతాన్ని చేసి, ప్రతిదినమూ తొమ్మిది వందల గోవులను బ్రాహ్మణులకు దానం చేశాను. లోకనాథా! సురేశ్వరా! కపిల జాతికి చెందిన పాడి ఆవులను, ఎన్నో ఆబోతులను ప్రతిదినమూ బ్రాహ్మణులకు దానమిచ్చాను. కానీ నేను ఆ ఫలంతో ఇక్కడకు రాలేదు. బ్రహ్మా! ప్రతిదినమూ ముప్పదిసార్లు అగ్నిచయనం చేసి, యాగం చేశాను. ఎనిమిది సర్వమేధ యాగాలను, ఏడు నరమేధ యాగాలనూ, చేశాను. నూట ఇరవై ఎనిమిది సార్లు విశ్వజిద్యాగాలను అనుష్ఠించాను. కానీ దేవేశా! వాటి ఫలంతో నేను ఇక్కడకు రాలేదు. సరయూనదీ తీరంలో, బాహుదానదీ తీరంలో, గంగానదీ తీరంలో, నైమిషారణ్యంలో పది లక్షల గోవులను దానం చేశాను. కానీ ఆ ఫలంతో ఇక్కడకు రాలేదు.

ఇంద్రుడు అనశనవ్రతాన్ని పాటించి, దానిని రహస్యంగా ఉంచాడు. ఆపై శుక్రుడు తపస్సుతో దానిని తెలిసికొన్నాడు. ఆ శుక్రుని తేజస్సుతో అది వెలుగులోకి వచ్చింది. వరేణ్యా! నేను దానిని సాధించాను. ఆపై ఆ కర్మను నేను సాధించినప్పుడు వేలకొలది బ్రాహ్మణులు, ఋషులు అక్కడకు వచ్చి ఉన్నారు. వారంతా సంతోషించారు. ప్రభూ! నన్ను బ్రహ్మలోకానికి వెళ్ళమని ఆదేశించారు. ప్రసన్నులైన ఆ వేలకొలది బ్రాహ్మణుల ఆశీస్సులతో నేను ఇక్కడకు వచ్చాను. దీనిని గురించి మరోలా ఆలోచించవద్దు. దేవేశ్వరా! నేను ఇష్టపడి యథావిధిగా అనశనవ్రతాన్ని పాటించాను. విధాతవయిన నీవు అడిగినపుడు నేను ఉన్నదున్నట్లు చెప్పాలి. అనశనం కన్నా గొప్ప తపస్సు లేదని నా అభిప్రాయం. నీకు నమస్కారం అనుగ్రహించు." భీష్ముడు చెప్తున్నాడు. "ఆ భగీరథ మహారాజు అలా అనగా బ్రహ్మ పూజార్హుడైన ఆయనను శాస్త్రోక్త పద్ధతితో పూజించాడు. కాబట్టి అనశనవ్రతాన్ని పాటిస్తూ సర్వదా బ్రాహ్మణులను పూజించు. విప్రుల ఆశీస్సులతో ఇహపరాలలో అన్నీ సిద్ధిస్తాయి. అన్న వస్త్రాలతో, గోదానంతో, మంచి నివాసగృహాలతో, శుభప్రదమైన దేవతారాధనలతో బ్రాహ్మణులను ఎప్పుడూ తృప్తిపరచాలి. ఇది పరమ రహస్యం. లోభం లేకుండా ఆచరించు."

104. ఆయుష్యాఖ్యానము.

యుధిష్ఠిరుడడిగాడు. "మనిషి వంద సంవత్సరాలు బ్రతుకుతాడని వందరకాల శక్తులతో పుడతాడని శాస్త్రాలు చెప్తున్నాయి. పితామహా! బాల్యంలోనే మనుషులెందుకు చనిపోతున్నారు ? అల్పాయువయిన మానవుడయినా ఆయుష్మంతు డెలా కాగలడు ? దేనితో కీర్తిని పొందగలడు? దేనితో సంపదను పొందగలడు ? పితామహా! మనిషి మనస్సుతో కానీ, మాటతో కానీ, చేష్టతో కానీ, తపస్సు, బ్రహ్మచర్యం, జపహోమాలు. ఓషధులు– వీటిలో దేనిని ఆచరించాలి? అది నాకు చెప్పవలసినది." భీష్ముడు చెప్తున్నాడు "నీవడిగిన దాన్ని ఇప్పుడు నీకు చెపుతాను. మానవుడు దేనితో అల్పాయుష్కు డవుతాడో. దేనితో దీర్ఘాయువు కాగలడో, దేనితో కీర్తిని పొందుతాడో, దేనితో సంపదను పొందుతాడో, ఏవిధంగా ప్రవర్తిస్తే శ్రేయస్సును పొందుతాడో వివరిస్తాను.

పురుషుడు సదాచారంతోనే ఆయుస్సును పొందుతాడు. సదాచారంతోనే సంపదను పొందగలడు. సదాచారంతోనే ఇహపరలోకాలలో కీర్తిని పొందగలడు. పురుషుడు దురాచారంతో ఇహలోకంలో ఎక్కువకాలం బ్రతకలేడు. అటువంటివానివలన ప్రాణులు బెదురుతారు. అతనిని నిరాదరిస్తారు. కాబట్టి ఆత్మశ్రేయస్సును కోరుకొనేవాడు ఈ లోకంలో సదాచారాన్ని పాటించాలి. పూర్తిగా పాపాత్ముడైనా సదాచారం అవలక్షణాలను అణచివేయగలదు. **సదాచారమే ధర్మలక్షణం, సత్పురుషులకు సత్ప్రవర్తనమే లక్షణం. శ్రేష్ఠపురుషుల నడవడియే సదాచారలక్షణం.*** ధర్మాన్ని పాటిస్తూ, లోకకళ్యాణ కార్యాలనే చేస్తూ ఉన్న పురుషుని చూడకపోయినా, అతనిని గురించి వినియే జనులు అతనిని ప్రేమిస్తారు. నాస్తికులై, క్రియాశూన్యులై, పెద్దలనూ, శాస్త్రాలనూ ఉల్లంఘిస్తూ, ధర్మమెరుగక దురాచారులైన వారు ఆయుస్సును కోల్పోతారు. శీలహీనులై, మర్యాదలను భంగం చేస్తూ, ఇతర స్త్రీలతో సంగమించే వారు ఈ లోకంలో అల్పాయుష్కులై మరణానంతరం నరకంలో పడతారు. ఏ శుభలక్షణమూ లేకపోయినా సదాచారవంతుడై, శ్రద్ధాళువై, అసూయారహితుడైన నరుడు నూరేళ్ళు జీవిస్తాడు.

క్రోధరహితుడు, సత్యవాది, భూతదయగలవాడు, అసూయారహితుడు, ఋజుస్వభావుడు అయిన నరుడు నూరేళ్ళు జీవిస్తాడు. మట్టిబెడ్డలు నలిపేవాడు, గడ్డి త్రెంపేవాడు, గోళ్ళు కొరికేవాడు, నిత్యమూ ఎంగిలిగా ఉండే అవలక్షణుడు దీర్ఘాయుస్సును

---

* ఆచారలక్షణో ధర్మ్యః సంతశ్చారిత్రలక్షణాః ।
సాధూనాం చ యథావృత్తమ్ ఏతదాచారలక్షణమ్ ॥ 9

పొందలేడు. బ్రాహ్మ ముహూర్తంలో నిదురలేవాలి. ధర్మార్థాలను గూర్చి ఆలోచించాలి. పక్కమీద నుండి లేచి, ఆచమించి, చేతులు జోడించి ప్రాతస్సంధ్యకై నిలవాలి. ఇదే రీతిగా మౌనంగా అపరసంధ్యా వేళ కూడా ఉపాసించాలి. ఉదయించే సూర్యుని కానీ, అస్తమించే సూర్యుని కానీ ఎప్పుడూ చూడకూడదు. గ్రహణవేళలో కానీ, మధ్యాహ్నవేళలో కానీ సూర్యునివైపు చూడరాదు. నీటిలో సూర్యబింబాన్ని చూడరాదు. ఋషులు నిత్యమూ సంధ్యనాచరించియే దీర్ఘాయుస్సును పొందగలిగారు. కాబట్టి సర్వదా మౌనంగా ప్రాతఃకాల సాయంకాల సంధ్యలను పాటించాలి. పూర్వసంధ్యోపాసన, సాయంసంధ్యోపాసన చేయని ద్విజులను ధార్మికుడైన రాజు శూద్రులనుగా భావించి, శూద్ర కర్మలను వారిచే చేయించాలి. ఏ వర్ణానికి చెందిన పురుషులైనా ఎప్పుడూ పరదారాసంగమం చేయదగదు. పరదారోపసేవనం వలె పురుషుని ఆయుస్సును క్షీణింపచేసే పని ఈ లోకంలో మరొకటి లేదు. పరదారోపసేవనం చేసిన పురుషుడు ఆ స్త్రీల శరీరాలలో ఎన్ని రోమకూపాలుంటాయో అన్ని సంవత్సరాల పాటు నరకంలో పడతాడు. కేశసంస్కారం, కాటుక పెట్టుకోవటం, దంతధావనం, దేవతార్చన – ఇవన్నీ పూర్వాహ్ణం (తొలిజాము)లోనే చేయాలి. మలమూత్రాలను చూడరాదు. వాటిపై అడుగు వేయరాదు, మరీ ప్రొద్దున కానీ, ప్రొద్దుపోయిన తరువాత కానీ, మిట్టమధ్యాహ్నం కానీ బయటకు వెళ్ళరాదు. అపరిచితులతో కానీ, శూద్రులతో కానీ, ఒంటరిగా గానీ యాత్ర చేయదగదు. బ్రాహ్మణునకు, గోవులకు, రాజులకు, వృద్ధులకు, బరువుమోస్తున్న వానికి, గర్భవతికి, దుర్బలునికి దారి వదలాలి. ప్రయాణ సమయంలో తెలిసిన చెట్లకు (పవిత్రంగా భావించే వాటికి) ప్రదక్షిణం చేయాలి. కూడళ్ళలో అన్నింటా ప్రదక్షిణంగానే వెళ్ళాలి. అలాగే మిట్ట మధ్యాహ్నం, రాత్రివేళ, అర్ధరాత్రిలో, పూర్వాపర సంధ్యాకాలంలో ఎప్పుడూ కూడళ్ళలో నిలువరాదు.

ఇతరులు ధరించిన చెప్పులను కానీ, వస్త్రాలను కానీ ధరించరాదు. నిత్యమూ బ్రహ్మచర్యాన్ని పాటించాలి. కాలితో కాలిని నొక్కరాదు. అమావాస్యనాడు, పౌర్ణమినాడు, ఉభయపక్షాలలోని చతుర్దశి, అష్టమీ తిథులలో స్త్రీ సంగమం తగదు. ఎవరినీ నిందించరాదు. ఎవరిమీదా అపవాదాలు వేయదగదు. చాడీలు చెప్పరాదు. ఇతరుల మర్మస్థానాలపై దెబ్బతీయరాదు. క్రూరంగా మాటాడరాదు. ఇతరులను తక్కువ చేసి చూడరాదు. ఇతరులు ఉద్వేగానికి లోనయ్యే కరకు మాట పలుకరాదు. అది పాపులలోకానికి నడిపిస్తుంది. మాటలనే బాణాలు నోటినుండి వెలువడుతాయి. అవి తగిలితే రేబవళ్ళు శోకింపజేస్తాయి. కాబట్టి ఇతరుల మర్మస్థానాలలో తగిలే మాటలను పండితుడెప్పుడూ ఇతరులతో అనదగదు.

బాణాలు బ్రద్దలు చేసినా, గొడ్డలి నరికివేసినా వనం మళ్ళీ చిగురిస్తుంది. కానీ చెడ్డమాట అనే శస్త్రంచే కలిగిన భయంకరమైన గాయం మాత్రం చెరిగిపోదు. శరీరంలో గ్రుచ్చుకొన్న కర్రులు, నాలీకాలు, నారాచాలను (బాణాలను) తొలగించవచ్చు. కానీ మనస్సులో గ్రుచ్చుకొన్న మాట అనే బాణాన్ని తొలగించలేము. అంగహీనులను, అధికాంగులను, విద్యాహీనులను, నిందితులను, రూపహీనులను, ధనహీనులను, బలహీనులను ఆక్షేపించరాదు. నాస్తికతను, వేదనిందను, దేవతలను చులకన చేయటాన్ని, పగను, అభిమానాన్ని, తీక్షణతను పరిత్యజించాలి. పుత్రులను, శిష్యులను తప్ప ఇతరులను కర్రతో కొట్టరాదు. కోపంతో నేలపై పడవేయరాదు. శిక్షించవలసివస్తే చేతితో దెబ్బవేయవచ్చు. బ్రాహ్మణులను నిందించరాదు. యాయావరులు నక్షత్రాలను వ్రేలెత్తి చూపరాదు. ఏ పక్షంలోనూ తిథిని చెప్పరాదు. అలా ఉంటే ఆయుస్సు క్షీణించదు.

అమావాస్య నాడు తప్ప ప్రతిదినమూ దంతధావనం చేయాలి. ఇతిహాస పురాణపఠనం, దానం, వేదాధ్యయనం, ఏకాగ్రతతో గాయత్రీ మంత్రజపం, సంధ్యోపాసనం ఇవన్నీ నిత్యమూ చేయాలి.

మలమూత్ర విసర్జన తరువాత, వీధిలోనుండి ఇంటిలోనికి వచ్చినపుడు, అధ్యయన భోజనాలకు ముందు కాళ్ళు కడుగు కోవాలి. ఇతరుల దృష్టి పడనివి, జలంచే కడుగబడినవి, బ్రాహ్మణుల ప్రశంసల నందినవి - ఈ మూడు బ్రాహ్మణులకు పవిత్ర పదార్థాలుగా దేవతలు కల్పించారు. హల్వా, కట్టుపొంగలి, ఫలరసం, చక్కిలం, పాయసం, వీటిని తనకోసం తయారుచేసి కొనగూడదు. దేవతా నివేదనకై సిద్ధం చేసికొనవచ్చు. నిత్యమూ అగ్నిని సేవించాలి. నిత్యమూ భిక్షను పెట్టాలి. నిత్యమూ మౌనంగా దంతధావనం చేయాలి. సంధ్యాకాలంలో నిదురించరాదు. నిత్యమూ స్నానం చేసి పవిత్రంగా ఉండాలి. సూర్యోదయం పరకు నిదురించరాదు. ఒకవేళ నిదురిస్తే ప్రాయశ్చిత్తం చేసికోవాలి. నిదురలేవగానే ముందు తల్లిదండ్రులకు నమస్కరించాలి. ఆపై గురువుకు లేదా ఇతరులకు, ఆ రీతిగా ఉంటే దీర్ఘాయుస్సును పొందవచ్చు. దంతధావనానికై నిషిద్ధమైన పుల్లలను ఎప్పుడూ వాడకూడదు. శాస్త్రవిహితకాష్ఠాలనే ఉపయోగించాలి. పర్వదినాలలో వాటిని కూడా ఏరలాలి. నిత్యమూ ఉత్తరాభిముఖుడై, సావధానుడై మలమూత్రాలను విసర్జించాలి. దంతధావనం చేయకుండా దైవపూజ చేయరాదు. దేవపూజ చేయకుండా గురువులు, వృద్ధులు, ధార్మికులు, విచక్షణులు తప్ప మరెవ్వరి దగ్గరకూ వెళ్లరాదు. పరమబుద్ధిమంతులు ఎప్పుడూ మలినమైన అద్దంలో ముఖం చూసికొనరాదు. అపరిచిత స్త్రీ దగ్గరకు గానీ, గర్భవతి దగ్గరకు కానీ వెళ్ళరాదు.

వివేకి వివాహానికి ముందు స్త్రీ సంగమం చేయరాదు. ఒకవేళ అలా జరిగితే వ్రతభంగంవలన

దోషి అవుతాడు. ప్రాయశ్చిత్తం చేసికోవాలి. పరస్త్రీలను చూడరాదు. ఏకాంతంలో పరకాంతతో ఏకాసనంపై కూర్చొనరాదు. ఇంద్రియాలను సర్వదా నియంత్రించాలి. కలలోనైనా పవిత్రహృదయుడై ఉండాలి.

ఉత్తర పశ్చిమాలలో తలపెట్టి నిదురించరాదు. వివేకి తూర్పుతలగా కానీ దక్షిణం వైపు తలపెట్టి కానీ నిదురించాలి. విరిగిన మంచం మీద కానీ, సడలిన మంచం మీద కానీ నిదురించరాదు. మరుగున ఉన్న మంచంమీద చూడకుండా శయనించరాదు. మంచంపై ఆడ్డంగా కానీ ఇతరులతో కలిసి కానీ పండుకొనరాదు. అవసరపడినప్పుడు కూడా నాస్తికుని దగ్గరకు వెళ్ళరాదు. వారు ఒట్టుపెట్టుకొన్న వారితో కలిసి వెళ్ళరాదు. ఆసనాన్ని కాలితో లాగి మనిషి దానిపై కూర్చొనరాదు. నగ్నంగా ఎప్పుడూ స్నానం చేయరాదు. రాత్రివేళ ఎప్పుడూ స్నానం చేయదగదు. వివేకి స్నానానంతరం శరీరాన్ని చేతితో మర్దించుకొనరాదు.

స్నానం చేయకుండా చందనాదులను పూసికొనరాదు. స్నానానంతరం తడిసిన వస్త్రాన్ని విదిలించరాదు. మానవుడెప్పుడూ తడిబట్టలు కట్టుకొనరాదు. మెడలోని మాలలను ఎప్పుడూ లాగరాదు. వస్త్రాల మీద వాటిని ధరించరాదు. రజస్వలతో ఎప్పుడూ మాటాడరాదు. గ్రామానికి దగ్గరగా ఉన్న పొలంలో మలవిసర్జన చేయరాదు. నీటిలో ఎప్పుడూ మలమూత్ర విసర్జన చేయరాదు.

దేవాలయంలో, గోసముదాయంలో, ఆరామాలలో వైర్లపై, విశ్రాంతి స్థానాలలో మలమూత్ర విసర్జన చేయరాదు. భోజనానంతరం, తుమ్మిన తరువాత, బాట నడచిన తరువాత, మలమూత్ర విసర్జన తరువాత తగినరీతిగా శుద్ధిచేసికొని రెండుసార్లు ఆచమించాలి. ఆచమించిన జలం హృదయాన్ని తాకాలి.

భోజనం చేయదలచినపుడు ముందుగా మూడుసార్లు ఆచమించాలి. భోజనానంతరం కూడా ఆలాగే మూడుసార్లు ఆచమించాలి. ఆపై రెండుసార్లు తుడుచుకోవాలి. నిత్యమూ తూర్పుముఖంగా కూర్చొని మౌనంగా భుజించాలి. అన్నాన్ని ఏవగించుకొనగూడదు. కొద్దిగా అన్నం మిగిల్చి ఉంచాలి. కంచంలో భోజనానంతరం మనసా అగ్నిని స్మరించాలి. తూర్పుముఖంగా భుజిస్తే ఆయుస్సు, దక్షిణముఖంగా తింటే కీర్తి, పశ్చిమముఖంగా భుజిస్తే ధనం, ఉత్తరముఖంగా తింటే సత్యం లభిస్తాయి. మనసా అగ్నిని స్పృశించి, నీటితో సకలేంద్రియాలను, సర్వావయవాలనూ, బొడ్డును, అరచేతులను స్పృశించాలి. పాట్టుమీద కానీ, బూడిద మీద కానీ, కపాలాల మీద కానీ ఎప్పుడూ కూర్చొనరాదు. ఇతరులు స్నానం చేసిన నీటి దగ్గరకు కూడా పోరాదు. శాంతిహోమాలు చేయాలి. సావిత్రీమంత్రాన్ని జపించాలి. స్వాధ్యాయం సాగించాలి. కూర్చొనియే భుజించాలి. నడుస్తూ

ఎప్పుడూ భుజించరాదు. నిలబడి మూత్రవిసర్జన చేయరాదు. బూడిదలో కానీ, గోశాలలో కానీ మూత్రవిసర్జన తగదు. తడికాళ్ళతో భుజించాలి. కానీ తడికాళ్ళతో పడుకొనరాదు. తడికాళ్ళతో భుజించినవారు నూరు సంవత్సరాలు జీవిస్తారు. అగ్ని, గోవు, బ్రాహ్మణుడు – ఈ మూడు తేజస్సులను ఎంగిలి చేతితో తాకరాదు. ఆ నియమాన్ని పాటిస్తే ఆయుస్సు తరగదు. ఎంగిలియై (భోజనానంతరం చేతులు, నోరు కడుగుకొనకుండా) సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు – ఈ మూడు తేజస్సులనూ ఎప్పుడూ చూడగూడదు.

వృద్ధులు వచ్చినప్పుడు యువకుల ప్రాణాలు పైకి లేస్తాయి. అప్పుడు లేచి, ఎదురేగి, నమస్కరిస్తే మరలా యథాస్థితికి వస్తాయి. కాబట్టి పెద్దలకు నమస్కరించాలి. స్వయంగా ఆసనాన్ని సమర్థించాలి. చేతులు జోడించి సేవించాలి. వారు బయలుదేరితే వెనుకనే నడిచి సాగనంపాలి. విరిగిన మంచంపై కూర్చొనరాదు, పగిలిన కంచంలో అన్నం తినరాదు. ఒకే వస్త్రం ధరించి భుజించరాదు. నగ్నంగా స్నానం చేయరాదు. నగ్నంగా నిదురించరాదు, ఎంగిలితో శయనించరాదు. ఎంగిలిచేతితో తలను తాకరాదు. ప్రాణాలన్నీ తలనే ఆశ్రయించి ఉంటాయి. జుట్టు పట్టిలాగటం, తలపై కొట్టడం తగదు. వాటిని విడవాలి. రెండు చేతులు కలిపి తలపై గీరుకొనరాదు. అదే పనిగా శిరఃస్నానం చేయరాదు. వీటిని పాటిస్తే ఆయుస్సు క్షీణించదు. నూనెతో తలంటుకొన్నప్పుడు ఆ చేతితో దేనినీ స్పృశించరాదు. నూనెతో చేసిన పదార్థాలు తినరాదు. ఆ నియమాన్ని పాటిస్తే ఆయుస్సు క్షీణించదు. అలాగే ఎంగిలి నోటితో చదువు చెప్పరాదు, చదువుకొనరాదు. దుర్గంధంతో గాలి వీస్తున్నప్పుడు మనసా కూడా స్వాధ్యాయాన్ని గురించి ఆలోచించరాదు. ప్రాచీన విషయాల నెరిగిన పండితులు ఈ విషయంలో యముడు పలికిన గాధలను ప్రస్తావిస్తుంటారు – "ఎంగిలి నోటితో పరుగెత్తినా, అధ్యయనం చేసినా వారి ఆయుస్సును హరిస్తాను. వారి సంతతిని లాక్కుంటాను. అనధ్యయన సమయంలో కూడా ద్విజుడు మోహంతో అధ్యయనం చేస్తే అతని వేదజ్ఞానం నశిస్తుంది. ఆయుస్సు క్షీణిస్తుంది. కాబట్టి జాగరూకుడై అనధ్యయనకాలంలో ఎప్పుడూ అధ్యయనం చేయరాదు." సూర్యునకభిముఖంగా, అగ్నికి అభిముఖంగా, గోబ్రాహ్మణులకభిముఖంగా, మార్గమధ్యంలో మూత్ర విసర్జన చేసినవారు ఆయుస్సును కోల్పోతారు. పగలు ఉత్తరముఖంగా, రాత్రి దక్షిణాభిముఖంగా మలమూత్ర విసర్జన చేయాలి. అలా ఆచరిస్తే ఆయుస్సు క్షీణించదు. దీర్ఘకాలం జీవింపదలచినవాడు బ్రాహ్మణుడు, పాము, క్షత్రియుడు – ఈ ముగ్గురూ కృశించినా కూడా వారిని విడువకూడదు. ఈ ముగ్గురు విషపూరితులు. కోపించిన పాము తన దృష్టి పారినంతమేర కాటువేసి దహిస్తుంది. క్షత్రియుడు క్రుద్ధుడైతే తేజస్సు

ప్రసరించినంతమేర దహిస్తాడు. బ్రాహ్మణుడు కోపిస్తే తన దృష్టి, తన సంకల్పం ప్రసరించినంతమేర వంశాన్ని దహిస్తాడు. కాబట్టి వివేకి ఈ ముగ్గురినీ ప్రయత్నపూర్వకంగా సేవించాలి.

గురువుతో ఎప్పుడూ మొండికి దిగరాదు. గురువుకు కోపం వస్తే సర్వవిధాలా గౌరవించి ప్రసన్నుని చేసికోవాలి. గురువు లేనిపోని విధంగా ప్రవర్తించినా ఆయన దగ్గర చక్కగానే ప్రవర్తించాలి. గురునింద మనుష్యుల ఆయుస్సును నిస్సంశయంగా దహిస్తుంది. ఆత్మహితాభిలాషి ఇంటికి దూరంగా మూత్రవిసర్జన చేయాలి. దూరంగా కాళ్ళు కడుక్కోవాలి. దూరంగానే ఉమ్మివేయాలి. పండితుడు ఎర్రటి పూలను ధరించరాదు. తెల్లటి పూలమాలలనే ధరించాలి. రాజా! తామరలు, కలువల విషయంలో ఈ నియమం వర్తించదు. తలపై ఎర్రటిపూలను, అడవిపూలను ధరించాలి. బంగారుమాలను ధరిస్తే అది ఎప్పుడూ అపవిత్రం కాదు. స్నానానంతరం నిత్యమూ తడి చందనాన్ని నుదుటపెట్టుకోవాలి. ధీమంతుడైన నరుడు వస్త్రాలను (ఉత్తరీయం, అధరీయం) తారుమారు చేయకూడదు. ఇతరులు ధరించిన వస్త్రాన్ని కానీ, అంచుచిరిగిన వస్త్రాన్ని కానీ ధరించకూడదు. నరోత్తమా! నిదురించేటప్పుడు వేరే వస్త్రాలు ధరించాలి. వీధులలో సంచరించేటప్పుడు, దేవతార్చన సమయంలోనూ వేరువేరు బట్టలను ధరించాలి. బుద్ధిమంతుడు నల్ల ఆవాలు, చందనం, బిల్వం, తగరం, కేసరం - వీటిని విడివిడిగానే శరీరలేపనానికి వినియోగించాలి. అన్ని పర్వదినాలలోనూ స్నానం చేసి, పవిత్రుడై, అలంకరించుకొని, ఉపవాసం చెయ్యాలి పర్వకాలాలలో ఎప్పుడూ బ్రహ్మచర్యాన్ని పాటించాలి.

ఒకే పాత్రలో ఎవరితోనూ కలిసి భుజించరాదు. రజస్వల ముట్టిన అపవిత్రమైన అన్నాన్ని తినరాదు. సారం నశించిన అన్నాన్ని తినరాదు. ఇతరుల దృష్టిపడిన అన్నాన్ని ఇతరులకు పెట్టకుండా భుజించరాదు. వివేకి అపవిత్రమనుష్యుల దగ్గర కానీ, సత్పురుషుల ఎదుట కూర్చొని కానీ భుజించరాదు. ధర్మశాస్త్రాలలో నిషేధించిన పదార్థాలను తినరాదు. అన్నం వైపు వీపు చూపిస్తూ కూడా భుజింపరాదు. శ్రేయస్కాముడు పిప్పలాన్ని, మర్రిపండ్లను, జనుము ఆకు/గంజాయి ఆకు, అత్తిపండును తినరాదు. వివేకి ఉప్పును చేతిలో పెట్టుకొని ఆస్వాదించరాదు, తినరాదు, రాత్రిపూట పెరుగును, పేలపిండిని తినరాదు. మాంసం తినదగనిది. దానిని విడిచిపెట్టాలి. ఉదయమూ, సాయంకాలమూ మాత్రమే భుజించాలి. అదీ సావధానంగా, మధ్యలో ఏమీ తినరాదు, వెంట్రుకలు పడిన అన్నాన్ని శత్రువు పెట్టే శ్రాద్ధాన్నాన్ని తినరాదు. భోజన సమయంలో మౌనం పాటించాలి. ఒకే వస్త్రాన్ని ధరించి భుజించరాదు. సరిగా కూర్చోకుండా ఎప్పుడూ తినదగదు. పదార్థాలను నేలపై నుంచి

తినరాదు. నిలబడి కానీ, చప్పుడు చేస్తూ కానీ తినరాదు. వివేకి మఁంచుగా అతిథులకు అన్నపానీయాలను అందించి ఆపై ఏకాగ్రతతో తాను భుజించాలి. పంక్తిలో అందరికీ సమానంగా భోజ్యపదార్థాలను పెట్టాలి. మిత్రులకు పెట్టకుండా తిన్ననాడు హాలాహలవిషాన్ని భక్షించినట్లే. నీటిని, పాయసాన్ని, పేలపిండిని, పెరుగును, తేనెను తప్ప మిగిలిన వాటిని తాను తిని, మిగిల్చి (ఎంగిలి) ఇతరులెవ్వరికీ పెట్టకూడదు. భుజిస్తూ పదార్థాలను శంకించకూడదు. ఆత్మశ్రేయస్సును కోరేవాడు భోజనాంతంలో పెరుగును తినరాదు. భోజనానంతరం ఆచమించి, నోరు కడుగుకోవాలి. ఒకేచేత్తో కాలిబొటన వ్రేలిని కడుగు కోవాలి.

ప్రయోగంలో నేర్పరి అయిన నరుడు తలపై చేతిని ఉంచి, ఏకాగ్రతతో అగ్నిని మనసా స్పృశించి దాయాదులలో మిన్న కాగలడు. నీటితో ఇంద్రియాలను (కన్ను, ముక్కు, వగైరా), నాభిని స్పృశించి, రెండు అరచేతులను కడుగుకోవాలి. కడుగుకొన్న తరువాత తడిచేతితో ఉండకూడదు (తుడుచుకోవాలి) బొటనవ్రేలి మూలస్థానాన్ని బ్రహ్మతీర్థమంటారు. చిటికెనవ్రేలు వెనుకభాగాన్ని దేవతా తీర్థమంటారు. బొటనవ్రేలు, చూపుడువ్రేలు, వీటి మధ్యభాగాన్ని పితృతీర్థమంటారు. శాస్త్రవిధిననుసరించి, ఆ ప్రదేశంద్వారానే ఎప్పుడూ జలంతో పితృకార్యాలను చేయాలి. శ్రేయస్కాముడు ఎప్పుడూ ఇతరులను నిందింపదగదు. అప్రియంగా మాటాడకూడదు. ఎవ్వనిపై కోపాన్ని ప్రదర్శించగూడదు. పతితులతో సంభాషించగూడదు. వారిని కనీసం చూడకూడదు. వారితో కలిసి ఉండకూడదు. ఈ నియమాలు పాటిస్తే దీర్ఘాయుస్సు లభిస్తుంది. పగటిపూట మైథునం తగదు. కన్యతో కానీ, బంధకితో కానీ సంగమించదగదు. ఋతుస్నానం చేయకముందు భార్యతో కలియకూడదు. ఈ నియమాలు పాటిస్తే దీర్ఘాయుస్సు లభిస్తుంది. పనిబడ్డప్పుడు తనతన తీర్థంలో ఆచమించి, మూడుసార్లు నీరు త్రాగి, రెండుమార్లు తుడుచుకోవాలి. అప్పుడు నరుడు పవిత్రుడవుతాడు. మానవుడు ఇంద్రియాలను ఒకసారి స్పృశించి, మూడుసార్లు సంప్రోక్షణ చేసికొని, వేదోక్త పద్ధతితో పితృకార్యాలను నిర్వహించాలి.

కౌరవా! బ్రాహ్మణులకై భోజనారంభంలో, భోజనాన్ని ముగించేటప్పుడూ పవిత్రమూ, హితకరమూ అయిన శౌచవిధానాన్ని చెపుతా విను. సర్వశౌచక్రియలలోనూ బ్రాహ్మణుడు బ్రాహ్మతీర్థం నుండి ఆచమించాలి. ఉమ్మిన తరువాత, తుమ్మిన తరువాత ఆచమిస్తే తాను పవిత్రుడవుతాడు. వయస్సుమళ్ళిన దాయాది, మిత్రుడు, దరిద్రుడు, కులీనుడు, పండితుడు ఎవరైనా సరే దరిద్రులయితే తన శక్తి ననుసరించి వారిని రక్షించాలి. వారికి ఇంటిలో ఆశ్రయమివ్వాలి. దానితో ధనమూ, ఆయుస్సు వృద్ధినందుతాయి. పావురాలు,

చిలుకలు, మైనాలు – ఇవి ఇంటిలో ఉండటం శుభకరం, గబ్బిలాలు వలె ఇవి ఇంటనుండటం పాపం కాదు.

దేవతా ప్రతిమలు, అద్దం, చందనం, పుష్పలతలు, నిర్మలజలం, బంగారం, వెండి ఇంటిలో ఉండటం, మంగళకరం.

ఉద్దీపకాలు, గ్రద్దలు, అడవి పావురాలు, తుమ్మెదలు ఇంట ప్రవేశిస్తే శాంతిని జరిపించాలి. ఇవి అశుభహేతువులు, మహాత్ముల నింద కూడా శుభకరం కాదు. మహాత్ముల రహస్యాలను ఎప్పుడూ ఎవ్వరికీ చెప్పగూడదు. అగమ్యస్త్రీలతో సంగమింపరాదు. రాజపత్నుల దగ్గరకు కానీ, వారి చెలికత్తెల దగ్గరకు కానీ వెళ్ళరాదు. రాజేంద్రా! వైద్యులు బాలురు, వృద్ధులు, సేవకులు, బంధువులు, బ్రాహ్మణులు, శరణార్థులు, విద్యాలవారు – వీరికి సంబంధించిన స్త్రీల దగ్గరకు పోరాదు. అలా పాటిస్తే దీర్ఘాయుస్సును పొందవచ్చు. శ్రేయస్కాముడైన ప్రాజ్ఞుడు బ్రాహ్మణులు, స్థపతులు కలిసి నిర్మించిన ఇంటిలోనే నివసించాలి. సంధ్యాకాలంలో నిదురించరాదు, విద్యాధ్యయనం చేయరాదు. భుజించరాదు, అలా పాటించిన మేధావి దీర్ఘాయుస్సును పొందగలడు. తన శుభాన్ని కోరుకునేవాడు రాత్రివేళ పితృకర్మలు చేయరాదు. భోజనానంతరం క్షురకర్మ చేయించరాదు. రాత్రివేళ స్నానం చేయరాదు. రాత్రివేళ పేలపిండిని తినరాదు. భోజనానంతరం మిగిలిన పానీయాలను కానీ, నీటిని కానీ విడిచిపెట్టాలి. రాత్రివేళ మొహమాటంతో భుజించరాదు. మొహమాటంతో భుజింపజేయరాదు. భోజనానంతరం పరుగెత్తరాదు. పక్షులను చంపరాదు. ఒకవేళ పక్షిమాంసం తిన్నా, తాను చంపి తినరాదు.

మహాప్రాజ్ఞుడైన నరుడు గొప్ప వంశంలో పుట్టి, మంచి లక్షణాలు కలిగి, తగిన వయస్సులో ఉన్న కన్యనే వివాహమాడాలి. భారతా! ఆపై పిల్లలను కని, వంశాన్ని ప్రతిష్ఠింపజేసి, జ్ఞానవంశాచార శిక్షణలకై వారిని గురువులకప్పగించాలి. కూతురు పుడితే కులీనుడు, బుద్ధిమంతుడైన వరునితో వివాహం జరిపించాలి. కొడుకుల పెండ్లి కూడా ఉత్తమ కులకాంతలతో జరిపించాలి. సేవకులను కూడా ఉత్తమ వంశాల నుండి గ్రహించాలి. దైవకార్యాలు కానీ పితృకార్యాలు కానీ తలకు స్నానం చేసిన తర్వాతనే చేయాలి. నరుని జన్మ నక్షత్రంలో, పూర్వాభాద్రా, ఉత్తరాభాద్రలలో కృత్తికా నక్షత్రంలో శ్రాద్ధాన్ని చేయకూడదు. దారుణ నక్షత్రాలలోనూ (ఆశ్లేష, ఆర్ద్ర, జ్యేష్ఠ మొదలయినవి), ప్రత్యక్తారలోనూ, జ్యోతిషశాస్త్రం నిషేధించిన నక్షత్రాలలోనూ దేవపితృకార్యాలు చేయదగదు. రాజేంద్రా! మనిషి తూర్పుముఖంగా కానీ, ఉత్తర ముఖంగా కానిక్షారం చేయించుకోవాలి. అలా చేస్తే దీర్ఘాయుస్సును పొందవచ్చు. భరతర్షభా! సజ్జనులను, గురువులను, వృద్ధులను, కులస్త్రీలను, ఇతరులను ఎవ్వరినీ

నిందించగూడదు. తనను తాను నిందించుకొనరాదు. నింద అధర్మకారణ మవుతుంది. నరోత్తమా! అంగహీనురాలినీ, అధికంగా అవయవాలు గలదానినీ, సగోత్రురాలిని, మాతృవంశంలో పుట్టిన దానిని వివాహమాడరాదు. వృద్ధురాలు, సంన్యాసిని, పతివ్రత, హీనవర్ణానికి చెందినది, అధిక వర్ణానికి చెందినది – ఇటువంటి స్త్రీలకు దూరంగా ఉండాలి. జాతి తెలియని స్త్రీతో, హీనజాతికి చెందిన స్త్రీతో, విచక్షణుడు, సంగమించరాదు. పాలిపోయిన రంగు గలదానిని, కుష్ఠురోగం గలదానిని నీవు పెండ్లాడరాదు. రాజా! అపస్మారకులు, హీనులు, బొల్లి, క్షయ, రోగులు – ఈ వంశాలలో పుట్టినదానితో వివాహం తగదు. శుభలక్షణాలు, ప్రశస్తమైన లక్షణాలు గలిగి, మనోహరమై, చూడముచ్చటగా నున్నదానిని నీవు పెండ్లాడవచ్చు. యుధిష్ఠిరా! తన శ్రేయస్సును కోరుకొనేవాడు తనకన్న మిన్నగా ఉన్న వంశంనుండి కానీ సమానస్థాయి గల వంశం నుండి కానీ స్త్రీని స్వీకరించవచ్చు. తక్కువదానిని, భ్రష్టురాలిని* పెండ్లాడదగదు.

ప్రయత్నపూర్వకంగా అగ్నిని పుట్టించి, స్థాపించి, బ్రాహ్మణులు చెప్పిన సమస్తవేద విహిత కార్యాలను అనుష్ఠించాలి. స్త్రీలపై ఈర్ష్య పడరాదు. సర్వవిధాలా భార్యను రక్షించాలి. ఈర్ష్య ఆయుస్సును పోగొడుతుంది. కాబట్టి ఈర్ష్య తగదు. పగటి నిద్ర ఆయుస్సును క్షీణింపజేస్తుంది. నిదురలేచిన తర్వాత మరలా నిదురించటమూ అంతే. ఉదయంపూట, సాయంసంధ్యలో నిదుర తగదు. అపవిత్రతో రాత్రి నిదురింపదగదు. పరపత్నీ సమాగమమూ, క్షురకర్మ తరువాత స్నానం చేయకుండా ఉండటమూ ఆయుస్సును క్షీణింపజేస్తాయి. అలాగే అపవిత్రతతో వేదాధ్యయనాన్ని ప్రయత్నపూర్వకంగా పరిత్యజించాలి. సంధ్యాకాలంలో తినరాదు, స్నానం చేయరాదు, చదువరాదు. నియతచిత్తుడై ధ్యానాదులను చేయవచ్చు, మరేపనీ చేయగూడదు. రాజా! బ్రాహ్మణపూజ, దేవతా ప్రణామం, గురువులకభివాదనం స్నానానంతరమే చేయాలి. పిలువని పేరంటానికి వెళ్ళగూడదు. యజ్ఞసందర్శనకు మాత్రం పిలుపు లేకపోయినా వెళ్లవచ్చు. భారతా! మన్ననలేని చోటికి వెళ్ళటం ఆయుస్సును క్షీణింపచేస్తుంది. ఒంటరిగా పరదేశాలకు వెళ్ళరాదు. రాత్రివేళ ప్రయాణం చేయరాదు. సంధ్యాకాలానికి ముందే ఇంటికి చేరాలి. **నరోత్తమా! తల్లి! తండ్రి, గురువులు శాసించిన దానిని చేయవలసిందే, అది హితమనిపించవచ్చు. లేదా అహిత మనిపించవచ్చు. ఆ ఆలోచన చేయరాదు.***

---

* **మాతుః పితుర్గురూణాం చ కార్యమేవానుశాసనమ్ ।**
హితం చాప్యహితం చాపి న విచార్యం నరర్షభ ॥ 144

రాజా! ధనుర్వేదాభ్యాసం, వేదాధ్యయనం వీటికై ప్రయత్నించాలి. ఏనుగు, గుర్రం, వీటిపై స్వారీ చేయటం, రథాన్ని నడపటం, వీటిని ప్రయత్న పూర్వకంగా అభ్యసించాలి. ఆ ప్రయత్నం చేసిన రాజే సుఖిస్తాడు. శత్రువులకు, సేవకులకు, తనవారికి ఎదిరించరానివాడవుతాడు. ప్రజాపాలనపై ఆసక్తి ఉన్నవాడు ఎప్పుడూ హాని పొందడు. నీవు తర్కశాస్త్రాన్ని, వ్యాకరణశాస్త్రాన్నీ తెలిసికొని ఉండాలి. రాజా! సంగీతాన్ని, సకలకళలను గ్రహించి ఉండాలి. పురాణేతిహాసాలను, ఆఖ్యానాలను, మహాత్ముల చరితలనూ నిత్యమూ వింటుండాలి. వివేకి భార్య రజస్వల అయినపుడు సంగమింపరాదు. నాల్గవ రోజు స్నానం చేసిన తరువాత రాత్రివేళ కలియవచ్చు. అయిదవ రోజు సంగమిస్తే పుత్రిక, ఆరవరోజు సంగమిస్తే పుత్రుడు పుడతాడు. (ఇక్కడ అయిదు ఆరు అన్నవి విషమ సమసంఖ్యలకు ప్రతీకలు కావచ్చు). ఈ విధిననుసరించి పండితుడు భార్యతో సంగమించాలి. దాయాదులను, వియ్యాలవారిని, మిత్రులను సర్వవిధాలా పూజించాలి. రాజా! యథాశక్తిగా వివిధ దక్షిణలనిస్తూ యాగాలు చేయాలి. గృహస్థ జీవనానంతరం వానప్రస్థుడై అరణ్యంలో నివసించాలి. యుధిష్ఠిరా! ఆయుస్సును కలిగించే లక్షణాలను నీకు ఇలా సంక్షేపంగా చెప్పాను. మిగిలిన విశేషాలను వేదజ్ఞానంలో వృద్ధులైన వారినుండి గ్రహించాలి. ఆచారం సంపదను కలిగిస్తుంది. ఆచారం కీర్తిని పెంచుతుంది. ఆచారంతో ఆయుస్సు పెరుగుతుంది. ఆచారమే అవలక్షణాలను నశింపజేస్తుంది. ఆగమాలు అన్నీ ఆచారమే శ్రేష్ఠమంటాయి. ఆచారం నుండి ధర్మం పుడుతుంది. ధర్మంవలన ఆయుస్సు పెరుగుతుంది. కీర్తిని, ఆయుస్సును, స్వర్గప్రాప్తిని కలిగే ఈ మహాకళ్యాణమార్గాన్ని సర్వవర్ణాల మీద దయతో బ్రహ్మ ఉపదేశించాడు.

రాజా! ఈ విషయాన్ని నిత్యమూ విన్నవాడు, వినిపించినవాడు ఈ సదాచారవ్రతం కారణంగా శుభలోకాలను పొందుతాడు.

105. జ్యేష్ఠ కనిష్ఠ వృత్తి.

యుధిష్ఠిరుడు అడిగాడు. "భరతర్షభా! జ్యేష్ఠుడు కనిష్ఠులతో ఎలా ప్రవర్తించాలి? అలాగే కనిష్ఠులు జ్యేష్ఠునితో ఎలా ప్రవర్తించాలి? అది నాకు చెప్పు. భీష్ముడు చెప్తున్నాడు. "నాయనా! నీవు జ్యేష్ఠుడవు, ఎప్పుడూ జ్యేష్ఠునివలెనే ప్రవర్తించాలి. భారతా! గురువు శిష్యులను చూసినట్లుగానే నీవు సోదరులను చూడాలి. భారతా! గురువు లేదా అన్న అవివేకంగా ప్రవర్తిస్తే శిష్యుడు లేదా సోదరుడు అదుపులో నిలవడు. గురువుకు దీర్ఘదృష్టి ఉంటే శిష్యునకు కూడా అది అలవడుతుంది. అంధుడుగా ఉండవలసిన సమయంలో అంధుడుగానే ఉండాలి. జడుడై ఉండాలి. విచక్షణుడై ఉండాలి. తెలిసి కూడా తెలియనట్లు

నటిస్తూ వారిలోని దోషాలను తొలగించటానికి అనుగుణంగా ప్రవర్తించాలి. కౌంతేయా! తమ్ములు తప్పుచేసినపుడు ప్రత్యక్షంగా దండిస్తే వారు భిన్న హృదయులై దానిని ప్రచారంలో పెడతారు. అప్పుడు ఆ రాజు ఐశ్వర్యంతో తపించిపోతున్న శత్రువులు భేదాలను సృష్టించే ప్రయత్నం చేస్తారు. జ్యేష్ఠుడే వంశాన్ని వర్ధిల్లజేయగలడు. నీతి తప్పితే నాశనం చేయగలడు కూడా. జ్యేష్ఠుడు నీతిని సరిగా తెలియకపోతే తాను పుట్టిన వంశాన్ని పూర్తిగా నశింపజేస్తాడు. జ్యేష్ఠుడు నీతి తప్పి చిన్నవారితో కుటిలంగా ప్రవర్తిస్తే తాను జ్యేష్ఠుడూ కాడు, జ్యేష్ఠభాగానికి యోగ్యుడూ కాడు. ఇతర రాజులు అటువంటివానిని నియంత్రించాలి. కపటంగా ప్రవర్తించేవాడు నిస్సంశయంగా నరకంలో పడతాడు. అటువంటి వాని పుట్టుక వేతసకుసుమం వలె ఆ తండ్రికి నిరర్థకమే. ఆ పాపపురుషుడు తాను పుట్టిన వంశంలో అన్ని అనర్థాలకు కారణమవుతాడు. అపకీర్తిని కలిగిస్తాడు. కీర్తిని మాయం చేస్తాడు. కనిష్ఠులు పాపకర్మాసక్తులైతే వారంతా పైతృకమైన ఆస్తిని పొందటానికి అర్హులు కారు. కానీ కనిష్ఠులకు వారి భాగమివ్వకుండా జ్యేష్ఠుడు పైతృక సంపత్తిని పొందరాదు. పైతృకమైన సంపదకు హాని కల్గించకుండా జ్యేష్ఠుడు పరదేశంలో స్వీయశక్తితో సంపదలను పొందితే, తన కిష్టం లేకపోతే ఆ సంపదలో కనిష్ఠులకు వాటా ఇవ్వనక్కరలేదు.

సోదరులు విడిచిపోకుండా కలిసి ఉన్నతిని సాధిస్తే, తండ్రి జీవించి ఉండగానే భాగాలు పంచవలసి వస్తే, తండ్రి ఎప్పుడూ అందరికీ సమానంగానే పంచిపెట్టాలి. పెద్దవాడు చెడ్డవాడైనా, మంచి వాడైనా చిన్నవారు అతనిని అవమానించరాదు. స్త్రీ లేదా తమ్ముడు దారితప్పితే అన్న వారిని శ్రేయోమార్గంలో నడపాలి. ధర్మవేత్తలు ధర్మమే శ్రేయస్కరమంటారు. **పదిమంది ఆచార్యులకన్నా ఉపాధ్యాయుడు, పదిమంది ఉపాధ్యాయులకన్నా తండ్రి, తండ్రికన్నా పదిరెట్లు తల్లి గొప్ప, తల్లి తన గౌరవంతో సమస్త భూమినీ కూడా కాదనగలదు. కాబట్టి తల్లివంటి గురువు లేడు.*** భారతా! తల్లి అందరికన్నా మిన్న. అందుకే జనులు తల్లిని గౌరవిస్తారు. తండ్రి చనిపోతే పెద్ద అన్నను తండ్రిగా భావించాలి. పెద్ద అన్న తమ్ములకు జీవికను కల్పించి, వారిని పోషించాలి. తమ్ములు అన్నకు తలవంచి, ఆయన చెప్పినట్లు నడుచుకోవాలి. అన్నను తండ్రిగానే భావించి ఆయన ప్రాపులోనే జీవితాన్ని గడపాలి. తల్లి, తండ్రి ఈశరీరాన్ని సృష్టిస్తారు. ఆచార్యుల ఉపదేశంతో పొందే

---

* దశాచార్యానుపాధ్యాయ ఉపాధ్యాయాన్ పితా దశ ॥ 14
దశ చైవ పితౄన్ మాతా సర్వాం వా పృథివీమపి ।
గౌరవేణాభిభవతి నాస్తి మాతృసమో గురుః ॥ 15

(జ్ఞాన) జీవితం సత్యమైనది. అదే అజరామరమైంది. భరతశ్రేష్ఠా! పెద్దఅక్క తల్లితో సమానం. అన్న భార్యకూడా తల్లితో సమానం. చిన్నతనంలో పాలు ఇచ్చినవారు (దాదులు) కూడా తల్లితో సమానం.

106. ఉపవాస విధి.

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా! సర్వవర్ణాలవారికీ, మ్లేచ్ఛులకూ కూడా ఉపవాసంపై బుద్ధి పుడుతోంది. కారణం తెలియటం లేదు. బ్రాహ్మణులు, క్షత్రియులు నియమాలను పాటించాలని నేను విన్నాను. ఉపవాసంతో వారికెటువంటి లాభం చేకూరుతుంది వారెలా ప్రవర్తించాలి ? అందరికీ వర్తించే నియమాలను, ఉపవాసాలను గురించి చెప్పు. ఉపవాసపరాయణుడు ఏ గతిని పొందగలడు? ఉపవాసం మహాపుణ్యం. ఉపవాసమే ఆశ్రయింపదగింది. ఈ లోకంలో ఉపవసించినవాడు ఏ ఫలితాన్ని పొందుతాడు? ఏ పనిచేస్తే పాపవిముక్తిని పొందగలడు? ఏ పనిచేస్తే పుణ్యాన్ని (ధర్మాన్ని) పొందగలడు? ఏ క్రియద్వారా స్వర్గాన్ని, పుణ్యాన్ని పొందగలడు ? ఉపవాసం తర్వాత మనిషి ఏ దానం చేయాలి? ఏ ధర్మం ద్వారా సుఖాన్ని, ధనాన్ని పొందగలడు? అది నాకు చెప్పు." వైశంపాయనుడు చెప్తున్నాడు. ధర్మజ్ఞుడైన యుధిష్ఠిరుడు అలా అడగగా ధర్మతత్త్వవేత్త, శంతనుసుతుడు అయిన భీష్ముడు ధర్మ రాజుతో ఇలా అన్నాడు. భీష్ముడు చెప్తున్నాడు. రాజా! ఉపవాసవిధిలోని గొప్ప గుణాలను గురించి నేను గతంలో ఎప్పుడో విన్నాను. ఇప్పుడు నీవు నన్ను అడిగినట్లే నేను గతంలో తపోధనుడైన ముని అంగిరసుని అడిగాను. నేను అలా ప్రశ్నించగా అగ్ని సంభవుడైన ఆ పూజ్యుడు పవిత్రమైన ఉపవాస విధిని గూర్చి ఇలా చెప్పాడు.

"పురుషశ్రేష్ఠా! కురునందనా! బ్రాహ్మణులు, క్షత్రియులు మూడు రాత్రులు ఉపవసించాలి. ఒక్కొక్కప్పుడు ఏడురాత్రులు ఉపవసించవచ్చు. వైశ్యులు కానీ, శూద్రులు కానీ మోహానికి లోనై మూడురాత్రులో, రెండు రాత్రులో ఉపవసించినా ప్రయోజనమేమీ లేదు. వైశ్యులు కానీ, శూద్రులు కానీ నాల్గుపూటలు (రెండు పగళ్లు, రెండు రాత్రులు) ఉపవసించవచ్చు. ధర్మప్రసక్తులు, ధర్మజ్ఞులు అయిన పండితులు త్రిరాత్రోపవాసాన్ని వారికై విధించలేదు. భారతా! పంచమినాడు కానీ, షష్ఠినాడు కానీ, పౌర్ణమినాడు కానీ మనస్సును, ఇంద్రియాలను నియంత్రణలో ఉంచుకొని ఉపవసిస్తూ సహనశీలుడు, రూపసంపన్నుడు, పండితుడు కాగలడు, ఆ ప్రాజ్ఞుడు ఎప్పుడూ సంతానహీనుడు కానీ, దరిద్రుడు కానీ కాడు. కౌరవ్యా! భగవత్పూజా పరాయణుడై పంచమి, షష్ఠి, అష్టమి, కృష్ణచతుర్దశి దినాలలో

తన ఇంట బ్రాహ్మణులకు భోజనం పెట్టి తాను ఉపవసిస్తే రోగహీనుడు, బలశాలి కాగలడు. మార్గశీర్షమాసంలో ఒక పూట భుజించి, తన శక్తిని అనుసరించి బ్రాహ్మణులకు భోజనం పెట్టినవాడు వ్యాధులనుండి పాపాల నుండి విముక్తి నందగలడు. సర్వకళ్యాణ సంపూర్ణుడై, అన్నిరకాల ఓషధులను పొందగలడు, మార్గశీర్షమాసంలో ఉపవసించినవాడు. మరుసటి జన్మలో వ్యాధి రహితుడు, బలశాలి కాగలడు. అప్పుడు వ్యవసాయంలో భాగస్వామియై బహుధనధాన్య సంపన్నుడు అవుతాడు. కొంతేయా! ఒంటిపూట భోజనంతో పుష్యమాసాన్ని గడిపినవాడు, సౌభాగ్యవంతుడు, రూపవంతుడు, కీర్తిమంతుడు కాగలడు. మాఘమాసంలో నియమపూర్వకంగా ఏకభుక్తంతో గడిపినవాడు సంపన్నుల ఇంట జన్మించి, జ్ఞాతులలో గొప్పవాడు కాగలడు. ఫాల్గుణ మాసాన్ని ఒంటిపూట భోజనంతో గడిపినవాడు స్త్రీలకు ఇష్టుడవుతాడు. స్త్రీలు అతనికి లోబడుతారు. చైత్రమాసాన్ని నియమపూర్వకంగా ఏకభుక్తంతో గడిపినవాడు బంగారం, మణులు, ముత్యాలలో సంపన్నమైన మహావంశంలో జన్మిస్తాడు. పురుషుడైనా, స్త్రీ అయినా జితేంద్రియులై వైశాఖ మాసాన్ని ఒంటిపూట భోజనంతో గడిపితే దాయాదులలో శ్రేష్ఠులవుతారు. పురుషుడు కానీ, స్త్రీ కానీ జ్యేష్ఠమాసాన్ని ఏకభుక్తంతో గడిపితే అసామాన్యమైన మహైశ్వర్యాన్ని పొందుతారు. ఆషాఢమాసాన్ని అలసత లేకుండా ఒంటిపూట భోజనంతో గడిపితే పుష్కలంగా ధనధాన్యాలనూ, సంతానాన్ని పొందగలడు. నియతేంద్రియుడై, శ్రావణమాసాన్ని ఏకభుక్తంతో గడిపితే సర్వతీర్థాలలోను స్నానం చేసిన పుణ్యం లభిస్తుంది. జ్ఞాతులను వర్ధిల్లజేస్తుంది. ఆషాఢమాసాన్ని ఒంటిపూట భోజనంతో గడిపిన నరుడు గోధనసంపన్నుడై, సమృద్ధిని, నిశ్చలైశ్వర్యాన్ని పొందుతాడు. అదేరీతిగా ఆశ్వయుజమాసాన్ని ఏకభుక్తంతో గడిపిన వాడు. పవిత్రుడు, వాహన సంపన్నుడై, చాలామంది కొడుకులను పొందగలడు. కార్తీకమాసంలో ఒంటిపూట భోజనంతో ఉన్నవాడు శూరుడు, కీర్తిమంతుడై చాలామంది భార్యలను పొందుతాడు. ఉపవాసంతో నెలలను గడిపే వారు పొందే ఫలితాలను చెప్పాను. తిథులకు సంబంధించిన ఆ నియమాలను చెపుతాను, విను.

పదిహేను దినాలకు ఒక సారి భుజించే వారు గోసంపన్నుడు, బహుపుత్రుడు అవుతాడు. చాలామంది భార్యలను పొందుతాడు. పండ్రెండు సంవత్సరాల పాటు ప్రతి మాసంలోనూ త్రిరాత్ర వ్రతాన్ని పాటించినవారు శత్రువులు లేని నిర్మల గణాధిపత్యాన్ని పొందగలరు. ప్రవృత్తిమార్గంలో నడిచేవాడు ఈ నియమాల నన్నింటినీ పండ్రెండు సంవత్సరాల పాటు పాటించాలి. ఉదయం, సాయంకాలం మాత్రమే భుజిస్తూ, మధ్యలో నీరు కూడా

త్యాగక, అహింసాతత్పరుడై, నిత్యమూ అగ్ని హోత్రహోమం చేస్తున్న వాడు ఆరు సంవత్సరాలలో సిద్ధిని పొందగలడు. ఈ విషయంలో సంశయం లేదు. ఆ మానవుడు అగ్నిష్టోమయజ్ఞఫలాన్ని కూడా పొందుతాడు. ఆ నరుడు రజోగుణరహితుడై, పుణ్యాత్ముడై వేలకొలదిగ దివ్యకాంతలతో నిండి, నృత్యగీతాలతో ప్రతి ధ్వనిస్తున్న అప్సరోభవనాలలో క్రీడిస్తారు. మేలిమిబంగారు వన్నె గల విమానాన్ని ఎక్కి, బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ పూర్తిగా వేయిసంవత్సరాల తరువాత ఈ లోకానికి వచ్చి మహాత్ము డవుతాడు. ఒక సంవత్సరం పాటు పూర్తిగా ఏకభుక్తంతో గడిపిన నరుడు అతిరాత్రియజ్ఞ ఫలాన్ని పొందుతాడు. ఆ మనిషి పదివేల సంవత్సరాల పాటు స్వర్గలోకంలో వెలుగొందుతాడు. పుణ్యం క్షీణించిన తరువాత ఈ లోకానికి వచ్చి మహాత్ము డవుతాడు. ఒక సంవత్సరం పాటు పూర్తిగా నాలుగుపూటల కొకసారి భుజిస్తూ, అహింసాతత్పరుడై, నిత్యమూ సత్యవచనుడై, జితేంద్రియుడై ఉన్నవాడు వాజపేయ యజ్ఞఫలాన్ని పొందుతాడు. పదివేల సంవత్సరాలపాటు స్వర్గలోకంలో విరాజిల్లుతాడు.

ఆరుపూటల కొకసారి భుజిస్తూ సంవత్సరకాలాన్ని గడిపిన నరుడు అశ్వమేధయాగ ఫలాన్ని పొందుతాడు. అతడు చక్రవాకాలు మోసే విమానంలో స్వర్గానికి వెళ్ళి ఇరవైనాలుగు వేల సంవత్సరాలు స్వర్గలోకంలో ఆనందంగా గడుపుతారు. ఎనిమిది పూటల కొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపిన మానవుడు గోమయయజ్ఞ ఫలితాన్ని పొందుతాడు. అతడు హంసలు, బెగ్గురు పక్షులు మోసే విమానంలో స్వర్గానికి వెళ్ళి ఏబదివేల సంవత్సరాల పాటు అక్కడ ఆనందంగా గడుపుతాడు. పదిహేను రోజులు కొకసారి భుజిస్తూ సంవత్సర కాలం గడిపినవారు ఆరుమాసాలపాటు ఉపవాసం చేసిన ఫలితాన్ని పొందగల రని అంగిరుడన్నాడు. అతడు అరవైవేల సంవత్సరాలపాటు స్వర్గంలో నివసిస్తాడు. రాజా! వీణ, పల్లకి, వేణువు- ఈ వాద్యాల మంచి ఘోషలతో, మధుర శబ్దాలతో నిదురనుండి మేల్కొలుపబడతాడు. నాయనా! రాజా! నెలకొకసారి నీటిని త్రాగుతూ సంవత్సరకాలం గడిపిన నరుడు విశ్వజిద్యాగ ఫలితాన్ని పొందుతాడు. అతడు సింహాలు, పులులు మోసే విమానంలో స్వర్గానికి వెళ్ళి అక్కడ డెబ్బదివేల సంవత్సరాలపాటు ఆనందంగా గడుపుతాడు. నెలకుమించి ఉపవసించటం విధి విధానం కాదు. రాజా! ఈ రీతిగా ధర్మవేత్తలు ఉపవాసవిధిని చెప్పారు. బాధ లేకుండా, వ్యాధులు లేకుండా ఉపవాసవ్రతాన్ని, పాటించిన వాడు పదేపదే యజ్ఞాలు చేసిన ఫలితాన్ని నిస్సంశయంగా పొందుతాడు. రాజా! హంసలు మోసే విమానంలో అతడు స్వర్గానికి వెళ్ళి అక్కడ లక్ష సంవత్సరాల పాటు ఆనందంగా గడుపుతాడు, వందలకొలది అప్సరసలు ఆ నరుని సుఖపెడతారు. బాధలకు, వ్యాధులను గురియై

కూడా ఉపవాసదీక్షను చేపట్టిన వాడు లక్ష సంవత్సరాలు పాటు స్వర్గంలో ఆనందంగా గడుపుతాడు. నిదుర నుండి లేచే సమయంలో కాలిమువ్వల సవ్వడులతో మేల్కొలుపబడుతాడు. వేయిహంసల విమానంలో ప్రయాణిస్తాడు. స్వర్గానికి వెళ్ళి పండులస్త్రీలతో నిండిన భవనంలో క్రీడిస్తాడు. లోకంలో బలహీనులను శక్తిమంతులను చేయటం కనిపిస్తుంది. గాయపడ్డవాని గాయాలను మాన్పించటం, వ్యాధిగ్రస్తునకు ఔషధసమూహాల నివ్వటం, కోపించిన వానిని అనునయించటం, అర్థంకోసమో, గౌరవం కోసమో దుఃఖిస్తున్న వాని దుఃఖాన్ని నివారించటం కనిపిస్తాయి. కానీ స్వర్గాన్ని, అక్కడ సుఖాలను కోరుకొనే వానికి ఇటువంటి ఐహిక సుఖాలు రుచించవు. ఆ పై ఆ పురుషుడు పవిత్రుడై, చక్కగా అలంకరించుకొని. వందలకాలం స్త్రీలతో నిండి, సువర్ణ సదృశమై, కోరికల నెలవైన ఏడంతస్తులమేడలో క్రీడిస్తాడు. పాపాలు తొలగి, సఫల సంకల్పుడై, స్థిరంగా సుఖిస్తాడు.

ఉపవాసంతో శరీరత్యాగం చెసిన మానవుడు ఈ క్రింది ఫలితాన్ని పొందుతాడు. బంగారు కాంతిలో బాలభానునివలె ప్రకాశిస్తూ, వైడూర్యాలు, ముత్యాలు పొదగబడి, వీణా మృంగధ్వనులతో ప్రతి ధ్వనిస్తూ, పతాకలతో, దీపికలతో వ్యాప్తమై, దివ్యఘంటా నినాదాలతో మురిపిస్తూ, వేలకొలది స్త్రీలతో నిండిన విమానాలపై సుఖిస్తాడు. ఆయన శరీరంపై ఎన్ని రోమకూపాలు ఉంటాయో అన్ని వేల సంవత్సరాలు స్వర్గంలో ఆనందంగా గడుపుతాడు. **వేదం కన్న గొప్ప శాస్త్రం లేదు. తల్లివంటి గురువు లేదు. ధర్మాన్ని మించిన లాభం లేదు. ఉపవాసాన్ని మించిన తపస్సు లేదు.*** ఇహపరలోకాల్లో బ్రాహ్మణుల కన్న పవిత్రమైనది ఏదీ లేదు. ఉపవాసాలతో సమానమైన తపస్సు లేదు. దేవతలు యధావిధిగా ఉపవాసాలు చేసి స్వర్గాన్ని పొందుతారు. బుషులు కూడా ఉపవాసాలతో ఉత్తమసిద్ధిని పొందారు. ధీమంతుడైన విశ్వామిత్రుడు వేలకొలది దివ్య సంవత్సరాలు ఏక భుక్తంతో, సహనంతో తపించి బ్రాహ్మణత్వాన్ని పొందాడు. చ్యవనుడు, జమదగ్ని, వసిష్ఠుడు, గౌతముడు, భృగువు ఈ మహర్షు లందరూ క్షమాశీలులై ఉపవాసాలు చేసి స్వర్గాన్ని పొందారు. దీనిని గతంలో అంగిరుడు మహర్షులకు ప్రదర్శించాడు. దీనిని నిత్యమూ ప్రచారంలో పెట్టినవాడు దుఃఖించడు. కౌంతేయా! మహర్షి అంగిరుడు ప్రవర్తింపజేసిన ఈ ఉపవాస విధిని యధాక్రమంగా నిత్యమూ చదివినవాడు, విన్నవాడు పాపవిముక్తి

---

* **నాస్తి వేదాత్ పరం శాస్త్రం నాస్తి మాతృసమో గురుః ।**
న ధర్మాత్ పరమో లాభః తపో నానశనాత్ పరమ్ ॥ 65

నందుతాడు. అతడు సర్వపాపాల నుండి ముక్తు డవుతాడు. మనస్సును దోషాలు అంటలేవు. ఆ నరోత్తముడు ఇతరజాతుల (పశుపక్ష్యాదుల) మాటలను అర్థం చేసికొనగలడు, శాశ్వతకీర్తిని పొందగలడు.

107. ఉపవాస వ్రత ఫలవర్ణనము.

యుధిష్ఠిరు అలా అడిగాడు. "మహాత్ములయిన పితామహులు-తమరు యథావిధిగా వివిధ యజ్ఞాలను గూర్చి వివరంగా చెప్పారు. ఇహపరలోకాలలో వీటి ఫలితాలను కూడా యథాతథంగా చెప్పారు. యజ్ఞాలకు ఉపకరణాలు చాలా కావాలి, విస్తృతంగా వివిధ సంభారాలను సమకూర్చు కోవాలి. కాబట్టి దరిద్రులు యజ్ఞాలు చేయలేరు. రాజులు కానీ రాజకుమారులు కానీ యజ్ఞాలు చేయగలరు. తగినంతధనం లేక. గుణసంపత్తి లేక, తోడు, సహాయాలు లేని వారు యజ్ఞాలు చేయలేరు. తగినంత ధనం లేక, గుణసంపత్తి లేక, తోడు, సహాయంలేని దరిద్రులు కూడా చేసి, మహాయజ్ఞాలతో సమానమైన ఫలితాన్ని పొందగల విధివిధాన మేది! పితామహా! నాకు చెప్పండి"

భీష్ముడు చెప్తున్నాడు". యుధిష్ఠిరా! అంగిరుడు చెప్పిన ఈ ఉపవాసవిధి యజ్ఞఫలాలతో సమానమైన ఫలితాన్ని ఇవ్వగలది. దానిని చెపుతా, విను. ఉదయమూ, సాయంకాలమూ మాత్రమే భుజించి మధ్యలో నీరు కూడా త్రాగకుండా నిలిచి, అహింసాతత్పరుడై, నిత్యమూ అగ్నిహోత్రహోమాన్ని చేస్తున్న నరుడు ఆరు సంవత్సరాలలో సిద్ధిని పొందగలడు. ఈ విషయంలో సంశయం లేదు. ఆ నరుడు మేలిమి బంగారు వన్నెగల విమానాన్ని పొందగలడు: అగ్నివలె తేజస్వంతమయిన ప్రజాపతిలోకంలో నృత్యగీతాలతో ప్రతిధ్వనించే దివ్యకాంతల భవనంలో వందకోట్ల సంవత్సరాలు నివసిస్తాడు. ధర్మపత్నీరతుడై, మూడుసంవత్సరాల పాటు నిరంతరంగా ఏకభుక్తంతో ఉన్నవాడు అగ్నిష్టోమఫలాన్ని పొందుతాడు. బహుళసువర్ణ దక్షిణలతో ఇంద్రుని కిష్టమైన యజ్ఞాన్ని అనుష్ఠిస్తూ, సత్యవంతుడు, దానశీలుడు, బ్రాహ్మణ భక్తుడు, అసూయారహితుడు, క్షమాశీలుడు, జితేంద్రియుడు, జితక్రోధుడై ఉన్ననరుడు పరమగతిని పొందగలడు. తెల్లని మేఘాలవలె ప్రకాశిస్తూ, హంసలక్షణాలుగల ఏడంతస్తులమేడలో రెండు పద్మసంవత్సరాలు ముగిసే వరకూ అప్సరసలతో కూడి నివసిస్తాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ, రెండుదినాలకు ఒకసారి భుజిస్తూ సంవత్సరం పాటు నిత్యమూ అగ్ని కార్యతత్పరుడై, నిత్యమూ ప్రాతఃకాలంలోనే మేల్కొనే మానవుడు అగ్నిష్టోమ యాగఫలితాన్ని పొందుతాడు. ఆ నరుడు

హంసలు బెగ్గురుపక్షులు మోసే విమానాన్ని పొందగలడు. ఇంద్రలోకంలో అందమైన స్త్రీల మధ్య నివసించగలడు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ, మూడు దినాలకు ఒక సారి చొప్పున సంవత్సరం పాటు భుజిస్తూ నిత్యమూ అగ్నికార్యతత్పరుడై, నిత్యమూ ప్రాతఃకాలంలోనే మేల్కొనే వాడు ఉత్తమ మైన అతిరాత్ర యజ్ఞ ఫలితాన్ని పొందగలడు. ఆ నరుడు నెమళ్ళు, హంసలు మోసే విమానాన్ని పొందుతాడు. అప్సరలతో కూడి సపర్వులలోకంలో సదా నివసిస్తాడు. మూడు పద్మ సంవత్సరాల కాలం తర్వాత తిరిగి వస్తాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమాన్ని నిర్వహిస్తూ నాలుగు రోజుల కొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపినవాడు ఉత్తమమైన వాజపేయ యజ్ఞఫలాన్ని పొందుతాడు.

ఆ నరుడు దేవకాంత లెక్కిన విమానాన్ని ఎక్కుతాడు. సాగరపర్యంతమూ ఉన్న ఇంద్రలోకంలో నివసిస్తాడు. అక్కడ నిత్యమూ దేవరాజ క్రీడను చూస్తుంటాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమాన్ని చేస్తూ అయిదు రోజులకొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపి, లోభ రహితుడై, సత్య వాదియై, బ్రాహ్మణ భక్తుడై, హింసను విడనాడి, అసూయారహితుడై, పాపకర్మలకు దూరమై ఉన్నవాడు ద్వాదశాహ యజ్ఞఫలాన్ని పొందుతాడు. అతడు సువర్ణమయమై, హంసలక్షితమై, సూర్యకిరణకాంతివలె ప్రకాశించే దివ్యశ్వేత విమాన సౌధంలో నివసిస్తాడు. అక్కడ నలభైవేడు పద్మ సంవత్సరాలకాలం సుఖంగా ఉంటాడు. నిత్యమూ అగ్ని హోత్రహోమంచేస్తూ, ఆరురోజుల కొకసారి చొప్పున భుజిస్తూ, సంవత్సరం పాటు ప్రతి దినమూ త్రిసంధ్యలలో స్నానం చేస్తూ, బ్రహ్మచారియై, అసూయారహితుడై గడిపిన ముని ఉత్తమమైన గోమేధయజ్ఞఫలాన్ని పొందగలడు. అతడు అగ్ని జ్వాలలవలె ప్రకాశిస్తూ, హంసలు, నెమళ్ళు సేవించే ఉత్తమ విమానాన్ని పొందుతాడు. అది బంగారు తాపటం గలది. అదేరీతిగా అప్సరసల ఒడిలో నిదురించి, నూపురనినాదాలతో, మేఖలల సవ్వడులతో మేల్కొలుపబడతాడు. అతడు రెండు పతాకలు (మహాపద్మాలు), పద్దెనిమిది పద్మాలు, ఒకకోటి మూడు వందల కోట్లు, ఏబది అయుతాల సంవత్సరాల పాటు ఇంకా వంద ఎలుగుబంట్ల చర్మంలో ఎన్ని వెంట్రుకలు ఉంటాయో అన్ని సంవత్సరాల పాటు బ్రహ్మలోకంలో విరాజిల్లుతాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ ఏడు రోజులు కొకసారి లెక్కన భుజిస్తూ సంవత్సరం పాటు, మాటను అదుపులో నుంచుకొని, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ; పూలమాలలను, చందన లేపనాలను, మధువును, మాంసాన్ని పరిత్యజించిన పురుషుడు మరుల్లోకానికి, ఇంద్రలోకానికి వెళతాడు. అక్కడ సర్వత్ర సిద్ధమనోరథుడై దేవకన్యల పూజల నందు కొంటాడు. బహుళసువర్ణ దానాలతో యజ్ఞం చేసిన ఫలితాన్ని

పొందుతాడు. లెక్క కందనన్ని సంవత్సరాలు ఆలోకాలలో ఆనందంగా గడుపుతాడు. నిత్యమూ అగ్ని హోత్రహోమం చేస్తూ, దేవకార్యతత్పరుడై, సహనశీలుడై ఎనిమిది రోజుల కొకసారి భుజించిన నరుడు ఉత్తమమైన పౌండరీకయాగ ఫలితాన్ని పొందుతాడు. అతడు తామరలవన్నెగల విమానాన్ని ఎక్కుతాడు. అక్కడ బంగారు వన్నె, శ్యామలవర్ణం గలిగిన పదహారు సంవత్సరాల వంటి ప్రాయం గల స్త్రీలను, ఇంకా నూతన యౌవనం, రూపం, విలాసంగల స్త్రీలను నిస్సంశయంగా పొందుతాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ, తొమ్మిది రోజుల కొకసారి చొప్పున భుజిస్తూ సంవత్సరకాలం గడిపిన నరుడు వేయి అశ్వమేధయాగాలు అనుష్ఠిస్తే వచ్చే ఉత్తమ ఫలితాన్ని పొందుతాడు. అతడు తామరవలె ప్రకాశించే విమానాన్ని పొందుతాడు. దివ్యమాలలు ధరించి, ప్రజ్వలించే సూర్యాగ్నులవలె తేజస్వినులైన రుద్రకన్యలు అతనిని సనాతనమైన అంతరిక్షలోకానికి తీసికొనిపోతారు. అక్కడ ఒక కల్పము, లక్ష కోట్ల పద్దెనిమిదివేల సంవత్సరాలు సుఖానుభవం పొందుతాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ పదిరోజులకొకసారి చొప్పున సంవత్సరం పాటు భుజించిన వాడు, సర్వభూతాలకు మనోహరమై బ్రహ్మకన్యలు నివసించే స్థానానికి వెళ్ళి వేయి అశ్వమేధయాగాలు చేసినవారు పొందే ఉత్తమ ఫలితాన్ని పొందుతాడు. ఆ నూతన పురుషుని రూపవతులయిన కన్యలు ఆనందింపజేస్తారు. అతడు నల్లకలువలు, ఎర్రకలువల వంటి వన్నె గలిగి, చిత్రమణి మాలలచే అలంకరింపబడి, శంఖధ్వనులచే ప్రతిధ్వనింపబడిన ఉత్తమ విమానయానాన్ని పొందుతాడు. అది మండలాకృతిలో తిరుగగలది. సుడులవలె క్లిష్టమైన భ్రమణాలు చేయగలది. కడలిఅలలవలె పైకి క్రిందికి పయనించగలది. ఆ విమానంలో స్ఫటికాలు, వజ్రసారమణుల స్తంభాలుంటాయి. చక్కని వేదిక లుంటాయి. హంసలు, బెగ్గురు పక్షుల కలధ్వనులు వినిపిస్తాయి. ఆ మహాయానాన్ని అతడు అధిరోహిస్తాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ పదుకొండురోజుల కొకసారి లెక్కన సంవత్సరం పాటు హవిస్సును భుజిస్తూ మనసా వాచా కూడా పరస్త్రీని కోరకుండా, తల్లిదండ్రుల కోసమైనా అసత్యమాడకుండా గడిపినవాడు విమానంలో నున్న మహాబలుడైన మహాదేవుని సన్నిధికి వెళతాడు. వేయి అశ్వమేధయాగాలు చేసినవాడు పొందే ఉత్తమఫలితాన్ని పొందుతాడు. అతడు బ్రహ్మ పంపగా తన దగ్గరకు స్వయంగా వచ్చిన విమానాన్ని చూస్తాడు. బంగారు వన్నె, అందమూగల యువతులు అతనిని దివ్యమనోహరమైన రుద్రుని వాసానికి కొనిపోతారు. అతడక్కడ ప్రళయకాలాన్ని వంటి తేజోవంతమైన రూపాన్ని ధరించి లెక్కలేనన్ని సంవత్సరాలుంటారు. ఒక లక్షవేయి కోట్ల సంవత్సరాల పాటు ప్రతిదినమూ దేవదానవ సమ్మతుడైన రుద్రునకు నమస్కరింపగలుగుతాడు. ఆ

రుద్రుడు ప్రతి రోజూ అతనికి దర్శనమిస్తాడు. సంవత్సరకాలం పాటు పన్నెండు రోజుల కొకసారి హవిష్యాన్ని భుజించినవాడు సర్వమేధయాగ ఫలాన్ని పొందుతాడు. ద్వాదశాదిత్యులవలె కాంతిమంతమైన విమానం (మేడ) అతనికై కల్పింపబడుతుంది. విలువైన మణులు దాని చుట్టూ పగడాలతో అది శోభిస్తుంది, హంసశ్రేణులు దాని చుట్టూ ఉంటాయి. నాగశ్రేణులతో అది వ్యాప్తమై ఉంటుంది. నెమళ్ళ కేకారవాలతో, చక్రవాకాల కలరవాలతో అది అందగిస్తుంటుంది. భవనం పై పెద్దపెద్ద గదులుంటాయి. రాజా! బ్రహ్మలోకంలోని ఆ భవనం నిత్యమూ పురుషులతో, స్త్రీలతో నిండి ఉంటుంది. మహాభాగుడు, ధర్మవేత్త అయిన అంగిరసమహర్షి ఇది చెప్పాడు. ఎప్పుడూ పదమూడురోజుల కొకసారి హవిష్యాన్నాన్ని భుజిస్తూ సంవత్సరకాలం గడిపిన వాడు దేవసత్రయాగఫలాన్ని పొందుతాడు. అతనికి రక్తపద్మోదయ మని పేరుగల విమానం లభిస్తుంది. అది బంగారుతాపటంతో, రత్నసమూహాలతో అలంకరింపబడి ఉంటుంది. దివ్యాభరణాలతో శోభిస్తుంది. దానిలో దివ్యకాంతలు నిండి ఉంటుంది. పవిత్రసుగంధం అక్కడ వ్యాపించి ఉంటారు. ఆ దివ్యవిమానంలో వాయు సంబంధమైన ఉపకరణాలు అమర్చబడి ఉంటాయి. ఈ ఉపవాసవ్రతాన్ని పాటించినవాడు అక్కడ ఆ బ్రహ్మలోకంలో రెండు శంఖాలు, రెండు పతాకలు, ఒక కల్పం, ఒక చతుర్యుగం, పదికోట్లు, నాలుగు పద్మాల కాలం నివసిస్తాడు. అక్కడ దేవకన్యలు గీత వాద్యఘోషలతో, భేరీ పణవ ధ్వనులతో ఈ నరుని ఆనందింపజేస్తూ పూజిస్తారు.

పదునాలుగు రోజుల కొకసారి హవిష్యాన్నాన్ని భుజిస్తూ సంవత్సరం పాటు గడిపినవాడు మహామేధ యజ్ఞ ఫలాన్ని పొందుతాడు. వర్ణనల కందని యౌవనం, రూపంగల దేవకన్యలు చక్కగా అలంకరించుకొని, శుద్ధమైన మేలిమి బంగారు అంగదాలను ధరించి విమానాలపై అతనిని తీసికొనిపోతారు. అక్కడ నిదురించిన ఆ నరుడు కలహంసల కూజితాలతో, నూపురాల ధ్వనులతో, మొలనూలి సవ్వడులతో మేల్కొలుపబడుతాడు. ఆ నరుడు గంగానదీతీరంలోని ఇసుకరేణువులన్ని సంవత్సరాలు ఆ దేవకన్యానివాసంలో నివసిస్తాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమాన్ని చేస్తూ, జితేంద్రియుడై, సంవత్సరకాలం పాటు పదిహేను రోజుల కొకసారి భుజించిన నరుడు వేయి రాజసూయయాగాలు చేసిన ఉత్తమ ఫలితాన్ని పొందుతాడు. హంసలు, నెమళ్ళు సేవించే దివ్యవిమానాన్ని అధిరోహిస్తారు. విమానం బంగారుతాపటంతో, మణిమండలాలతో చిత్రంగా ప్రకాశిస్తుంది. దివ్యాభరణాలతో ప్రకాశించే స్త్రీలు దానికి శోభను కలిగిస్తారు. ఆ విమానానికి ఒకటే స్తంభం. నాలుగు ద్వారాలు. ఏడు అంతస్తులు. అది మంగళప్రదమైనది. వేల కొలది పతాకలతో, గీత

నాదాలతో అది అందగిస్తుంది. మణులతో, ముత్యాలతో, పగడాలతో అలంకరింపబడి, మెరుపుల వంటికాంతి గలిగి దివ్యగుణ సంపన్నమైన ఆ దివ్య విమానాన్ని అధిరోహిస్తాడు. ఖడ్గమృగాలు, ఏనుగులు, అతనికి వాహనాలు అవుతాయి. వేయియుగాలు పాటు అక్కడ నివసిస్తాడు.

నిరంతరాయంగా పదహారు రోజులకొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపినవాడు సోమయాగఫలితాన్ని పొందుతాడు. అతడు సోమకన్యల భవనాలలో నిత్యమూ నివసిస్తాడు. సౌమ్యగంధాలను పూసికొని, తన ఇష్టం వచ్చినట్లు సంచరిస్తుంటాడు. అతడు ఏడంతస్తుల మేడలో మధురంగా మాటాడే దివ్య సుందరీమణుల పూజల నందుకొంటూ, కామభోగాలను సేవిస్తాడు. ఆ నరుడు వంద పద్మాలు, పది మహాకల్పాలు, నాలుగు చతుర్యుగాల పాటు ఆ పుణ్యఫలాన్ని అనుభవిస్తాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ పదిహేడురోజుల కొకసారి చొప్పున భుజిస్తూ సంవత్సరకాలం గడిపినవాడు వరుణ ఇంద్ర, రుద్ర, మరుత్, శుక్ర బ్రహ్మలోకాలకు వెళతాడు. అక్కడ దేవకన్యలు అతనికి ఆసనాన్ని ఇచ్చి సేవిస్తారు. అతడు భూలోకాన్నీ, భువర్లోకాన్నీ, విశ్వరూపుడైన దేవర్షిని చూస్తాడు. అక్కడ దేవాధిదేవుని కూతుళ్ళు ముప్పయి రెండు మంది అతనిని ఆనందింపజేస్తారు. వారు అందగత్తెలు, మధురభాషిణులు, చక్కగా అలంకరించు కొన్నవారు. సూర్య చంద్రులు ఆకాశంలో సంచరిస్తున్నంత కాలం ఆ ధీరుడు అక్కడ సుధను, అమృత రసాన్ని సేవిస్తూ సంచరిస్తారు. సంవత్సరకాలం పాటు పద్దెనిమిది రోజుల కొకసారి భుజించిన వాడు సప్తలోకాలను చూడగలుగుతాడు. అతని వెంట జయజయధ్వానాలతో రథాలు నడుస్తాయి. చక్కగా అలంకరింపబడి ప్రకాశిస్తున్న ఆ రథాలపై దేవకన్యలు కూర్చొని ఉంటారు. పులులు, సింహాలు మోసే ఉత్తమ దివ్యవిమానాన్ని అతడు సుఖంగా అధిరోహిస్తాడు. ఆ విమానం మేఘగర్జనల వలె ధ్వనిస్తుంది. అతడు అక్కడ వేయికల్పాల కాలం ఆ కన్యలతో కూడి ఆనందిస్తాడు. అమృతం వంటి ఉత్తమ సుధారసాన్ని సేవిస్తాడు.

నిరంతరంగా సంవత్సరకాలం పాటు పంతొమ్మిది రోజుల కొకసారి భుజించిన వాడు సప్తలోకాలను చూడగలుగుతాడు. అప్సరసల సమూహాలు సేవించే ఉత్తమస్థానాన్ని పొందుతాడు. సూర్య సమానతేజస్సుగల విమానాన్ని పొందుతాడు. అది గంధర్వగీతాలతో నినదిస్తుంటుంది. అక్కడ దివ్యవస్త్రాలను ధరించి, శ్రీమంతుడై, చింత లేకుండా అమరకాంతలతో పదికోట్లు సంవత్సరాలు ఆనందంగా గడుపుతాడు. ఇరవైరోజుల కొకసారి భుజిస్తూ, సత్యవాదియై, సదా ధృతవ్రతుడై, మాంసభక్షణాన్ని మాని, బ్రహ్మచారియై, సర్వ భూతహితాసక్తుడై సంవత్సరకాలం గడిపినవాడు విశాలరమణీయాలైన ఆదిత్యలోకాలను

పొందుతాడు. దివ్యమాలలు, దివ్యానులేపనాలతో శోభిస్తున్న గంధర్వులు, అప్సరసలు మనోహరాలయిన సువర్ణ విమానాలతో అతని వెంట నడుస్తారు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ ఇరవైయొక్క రోజుల కొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపినవారు శుక్రాచార్య దేవేంద్రుల దివ్యలోకాలకు వెళతాడు. అశ్వినీకుమార, మరుల్లోకాలకు కూడా వెళతాడు. సర్వదా సుఖాసక్తుడై దుఃఖ మంటూ తెలియక, శ్రేష్ఠమైన విమానంపై అందగత్తెల సేవల నందుకొంటూ శక్తి మంతుడైన దేవతలవలె సంచరిస్తాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ, ఇరవైరెండు రోజుల కొకసారి భుజిస్తూ సంవత్సరకాలం అహింసాతత్పరుడై ధీమంతుడై, సత్యవచనుడై, అసూయారహితుడై గడిపిన వాడు సూర్యునివలె తేజస్వియై, శ్రేష్ఠ విమానాన్ని అధిరోహించి వసులోకాలకు వెళతాడు. అక్కడ దివ్యాభరణాలు ధరించి కామచారి, అమృతాహారియై దేవకన్యలతో కూడి సుఖిస్తాడు. ఇరవైమూడు రోజులు కొకసారి భుజిస్తూ, మితాహారుడు, సదా జితేంద్రియుడై సంవత్సరకాలం గడిపినవాడు వాయు, శుక్ర, రుద్రలోకాలకు వెళతాడు. అతడు అనేక గుణాలుగల శ్రేష్ఠవిమానాన్ని అధిరోహించి, కామచారియై, స్వేచ్ఛాసంచారియై అప్సరోగణాల పూజల నందగలడు. ఆ లోకాలలో దివ్యాభరణాలు ధరించి దేవకన్యలతో క్రీడించగలడు.

నిత్యమూ అగ్నిహోత్రహోమం చేస్తూ ఇరవై నాలుగు రోజుల కొకసారి హవిష్యాన్నాన్ని భుజిస్తూ సంవత్సరకాలం గడిపిన వాడు దివ్యమాలలను, దివ్య వస్త్రాలను, దివ్యగంధాలను, దివ్యానులేపనాలను ధరించి ఆదిత్యలోకంలో ఆనందంగా చిరకాలం నివసిస్తాడు. హంసలతో కూడి మనోరంజకమైన దివ్యసువర్ణ విమానంలో వేలకొలదిగ, పదివేలకొలదిగ ఉన్న దేవ కన్యలతో రమిస్తాడు. నిరంతరంగా ఇరవై అయిదు రోజుల కొకసారి భుజిస్తూ, సంవత్సరకాలం గడిపినవాడు సర్వసమృద్ధమైన విమానాన్ని అధిరోహిస్తాడు. మేఘగర్జన వంటి ధ్వనులు గలిగి, సింహాలు పులులు లాగే నిర్మల, మంగళకర, సువర్ణ విమానాల నెక్కి దేవకన్యలు జయజయ ధ్వానాలతో అతని వెంట వెళతారు. అక్కడ సుమనోహరమై, దివ్యమైన ఉత్తమ విమానంపై (మేడ) వేయికల్పాల పాటు అమృతోపమమైన ఉత్తమ సుధారసాన్ని ఆస్వాదిస్తూ వందలకొలది కాంతలు చుట్టూ ఉండగా నివసిస్తాడు. నిత్యమూ అగ్నిహోత్రహోమాన్ని చేస్తూ ఇరవైయారు రోజుల కొకసారి భుజిస్తూ, నియమంతుడై, నియతాహారుడై సంవత్సర కాలం జితేంద్రియుడై, రాగరహితుడై గడిపిన మహాభాగుడు అప్సరోగణాలచే పూజింపబడతూ సప్త మరుల్లోకాలకు, అష్టవసులోకాలకు వెళతాడు. సర్వరత్నాలతో అలంకరింపబడిన స్ఫటికదివ్య విమానాలతో కూడి గంధర్వులు, అప్సరసల పూజ లందుకొంటూ దివ్యతేజోమయుడై దేవతల లెక్కలో రెండువేల దివ్య యుగాలపాటు

అక్కడ ఆనందంగా గడుపుతాడు.

నిత్యమూ అగ్నిహోత్రహవనం చేస్తూ ఇరవైయేడు రోజుల కొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపినవాడు పుష్కల ఫలాన్ని పొందుతాడు దేవలోకంలో పూజింపబడతాడు. రాజా! అక్కడ అమృతాన్ని భుజిస్తూ, తృష్ణారహితుడై ఆనందంగా గడుపుతాడు. దివ్యశరీరుడై రాజర్షులు వినిపించే దేవర్షుల చరిత్రను వింటూ, శ్రేష్ఠ విమానంపై నుండి, మనోహరలయిన సుందరస్త్రీలతో మదమత్తుడై మూడువేల యుగాలు, మూడువేల కల్పాల పాటు సుఖిస్తాడు. జితమనస్కుడై, జితేంద్రియుడై ఇరవైయెనిమిది రోజుల కొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపిన వాడు దేవర్షులు పొందే విస్తృత ఫలితాన్ని పొందుతాడు. అక్కడ భోగశాలియై నిర్మల సూర్య తేజస్సుతో ప్రకాశిస్తాడు సూర్యునివలె ప్రకాశించే మనోహరమైన విమానంలో బలిసినస్తనాలు, తొడలు, జఘనాలు గలిగి మంచి తేజస్సు గల యువతులు దివ్యాభరణాలను అలంకరించుకొని తాము ఆనందిస్తూ అతనిని ఆనందింపజేస్తారు. కోరికల నన్నింటినీ తీర్చగల ఆ దివ్య విమానంలో పదిలక్షల కల్పాలపాటు అతడు సుఖిస్తాడు. సదా సత్యవ్రతపరాయణుడై ఇరవైతొమ్మిది రోజుల కొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపినవాడు దేవర్షులు, రాజర్షులు సేవించే దివ్యపుణ్యలోకాలను పొందుతాడు. సువర్ణమయమై, సర్వరత్న సమన్వితమై సామగ్రీ సమువేత మై సూర్యచంద్ర ప్రకాశంగల దివ్యవిమానాన్ని పొందుతాడు. ఆ విమానం అప్సరస్సమూహాలతో నిండి, గంధర్వగానంతో ప్రతిధ్వనిస్తుంటుంది. అక్కడ మదమత్తలై మనోహరలై, సుందరులై దివ్యాభరణాలు అలంకరించుకొన్న మంచి స్త్రీలు అతనిని వినోదింపజేస్తారు. అక్కడ అతడు భోగశాలియై, తేజస్వియై, అగ్ని వంటి కాంతి గలిగి దివ్యశరీరంతో అమరుల వలె ప్రకాశిస్తూ, దివ్య భావసంపన్నులై వసులోకాలకు, మరులోకాలకు, సాధ్యులలోకాలకు, అశ్వినుల లోకాలకు, రుద్రబ్రహ్మలోకాలకు వెళతాడు.

నిత్యమూ శాంతస్వభావుడై నెలకొకసారి భుజిస్తూ సంవత్సరకాలం గడిపినవాడు బ్రహ్మలోకాన్ని చేరుతాడు. అక్కడ అమృతరసాన్ని ఆహారంగా స్వీకరిస్తూ, అందరి మనస్సులను ఆకట్టుకొంటూ, శ్రీమంతమైన రూపాన్ని ధరించి, తేజస్సు, శరీర సౌందర్యం, కాంతులతో సూర్యునివలె ప్రకాశిస్తాడు. దివ్యమాలలను, దివ్యవస్త్రాలను, దివ్యగంధాలను దివ్యానులేపనాలను ధరించి, భోగవంతుడై సుఖావహుడై ఉంటాడు. అక్కడ విమాన మందుండి స్వయంప్రకాశంగల దివ్య కాంతలతో కూడి వెలుగొందుతాడు. సతతమూ రుద్రకన్యలు, దేవర్షి కన్యలు అతనిని పూజిస్తారు. ఆ కన్యలు వివిధ స్వరూపాలు, వివిధాలైన అనురాగాలు, వివిధ మధురభాషణలు, వివిధ రతిక్రీడలతో శోభిస్తుంటారు. అతని విమానం సూర్యునివలె, వైడూర్యాలవలె ప్రకాశిస్తూ గగనం వలె విశాలంగా ఉంటుంది. దాని వెనుక భాగం

చంద్రునివలె, ఎడమవైపు మేఘకాంతివలె , కుడివైపు ఎర్రని కాంతితో క్రిందిభాగాల నీలమండలం వలె పైభాగం వివిధ వర్ణాలతో ప్రకాశిస్తుంది. అక్కడ అనేక పురుషులతో కలిసి పూజల నందుకొంటూ నివసిస్తాడు. జంబూద్వీపంలో ఎన్ని జలబిందువులు కురుస్తాయో అన్ని వేల సంవత్సరాల పాటు ఆ ధీమంతుడు బ్రహ్మలోకంలో విరాజిల్లుతాడు. వర్షాకాలంలో ఆకాశం నుండి ఎన్ని చినుకులు పడతాయో అన్ని సంవత్సరాలపాటు అమరతేజస్వియై అతడు బ్రహ్మలోకంలో నివసిస్తాడు.

నెలకొక సారి భుజిస్తూ పది సంవత్సరాలు గడిపిన వాడు ఉత్తమ స్వర్గలోకాన్ని పొందుతాడు. మహర్షిత్వాన్ని పొంది సశరీరంగా దివ్యలోకాలకు వెళతాడు. మునియై జితేంద్రియుడై, క్రోధాన్ని జయించి; జ్ఞానేంద్రియాన్ని పాట్టను అదుపులో నుంచుకొని, నిత్యమూ అగ్నిహోత్రం చేస్తూ, నియమపూర్వకంగా సంధ్యోపాసన చేస్తూ, అనేక నియమాలను పాటిస్తూ, పవిత్రుడై, భుజిస్తూ, ఆకాశంవలె నిర్మలాగా ఉన్నవాడు సూర్యునివలె తేజస్వి కాగలడు. అతడు తన శరీరంతోనే స్వర్గానికి వెళ్ళి, అమరులవలె ప్రకాశిస్తూ పుణ్యఫలమైన స్వర్గాన్ని స్వేచ్ఛానుసారం అనుభవిస్తాడు. ఈ రీతిగా యజ్ఞాల ఉత్తమ విధానాన్ని నీకు యథాక్రమంగా, విస్తరంగా చెప్పాను. పార్థా! ఉపవాస ఫలాన్ని తెలియజేశాను. దరిద్రులు కూడా ఈ ఉపవాస విధిని పాటించటం ద్వారా యజ్ఞఫలాన్ని పొందవచ్చు. దేవతలను, బ్రాహ్మణులను పూజించుట యందు ఆసక్తి కలిగి ఈ ఉపవాసాలను చేయటం ద్వారా పరమగతిని పొందవచ్చు. నియమశీలులై, అప్రమత్తులై, శౌచాచార పరాయణులై, మహా మనస్వులై, దంభద్రోహరహితులై పవిత్ర బుద్ధులై; అచంచలమూ, స్థిరమూ అయిన స్వభావం గల వారికై ఈ ఉపవాసవిధిని సవిస్తరంగా తెలియజేశాను. ఈ విషయంలో నీవు సంశయింపవలదు.

108. మానస పార్థివతీర్థముల మహత్త్వము.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. " పితామహా! ఏ తీర్థంలో స్నానం చేస్తే పరమపవిత్రత సిద్ధిస్తుందో, సర్వతీర్థాలలోనూ శ్రేష్ఠమైన ఆ తీర్థమేది?"

భీష్ముడు చెప్తున్నాడు. " సర్వతీర్థాలు ధీమంతులకు ప్రయోజన కారులే అయితే వాటిలో పవిత్రమై, పవిత్రతను కల్గించగల తీర్థాన్ని గూర్చి చెపుతాను. సావధానంగా వినుము. సత్యమనే జలమూ, ధైర్యమనే మడుగులు గల మానస తీర్థం అగాధమూ, నిర్మలమూ, పరమపవిత్రమూ కూడా. శాశ్వత సత్యమైన పరమాత్మను మనస్సులో నిలుపుకొని దానిలో

స్నానం చేయాలి. మానసతీర్థంలో స్నాన మాడితే యాచింపక పోవటం, ఋజుత్వం, సత్యం, మృదుత్వం, అహింసాస్వభావం, సర్వప్రాణులపై దయ, క్రూరత్వం లేకపోవటం, శమదమాలు- ఇవన్నీ లభిస్తాయి. మమకారం లేనివారు, అహంకారం లేనివారు, ద్వంద్వాలకు లోబడనివారు, దానం పట్టనివారు, భిక్షతో జీవించేవారు- వీరంతా పవిత్రులు, తీర్థస్వరూపులు. తత్త్వవేత్తయై, అహంకార బుద్ధిలేనివాడు శ్రేష్ఠతీర్థమయిన నారాయణుని యందు కానీ, రుద్రుని యందు కానీ ఉన్న భక్తి కూడా గొప్పతీర్థమే. ఈ పవిత్రతా లక్షణం పరిశీలింపగలిగితే సర్వత్రా కనిపిస్తుంది. అంతఃకరణం సత్త్వరజస్తమోగుణాలను తొలగించు కొన్నవారు, బాహ్యంగా పవిత్రులైనా అపవిత్రులైనా తమ కర్తవ్యాన్ని నిర్వహించేవారు, సర్వస్వాన్ని త్యజించటంలో ఆసక్తి గలవారు, సర్వజ్ఞులు, సమదృష్టిగల వారు అయి శౌచాచరణతో ఆత్మ శుద్ధిని సాధించినవారు పరమపవిత్ర తీర్థస్వరూపులు. **శరీరాన్ని నీటితో తడిపినంత మాత్రాన స్నానం చేసినట్లు కాదు. దమంలో (ఇంద్రియ నిగ్రహంలో) స్నానం చేసినవాడే స్నాతుడు. వాడే బాహిరంగా అంతరంగా కూడా పవిత్రుడు. జారిపోయిన వాటిపై అపేక్ష లేకుండా, లభించిన వాటిపై మమకారం లేకుండా ఉండేవారు, ఏ కోరికా పుట్టని వారు - ఇటువంటి వారిలోనే పరమపవిత్రత ఉంటుంది.*** ఈ లోకంలో ప్రజ్ఞానమే శరీరానికి పరమపవిత్రత. అదే రీతిగా ఏమీ లేకపోవటం, మనఃప్రసన్నత కూడా శరీరాన్ని పవిత్రం చేస్తాయి. ఆచారశౌచం, మనశ్శౌచం, తీర్థశౌచం, జ్ఞానశౌచం అని శౌచం నాలుగు రకాలు., వీటిలో జ్ఞానశౌచమే అన్నింటి కన్న శ్రేష్ఠం. ప్రజ్వలించే మనస్సుతో బ్రహ్మజ్ఞాన మనే జలంతో మానసతీర్థంలో స్నాన మాడితే దానినే తత్త్వద్రష్టలు నిజమైన స్నానంగా పరిగణిస్తారు. నిత్యమూ శౌచాచారసంపన్నుడై, పవిత్రభావయుక్తుడై, కేవలం సద్గుణసంపన్నుడైన నరుడు నిత్యపవిత్రుడు. ఇంతవరకు శరీరంలోని తీర్థాలను గురించి చెప్పాను. ఇకలోకంలోని పుణ్య తీర్థాలను గురించి చెపుతాను. అవి కూడా విను. శరీరంలోని విభిన్నభాగాలు పవిత్రాలు అయినట్లే పృథివిలోని భిన్నభిన్న భాగాలు, అక్కడి నీరు పుణ్య ప్రదాలు. తీర్థసంకీర్తనం చేత, తీర్థస్నానం చేత, అక్కడ పితృతర్పణల చేత తమ పాపాలను తీర్థాలలోనే విడిచి పెడతారు. వారు సుఖంగా

---

* నోదకక్లిన్నగాత్రస్తు స్నాత ఇత్యభిధీయతే ।
స స్నాతో యో దమస్నాతః స బాహ్యాభ్యంతరః శుచిః ॥ 9
అతీతేష్వనపేక్షా యే ప్రాప్తేష్వర్థేషు నిర్మమాః ।
శౌచమేవ పరం తేషాం యేషాం నోత్పద్యతే స్పృహా ॥ 10

స్వర్గానికి వెళతారు. పృథివీమండలంలోని కొన్ని భాగాలు సాధువుల నివాసం వలన, పృథివీతేజస్సు వలన, జలతేజస్సు వలన అత్యంతమూ పుణ్యభాజనాలుగా భావింపబడతాయి. ఇలా మనస్సులోనూ, పృథివిలోనూ కూడా ఎన్నో పుణ్య తీర్థాలున్నాయి. ఆ రెండింటిలోనూ స్నానం చేసినవాడు త్వరగా సిద్ధి పొందగలడు. క్రియాశూన్య మైన బలమూ, బలహీనమైన క్రియ ఈ లోకంలో కార్యాన్ని సాధించలేవు. రెండూ కలిస్తే సిద్ధి. ఈ రీతిగా శరీరశౌచంతో తీర్థశౌచంతో కూడుకొన్న వాడు పవిత్రుడై సిద్ధిని పొందుతాడు. ఈ రెండు రకాల శౌచమే ఉత్తమ శౌచం.

109. విష్ణు ద్వాదశకము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. "ఉపవాసా లన్నింటిలో శ్రేయస్కరమై మహా ఫలితాన్ని ఇవ్వ గలిగినదిగా లోకమంతా నిస్సందేహంగా అంగీకరించేది ఏది? నీవు నాకు చెప్పాలి." భీష్ముడు చెప్తున్నాడు. " రాజా! స్వయంభువు అయిన విష్ణువు స్వయంగా చెప్పిన దానిని విను. దానిని పాటిస్తే పురుషుడు సుఖాన్ని పొందగలడు. ఈ విషయంలో సంశయం లేదు. మార్గశీర్షమాసంలో రోజంతా ఉపవాసముండి కేశవుని అర్చిస్తే అశ్వమేధయాగ ఫలితాన్ని పొందవచ్చు. ఆ వ్రతశీలుని పాపం కూడా నశిస్తుంది. అదేరీతిగా పుష్యమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి నారాయణా! అంటూ పూజించినవాడు వాజపేయ యాగఫలాన్ని పొందుతాడు, పరమసిద్ధిని పొందగలడు కూడా. మాఘమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి మాధవుని పూజించిననాడు రాజసూయయాగ ఫలాన్ని పొందుతాడు. తన వంశాన్ని సముద్ధరిస్తాడు. అదేరీతిగా పాల్గునమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాస ముండి గోవిందా! అంటూ పూజించిన వాడు అతిరాత్ర యాగఫలాన్ని పొందుతాడు. సోమలోకానికి వెళతాడు. చైత్రమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి 'విష్ణు' అంటూ స్మరించినవాడు పౌండరీక యాగఫలాన్ని పొందుతారు. దేవలోకానికి వెళతాడు. వైశాఖమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి మధుసూదనుని పూజించినవాడు అగ్నిష్టోమయాగఫలాన్ని పొందుతాడు. సోమలోకానికి వెళతాడు.

జ్యేష్ఠమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి త్రివిక్రముని అర్చించినవాడు గోమేధయాగ ఫలాన్ని పొందుతాడు అప్సరసలతో కూడి సుఖిస్తాడు. ఆషాఢమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి 'వామనా' అంటూ అర్చించిన వాడు నరమేధయాగఫలాన్ని పొందుతాడు. మహాపుణ్యాన్ని కూడా దక్కించుకొంటాడు.

శ్రావణమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి శ్రీధరుని పూజించిన వాడు పంచమహాయజ్ఞాల ఫలాన్ని పొందుతాడు. విమాననివాసంలో సుఖించగలడు. భాద్రపదమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి 'హృషీకేశా!' అంటూ అర్చించిన వాడు సౌత్రామణి యాగఫలాన్ని పొందుతాడు. పవిత్ర హృదయు డవుతాడు. ఆశ్వయుజ మాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి 'పద్మనాభా!' అంటూ అర్చించినవాడు వేయిగోవులను దానమిచ్చిన పుణ్యఫలాన్ని పొందుతాడు. ఈ విషయంలో సంశయం లేదు. కార్తిక మాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసముండి 'దామోదరా!' అని అర్చించిన పురుషుడైనా స్త్రీ అయినా గోయజ్ఞ ఫలాన్ని పొందుతాడు. ఈ రీతిగా సంవత్సరమంతా పుండరీకాక్షుని అర్చించినవాడు గత జన్మను సర్మించగలడు. పుష్కలంగా బంగారాన్ని పొందగలడు. ప్రతిదినమూ ఈ రీతిగా విష్ణువును అర్చించినవాడు విష్ణుభావాన్ని పొందుతాడు. వ్రత సమాప్తివేళలో బ్రాహ్మణులను భోజనం పెట్టాలి లేదా నేతిని దానమివ్వాలి. ఈ ఉపవాసాలను మించిన ఉపవాసం మరొకటి లేదని నిర్ణయం. పూజ్యులైన విష్ణుభగవానులే ఈ పురాతన విషయాన్ని చెప్పాడు.

110. మార్గశీర్షమాస చంద్రవ్రతము.

వైశంపాయను డిలా అన్నాడు. "మహాప్రాజ్ఞు డైన యుధిష్ఠిరుడు అంపశయ్యపైనున్న వృద్ధుడు, కురుపితామహుడు అయిన భీష్ముని సమీపించి ఇలా అడిగాడు. యుధిష్ఠిరు డడిగాడు "మనిషి శరీరావయవాలకు రూపసౌభాగ్య మెలా లభిస్తుంది? అతనికి లోక ప్రియత్వమెలా దక్కుతుంది? ధర్మార్థ కామాలతో కూడి నరుడు సుఖాన్ని ఎలా పొందగలడు?" భీష్ముడు చెప్తున్నాడు. "మార్గశీర్షమాస శుక్ల ప్రతిపత్తు (పాడ్యమి) నాడు చంద్రుడు మూలా నక్షత్రంతో కలిసినప్పుడు చంద్రవ్రతం చేయాలి. రాజేంద్రా! పాదంలో మూలా నక్షత్రాన్ని, పిక్కలో రోహిణి నక్షత్రాన్ని భావించాలి. తొడ ఎముకలలో ఆశ్వినిని, తొడలలో పూర్వాషాఢ, ఉత్తరాషాఢలను, గుహ్యేంద్రియంపై పుబ్బ, ఉత్తరలను, కటిపై కృత్తికలను భావించాలి. నాభిలో పూర్వాభాద్ర, ఉత్తరాభాద్రలను, నేత్ర మండలంపై రేవతిని, వెనుక వైపు ధనిష్ఠ, అనురాధ, ఉత్తరలను భావించాలి. రాజా! బాహువులలో విశాఖానక్షత్రాన్ని చేతిలో హస్తను, వ్రేళ్ళలో పునర్వసును, గోళ్ళలో ఆశ్లేషను భావించాలి. రాజేంద్రా! మెడపై జ్యేష్ఠను, చెవులలో శ్రవణాన్ని, ముఖంలో పుష్యమిని, దంతాలు పెదవులపై స్వాతిని భావించాలి. నవ్వులో శతభిషను నాసికపై మఖను, కంటిలో మృగశిరను, నుదుట అనురాధను భావించాలి. రాజా! శిరస్సుపై భరణిని, వెంట్రుకలలో ఆర్ద్రను భావించాలి. అలా ప్రతిష్ఠిం

ప్రతిదినమూ అర్చించాలి. ముగింపులో వేద పండితులైన బ్రాహ్మణులకు నేతిని దానం చేయాలి? అలా పాటించిన వాడు పూర్ణచంద్రునివలె పరిపూర్ణమైన శరీర సౌందర్యంతో దర్శనీయు డవుతాడు. జ్ఞాని అవుతాడు.

111. సంసార చక్రము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. " పితామహా! మహాప్రాజ్ఞా! మానవుల జీవితయాత్రకు సంబంధించిన ఉత్తమ విధానాన్ని వినగోరుతున్నాను. రాజేంద్రా! లోకంలో నివసిస్తున్న నరులు ఏ ప్రవర్తనతో ఉత్తమ స్వర్గాన్ని పొందగలరు? నరకాన్ని ఎలా పొందగలరు? జనులు కట్టెతో మట్టిబెడ్డతో సమానమైన తమ మృతశరీరాన్ని వీడి, ఈ లోకనుండి వెళ్ళిపోతున్నారు. వారిని అనుసరించి వెళ్ళేది ఎవరు?" భీష్ముడు చెపుతున్నాడు. "ఇదిగో! పూజ్యుడు, ఉదారబుద్ధి అయిన బృహస్పతి వస్తున్నాడు. ఈ సనాతనరహస్యాన్ని గురించి ఆ మహాభాగుని అడుగు. ఇతరు లెవ్వరూ దీనిని గురించి చెప్పలేరు. బృహస్పతి వంటి వక్త మరొకడు ఎక్కడా లేడు." ఆ సమయంలోనే పవిత్ర హృదయుడైన బృహస్పతి స్వర్గలోకం నుండి వచ్చాడు. అప్పుడు యుధిష్ఠిరుడు లేచి ధృతరాష్ట్రుని ముందుంచుకొని నిలిచాడు తానూ. ఆ సభాసదులు బృహస్పతిని అసాధారణంగా అర్చించారు. ఆ పై ధర్మసుతుడైన ధర్మరాజు పూజ్యుడైన బృహస్పతిని సమీపించి యథాన్యాయంగా, తాత్త్వికంగా ప్రశ్నించాడు. యుధిష్ఠిరుడు అడిగాడు. "సర్వధర్మవేత్తా! మనిషికి నిజమైన సహాయకుడు ఎవరు? తల్లియా? తండ్రియా? కొడుకా? గురువా? జ్ఞాతులా? వియ్యాలవారా? మిత్రవర్గమా? జనులు కట్టితో, మట్టిబెడ్డతో సమానమైన తమ మృతశరీరాన్ని వీడి, ఈ లోకం నుండి వెళ్ళిపోతున్నారు. వారిని అనుసరించి వెళ్ళేది ఎవరు? బృహస్పతి చెప్తున్నాడు. "రాజా! జీవి ఒంటరిగానే పుడుతుంది. ఒంటరిగానే నశిస్తుంది. ఒంటరిగానే దుఃఖాన్ని తరిస్తుంది. ఒంటరిగానే దుర్గతిని పొందుతుంది. తండ్రి, తల్లి, సోదరుడు, కొడుకు, గురువు, జ్ఞాతులు, వియ్యాలవారు, మిత్రవర్గమూ- వీరెవ్వరూ కూడా సహాయకులు కారు. జనులు కట్టెతో, మట్టిబెడ్డతో సమానమైన మృత శరీరాన్ని వీడి రెండు క్షణాల పాటు ఏడుస్తారు. ఆ పై విముఖు లవుతారు. వారు విడిచిన ఆ శరీరాన్ని కేవలం ధర్మమే అనుసరిస్తుంది. అందువల్ల నరులు ఎప్పుడూ ధర్మాన్నే సహాయంగా సేవించాలి. ధర్మంతో కూడిన ప్రాణి ఉత్తమ స్వర్గాన్ని పొందుతుంది. అలాగే అధర్మంతో కూడిన ప్రాణి నరకాన్ని పొందుతుంది. కాబట్టి వివేకి న్యాయార్జితమైన ధనంతో ధర్మాన్ని అనుష్ఠించాలి పరలోకంలో ధర్మ

మొక్కటే మనుష్యులకు సహాయపడుతుంది. అవివేకి లోభమోహాలకు లోనయి ఇతరులకై లోభంతో కానీ, మోహంతో కానీ, మోహంతో కానీ, దయతో కానీ, భయంతో కానీ చేయదగని పనులు చేస్తాడు. జీవితఫలాలు మూడే. అవి ధర్మార్థకామాలు. అధర్మాన్ని వీడి, ఈ మూడింటిని పొందే ప్రయత్నం చేయాలి."

యుధిష్ఠిరు డడిగాడు."ధర్మయుక్తమై, పరమహితకరమైన వచనాన్ని తమద్వారా విన్నాను. శరీరస్థితిని గురించి తెలుసుకోవాలని నాకు బుద్ధిపుడుతోంది. మనుష్యుల మృతశరీరం ఇక్కడే ఉంటుంది, సూక్ష్మశరీరం అవ్యక్తమై, అదృశ్యమవుతుంది. ఇక దానిని ధర్మమెలా అనుసరిస్తుంది." బృహస్పతి చెప్తున్నాడు."పృథివి వాయువు, ఆకాశం, జలం, తేజస్సు, మనస్సు, యముడు, బుద్ధి ఆత్మ ఇవన్నీ ఎప్పుడూ ధర్మాన్ని చూస్తూనే ఉంటాయి. పగలు, రాత్రి కూడా ఈ లోకంలోని సర్వప్రాణుల చేష్టలకూ సాక్షి భూతులే. వీటితో కలిసి ధర్మం జీవుని అనుసరిస్తుంది. మహామునీ ! చర్మము, ఎముకలు, మాంసం, శుక్ర శోణితాలు - ఇవన్నీ జీవం లేని శరీరాన్ని విడిచి పెడతాయి. కాబట్టి ధర్మయుక్తమైన జీవియే పరమగతిని పొందుతుంది. ఆపై పరలోకస్థితి ముగిసి మరో శరీరాన్ని ధరించినప్పుడు పంచభూతాలలోని అధిష్ఠాన దేవతలు ఆ జీవుని శుభాశుభకర్మలను గమనిస్తారు. ఇంకా ఏం వినాలనుకొంటున్నావు ? ఆ పై ధర్మయుక్తుడైన ఆ జీవుడు ఇహపరలోకాలలో సుఖిస్తాడు. ఇంకా నీకు ఏం చెప్పమంటావు?"

యుధిష్ఠిరు డడిగాడు."ధర్మమెలా అనుసరిస్తుందో పూజ్యులైన తమరు కళ్ళకు కట్టినట్టు చెప్పారు. శరీరంలో వీర్యం ఎలా పుడుతుందో తెలిసికోవా లనుకొంటున్నాను. బృహస్పతి చెప్తున్నాడు."రాజా! పవిత్ర హృదయా! శరీరంలోని పృథివి, వాయువు, ఆకాశం, జలం, తేజస్సు, మనస్సు - వీటి అధిష్ఠాన దేవతలు ఆహారాన్ని స్వీకరిస్తారు. దానితో పంచభూతాలూ, మనస్సు తృప్తిపడతాయి. అప్పుడు వీర్యం పుడుతుంది. నృపా! అప్పుడు స్త్రీపురుషుల కలయిక వలన గర్భోత్పత్తి కలుగుతుంది. ఇదంతా వివరంగా చెప్పాను. ఇంకా ఏం వినాలను కొంటున్నావు ?"

యుధిష్ఠిరు డడిగాడు." పూజ్యులైన తమరు గర్భం ఎలా ఏర్పడుతుందో చెప్పారు. పుట్టిన వాడు బంధనాలలో ఎలా పడతాడో అది చెప్పండి." బృహస్పతి చెప్తున్నాడు "జీవుడు వీర్యం ద్వారా గర్భంలో ప్రవేశించగానే ఆ పంచభూతాలు శరీరాకృతితో ఆ జీవుని లోగొంటాయి. ఆ భూతాల నుండి విడవడగానే మరలా గత్యంతరాన్ని పొందుతాడు. సమస్త భూతాలతో కూడికొని ఉన్న జీవుడే సుఖదుఃఖాదులను పొందుతాడు. అప్పుడు

పంచభూతాలలోని తదధిష్ఠాన దేవతలు జీవుని శుభాశుభకర్మలను గమనిస్తారు. ఇంకా ఏం వినాలనుకొంటున్నావు.?"

యుధిష్ఠిరు డడిగాడు"స్వామీ! జీవుడు చర్మం, మాంసం, ఎముకలు - వీటితో కూడిన శరీరాన్ని, పంచభూతాలనూ విడిచిన తరువాత ఎక్కడ నిలిచి సుఖ దుఃఖాలను అనుభవిస్తాడు?" భారతా! బృహస్పతి చెప్తున్నాడు "జీవుడు తన కర్మతో సహా వీర్యత్వాన్ని పొంది. స్త్రీల అండంలో చేరి సమయాను సారంగా జన్మ ధరిస్తాడు. గర్భవాసానికి రాకముందు యమభటుల ద్వారా కష్టాలు పడతాడు. వారి దెబ్బలు తింటారు. దుఃఖ భూయిష్ఠమైన సంసార చక్రంలో ఎన్నో బాధలు పడతాడు, రాజా! ఆ జీవి ఈ లోకంలో కూడా పుట్టిన నాటి నుండి పుణ్యకర్మాసక్తుడై, ధర్మఫలాన్ని ఆశ్రయించి, సుఖాలను అనుభవిస్తాడు. ఒక వేళ పుట్టినప్పటి నుండి యథాశక్తిగా జీవుడు ధర్మాన్ని సేవిస్తే తాను ఎదిగిన తర్వాత నిత్యమూ సుఖాలను అనుభవించగలడు. ధర్మాచరణవేళలో మధ్యమధ్య ఒకవేళ అధర్మాన్ని చేస్తే సుఖాల ననుభవించిన తరువాత ఆ జీవుడు దుఃఖాన్ని కూడా పొందవలసివస్తుంది. అధర్మంతో కూడిన మనుష్యుడు యమలోకానికి వెళ్ళి మహాదుఃఖాన్ని పొంది ఆ పై తిర్యగ్జాతిలో పుడతాడు. మోహానికి లోనైన జీవుడు ఏయే పనుల ద్వారా ఏయే జాతులలో జన్మిస్తాడో చెపుతా, విను. శాస్త్రాలలో, ఇతిహాసాలలో, వేదంలో కూడా చెప్పబడింది. మానవ లోకంలో పాపం చేస్తే మరణానంతరం ఘోరమైన నరకంలో పడతాడు. రాజా! ఈ నరకంలో కూడా దేవలోకంతో సమానంగా పుణ్యప్రదేశాలు కూడా ఉన్నాయి. పశుపక్ష్యాదులు తప్ప ఇతర జంగమప్రాణులన్నీ అక్కడకు చేరుతాయి. యమసదనం దివ్యమైనది. గుణాలతో బ్రహ్మలోకంతో సమానమైనది. కానీ నియతంగా తన పాపకర్మలచే బంధించిన ప్రాణి అక్కడ నరకంలో పడి దుఃఖాలను అనుభవిస్తాడు. ఇక ఏఏభావంతో, ఏఏ కర్మతో పురుషుడు పరుషమూ, ఘోరమూ అయిన గతిని పొందుతాడో. చెప్పబోతున్నాను. విను. ద్విజుడు నాలుగు వేదాలనూ అధ్యయనం చేసికూడా మోహానికి లోనై పతితులనుండి దానాలను స్వీకరిస్తే గాడిదగా పుడతాడు. భారతా! గాడిదగా పదిహేను సంవత్సరాలు బ్రతుకుతాడు. ఆ పై మరణించి ఎద్దుగా పుడతాడు. ఎద్దుగా ఏడు సంవత్సరాలు జీవిస్తాడు. ఎద్దుగా మరణించి బ్రహ్మరాక్షసుడుగా పుడతాడు. బ్రహ్మరాక్షసుడుగా మూడు నెలలు గడిపి. ఆపై మరల బ్రాహ్మణుడుగా పుడతాడు. పతితునిచే యాగాలు చేయించినవాడు కీటక జాతిలో పుడతాడు. భారతా! ఆ జన్మలో పదిహేను సంవత్సరాలు జీవిస్తాడు. కృమిజాతి నుండి బయటపడిన తరువాత గాడిదగా

పుడతాడు. అలా అయిదు సంవత్సరాలు జీవిస్తాడు. ఆ పై పందిగా పుట్టి అయిదు సంవత్సరాలు, కోడిగా అయిదు సంవత్సరాలు, నక్కగా అయిదు సంవత్సరాలు, కుక్కగా ఒక సంవత్సరం బ్రతికి మరల మనిషిగా జన్మిస్తాడు.

అవివేకియై గురువుపట్ల అపరాధం చేసిన శిష్యుడు ఈ క్రింది మూడు జాతులలో నిస్సంశయంగా జన్మిస్తాడు. రాజేంద్రా! ముందు కుక్కగా తరువాత రాక్షసుడుగా, తరువాత గాడిదగా పుడతాడు. ఆ పై మరణించి ప్రేత రూపంలో బాగా కష్టాలు పడి కడకు బ్రాహ్మణుడుగా పుడతాడు. పాపకారియై గురుపత్నితో సమాగమాన్ని శిష్యుడు మనసా భావించినా చాలు, ఆ అధర్మభావన ఫలంగా భయంకర జాతులలో జన్మిస్తాడు. ఆ జీవుడు కుక్కగా పుట్టి మూడు సంవత్సరాలు జీవిస్తాడు. ఆ జన్మలో మరణించి కీటకంగా పుడతాడు. ఆ కీటక జన్మలో సంవత్సరకాలం జీవిస్తాడు. ఆ పై మరణించి బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. ఒక వేళ గురువే పుత్రతుల్యుడైన శిష్యుని నిష్కారణంగా హింసిస్తే, తన స్వేచ్ఛా చారిత్యం వలన ఆ గురువుకూడా క్రూర జంతువుగా జన్మిస్తాడు.

రాజా! తండ్రిని, తల్లిని అవమానించిన కుమారుడు కూడా మరణానంతరం ముందు గాడిదగా పుడతాడు. గాడిదగా పదిసంవత్సరాలు గడుపుతాడు. ఆ పై మొసలిగా పుట్టి సంవత్సరకాలం జీవిస్తాడు. తరువాత మనిషిగా పుడతాడు. తల్లి దండ్రులిద్దరి కోపానికి గురి అయిన కుమారుడు గురుజనుల అనిష్టభావన కారణంగా మరణానంతరం గాడిదగా పుడతాడు. గాడిదగా పదినెలలు బ్రతికి ఆ పై కుక్కగా పదునాలుగు నెలలుగా గడిపి, ఆపై పిల్లిగా ఎడునెలలు జీవించి ఆ తరువాత మనిషిగా పుడతాడు. రాజా! తల్లి దండ్రులను నిందించినవాడు మైనాగా (పక్షి) పుడతాడు. తల్లిదండ్రులను కొట్టిన వాడు తాబేలుగా జన్మిస్తాడు. తాబేలుగా పది సంవత్సరాలు, ముళ్ళపందిగా మూడు సంవత్సరాలు, పాముగా ఆరునెలలు గడిపి ఆపై మానవుడుగా పుడతాడు. రాజులు పెట్టిన పిండాన్ని తింటూ కూడా మోహానికిలోనై ఆరాజు శత్రువులను సేవించేవాడు మరణానంతరం కోతిగా జన్మిస్తాడు. కోతిగా పదిసంవత్సరాలు, ఎలుకగా అయిదు సంవత్సరాలు, కుక్కగా పుట్టి ఆరునెలలు గడిపి ఆ తరువాత మనిషిగా పుడతాడు. తన దగ్గర ఇతరులు దాచుకొన్న ధనాన్ని అపహరించిన వాడు వంద జన్మలెత్తి, చివరగా కీటకంగా జన్మిస్తాడు. భారతా! కీటకంగా పదిహేనుసంవత్సరాలు జీవించి పాపాన్ని నశింపజేసికొని ఆ పై మనిషిగా పుడతాడు.

అసూయాపరుడైన నరుడు కూడా మరణానంతరం జింకగా పుడతాడు.

దుర్మతియై నమ్మినవానికి ద్రోహం చేసిన నరుడు చేపగా పుడతాడు. భారతా! ఎనిమిది సంవత్సరాల పాటు చేపగా బ్రతికి, మరణానంతరం నాలుగు మాసాల పాటు జింకగా, ఆ పై మేకగా జన్మిస్తాడు. మేకగా సంవత్సరకాలం జీవించి, మరణానంతరం కీటకంగా పుడతాడు, ఆ పై ఆ జీవుడు మనిషిగా పుడతాడు. మహారాజా! మోహానికి, అజ్ఞానానికిలోనై, సిగ్గు లేకుండా ధాన్యాలను. యవలను, నువ్వులను, మినుములను, ఉలవలను, ఆవాలను, శనగలను, బఠాణీలను, పెసలను, గోధుమలను, అవిసెలను, ఇతర సస్యాలను అపహరించిన వాడు మరణానంతరం ఎలుకగా పుడతాడు. మహారాజా! ఎలుకగా మరణించి, పందిగా పుడతాడు. పందిగా పుట్టిపుట్టగానే రోగంతో మరణిస్తాడు. రాజా! ఆ తరువాత ఆ మూఢుడు తన కర్మఫలంగా కుక్కగా జన్మిస్తాడు. కుక్కగా అయిదు సంవత్సరాలు గడిపి ఆపై మానవ జన్మ నెత్తుతాడు.

ఇతరుని భార్యతో సంగమించిన వాడు క్రమంగా తోడేలుగా, కుక్కగా అయిదు సంవత్సరాలు గడిపి ఆ పై మానవ జన్మ నెత్తుతాడు. రాజా! మోహంతో పాపబుద్ధియై సోదరుని భార్యను బలాత్కరించిన వాడు మగకోయిలగా సంవత్సరకాలం గడుపుతాడు. మిత్రుని భార్యను, గురుపత్నిని, రాజపత్నిని కామంతో బలాత్కరించినవాడు మరణానంతరం పందిగా పుడతాడు. పందిగా అయిదు సంవత్సరాలు, తోడేలుగా పది సంవత్సరాలు, పిల్లిగా అయిదు సంవత్సరాలు, కోడిగా పదిసంవత్సరాలు, చీమగా మూడు నెలలు, కీటకంగా ఒకనెల జీవిస్తాడు. ఈ రీతిగా వివిధ జాతులతో గడిపి, ఆ పై క్రమంగా జన్మిస్తాడు. ఆ క్రిమిజాతిలో పదునాలుగు నెలలు గడిపి వాటితో అధర్మాన్ని నశింపజేసికొని మరల మానవజన్మ నెత్తుతాడు.

రాజా! వివాహం కానీ, యజ్ఞం కానీ, దానం కానీ జరుగుతున్నప్పుడు మోహానికి లోనై ఆటంకాలు కల్పించిన వాడు మరణానంతరం క్రిమిగా జన్మిస్తాడు. భారతా! పదిహేను సంవత్సరాలు క్రమగా జీవించి అధర్మాన్ని నశింపచేసికొని, ఆ పై మానవుడుగా పుడతాడు. రాజా! కూతురుని ఒకని కిస్తానని మాట ఇచ్చి (లేదా కన్యాదానం చేసి) మరొకనికి దాన మివ్వబోయిన వాడు మరణానంతరం క్రిమి జాతిలో జన్మిస్తాడు. యుధిష్ఠిరా! ఆ జాతిలో పదమూడు సంవత్సరాలు గడిపి, అధర్మాన్ని నశింపచేసికొని, మరల మానవ జన్మనెత్తుతాడు. దేవ కార్యాన్ని కానీ, పితృకార్యాన్ని కానీ మాని వైశ్యదేవం(బలిసమర్పణ) చేయకుండా భుజించినవాడు. మరణానంతరం కాకిగా పుడతాడు. వంద సంవత్సరాలు కాకిగా బ్రతికి ఆ పై కోడిగా పుడతాడు. ఆ పై నెలరోజులు పాముగా జీవిస్తాడు. అక్కడ

నుండి మనిషిగా జన్మిస్తాడు. తండ్రితో సమానమైన పెద్దన్నను అవమానించిన వాడు కూడా మరణానంతరం క్రౌంచపక్షిగా పుడతాడు. క్రౌంచపక్షిగా సంవత్సరకాలం జీవించి, ఆ పై ఈల పురుగుగా జన్మిస్తాడు. ఆ జన్మలో మరణించి, మరల మనిషిగా పుడతాడు. శూద్రుడు బ్రాహ్మణస్త్రీతో సంగమిస్తే క్రిమిగా పుడతాడు - ఆపై మరణించి, పందిగా పుడతాడు. రాజా! పందిగా పుట్టీపుట్టకముందే రోగంతో మరణిస్తాడు. ఆ మూఢుడు తన కర్మఫలంగా ఆ పై కుక్కగా జన్మిస్తాడు. కుక్కగా పుట్టి పాప ఫలాన్ని అనుభవించి, ఆ పై మనిషిగా పుడతాడు, ఆ జన్మలో ఒకే సంతానాన్ని కని, మరల ఎలుకగా జన్మిస్తాడు. రాజా! కృతఘ్నుడు మరణానంతరం యమలోకానికి వెళ్తాడు. అక్కడ కోపించిన యమభటులచే దారుణ హింసలకు గురి అవుతాడు. భారతా! అతడు యమలోకానికి వెళ్ళి అక్కడ దండం ముద్గరం శూలం వీటితో దెబ్బలు తిని, దారుణమైన కుంభీపాకం, అసి పత్రవనం ఇంకా అనేక నరకాలలో ఘోర యాతనలను పొంది, యమభటుల ద్వారా దెబ్బలు తింటాడు. ఈ రీతిగా ఉగ్రులైన యమదూతలచే హింసింపబడిన ఆ కృతఘ్నుడు మరల సంసారచక్రంలో బడి క్రిమిజాతిలో పుడతాడు. భారతా! పదిహేను సంవత్సరాలు క్రిమిగా జీవించి ఆపై మాతృగర్భంలో ప్రవేశించి, అక్కడ శిశువుగానే మరణిస్తాడు. ఆ తరువాత వందలమార్లు ఆ జీవుడు గర్భస్థుడవుతాడు. అనేక పర్యాయాలు జన్మించి, చివరగా జంతుజాతులలో జన్మిస్తాడు. ఆ జాతులలో అనేక సంవత్సరాలు దుఃఖాన్ని అనుభవించి, మరలా మనిషిగా కాక తాబేలుగా పుట్టి చాలాకాలం గడుపుతాడు.

పెరుగును దొంగిలించిన దుర్మతి కొంగగా పుడతాడు. చేపలను దొంగిలించినవాడు కారంకవపక్షిగా జన్మిస్తాడు. తేనెను దొంగిలించిన వాడు దోమగా పుడతాడు. పండ్లను కానీ, వ్రేళ్ళను కానీ, అప్పచ్చులను కానీ దొంగిలించిన వాడు చీమగా పుడతాడు. అనుములు లేదా పెదబొబ్బరలు దొంగిలించిన వాడు హలగోలక మనే క్రిమిగా జన్మిస్తాడు. పాయసాన్ని దొంగిలించిన వాడు తిత్తిరిపక్షి అవుతాడు. పిండిరొట్టెను దొంగిలించిన వాడు గుడ్లగూబగా పుడతాడు. దుర్మతియై ఇనుమును దొంగతనం చేసిన నరుడు కాకిగా జన్మిస్తాడు. కంచు దొంగిలించినవాడు హారీతపక్షిగా పుడతాడు. వెండిగిన్నె దొంగిలించిన వాడు పావురంగా జన్మిస్తాడు. బంగారు గిన్నె దొంగిలించిన వాడు క్రిమి జాతిలో పుడతాడు. ఉన్నిబట్టలు దొంగిలిస్తే ఊసరవిల్లిగా పుడతాడు. పట్టుబట్టలు దొంగిలించిన నరుడు వల్లంకిపిట్టగా జన్మిస్తాడు. మృదువైన (నాజూకైన) వస్త్రాలను దొంగిలించిన మానవుడు చిలుకగా పుడతాడు. ఉత్తరీయాలను దొంగిలించిన వాడు మరణానంతరం హంసగా జన్మిస్తాడు. నూలు బట్టలు దొంగిలించిన మానవుడు మరణానంతరం క్రౌంచపక్షిగా

పుడతాడు. పట్టుబట్టలను, గొర్రె బొచ్చుతో చేసిన బట్టలను, పట్టులాంటి బట్టలను దొంగిలించిన వాడు కుందేలుగా పుడతాడు. రంగురంగుల బట్టలను దొంగిలించి నెమలిగా జన్మిస్తాడు. ఎర్రని బట్టలను దొంగిలించిన వాడు పుడతాడు. రాజా! లోభానికి లోనై అనులేపన ద్రవ్యాలను, గంధాలను అపహరించిన మానవుడు చుంచెలుకగా జన్మిస్తాడు. ఆ రూపంలో పదిహేను సంవత్సరాలు జీవిస్తాడు. అధర్మం నశించిన తరువాత మరలా మానవ జన్మ నెత్తుతాడు. పాలను దొంగిలిస్తే కొంగగా పుడతాడు.

రాజా! మోహానికి లోనై నూనెను అపహరించిన నరుడు మరణానంతరం బొద్దింకగా పుడతాడు. ఆయుధధారియై నిరాయుధుని చంపిన పురుషాధముడు - అది ధనం కోసం కావచ్చు, శత్రుత్వంతో కావచ్చు. మరణానంతరం గాడిదగా పుడతాడు. గాడిదగా రెండు సంవత్సరాలు బ్రతుకుతాడు. ఆ పై ఆయుధం దెబ్బతిని, మరణించి జంతుజాతిలో పుట్టి నిత్యమూ ఉద్వేగంతో జీవిస్తాడు. సంవత్సరకాలం తర్వాత ఆ మృగజన్మలో ఆయుధంతో చంపబడతాడు. తరువాత చేపగా పుట్టి, వలలో చిక్కుతాడు. వలనుండి తప్పు కొన్నా నాలుగు నెలలు తరువాత మరణించి క్రూరజంతువుగా పుడతాడు. పది సంవత్సరాలు క్రూరజంతువుగా గడిపి, ఆపై అయిదు సంవత్సరాలు పులిలా బ్రతుకుతాడు. ఆ పై అధర్మాన్ని నశింపజేసికొని, కాలప్రేరణచే మరణించి మరలా మానవ జన్మ నెత్తుతాడు. దుర్మతియై స్త్రీని చంపిన వాడు యమలోకానికి పోయి, వివిధ క్లేశాలను అనుభవించి ఆపై ఇలపై కష్టాలకు నెలవులైన జన్మలను పొందుతాడు. మహారాజా! ఆ తరువాత క్రిమిజాతులో పుడతాడు. ఇరవై సంవత్సరాలు క్రిమిగా జీవించి ఆపై మానవ జన్మ నెత్తుతాడు. భోజనాన్ని అపహరించిన నరుడు ఈగగా పుడతాడు. అనేక మాసాల పాటు ఈగల గుంపులో జీవిస్తాడు. తరువాత పాపం నశించగానే మానవ జన్మను పొందుతాడు. ధాన్యాన్ని అపహరించిన పురుషుడు మరుజన్మలో ఒళ్ళంతా రోమాలతో పుడతాడు. రాజా! అలాగే నువ్వుల పిండితో కూడిన ఆహారాన్ని దొంగిలించిన నరుడు నెమలి వంటి ఆకారంగల భయంకర మూషికంగా జన్మిస్తాడు. ఆ పాపాత్ముడు నిత్యమూ మానవులను కొరుకుతుంటాడు. దుర్మతియై నేతిని దొంగిలించిన వాడు కొమ్ములుగల జలపక్షి (కాకమద్గువు)గా జన్మిస్తాడు. చేపలను, మాంసాన్ని దొంగిలించిన దుర్మతి కాకిగా పుడతాడు, ఉప్పు దొంగిలించిన వాడు చిరికాకిగా జన్మిస్తాడు. నాయనా! నమ్మకంతో ఇతరులు తన దగ్గర దాచుకొన్నదానిని దొంగిలించిన మానవుడు మరణానంతరం మత్స్యజాతిలో పుడతాడు. మత్స్యజన్మలో మరణించిన తరువాత మరల మానవ జన్మనెత్తుతాడు. కానీ ఆయుస్సు బాగా తగ్గుతుంది. భారతా! పాపాలు చేసిన నరుడు

పశుపక్ష్యాదులతో జన్మిస్తాడు. తమను ఉద్ధరించిన ధర్మాన్ని వారు కొంచెంకూడా గ్రహించలేరు.

పాపప్రవర్తన గల నరులు లోభమోహాలకులోనై పాపాలను చేసి, వ్రతాలతో వీటిని తొలగించుకోవాలని ప్రయత్నిస్తూ సతతము సుఖదుఃఖాల ననుభవిస్తుంటాడు. మరుసటి జన్మలో అటువంటి వారికి నివాసస్థానం లభించదు. వారు నిస్సంశయంగా మ్లేచ్ఛ లవుతారు. పుట్టిన నాటినుండి పాపాలకు దూరంగా ఉన్న నరులు రూపవంతులు, ధనవంతులు, రోగరహితులు అవుతారు. స్త్రీలు కూడా పాపపుపనులు చేస్తే పాపఫలాన్ని అనుభవిస్తారు. అటువంటి పాపాత్ములకే భార్యలవుతారు. అనఘా ! ఇతరులకు చెందిన ధనాన్ని అపహరిస్తే వచ్చే దోషాలు ఎన్నో చెప్పబడ్డాయి. అయితే ఈ చెప్పినది లేశమాత్రంగానే. భారతా! మరొకమారు ఎప్పుడైనా మాటల సందర్భంలో మరలా వినవచ్చు. మహారాజా! గతంలో దేవర్షుల మధ్య బ్రహ్మ చెప్పగా ఈ విషయాలను విన్నాను. నీవు అడిగావు కాబట్టి యథాతథంగా దానిని పూర్తిగా నీకు విన్నదివిన్నట్లు చెప్పాను. దీనిని గ్రహించి మనస్సు సదా ధర్మంమీదనే లగ్నంచేయి.

112. అన్నదాన మహిమ.

బ్రాహ్మణా! అనఘా! నీవు అధర్మగతిని వివరించావు. వాగ్మిశ్రేష్ఠా! నేను ధర్మగతిని కూడా వినగోరుతున్నాను. పాప కర్మలు చేసిన వారు శుభగతిని ఎలా పొందగలరు ? ఏకర్మను ఆచరించి శుభగతిని పొందగలరు?"

బృహస్పతి చెప్తున్నాడు.' అధర్మానికి లోబడి పాపకర్మలు చేస్తున్న వాని మనసు విపరీతంగా పని చేస్తుంది. దానితో నరకానికి వెళ్ళవలసివస్తుంది. మోహం వలన అధర్మంగా ప్రవర్తించినా తరువాత పశ్చాత్తాపం పొంది, మనస్సును నియంత్రించుకొని పాపకర్మలను మానాలి. పాపకృత్యాలను ఏ మేర అసహ్యించు కొంటాడో ఆమేర ఆశరీరం అధర్మం నుండి విముక్తమవుతుంది. రాజా! తాను చేసిన పాపాలను గూర్చి బ్రాహ్మణులకు తెలిపిన పాపి, ఆ అధర్మం వలన కలిగిన అపవాదం నుండి వెంటనే విముక్తు డవుతాడు. నరుడు తాను చేసిన పాపాలను స్థిరచిత్తంతో ఎంతమేర బహిరంగ పరుస్తారో అంతమేర దాని నుండి విముక్తి నందుతాడు. పాము శిథిలమైన కుబుసాన్ని వీడి, దాని నుండి బయటపడ్డట్టు విముక్తి కలుగుతుంది. ఏకాగ్రతతో, మనస్సమాధితో బ్రాహ్మణునకు వివిధ దానాలు చేసినవాడు సద్గతిని పొందుతాడు. యుధిష్ఠిరా! నరుడు అకృత్యాలు చేసికూడా ధర్మఫలాన్ని పొందగల వివిధ దానాలను గూర్చి చెపుతాను. అన్ని దానాలలో అన్నదానం శ్రేష్ఠమని

చెప్పబడుతోంది. ధర్మాన్ని కోరుకునే వాడు ముందు సరళభావనతో అన్న దానం చేయాలి. మనుషులకు అన్నమే ప్రాణాలు. అన్నం ఉండియే ప్రాణి పుడతాడు. లోక ప్రతిష్ఠ అన్నం మీదనే ఆధారపడుతుంది. దేవర్షులు, పితరులు, మానవులు అన్నాన్నే ప్రశంసిస్తారు. అన్న దానంతోనే రంతిదేవుడు స్వర్గానికి వెళ్ళగలిగాడు. స్వాధ్యాయతత్పరులైన బ్రాహ్మణులకు ప్రసన్న హృదయంతో న్యాయంగా సంపాదించిన ఉత్తమాన్నాన్ని పెట్టాలి. ఆనందంగా వేయి మంది బ్రాహ్మణులకు అన్నదానం చేస్తే ఆ దాత పశుపక్షి జన్మాలను పొందడు. నరర్షభా! సదా యోగాసక్తుడైన నరుడు పదివేలమంది బ్రాహ్మణులకు అన్నదానం చేస్తే అధర్మం నుండి బయటపడతాడు. వేదవేత్త అయిన బ్రాహ్మణుడు భిక్షమెత్తి స్వాధ్యాయతత్పరుడైన బ్రాహ్మణునకు దానం చేస్తే ఇహలోకంలో సుఖంగా జీవిస్తాడు.

*భిక్షమెత్తి అయినా అన్నంతెచ్చి బ్రాహ్మణులకు పెట్టినవాడు, సువర్ణదానం చేసినవాడు అనేక పాపాలను నశింపజేసి కొంటారు. జీవికకు ఉపయోగపడే భూమిని దానం చేసిన వాడు పాపం నుండి ముక్తినందుతాడు. **పురాణ పారాయణలతో కూడా బ్రాహ్మణుడు పాపవిముక్తి నందగలడు.** లక్షగాయత్రీ జపం చేసినా, వేయి గోవులను తృప్తి పరచినా, పవిత్ర బ్రాహ్మణులకు యధార్థంగా వేదార్థాన్ని వినిపించినా, స్వర్గాన్ని త్యజించినా కూడా బ్రాహ్మణులకు పాపవిముక్తి నందగలడు. వీరందరికీ అన్నం పెట్టి అతిథ్య మివ్వటం శ్రేష్ఠం. అందుకే అన్నం అన్నింటిని మించినది.*

ధర్మాత్మా! పాండునందనా! బ్రాహ్మణుల సొమ్ములు అపహరించకుండా న్యాయంగా ప్రజాపాలన చేస్తూ, తన భుజబలంతో సాధించిన అన్నాన్ని వేదజ్ఞులైన బ్రాహ్మణులకు పవిత్రమూ, ఏకాగ్రమూ అయిన మనస్సుతో దానం చేస్తే, ఆ అన్నదాన ఫలితంగా క్షత్రియుడు పాపకృత్యాలఫలితాన్ని తొలగించుకొనవచ్చు. వ్యవసాయం ద్వారా సంపాదించిన అన్నంలో ఆరవభాగాన్ని రాజుకు పన్నుగా చెల్లించి, పవిత్రమైన మిగిలిన భాగాన్ని బ్రాహ్మణులకు దానం చేసి వైశ్యుడు పాపవిముక్తి నందగలడు. ప్రాణాలను లెక్కచేయకుండా కష్టపడి సంపాదించిన అన్నాన్ని బ్రాహ్మణులకు దానం చేసి, శూద్రుడు పాపవిముక్తిని పొందగలడు. ప్రాణిహింస చేయకుండా కండబలంతో సాధించిన అన్నాన్ని బ్రాహ్మణులకు పెట్టినవాడు కష్టాలపాలు కాడు. న్యాయంగా సంపాదించిన అన్నాన్ని ఆనందంగా వేదవృద్ధుడైన బ్రాహ్మణులకు దానం చేసిన నరుడు పాపవిముక్తిని పొందగలడు. లోకంలో బలసంవర్ధకమైన అన్నాన్ని దానం చేసిన నరుడు బలవంతుడవుతాడు. సత్పురుషమార్గంలో నడిచినవాడు సర్వపాపాల నుండి ముక్తినందగలడు.

దానశీలురు దారిని నిర్మించారు. ధీమంతులు ఆ దారిలో నడుస్తారు. అన్నదానం చేసినవారు ప్రాణదానం చేసినట్లే. వారిద్వారానే సనాతన ధర్మం వర్ధిల్లుతుంది. మనుష్యుడు

న్యాయబద్ధంగా సంపాదించిన అన్నాన్ని సర్వావస్థలలోనూ, యోగ్యులకు సమర్పించాలి. అన్నమే నిత్యమూ ప్రాణులకు పరమగతి. అన్నదానం ద్వారా నరునకు నరకాన్ని సేవించవలసిన అవసరం రాదు. **కాబట్టి న్యాయంగా సంపాదించిన అన్నాన్ని దానం చేయాలి.** గృహస్థుడు సదా ముందు బ్రాహ్మణులకు అన్నం పెట్టి, తరువాత తాను భుజించాలి. మానవుడు అన్నదానంతో ప్రతిదినాన్ని సఫలం చేసికోవాలి. రాజా! వేదవేత్తలు, న్యాయవేత్తలు, ధర్మవేత్తలు, ఇతిహాస పండితులు అయిన వేయిమంది బ్రాహ్మణులకు అన్నంపెట్టిన నరుడు ఘోరనరకాలలో పడడు. సంసార చక్రంలో భ్రమించడు. ఇహలోకంలో అన్ని కోరికలూ తీరి, మరణానంతరం కూడా సుఖాలను పొందుతాడు. ఈ రీతిగా అన్నదానతత్పరుడైన వాడు నిశ్చింతగా సుఖిస్తాడు. రూపవంతుడు, కీర్తిమంతుడు, ధనవంతుడై విరాజిల్లుతాడు. భారతా! అన్నదానానికి సంబంధించిన మహాఫలాన్ని మొత్తం చెప్పాను. దానధర్మాలన్నింటికీ మూలం అన్నదానమే.

113. అహింసా ధర్మముల మహిమ.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. అహింస, వైదిక కర్మాచరణం, ధ్యానం, ఇంద్రియ నిగ్రహం, తపస్సు, గురుశుశ్రూష - వీటిలో పురుషునకు శ్రేయస్కరమైనదేది ? బృహస్పతి చెప్తున్నాడు. "భరతర్షభా! ఈ ఆరూ ధర్మబద్ధాలే. వీటికి వేరువేరు కారణాలుంటాయి. వాటిని వివరిస్తాను. విను. ప్రాణికి నిశ్రేయసానికి ఉపయోగపడే సర్వోత్తమ మార్గాన్ని చెపుతాను. అహింసకు దూరం కాని ధర్మాన్ని పాటిస్తూ, సదా మోహ, మద మాత్సర్యాలను ఇతర ప్రాణులపైనుంచి తన నుండి తొలగించుకొని, కామక్రోధాలను నియంత్రించిన నరుడు సిద్ధిని పొందగలడు. తన సుఖాన్ని వెదుక్కొంటూ, అహింసకాలైన ప్రాణులను క్రూరతో కొట్టినవాడు మరణానంతరం సుఖానికి నోచుకోడు. సమస్త ప్రాణులనూ తనను వలె భావిస్తూ, దండాన్ని విడిచి, క్రోధాన్ని జయించిన పురుషుడు మరణానంతరం సుఖాన్ని అనుభవిస్తాడు. సర్వప్రాణులను తనవలె భావిస్తూ, అన్నింటినీ సమానంగా చూస్తూ, రాకపోకలే లేని జ్ఞానియొక్క మార్గాన్ని తెలిసికొనటంలో దేవతలు కూడా భ్రాంతి పడతారు. **తనకు ప్రతికూలమైన దానిని ఇతరులకు కల్పించకూడదు. ధర్మం యొక్క సంక్షిప్త స్వరూపమిది. దీనికి భిన్నమైన ప్రవర్తన కామమూలకం.*** తాను అడిగిన

* వ తత్ పరస్య సందధ్యాత్ ప్రతికూలం యదాత్మనః ।
ఏష సంక్షేపతో ధర్మః కామాదన్యః ప్రవర్తతే ॥ 8

దానిని ఇతరులు ఇచ్చినపుడు, లేదా తిరస్కరించినప్పుడు సుఖదుఃఖాలు, ప్రియాప్రియాలవిషయంలో తన మనఃస్థితి వలెనే ఇతరుల మనఃస్థితి కూడా ఉంటుందని గ్రహించాలి. తాను ఇతరులను ఆక్రమించినట్లు అవసరపడితే ఇతరులు కూడా తనను ఆక్రమిస్తారు. ఇదియే నీకు ఈలోకంలో దృష్టాంతం కావాలి. ఈ రీతిగా నిపుణంగా ధర్మస్వరూపం చెప్పబడింది. వైశంపాయనుడు చెప్తున్నాడు. "ధీమంతుడైన బృహస్పతి ధర్మరాజైన యుధిష్ఠిరునితో ఇలా చెప్పి, మేము చూస్తుండగానే స్వర్గానికి వెళ్ళిపోయాడు.

114. హింసా మాంస భక్షణనింద.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆపై మహాతేజస్వి, వాగ్మిశ్రేష్ఠుడు అయిన యుధిష్ఠిరుడు అంపశయ్యపై నున్న పితామహుని మరలా ఇలా అడిగాడు." యుధిష్ఠిరుడిలా అడిగాడు "మహామతీ ! ఋషులు, బ్రాహ్మణులు, దేవతలు వేదప్రమాణాన్ని అనుసరించి అహింసారూపమైన ధర్మాన్ని ప్రశంసిస్తున్నారు. రాజా ! కర్మణా, వాచా, మనసా కూడా హింసను చేసిన నరుడు ఆ దుఃఖంనుండి ఎలా విముక్తిని పొందగలడు ?' భీష్ముడు చెప్తున్నాడు. "శత్రుసూదనా ! బ్రహ్మవాదులు అహింస నాలుగు రకాలు (మనసా, వాచా, కర్మణా హింసింపకుండుట, మాంసం తినకుండుట) అన్నారు. వీటిలో ఏ ఒక్కటి లోపించినా అహింసాధర్మం అసంపూర్ణమే. మహీపాలా ! నాల్గు కాళ్ళ జంతువు ఏదైనా మూడు కాళ్ళతో నిలువ లేనట్లు ఈ అహింస కూడ మూడుకారణాలతో పాలించినా అహింసకాలేదు. ఏనుగుఅడుగు జాడలలో కాళ్ళతో నడిచే ఇతర ప్రాణుల అడుగుజాడలు కలిసిపోయినట్లు ప్రాచీన కాలంలో లోకంలో ధర్మబద్ధంగా అహింస నిర్దేశింపబడింది. ప్రాణికి మనసా, వాచా, కర్మణా చేసిన హింసలతో దోష మంటుతుంది. ముందు మనసా, ఆపై వాచా, కడకు కర్మణా హింసను త్యజించి, మాంసాన్ని భక్షించనివాడు త్రివిధ హింసా దోషాలనుండి విముక్తి నందుతాడు. బ్రహ్మవాదులు హింసకు మూడు కారణాలను చెప్పారు. మనసా మాంసభక్షణను భావించటం, వాచా మాంస భక్షణను ఉపదేశించటం, కర్మణా మాంసాన్ని భక్షించటం - ఈ మూడూ హింసా దోషానికి ఆధారాలు. అందువలన తపస్సుపై ఆసక్తిగల ధీమంతులు మాంసాన్ని తినరు. రాజా ! మాంస భక్షణలో ఉన్న దోషాలను చెపుతాను, విను.

విచక్షణ లేక కుమారుని మాంసానికీ, ఇతర మాంసానికి తేడా లేదని తెలిసికూడా మోహవశుడై మాంస భక్షణ చేసేవాడు నరాధముడు. తల్లిదండ్రుల కలయికతో

పుత్రోదయమైనట్లు హింసచేసిన పాపాత్ముడు, వివశుడై పదే పదే పాపజన్మను పొందవలసివస్తుంది. నాలుక ద్వారా రుచి తెలిసి, దానిపై ఆసక్తి కలిగినట్లు మాంసాన్ని తినటం ప్రారంభిస్తే దానిపై ఆసక్తి పెరుగుతుంది. శాస్త్రాలలో కూడా అలాగే నియమింపబడింది. విషయానుభావం ఆసక్తిని పెంచుతుంది. మసాలాలతో సంస్కరించిన మాంసం ఒకరుచి. అది లేని మాంసం ఒకరుచి. కేవలం ఉడికిన మాంసం ఒకరుచి. ఉప్పు కలిసిన దొకరుచి. ఉప్పులేని దొకరుచి. ఈ రుచి భేదాలవలన మనస్సులో ఆసక్తి కలుగుతుంది. మాంసాన్ని తినేనరులు స్వర్గంలో పుష్కలంగా లభించే భేరీ మృదంగ శబ్దాలను, తంత్రీ శబ్దాలను ఎలా సేవించగలరు ? ఆ మూర్ఖ లసలు స్వర్గానికి వెళ్ళరు గదా ! మాంసరుచి మీద ఉన్న ఆసక్తితో అదే యావకు లోనై ఆ ఫలాన్ని కోరుకొంటూ దానిని ప్రశంసించే వారు ఊహకు, మాటకు, మనస్సుకు అందని స్థితిని పొందుతారు.

మరణానంతరం బూడిదయై పోవటమో, ఏ జంతువో తింటే దాని మలంగా మారటమో, పురుగులు పట్టడమో ఈ మూడింటిలో ఏదో ఒకటి ఈ శరీరానికి నిశ్చితం.

ఈ స్థితిలో వివేకి ఎవడైనా ఇతరులను పీడించి, తన శరీరాన్ని కాపాడుకోవాలనుకొంటాడా ? మాంస భక్షణను ప్రశంసించటమే పాపమయమైన కర్మఫలాన్ని ఇస్తుంది. ఎందరో సజ్జనులు తమ మాంసాలతో పరుల మాంసాలను పరిరక్షించి, మరణానంతరం స్వర్గానికి వెళ్ళారు. మహారాజా ! ఈ రీతిగా నాల్గు రకాలుగా ఆవరించి ఉన్న అహింసా స్వరూపాన్ని నీకు చెప్పాను. అది సర్వధర్మ సంహిత.

115. మద్యమాంస పరిత్యాగ ఫలము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు "అహింసయే పరమధర్మ మని ఎన్నో విధాలుగా చెప్పావు. మాంస భక్షణాన్ని విడనాడే విషయంలో మాకు ధర్మసంశయ ముంది. మాంసాన్ని తింటే దోషమేమిటి ? తినకపోతే గుణమేమిటి ? చంపితినే వాడొకడు. ఇతరులిచ్చిన మాంసం అనే వాడొకడు ఇతరులు తినటానికై జంతువధ చేసే వాడొకడు. కొనుక్కొని తినేవాడొకడు. వారికి ఫలమేమిటి ? అనఘా ! ఈ విషయంలోని తత్త్వాన్ని చెపితే వినాలని ఉంది. ఈ సనాతనధర్మాన్ని నిశ్చితంగా ఆచరింపదలచుకొన్నాను. మనిషి ఆయుస్సు నెలా పొందుతాడు ? ఎలా బలశాలి కాగలడు ? ఎలా సర్వాంగసహితుడు కాగలడు ? శుభలక్షణసంపన్నుడెలా కాగలడు ?"

భీష్ముడు చెప్తున్నాడు 'రాజా ! మాంసం తినకపోవటం ఎటువంటి ధర్మమో,

దానికి సంబంధించిన ఉత్తమ విధి ఎటువంటిదో దాని తత్వాన్ని యథాతథంగా చెపుతాను, విను. అవికలరూపాన్ని, ఆయుస్సును, బుద్ధిని, సత్వాన్ని, బలాన్ని, జ్ఞాపకశక్తిని పొంద దలచిన మహాత్ములైన నరులు హింసను వర్జించారు. ఋషుల మధ్య ఈ విషయానికి సంబంధించి అనేక చర్చలు జరిగాయి. వారి వారి అభిప్రాయా లెటువంటివో విను. ధర్మజా ! ప్రతిమాసంలోనూ వ్రతధారియై అశ్వమేధయాగం చేసినవానికీ, మధుమాంసాలను విడనాడిన వానికీ ఫలితం సమానమే. రాజా ! ధీమంతులైన సప్తర్షులు, వాలఖిల్యులు, మరీచిపులు మాంసం తినకపోవటాన్ని ప్రశంసిస్తున్నారు. మాంసం తిననివాడు, జంతువధచేయనివాడు, జంతువులను చంపించనివాడు సర్వప్రాణులకు మిత్రుడని స్వాయంభువమనువు చెప్పాడు. మాంసాన్ని పరిత్యజించిన వానిని ఏ ప్రాణీ తిరస్కరించదు సర్వప్రాణులు నమ్ముతాయి. సాధువులు వానిని గౌరవిస్తారు. ఇతరుల మాంసంతో తన మాంసాన్ని పెంపొందింప జేయగోరినవాడు తప్పక దుఃఖాన్ని పొందుతాడని ధర్మాత్ముడైన నారదు డన్నాడు. మద్యమాంసాలను పరిత్యజించినవాడు దానమిచ్చినట్లే, యాగాలు చేసినట్లే, తపస్సు చేసినట్లే అని బృహస్పతి చెప్పాడు. వంద సంవత్సరాలపాటు ప్రతిమాసంలోనూ అశ్వమేధం చేసినవాడు, మాంస భక్షణాన్ని పరిత్యజించినవాడూ సమానులే అని నా అభిప్రాయం. మద్యమాంసాలను పరిత్యజిస్తే సదా యాగం చేసినట్లే, నిత్యమూ దానం చేసినట్లే, నిరంతరంగా తపస్సు చేసినట్లే.

భారతా ! ముందు మాంసాన్ని తింటున్నా తరువాత దానిని విడిచిపెట్టినవాడు పొందే ఫలాన్ని సర్వవేదాలు కానీ, సర్వయజ్ఞాలు కానీ అందించలేవు. మాంసం రుచి చూసిన తరువాత దానిని విడిచిపెట్టడం, సర్వప్రాణులకు అభయదాయకమైన అహింసా వ్రతాన్ని పాటించటం ఎంతో దుష్కరమైన వ్రతం. సర్వప్రాణులకూ అభయమిచ్చిన విద్వాంసుడు లోకంలో నిస్సంశయంగా ప్రాణదాత అవుతాడు. ఈ రీతిగా ధీమంతులు అహింసావ్రతాన్ని పరమ ధర్మంగా పరిగణిస్తారు. ప్రాణాలు తన కిష్టమైనట్లే సమస్త ప్రాణులకు కూడా ఇష్టమైనవే. బుద్ధిమంతులు, పుణ్యాత్ములు సమస్త ప్రాణులనూ తమవలెనే భావించాలి. తమ శ్రేయస్సును కోరుకొనే పండితులకు కూడా మృత్యువంటే భయమే. ఆస్థితిలో బ్రతుకు మీద ఆశ ఉండి కూడా మాంస జీవనులైన పాపాత్ములచే చంపబడే ప్రాణులకు భయముండదా ? పైగా అవి ఏరోగమూ లేనివి, ఏ తప్పు చేయనివి. కాబట్టి మహారాజా ! మాంస పరిత్యాగం ధర్మానికి, స్వర్గప్రాప్తికి, సుఖసిద్ధికి ఉత్తమ సాధనం. అహింసయే పరమధర్మం. అహింసయే పరమ తపస్సు. అహింసయే పరమసత్యం. ఆ

అహింస నుండియే ధర్మం ప్రవర్తిస్తుంది. మాంసం గడ్డినుండి కానీ, కట్టెనుండీ కానీ, రాతినుండి కానీ లభించదు. ప్రాణిని చంపితేనే మాంసం దొరుకుతుంది. కాబట్టి మాంస భక్షణం దోషం. స్వాహా (దైవయజ్ఞం) స్వధా (పితృయజ్ఞం) నుష్ఠానం తరువాత యజ్ఞశిష్టమైన అమృతాన్ని భుజించే దేవతలు సత్యాన్ని, ఋజుత్వాన్ని ప్రేమిస్తారు. సదా మాంసభక్షణం చేసే రాక్షసులు కుటిలులు, అసత్యపరాయణులు అని గ్రహించు. రాజా ! మాంసాన్ని తిననివాడు భీకరారణ్యాలలో కానీ, దుర్గమ వనాలలో కానీ, రాత్రి కానీ, పగలు కానీ, ఉభయ సంధ్యలలో కానీ, కూడళ్ళలో కానీ, సభలలో కానీ, ఎదుటివాడు ఆయుధ మెత్తినా కానీ, జంతుభయమో సర్పభయమో కలిగేటప్పుడు కానీ ఇతరులవలన భయపడడు. అతడు సర్వప్రాణులకూ శరణు నిస్తాడు. సర్వప్రాణులు నమ్మదగినవాడవుతాడు, ఎవ్వరికీ ఉద్వేగాన్ని కలిగించడు, ఎవరివలనా ఉద్వేగాన్ని పొందడు.

తినేవాడు లేకపోతే చంపే వాడుండడు. పశువులను చంపేవాడు మాంసభక్షకుల కోసమే పశుహింస చేస్తున్నాడు. మాంసం తినదగినిది అని నిర్ణయించుకొంటే ఇక హింస ఉండదు. కేవలం మాంసం తినేవారికై పశుహింస జరుగుతోంది. మహాతేజస్వీ ! హింసకుని ఆయుస్సును అతడు చేసిన పాపం హరిస్తుంది. కాబట్టి తన శ్రేయస్సును కోరుకొనే వాడు మాంసభక్షణాన్ని విడనాడాలి. ప్రాణులను హింసిస్తూ భయంకరంగా సంచరించే ప్రాణులు తమకై రక్షకుని పొందలేనట్లు ప్రాణులను హింసించే మనిషి కూడా పాములవలె, జంతువులవలె ఇతరుల ఉద్వేగానికి గురి అవుతాడు. తనకు రక్షకు డుండడు. మనుష్యులకు లోభం వలన, బుద్ధి మోహంవలన; బలాన్ని, శక్తినీ పొందగోరి, పాపులతో మైత్రివలన అధర్మంపై ఆసక్తి కలుగుతుంది. ఇతరుల మాంసంతో తన మాంసాన్ని పెంచుకోదలచిన వాడు ఎక్కడ పుట్టినా ఉద్వేగంతోనే నివసిస్తాడు. నియమ పరాయణులైన మహర్షులు ధనాన్నీ, కీర్తినీ, ఆయుస్సునూ, స్వర్గాన్ని పొందటానికి మాంస భక్షణ పరిత్యాగమే ఉత్తమ సాధన మన్నారు. కౌంతేయా ! గతంలో మార్కండేయ మహర్షి చెప్పగా మాంసభక్షణలోని దోషాలను నేను విన్నాను.

బ్రతుకుక దలచుకొన్న ప్రాణులను చంపి లేదా స్వయంగా మరణించిన జంతువుల మాంసాన్ని తిన్నవాడు తాను వాటిని చంపకపోయినా చంపినట్టే లెక్క. కొన్నవాడు ధనంతో, తిన్నవాడు అనుభవించటంతో, చంపిన వాడు వధబంధాలతో - ఇలా త్రివిధంగా ప్రాణివధ జరుగుతోంది. మాంసాన్ని తినకపోయినా తినేవారిని ఆమోదించిన వాడు భావదోషం వలన మాంసభక్షణ పాపాన్ని పొందుతాడు. అలాగే చంపేవాడిని ఆమోదించినవానికి

కూడా హింసాదోష మంటుతుంది. మాంసాన్ని తినకుండా ఇహలోకంలో సమస్త ప్రాణులపై దయ చూపేవానని ఏ ప్రాణీ తిరస్కరించదు. అతడు రోగరహితుడై, చిరంజీవి అవుతాడు. సువర్ణదానం కన్న, గోదానం కన్న, భూదానం కన్న మాంసాన్ని తినకపోవటం విశిష్ట ధర్మ మని మేము విన్నాం. మాంసం తినేవారి కోసం పశుహత్య చేసేవాడు నరాధముడు. మాంసంతినే వాని కన్న ఎక్కువ పాపం చంపిన వానికే చెందుతుంది. మాంసలోభియై, మూర్ఖుడై యజ్ఞయాగాది వైదిక మార్గాల పేరుతో ప్రాణిహింస చేసే వాడు అధముడు. వాడు నరకాన్ని పొందుతాడు. ముందు మాంసం తినే అలవాటున్నా, తరువాత దానిని విడిచిపెట్టిన వానికి మహాధర్మఫలం లభిస్తుంది. అతడు పాపవిముక్తుడవుతాడు. పశువును తెచ్చినవాడు, అనుమతించినవాడు, చంపినవాడు, అమ్మినవాడు, కొన్నవాడు, వండినవాడు, తిన్నవాడు వీరందరూ మాంసం తిన్నట్లే. ఈ విషయమై బ్రహ్మ విధించి, ప్రాచీన ఋషులు అంగీకరించి, వేదాలలో ప్రతిష్ఠించిన మరొక ప్రమాణాన్ని కూడా చెపుతాను. సంతతిని కోరే మనుషులు ప్రవృత్తి రూప ధర్మాన్ని ప్రతిపాదించారు. మోక్షార్థులై విరక్తి గొన్న వారు మాత్రం దానిని అంగీకరించరు. తనను తాను ఏ ఉపద్రవాలు లేనివానినిగా నిలుపుకొనదలచిన పురుషుడు జంతు మాంస భక్షణాన్ని పూర్తిగా విడిచిపెట్టాలి.

పూర్వకల్పంలో మనుష్యులు యజ్ఞంలో అన్నాన్నే (పురోడాశాదులు) పశువుగా వినియోగించేవారు. పుణ్యలోక పరాయణులైన యజమానులు దానితోనే యాగం చేసేవారు. రాజా ! గతంలో ఈ విషయమై ఋషులు చేదిరాజైన వసువును తమ సందేహాన్ని గూర్చి అడిగారు. ఆయన తినదగని మాంసాన్ని తినదగినదనే చెప్పాడు. ఆ అనుచిత నిర్ణయం వలన ఆ రాజు ఆకాశం నుండి నేలకు దిగజారాడు. మరలా అదే మాట అని, ఇక్కడ నుండి పాతాళానికి చేరుకొన్నాడు. రాజేంద్రా ! నేను చెపుతున్నాను, విను. మాంసాన్ని తినకపోవటమే సర్వసుఖం. నిండు నూరు సంవత్సరాలు దారుణ తపస్సు నాచరించిన వాడు, మాంసభక్షణాన్ని పరిత్యజించినవాడు, ఇద్దరూ సమానమే అని నా అభిప్రాయం. రాజా ! విశేషించి శరదృతువులో, శుక్ల పక్షంలో మద్యమాంసాలను పూర్తిగా పరిహరించాలి. ఇది ధర్మబద్ధమైన విధి.

సంవత్సరంలో నాలుగు నెలల పాటు మాంసాన్ని వదలి పెట్టినవాడు నాలుగు శుభాలను పొందుతాడు. అవి కీర్తి, ఆయుస్సు, యశస్సు, బలం. లేకపోతే ఒక నెలపాటు సర్వమాంసాలను తినకుండా ఉన్నా వాడు సర్వదుఃఖాలను అతిక్రమించి, రోగాలు లేకుండా సుఖంగా జీవిస్తాడు. నెలరోజులపాటు, లేదా పక్షం రోజులపాటు మాంసాన్ని పరిత్యజించినవాడు

హింసకు దూరమైనట్లే తనకు బ్రహ్మలోకం ప్రాప్తిస్తుంది. రాజా ! ఆశ్వయుజమాసంలో రెండు పక్షాలలో లేదా ఒక పక్షంలో మాంసాన్ని పరిత్యజించి, కొందరు రాజులు సర్వభూతాలనూ ఆత్మ రూపంగా భావించి, పరావర తత్త్వాన్ని తెలిసికొన్నారు. ఆ రాజులు నాభాగుడు, అంబరీషుడు, మహాత్ముడైన గయుడు, ఆయువు, అనరణ్యుడు, దిలీపుడు, రఘువు, పూరుడు, కార్తవీర్యుడు, అనిరుద్ధుడు, నహుషుడు, యయాతి, నృగుడు, విశ్వగశ్వుడు, శశబిందుడు, యువనాశ్వుడు, శిబి (ఉశీనరసుతుడు) ముచుకుందుడు, మాంధాత, హరిశ్చంద్రుడు. సత్యాన్ని పలకండి. అసత్యమాడవద్దు. సత్యం సనాతన ధర్మం. హరిశ్చంద్రుడు సత్య ప్రభావంతోనే ఆకాశంలోనే చంద్రునివలె సంచరిస్తున్నాడు. శ్యేనచిత్రుడు, సోమకుడు, వృకుడు, రైవతుడు, రంతిదేవుడు, వసువు, సృంజయుడు, ఇతర రాజులు, కృపుడు, భరతుడు, దుష్యంతుడు, కరూషుడు, రాముడు, అలర్కుడు, నరుడు, విరూపాశ్వుడు, నిమి, ధీమంతుడైన జనకుడు, పురూరవుడు, పృథువు, వీరసేనుడు, ఇక్ష్వాకుడు, శంభువు, శ్వేత సాగరుడు, అజుడు, దుంధువు, సుబాహువు, హర్యశ్వుడు, క్షుపుడు, భరతుడు - ఈ రాజులు, ఇంకా ఇతర రాజులు మాంసాన్ని తినలేదు. ఈ రాజు లందరూ శోభాసంపన్నులై, ప్రజ్వలిస్తూ, బ్రహ్మలోకంలో వేలకొలది స్త్రీలతో గూడి, గంధర్వుల సేవలనందుకొంటూ విరాజిల్లుతున్నారు.

కాబట్టి ఈ అహింసా రూపమైన ధర్మం సర్వధర్మాలలోనూ శ్రేష్ఠం. ఈ ధర్మాన్ని పాటించిన మహాత్ములు స్వర్గలోకంలో నివసిస్తారు. ధర్మాత్ములై పుట్టిన నాటి నుండి కల్లు, సారాయి, మాంసం విడిచిపెట్టిన వారు మునులుగా పరిగణింపబడతారు. మాంసభక్షణ పరిత్యాగరూపమైన ఈ ధర్మాన్ని పాటించినవాడు, ఇతరులకు వినిపించినవాడు, దురాచారుడైనా నరకానికి పోడు. పవిత్రమూ, ఋషిపూజితమూ అయిన ఈ మాంస భక్షణ పరిత్యాగ విధిని పదే పదే చదివిన వాడు, విన్నవాడు సర్వపాపాలనుండి విముక్తిని పొంది, కోరిక లన్నీ తీరి విరాజిల్లుతాడు. జ్ఞాతులలో విశిష్టస్థానం పొందుతాడు. ఇక్కడ సంశయం లేదు. ఆపన్నుడు ఆపదలనుండి విముక్తి పొందుతాడు. బద్ధుడు బంధవిముక్తి నందుతాడు. రోగి రోగవిముక్తు డవుతాడు. దుఃఖితుడు దుఃఖాల నుండి విముక్తి నందగలడు. ఆ నరుడు పశుపక్ష్యాదులలో జన్మించడు. రూపవంతుడవుతాడు. సంపదలను, విపులకీర్తిని పొందుతాడు. రాజా ! ఇలా నేను ఋషులు ఏర్పరచిన మాంస పరిత్యాగ విధానాన్ని గురించి, ప్రవృత్తినివృత్తులను గురించి చెప్పాను.'

116. అహింసాధర్మ ప్రశంస.

యుధిష్ఠిరు డడుగుతున్నాడు 'ఈ లోకంలో ఈ మానవులు వివిధ భక్ష్య పదార్థాలను కాదని మహారాక్షస సమూహాలవలె క్రూరులై మాంసలోలుపులవుతున్నారు. వివిధ స్వరూపాలలో ఉన్న అపూపాలను, వివిధ శాకాలను, రుచికరాలైన తీపి పదార్థాలను కూడా మాంసం వలె ఇష్టపడటం లేదు. ప్రభూ ! కాబట్టి మాంసాన్ని మానటంలోని గుణాలను, మాంసాన్ని తినటంలోని దోషాలను వినగోరుతున్నాను. ధర్మాన్ని అనుసరించి ఉన్నదున్నట్లుగా సమస్త విషయాన్ని తెలియజేయి. తిన దగిన దేమిటో తినదగని దేమిటో కూడా చెప్పు మాంస స్వరూప మేమిటి ? అది ఎటువంటిది ? దాన్ని మానటంలోని గుణాలేవి ? తినటంలోని దోషాలేవి ? పితామహా ! నాకు చెప్పు.'

భీష్ముడు చెప్తున్నాడు 'మహాబాహూ ! నీవు చెప్పినది నిజమే. మాంసాన్ని విడనాడటంలో ఎన్నో గుణాలున్నాయి. అవి మనుష్యులకు ఎలా ఉపయోగపడతాయో చెపుతా, విను. పరమాంసంతో తన మాంసాన్ని పెంపొందించుకోవా లనుకొనే వానికన్న మరీ క్షుద్రుడు లేడు. మరీ క్రూరుడైన నరుడూ లేడు. లోకంలో ప్రాణాల కన్న ఇష్టమైనది మరొకటి లేదు. కాబట్టి నరుడు తనమీదయను కోరినట్లు ఇతరులపై దయ చూపాలి. నాయనా ! శుక్రంనుండి మాంసం పుడుతుంది. ఈ విషయంలో సంశయం లేదు. మాంసభక్షణం మహాదోషం. మాంస పరిత్యాగం పుణ్యప్రదం. సర్వప్రాణులపై దయచూపటంతో సమానమైనది ఇహపరలోకాలలో మరొకటి లేదు. దయామయుడైన నరునికి ఈలోకంలో ఏ భయమూ కలుగదు. దయావంతులకు, తాపసులకు ఇహపర లోకాలు సుఖప్రదాలు. అహింసయే ధర్మానికి లక్షణమని ధర్మవేత్త లంటారు. మనస్వి అయిన నరుడు అహింసాత్మక కర్మలనే చేయాలి. దయాపరుడై, సర్వప్రాణులకు అభయమిచ్చిన వానికి సర్వభూతాలు అభయదానం చేస్తాయని వింటుంటాం. సర్వప్రాణులకూ అభయ మిచ్చినవాడు గాయపడినా, జారినా, నేలబడినా, ప్రవాహంలో లాగుకొని పోతున్నా, సమవిషమ పరిస్థితులలోనున్నా సర్వ భూతాలు అతనిని రక్షిస్తాయి. ఇతరులను భయంనుండి బయటపడవేసిన వానిని క్రూరమృగాలు చంపుతాయి. పిశాచాలు గానీ, రాక్షసులు గానీ చంపరు. భయం కలిగిన సమయంలో దీనినినుండి బయటపడతాడు.

ప్రాణదానాన్ని మించిన దానం ఇంతవరకు లేదు. ఇక మీదట ఉండబోదు. తన కన్న ఇష్టమైన వస్తువు ఏదీ లేదని నిర్ణయం. భారతా ! సర్వప్రాణులకూ మరణం

కన్న నచ్చనిది ఏదీ లేదు. మరణకాలంలో ప్రాణులకు వెంటనే వణుకు పుడుతుంది. సంసార సాగరంలో నరుడు గర్భవాసం, జననం, వార్ధక్యం మొదలయిన వాటితో నిత్యమూ దుఃఖిస్తూ, పరిభ్రమిస్తుంటాడు. మరణమంటే ఉద్వేగానికి లోనవుతాడు. గర్భవాసంలో మూత్ర స్వేదపురీషాల మధ్య నిలిచి, మరీ దారుణంగా ఉండే కారం, ఆమ్లం, చేదు రసాలతో పక్వం చేయబడతాడు. ఆ రసస్పర్శ పరుషంగా ఉంటుంది. మాంసంపై ప్రేమగల జీవుడు జననానంతరం కూడా వివశుడై మరల మరల భేదింపబడుతూ, వండబడుతుంటాడు. అది ప్రత్యక్షంగా కనిపించేదే. పాపకారణంగా కుంభీపాక మనే నరకంలో కూడా పాకానికి గురి·అవుతారు. మరల ఆయా జాతులలో పుట్టి, ఆక్రమణ పూర్వకంగా చంపబడతారు. ఇలా సంసార చక్రంలో త్రిప్పబడుతూనే ఉంటారు. లోకమర్యాద ననుసరించి తనకన్న ప్రియమైనది తనకేదీ ఉండదు. **కాబట్టి సర్వప్రాణులను దయతో తననువలె చూడగలగాలి.** రాజా ! బ్రతికిఉన్నంతకాలం ఏ మాంసమూ తిననివాడు మరణానంతరం స్వర్గంలో విశాలస్థానాన్ని పొందుతాడు. ఈ విషయంలో సంశయం లేదు. బ్రతుకగోరుతున్న ప్రాణుల మాంసాలను తిన్నవాడు మరుసటి జన్మలో ఆ భూతాలచేతనే తినబడతాడు. నాకు సందేహంలేదు. భారతా ! 'నన్ను తాను తింటున్నాడు కాబట్టి నేను కూడా అతనిని తింటాను (మాం సః)' అని ఆహారమవుతున్న ప్రాణి భావిస్తుంది. అందువలననే మాంసానికి మాం సత్వం సిద్ధించిందని గ్రహించు. రాజా ! ఈ జన్మలో చంపినవాడు మరుసటి జన్మలో నిత్యమూ చంపబడతాడు. అలాగే తిన్నవాడు కూడా చంపబడతాడు. ఇతరుల నిందించినవాడు నిందితుని కోపానికి గురియై, ద్వేషానికి పాత్రు డవుతాడు. ఎవడు ఏ శరీరంతో ఏయే కర్మలను చేస్తాడో ఆ యా శరీరాలతో ఆ యా కర్మ ఫలాల ననుభవిస్తాడు.

అహింసయే పరమధర్మం. అహింసయే మహాదమం. అహింసయే గొప్పదానం. అహింసయే ఉత్తమ తపస్సు. అహింసయే పరమయజ్ఞం. అహింసయే పరమ తపస్సు. అహింసయే పరమ మిత్రుడు. అహింసయే పరమ సుఖం. సర్వయజ్ఞాలలో దానం చేసినా, సర్వతీర్థాలలో మునిగినా, సర్వదాన ఫలాన్ని పొందినా అవి అహింసతోసాటి కావు. హింస చేయనివాని తపస్సు అక్షయ మవుతుంది. హింసచేయనివాడు సర్వ ప్రాణులకూ తల్లి, తండ్రి. కురుశ్రేష్ఠా ! ఇది అహింసా ఫలం. ఇంకా ఎక్కువ కూడా ఉంటుంది. వంద సంవత్సరాలు తీసికొన్నా అహింసాగుణాలను చెప్పటం కుదరదు.'

117. కీటోపాఖ్యానము - 1.

యుధిష్ఠిరు డడిగాడు. పితామహా మహసంగ్రామంలో ఇష్టంతో కానీ, అనిష్టంతోకానీ మరణించినవారు ఏ గతిని పొందుతారు ? అది నాకు చెప్పవలసింది. మహాప్రాజ్ఞా ! మహాసంగ్రామంలో మనుష్యులకు ప్రాణపరిత్యాగం ఎంతో దుఃఖకారణం. ప్రాణత్యాగం దుష్కరమైన దని నీ వెరిగినదే గొప్పగా ఉన్నా, హీనంగా ఉన్నా, శుభకరమైనా, అశుభకరమైనా ఏ స్థితిలోనూ ప్రాణత్యాగం దుష్కరమే. దానికి కారణమేమిటో చెప్పు. నా దృష్టిలో నీవు సర్వజ్ఞుడవు' భీష్ముడు చెప్తున్నాడు 'రాజా ! గొప్పగా ఉన్నా, హీనంగా ఉన్నా, శుభకరమైనా, అశుభకరమైనా ఈ సంసారంలో పడిన ప్రాణులు సుఖంగానే భావిస్తారు. మరణాన్ని కోరుకోరు. దానికి కారణం విను. యుధిష్ఠిరా ! ఇలా నీవు మంచి ప్రశ్న వేశావు.

ఈ విషయమై గతంలో వ్యాసునకూ కీటకానికీ మధ్య జరిగిన సంవాదాన్ని చెపుతాను. ఒకప్పుడు బ్రాహ్మణుడు, బ్రహ్మస్వరూపుడు అయిన వ్యాసుడు బళ్ళబాటపై వేగంగా పరుగెత్తుతున్న పురుగును చూశాడు. ఆ వ్యాసుడు సర్వప్రాణుల గమనాలను సర్వప్రాణుల భాషలను తెలిసిన సర్వజ్ఞుడు. ఆయన అలా పరుగెత్తుతున్న పురుగును చూసి ఇలా అన్నాడు. 'కీటమా ! భయపడినట్లున్నావు. త్వరపడుతున్నట్లు కనిపిస్తున్నావు. ఎక్కడికి పరుగెడుతున్నావు ? దేనికి భయపడుతున్నావు ? చెప్పు.' కీటమిలా అన్నది 'మహామతీ ! ఈ బండి చేస్తున్న పెద్ద చప్పుడు విని నాకు భయం కలుగుతోంది. ఈ ధ్వని భయంకరంగా ఉంది. ఆ చప్పుడు వింటుంటే అది నన్ను చంపటానికి వస్తున్నట్లుంది. అందువలన ఇక్కడనుండి తొలగిపోతున్నాను. కొరడా దెబ్బలు తింటూ, మహాభారాన్ని లాగుకొని వస్తున్న ఎద్దుల నిశ్శ్వాసధ్వని దగ్గరగానే వినిపిస్తోంది. ప్రభూ ! ఆ బండి నడుపుతున్న మనుష్యుల వివిధ ధ్వనులు కూడా వినిపిస్తున్నాయి. మావంటి కీటకాలు ఇటువంటి ధ్వనిని వినలేవు. కాబట్టి ఈ దారుణభయంనుండి తప్పుకొని పోతున్నాను. ప్రాణులకు మృత్యువు దుఃఖకరం. జీవితం చాలా దుర్లభం. అందువలన నేను పారిపోతున్నాను. సుఖంలో నుండి దుఃఖంలోనికి పడదలచుకోలేదు.'

భీష్ముడు చెప్తున్నాడు 'కీటక మలా అనగానే వ్యాసుడు దానినిలా అడిగాడు. "కీటకమా నీకు సుఖమేమిటి ? నీకు మరణమే సుఖ మనుకొంటున్నాను. నీవు పురుగుగా బ్రతుకుతున్నావు. నీకు గొప్ప శబ్దమూ, స్పర్శ, రసమూ, గంధమూ గొప్పగొప్ప భోగాలూ ఏమీ తెలియవు. నీకు మరణమే శ్రేయస్కరం." కీటక మిలా అన్నది "జీవుడు ఏ పుట్టుకలోనైనా సుఖపడతాడు. ఈ జన్మలో కూడా నాకు సుఖముంది. మహాప్రాజ్ఞా !

అందువలననే బ్రతుకదలచుకొంటున్నాను. ఈ జన్మలో కూడా దేహాన్ని అనుసరించి సర్వ విషయాలు లభిస్తాయి. మనుష్యులకు, స్థావర ప్రాణులకు భోగానుభవం వేరువేరుగా ఉంటుంది. గతంలో నేను మనుష్యుడను, అందునా శూద్రుడను. ధనవంతుడను బ్రాహ్మణులను వ్యతిరేకించేవాడను. క్రూరుడనై, నీచుడనై వడ్డీతో బ్రతికేవాడిని. పరుషమైన మాట, మోసగించటంలో నేర్పు ఉండేవి. సర్వజగత్తునూ ద్వేషించేవాడను. అసత్యాలతో వంచించటం, ఇతర ధనాపహరణపై ఆసక్తి గలవాడను. నేను క్రూరుడను. రుచులపై ఆసక్తితో ఒంటరిగానే భుజించాలనుకొనే వాడిని. ఈర్ష్యకు లోనై ఇంటికివచ్చిన అతిథులను పస్తుపెట్టేవాడిని. గతజన్మలో దేవతల కోసం, పితృయజ్ఞం కోసం శ్రద్ధగా అన్నాన్ని సమకూర్చే వాడను. కానీ అర్థాసక్తితో ఆ అన్నాన్ని కూడా దానం చేసే వాడను కాను. భయపడినప్పుడు శరణాగతులై రహస్యరక్షణ కోరి నా ఇంటికి వచ్చిన వారిని హఠాత్తుగా విడిచి పుచ్చే వాడను. అభయాన్ని కోరిన వారిని రక్షించేవాడను కాదు. మనుష్యుల ధనాన్ని, ధాన్యాన్ని, ప్రియభార్యలను, వాహనాలను, అద్భుత గృహాలను, సంపదలను చూసి, నిరర్థకంగా అసూయపడుతున్నాను. పరుల సుఖాన్ని చూసి ఈర్ష్యపడుతున్నాను. ఇతరుల ఔన్నత్యాన్ని సహించలేను. ఇతరుల ధర్మార్థకామాలను బాధిస్తాను. స్వేచ్ఛగా ప్రవర్తిస్తున్నాను. గతంలో నేను క్రూరకర్మనే చేసి ఉంటాను. దానిని తలచుకొంటుంటే ప్రియపుత్రుని పోగొట్టుకొన్నంత పశ్చాత్తాపం కలుగుతోంది. గతంలో నేను చేసిన శుభకర్మల ఫలితాన్ని అనుభవించలేదు. వృద్ధురాలైన నా తల్లిని పూజించాను. బ్రాహ్మణులను అర్చించాను. ఒకసారి పదిమందితో కలిసి ఇంటికి వచ్చిన సద్గుణ సంపన్నుడైన బ్రాహ్మణాతిథిని ఆదరించాను, బ్రహ్మస్వరూపా! ఆ పుణ్యఫలంవలన పూర్వజన్మ స్మృతి నన్ను వీడలేదు. తపోధనా ! నేను మరల ఏదో శుభకర్మతో రాబోయే జన్మలో సుఖపడదలచుకొన్నాను. తమ ద్వారా ఆ శ్రేయస్కరమైన కర్మను గూర్చి వినదలచుకొన్నాను.'

118. కీటోపాఖ్యానము - 2

వ్యాసుడు చెప్తున్నాడు 'తిర్యగ్జాతిలో పుట్టికూడా మోహానికి లోనుకాక పోవటానికి కారణమైన శుభకర్మ నాతో ముడివడినదే. నా దర్శనం వలననే నీవు మోహానికి గురికాలేదు. నేను నిన్ను తపోబలంతో నాదర్శనంతోడనే తరింపజేయగలను. తపోబలాన్ని మించిన బలిష్ఠమైన బలం మరొకటి లేదు. కీటకమా ! నీవు చేసిన పాపాల ఫలితంగా నీవు పురుగువైనా వని తెలుసు. నీకు ఇప్పుడు ధర్మం కావాలనిపిస్తే నీకు మరల ధర్మం

లభిస్తుంది. దేవత లయినా, పశుపక్ష్యాదు లయినా ఈ కర్మ భూమిలో చేసిన కర్మఫలాన్ని అనుభవిస్తాయి. మనుష్యులలో ధర్మం కూడా కామం కోసమే. అలాగే గుణాలు కూడా కామసిద్ధి కోసమే కనిపిస్తాయి. మనుష్యుడు పండితుడయినా పామరుడయినా వాక్కు, బుద్ధి చేతులు, కాళ్ళు లేకుండా జీవిస్తుంటే ఏం త్యజించగలడు ? సర్వాత్మనా తానే పరిత్యక్తుడు. ఒకచోట ఒక బ్రాహ్మణుడున్నాడు. నిత్యజీవితంలో చంద్ర సూర్యుల నర్చిస్తుంటాడు. పుణ్యకథలను వినిపిస్తుంటాడు. కీటకమా ! నీవు అక్కడ జన్మించగలవు. అక్కడ పంచభూత విషయాలను అనాసక్తంగా నీవు అనుభవించగలవు. అక్కడ నేను నీకు బ్రహ్మవిద్యను బోధిస్తాను. నీవు కోరిన లోకానికి వెళ్ళవచ్చు.'

ఆ పురుగు అలాగే అని పలికి బాటలోనే నిలిచింది. ఒకచోట ఒక పెద్ద బండి అక్కడకు వచ్చింది. చక్రం మీదదొర్లి ఆ పురుగు శిధిలమై మరణించింది. ఆపై అది క్రమంగా ముండ్లపంది, ఉడుము, పంది, మృగం, పక్షి, చండాలుడు, శూద్రుడు, వైశ్యుడుగా జన్మించి కడగా క్షత్రియజన్మ పొందింది. ఇతర జాతులన్నింటిలో తిరిగి, అమిత తేజస్వి అయిన వ్యాసుని అనుగ్రహం వలన క్షత్రియ జాతిలో పుట్టి, మహర్షిని దర్శించగోరి, ఆయన దగ్గరకు వెళ్ళింది. పురుగుగా ఉన్నప్పుడు సత్యవాది అయిన ఆ మహర్షితో మాటాడినదంతా స్మరించి, ఆ క్షత్రియుడు చేతులు జోడించి, ఆ మునిపాదాలను పట్టాడు. కీటకం (క్షత్రియుడు) ఇలా అన్నది 'నేను సాటిలేని స్థానాన్ని పొందాను. పది జన్మల నుండీ నేనీ స్థితిని కోరుకొంటున్నాను. పురుగుగా ఉంటూ కూడా నేను రాజపుత్రుడుగా పుట్టగలగటం తమ అనుగ్రహమే సువర్ణమాలలు ధరించి ఎంతో బలం గల ఏనుగులు ఇప్పుడు నన్ను మోస్తున్నాయి. కాంబోజ జాతికి చెందిన మేటి గుర్రాలు నా రథానికి పూన్చబడుతున్నాయి. ఒంటెలు, కంచర గాడిదలు కట్టిన బండ్లు నన్ను లాగుతున్నాయి. బాంధవులతో, అమాత్యులతో కూడి మాంసాహారాన్ని తినగలుగుతున్నాను. నేను గొప్ప వాళ్ళకు తగిన నివాస గృహాలలో సుఖశయనాలపై చక్కని ఆదరింపుతో నిదురిస్తున్నాను. ప్రతిరాత్రి ముగియబోయే ముందు దేవతలు ప్రియవచనాలతో మహేంద్రుని స్తుతించినట్లు సూతులు, మాగధులు, వందులు నన్ను స్తుతిస్తున్నారు. తమరు సత్యసంధులు. అమిత తేజస్వులు. తమ అనుగ్రహంతోనే పురుగుగా ఉన్న నేను రాజపుత్రత్వాన్ని పొందగలిగాను. మహాప్రాజ్ఞా ! నమస్కారం. ఏం చేయమంటారో శాసించండి. తమ తపోబలంతోనే నేను ఇదంతా పొందగలిగాను.'

వ్యాసు డన్నాడు. 'రాజా ! నీవు నన్ను నేడు మాటలతో చక్కగా స్తుతించావు.

ఇప్పటివరకు నీవు నీ కీటకజన్మకు సంబంధించిన దయనీయ స్మృతిలోనే ఉన్నావు. గతజన్మలో అర్థపరాయణుడవై, క్రూరుడవై, ఆతతతాయివై, శూద్రజన్మలో చేసిన పాపం ఇంకా నశించలేదు. కీటక జన్మలో నీవు నన్ను దర్శించావు. ఆ పుణ్యఫలం వలన రాజపుత్రుడవు కాగలిగావు. ఇప్పుడు మరల నన్ను అర్చిస్తున్నావు. దీనివలన క్షత్రియ జన్మ తరువాత బ్రాహ్మణుడవు కాగలవు. రాజకుమారా ! ఈ జన్మలో బాగా సుఖపడి, చివరలో గోబ్రాహ్మణులకై రణభూమిలో ప్రాణాల నాహుతి చేసి బ్రాహ్మణత్వాన్ని పొందగలవు. ఆదశలో ఇష్ట దక్షిణలతో యాగాలు చేసి స్వర్గసుఖాల ననుభవించగలవు. ఆపై అవ్యయ బ్రహ్మస్వరూపుడవై, ఆనందాన్ని అనుభవించగలవు. జీవుడు తిర్యగ్జన్మ నుండి శూద్రుడుగా పుడతాడు. శూద్రుడు వైశ్యుడుగా, వైశ్యుడు క్షత్రియుడుగా, సదాచార సంపన్నుడైన క్షత్రియుడు బ్రాహ్మణుడుగా పుడతాడు. సదాచారి అయిన ఆ బ్రాహ్మణుడు పుణ్యమయమైన స్వర్గాన్ని పొందగలడు.'

119. కీటోపాఖ్యానము - 3

భీష్ముడు చెప్తున్నాడు 'రాజా ! ఈ విధంగా కీటజన్మను వీడి, తన గత జన్మను స్మరిస్తూనే క్షత్రియ ధర్మాన్ని పొంది, బలశాలియై తీవ్రంగా తపస్సు చేశాడు. ధర్మార్థ వేత్తయై ఆ రాజకుమారుడు చేస్తున్న ఆ తీవ్ర తపస్సును చూసి, అప్పుడు ద్విజశ్రేష్ఠుడైన వ్యాసుడు వచ్చాడు.' వ్యాసుడన్నాడు "కీటమా ! ప్రాణి సంరక్షణం దేవతల వ్రతం అదే క్షాత్రధర్మం కూడా. ఆ క్షాత్ర దేవవ్రతాన్ని పాటిస్తూ నీవు మరుసటి జన్మలో బ్రాహ్మణుడవు కాగలవు. శుభాశుభాలను సరిగా తెలిసి, జితేంద్రియుడవై, ప్రజలను చక్కగా పరిపాలించు. మంచి భోగాలను దానం చేస్తూ, అశుభాలను ప్రక్షాళన చేస్తూ ఆత్మజ్ఞానివై, సుప్రసన్నుడవై, స్వధర్మాసక్తుడవై, ఈ క్షాత్రశరీరాన్ని విడిచి మరుసటి జన్మలో విప్రత్వాన్ని పొందగలవు." భీష్ముడు చెప్తున్నాడు 'రాజా ! యుధిష్ఠిరా ! ఆ కీటకం వేదవ్యాసుని మాట విని, ప్రజలను ధర్మబద్ధంగా పరిపాలించి, మరలా వెళ్ళి అచిర కాలంలోనే పరలోకగతుడై ప్రజాపాలన ధర్మఫలంగా బ్రాహ్మణత్వాన్ని పొందింది. ఆపై మరల మహాయ శస్వి, మహాప్రాజ్ఞుడు అయిన కృష్ణ ద్వైపాయనుడు ఆ బ్రాహ్మణుని దగ్గరకు వచ్చాడు. వ్యాసుడిలా అన్నాడు. "ఓయీ ! బ్రాహ్మణశ్రేష్ఠా ! శ్రీమంతుడా ! నీవు ఏ రీతిగానూ వ్యధచెందవలదు. మంచి పనులు చేసినవాడు శుభజాతులలో, పాపకర్మలు చేసినవాడు పాపజాతులలో పుడతాడు. ధర్మజ్ఞా ! కీటకమా ! మనుష్యుడు తాను చేసిన

పాపాన్ని బట్టి పాపఫలాన్ని అనుభవించవలసినదే. కాబట్టి మృత్యుభయాన్ని గురించి వ్యథ చెందవద్దు ధర్మలోపభయ ముండాలి. ఉత్తమ ధర్మాన్ని పాటించాలి." కీటక మన్నది "భగవానుడా ! దీవలన నేను సుఖస్థితినుండి మరీ సుఖస్థితికి రాగలిగాను. ధర్మ బద్ధంగా సిరిని పొందగలిగాను. నా పాపం ఇప్పుడు నశించిపోయింది." భీష్ముడు డిలా చెప్తున్నాడు. 'రాజా ! ఆ కీటం వ్యాస భగవానుని వచనాన్ని పట్టి, దుర్లభమైన బ్రాహ్మణ్యాన్ని పొంది, భూమి నంతా వందలకొలది యజ్ఞయూపస్తంభాలతో గుర్తింపచేశాడు. ఆపై ఆ బ్రహ్మవిత్తముడు బ్రహ్మసాలోక్యాన్ని పొందాడు. పార్థా ! ఆ కీటకం వ్యాసవచనాన్ని అనుసరించి స్వధర్మాన్ని చక్కగా పాటించింది. అప్పుడు సనాతన బ్రహ్మ పదాన్ని పొందింది. అదే రీతిగా కురుక్షేత్రంలో క్షత్రియ శ్రేష్ఠులందరూ తమ శక్తితో క్షాత్రధర్మాన్ని ప్రదర్శించి, మరణించి, పుణ్యగతిని పొందారు. అందువలన కుమారా ! బాధపడవలదు.'

120. వ్యాసమైత్రేయ సంవాదము - దాన ప్రశంసా కర్మ రహస్యాలు

యుధిష్ఠిరు డడిగాడు. 'సజ్జనశ్రేష్ఠా ! పితామహా ! విద్య, తపస్సు, దానం వీటిలో ఏది గొప్ప. అడుగుతున్నాను. నాకు చెప్పు.' భీష్ముడు చెప్తున్నాడు. 'ఈ విషయంలో కూడా ప్రాచీనమైన వ్యాసమైత్రేయ సంవాదాన్ని ఉదాహరిస్తుంటారు.

రాజా ! ఒకప్పుడు కృష్ణద్వైపాయనుడు అజ్ఞాతంగా చరిస్తూ, వారాణసిలో మునిమండలి మధ్యనున్న మైత్రేయుని కలిశాడు. మునిసత్తముడైన ఆ వ్యాసుడు తన సమీపంలో కూర్చొని ఉండటం తెలిసి, మైత్రేయుడు ఆయనను అర్చించి, మంచి భోజనాన్ని పెట్టాడు. మహామనస్వి అయిన వ్యాసుడు గుణయుక్తమై, సార్వకాలిక రుచులతో కూడా ఉన్న ఆ ఉత్తమాన్నాన్ని భుజించి ప్రీతు డయ్యాడు. అక్కడ నుండి బయలుదేరుతూ చిరునవ్వునవ్వాడు. నవ్వుతున్న వ్యాసుని చూసి మైత్రేయుడు ఇలా అడిగాడు. "ధర్మాత్మా ! పండితుడా ! మీ పాదాలనంటి, చేతులు జోడించి, నమస్కరించి అడుగుతున్నాను. మీ నవ్వుకు కారణ మేమిటో చెప్పండి. తపస్వులై, ధైర్యశీలురైన మీకు ఉల్లాస మెందుకు కలిగింది ? నాయనా ! మా తపోభాగ్యమూ, ఇక్కడి మహాభాగ్యమూ తెలుసు. జీవాత్మ పరమాత్మలను నేను వేరువేరుగా భావిస్తాను. పరమాత్మ సర్వపదార్థాలతో సంబంధమున్నవాడు. అందువలన జీవాత్మకన్న విశిష్టుడు. మీ దృష్టిలో జీవాత్మ పరమాత్మలు అభిన్నులు. అటువంటి స్థితిలో నాకు రాని నవ్వు మీకెలా వచ్చింది ?'

వ్యాసుడు చెప్తున్నాడు 'అతిచ్ఛందం (అతిథిని గౌరవించి సత్కరించటం)

వలన అతివాదం (అతిథిని మాటలతో గౌరవించటం) వలన ఈ ఉల్లాసం కలిగింది. వేదవచనం అసత్య మెలా అవుతుంది ? వేదమెందుకు అనృతం పలుకుతుంది ? పురుషుడు ఉత్తమ వ్రతాలను పాటించటానికి మూడే మార్గాలు. ద్రోహం చేయక పోవటం, దానం చేయటం, ఇతరులతో సత్యమే చెప్పటం. ఇది వేదోక్తమైన విధి. పూర్వకాలంలో మహర్షులు దీనిని పాటించారు. దీనిని అనాదిగా వింటున్నాను. ఇప్పుడు కూడా మనం దానిని కర్తవ్యంగా స్వీకరించాలి. వేదవిధి ననుసరించి చేసిన దానం స్వల్ప మయినా మహాఫలాన్ని ఇస్తుంది. అసూయలేకుండా హృదయ పూర్వకంగా ఆర్తితో ఉన్నా నాకు అన్నపానీయాలు దానం చేశావు. ప్రభూ ! నేను ఆకలిదప్పులతో ఉన్నాను. అటువంటి నాకు అన్న పానీయాల నిచ్చావు. దీని వలన మహాయజ్ఞాల ద్వారా పొందగల పుణ్యలోకాలను గెలుచుకొన్నావు. నేను దానిని చూస్తున్నాను. ఈ దానం ద్వారా పవిత్రమైన నీ తపస్సుతో సంతోషించాను. నీ బలం పుణ్యబలం. నీ దర్శనం పుణ్యదర్శనం. నాయనా ! నీ శరీరం నుండి వెలువడుతున్న పవిత్ర గంధం దానరూపమైన నీ కర్మ ద్వారా పుట్టిన దనే నేను భావిస్తున్నాను. అది తీర్థస్నానం కన్న, వైదికవ్రతానుష్ఠాన లేపనం కన్న గొప్పది. ద్విజా ! పవిత్ర కర్మలన్నింటికన్న దానం పవిత్రమైనది. అది అలా పవిత్రం కాకపోయినట్లయితే ఆ దానాన్ని గురించి ఇంత గొప్పగా చెప్పేవారు కాదు. వేదవిహితాలై ప్రశంసలకు నోచుకొన్న కర్మలన్నింటికన్న దానం శ్రేష్ఠతరం. ఈ విషయంలో నాకు సంశయం లేదు. దాతలు కల్పించిన బాటలోనే బుద్ధిమంతులు నడుస్తారు. వీరే ప్రాణదాతలు. వారి యందే ధర్మం నిలిచి ఉంటుంది. వేదాధ్యయనం వలె, ఇంద్రియ నిగ్రహంవలె, సర్వ విషయ పరిత్యాగం వలె దానం పరమోత్తమం. ఈ దానం వలన నీవు ఉత్తమ సుఖాన్ని పొందగలవు. ధీమంతుడైన నరుడు దానం ద్వారా సుఖస్థితి నుండి సుఖతరస్థితిని పొందగలడు. ఇది మన ఎదుట కనిపించే విషయమే నిస్సంశయంగా మనమలాగే గ్రహించాలి. నీవంటి శ్రీమంతులు ధనం దొరికినప్పుడు దాన యజ్ఞాల నాచరించి సుఖపడతారు. మహాప్రాజ్ఞా ! కొందరు విషయ సుఖాల ద్వారా దుఃఖాలను తెచ్చుకొంటారు. కొందరు తపస్సువంటి కష్టాల ద్వారా సుఖాలు పొందుతారు. ఇవి వారి వారి స్వభావాన్ని బట్టి కలుగుతాయి.

ఈలోకంలో పురుషప్రవృత్తి మూడు రకాలుగా ఉంటుంది. పుణ్యమయ మొకటి. పాపమయ మొకటి. ఈ రెండూ లేని దొకటి. బ్రహ్మజ్ఞాని తాను పనిచేసినట్లు (తనను కర్తగా) భావించడు. అందువలన తాను చేసిన పనిని పుణ్యమని కానీ, పాపమని కానీ భావించడు. కాబట్టి తాను చేసిన పనియొక్క పుణ్యపాపాలు తనకు ప్రాప్తించవు. యజ్ఞం,

దానం, తపస్సు చేసే నరులు పుణ్యకర్ములు. ఇతర ప్రాణులకు ద్రోహం చేసే జనులు పాపకర్ములు. ఇతరుల ద్రవ్యాన్ని అపహరించే వారు దుఃఖపడతారు. నరకంలో పడతారు. ఈ పుణ్యపాప కర్మలకు భిన్నమైన కర్మల ద్వారా పుణ్యమూ లేదు, పాపమూలేదు. ఆనందించు. వర్ధిల్లు. ప్రసన్నుడవై ఉండు. దానాలు చేయి. యాగాల ననుష్ఠించు' పండితులు కానీ, తాపసులు కానీ నిన్ను పరాభవించలేరు.

121. వ్యాసమైత్రేయ సంవాదము - అన్నదాన ప్రశంస

భీష్ముడు చెప్తున్నాడు. "వ్యాసుడలా అనగానే కర్మపూజకుడు, మహాపండితుడు, ప్రాజ్ఞుడు, పరమసంపదగల ఇంటపుట్టినవాడు అయిన మైత్రేయుడు ఇలా అన్నాడు. మైత్రేయుడిలా అన్నాడు. "విభూ ! మహాప్రాజ్ఞా ! మీరన్నది యథార్థమే. మీ అనుమతితో కొంచెం మాటాడదలచుకొన్నాను". వ్యాసుడన్నాడు. "మైత్రేయా ! మహాప్రాజ్ఞా ! నీ చెప్పదలచుకొన్నది ఏదైనా, ఎంతయినా, యథాతథంగా చెప్పు నీ మాట వినగోరుతున్నాను. మైత్రేయుడు చెప్తున్నాడు "మీరు విద్యాతపస్సులతో పవిత్రమైన అంతఃకరణం గలవారు. సంశయం లేదు మీరు చెప్పిన దాన సంహిత నిర్మలమూ, నిర్దుష్టమూ కూడా. మీరు పవిత్ర హృదయులు కావటం వలన నాకు ఈ మహాలాభం సిద్ధించింది. సమృద్ధ తపశ్శాలుడయిన వానివలె బుద్ధితో బాగా ఆలోచించి ఇది చూడగలుగుతున్నాను. మీదర్శనంతోనే మాకు అభ్యుదయం లభిస్తుంది. ఈ దర్శనం మీ అనుగ్రహమే అని భావిస్తున్నాను. ఈ కర్మకూడా మీ అనుగ్రహంవలన స్వాభావికంగా లభించినదే. తపస్సు, పాండిత్యం, ఉత్తమ వంశంలో పుట్టుక - ఇవి బ్రాహ్మణత్వానికి కారణాలు. ఈ మూడుగుణాలు ఉన్నప్పుడే బ్రాహ్మణు డవుతాడు. బ్రాహ్మణుడు తృప్తి చెందితే పితరులు, దేవతలు తృప్తి పడతారు. పండితులకు ఎవ్వరూ బ్రాహ్మణునికన్న ఎక్కువ కారు. బ్రాహ్మణుడు లేకపోతే ఈ జగమంతా అంధకార బంధుర మయ్యేది. ఏమీ తెలిసేది కాదు. చాతుర్వర్ణ వ్యవస్థ కానీ ధర్మా ధర్మాలు కానీ, సత్యాసత్యాలు కానీ తెలిసేవి కావు.

చక్కగా దున్నిన నేలలో మానవుడు పంటను పొందినట్లు పండితునకు దాన మిస్తే దాత ఫలాన్ని పొందగలుగుతాడు. చక్కని పాండిత్యం, నడవడిగల బ్రాహ్మణుడు దానం తీసికొనటానికి తగినవాడు. అటువంటి స్వీకర్త లేకపోతే ధనికుల ధనమంతా వ్యర్థమయ్యేది. మూర్ఖుడు తాను తిన్న అన్నాన్ని నాశనం చేస్తాడు. ఆ అన్నం ఆ మూర్ఖుని నశింపజేస్తుంది. యోగ్యుడై అన్నాన్ని, అన్నదాతను రక్షించిన వానిని ఆ అన్నం రక్షిస్తుంది.

దానఫలాన్ని చంపినవాడు తాను కూడా చచ్చినట్లే. ప్రభావమూ, శక్తి గల విద్వాంసుడు తాను తిన్న అన్నాన్ని మరలా పుట్టించగలుగుతాడు. తాను అన్నంనుండియే జన్మిస్తాడు. ఇచ్చినవాడికి వచ్చిన పుణ్యమే తీసికొన్న వానికీ వస్తుంది. ఒక చక్రంతో బండినడవదు గదా ! ఈ రీతిగానే ఋషులు భావించారు. చక్కని పాండిత్యమూ, మంచి నడవడీ గల బ్రాహ్మణులున్న చోట చేసిన దాన ఫలాన్ని ఇహ పరలోకాలలో అనుభవించవచ్చు. పవిత్ర వంశంలో పుట్టి, సతతమూ తీవ్ర తపస్సులో ఆసక్తులైన నానాధ్యయన సంపన్నులు ఎప్పుడూ అందరికన్న పూజింపదగినవారు. ఆ సజ్జనులు దారిని ఏర్పరుస్తారు. ఆ దారిలో నడిచినవారు మోహానికి గురికారు. వారే స్వర్గానికి నడిపించగలవారు. సనాతన యాగ నిర్వాహకులు."

122. వ్యాసమైత్రేయ సంవాదము - గృహస్థ కర్తవ్యము

భీష్ముడు చెప్తున్నాడు మైత్రేయు డలా అనగానే వ్యాసభగవానుడు మైత్రేయునితో ఇలా పలికాడు. "నీవు భాగ్యవంతుడవు. ఇటువంటి జ్ఞానాన్ని పొందావు. భాగ్యం కొద్ది నీ బుద్ధి ఇలా వికసించింది. లోకం ఉత్తమ గుణాలు గల వారినే ఎక్కువగా ప్రశంసిస్తుంది. నీపై రూపాభిమానం, వయోభిమానం, సంపదభిమానం ప్రభావాన్ని చూపటం లేదు. ఇది నీకు దైవికంగా లభించిన అనుగ్రహం. సంశయం లేదు. దానం కన్న గొప్ప ధర్మాన్ని నీకు చెప్పబోతున్నాను, విను. లోకంలోని ఆగమాలు, శాస్త్రాలు, ప్రవృత్తులు అన్నీ వేదాన్ని ముందుంచుకొని (వేదప్రామాణ్యంతో) క్రమంగా ఏర్పడినవి. నేను దానాన్ని ప్రశంసిస్తున్నాను. నేను తపస్సునూ, జ్ఞానాన్ని ప్రశంసిస్తున్నాను. తపస్సు పవిత్రమైనదే. వేదాధ్యయనం స్వర్గ సాధనమే. తపస్సువలనా, విద్యవలనా కూడా గొప్పస్థితిని పొందవచ్చునని నేను విన్నాను. తపస్సు చేతనే ఇతరేతర పాపాలను కూడా తొలగించుకొనవచ్చు. ఏదో ఒక ఉద్దేశాన్ని పెట్టుకొని తపస్సు చేసిన పురుషుడు తపస్సు ద్వారా, విద్యద్వారా దానినంతా పొందగలడని నేను విన్నాను. సంబంధం కుదరని దయినా, ఎదిరించరాని దయినా, పొందరానిదయినా, అతిక్రమింపరానిదయినా తపస్సుతో పూర్తిగా లభిస్తుంది. తపస్సు అన్నిటికన్నా ఎక్కువ బలమైనది. త్రాగుబోతు, దొంగ, భ్రూణహత్య చేసినవాడు, గురుపత్నితో సంగమించినవాడు కూడా తపస్సుతో సర్వాన్ని దాటిపోగలడు. పాపవిముక్తి పొందగలడు. సర్వ విద్యల నెరిగిన వాడే కళ్ళున్నవాడు. మనం కావాలను కొంటే తపస్వినీ కూడా అలాగే (కళ్ళున్న వానిగా) చెప్తుంటారు. ఆ ఇద్దరికీ ఎప్పుడూ నమస్కరించాలి. పాండిత్యమే

ధనమైనవారి నందరినీ పూజించాలి. అలాగే తాపసులనుకూడా. దాతలు ఇహలోకంలో సంపదను, పరలోకంలో సుఖాన్ని పొందగలరు. లోకంలోని పుణ్యపురుషులు అన్నదానాలతో ఇహ లోకంలో సుఖాన్ని, మరణానంతరం బ్రహ్మలోకాన్ని, శక్తిసంపన్నాలైన ఇతరలోకాలను పొందగలరు. దాతలు పూజిస్తారు, పూజింపబడతారు. గౌరవిస్తారు, గౌరవింపబడతారు. దాత ఎక్కడకు పోయినా అన్ని వైపులనుండీ స్తుతులను పొందగలరు.

మనుష్యులు దానాలు చేసినా చేయకపోయినా, పైలోకాలలో ఉన్నా క్రిందిలోకాలలో ఉన్నా పూర్వకర్మను బట్టి ఎవరి కే లోకం లభిస్తుందో అక్కడికి వారు వెళతారు. మైత్రేయా ! నీవు కోరిన అన్నపానాలు నీకు లభిస్తున్నాయి. నీవు మేధావివి. ఉత్తమ వంశంలో పుట్టిన వాడవు. పండితుడవు. దయావంతుడవు. యువకుడివి. వ్రతశీలివి. ధర్మాసక్తుడవై ఉండు. గృహస్థులకు ప్రథమ కర్తవ్యమూ, ప్రశస్తమూ అయిన దానిని చెపుతా, గ్రహించు. భర్త భార్యతోనే, భార్య భర్తతోనే తృప్తి పడుతున్న వంశంలో అంతా శుభమే జరుగుతుంది. నీటితో శరీరం మీది మురికి పోయినట్లు, అగ్ని జ్వాలతో చీకటి తొలగిపోయినట్లు, దానంతో, తపస్సుతో పాపమంతా నశిస్తుంది.

మహాభాగా ! బ్రాహ్మణుడు దానంతో, తపస్సుతో, విష్ణు సమర్చనతో సంసార సాగరం నుండి తరిస్తాడు. తమకర్మద్వారా పవిత్ర హృదయులై, తపస్సు ద్వారా నిర్మలాత్ములై, విద్య ద్వారా మోహరహితులైన వారిని హరి తరింపజేస్తాడు. ఆయనను అర్చించటంపై ఆసక్తిని చూపు. ఆయనకు భక్తుడవై నమస్కరించు. అష్టాక్షర పరాయణులైన ఆయనభక్తులు నశించరు. ఓంకారో పాసన పరులు, పరమార్థపరులైన వారి సాంగత్యంతో పాప విముక్తుడవై పవిత్రుడవు కమ్ము.

మైత్రేయా ! నీకు శుభం జరుగుతుంది. నేను చక్కగా నా ఆశ్రమానికి వెళ్తాను. దీనిని మనస్సులో ఉంచుకో. నీకు శ్రేయస్సు కలుగుతుంది." మైత్రేయుడు వ్యాసునకు నమస్కరించి, ప్రదక్షిణం చేసి, చేతులు జోడించి, "పూజ్యా ! మీకు కూడా శుభం జరగాలి" అన్నాడు.

123. శాండిలీసుమనా సంవాదము - పతివ్రతా కర్తవ్యము

యుధిష్ఠిరు డడిగాడు "పితామహా ! మంచి మగువల సదాచార మెటువంటిది ? నీవు చెపితే వినాలను కొంటున్నాను. నాకు చెప్పు."

భీష్ముడు చెప్తున్నాడు "ఇది దేవలోకంలో జరిగిన విషయం. మనస్విని అయిన శాండిలి అనే స్త్రీ ఉండేది. కేకయ రాజపుత్రి సుమన ఆమెనిలా అడిగింది. "కళ్యాణీ ! నీవు ఏ నడవడితో, ఏ సదాచారంతో సర్వపాపాలను నశింపజేసికొని దేవలోకంలోనికి

వచ్చావు ? నీవు నీ తేజస్సుతో అగ్నిజ్వాల వలె ప్రకాశిస్తున్నావు. చంద్రుని పుత్రికవలె నీ కాంతితో ప్రకాశిస్తూ స్వర్గానికి వచ్చావు. నిర్మల వస్త్రాలను ధరించి, శ్రమ లేకుండా విమానంపై ఉన్నావు. శుభాకృతితో ప్రకాశిస్తున్నావు. నీ తేజస్సుతో వేయిరెట్లుగా వెలిగి పోతున్నావు. స్వల్ప తపస్సుతోనో, స్వల్ప దానంతోనో, స్వల్ప నియమంతోనో నీవు ఇక్కడకు వచ్చియుండవు. కాబట్టి నాకు నీ సదాచారతత్వాన్ని చెప్పు." ఈ రీతిగా సుమన మధుర వచనాలతో అడగగా, శాండిలి అందంగా నవ్వుతూ, నిదానంగా సుమనతో ఇలా పలికింది. "నేను కాషాయ వస్త్రాలు ధరించినందువలన గానీ, నారచీరలు ధరించి నందువలన గానీ, తల గొరిగించుకొన్నందువలన గానీ, జటాధారణ వలన గానీ దేవలోకానికి రాలేదు. నేనెప్పుడూ జాగరూకతతో ఉండేదాన్ని. భర్తతో ఎప్పుడూ అహితవచనాలను కానీ, పరుష వచనాలను కానీ పలుకలేదు. దేవతలను, పితరులను, బ్రాహ్మణులను పూజించటంలో సదా అప్రమత్తంగా ఉండేదాన్ని. అత్తమామల ఆదేశాలను పాటించేదాన్ని, ఇతరులపై చాడీలు చెప్పను. అది నామనస్సులో కూడా ఉండదు. ద్వారాన్ని వీడి మరెక్కడా నిలవను. ఎక్కువ సేపు కబుర్లు చెప్పను. నేను ఏకాంతంలో కానీ, పదిమంది ఎదుట కానీ అశ్లీలపరిహాసాలు చేయను. నా పనిద్వారా ఎవ్వరికీ అహితాన్ని కలిగించను. భర్త పనిమీద బయటకు వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చినప్పుడు ఆసనంపై కూర్చుండజేసి సావధానంగా సమాదరిస్తాను. నా భర్త మెచ్చని ఆహారాన్ని, ఇష్టపడని ఆహారాన్ని అది భక్ష్యమయినా, భోజ్యమయినా, లేహ్యమయినా సరే దానిని పూర్తిగా పరిహరిస్తాను. కుటుంబానికి మొత్తానికి అవసరమైన పని కలిగినపుడు ప్రొద్దుటే లేచి దానినంతా చేయిస్తాను.

అగ్నిని సంరక్షిస్తాను. ఇంటిని శుభ్రపరుస్తాను. నిత్యమూ కుమారులను పాలిస్తాను. కన్యకలకు తగిన హితాన్ని చెపుతాను. నాకిష్టమయిన వాటిని విడిచి అయినా గర్భాన్ని సంరక్షిస్తాను. బాలురను తిట్టడం, కోపపడటం, సతాయించటం వంటివి చేయను. ఇంటిలో ధ్యాన్యాన్ని కానీ, అన్నాన్ని కానీ వెదజల్లను. ఇంటిలో గోవులకు ఆహారాన్నీ, నీటినీ అందిస్తూ, రత్నాలవలె రక్షిస్తాను. నేను పవిత్రురాలనై ముందు నిలిచి బ్రాహ్మణులకు భిక్షనిస్తాను.

నాభర్త ఏదయినా పనిమీద పరదేశానికి వెళితే అప్పుడు నేను నియమ పూర్వకంగా అనేక మంగళ కార్యాలలో లగ్నమై ఉంటాను. భర్త ఇంటలేనపుడు కాటుక, గోరోచనతిలకం, అభ్యంగస్నానం, పూలమాలలను ముడవటం, అలంకరించుకొనటం మొదలయినవి ఇష్టపడను. భర్త సుఖనిద్రలో ఉన్నప్పుడు అవసరమైన పని వచ్చినా ఎప్పుడూ నిదురలేపను. దానితో నా మనస్సు ఆనందిస్తుంది. కుటుంబ పోషణ కోసమై కూడా భర్త నెప్పుడూ ఇబ్బంది పెట్టను. ఇంటిగుట్టు కాపాడుతాను. ఇల్లు, వాకిలి చక్కగా శుభ్రపరిచి ఉంచుతాను. ఈ

ధర్మమార్గాన్ని సావధానంగా అనుసరిస్తున్న స్త్రీ-స్త్రీలలో అరుంధతి వలె మన్ననలంది, మరణానంతరం స్వర్గ లోకంలో వెలుగొందుతుంది." భీష్ముడు చెప్తున్నాడు. "ఆ శాండిలీ దేవి ఈ రీతిగా పతిధర్మాన్ని వివరించి, అప్పుడు అంతర్ధాన మయింది. పాండునందనా ! ఈ కథను ప్రతి పర్వదినాన చదివినవాడు స్వర్గానికి వెళ్ళిన తరువాత నందనవనంలో సుఖంగా నివసిస్తాడు."

124. హరిణకృశకాఖ్యానము

యుధిష్ఠిరు డడిగాడు "పరమ కర్తవ్యంగా భావింపదగినదై, మహాత్ములు ఆచరింపదగిన ధర్మ స్వరూపమై, సర్వశాస్త్ర సారంగా భావింపబడే దేది ? దయచేసి దానిని చెప్పవలసినది". భీష్ముడు చెప్తున్నాడు. "రాజా ! ఇది పరమరహస్యం. సంసారబంధం నుండి విముక్తి కలిగించగలది. నీవు వినదగినది. చక్కగా గ్రహింపదగినది కూడా.

ఒకప్పుడు పుండరీకుడనే విప్రుడు ఒకానొక పుణ్యతీర్థంలో ఎప్పుడు జపిస్తూ ఉండేవాడు. ఆ పుండరీకుడు యోగపరాయణుడైన నారదమునిని శ్రేయోమార్గాన్ని గురించి ప్రశ్నించాడు. ఆ నారదుడు కూడా మహాత్ముడైన బ్రహ్మ చెప్పిన శ్రేయోమార్గాన్ని బ్రాహ్మణున కిలా చెప్పాడు. నారదుడిలా చెప్పాడు. "నాయనా ! ఉత్తమమైన జ్ఞానయోగాన్ని సావధానంగా విను. ఇది మరి దేనినుండీ పుట్టినది కాదు. విస్పృతార్థ సాధకం, వేదశాస్త్ర సారభూతం. ఇరువదినాలుగు తత్త్వాల రూపమైన ప్రకృతి కన్న వేరుగా ఇరువది అయిదవ తత్త్వంగా చెప్పబడినవాడు పురుషుడు. ఆయన సర్వభూతాత్మభూతుడు. ఆయననే నరు డంటారు. ఆ నరుని నుండి సర్వతత్త్వాలు జనించాయి. అందువలన అవి నారాలు. అవి భగవంతుని నివాసస్థానాలు. ఆకారణంగానే ఆయనవేరు నారాయణుడు సృష్టిసమయంలో నారాయణుని నుండి ఈ సర్వజగత్తు పుడుతుంది. మరల ప్రళయవేళలో ఆయనలోనే లీనమవుతుంది. నారాయణుడే పరబ్రహ్మ. నారాయణుడే పరతత్త్వం. నారాయణుడే పరాత్పరుడు. నారాయణుని కన్న పరతత్త్వ మేదీ లేదు. ఆయననే వాసుదేవుడనీ, విష్ణువనీ, ఆత్మ అనీ కూడా అంటారు. పేరులోనే మార్పులు కానీ సర్వశాస్త్రాలు వర్ణించినది నారాయణునే. సమస శాస్త్రాలనూ ఆలోచన చేసి పదేపదే ఆలోచించిన తరువాత ప్రకటమైన సిద్ధాంతమిది. సదా నారాయణునే ధ్యానించాలి. కాబట్టి నీవు శాస్త్రార్థాలతో విస్తరించిన సర్వగహన విషయాలను విడిచి, అనన్య చిత్తుడవై అజుడు, విభుడు అయిన నారాయణుని ధ్యానించు. ముహూర్తకాలమయినా సరే ! అలసతలేకుండా నారాయణుని ధ్యానించినవాడు సద్గతిని పొందగలడు. ఇక అదే లక్ష్యంగా ధ్యానించిన వాని విషయం చెప్పవలసిన దేముంది ? 'ఓంనమో నారాయణాయ' అనే ఈ మంత్రాన్ని సనాతన బ్రహ్మ స్వరూపంగా గ్రహించి, మరణ సమయంలో దానినే జపించినవాడు విష్ణువు యొక్క పరమ పదాన్ని పొందగలడు. హితాభిలాషి అయిన పురుషుడు సర్వదా శ్రవణ మనన, గాన, స్తుతి, అర్చనలతో బ్రహ్మస్వరూపుడైన నారాయణుని ఆరాధించాలి. నారాయణపరాయణుని పాపమంటదు. తానే ఉదయించిన సూర్యునివలె సమస్తలోకాన్నీ పవిత్రం చేయగలడు. బ్రహ్మచారి అయినా, గృహస్థుడయినా, వానప్రస్థుడయినా సంన్యాసి అయినా

కేశవుని ఆరాధించకపోతే పరమగతిని పొందలేడు. సువ్రతా ! వేయి జన్మలనెత్తినా విష్ణువుపై బుద్ధికుదరటం కష్టం. కాబట్టి భక్త వత్సలుడైన ఆ నారాయణ దేవుని ఆరాధించు."

భీష్ముడు చెప్తున్నాడు. "నారదుడు అలా చెప్పగానే ఆ విప్రుడు. పుండరీకుడు విష్ణువు నర్చించసాగాడు. కలలో కూడా శంఖచక్ర గదాధారియై, కిరీటకుండల ధారియై, శ్రీవత్సలాంఛనుడై, కౌస్తుభమణిని ధరించిన ఆ పుండరీకాక్షుని దర్శించి, వేగంగా లేచి ఆ దేవదేవునకు నమస్కరించేవాడు. ఆలా చాలాకాలం గడిచిన తరువాత నారాయణుడు ఆ పుండరీకునకు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు సర్వవేదాలు, దేవతలు, గంధర్వులు, కిన్నరులు వివిధస్తోత్రాలతో ఆయనను స్తుతించారు. ఆ యోగనిలయుడైన ఆ హరి, ఆ అధోక్షజుడు, ఆ భగవంతుడు వారందరిచే పూజింపబడి, పుండరీకుని వెంటబెట్టుకొని తన నివాసానికి వెళ్ళిపోయాడు. కాబట్టి రాజేంద్ర ! నీవు కూడా విష్ణుభక్తుడవై, నారాయణపరాయణుడవై, తగిన రీతిగా ఆయన నర్చించి ఆ పురోషోత్తముని సేవించు. ఆయన అజరుడు, అమరుడు, అద్వితీయుడు, ధ్యానింపదగినవాడు, అనాది, అనంతుడు, సగుణుడు, నిర్గుణుడు, ఆదికారణం, స్థూలరూపుడు, పరమసూక్ష్మరూపుడు, సాటిలేనివాడు, అందరూ పొల్చుకొనదగినవాడు, యోగులు జ్ఞానం ద్వారా పొందదగినవాడు, త్రిభువనగురువు. ఆ విష్ణుభగవానుని శరణుకోరు.

యుధిష్ఠిరు డడిగాడు "భారతశ్రేష్ఠా ! మీ అభిప్రాయంలో సామదానాలలో ఏది మిన్న ? ఏది మిగులుతుంది ? దానిని చెప్పండి ?" భీష్ముడు చెప్తున్నాడు "ఒకడు సామంతో ప్రసన్నుడవుతాడు. మరొకడు దానంతో తృప్తి వడతాడు. కాబట్టి పురుష స్వభావాన్ని తెలిసికొని ఆ రెండింటిలో ఒకదాన్ని స్వీకరించాలి. రాజా ! సాంత్వనంలో (సామంలో) ఉండే గుణాలను విను. సామం ద్వారా భయంకర ప్రాణులనయినా వశం చేసికొనవచ్చు. ఈ విషయంలో కూడా అరణ్యంలో రాక్షసునకు పట్టుబడిన బ్రాహ్మణుడు అతని నుండి విముక్తి పొందిన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు.

ఒకానొక బ్రాహ్మణుడు బుద్ధిమంతుడు, మాటకారి నిర్జనారణ్యంలో తిరుగుతూ రాక్షసుని చేతికి చిక్కాడు. ఆ రాక్షసుడాయనను తినదలచాడు. బ్రాహ్మణుడు కష్టాలలో పడ్డాడు. బుద్ధిమంతుడు, పాండిత్య సంపన్నుడు అయిన ఆ విప్రుడు ఆ భీకర రాక్షసుని చూసి కూడా కంగారు పడలేదు. వ్యథ చెందలేదు. ఆ రాక్షసునిపై సామనీతినే ప్రయోగించాడు. ఆ రాక్షసుడు బ్రాహ్మణుని మాటను మన్నించి ఇలా అడిగాడు "నా ప్రశ్నకు సమాధానం చెపితే విడిచివెడతాను. చెప్పు. నేను ఎందువల్ల కృశించి పాలిపోతున్నాను ?" ఆ బ్రాహ్మణుడు ముహూర్తకాలం చింతించి, శాంతంగా ఆ రాక్షసుని ప్రశ్నకు ఈ క్రింది మాటలలో సమాధాన మిచ్చాడు. బ్రాహ్మణుడు చెప్తున్నాడు "నీవు ఆత్మీయులకు దూరమై పరదేశంలో సాటి కాని వారి సాహచర్యంలో అనుపమ భోగాలను అనుభవిస్తున్నావు. అందువల్ల కృశించి, పాలిపోయావు. రాక్షసా ! నీ మిత్రులను నీవు చక్కగా ఆదరించినా కూడ

స్వభావదోషం వలన వారు నీ పై అనురక్తులు కావటం లేదు. అందువలన కృశించి, పాలిపోయావు. నీకన్న గుణాలలో తక్కువవారైన జడులు కూడా ధనైశ్వర్యాలతో నిన్ను మించిపోయి నిశ్చితంగా నిన్ను అవమానిస్తున్నారు. అందువలన కృశించి, పాలిపోయావు.

నీవు గుణవంతుడవు, పండితుడవు, వినయశీలుడవు. అయినా గుణహీనులు, పామరులు సత్కరింపబడటం చూస్తున్నావు. నిశ్చితంగా నీవు కృశించి, పాలిపోవటానికి ఇదే కారణం.

బ్రతుకు తెరువు లేక బాధపడుతూ కూడా నీ మాహాత్మ్యం కారణంగా బ్రతుకు తెరువును పొందే హీనోపాయాలను తప్పక నిందిస్తుంటావు. అందువలన కృశించి, పాలిపోయావు. సజ్జనా ! నీ మంచితనం వలన నీవు కష్టపడి కూడా ఎవరికో ఉపకారం చేసి ఉంటావు. కానీ అతడు నిన్ను తాను ఓడించగలిగినట్లు భావించి ఉంటాడు. అందువలన కృశించి, పాలిపోయావు.

కామక్రోధాలకు మనస్సులు లోనై, అపమార్గాలలో చరిస్తూ కష్టాలు పడుతున్న జనులను గురించి నీవు చింతిస్తూ ఉంటా వనుకొంటున్నాను. అందువలన కృశించి, పాలిపోయావు. నీవు నీ ప్రజ్ఞ కారణంగా గౌరవింపదగినవాడవు. కానీ నిశ్చితంగా అజ్ఞానులు నిన్ను పరిహసించి ఉంటారు. చెడ్డ వారు నిన్ను హీనంగా చూసి ఉంటారు. అందువలన కృశించి, పాలిపోయావు. ఎవడైనా శత్రువు మిత్రునివలె మాటాడుతూ, మర్యాదస్థునివలె ప్రవర్తిస్తూ నిన్ను తప్పక మోసంచేసి ఉంటాడు. అందువలన కృశించి, పాలిపోయావు. నీ పనితీరు అందరు ఎరిగినదే. నీవు రహస్యాలను గ్రహించటంలో కూడా నేర్పరివి, సమర్థుడవు అయినా అటువంటివారు నిన్ను తప్పక మన్నింపకపోయి ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు. చెడ్డవారి మధ్య కూడా నీవు నిస్సంశయంగా మంచి మాటలే చెపుతావు. అయినా నీ గుణాలు వెలుగులోనికి రాలేదు. అందువలన కృశించి, పాలిపోయావు. నీకు ధనమూ, బుద్ధీ, పాండిత్యమూ లేక పోయినా కేవలం నీ శక్తితో ఉన్నత స్థానాన్ని కోరావేమో ! అది కుదరకపోయి ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు. బహుశః నీ మనస్సు తపస్సుపై లగ్నమై ఉండవచ్చు. అరణ్యాలలో నివసించాలని భావిస్తుండవచ్చు. నీ బాంధవులు దానిని అభినందించకపోయి ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు.

నీకొడుకు దుర్మార్గుడై ఉండవచ్చు. నీ అల్లుడు నీ ఆస్తిని తుడిచిపెట్టి ఉండవచ్చు. నీ భార్య నీకు ప్రతికూలంగా ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు నీ సోదరులు నమ్మించి ద్రోహం చేసి ఉండవచ్చు. నీ తండ్రికానీ, తల్లి కానీ, అన్న కానీ, గురువు కానీ ఆకలితో కృశించి, మరణించి ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు. నీవు బ్రాహ్మణుని కానీ, గోవును కానీ హత్య చేసి ఉండవచ్చు. విప్రుని సొమ్మును అపహరించి ఉండవచ్చు. దేవతల ధనాన్ని కాజేసి ఉండవచ్చు

అందువలన కృశించి, పాలిపోయావు.

నీ భార్య నెవరైనా అపహరించి ఉండవచ్చు. నీవు వృద్ధుడవై ఉండవచ్చు లోకం నిన్ను ద్వేషిస్తూ ఉండవచ్చు లేదా అజ్ఞానంతో నీవు ముసలివి అయి ఉండవచ్చు. అందువలన కృశించి పాలిపోయావు నీవు ముసలితనం కోసం దాచుకొన్న ధనాన్ని ఎవరైనా అపహరించి ఉండవచ్చు బ్రతుకు తెరువుకోసం దుర్జనులను సేవించవలసి ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు

నీకు భార్య అంటే ఇష్టం. కానీ పొరుగింటి యువకుడు అందగాడు, మహాధనికుడు ఆమెను కామించి ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు. ధనవంతుల మధ్య నీవు మంచిమాట చెప్పినా అది ఆ సమయంలో నిశ్చితంగా రాణించకపోయి ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు. దృఢ నిర్ణయాలు ముందే తీసికొనే నీకిష్టమైన వ్యక్తి ఎవరైనా మూర్ఖత్వం కారణంగా నీపై కోపంగా ఉండవచ్చు. అతనిని నీవు అనునయించ లేక పోతుండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు. ఎవరో ఒకరు తన కిష్టమైన ఏదో పనిలో నిన్ను నియోగించి, తన స్వార్థాన్ని సాధించుకొంటూ ఉండి ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు. సద్గుణ సంపన్నుడవై పరుల మన్ననల నందుకొంటున్న నిన్ను మిత్రుడెవరో ఇదంతా తనవల్లనే జరుగుతున్నట్లు ప్రవర్తిస్తూ ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు. నీవు మొహమాటంతో నీలోని అభిప్రాయాన్ని చెప్పలేక పోయి ఉండాలి. అలా ఉంటే దక్కవలసింది దక్కదేమో అన్న అనుమాన ముండి ఉండాలి. అందువలన కృశించి పాలిపోయావు. లోకంలో వివిధ బుద్ధులు, వివిధ రుచులు గల మనుష్యులుంటారు. వారిని అందరినీ నీ గుణాలతో నీవు లొంగదీసికోవాలని భావించి ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు.

నీవు పండితుడవు కాకపోయినా పండితకీర్తిని కోరి ఉండాలి. పిరికి వాడవై పరాక్రమవంతుడని పేరును పొందగోరి ఉండాలి. స్వల్ప దానంతో దాతృకీర్తిని ఆశించి ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు. ఎంతో కాలంగా నీవు అభిలషిస్తున్న ఏదో ఫలితం నీకు దక్కి యుండకపోవచ్చు. దానిని ఇతరులు చేజిక్కించుకొని ఉండవచ్చు అందువలన కృశించి, పాలిపోయావు నీవు ఏ తప్పు చేసినట్లు నీకు కనిపించటం లేదు అయినా నిష్కారణంగా ఇతరులు నిన్ను నిందిస్తూ ఉండాలి. అందువలన కృశించి పాలిపోయావు. విరక్తులై గృహస్థులుగాఉన్నవారిని, అసాధువులై అరణ్యవాసులైన వారిని సంన్యాసులై మందిరాలలో ఉన్నవారిని చూసి ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు నీ ఆప్తులు రోగపీడితులై దుఃఖిస్తుంటే, వారిని బయటపడవేయలేకపోయి ఉండవచ్చు దానితో నిన్ను నీవు నిరర్థకునిగా భావించుకొని ఉండవచ్చు. అందువలన కృశించి, పాలిపోయావు

నీవు సమయోచితంగా ధర్మానికి, అర్థానికి, కామానికి అనుకూలమైన మాటనే చెప్పినా దానిని ఇతరుల నమ్మకపోయి ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు. నీవు బుద్ధిమంతుడవై కూడా బ్రతుకు తెరువు కోసం బుద్ధిహీనులు ఇస్తున్న ధనాన్ని తీసికొని జీవించవలసి వచ్చి ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు. పాపాలు పెరగటాన్ని, పుణ్యకర్మలు నశించిపోవటాన్ని చూసి నిత్యమూ తప్పనిసరిగా ఆస్థితిని నిందిస్తూ ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు. పరస్పరం విరోధించుకొనే నీ మిత్రులను ఆపి, వారికి మేలు చేయాలని కోరుకొంటూ ఉండాలి. అందువలన కృశించి, పాలిపోయావు. శ్రోత్రియులై తగని పనులు చేస్తున్న వారుంటారు. ప్రాజ్ఞులై కూడా ఇంద్రియ నిగ్రహం లేని వారుంటారు. వారిని గురించి నీవు ఆలోచిస్తున్నా వను కొంటాను. అందువలన కృశించి, పాలిపోయావు. అలా మన్నింపబడిన ఆ రాక్షసుడు ఆ విప్రుని సమాదరించాడు. ఆయనను మిత్రునిగా చేసికొని, ధనాల నిచ్చి, విడిచిపెట్టాడు."

125. పితృరహస్యము

యుధిష్ఠిరు డడిగాడు "పితామహా ! మానవజన్మ అత్యంతమూ దుర్లభమైన కార్యక్షేత్రం. అటువంటి జన్మను పొంది కూడా దరిద్రుడైన వాడు తన శ్రేయస్సుకోసం ఏం చేయాలి ? గాంగేయా ! దానాలలో ఉత్తమదాన మేది ? ఏ వస్తువును ఎలా దానంచేయాలి ? ఎవరు మాన్యులు ? ఎవరు పూజనీయులు ? ఈ రహస్యాన్ని చెప్పాలి." వైశంపాయనుడు చెప్పాడు. 'యుధిష్ఠిర నరపాలుడు అలా అడగగానే భీష్ముడు పరమధర్మ రహస్యాన్ని ధర్మజునితో ఇలా చెప్పాడు.

భీష్ముడు చెప్తున్నాడు "రాజా ! భారతా ! వ్యాసభగవానుడు నాకు గతంలో చెప్పిన ధర్మ రహస్యాలను చెపుతాను. సావధానంగా విను. రాజా ! ఇది దేవరహస్యం. అనాయాసంగా కార్య సాధన చేయగల యముడు నియమబద్ధంగా మహాతపస్సు చేసి, తత్ఫలంగా దీనిని పొందాడు. దీనితో దేవతలు, పితరులు, ఋషులు, ప్రమథులు, లక్ష్మి, చిత్రగుప్తుడు, దిగ్గజాలు ప్రసన్న లవుతారు. మహాఫలితాన్ని ఇవ్వగల ఋషిధర్మం దీనిలో సరహస్యంగా సమావిష్టమై ఉంది. ఇది మహాదానఫలాన్ని, సర్వయజ్ఞఫలాన్ని ఇవ్వగలది. అనఘా ! ధర్మాన్ని ఈ రీతిగా గ్రహించినవాడు, గ్రహించి ఆచరించినవాడు పాపి అయినా దాని నుండి ముక్తినంది సద్గుణసంపన్నుడు కాగలడు.

పదిమంది కసాయివారితో ఒక గానుగవాడు సమానం. పది మంది గానుగ

వారితో ఒక త్రాగుబోతు సమానం. పది మంది త్రాగుబోతులతో ఒక వేశ్య సమానం. హీనుడైన రాజు పదిమంది వేశ్యలతో సమానం. రాజుగా ఉండటం వీటి నన్నింటినీ మించిన దోషం. ఈ పాపాలన్నీ రాజ్యపాలనలోని పాపంలో సగం కూడా కాదు. ధర్మార్థకామ బోధకమైన శాస్త్రం పవిత్రం, పుణ్య లక్షణసంపన్నంకూడా. ధర్మవ్యాఖ్య పుణ్యప్రదమైనది, మహారహస్యాన్ని వినిపించేది. దేవతలే స్వయంగా దాన్ని విధించారు. ధర్మసంయుక్తమైన దానిని తప్పక వినాలి. దానిలో పితృశ్రాద్ధకర్మకు సంబంధించిన రహస్యాలు, సర్వదేవతలకు సంబంధించిన రహస్య మంతా చెప్పబడుతుంది. మహాఫలదాయకమైన ఋషిధర్మం సరహస్యంగా దీనిలో స్మరింపబడుతుంది. అదే రీతిగా మహాయజ్ఞఫలం, సర్వదాన ఫలం కూడా దీనిలో ప్రతిపాదింపబడింది. దానిని నిత్యమూ పఠించిన మర్త్యులు దాని తత్త్వాన్ని బాగా తెలియగలరు. దాని ఫలాన్ని విని, ఇతరుల దగ్గర వ్యాఖ్యానించినవారు స్వయంగా నారాయణప్రభు స్వరూపు లవుతారు. అతిథులను పూజించిన నరుడు గోదాన ఫలాన్ని, తీర్థస్నానఫలాన్ని, యాగనిర్వహణ ఫలాన్ని పొందుతాడు. శ్రద్ధతో ధర్మశాస్త్రాన్ని విన్నవారు, విశుద్ధమనస్కులు వారి శ్రద్ధాసహితమైన నిర్మల మనస్సు ద్వారా పుణ్యలోకాలను గెలుచుకొంటారు. వీరు గతపాపాల నుండి విముక్తి నందుతారు. ఇకపై వారిని పాపమంటదు. నిత్యమూ ధర్మాన్ని పొందిన నరుడు మరణానంతరం ఉత్తమ లోకాలకు చేరుతాడు.

ఒకానొక సమయంలో హఠాత్తుగా ఒక దేవదూత వచ్చి, ఆకాశంలో అదృశ్యంగా నిలిచి, ఇంద్రునితో ఇలా అన్నాడు. 'భిషగ్వరులు, సద్గుణ సంపన్నులైన అశ్వినులున్నారు గదా ! వారి ఆదేశంతో నేను దేవతలు, పితరులు, మనుష్యుల సమీపానికి వచ్చాను. శ్రాద్ధదినాన శ్రాద్ధం పెట్టినవాడు, శ్రాద్ధ భోక్తా మైథునంలో పాల్గొనరాదని నిషేధించటానికి కారణమేమిటి ? శ్రాద్ధంలో విడివిడిగా మూడు పిండాలు పెట్టడానికి కారణమేమిటి ? మొదటి పిండాన్ని ఎవరికి పెట్టాలి ? మధ్యమ పిండం ఎవరికి చెందుతుంది ? మూడవ పిండం ఎవరిది ? దీనిని తెలిసికోవాలను కొంటున్నాను.' ఆ దేవదూత శ్రద్ధ ధానుడై ఆ రీతిగా ధర్మయుక్తంగా ప్రశ్నించగా తూర్పున ఉన్న దేవతలు, పితరులు అందరూ ఆ దేవదూతను అభినందిస్తూ ఇలా అన్నారు.

"దేవతాశ్రేష్ఠా ! నీకు స్వాగతం ! నీకు శుభం కలుగుతుంది. విను. నీవు గూఢార్థాలుగల ఉత్తమ ప్రశ్నను అడిగావు. శ్రాద్ధం పెట్టినవాడు కానీ, శ్రాద్ధాన్ని తిన్నవాడు కానీ ఆనాడు స్త్రీతో సంగమిస్తే వారి పితరులు ఆ మాసమంతా ఆ వీర్యం మీదనే శయనిస్తారు. పిండవిభాగాన్ని యథాక్రమంగా చెప్తాను. మూడు పిండాలలో మొదటిదాన్ని

నీటిలో కలిపివేయాలి. మధ్యమ పిండాన్ని శ్రాద్ధం పెడుతున్న వాని భార్య మాత్రమే తినాలి. మూడవ పిండాన్ని అగ్నికి ఆహుతి చేయాలి.

ఈ రీతిగా శ్రాద్ధవిధి చెప్పబడింది. ఇలా చేస్తే ధర్మం లోపించదు. ఈ ధర్మాన్ని పాటించిన వాని పితరులు ప్రసన్న మనస్కులై ఎప్పుడూ ఆనందిస్తారు. సంతతి వర్ధిల్లుతుంది. ఎప్పుడూ క్షీణించదు." దేవదూత ఇలా అన్నాడు. పిండవిభాగాన్ని యథాక్రమంగా చెప్పారు. మూడులోకాలలో నున్న పితరులకు పిండంపెట్టే శాస్త్ర విధిని మీరు చెప్పారు. మొదట ఎత్తి దిగువనీటిలో పడవేసిన పిండం ఎవరికి చెందుతుంది ? ఏ దేవతను తృప్తి పరుస్తుంది ? ఏ పితరులను తరింపజేస్తుంది ? మధ్యమ పిండాన్ని పెద్దల ఆదేశంతో శ్రాద్ధకర్త భార్య తింటోంది గదా ! శ్రాద్ధకర్తపితరులు ఆ పిండాన్ని తామెలా భుజిస్తారు ? అగ్నిలో వేయబడిన మూడవ పిండం ఏగతిని పొందుతుంది ? ఏ దేవతకు చెందుతుంది ? దీనిని వినగోరుతున్నాను. మూడు పిండాల గతి ఏది ? వీటి ఫలితమేది ? వీటిని పొందే దేవత ఎవరు ?' పితరులు అలా అన్నారు. "నీ వడిగిన ప్రశ్న చాలా గొప్పది. రహస్యమై, అద్భుతమైన ప్రశ్నను మమ్ము అడిగావు. దేవతలు, మునులు ఈ శ్రాద్ధవిధిని ప్రశంసిస్తారు. పిత్కకార్యానికి చెందిన ఈ రహస్యం నిశ్చితంగా ఆ దేవతలకు, మునులకు కూడా తెలియదు. పితృభక్తుడై, మహాయశస్వియై, వరాలు పొంది, చిరంజీవి అయిన మహాత్ముడు, ఉత్తమ విప్రుడు మార్కండేయుడు తప్ప మరొకరు దీని నెరుగరు. పూజ్యుడైన విష్ణువు ద్వారా ఆయన మూడుపిండాల గతిని గ్రహించాడు. శ్రాద్ధవిధికి సంబంధించిన నిశ్చయాన్ని నీవడిగావు. దేవదూతా ! మూడు పిండాల గతిని నేను చెప్తాను. సావధానంగా విను. నీటిలో కలిసిన పిండం చంద్రుని తృప్తిపరుస్తుంది. ఆ చంద్రుడు దేవతలను, పితరులను తృప్తిపరుస్తాడు. పెద్దల ఆదేశంతో మధ్యమ పిండాన్ని శ్రాద్ధకర్తభార్య తింటుంది గదా ! దానితో తృప్తిపడిన పితామహుడు (బ్రహ్మ) పుత్రులను కోరుకొనే వారికి పుత్రుల నిస్తాడు. అగ్నిలో పడవేసిన పిండాన్ని గురించి చెపుతున్నా విను. దానితో తృప్తిపడిన పితరులు ప్రసన్నులై కోరికలను తీరుస్తారు. మూడు పిండాలగతి నీకు పూర్తిగా చెప్పబడింది. శ్రాద్ధభోక్త ఆనాడు యజమానికి తండ్రివంటివాడు. కాబట్టి ఆ రోజు ఆయన మైథునాన్ని పరిత్యజించాలి అని భావిస్తారు. దేవతాశ్రేష్ఠా ! బ్రాహ్మణుడు శుచియై ఎప్పుడైనా శ్రాద్ధ భోజనం చేయాలి. నేను చెప్పిన దోషాలు అలాగే సంక్రమిస్తాయి. మరొక రీతిగా మారవు. కాబట్టి బ్రాహ్మణుడు స్నానం చేసి, పవిత్రుడై, సహనశీలుడై శ్రాద్ధభోజనం చేయాలి. ఈ రీతిగా శ్రాద్ధదానం చేస్తే సంతానం వృద్ధిలోకి వస్తుంది.

ఆ తరువాత విద్యుత్ప్రభుడనే మహాతపస్వి అయిన ముని ఇలా అన్నాడు. ఆ శ్రాద్ధ కర్త రూపం సూర్య తేజస్సుతో సమానంగా ప్రకాశిస్తుంది. ఆ విద్యుత్ప్రభుడు ధర్మ రహస్యాలను విని, ఆపై ఇంద్రునితో ఇలా అన్నాడు. 'మానవులు మోహానికి లోనై తిర్యగ్జాతిలో జన్మించిన ప్రాణులను కీటకాలను, చీమలను, పాములను, గొర్రెలను, మృగాలను, పక్షులను - హింసిస్తున్నారు. ఎంతోపాపాన్ని పొందుతున్నారు. వీరి పాపానికి ప్రతిక్రియ ఏది ?' అప్పుడు దేవగణాలు అన్నీ తపోధనులయిన ఋషులు, మహాభాగులైన పితరులు ఆమునిని అభినందించారు.

ఇంద్రుడిలా చెప్పాడు. 'కురుక్షేత్రాన్ని, గయను, గంగను, ప్రభాసతీర్థాన్ని పుష్కర తీర్థాలను మనసా ధ్యానించి ఆపై నీటిలో స్నానం చేయాలి. ఆ ప్రకారం చేస్తే రాహువు నుండి చంద్రుడు విముక్తి నందినట్లు పాపంనుండి విముక్తి నందగలరు. గోవుల పృష్ఠాన్ని తాకినవాడు, తోకకు నమస్కారం చేసినవాడు పై తీర్థాలలో మూడు రోజులు స్నానంచేసి, ఉపవసించినట్లే" ఆపై విద్యుత్ప్రభుడు ఇంద్రునితో ఇలా అన్నాడు. "ఇంద్రా ! నేను చెప్పబోయేది సూక్ష్మతరధర్మం. దానిని విను. ఒంటికి మర్రి ఊడకషాయాన్ని పూసికొన్నా, పెద్ద ఆవాల నూనెను పూసి కొన్నా, అరవై రోజుల పంట బియ్యంతో పాయసాన్ని చేసి త్రాగినా సర్వపాప విముక్తి లభిస్తుంది. ఋషులు ఆలోచించిన మరొక పరమ రహస్యాన్ని కూడా విను. ఇంద్రా ! నేను దీనిని పరమేశ్వరుని సన్నిధిలో బృహస్పతి చెప్పినప్పుడు ఆ రుద్రునితో కలిసి విన్నాను. దీనిని సావధానంగా విను. భోజనానికి ముందు పర్వతంపైకి ఎక్కి, ఒంటికాలిపై నిలిచి, చేతులు పైకెత్తి, జోడించి, అగ్నిదేవుని వైపు చూసినవాడు మహా తపస్సుతో కూడి ఉపవసించిన ఫలితాన్ని పొందుతాడు. గ్రీష్మకాలంలో కానీ, చలికాలంలో కానీ సూర్యకిరణాలచే తపింపజేయబడినవాడు తన పాపాలను అన్నింటినీ పోగొట్టుకొంటాడు. పాపవిముక్తుడైన అతనికి శాశ్వత తేజస్సు లభిస్తుంది. ఆ తేజస్సుతో సూర్యునివలె విరాజిల్లుతాడు. మరల చంద్రునివలె ప్రకాశిస్తాడు.'

ఆ తరువాత దేవతల మధ్యలో దేవరాజయిన ఇంద్రుడు సర్వోత్తముడైన బృహస్పతితో ఇలా మధురంగా పలికాడు. 'భగవాన్ ! మనుష్యులకు సుఖాన్ని కలిగించే ధర్మం యొక్క రహస్య స్వరూపాన్ని, రహస్యంగా ఉన్న దోషాలను గురించి యథాతథంగా చెప్పవలసినది.' బృహస్పతి చెప్తున్నాడు. "సూర్యాభిముఖంగా కానీ, వాయుప్రసారానికి ప్రతికూలంగా కానీ మూత్ర విసర్జన చేసేవాడు. ప్రజ్వలిస్తున్న అగ్నిలో సమిధలు వేయనివాడు, లేగదూడగల ఆవు నుండి కూడా క్షీరలోభంతో పాలు పితికేవాడు - వీరిలోని దోషాలను

చెపుతాను. ఇంద్రా ! సావధానంగా విను. సూర్యుని, గాలిని, అగ్నిని, లోకాలకు తల్లుల వంటి గోవులను బ్రహ్మ స్వయంగా సృష్టించాడు. వీరు భూలోకంలో దేవతల వంటివారు. లోకాలను తరింపజేయగలవారు. ధర్మనిర్ణయాలను ఒక్కొక్కటిగా చెపుతాను. మీరందరూ వినండి.

ఇంద్రా ! దురాచారులై, వంశవినాశకులైన పురుషులు కానీ, దురాచారలయిన సమస్త స్త్రీలు సూర్యాభిముఖంగా కానీ, గాలికి ప్రతి కూలంగా కానీ మూత్ర విసర్జన చేస్తే ఎనబై ఆరు సంవత్సరాల వరకు గర్భంలోని పిండాలు జారిపోతాయి. ప్రజ్వలించే అగ్నిలో సమిధలను వేయనివాడు అగ్నిహోత్రంలో హవిస్సులను వేస్తే వాటిని అగ్ని దేవుడు గ్రహించడు. లేగదూడగల ఆవుపాలను త్రాగే వారి ఇంట ఆవుపాలు త్రాగి, వంశాన్ని ఉద్ధరించగల పిల్లలు పుట్టరు. వారి సంతానం నశిస్తుంది. కులమూ, వంశమూ కూడా నశిస్తుంది. ఈ స్థితిని కులవృద్ధులైన బ్రాహ్మణులు గతంలో ప్రత్యక్షంగా చూశారు కూడా. కాబట్టి సంపదలను కోరుకొనే మర్త్యులు శాస్త్రం నిషేధించినవాటిని విడనాడాలి. విధించినవాటిని ఆచరించాలి. నీకు సత్యం చెప్తున్నాను. మహాభాగా ! ఆ తరువాత మరుద్గణాలతో సహా సమస్త దేవతలు, మహాత్ములయిన ఋషులు పితరుల నిలా అడిగారు. 'అల్ప బుద్ధులయిన మానవులు ఏ పనిచేస్తే పితరులు సంతోషిస్తారు ? శ్రాద్ధ దానం ఎలా అక్షయమవుతుంది ? మనుష్యులు ఏ కర్మ ద్వారా పితృఋణ విముక్తులు కాగలరు ? దీనిని వినాలను కొంటున్నాం. మాకెంతో కుతూహలంగా ఉంది." పితరు లిలా చెప్పారు. "మహాభాగులారా ! న్యాయబద్ధమైన సంశయాన్నే ప్రకటించారు. మర్త్యులు ఎటువంటి సత్కర్మ చేస్తే ఆనందిస్తామో దానిని వినండి.

నల్లని ఆబోతును విడవటం ద్వారా, అమావాస్యనాడు తిలోదకాలతో తర్పణచేయటం ద్వారా, వర్షాకాలంలో దీపదానం చేయటం ద్వారా పితృఋణం తీర్చుకొనవచ్చు. ఈ రీతిగా నిజాయితీతో ఇచ్చిన దానం అక్షయ మవుతుంది. మహాఫలదాయక మవుతుంది. మాకు అక్షయమైన ఆనందం కలుగుతుంది. శాస్త్రమిలా చెపుతోంది. పితృశ్రద్ధతో సంతానాన్ని కన్న మర్త్యులు తమ ప్రపితామహులను దుర్గమ నరకం నుండి తరింపజేస్తారు.' పితరుల మాటలను విని, వృద్ధగార్గ్యుని వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. ఆయన తపోధనుడు. మహాతేజస్వి. తాను వారితో ఇలా అన్నాడు. 'తపోధనులారా ! నల్లని ఆబోతును విడిస్తే వచ్చే ఫలితమేమిటి ? వర్షర్తువులో దీపదానంవలన, అమావాస్య నాటి తిలోదకతర్పణం వలన ఫలమేమిటి ?'

పితరులిలా చెప్పారు. "వదిలిన ఆబోతు జలాశయాల్లో దిగి, తోకతో నీటిని మీదికి చిమ్ముకొంటే ఆ ఆబోతును వదిలిన వారి పితరులు ఆరవైవేల సంవత్సరాలపాటు ఆ నీటితో తృప్తిపడతారు. ఆ ఆబోతు ఒడ్డుమీదనుండి కొమ్ములతో బురద నెత్తుకొని నిలిస్తే ఆ ఆబోతును విడిచినవాని పితరులు నిస్సంశయంగా సోమలోకానికి వెళతారు. వర్షర్తువులో దీపదానం చేసిన నరుడు చంద్రునివలె శోభిస్తాడు. దీపదానం చేసిన వాడు అంధకార రూపమైన నరకానికి వెళ్ళడు. తపోధనా ! అమావాస్యనాడు రాగిపాత్రలో తేనె, నువ్వులు కలిపిన జలంతో పితరులకు తర్పణచేసిన మర్త్యులు సరహస్యంగా యథావిధిగా శ్రాద్ధకర్మ చేసినట్లే. వారి సంతతి ఎప్పుడూ పుష్టిగా, ఆనందంగా ఉంటుంది. పిండదానం చేసినదానికి ఫలం కులవంశ వృద్ధియే. శ్రద్ధతో శ్రాద్ధం పెట్టినవాడు పితరుల ఋణం తీర్చుకొన్నట్లే. ఈ రీతిగా శ్రాద్ధకాలం, శ్రాద్ధక్రమం, శ్రాద్ధవిధి, శ్రాద్ధపాత్ర, శ్రాద్ధఫలాలు ఉన్నదున్నట్లు వర్ణించి చెప్పబడింది."

126. దేవరహస్యము

భీష్ముడు చెప్తున్నాడు. "ఏ పనిచేస్తే నీకు ప్రీతి కలుగుతుంది ? ఎలా ఆనందిస్తావు" అని ఇంద్రుడడుగగానే ప్రభువైన ఈశ్వరుడు ఇలా అన్నాడు.

విష్ణువు చెప్తున్నాడు. "బ్రాహ్మణులను నిందించటం, నన్ను తీవ్రంగా ద్వేషించటం సమానమే. బ్రాహ్మణులను పూజిస్తే నిత్యమూ నన్ను పూజించినట్లే. సందేహం లేదు. బ్రాహ్మణులకు నిత్యమూ నమస్కరించాలి. భోజనానంతరం వారి కాళ్ళు కడగాలి. సుదర్శన చక్రాన్ని తీర్చి, దానిపై నన్ను పూజించి, బలులు సమర్పించాలి. అలా చేసిన మానవుల ప్రవర్తనతో నేను తృప్తిచెందుతాను. పొట్టిగా ఉన్న బ్రాహ్మణుని, నీటిలో నుండిపైకి లేచిన వరాహాన్ని చూసి, ఆ వరాహం పైకెత్తిన మృత్తికను తలదాల్చిన వారికి ఎటువంటి అశుభమూ కలుగదు. పాపం కూడా అంటదు. అశ్వత్థ వృక్షాన్ని, గోరోచనాన్ని, గోవును నిత్యమూ పూజించిన నరుడు దేవతలు, అసురులు, మనుష్యులతో సహా సకల జగత్తును పూజించినట్లే. ఆ రూపానికి వారు చేసిన పూజను యథార్థమూర్తికి చేసిన పూజగా భావించి, స్వీకరిస్తాను. లోకాలు నిలిచి ఉన్నంతకాలం నాకదే పూజ. మరొకపూజ అవసరం లేదు. అల్పబుద్ధులైన మానవులు ఇతర మార్గాలలో నన్ను వృథాగా పూజిస్తున్నారు. వారు చేస్తున్న ఆ పూజను నేను పరిగ్రహించను అది నాకు ఆనందాన్ని ఇవ్వదు." ఇంద్రుడిలా అడిగాడు "చక్రాన్ని, పాదాలను, వరాహాన్ని, పొట్టి బ్రాహ్మణుని, పైకెత్తిన ధరణిని (మృత్తికను) నీ వెందుకు

ప్రశంసిస్తున్నావు ? నీవే భూతాలను సృష్టిస్తున్నావు. నీవే ప్రజలను సంహరిస్తున్నావు. మర్త్యులతో సహా సర్వప్రాణులకూ సనాతన ప్రకృతివి నీవే.'

'అప్పుడు విష్ణువు నవ్వి, ఇలా అన్నాడు. "చక్రంతో రాక్షసులను చంపాను. పాదాలతో భూమిని ఆక్రమించాను. వరాహరూపాన్ని ధరించి, హిరణ్యాక్షుని పడగొట్టాను. వామన రూపాన్ని స్వీకరించి, బలిచక్రవర్తిని జయించాను. ఈ కారణంగా వీటిని పూజించిన మహాత్ములైన మానవులను చూసి ఆనందిస్తాను. అటువంటి నన్ను పూజించిన వారికి పరాభవం కలుగదు. బ్రహ్మచారి అయిన బ్రాహ్మణుడు ఇంటికి రావటాన్ని చూసి, ముందుగా ఆయనకు భోజనం పెట్టిని ఆపై తాను తినాలి. ఆ భోజనం అమృత తుల్య మవుతుంది. ప్రాతస్సంధ్యోపాసన చేసి, సూర్యుని కెదురుగా నిలిస్తే సర్వతీర్థాలలోనూ తాను స్నానమాడినట్లే. తత్ఫలంగా సర్వపాపవిముక్తి లభిస్తుంది. తపోధనులారా ! మీకు అడిగిన సంశయాలకు సమాధానంగా ఈ రహస్య విషయాలను మీకు పూర్తిగా చెప్పాను ఇంకా ఏం చెప్పమంటారు ?"

బలదేవుడిలా అన్నాడు. "మనుష్యులకు సుఖాన్ని కలిగించే పరమ రహస్యాన్ని వినండి. దీని నెరుగక అజ్ఞానులు భూతాల పీడనకు లోనై కష్టపడుతున్నారు. ఉదయాన్నే లేచి గోవును, నేతిని, పెరుగును, ఆవాలను, నల్లావాలను స్పృశించిన మానవుడు పాపవిముక్తి నందుతాడు. తపోధనులు ముందు అయినా, వెనుక అయినా వస్తున్న సమస్త ప్రాణులను విడిచి దూరంగా వెళతారు. కష్టాలలో అయినా ఎంగిలి వస్తువులను పరిగ్రహించరు." దేవతలన్నారు. "మానవులు జలపూర్ణమైన రాగిపాత్రను తీసికొని ఉత్తరాభిముఖులై, ఉపవాస నియమాన్ని స్వీకరించాలి. లేదా ఏదైనా వ్రతాన్ని సంకల్పించాలి. దానితో అతని ప్రవర్తనతో దేవతలు ఆనందిస్తారు. కోరిక సిద్ధిస్తుంది. కానీ అల్పబుద్ధులైన మానవులు అలా చేయక వ్యర్థంగా వేరేపనులు చేస్తుంటారు. ఉపవాసమప్పుడు, బలిదాన సమయంలో రాగి పాత్ర ప్రశస్తం. బలి, భిక్ష, అర్ఘ్యం, పితరులకు తిలోదకం రాగిపాత్రతో ఇవ్వాలి. లేకుంటే ఫలం స్వల్పమే. ఇది చాలా రహస్యవిషయం మీకు చెప్పాను. ఈ రీతిగా చేస్తే దేవతలు ఆనందిస్తారు."

ధర్ముడు చెప్తున్నాడు "విప్రుడు రాజపురుషుడైనా, వేతనం తీసికొని ఘంటకొట్టే వాడయినా పరిచారకుడయినా, గో రక్షకుడైన వ్యాపారస్థుడైనా, శిల్పి అయినా, నటుడయినా, మిత్రద్రోహి అయినా, వేదాధ్యయనం లేనివాడైనా శూద్రస్త్రీకి భర్త అయినా వీరికి దైవకార్య, పిత్కకార్యాలకు సంబంధించినది ఏదీ, ఏరీతిగానూ పెట్టదగదు. వారికి పిండాలను (అన్నాన్ని)

ఇచ్చినవాడు క్షీణిస్తాడు. వాని పితరులు తృప్తిచెందరు. ఇంటికి వచ్చిన అతిథి నిరాశతో ఇంటి నుండి వెళ్ళిపోతే, అతిథి సత్కారం జరగనందువలన ఆ ఇంటినుండి పితరులు, దేవతలు, అగ్నులు నిరాశతో వెనుదిరుగుతారు. అతిథిని అర్చించకపోతే ఆ యజమానికి స్త్రీని చంపినవాడు, గోవును చంపినవాడు, కృతఘ్నుడు, బ్రహ్మహత్య చేసిన వాడు, గురుపత్నితో సంగమించినవాడు పొందే ఫలితంతో సమానమైన ఫలితం లభిస్తుంది.' అగ్ని ఇలా అన్నాడు "మనిషి దుర్బుద్ధియై కాలినెత్తి గోవును గానీ, మహాభాగుడైన బ్రాహ్మణుని గానీ, వెలుగుతున్న అగ్నిని గానీ స్పృశిస్తే వచ్చే దోషాలను చెప్పబోతున్నాను. సావధానంగా వినండి. అటువంటి పనులు చేసిన వాని అపకీర్తి స్వర్గందాకా వ్యాపిస్తుంది. అతని పితరులు భయపడతారు. దేవతలకు కూడా ఎంతో వైమనస్యాన్ని కలిగించినవాడవుతాడు. మహాతేజస్వి అయిన అగ్ని అతడిచ్చిన హవ్యాలను స్వీకరింపడు. అతడు వంద జన్మల పాటు నరకంలో వండబడతాడు. అతనికి ఏ రీతిగానూ ప్రాయశ్చిత్తాన్ని అంగీకరించరు. కాబట్టి శ్రద్ధాళువై, ఆత్మహితాన్ని కోరుకొనే మనిషి ఎప్పుడూ గోవులను కానీ, మహాతేజస్వి అయిన బ్రాహ్మణుని గానీ, ప్రజ్వలించే అగ్నిని కానీ కాలితో తాకకూడదు. ఈ ముగ్గురివైకి కాలినెత్తే వాడు పొందే ఈ దోషాలను వివరించాను."

. విశ్వామిత్రుడిలా అన్నాడు "ధర్మసంబద్ధమై గోపనీయమైన పరమ రహస్యాన్ని వినండి. భాద్రపదమాసంలో కృష్ణపక్షంలో, మఘానక్షత్ర యుక్త త్రయోదశినాడు, కుతప (మధ్యాహ్నంతరువాత) కాలంలో, దక్షిణాభిముఖుడై, ఏనుగునీడ తూర్పుగా పడుతున్నప్పుడే ఆ నీడలో నిలిచి, పితరులకు పరమాన్నాన్ని నివేదించాలి. ఆ దానం యొక్క విస్తృత ఫలాన్ని గురించి విను. అలా చేస్తే పదమూడు సంవత్సరాలు పాటు మహాశ్రాద్ధాన్ని నిర్వహించినట్లే. గోవులు ఇలా అన్నాయి 'గతంలో బ్రహ్మలోకంలో వజ్రధారి అయిన ఇంద్రుని యజ్ఞంలో బహులా ! సమంగా ! ఆకుతో భయా ! క్షామా ! సఖీ ! భూయసీ ! మొదలయిన పదాలతో సంబోధించి, దూడలతో సహా గోవులను స్తుతించారు. అలాగే ఆకాశంలో ఉన్న గోవులకు, సూర్యమార్గంలో ఉన్న గోవులకు నారదుడు, ఇతరదేవతలు కలిసి సర్వసహా అని పేరుపెట్టారు. పై రెండు శ్లోకాలూ కలిపి ఒక మంత్రం. ఈ మంత్రంతో గోవులకు నమస్కరించినవాడు పాపకర్మల నుండి ముక్తినందుతాడు. గోసేవా ఫలంగా ఇంద్రలోకాన్ని పొందుతాడు. చంద్రకాంతితో ప్రకాశిస్తాడు. దేవతలు కూడా సేవించే ఈ మంత్రాన్ని పర్వ దినాలలో, గోశాలలో పరించిన వానికి పాపమంటదు, భయశోకాలుండవు. అతడు ఇంద్రలోకాన్ని పొందుతాడు."

భీష్ముడు చెప్తున్నాడు "ఆపై లోకప్రసిద్ధిచెందిన మహానుభావులైన వసిష్ఠాది సప్తర్షులు అందరూ, కమల సంభవుడైన బ్రహ్మకు ప్రదక్షిణం చేసి, చేతులు జోడించి నిలిచారు. వారిలో బ్రహ్మవిత్తముడైన వసిష్ఠుడు సర్వప్రాణులకూ, విశేషించి బ్రాహ్మణ క్షత్రియులకు హితకరమైన ప్రశ్న వేశాడు. "లోకంలో సజ్జనులు సాధారణంగా ద్రవ్యహీనులు, దరిద్రులుగా ఉంటారు. వారు ఏ పనిచేస్తే యజ్ఞాచరణ ఫలితాన్ని పొందగలుగుతారు ?" ఆ ప్రశ్నవిని బ్రహ్మ వారితో ఇలా అన్నాడు. "మీరు మంచి ప్రశ్న అడిగారు. ఇది గూఢార్థం, పరమశుభకరం, సూక్ష్మం, మానవులకు శ్రేయోదాయకం కూడా. తపోధనులారా ! మానవుడు యజ్ఞఫలం పొందగల మార్గాన్ని పూర్తిగా, అంతా చెపుతాను. వినండి. ఈ విషయంలో సంశయం లేదు. పుష్యమాసంలో, శుక్లపక్షంలో, రోహిణీ నక్షత్రం వచ్చిన నాటి రాత్రి మనుష్యుడు స్నానం చేసి, విశుద్ధుడై, ఒకే వస్త్రాన్ని ధరించి, శ్రద్ధాసావధానతలతో శూన్యప్రదేశంలో పడుకొని, చంద్రకిరణాలను సేవించాలి. అలాచేస్తే మహాయజ్ఞఫలం లభిస్తుంది. ద్విజోత్తములారా ! సూక్ష్మంగా అర్థతత్వాలను గ్రహింపగల మీరడిగిన ప్రశ్నకు సమాధానంగా పరమరహస్యమైన ఈ విషయాన్ని మీకు చెప్పాను."

127. ధర్మరహస్య వర్ణన

అగ్నిదేవుడంటున్నాడు "పూర్ణిమనాడు చంద్రోదయ వేళలో చంద్రుని కభిముఖంగా నిలిచి, నేతితో అక్షతలతో సహా దోసెడు నీళ్ళను చంద్రుని కర్పించినవాడు అగ్ని కార్యం చేసినట్లే, అతడు మూడు అగ్నులలో (గార్హపత్యం, ఆహవనీయం, దక్షిణాగ్ని) ఆహుతులను అర్పించినట్లే. మూర్ఖుడై అమావాస్యనాడు చెట్టు ఆకును ఒక్కదానిని కోసినా అతనికి బ్రహ్మహత్యాపాప మంటుతుంది. మూర్ఖుడై అమావాస్యనాడు పండ్లుతోముకొనే పుల్లను తింటే అతడు చంద్రుని హింసించినట్లే. అతని పితరులు ఉద్వేగానికి లోనవుతారు. పర్వదినాలలో దేవతలు అతడిచ్చిన హవ్యాన్ని స్వీకరించరు. అతని పితరులు కూడా కోపిస్తారు. అతని కులంలో వంశహాని జరుగుతుంది."

లక్ష్మి ఇలా అన్నది. "ఇంటిలో పాత్రలు చిందరవందరగా పడిఉన్నా, గిన్నెలు, ఆసనాలు విరిగిపోయి ఉన్నా, స్త్రీలు పీడింపబడుతున్నా ఆ ఇల్లు పాపపంకిల మవుతుంది. పాపదూషితమైన ఆ ఇంటినుండి ఉత్సవసమయాలలోనూ, పర్వదినాలలోనూ దేవతలు, పితరులు నిరాశతో వెళ్ళి పోతారు." అంగిరుడన్నాడు. "సంవత్సరంపాటు కానుగచెట్టు క్రింద అవిసెచెట్టు వేరును చేతబట్టి దీపదానం చేసినవాని సంతతి వర్ధిల్లుతుంది."

గార్గ్యుడిలా అన్నాడు. "నిత్యమూ ఆతిథ్య మివ్వాలి. ఇంటిలో దీపాన్ని పెట్టాలి. పగలు నిద్రించగూడదు. మాంసాన్ని తినరాదు. గోబ్రాహ్మణులను హింసించగూడదు. పుష్కరాలను కీర్తించాలి. సరహస్యమైన ఈ శ్రేష్ఠధర్మం మహాఫలాన్ని ఇస్తుంది. వందల యాగాలు చేసినా ఆ హవిస్సు (ఫలం) నశిస్తుంది. కానీ పై ధర్మాలను శ్రద్ధాళువులై పాటిస్తే ఆ ఫలం ఎప్పుడూ తరిగిపోదు. ఇదిగో, గోపనీయమైన మరొక పరమ రహస్యాన్ని చెపుతున్నాను. వినండి. శ్రాద్ధకల్పంలో, యజ్ఞంలో, తీర్థంలో, పర్వదినాలలో దేవతలకై నిర్దేశించిన హవిస్సుపై రజస్వల, కుష్ఠరోగంగల స్త్రీ, గొడ్రాలు వీరి దృష్టి పడితే ఆ హవిస్సును దేవతలు స్వీకరించరు. పితరులు కూడా పదమూడు సంవత్సరాలపాటు ఆనందానికి దూరంగా ఉంటారు. శ్రాద్ధ దినాలలో, యజ్ఞవేళలో మనుష్యుడు స్నానం చేసి, పవిత్రుడై తెల్లని వస్త్రాలు ధరించి, బ్రాహ్మణులచే స్వస్తివాచనం చేయించాలి. మహాభారతాన్ని చదవాలి. అలా చేస్తే హవ్యకవ్యాలు అక్షయాలవుతాయి."

ధౌమ్యుడిలా అన్నాడు. "ఇంటిలో పగిలిన పాత్రలు, విరిగిన మంచం, కోడి, కుక్క, ఇంటిలో మొలిచిన చెట్లు ఇవన్నీ ఉండటం మంచిదికాదు. పగిలిన గిన్నెలు కలికి ఆవాసం. విరిగిన మంచం ధనహాని. కోడి, కుక్క ఉంటే దేవతలు హవిస్సును స్వీకరించరు. చెట్టు మొదళ్ళు జంతువుల నివాసం కాబట్టి ఇంటిలోపల చెట్లుండరాదు." జమదగ్ని ఇలా అన్నాడు. "అశ్వమేధ యాగం చేసినా, వంద వాజపేయయాగాలు చేసినా, తలక్రిందులుగా వ్రేలాడినా, దీర్ఘసత్రయాగం చేసినా హృదయం పవిత్రం కాకపోతే తప్పక నరకానికే వెళతాడు. యజ్ఞమూ, సత్యమూ, హృదయవిశుద్ధి మూడూ సమానమే. గతంలో ఒకడు పవిత్ర హృదయంతో బ్రాహ్మణునకు లోటాడు గంజిని దానం చేసి బ్రహ్మలోకానికి వెళ్ళగలిగాడు. హృదయశుద్ధి ప్రాధాన్యానికి ఆ ఉదాహరణం చాలు."

128. వాయువు ధర్మాధర్మములను వివరించుట

వాయుదేవుడిలా అన్నాడు. "మానవులకు సుఖాన్ని కల్గించగల ధర్మాన్ని కొంచెం చెపుతాను. రహస్యదోషాలను గూర్చి కూడా చెపుతాను. సావధానంగా వినండి. నిత్యమూ అగ్నికార్యం చేయాలి. శ్రాద్ధదినాన ఉత్తమ భోజనం పెట్టాలి. పితరులకై దీపదానం చేయాలి. తిలోదకాలు సమర్పించాలి. ఈ రీతిగా మనుష్యుడు శ్రద్ధతో, ఏకాగ్రతతో సంవత్సరంలో నాలుగు మాసాల పాటు పితరులకై తిలోదకాల నర్పించి, యథాశక్తి వేదపండితుడైన బ్రాహ్మణునకు భోజనం పెడితే వందయాగాలు చేసిన విపులఫలాన్ని పొందుతాడు.

మరొక పరమరహస్యాన్ని చెపుతాను. ఇది గర్హనీయం వినండి. బ్రాహ్మణుని, అగ్నిని, శూద్రుడు ఒకచోట నుండి మరొక చోటుకు కొనిపోయినా, స్త్రీలు హవిస్సును తీసికొని పోయినా, దానిని ఎవరైనా ధర్మంగా భావించినా వానికి అధర్మమంటుతుంది. అగ్నులు వానిపై కోపిస్తారు. అతడు శూద్రజాతిలో జన్మిస్తాడు. అతని విషయంలో దేవతలు, పితరులు కూడా పెద్దగా ఆనందపడరు. అక్కడ ప్రాయశ్చిత్తమేమిటో చెపుతాను. వినండి. దీనిని పాటించిన నరుడు నిశ్చింతగా, సుఖంగా ఉంటాడు. గోవుల మూత్రంతో, పేడతో, పాలతో, నేతితో, నిరాహారంగా, సావధానంగా మూడురోజులపాటు అగ్నికార్యం చేయాలి. అలా సంవత్సరకాలం గడిపిన తరువాత దేవతలు అతని హవిస్సును స్వీకరిస్తారు. ఈ రీతిగా ధర్మ రహస్యాన్ని, అధర్మ రహస్యాన్ని కూడా చెప్పాను. ఇది స్వర్గకాములకు మరణానంతరం స్వర్గసుఖాన్ని కలిగిస్తుంది."

129. లోమశరహస్యము

లోమశు డిలా అన్నాడు. "అవివాహితుడై, పరులభార్యలపై ఆసక్తిగల నరుని పితరులు శ్రాద్ధవేళలో నిరాశకు లోనవుతారు. పరదారాసక్తుడు, గొడ్రాలిని సేవించేవాడు, బ్రాహ్మణుని సొమ్మును అపహరించేవాడు. ఈ ముగ్గురూ సమానమైన తప్పు చేసినట్లే పితరుల దృష్టిలో వీరు పలుకరింపదగనివారు. ఈ విషయంలో సంశయం లేదు. దేవతలు, పితరులు కూడా వీరి హవిస్సును స్వీకరించరు. కాబట్టి ఆత్మహితాన్ని కోరేవాడు పరదారలను పరిహరించాలి. గొడ్రాలిని విడనాడాలి. బ్రాహ్మణుని సొమ్మును అపహరించరాదు. ధర్మయుక్తమై, గోపనీయమైన మరొక పరమ రహస్యాన్ని వినండి. ఎప్పుడూ గురువు మాటను చాలా శ్రద్ధగా పాటించాలి. ప్రతిమాసంలోను ద్వాదశినాడు, పౌర్ణమి నాడు బ్రాహ్మణులకు నేతిబియ్యాన్ని దానం చేయాలి. దాని పుణ్యాన్ని వినండి. ఆ దానంతో చంద్రుడు, మహాజలాశయమైన సముద్రుడు వర్ధిల్లుతారు. ఇంద్రుడు ఆ దాతకు అశ్వమేధయాగఫలంలోని నాలుగవ భాగాన్ని కల్పిస్తాడు. ఆ దానంతో నరుడు తేజస్వి అవుతాడు. బలశాలి కాగలడు. భగవానుడైన సోముడు ప్రసన్నుడై కోరిన కోరికలను తీరుస్తాడు. మహాఫలదాయకమైన మరొక ధర్మరహస్యాన్ని వినండి. ఇది ఈ కలియుగంలో మనుష్యులకు సుఖావహమైన ధర్మం. ఉదయమే లేచి, స్నానం చేసి, తెల్లని వస్త్రాలు ధరించి, సావధానంగా బ్రాహ్మణులకు తిలపాత్రను దానం చేయాలి. మధుమిశ్రితమైన తిలోదకాన్ని, దీపాన్ని, కట్టెపొంగలిని పితరులకు సమర్పించాలి. అలా చేసిన మానవుడు పొందే ఫలితాన్ని వినండి. తిలపాత్ర

దాన ఫలాన్ని ఇంద్రుడిలా చెప్పాడు 'గోదానం చేసినా, శాశ్వతంగా భూదానం చేసినా భూరిదక్షిణలతో అగ్నిష్టోమయాగం చేసినా ఈ పుణ్యకర్మలతో సమానంగానే తిలపాత్రదానాన్ని కూడా దేవతలు భావిస్తారు. పితరు లెప్పుడూ శ్రాద్ధంలో తిలోదకదానాన్ని అక్షయ దానంగా భావిస్తారు. దీపదానంతో కట్టి పొంగలి పెట్టడంతో పితామహులు సంతుష్టి చెందుతారు నేను చెప్పిన ఈ పురాతన ధర్మం ఋషుల దర్శనం. స్వర్గలోకంలోనూ, పితృలోకంలోనూ పితరులు, దేవతలు దీనిని ఆదరిస్తారు."

130. అరుంధతీ చిత్రగుప్తరహస్యము

భీష్ముడు చెప్తున్నాడు. "ఆపై ఋషిగణాలందరూ, పితరులు, దేవతలూ కలిసి, మహాత్ముడైన వసిష్ఠునితో సమానమైన శీలమూ, శక్తిగల తపోవృద్ధురాలైన అరుంధతిని సావధానంగా ఇలా అడిగారు 'కళ్యాణీ ! మేము నీనుండి ధర్మరహస్యాలను వినగోరుతున్నాం. నీ దృష్టిలో పరమ రహస్యధర్మమేదో చెప్పవలసినది.' అరుంధతి చెప్తోంది. 'మీరు నన్ను తలచుకొనటంవలన నా తపస్సు వర్ధిల్లుతోంది. మీ అనుగ్రహంతో శాశ్వత ధర్మాలను చెపుతాను. అవి పరమగోపనీయ రహస్యాలు. అవన్నీ వినండి. పరిశుద్ధమనస్కులై శ్రద్ధగలవారికే వీటిని చెప్పాలి. శ్రద్ధలేనివాడు, అభిమాని, బ్రహ్మహత్య చేసిన వాడు, గురుపత్నితో సంగమించినవాడు – ఈ నలుగురు పలుకరింపదగనివారు. వారికి ధర్మరహస్యం చెప్పగూడదు.

నరుడు పండ్రెండు సంవత్సరాలపాటు ప్రతిదినమూ కపిలగోవును దానం చేసినా. ప్రతి మాసమూ నిరంతరంగా సత్రయాగం చేసినా జ్యేష్ఠపుష్కర తీర్థంలో లక్షగోవులు దానం చేసినా అతిథిని సంతోషపెట్టినవాడు పొందేధర్మ ఫలాన్ని తాను పొందలేడు. మనుష్యులకు శుభావహమై మహాఫలదాయకమైన మరొక ధర్మాన్ని కూడా వినండి. దీనిని శ్రద్ధతో పాటించాలి. ఉదయాన్నే లేచి దర్భలను, నీటిని తీసికొని గోవుల దగ్గరకు వెళ్ళాలి. ఆ నీటిని గోవుల కొమ్ములపై చల్లాలి. కొమ్ములపై నిలిచిన నీటిని శిరసా ధరించాలి. ఆరోజు ఉపవసించాలి. అలా పాటించినవాడు పొందే ధర్మఫలాన్ని విను. మూడు లోకాలలోనూ సిద్ధులు, చారణులు, మహర్షులు సేవించే ప్రసిద్ధ తీర్థాలలో స్నానమాచరిస్తే వచ్చే ఫలం, గోవుల కొమ్ముల మీది జలాన్ని తలదాల్చినందువలన లభిస్తుంది." అప్పుడు దేవతలు, పితరులు, సమస్త ప్రాణులు బాగా ఆనందించి సాధువాదాలు చేశారు. అరుంధతిని ప్రశంసించారు. పితామహు డన్నాడు "ఆహా ! మహాభాగా ! ధర్మాన్ని

సరహస్యంగా చక్కగా ఉదాహరించావు. నీకు వరమిస్తాను, ధన్యురాలా ! నీ తపస్సు సదా వర్ధిల్లుతుంది.''

యముడు చెప్తున్నాడు ''మీ ద్వారా నేను విన్న కథ దివ్యమూ, రమణీయమూ కూడా. నేను, చిత్రగుప్తుడు కూడా మాటాడే ప్రియభాషణను వినండి. ధర్మ సహితమైన ఈ రహస్యం మహర్షులు కూడా వినదగినదే. ఆత్మ హితాన్ని కోరుకొనే మర్త్యుడు దీనిని శ్రద్ధగా వినాలి. మనుష్యుడు చేసిన పుణ్యమైనా, పాపమైనా కొంచెం కూడా నశించదు. అనుభవించవలసినదే. పర్వకాలంలో చేసిన స్వల్పదానమైనా సూర్యుని చేరుతుంది. మర్త్యుడు ప్రేతలోకానికి వెళ్ళినప్పుడు సూర్యదేవుడు ఆ వస్తువుల నన్నింటినీ తిరిగి ఇస్తాడు. పుణ్యాత్ముడు అక్కడ వాటిని అనుభవిస్తాడు. చిత్ర గుప్తుని అభిప్రాయంలా శుభాకరమైన ధర్మాన్ని కొంచెం చెపుతాను. ఎప్పుడూ జలదానం, దీపదానం చేయాలి. చెప్పులను, గొడుగును, కపిలగోవును యథోచితంగా దానం చేయాలి. పుష్కర తీర్థంలో వేదపారగుడైన బ్రాహ్మణునకు కపిలగోవును దానం చేయాలి. అగ్నిహోత్రనియమాలను సర్వవిధాలా ప్రయత్న పూర్వకంగా పాటించాలి. దీనితోపాటు మరొక ధర్మాన్ని కూడా చిత్రగుప్తుడు చెప్తుంటాడు. విడివిడిగా తాను చెప్పే ఫలాలను సజ్జనులు అందరూ వినాలి. సర్వప్రాణులూ కాలక్రమాన్ని అనుసరించి నశించవలసినవే. అక్కడ దుర్గమ నరకంలో పడిన మనుష్యులు, ఆకలిదప్పుల బాధలకు గురియై, అగ్నిలో దహింపబడుతూ పచనం చేయబడుతారు. అక్కడ తప్పించుకొనే ఉపాయ మేదీ ఉండదు. అల్ప బుద్ధులు నరకంలో దుఃఖమయమైన గాఢాంధకారంలో పడతారు. అక్కడ దుర్గమనరకాన్ని దాటి పోగల ధర్మాన్ని చెపుతాను. ఈ ధర్మంలో ఖర్చు తక్కువ, ఫలిత మెక్కువ. మరణానంతరం కూడా సుఖదాయక మిది. పానీయగుణాలు దివ్యాలు. విశేషించి ప్రేతలోకంలో వాటికి విలువ ఎక్కువ. నరకంలో పుణ్యోదక అనుపేర నది ఉన్నది. అది యమలోకవాసులకై విధింపబడింది. ఆ జలం అమృతంవంటిది, చల్లనిది, అక్షయమైనది. పానీయాన్ని దానం చేసినవాడు ఆ పుణ్యోదకాన్ని త్రాగుతాడు. ప్రదీపదానం వలన కలిగే బహుళ గుణాలను వినండి.

దీపదాత నరకంలో అంధకారాన్ని చూడడు. ఇది నియతం. చంద్రుడు, సూర్యుడు, అగ్ని దీపదాతకు కాంతి నిస్తారు. దేవతలు కూడా దీపప్రదాతను ఆదరిస్తారు. అతనికై దిక్కులు నిర్మలంగా ఉంటాయి. ప్రేతలోకానికి వెళ్ళిన నరుడు సూర్యుని వలె ప్రకాశిస్తాడు. కాబట్టి దీపాన్ని దానం చేయాలి. విశేషించి జలాన్ని దానం చేయాలి. పుష్కరతీర్థంలో వేద

పండితుడైన బ్రాహ్మణునకు కపిలగోవు నిచ్చినవాడు పొందే విశేషఫలాన్ని వినండి. ఎద్దులతో పాటు వంద ఆవుల నిచ్చిన శాశ్వతఫల మతనికి దక్కుతుంది. బ్రహ్మ హత్యవంటి పాపకర్మను చేసినా ఒక్క కపిలా గోదానం దానిని చెరిపివేస్తుంది. అలా ఇచ్చిన ఒక్క కపిలగోవు వంద ఆవులకు సమానం. కాబట్టి జ్యేష్ఠపుష్కరంలో పున్నమినాడు కపిలను దానం చేయాలి. యోగ్యుడైన ద్విజోత్తమునకు చెప్పులను దానం చేసిన వారికి విషమస్థాన మేదీ ఉండదు. దుఃఖముండదు. కష్టాల బారిన పడడు. గొడుగును దాన మిచ్చినవాడు పరలోకంలో సుఖకరమైన నీడను పొందుతాడు. ఈలోకంలో చేసినదానం ఎప్పుడూ నశించదు.' చిత్రగుప్తుని అభిప్రాయాన్ని విని మహా తేజస్వి అయిన సూర్యుడు ఒళ్ళు పులకరింపగా సమస్త దేవతలతోనూ, పితరులతోనూ ఇలా అన్నాడు. 'మహాత్ముడైన చిత్రగుప్తుని అభిప్రాయాన్ని విన్నారు గదా ! అది ధర్మరహస్యం. మర్త్యులు శ్రద్ధాళువులై మహాత్ములైన బ్రాహ్మణులకు ఈ దానమిస్తే వారికి భయమే కలుగదు.

ఈ లోకంలో ధర్మదోషాలు అయిదున్నాయి. వాటికి ప్రాయశ్చిత్తం లేదు. ఆ తప్పులు చేసిన నరాధములు అనాచారులు. వారితో మాటాడకూడదు. వారిని పరిహరించాలి. బ్రహ్మహత్య చేసినవాడు, గోహత్య చేసిన వాడు, పరదారాసక్తుడు. శ్రద్ధాశూన్యుడు, స్త్రీ మీద ఆధారపడి బ్రతికేవాడు - ఈ అయిదుగురు ఆ మహాదోషులు. ఈ పాప కర్ములు ప్రేతలోకానికి వెళ్ళి, నరకంలోని అగ్నిలో చేపలవలె పచనం చేయబడతారు. చీము, నెత్తురు వారికి ఆహార మవుతుంది. ఈ అయిదు తప్పులు చేసిన వారితో పితరులు కానీ, దేవతలు కానీ, స్నాతకులైన బ్రాహ్మణులు కానీ, ఇతర తపోధనులు కానీ కనీసం మాటాడరు."

131. ప్రమథరహస్యము.

భీష్ముడు చెప్తున్నాడు. "ఆ తరువాత మహాభాగ్యశాలులైన దేవతలు, పితరులు, మహాభాగులయిన ఋషులు ప్రమథులతో ఇలా అన్నారు. "మహాభాగులారా మీరు ప్రత్యక్షంగా నిశాచరులు ఉచ్ఛిష్ఠులు, అపరిశుద్ధులు, క్షుద్రులు అయిన మానవులను ఎలా హింసిస్తున్నారు ? మీరు మర్త్యులను హింసించకుండా ఉండేదుకు ఉపాయాలు ఏవి ? మీరు ఇళ్ళలోనే కనిపించకుండా పోయే రక్షోఘ్న మంత్రాలు ఏవి ? నిశాచరులారా ! దీని నంతా మీ ద్వారా వినగోరుతున్నాం." ప్రమథులిలా అన్నారు. "ఎప్పుడూ మైథునంతో ఎంగిలిపడినవారు, పెద్దా చిన్నా తెలియనివారు, మోహంతో మాంసాన్ని తినేవారు, చెట్ట

క్రింద నిదురించేవారు, తలపై మాంసపుమూట మోసేవారు, కాళ్ళవైపు తలపెట్టి పడుకొనే వారు - వీరంతా అపవిత్రులు, ఎన్నో లోపాలుగల మానవులు నీటిలో మలమూత్రాలను, ఉమ్మిని విడిచేవారు కూడా అపవిత్రులు. ఈ మానవులను చంపవచ్చు, తినవచ్చు. ఈ విషయంలో సంశయం లేదు. ఇటువంటి స్వభావమూ, నడవడీ గల మానవులను బెదిరిస్తున్నాం. వారిని మేము హింసింపకుండా ఉండగలందులకు ఉపాయాలను వినండి. శరీరానికి గోరోచనాన్ని అలదుకొన్నవానిని, వసను చేత ధరించిన వానిని, మస్తకంపై నేతిని, అక్షతలను తదాసక్తితో ధరించిన వానిని, మాంసం తిననివానిని మేము హింసించలేము. ఎవని ఇంట నిత్యమూ రేబవళ్ళు అగ్ని జ్వలిస్తుంటుందో, చిరుతపులితోలు, దంతాలు, కొండతాబేలు, ఆజ్య ధూమం, పిల్లి, నల్లని లేదా పసుపు పచ్చని మేక ఏ గృహస్థుని ఇంట ఉంటాయో ఆ గృహాలను భీకరులై, మాంసభక్షకులైన నిశాచరులు ఆక్రమించలేరు. లోకాలలో సుఖంగా సంచరిస్తున్నా, మావంటి నిశాచరులు కూడా అటువంటి ఇండ్లలో చొరబడలేరు. కాబట్టి రాజా ! ఇళ్ళలో ఇటువంటి రక్షోఘ్న వస్తువుల నుంచుకోవాలి. మీకు తీవ్ర సంశయమున్న విషయాన్ని పూర్తిగా మీకు చెప్పాం."

132. దిగ్గజరహస్యము

భీష్ముడు చెప్తున్నాడు "ఆపై పద్మం వలె ప్రకాశిస్తున్న పద్మసంభవుడైన బ్రహ్మ, దేవతలతో, శచీపతిఅయిన దేవేంద్రునితో ఇలా అన్నాడు. "ఇది రసాతలంలో సంచరించే మహాబలశాలి అయిన ఏనుగు. మహాసత్త్వమూ, మహాపరాక్రమూ, తేజస్సు గల దీనిపేరు రేణుకం. దాదాపు దిగ్గజాలన్నీ మహాతేజస్సు, మహాపరాక్రమమూ గలవి. అవి పర్వతాలు, వనాలు, కాననాలతో సహా సమస్త భూమండలాన్ని మోస్తున్నాయి. మీ అనుమతితో ఈ రేణుకం ఆమహాగజాల దగ్గరకు వెళ్ళి ధర్మరహస్యాలను అడుగుతుంది." బ్రహ్మ మాటను విని, ఆదేవతలు అప్పుడు ప్రశాంతహృదయులై రేణుకాన్ని ఆ దిగ్గజాల దగ్గరకు పంపించారు. రేణుక మిలా అన్నది "మహాబలులారా ! దేవతలు, పితరులు నన్ను ఆదేశించారు. మీ నుండి ధర్మరహస్యాలను యథాతథంగా వినగోరుతున్నాను. మహాభాగాలారా ! మీరు భావించే ధర్మతత్త్వాన్ని చెప్పండి." దిగ్గజాలు చెప్తున్నాయి "కార్తీక మాసంలో కృష్ణ పక్షంలో ఆశ్లేషానక్షత్రయుక్తమైన అష్టమి మంగళప్రదం. ఆ రోజు ఆహారాన్ని, కోపాన్ని నియంత్రించుకొని శ్రాద్ధ దినాన ఈ మంత్రాన్ని జపించి మాకు పొంగలి నివేదించాలి. 'బలదేవుడు (ఆదిశేషువు) మొదలుగా గల మహాబలశాలు లయిన ఏనుగులు అనంతాలు, అక్షయాలు, భోగులు.

అవి అలాగే వారి వంశంలో పుట్టిన పెద్ద పెద్ద పాములు నా బల తేజస్సులను పెంపొందింప జేయటానికై నా బలిని స్వీకరించాలి. నారాయణుడు ప్రళయవేళలో నీటినుండి భూమిని పైకెత్తినప్పుడు ఎంత బలంతో ఉన్నాడో లక్ష్మీ సంపన్నుడైన ఆదేవుని అప్పటి బలం నాకు సంక్రమించాలి.' అలా మంత్రాన్ని పఠించి అక్కడి పుట్టలో ఆ బలిని నివేదించాలి. పుట్టపై నాగకేసర పుష్పాలను చల్లి, చందనాన్ని పూసి, నల్లటి గుడ్డను కప్పి సూర్యాస్తమయం తర్వాత పుట్టపై బలినుంచాలి. దీనితో మేమంతా సంతోషించి, క్రింద బరువు బాధిస్తున్నా ఆ శ్రమ తెలియకుండా భూమిని భరిస్తాం. బరువుతో బాధపడుతూ కూడా ఎవ్వరినీ ఏమీ కోరని మేము ఇలా భావిస్తున్నాం. బ్రాహ్మణుడైనా, క్షత్రియుడైనా, వైశ్యుడయినా, శూద్రుడైనా ఉపవసిస్తూ ఒక సంవత్సరం పాటు ఇలా బలిదానం చేస్తే ఎంతో ఫలం లభిస్తుంది. పుట్టదగ్గర ఇచ్చే బలి ఎంతో ఫలితాన్ని ఇవ్వగలదని మా అభిప్రాయం. ఇలా చేస్తే మూడులోకాలలో నున్న మహాపరాక్రమశాలు లయిన ఏనుగుల కన్నింటికీ వందసంవత్సరాలపాటు యథావిధిగా ఆతిథ్యమిచ్చినట్లే!" దిగ్గజాల ఆ అభిప్రాయాన్ని విని, మహాభాగులైన దేవతలు, పితరులు, ఋషులు రేణుకాన్ని ప్రశంసించారు.'

133. మహాదేవరహస్యము.

మహేశ్వరు డిలా అన్నాడు. "మీరంతా ధర్మసారాన్ని తీసి ఉత్తమ ధర్మాన్ని ఉదాహరించారు. ఇక మీరందరూ నేను చెప్పబోయే ధర్మరహస్యాన్ని వినండి. శ్రద్ధ, ధర్మాన్ని ఆశ్రయించిన బుద్ధి గల నరులకు మాత్రమే మహాఫలదాయకమైన ధర్మాన్ని రహస్యాలతో పాటు ఉపదేశించాలి. ఉద్వేగానికి లోను కాకుండా, నెలరోజులపాటు గోవులకు ఆహారాన్ని అందిస్తూ, తాను ఏకభుక్తంతో ఉన్న వాడు పొందే ఫలాన్ని చెపుతాను, వినండి. మహాభాగులారా ! ఈ గోవులు పరమ పవిత్రమైనవిగా భావింపబడతాయి. దేవతలు, అసురులు, మానవులతో సహా మూడులోకాలనూ అవి ధరిస్తూ ఉండేవి. వాటికి సేవచేయటం మహాఫలదాయకం, మహాపుణ్యదాయకం. గోవులకు ఆహారాన్ని పెట్టిన వాడు అనుదినమూ ధర్మాన్ని ప్రోది చేసికొంటాడు. నేను గతంలో కృతయుగంలో గోవులు నా దగ్గరే ఉండాలని ఆదేశించాను. అప్పుడు పద్మసంభవుడైన బ్రహ్మ నన్ను అనునయించాడు. అందువలన గోవుల మందలోనున్న ఎద్దు నా రథధ్వజచిహ్నంగా పైన ఉంటుంది. నేను ఎప్పుడు గోవులతో పాటు ఉండి, ఆనందిస్తాను. కాబట్టి అవి నిత్యమూ పూజింపదగినవి. వరదానం

చేసే మహాప్రభావంగల ఆ గోవులను ఉపాసిస్తే వరాలనిస్తాయి. సర్వకర్మల ద్వారా పొందదలచిన ఫలం లభించేటట్లు గోవులు వరమిస్తాయి. గోవులకు పైరీతిగా ఆహారం పెట్టినవాడు నిత్యగోసేవా ఫలంలో నాలుగవ భాగాన్ని పొందగలడు."

134. స్కందదేవ రహస్యము

స్కందుడు ఇలా చెప్తున్నాడు "నా అభిప్రాయంలో కూడా ధర్మ స్వరూప మొకటుంది. దానిని సావధానంగా వినండి. నల్లటి ఆబోతు కొమ్ముల మీదనున్న బురదతో మూడురోజులు స్నానం చేసినవాడు పొందే పుణ్యఫలాన్ని వినండి. అశుభాన్ని పూర్తిగా పోగొట్టుకొంటాడు. ఇతరులపై ఆధిపత్యాన్ని వహిస్తాడు. మరల మానవ జన్మ నెత్తితే శూరుడుగానే పుడతాడు. ఇదిగో ! మరొక పరమగోపనీయమైన ధర్మరహస్యాన్ని గ్రహించండి. పున్నమినాడు చంద్రోదయ సమయంలో, రాగి పాత్రతో, తేనె కలిపిన పక్వాన్నాన్ని చంద్రునికి బలిగా ఇవ్వాలి. దానితో కలిగే నిత్యధర్మఫలాన్ని శ్రద్ధగా వినండి. సాధ్యులు, రుద్రులు, ఆదిత్యులు, విశ్వేదేవులు, అశ్వినులు, మరుత్తులు. వసువులు ఆ బలిని గ్రహిస్తారు. దానితో చంద్రుడు, సముద్రుడు వర్ధిల్లుతారు. ఇలా నేను రహస్యసహితంగా సుఖావహమైన ధర్మాన్ని చెప్పాను.' విష్ణువు చెప్తున్నాడు "మహాత్ములైన దేవతలు, ఋషులు చెప్పిన ఈ ధర్మరహస్యాల నన్నింటినీ ప్రతిదినమూ చదివినవానికీ, దోష దృష్టిలేకుండా నిత్యమూ శ్రద్ధతో విన్నవానికీ ఎటువంటి విఘ్నమూ కలుగదు. అతనికి భయంకూడా కలుగదు. శుభప్రదాలు, పుణ్యప్రదాలూ అయిన ఈ ధర్మరహస్యాలను జితేంద్రియుడై పఠించినవానికి ధర్మఫలం పూర్తిగా లభిస్తుంది. అతనిపై పాపప్రభావ ముండదు. అతనిని పాపమంటదు. చదివినా, విన్నా, వినిపించినా అతని పితరుల అక్షయ హవ్యకవ్యాలను భుజిస్తారు. పర్వదినాలతో నియమ పూర్వకంగా బ్రాహ్మణులకు ఈ ధర్మాలను వినిపించినవాడు సర్వదా ఋషులకు, దేవతలకు, పితరులకు ఇష్టుడవుతాడు, శ్రీమంతుడవుతాడు. సదా ధర్మంలో ప్రవర్తిస్తాడు. మహాపాతకాలను తప్ప, మిగిలిన చిన్న చిన్న పాపాలను చేసినా ఈ ధర్మ రహస్యాన్ని వింటే ఆ పాపాలనుండి విముక్తి నందుతాడు." భీష్ముడు చెప్తున్నాడు. "రాజా ! దేవతలు చెప్పిన ఈ ధర్మ రహస్యాన్ని నాకు వ్యాసుడు చెప్పాడు. సర్వదేవతలూ నమస్కరించే ఈ ధర్మాన్ని నేను నీకు చెప్పాను. ఒకవైపు రత్నాలతో నిండిన భూమి, మరొకవైపు ఈ ఉత్తమ జ్ఞానం ఈ రెండింటిలో భూమిని విడిచి ఈ ధర్మాన్నే వినాలని ధర్మవేత్త

భావించాలి. శ్రద్దలేని వానికి, నాస్తికునికి, ధర్మహీనునికి, దయారహితునికి, యుక్తివాదంతో చెడ్డపనులు చేసేవానికి, గురుద్వేషికి, శరీరాభిమానికి ఈ ధర్మరహస్యాన్ని చెప్పకూడదు."

135. భోజ్య - అభోజ్యాన్న వివరణ

యుధిష్ఠిరుడు అడిగాడు "భారతా ! ఈ లోకంలో బ్రాహ్మణుడు ఎవరి దగ్గర భుజించాలి ? క్షత్రియుడు ఎవరి ఇంట భుజించాలి ? అలాగే వైశ్యులు, శూద్రులు ఎక్కడెక్కడ భుజించాలి ?' భీష్ముడు చెప్తున్నాడు. "ఈ లోకంలో బ్రాహ్మణుడు బ్రాహ్మణుని ఇంట, క్షత్రియుని ఇంట, వైశ్యుని ఇంటా భుజించవచ్చు. శూద్రుని ఇంట భుజించటం నిషిద్ధం. క్షత్రియుడు బ్రాహ్మణ క్షత్రియ, వైశ్యుల ఇంట భుజించ వచ్చు. అన్నింటినీ తింటూ, శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించే శూద్రుని ఇంటి అన్నాన్ని పరిహరించాలి. నిత్యాగ్నిహోత్రులై, పవిత్రులై, చాతుర్మాస్యవ్రతాసక్తులైన వైశ్యుల ఇంట బ్రాహ్మణులు, క్షత్రియులు భుజించవచ్చు. శూద్రుల ఇంట భుజించినవాడు సమస్త పృధివీ మలాన్ని మనుష్యుల మలాన్ని త్రాగినట్లే, తిన్నట్లే. శూద్రుని అన్నం తిన్నవాడు పృధివీ మలాన్ని, తిన్నట్లే. శూద్రుని అన్నం తిన్న బ్రాహ్మణులు పృధివీ మలాన్ని తిన్నట్లే. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు శూద్రకర్మాసక్తులయితే వారు స్వకర్మనిష్ఠులయినా సరే నరకంలో వండబడతారు. అలాగే శాస్త్ర విరుద్ధ కర్మల నాచరిస్తూ నరకంలో పడతారు. విప్రులు స్వాధ్యాయనిరతులై, మానవులకు శుభాన్ని కలిగించే పనులు చేయాలి. క్షత్రియులు రక్షకులు కావాలి. పని చేయాలి. వైశ్యుడు చేసే పనిని ఆశ్రయించి ఇతరులు జీవిస్తారు. కృషి, గోరక్షణం, వాణిజ్యం ఇవి వైశ్యకర్మలు. వీటిని తక్కువ చేసి చూడరాదు. స్వకర్మను విడిచిపెట్టి శూద్రకర్మను పాటించేవాడు శూద్రుని వంటివాడే. అతని ఇంట ఎప్పుడూ భుజించరాదు. వైద్యుడు, ఆయుధాలనమ్మి జీవించేవాడు, పురాధ్యక్షుడు, పురోహితుడు, సంవత్సర ఫలితాలు చెప్పేవాడు, వ్యర్థమైన చదువులు చదివేవాడు వీరంతా బ్రాహ్మణు లయినా శూద్రుని వంటివారే. శూద్రకర్మలు చేస్తున్న ఈ బ్రాహ్మణుల ఇంట సిగ్గు విడిచి భుజించినవాడు, తినదగనిది తినిన ఆపాపం కారణంగా దారుణ భయానికి లోనవుతాడు. అతని వంశం, పరాక్రమం, తేజస్సు నశిస్తాయి. పశుపక్ష్యాదులలో పుట్టవలసి వస్తుంది. ధర్మాన్ని విడిచిన అతడు కుక్కవలె పనిలేకుండా తిరుగుతుంటాడు. వైద్యుని అన్నం తింటే అది పురీషం వంటిది. వేశ్య అన్నం మూత్రంవంటిది. శిల్పి అన్నం రక్తం వంటిది. సజ్జన సమ్మతుడైన నరుడు విద్యను అమ్ముకొని జీవించేవాని అన్నం తినరాదు. అది శూద్రాన్నం వంటిదే. సాధుజనుడు

దానిని పరిహరించాలి. మాటపడిన వాని ఇంట భుజించేవాడు రక్తపు మడుగు వంటివాడు. చాడీలు చెప్పేవాని భోజనం చేస్తే, ఆ భోజనం బ్రహ్మహత్యతో సమానం. ఆదరణలేకుండా, అవహేళనతో పెట్టే అన్నాన్ని ఎప్పుడూ తినకూడదు. అటువంటి అన్నాన్ని తిన్న బ్రాహ్మణుడు వేగంగా రోగాన్ని, వంశ వినాశనాన్ని పొందుతాడు. నగర రక్షకుని ఇంట భుజించినవాడు చండాలునితో సమానం. గోహత్య చేసిన వాని ఇంట, బ్రహ్మహత్య చేసినవాని ఇంట, త్రాగుబోతు ఇంట, గురుపత్నితో సంగమించినవాని ఇంట భుజించిన విప్రుడు రాక్షస వంశ వర్ధనుడు అవుతాడు. ఇతరులు దాచికొన్నవస్తువును దొంగిలించిన వాడు, కృతఘ్నుడు, నపుంసకుడు - వీరి భోజనాన్ని స్వీకరించినవాడు మధ్య దేశం నుండి బహిష్కరింపబడిన శబరుని ఇంట జన్మిస్తాడు. కౌంతేయా ! ఎవని ఇంట భుజింపరాదో, ఎవని ఇంట భుజించవచ్చో యథావిధిగా నేను చెప్పాను. ఇప్పుడు నా నుండి ఇంకా ఏమి వినాలను కొంటున్నావు."

136. అనుచిత భోజనప్రాయశ్చితము.

యుధిష్ఠిరుడు అడిగాడు "మీరు భోజ్యాభోజ్య విషయాలను పూర్తిగా చెప్పారు. కానీ ఇక్కడ నాకొక సందేహం. అడుగుతున్నాను. పితామహా ! నాకు చెప్పండి. బ్రాహ్మణులు ప్రత్యేకించి హవ్యకవ్యాలను స్వీకరించినప్పుడు, అనేక విధాలయిన అన్నాన్ని స్వీకరింపవలసి వచ్చినప్పుడు వారికి ప్రాయశ్చిత్తా లేమిటి ? నాకు చెప్పవలసినది." యుధిష్ఠిరా ! నేతిని స్వీకరించినపుడు గాయత్రీ మంత్రాన్ని పఠించి, సమిధలను అగ్నికి ఆహుతి చేయాలి. తిలదానాన్ని స్వీకరించినా ఇదే ప్రాయశ్చిత్తం. రెండూ సమానమే. ఫలరసాన్ని, తేనెను, ఉప్పును దానం పట్టినప్పుడు అప్పటి నుండి సూర్యోదయం వరకు నిలిచి ఉంటే, బ్రాహ్మణుడు పవిత్రుడవుతాడు. బంగారాన్ని దానం పట్టినప్పుడు గాయత్రిని జపించి, బహిరంగంగా లోహదండాన్ని ధరించి, బ్రాహ్మణుడు దాని నుండి విముక్తి నందుతాడు. నరశ్రేష్ఠా ! ఇలాగే ధనాన్ని, వస్త్రాన్ని, స్త్రీని, అన్నాన్ని, పాయసాన్ని, చెఱకు రసాన్ని ప్రతిగ్రహించినప్పుడు కూడా సువర్ణ దానం పట్టినప్పటి వలెనే ప్రాయశ్చిత్తాన్ని చేసికోవాలి. చెఱకును, నూనెను, పవిత్రాలను స్వీకరించినప్పుడు, త్రికాలాలలో స్నానం చేయాలి, ధాన్యం. పూలు, పండ్లు, నీళ్ళు, పిండి వంటలు, యవలజావ, పెరుగు, పాలు దానం పట్టినప్పుడు వంద సార్లు గాయత్రిని జపించాలి. శ్రాద్ధ సమయంలో గొడుగును, చెప్పులను ప్రతిగ్రహించినప్పుడు సావధానంగా వందసార్లు గాయత్రిని జపిస్తే పాపవిముక్తిని పొందుతాడు. గ్రహణ సమయంలో

(కారాగారంలో ఉన్నవాని దగ్గర), ఆశౌచ సమయంలో ఇచ్చిన పాలాన్ని దానం తీసికొన్నవాడు మూడు రాత్రులు ఉపవసించాలి. దానితో పాపవిముక్తి కలుగుతుంది. కృష్ణ పక్షంలో పెట్టిన పిత్ర్యశ్రాద్ధ భోజనం చేసిన బ్రాహ్మణుడు ఒకపగలు, ఒక రాత్రి గడచిన తరువాత పవిత్రుడవుతాడు. శ్రాద్ధభోజనం చేసిన బ్రాహ్మణుడు ఆరోజు సంధ్యా వందనం చేయగూడదు. గాయత్రిని జపించరాదు. మరొకసారి అన్నంతినరాదు. దానితో తాను పవిత్రుడవుతాడు. అందువలననే అపరాహ్ణ కాలంలో పిత్ర్యశ్రాద్ధం పెట్టాలంటారు. ఒకరోజు ముందుగానే బ్రాహ్మణులను నిమంత్రించాలి. దానితో వారు ముందు చెప్పినట్లు పవిత్రుల ఇంట భోజనం చేయగలుగుతారు.

మరణం సంభవించిన ఇంట మూడవ రోజు భోజనం చేసిన బ్రాహ్మణుడు ప్రతిదినమూ ముమ్మారు స్నానం చేసి పండ్రెండవ రోజు శుద్ధి పొందుతాడు. పండ్రెండవ రోజు గడచిన తరువాత ప్రత్యేంగా స్నానాదులతో పవిత్రుడై, బ్రాహ్మణులకు హవిర్దానం చేస్తే ఆ పాపం నుండి విముక్తి పొందుతాడు. మరణం సంభవించిన ఇంట పదిరోజులు భుజించిన వానికి గాయత్రీజపం, రైవత సామగానం, పవిత్రేష్టి, కూష్మాండ అనువాకపంచకం, అఘమర్షణ స్నానం ప్రాయశ్చిత్తాలు. మరణం సంభవించిన ఇంట పెట్టిన భోజనాన్ని మూడురాత్రులు తిన్న బ్రాహ్మణుడు ఏడురోజుల పాటు ముమ్మారు స్నానం చేస్తే పవిత్రు డవుతాడు. ఈ ప్రాయశ్చిత్తంవలన సిద్ధిని పొందుతాడు. పెద్ద కష్టాల బారినపడడు. బ్రాహ్మణుడు శూద్రుల పంక్తిలో ఒక్కసారి భుజించినా అపవిత్రు డవుతాడు. అతనికి యధావిధిగా శౌచకర్మ విధింపబడుతోంది. బ్రాహ్మణుడు వైశ్యులతో పాటు ఒక్కసారి పంక్తిభోజనం చేసినా మూడు రాత్రులు వ్రతదీక్షలో నుండి ఆ కర్మదోషం నుండి విముక్తి నందుతాడు. బ్రాహ్మణుడు క్షత్రియుల పంక్తిలో ఒక్కసారి భుజించినా సచేలస్నానం చేస్తే ఆ పాపం నుండి ముక్తి పొందగలడు. బ్రాహ్మణుల తేజస్సు వారితో కలిసి భుజించిన శూద్రుల వంశాన్ని, వైశ్యుల పశువులను, బాంధవులను; క్షత్రియుల సంపత్తిని హరిస్తుంది. దానికై ప్రాయశ్చిత్తాన్ని, శాంతి హోమాన్ని చేయాలి. దానికై గాయత్రీ జపం, రైవత సామగానం, పవిత్రేష్టి, కూష్మాండ అనువాక పంచకం, అఘమర్షణ స్నానం – వీటిని ఆచరించాలి. ఇతరుల ఎంగిలిని తినరాదు. ఇతరులతో కలిసి పంక్తి భోజనం చేయరాదు. ప్రాయశ్చిత్తాలపై అనుమానపడరాదు. ప్రాయశ్చిత్తానంతరం గోరోజనం, గరిక, పసుపు వంటి మంగళపదార్థాలను తాకాలి."

137. దానప్రశంస

యుధిష్ఠిరు డడిగాడు "భారతా ! పితామహా ! దానంతో, తపస్సుతో స్వర్గాన్ని పొందవచ్చునన్నారు. కానీ ఒక సందేహం నామనస్సును దుఃఖపెడుతోంది. ఈ రెండింటిలో లోకంలో ఏది గొప్పది ? మీరు చెప్పాలి." భీష్ముడు చెప్తున్నాడు. "తపస్సుతో పవిత్ర హృదయులై, ధర్మ పరాయణులైన రాజులు దానపుణ్యాసక్తులై నిస్సందేహంగా ఉత్తమ లోకాలను పొందారు. వారిని గురించి చెపుతాను, విను. లోకంలో సత్కృతులనందిన ఆత్రేయుడు శిష్యులకు నిర్గుణ బ్రహ్మనుపదేశించి ఉత్తమలోకాలను పొందాడు. ఉశీనరసుతుడైన శిబి ప్రియపుత్రుని ప్రాణాలను బ్రాహ్మణునకై బలిచేసి, ఈలోకంనుండి స్వర్గానికి వెళ్ళాడు. కాశిరాజైన ప్రతర్దనుడు తనకుమారుని బ్రాహ్మణునకు సమర్పించి, ఇహపరలోకాలలో సాటిలేని కీర్తిని అనుభవిస్తున్నాడు. సంకృతి కుమారుడైన రంతిదేవుడు మహాత్ముడైన వసిష్ఠునకు యధావిధిగా అర్ఘ్య ప్రదానం చేసి, ఉత్తమ లోకాలను పొందాడు. దేవావృధుడు వందకమ్ములు గలిగి, దివ్యమై, శుభ కరమైన బంగారు గొడుగును యజ్ఞం కోసం బ్రాహ్మణున కిచ్చి, స్వర్గానికి వెళ్ళాడు. పూజ్యుడైన అంబరీషుడు పరమతేజస్వి అయిన బ్రాహ్మణునకు సకలరాజ్యాన్నీ సమర్పించి, దేవలోకాన్ని పొందాడు. సూర్య కుమారుడు (కర్ణుడు) దివ్య కుండలాలను, జనమేజయుడు వాహనాన్ని, గోవులను బ్రాహ్మణునకు దానం చేసి, ఉత్తమ లోకాలను పొందారు. రాజర్షి అయిన వృషాదర్భి వివిధ రత్నాలనూ, సుందర గృహాలను బ్రాహ్మణుల కిచ్చి, స్వర్గానికి వెళ్ళాడు.

విదర్భరాజ కుమారుడైన నిమి తన రాజ్యాన్నీ, కుమార్తెను అగస్త్యుడికి దానం చేసి పుత్రులతో, పశువులతో, బంధువులతో సహా స్వర్గానికి వెళ్ళాడు. మహాయశస్వి, జమదగ్నికుమారుడు అయిన పరశురాముడు బ్రాహ్మణునకు భూమిని దానంచేసి, ఊహకందని అక్షయలోకాలకు వెళ్ళాడు. ఒకప్పుడు వానలు కురవకపోతే మునిరాజు అయిన వసిష్ఠుడు సమస్త ప్రాణులకు జీవదానం చేసి, తత్ఫలంగా అక్షయగతిని పొందాడు. దశరధకుమారుడైన రాముడు యాగాలలో ఎంతో ధనాన్ని ఆహుతిచేసి, లోకంలో గొప్ప కీర్తిని పొంది, అక్షయలోకాలకు వెళ్ళాడు. మహాయశస్వి, రాజర్షి అయిన కక్షసేనుడు మహాత్ముడైన వసిష్ఠునకు తనకున్నదంతా అర్పించి, స్వర్గాన్ని పొందాడు. కరంధముని మనుమడు, అవిక్షితుని కొడుకు అయిన మరుత్తుడు ఆంగిరసునకు (సంవర్తునకు) కన్యాదానం చేసి, వేగంగా స్వర్గానికి వెళ్ళారు. ధర్మాత్ములలో మేటి, పాంచాలరాజు అయిన బ్రహ్మదత్తనరపాలుడు శంఖ మనే నిధిని దానం చేసి, ఉత్తమగతిని పొందాడు. మిత్రహుడనేరాజు కూడా మహాత్ముడైన

వసిష్ఠునకు తన ప్రియపత్ని అయిన దమయంతిని ఇచ్చి, స్వర్గానికి వెళ్ళాడు. మను పుత్రుడైన సుద్యుమ్న మహారాజు మహాత్ముడైన లిఖితుని ధర్మబద్ధంగా శిక్షించి, ఉత్తమలోకాలను పొందాడు. మహాయశస్వి, రాజర్షి అయిన సహస్రచిత్యుడు ఇష్టమయిన ప్రాణాలను బ్రాహ్మణునకై పరిత్యజించి, ఉత్తమ లోకాలను పొందాడు. శతద్యుమ్న మహారాజు అన్ని కోరికలతో నిండిన బంగారు ఇంటిని మౌద్గల్యునకు దానం చేసి, స్వర్గానికి వెళ్ళాడు. సుమన్యు మహారాజు గతంలో భక్ష్యాలను, భోజ్యాలను, కొండలవంటి రాసులుగా పోసి, శాండిల్యునకు ఇచ్చి, స్వర్గాన్ని చేరాడు. ద్యుతిమంతుడనే పేరుగల మహాకాంతిమంతుడైన శాల్వరాజు ఋచీకునకు రాజ్యాన్ని దానం చేసి, ఉత్తమ లోకాలను పొందాడు.

మదిరాశ్వుడనే రాజర్షి అందగత్తెఅయిన తన కుమార్తెను హిరణ్యహస్తునకు దానం చేసి, దేవతల లోకానికి వెళ్ళాడు. రాజర్షి అయిన లోమపాదనరపాలుడు తన కుమార్తె అయిన శాంతను ఋశ్యశృంగున కిచ్చి తన కోరికలనన్నింటినీ పూర్తిగా పొందగలిగాడు. రాజర్షి అయిన భగీరథుడు హంసి అనే పేరు గల తన కుమార్తెను కౌత్సునకు దానం చేసి, తత్ఫలంగా అక్షయలోకాలను పొందాడు. భగీరథరాజు లక్ష ఆవులను దూడలతో పాటు కోహలునకు దానంచేసి, ఉత్తమలోకాలను పొందాడు. యుధిష్ఠిరా ! వీరే కాక ఇతరు లెందరో దానంతో, తపస్సుతో మరల మరలా స్వర్గానికి వెళ్తున్నారు. వస్తున్నారు. దాన తపస్సులతో ఉత్తమ లోకాలను పొందిన గృహస్థుల కీర్తి భూమి ఉన్నంత వరకు ఈ లోకంలో నిలిచి ఉంటుంది. యుధిష్ఠిరా ! నేను శిష్టుల చరిత్రను కీర్తించాను. దానంతో, యజ్ఞంతో, సంతానాన్ని కనటంతో వీరు స్వర్గంలో ప్రతిష్ఠ నందారు. కౌరవ ధురంధరా ! నీవు కూడా నిత్యము దానం చేయి. నీ బుద్ధి దాన యజ్ఞక్రియలలో లగ్నమై, ధర్మాని వృద్ధి పొందింప జేయాలి. ఇంకా నీకు సందేహాలేమైనా ఉంటే రేపు ఉదయం చెపుతాను. సంధ్యాకాలం సమీపించింది."

138. పంచదాన వివరణము.

యుధిష్ఠిరుడు అడిగాడు "తాతా ! మహాదానధర్మాలు చేసి స్వర్గాన్ని పొందిన రాజులను గురించి మీ ద్వారా విన్నాను. ఇక్కడ ఈ విషయాన్ని వినగోరుతున్నాను. దానం ఎన్ని విధాలు ? దాన ఫలమేమిటి ? ఎలా ? ఎవరికి ? ధర్మాను సారంగా దానం చేయటాన్ని కోరవచ్చు. ఏ కారణాలతో దానం చేయాలి ? దాన మెన్ని రకాలు ? ఇదంతా యథాతథంగా వినాలనుకొంటున్నాను." భీష్ముడు చెప్తున్నాడు. "కౌంతేయా ! దానతత్వాన్ని

గురించి విను. సర్వవర్ణాల వారికి ఎలా దానం చేయవచ్చో చెపుతా విను. ధర్మం, అర్థం, భయం, కామం, కారుణ్యం ఈ అయిదు కారణాల వలన దానం అయిదురకాలు. ఇక దాన కారణాలను చెపుతా విను. దాత ఇహలోకంలో కీర్తినీ, పరలోకంలో ఉత్తమ సుఖాన్ని పొందుతాడు. ఈ భావంతో అసూయలేకుండా విప్రులకు దానం చేయాలి. (ఇది ధర్మదానం) ఈయన ఇస్తున్నాడు ఇంకా ఇస్తాడు, నాకు ఇచ్చాడు, ఈయన ఇచ్చాడు, ఇటువంటి మాటలను యాచకులనోటి నుండి వింటూ కీర్తి కోసం సర్వస్వాన్ని యాచకుల కివ్వవచ్చు (ఇది అర్థదానం) "నేను ఇతని కేమీ కాను. నాకూ ఇతడేమీ కాడు అయినా దాన మివ్వకుండా తిరస్కరిస్తే నన్ను ఏం చేస్తాడో" అనుకొంటూ భయంతో పండితుడు మూర్ఖునికి దానం చేయవచ్చు (ఇది భయదానం). 'నాకితడు ఇష్టమైనవాడు. ఇతనికి నేను ఇష్టమైనవాడిని' అని ఆలోచిస్తూ బుద్ధిమంతుడు, ఆలస్యం లేకుండా ఖేదపడకుండా మిత్రునికి దాన మివ్వాలి (ఇది కామదానం). "ఈయన దీనుడైయాచిస్తున్నాడు ఎంతిచ్చినా ఆనందిస్తాడు" అనుకొంటూ దరిద్రునకు సర్వథా జాలితో దానంచేయాలి (ఇది కారుణ్యదానం). అయిదు రకాలయిన ఈ దానం పుణ్యాన్ని, కీర్తినీ పెంపొందింప జేస్తుంది. శక్తివంచన లేకుండా దానం చేయాలి. ఇది బ్రహ్మచెప్పిన మాట"

139. ఋషి శ్రీకృష్ణ సంభాషణము.

యుధిష్ఠిరు డడిగాడు "పితామహా ! మన ఈ శ్రేష్ఠవంశంలో అనేకాగమాలలో నీవే పండితుడవు. అరిందమా ! ధర్మార్థ సంయుక్తమై, భవిష్యత్తులో సుఖదాయకమై, జగదాశ్చర్యకరమైన విషయాన్ని నీ నుండి వినగోరుతున్నాను. పురుషశ్రేష్ఠా ! జ్ఞాతులకు, దాయాదులకు దుర్లభమైన ఈ కాలం సంప్రాప్తించింది. నీవు తప్ప మాకు ధర్మాన్ని శాసించి చెప్పగలవాడు మరొకడు లేడు. అనఘా ! నా సోదరులతో సహా నన్ను అనుగ్రహించదలచుకొంటే నేను అడగబోతున్న ప్రశ్నకు సమాధాన మివ్వాలి. ఈ నారాయణుడు శ్రీమంతుడు, సర్వరాజులు సమ్మానించే వాడు. కానీ ఎంతో వినయంతో, గౌరవంతో నిన్ను సేవిస్తున్నాడు. ఆయన సమక్షంలో, ఈ రాజులందరి సమక్షంలో, నా సోదరులకు ప్రియాన్ని కల్గించటానికై నీవు స్నేహ పూర్వకంగా వివరించి చెప్పాలి."

వైశం పాయనుడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరుని ఆ మాటను విని స్నేహావేశంతో గంగకొడుకైన భీష్ముడు ఇలా అన్నాడు.

"రాజా ! గతంలో ఈ విష్ణుమూర్తి ప్రభావాన్ని గురించి, మహేశ్వరుని ప్రభావాన్ని

గురించి నేను విని ఉన్న అతిమనోహరకథను నీకు చెపుతాను. రుద్రాణికి కలిగిన సందేహాలను, తద్విషయమై ఆ దంపతుల మధ్య జరిగిన సంభాషణను కూడా నానుండి వినుము. ఒకసారి ధర్మాత్ముడైన కృష్ణుడు పండ్రెండు సంవత్సరాల పాటు వ్రతం చేశాడు. వ్రతదీక్షితుడైన ఆయనను చూడాలని నారద పర్వతులు వచ్చారు. కృష్ణ ద్వైపాయనుడు, జపించేవారిలో శ్రేష్ఠుడైన ధౌమ్యుడు, దేవలుడు, కాశ్యపుడు, హస్తికాశ్యపుడు, ఇతర మహర్షులు; దీక్షితులు, జితేంద్రియులు అయిన సాధువులు శిష్యులతోపాటు వచ్చారు. ఆ శిష్యులు కూడా దేవతల వంటివారు, సిద్ధులు, తపస్సంపన్నులు. దేవకీనందనుడైన శ్రీకృష్ణుడు ప్రసన్నుడై దేవతలకు చేయతగిన సేవలతో ఆ మహర్షులకు తన వంశాచారానికి తగినట్లు అతిథి సత్కారాలను కల్పించాడు. ఆకుపచ్చ, పసుపు వన్నెతోగల నూతన దర్భాసనాలపై ఆ మహర్షులు ప్రసన్నులై, శ్రీకృష్ణునకు దగ్గరగా కూర్చున్నారు. ఆపై వారు రాజర్షులకు, దేవతలకు, అక్కడ వసిస్తున్న తపోధనులకు సంబంధించి మధుర ధార్మిక విషయాలను గూర్చి ముచ్చటించుకొన్నారు.

ఆపై వ్రతాచరణరూపమైన ఇంధనంతో ప్రజ్వలింపజేయబడిన నారాయణతేజస్సు అద్భుత కర్మలు చేసే శ్రీకృష్ణుని ముఖం నుండి అగ్ని రూపంలో వెలువడి ఆ పర్వతాన్ని చెట్లతో, లతలతో, పొదలతో, పక్షిసమూహాలతో, మృగ సమూహాలతో, క్రూరజంతువులతో, పాములతో సహా దహింపసాగింది. అప్పుడు ఆ శైలశిఖరం దగ్ధమవుతూ, దయనీయంగా కనిపించింది. వివిధ జంతువుల హాహాకారాలతో అచేతన శిఖరమే ఆక్రోశిస్తున్నట్టుంది. మహాజ్వాలలు గల ఆ అగ్ని పర్వతాన్ని పూర్తిగా దగ్ధం చేసి, విష్ణుమూర్తి సమీపానికి వచ్చి, శిష్యుని వలె పాదాలను స్పృశించింది. ఆపై శత్రుసూదనుడైన ఆ విష్ణువు పూర్తిగా తగులబడిన ఆ పర్వతాన్ని చూసి, తన చల్లని చూపులను ప్రసరింపజేసి, దానికి మరల మునుపటి స్థితిని కల్పించాడు. ఆ పర్వతం అంతకుముందువలె మరల వికసించిన లతలతో, చెట్లతో, పక్షి గణాలతో, క్రూరజంతువులతో, పాములతో నిండిపోయింది.

ప్రసన్నులైన నిద్దచారణ సంఘాలు ఆ పర్వతాన్ని శోభింపజేస్తున్నారు. మదపుటేనుగులు, వివిధ పక్షిగణాలు దానిపై కూడి ఉన్నాయి

ఊహకు కూడా అందని ఆ అద్భుత కర్మను చూసి, అప్పుడు మునిగణమంతా ఆశ్చర్యానికి లోనైంది. వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. కన్నులు ఆనంద బాష్పాలతో నిండాయి. ఆపై వక్తలలో శ్రేష్ఠుడైన నారాయణుడు, ఆశ్చర్యానికి లోనై ఉన్న మునులను చూసి, వినయంతో, స్నేహంతో, ఇలా మధురవచనాలతో ప్రశ్నించాడు. "ఋషిగణం

మమతాశూన్యం. సంగాలను విడనాడినది. జ్ఞాన సంపన్నం. అయినా ఆశ్చర్యానికి ఎందుకు లోనైంది ? ఇది నా సంశయం తపోధనులారా ! మీరందరూ మచ్చపడని ఋషులు. దీనిని యథాతథంగా అర్థ నిర్ణయం చేసి, తీర్చి చెప్పవలసింది." ఋషులు చెప్తున్నారు "లోకాలను సృష్టించేది నీవే, మరల సంహరించేది నీవే, చల్లదనం నీవే, వేడి నీవే, వర్షించేది కూడా నీవే, భూమిపై నున్న సకల చరాచర ప్రాణులకు తండ్రి నీవే, తల్లివి నీవే. ప్రభువువు నీవే, జన్మస్థానమూ నీవే. మధుసూదనా ! నీ నోటి నుండి అగ్ని వెలువడటం మాకు ఆశ్చర్య జనకమైంది. మాకొక సంశయం శుభకరా ! దానికి కారణాన్ని చెప్పి, సంశయాన్ని పోగొట్టవలసిన వాడవు నీవే. హరీ ! శత్రుసూదనా ! ఆపై నిర్భయంగా మేము కూడా మేము చూసిన, విన్న ఆశ్చర్య కరవిషయాన్ని నీకు చెపుతాం."

వాసుదేవుడ అలా చెప్పాడు "నా నోటి నుండి వెలువడినది వైష్ణవ తేజస్సు. ఇది ప్రళయ కాలాగ్ని రూపాన్ని ధరించి ఈ పర్వతాన్ని దహించింది. ఆ తేజస్సుతో జితక్రోధులు, జితేంద్రియులై, దేవతలతో సమానంగా తపోధనులైన మీ వంటి ఋషులు కూడా ఆర్తులై దుఃఖించారు. నేను వ్రతదీక్షలో ఉన్నాను. తాపసులు ఆవ్రతాన్ని సేవిస్తున్నందువలన నా తేజస్సు అగ్ని రూపంగా వెలువడింది. మీరు వ్యధచెంద నవసరం లేదు. నేను తపస్సు ద్వారా నా వంటి శక్తిమంతుడైన కుమారుని పొందాలనే కోరికతో శుభాస్పదమైన ఈ పర్వతానికి వచ్చాను. అంతలో నా శరీరంలో ఉన్న ప్రాణమే అగ్నిరూపాన్ని ధరించి, వెలువడింది. సర్వలోక పితామహుడై అందరికీ వరాల నిచ్చే బ్రహ్మదర్శనానికి వెళ్ళింది. మునిశ్రేష్ఠులారా ! ఆ బ్రహ్మ సాక్షాత్తు మహేశ్వరుడే. నీ తేజస్సులోని సగపాలుతో నీకు కుమారుడుగా పుడతాడని నా ప్రాణంతో చెప్పి పంపించాడు. ఆ అగ్ని రూపమైన నా ప్రాణమే మరలా నా దగ్గరకు వచ్చి, శిష్యునివలె పరిచర్యచేయటానికి నా పాదాలకు ప్రణమిల్లి, శాంతించి, తన పూర్వస్థితిని పొందింది. తపోధనులారా ! ధీమంతుడైన పద్మనాభుని ఈ రహస్యాన్ని నేను మీకు సంక్షేపంగా చెప్పాను. మీరు భయపడనవసరం లేదు. మీరు దీర్ఘదృష్టి గలవారు, తాపసవ్రతంతో ప్రజ్వలిస్తున్నవారు, జ్ఞాన విజ్ఞాన శోభితులు కాబట్టి సర్వత్ర మీగమనానికి ఎదురులేదు. భూలోకంలో కానీ, స్వర్గలోకంలో గానీ, మీరు చూచిన లేదా విన్న పరమాశ్చర్య మేదైనా ఉంటే నాకు చెప్పండి. ఈ లోకంలో తపోవనవాసులైన మీరు చెప్పబోయే అమృత సమానాలయిన మధురవచనాలను వినాలని నాకెప్పుడూ కోరిక. మునులారా ! మీ దర్శనం దేవతాదర్శనంవలె దివ్యం. భూలోకంలో గానీ, స్వర్గలోకంలో గానీ దివ్యంగా అద్భుతంగా కనిపించే వస్తువులను మీరు చూడలేక

పోవచ్చు కానీ నేను ప్రత్యక్షంగా చూడగలను. అది నా పరాప్రకృతి. దానికెక్కడా నిరోధం లేదు. నాలోని ఐశ్వర్యం నాకు ఆశ్చర్యకర మనిపించదు. అయినా సత్పురుషుల చెవుల బడునట్లుగా చెప్పిన విషయం విశ్వసనీయమవుతుంది. శిలాలేఖ వలె భూమిపై చిరకాల ముంటుంది. కాబట్టి నేను సజ్జనులైన మీ నుండి వెలువడిన ఆ మాటలను మానవుల బుద్ధిని ఉద్దీపింపజేసేదిగా భావించి, ఆ సమాజంలో చెపుతాను."

దానితో కృష్ణ సన్నిధిలోనున్న మునులందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. పద్మదళాలవంటి కన్నులతో ఆ జనార్దనుని చూశారు. కొందరు ఆయనను వర్ణిల్ల జేస్తున్నారు. కొందరు అర్చిస్తున్నారు. మరికొందరు ఋగ్వేదంలోని అర్థవంతాలయిన ఋక్కుల ద్వారా ఆ మధుసూదనుని స్తుతిస్తున్నారు. ఆపైమునులందరూ వాక్యవిశారదుడు,. దేవ ద్రష్ట అయిన నారదుని కృష్ణునకు బదులివ్వటానికి నియోగించారు. మునులిలా అన్నారు "ప్రభూ ! మహర్షీ ! తీర్థయాత్రాపరులైన మునిజనులు హిమవద్గిరిపై ఊహకందని ఆశ్చర్యసన్నివేశాన్ని చూశారు. కాబట్టి నీవు ఋషిజనుల హితంకోసం ఆ విషయమంతా మొదటి నుండి చూసినది చూసినట్లు కృష్ణునకు చెప్పాలి." మునులు అలా అనగానే పూజ్యుడు దేవర్షి అయిన నారదముని ఈ పూర్వవృత్తాంతాన్ని చెప్పారు."

140. ఉమామహేశ్వర సంవాద ప్రారంభము

భీష్ముడు చెప్తున్నాడు "అప్పుడు నారాయణునికి ఆప్తుడు, పూజ్యుడు అయిన నారదముని ఉమాశంకరుల సంవాదాన్ని గూర్చి చెప్పసాగాడు. "ధర్మాత్ముడు, దేవదేవుడు అయిన ఈశ్వరుడు పుణ్యప్రదమైన హిమవత్పర్వతంపై తపస్సు చేశాడు. ఆ పర్వతం సిద్ధులు, చారణులు సేవించేది. వివిధౌషధాలతో అందమైన రకరకాల పూలతో నిండినది. అప్సరస్సమూహాలతో కూడినది. భూతసమూహాలు సేవించేది. అక్కడ పరమేశ్వరుడు వందలకొలది భూత సమూహాలు చుట్టూ నిలవగా ఆనందంతో కూడి ఉన్నాడు. ఆ భూతాలు వివిధ రూపాలతో, విరూపాలతో, దివ్యరూపాలతో అద్భుతంగా కనిపిస్తున్నాయి. కొన్ని భూతాల ఆకారాలు సింహాలు, పులులు, ఏనుగుల వంటివి. సర్వజాతుల ప్రాణులు అక్కడున్నాయి. కొన్నింటి ముఖాలు నక్కలవలె, చిరుతపులులవలె, ఎలుగుబంట్లవలె, ఎద్దులవలె ఉన్నాయి. కొన్ని గుడ్లగూబలవంటి ముఖాలతో భయంకరమైనవి. కొన్ని తోడేళ్ళు, డేగల ముఖాలవి. కొన్ని జింకలవంటి ముఖాలవి. వివిధ వర్ణాలతో వివిధ జాతిప్రాణులు అక్కడున్నాయి. ఇవికాక కిన్నరులు, యక్షులు, గంధర్వులు, రాక్షసులు, భూత గణాలు

మహాదేవుని చుట్టూ ఉన్నాయి. ఆ మహేశుని సదస్సులో దివ్యపుష్పాలను చల్లారు. దివ్యతేజస్సు అక్కడ వ్యాపించి ఉంది. దివ్యచందన చర్చలతో, దివ్య ధూప గంధాలతో అది పరిమళించింది. దివ్యవాద్యాలు ఆ సదస్సులో ధ్వనిస్తున్నాయి. మృదంగాలు, పణవాలు మ్రోగుతున్నాయి. శంఖ భేరీనినాదాలు అంతటా వినిపిస్తున్నాయి. భూత సముదాయాలు, నెమళ్ళు అన్నివైపులా నృత్యం చేస్తున్నాయి. ఆ సభలో అప్సరసలు నాట్యమాడుతున్నారు. ఆ దివ్య సభ దేవర్షిగణసేవితమై చూడముచ్చటగా ఉంది. చెప్పటానికి వీలు కానంత అద్భుతంగా, దివ్యంగా ఉన్నది ఆ సభ. ఆ గిరీశుని తపస్సుతో ఆ కొండ ప్రకాశిస్తోంది. స్వాధ్యాయ తత్పరులైన విప్రుల వేదఘోషతో అది ప్రతిధ్వని స్తోంది. మాధవా ! సాటిలేని ఆ కొండ తుమ్మెదల గీతాలతో అందగిస్తోంది. జనార్దనా ! భీకరరూపంలో ఉన్నా, ఆ సభ మహోత్సవం వలె ఉంది. దానిని చూసిన మునిగణానికి పరమానందం కలిగింది. మహాభాగులైన మునులు, ఊర్ధ్వరేతస్కులయిన సిద్ధులు, మరుత్తులు, వసువులు, సాధ్యులు, విశ్వేదేవులు, దేవేంద్రుడు, యక్షులు, నాగులు, పిశాచాలు, లోకపాలకులు, అగ్ని, సర్వవాయువులు, మహాభూతాలు అక్కడ వచ్చి చేరాయి. ఋతువులు మహాద్భుతాలైన సమస్తపుష్పాలు అక్కడ వెదజల్లాయి. ఓషధులు తాము ప్రకాశిస్తూ, వనాన్ని ప్రకాశింపజేశాయి. అక్కడ రమణీయశిఖరాలపై, జనులకు ఇంపు కూర్చుతూ, కిలాకిలా రావాలు చేస్తున్న పక్షులు ఆనందంతో నాట్యమాడుతూ, కూస్తున్నాయి.

అక్కడ దివ్యధాతువులతో అలంకరింపబడి శయ్యవలె ఉన్న ఆ గిరిశిఖరంపై కూర్చొని మహామనస్వి అయిన పరమేశ్వరుడు శోభించాడు. ఆయన పులితోలును వస్త్రంగా ధరించాడు. సింహచర్మాన్ని ఉత్తరీయంగా వేసి కొన్నాడు. పాము యజ్ఞోపవీతంగా ఉంది. ఎర్రటి అంగదాలను అలంకరించుకొని ఉన్నాడు. నల్లటి మీసాలు, జటలు ధరించి, భయంకరుడై రాక్షసులకు భయాన్ని కల్గిస్తున్నాడు. వృషభధ్వజుడైన ఆ శివుడు సర్వప్రాణులకు, భక్తులకు అభయాన్ని ఇస్తున్నాడు. ఆయనను చూసి, మహర్షులందరూ తలలు నేలకు వాల్చి, ఆయనకు ప్రణమిల్లారు. పరమ పవిత్ర వచనాలతో మనోహరంగా ఆయనను స్తుతించారు. వారందరూ పాపవిముక్తులు, సహనశీలురు, కల్మషం లేని వారు. పరమేశ్వరుని ఆ భీకరప్రదేశం ఎంతో శోభిస్తోంది. అది పెద్దపెద్ద పాములతో నిండి, చొరరానికి వీలు కాకుండా ఉంది. మధుసూదనా ! వృషభధ్వజుని ఆ భీకరసభాస్థలం క్షణకాలంలోనే అద్భుతంగా కనిపించింది. అప్పుడు భూతాల స్త్రీల సమూహం తన చుట్టూ నిలవగా

శైలసుత (పార్వతి) సర్వతీర్థ జలాలతో నిండిన సువర్ణకలశాన్ని పట్టుకొని, శివుని దగ్గరకు వచ్చింది. ఆమె శివునివలెనే వస్త్రాలు ధరించి ఉన్నది. ఆయనవలెనే వ్రతాలను అనుష్ఠిస్తోంది. ఆ కొండ నుండి స్రవించే సకలనదులు ఆమె వెంట వస్తున్నాయి. ఆమె పుష్పవృష్టిని కురిపిస్తూ, వివిధ పరిమళాలను వెదజల్లుతూ, హిమవంతుని పార్శ్వ భాగం నుండి శివుని దగ్గరకు వచ్చింది. ఆపై ఆమె అందంగానవ్వుతూ, వినోదం కోసం సరదా పడి తన రెండు చేతులతో వేగంగా శుభప్రదాలైన శివుని రెండుకళ్ళను మూసింది. కన్నులను మూయగానే ప్రపంచమంతా వెంటనే అంధకార బంధురమై నిశ్చేతన మయ్యింది. హోమాలులేవు. వషట్కారాలూ లేవు. జనమంతా బెదరిపోయింది. అందరి మనస్సులు కలతపడ్డాయి. శివుడు కళ్ళను మూయగానే సూర్యుడు నశించినట్లయింది. ఆపై క్షణకాలంలోనే లోకంలోని చీకటి తొలగిపోయింది. ఆ శివుని లలాటం నుండి ప్రజ్వలిస్తూ మహాజ్వాల వెలువడింది. ఆయన నుదుట సూర్యసమానమైన మూడవకన్ను ఏర్పడింది. అదిప్రళయకాలాగ్నివలె మండింది. దానితోనే హిమవద్గిరి దగ్ధమైంది. ఆపై విశాలనయనాలు గల ఆపార్వతి మండుతున్న అగ్నివంటి మూడవకన్ను గల మహేశ్వరుని గమనించి, తలవంచి, నమస్కరించి శివునివైపు ఆశ్చర్యంగా చూసింది. మరి చెట్లతో సరళవృక్షాలతో అందగిస్తూ, దివ్యౌషధాలతో ప్రకాశిస్తున్న ఆ వనం తగులబడుతూనే ఉంది. మృగ సమూహాలు భయపడి పారిపోతూ. దిక్కుతోచక శివుని సమీపానికి వచ్చిచేరాయి. వాటితో ఆ సభాస్థలి నిండిపోయింది. అప్పుడు అగ్నిజ్వాలలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆజ్వాలలు మెరుపులవలె చంచలంగా ఉన్నాయి. ద్వాదశాదిత్యుల వంటి ఆ అగ్ని భయంకరమై, మరొక ప్రళయకాలాగ్ని వలె కనిపిస్తోంది. క్షణకాలంలోనే ధాతువులతో, విశాల శిఖరాలతో, మండుతున్న లతలతో, ఓషధులతో సహా హిమవత్పర్వతం పూర్తిగా దగ్ధమైంది. అలా ఆ పర్వతం పూర్తిగా దగ్ధం కావటం చూసి, పార్వతి చేతులు జోడించి నిలిచి, మహేశ్వరుని శరణుకోరింది. అప్పుడు పార్వతి స్త్రీ స్వభావాన్ని బట్టి పిరికితనంతో నిలిచింది. తండ్రి యొక్క దీన స్థితిని ఆమె చూడలేకపోయింది. అది చూసి, శివుడు ప్రసన్న దృష్టితో హిమవద్గిరిని చూశాడు.

మరల క్షణకాలంలోనే హిమవంతుడు తన పూర్వ స్థితిని పొంది, అందంగా కనిపించాడు. పక్షులు ఆనందంతో కూతలుపెడుతున్నాయి. వనవృక్షాలు చక్కగా పుష్పించాయి. మరల స్వస్థితిని పొందిన హిమవద్గిరిని చూసి, పతివ్రత అయిన పార్వతి ప్రసన్నురాలై సర్వలోకపతి అయిన మహాదేవునితో ఇలా అన్నది. ఉమ ఇలా అన్నది "భగవంతుడా!

సర్వభూతపతీ ! శూలపాణీ ! మహావ్రతా ! నాకు పెద్ద సందేహం కలిగింది. దానిని వివరించాలి. నీ నుదుటి నుండి మూడవకన్ను ఎందుకు పుట్టింది ? పక్షి సమూహాలతో, వనాలతోపాటు పర్వతమెందుకు దగ్ధ మైంది ? స్వామీ ! మరల దానిని పూర్వస్థితికి ఎందుకు తెచ్చావు ? నా తండ్రిని మరల చెట్లతో ఎందుకు కప్పివేశావు ?

దేవా ! ఈ సంశయం నామనస్సులో తిరుగుతోంది. దేవదేవా ! నీకు నమస్కారం, ఈ విషయాన్ని నాకు చెప్పాలి." నారదుడిలా అన్నాడు. "పార్వతి అలా అనగానే శివుడు ప్రసన్నుడై ఇలా బదులిచ్చాడు. "దేవి ! ధర్మజా ! ప్రియభాషిణి ! నీ సంశయం తగినదే ప్రియా ! నీవు తప్ప మరొకరు నన్నిలా అడగలేరు. భామిని ! పైకి చెప్పదగినదయినా, రహస్యమైనా, నీ ముచ్చటకోసం అంతా చెప్తాను. ఈ సభలో దాని నంతా విను. ప్రియా ! సర్వలోకాలలోనూ నేను కూటస్థుడను. మూడు లోకాలూ విష్ణువునకు వలె నాకూ లోబడి ఉంటాయి. భామిని ! మరొక విషయం గ్రహించు. విష్ణువు జగత్ స్రష్ట నేను జగద్రక్షకుడను. కాబట్టి సుందరీ ! ఎప్పుడైతే శుభమైనా, అశుభమైనా నన్ను తాకుతాయో అప్పుడే సర్వజగత్తూ ఆ స్థితికి లోనవుతుంది.

దేవీ ! అనిందితా ! నీవు చిన్నతనంతో నా కళ్ళు మూశావు. దానితో తత్క్షణమే లోకమంతా వెలుగును కోల్పోయింది. పార్వతీ ! లోకంలో సూర్యుడు అదృశ్యం కాగానే, చీకటి వ్యాపించగానే ప్రజాసంరక్షణకై నేను మండుతున్న మూడవకంటిని సృష్టించాను. ఆకంటి నుండి మహాతేజస్సు వెలువడింది. దానితో ఈ పర్వతం దగ్ధమైంది. దేవి ! మరల నీ ఆనందం కోసం దానిని పూర్వస్థితికి తెచ్చాను నేను."

ఉమ ఇలా అన్నది. "స్వామీ ! నీ తూర్పు ముఖం చంద్రునివలె చూడముచ్చటగా ఉంది. ఉత్తరముఖం, పశ్చిమ ముఖం తొల్లింటివలె కాంతితో ఉన్నాయి. దక్షిణముఖం భయంకరంగా ఉంది. నీ కపిలజటలు పైకి లేచి ఉన్నాయి. నీ కంఠం నల్లగా నెమలి ఫించం వలె ఉంది. దీని కంతటికీ కారణమేమిటి ? దేవా ! నీ చేతిలో ఎప్పుడూ పినాక ముంటుంది. ఎందుకది ? నీవు నిత్యమూ జటాధారివై, బ్రహ్మచారివై ఉంటావెందుకు ? ప్రభూ ! వృషభధ్వజా ! ఈ సంశయాన్ని పూర్తిగా మీరు సమాధాన పరచాలి. నేను నీకు సహధర్మచారిణిని, భక్తురాలను." భీష్ముడు చెప్తున్నాడు "పార్వతి అలా అడగగానే పూజ్యుడు, సమర్థుడు అయిన ఆ పినాకధారి ఆమె ధైర్యానికీ, జ్ఞానానికీ ఎంతో ప్రసన్నుడయ్యాడు. ఆపై ఆ శివుడు 'సుందరీ ! రుచిరవదనా ! నా ఈ రూపాలను గురించి హేతుబద్ధంగా చెపుతాను. విను' అని ఆమెతో అన్నాడు."

141. ఉమామహేశ్వర సంవాదము - ప్రవృత్తి నివృత్తి ధర్మ నిరూపణము.

భగవానుడిలా అన్నాడు. 'పూర్వం బ్రహ్మదేవుడు రత్నాలలోని ప్రతికణంలోని సారాన్ని సంగ్రహించి తిలోత్తమ అనే అందమైన అప్సరసను సృష్టించాడు. మంగళ స్వరూపిణీ ! దేవి ! అందమైన ముఖవర్చస్సు. సాటిలేని రూపమూ కల ఆ తిలోత్తమ, ప్రదక్షిణం చెయ్యాలని నా వద్దకు వచ్చింది. దేవీ ! ఆమె, నాసమీపంలో ఎటువైపు ప్రదక్షిణం చేస్తుంటే అటు వైపు నాకొక అందమైన ముఖం ఏర్పడింది. ఆమెను చూడటానికి నేను ఉత్తమ యోగ విద్యను ప్రదర్శిస్తూ నాల్గు ముఖాలు నాల్గు రూపాలు పొందాను. పూజ్యురాలా! నేను తూరుపునున్న ముఖంతో ఇంద్రునిగా పరిపాలిస్తున్నాను. ఉత్తర ముఖంతో నీతో కూడి క్రీడిస్తున్నాను. పడమట నున్న నా ముఖం, ప్రసన్నంగాను, సర్వప్రాణి సుఖకరంగాను, ఉంటుంది. నా దక్షిణ ముఖం భయంకరమై తీక్ష్ణంగా ప్రజలను సంహరిస్తున్నది. లోకాల మేలు కోసం జటలతో బ్రహ్మచారిగా ఉన్నాను. దేవతల పనులు నెరవేర్చటానికి, పినాకధనుస్సు నా చేతిలో ఉన్నది. పూర్వం ఇంద్రుడు నాసిరిని కాజేయాలని నా పై వజ్రాన్ని ప్రయోగించాడు. అది కంఠాన్ని మాత్రం దహించి వెళ్ళిపోయింది. నాటి నుండి శ్రీకంఠుడి నయ్యాను.

పూర్వం మరొక యుగంలో బలవంతులైన దేవదానవులచే అమృతంకోసం చాలాకాలం మహాసముద్రం చిలుకబడింది. నాగరాజును తాడుగా చేసి, మహాసముద్రాన్ని మధిస్తుండగా సర్వలోక వినాశనం కల్గించే విషం అక్కడ పుట్టింది. దాన్ని చూసి దేవతలందరూ కలత చెందారు. దేవి! లోక క్షేమంకోసం. దాన్ని నేను స్వీకరించాను. శుభాంగీ ! ఆ కారణంగా నా కంఠానికి నెమలి పింఛం నలుపు వచ్చింది. అప్పటినుండి నేను నీలకంఠునిగా పిలువబడుతున్నాను. దేవి! దీనికి సంబంధించినదంతా చెప్పాను. ఇంకా ఏమి వినాలనుకొంటున్నావు' - అన్నాడు పరమేశ్వరుడు.

ఉమ అన్నది. 'నీలకంఠా! నీవు అన్నిలోకాలకు సుఖాన్నిస్తావు ! నీకు నమస్కారం. దేవదేవేశ ఎన్నో ఆయుధాలు ఉండగా నీవు పినాకాన్నే ఎందుకు ధరిస్తున్నావో చెప్పవలసింది.' శ్రీమహేశ్వరుడన్నాడు. 'శుచిస్మితా! నాకు ఆయుధం ఎలా వచ్చిందో చెపుతాను విను. మహాదేవీ ! ఒకానొక యుగంలో కణ్వుడనే మహాముని ఉన్నాడు. అతడొక దివ్యమైన తపస్సును ప్రారంభించాడు. ప్రియా! అతడు తీవ్రమయిన తపస్సు చేస్తుండగా, కొంత కాలానికి అతని శిరస్సు మీద ఒక పుట్ట ఏర్పడింది. దాన్ని కూడా మోస్తూనే అతడు తపస్సును కొనసాగించాడు. తపస్సుకు సంతసించిన బ్రహ్మదేవుడు వరం ఇవ్వడానికి వచ్చాడు. బ్రహ్మ అతడికి వరం ఇచ్చాక, అక్కడొక వెదురును చూసి, ఆలోచించాడు. భామినీ ! ఆ వెదురుతో లోకానికి మేలు కాగలదని భావించి, దానితో ధనుస్సు చెయ్యడానికి నియమించాడు. ఆ బ్రహ్మ విష్ణువు యొక్క, నా యొక్క సామర్థ్యాలను భావించి, ఇద్దరికీ చెరొక ధనుస్సును ఇచ్చాడు. నా ధనుస్సు పినాకం, విష్ణువు ధనుస్సు శార్ఙ్గం, మిగిలిన వెదురుతో గాండీవమనే ధనుస్సు నిర్మించబడింది.

దాన్ని సోమునిదిగా ప్రకటించి, బ్రహ్మ తనలోకానికి వెళ్ళాడు. పూజ్యురాలా! నావద్దకు ఆయుధం వచ్చిన విషయమంతా నీకు చెప్పాను.'

పార్వతి అన్నది - 'శ్రేష్ఠుడా, ఈ ప్రపంచంలో శ్రీమంతాలైన ఎన్నో వాహనాలుండగా, తమకు ఎద్దు ఏవిధంగా వాహనం అయిందో చెప్పవలసింది.' శ్రీమహేశ్వరుడన్నాడు. 'పాలను మేఘంలా వర్షించే కామధేనువును బ్రహ్మ దేవతల కోసం సృష్టించాడు. అమృతం లాంటి పాలనిచ్చే ఆ ధేనువు అనేక రూపాలను పొందింది. ఒకనాడు ఆ ఆవు దూడ ముఖం నుండి వెలువడే నురుగు నా శరీరం మీద పడింది. కనుక నాకోపంతో దహింపబడిన ఆవులు అనేక రంగుల్లోకి మారిపోయాయి. అప్పుడు అర్థనీతివేత్త లోకగురువు అయిన బ్రహ్మ నన్ను అనునయించాడు. ఆయన ఈ ఎద్దును జెండాగాను, వాహనం గాను నాకు ఇచ్చాడు.'

ఉమ అన్నది - 'భగవంతుడా! స్వర్గంలో ఎన్నో సద్గుణాలున్న నివాసాలు ఉండగా, వాటన్నిటినీ వదిలేసి. నీవు ఎందుకు శ్మశానంలో క్రీడిస్తున్నావు? శ్మశానం, జుట్టు ఎముకలతో భయంకరంగా ఉంటుంది. పుర్రెలు, కుండలతో నిండి ఉంటుంది. గ్రద్దలు నక్కలతో నిండి ఉంటుంది. వందల చితులు వెలుగుతుంటాయి.' అశుభ్రంగాను, మాంసం క్రొవ్వు, రక్తాలతో బురదగా ఉంటుంది. ప్రేగులు, ఎముకలు అంతటా పరుచుకొని ఉంటాయి. నక్కల కూతలతో మారుమ్రోగుతుంటుంది. మహేశ్వరుడిలా అన్నాడు - 'పవిత్రమయిన ప్రదేశం కోసం భూ మండల మంతటినీ రాత్రనక, పగలనక వెతుకు తుంటాను. ఈ ప్రపంచంలో శ్మశానం కంటె పవిత్రమయిన ప్రదేశం కన్పించదు. కనుక అన్నినివాస స్థానాలకంటే మర్రి చెట్టు కొమ్మలతో కప్పబడి, తునకలయిన పూలమాలలతో అలంకరింపబడిన శ్మశానంలో నా మనస్సు రమిస్తుంది. శుచిస్మితా! ఈ నా భూతగణాలన్నీ శ్మశానంలోనే క్రీడిస్తుంటాయి. దేవీ ! నేను భూతగణాలు లేని చోట నివాసానికి ఇష్టపడను. శుభాంగీ ! ఈ నివాసమే నాకు పవిత్రమయినది. స్వర్గంలాంటిది కదా! కనుకనే పవిత్రతను కోరే ఉపాసకులచే పుణ్యమూ ఉత్తమమూ అయిన శ్మశానం ఉపాసింపబడుతున్నది.

పూజ్యురాలా! ఈ శ్మశానం కంటే పవిత్రమయిన ప్రదేశం లేదు. మనుష్యుల తాకిడి తక్కువ కనుక ఇది అతి పవిత్రంగా చెప్పబడింది. ప్రియా! వీరస్థానం కనుక నాకు ఈ ప్రదేశం నివాసం అయింది. వందల పుర్రెలతో నిండి భయంకరమయిన ఈ ప్రదేశం నాకు అనుకూలమయినది. మధ్యాహ్నకాలంలో, సాయంప్రాతసంధ్యలలో, ఆర్ద్రానక్షత్రకాలంలో ఆయుష్కాములుగాని, అపవిత్రులుగాని ఈ ప్రదేశంలో తిరుగరాదని నిర్ణయింపబడింది. భూతాలవల్ల ఏర్పడే భయాన్ని నాకంటె ఇతరులు పోగొట్టు కొనజాలరు. అక్కడ ఉండి నేను ప్రతిరోజూ ప్రజల్ని పాలిస్తుంటాను. నా ఆనతి వల్ల

భూతసంఘాలు ఈ ప్రదేశంలో ఏ ప్రాణినీ చంపవు. లోకహితంకోసం ఆ భూతసంఘాలను శ్మశానంలో నేను రమింపచేస్తాను. నీకు ఈ విషయం అంతా చెప్పాను. దేవి! ఇంకా ఏమి వినాలను కొంటున్నావు!

ఉమ అన్నది - భగవంతుడా, దేవాది దేవ, త్రిలోచన, వృషభధ్వజ! నీరూపం రాగి రంగుతో వికృతంగాను భయంకరంగాను కానవస్తున్నది. బూదితో నిండి, మూడుకళ్ళతో వాడికోరలతో చిక్కని జటలతో రాగిగడ్డంతో, పులి చర్మంతో భయంకరంగా ఉంది. రౌద్రమూ ఘోరమూ భయానకమూ, శూల పట్టిస సహితమూ అయిన ఈ రూపాన్ని ఎందుకు స్వీకరించారో చెప్పవలసింది. ప్రియా! ఈ విషయంలోని తత్త్వాన్ని వివరిస్తాను, శ్రద్ధగా వినుమా. లౌకిక పదార్థాలు శీతాలు ఉష్ణాలు అని రెండు విధాలుగా ఉంటాయి. ఆ రెంటి కారణంగా సౌమ్యంగా, ఆగ్నేయంగా కల్పించబడింది. విష్ణువునందు సౌమ్యతత్త్వం, నాయందు ఆగ్నేయ తత్త్వం ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. ఈ నా శరీరంతో అన్నిలోకాలనూ నేను నిత్యం పరిపాలిస్తుంటాను. దేవీ ! రౌద్రాకారం, వికృతినేత్రం, శూల పట్టికాయుధాలుగల నా ఈ అగ్ని తత్త్వ ప్రధానమైన రూపం ఎల్లవేళలా లోకహితం చేస్తుంటుంది. సువదనా! నేనీరూపాన్ని విడిచిపెడితే సర్వలోకాలు వై పరీత్యాన్ని పొందుతాయి. అంతా తారుమారు అవుతుంది. అందువల్ల లోకహితం కోసం నేను ఈ రూపాన్ని ధరిస్తున్నాను. దేవీ ! నీవింకా ఏమి వినాలను కుంటున్నావు?

నారదుడు అన్నాడు - దేవేశుడు ఈవిధంగా చెప్పగానే పరమర్షులు ఆశ్చర్యంతో నమస్కరిస్తూ వాగ్రూపంలో ఈ విధంగా స్తుతించారు. ఋషులు అన్నారు - శంకర! సర్వేశ! నీకు నమస్కారం. సర్వజగద్గురుడా! నమస్కారం. దేవాది దేవా! నమస్కారం. చంద్రశేఖర! నమస్కారం. అత్యంత ఘోరా ! నమస్కారం. రుద్రా ! శంకరా ! నమస్కారం. అత్యంత ప్రశాంతుడా! నమస్కారం చంద్రపాలకా! నమస్కారం. ఉమామహేశునికి నమస్కారం. చతుర్ముఖునికి నమస్కారం. భూతపతికి నమస్కారం. గంగాధరునికి నమస్కారం. త్రిశూల హస్తునికి పన్నగా భరణునికి త్రిలోచనునికి ప్రణామం. దక్షయజ్ఞ విదాహకునకు వందనం. లోక రక్షణ తత్పరుడైన బహునేత్రునకు నమస్కారం. ఆహా దేవుని మహత్తు దయ ఎంత గొప్పది! ఇటువంటి ధర్మపరత్వం దేవదేవునికే చెల్లింది. నారదుడన్నాడు- ఋషులీవిధంగా స్తుతిస్తుండగా సమయజ్ఞ అయిన దేవి ఋషులప్రీతి కోసం హరునితో ఇలా అంది.

భగవంతుడా! సమస్తభూతేశ! అన్ని ధర్మాలు తెలసినవాడా! పినాకపాణీ, వరదా ! నాకొక గొప్ప సందేహం మిగిలింది. ఈ ముని సమూహమంతా తపస్సు చేసింది. తపోవేషంతో లోకమంతా వివిధ రూపాలతో తిరుగాడుతోంది. శత్రుసూదన! ఈ ముని సమూహానికి, నాకూ ఆనందం కల్గించటానికి ఈ నా సందేహాన్ని తీర్చవలసిందిగా ప్రార్థిస్తున్నాను. ప్రభూ ! ధర్మానికి లక్షణమేమిటి ? ధర్మసూక్ష్మం తెలియని, నరులు దీన్ని ఎలా ఆచరించగల్గుతారు? చెప్పవలసింది. నారదుడన్నాడు - అప్పుడు మునిగణాలు ఉమాదేవిని పూజించారు. ఋక్కులతో విపుల భావాలతో నిండిన స్తుతులు చేశారు. మహేశ్వరుడన్నాడు - అహింస, సత్యం పలకటం, భూతదయ శమం, శక్తిమేరకు దానాలు చెయ్యటం, ఉత్తమ గృహస్థధర్మం. పరులభార్యలతో సంబంధం పెట్టుకోక పోవటం,

తనవద్ద ఉంచబడిన స్త్రీలను రక్షించటం, ఇవ్వనిదాన్ని తీసుకోకపోవటం, మద్యమాంసాల్ని విడిచిపెట్టడం అయిదు విధాలయిన ధర్మం అనేక శాఖలతో కూడినది. సుఖానికి మార్గం, ధర్మనిష్ఠులయిన ప్రాణులు ఈ ధర్మాన్ని ఆచరించాలి. ఉమ అన్నది - దేవా !నాలుగువర్ణాలవారు ఏ ఏ ధర్మాలను ఆచరిస్తే వారివారి వర్ణాల్లో ఉత్తములవుతారో దాన్ని సెలవీయవలసింది. బ్రాహ్మణధర్మం ఎలాంటిది ? క్షత్రియధర్మమెలా ఉంటుంది? వైశ్యుని ధర్మలక్షణం ఏది? శూద్రుడు ఏ ధర్మం ఆచరించాలి?

మహేశ్వరుడిలా అన్నాడు - దేవి! నీకిష్టమయిన వర్ణాశ్రమ ధర్మమంతా చెబుతాను, శ్రద్ధగా విను. పూర్వం లోకాన్ని సృజించాలనే సంకల్పం కలిగిన బ్రహ్మదేవుడు బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు అనే వర్ణాలను నిర్మించాడు. వారివారికి తగిన పనులు శాస్త్రాలలో విధింపబడ్డాయి. ప్రపంచమంతా ఒకవేళ ఒకే వర్ణంలో ఉంటే ఆది నశిస్తుంది. కనుకనే సృష్టికార్యంతో పాటు నాలుగు వర్ణాలు ఏర్పరుపబడ్డాయి. బ్రహ్మముఖాన్నుండి బ్రాహ్మణులు సృజించబడ్డారు. కనుక వారు వాగ్విశారదులయ్యారు. బాహువుల నుండి క్షత్రియులు సృష్టింపబడ్డారు. కనుకనేవారు బాహుగర్వితులయ్యారు. వైశ్యులు ఉదరం నుండి పుట్టడం వల్ల వారు వార్తోపజీవులయ్యారు. శూద్రులు పాదాలనుండి వెలువడ్డారు కనుక సేవకులయ్యారు. దేవీ ! వారి ధర్మాలను కర్మలను చెప్తాను. శ్రద్ధగా విను. లోకాలకు స్థితిని కల్పించడానికి సృజించబడిన విప్రులు భూమి దేవులుగా చెప్పబడ్డారు. హితాన్ని కోరుకొనేవారు ఆ బ్రాహ్మణుల్ని అవమానించరాదు. దానయోగాలకు మూలమైన బ్రాహ్మణులు లేకుంటే దేవి, ఇహ పరాలు రెండూ చెడిపోతాయి. దేవీ ! ఏ నరాధముడు, బ్రాహ్మణులను అవమానిస్తాడో, తిడతాడో, కోపం కలుగచేస్తాడో కొడతాడో, వారి ధనాన్ని దొంగిలిస్తాడో, కామలోభాల మోహంలోపడి ఎవడు నీచమైన పనులు చేయిస్తాడో, అటువంటివాడు నన్ను అవమానించినట్లే, తిట్టినట్లే కోపింపచేసినట్లే, కొట్టినట్లే, నాధనాన్ని దొంగిలించినట్లే, ఆ మూర్ఖుడు నాచేత సేవలు చేయించుకొని నిందించినవాడుగా లెక్కించబడతాడు. వేదాధ్యయనం, యజ్ఞాలు చెయ్యటం, దానాలు చెయ్యటం బ్రాహ్మణధర్మాలు, అధ్యాపనం, యజ్ఞాలు చేయించటం, దానాన్ని స్వీకరించటం ఇవి బ్రాహ్మణునికి నిర్దేశింపబడిన కర్మలు. సత్యం, శాంతి, తపస్సు, శౌచం, ఇది బ్రాహ్మణునికి సనాతనధర్మాలు. ధాన్యాలను, రసవస్తువులను విక్రయించటం బ్రాహ్మణునికి పనికిరాదు. తపస్సే బ్రాహ్మణునికి ఎల్లవేళలా ధర్మమవుతున్నది. ఇందులో సందేహం లేదు బ్రాహ్మణులు కేవలం ధర్మాన్ని నిలబెట్టడానికి బ్రహ్మదేవుని చేత తపోబలంతో నిర్మింపబడ్డారు.

మహాభాగా! నీవడిగిన విషయాలన్నీ చెప్పాను. మహానుభావులయిన ద్విజాతులు అన్నివేళలా భూమిలోనున్న దేవతలుగా లోకంలో కీర్తింపబడుతున్నారు. ఉపవాసం ఎల్లవేళలా బ్రాహ్మణధర్మం, అనటంలో సంశయం లేదు. అటువంటి బ్రాహ్మణుడు ధర్మార్థాలు పొంది, బ్రహ్మ సమానుడవుతాడు. దేవి! బ్రాహ్మణునికి వేదాధ్యయనం సహజమైన ధర్మకార్యం, ఉపనయన వ్రతం వల్ల బ్రాహ్మణుడు రెండవ జన్మను పొంది ద్విజుడనబడతాడు.

ధర్మనిష్ఠులైన మానవులు గురువులను, దేవతలను పూజించటానికి వేదాధ్యయనరూపమైన ధర్మాన్ని తప్పక ఆచరించాలి. ఉమ అన్నది - భగవంతుడా! నాల్గువర్ణాలకు సంబంధించిన అన్ని ధర్మాలను విశదపర్చి, నా సందేహాన్ని తీర్చవలసింది. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. రహస్యాలను తెలుసుకోవటం, వేదాధ్యయనాన్ని వ్రతంగా చెయ్యటం, అగ్నికార్యాన్ని చెయ్యటం, గురువు చెప్పిన పనుల్ని సాధించటం, ఇవి బ్రాహ్మణధర్మాలు. భిక్షాటనం ద్వారా జీవించటం గొప్ప ధర్మం, నిత్యం యజ్ఞోపవీతాన్ని ధరించి గాయత్రీమాత నుపాసించాలి. నిత్యం వేదాధ్యయనం బ్రహ్మచర్యాశ్రమ పాలనం చెయ్యాలి. ఇవి బ్రాహ్మణధర్మాలు. గురువు అనుమతి పొందాక మాత్రమే బ్రాహ్మణుడు గురుకులాన్ని విడిచిపెట్టాలి. తర్వాతనే తగిన భార్యను విధివిధానం ద్వారా పొందాలి. శూద్రాన్నం భుజించరాదు, మంచి మార్గాన్ని అవలంబించాలి. నిత్యోపవాసం (భగవత్ స్మరణ) బ్రహ్మచర్యం, ఇవి బ్రాహ్మణధర్మాలు. అగ్నికార్యం, వేదాధ్యయనం, యజ్ఞానుష్ఠానం, చేస్తూ, ఇంద్రియాల్ని జయించి, విఘసాశియై, పరిమితంగా భుజిస్తూ పవిత్రుడై, సత్యవాక్కుగా బ్రాహ్మణ గృహస్థుడుండాలి. అతిధిపూజనం ధర్మం, మూడు అగ్నులను అర్చించటం ధర్మం. పశుబంధాది ఇష్టులను శాస్త్రవిహితంగా బ్రాహ్మణుడు ఆచరించాలి. యజ్ఞంగొప్ప ధర్మం. ప్రాణులపట్ల అహింసా భావంతో ఉండాలి. ముందుగా తానే భుజించరాదు. విఘసాశిత్వం మరొకధర్మం. పరిజనులందరూ తిన్నాక, తర్వాత భోజనం చెయ్యటం ధర్మం. గృహస్థుడయిన బ్రాహ్మణునకు ముఖ్యంగా శ్రోత్రియునకు ఇది పరమ ధర్మం. గృహస్థులైన దంపతులు సమానమైన స్వభావం కల్గి ఉండాలి. గృహానికి సంబంధించిన దేవతలకు ఇతర దేవతలకు నిత్యము పుష్పాలు బలులు ఇవ్వటం, ఇంటిని అలికి ఉంచుకోవటం నిత్యమూ ఉపవసించటం గృహస్థ ధర్మం. ఇంటిలో నేతి ధూపాలు, (హోమకార్యాలు) జరుగుతుండాలి. ఇది గృహస్థుగానున్న ద్విజుని ధర్మం. ఇది లోకాన్ని నిలిపి ఉంచుతుంది. మంచి ద్విజులు ధర్మాల్ని ఎల్లవేళలా పాటిస్తారు. దేవీ ! నేను క్షత్రధర్మంగా చెప్పినదాన్ని వివరిస్తాను, నీవు శ్రద్ధగావిను. క్షత్రియునకు మొదటి ధర్మం ప్రజల్ని చక్కగా పాలించటం, దాన్ని చక్కగా నిర్వహించినవాడు చెప్పబడిన ఫలాల్ని పొందుతాడు. ధర్మవంతుడుగా కీర్తింపబడతాడు.

దేవీ ! ద్విజులను రక్షించటానికి క్షత్రియులున్నారు. క్షత్రియుడు లేకపోతే లోకమర్యాద తారుమారు అవుతుంది. క్షత్రియుడు రక్షించటంవల్లే జగత్తు శాశ్వతంగా నిలుస్తోంది. ప్రజలకు మేలు చెయ్యటం క్షత్రియధర్మం, రాజామంచి గుణాలున్నవాడైతే లోకవ్యవహారాలు సక్రమంగా ఉంటాయి.

ఏ రాజు ధర్మబద్ధంగా ప్రజల్ని రక్షిస్తాడో అతడు ప్రజాపాలన ధర్మంవల్ల

గొప్ప లోకాలు పొందుతాడు. అటువంటి రాజుకు దమం, వేదాధ్యయనం, అగ్నిహోత్రకార్యం, దానం, అధ్యయనం ధర్మాలు. యజ్ఞోపవీతం, (సంధ్యావందనం) ధరించాలి. ధర్మకార్యాలు చెయ్యాలి. సేవకుల్ని పోషించాలి. ఇవి చేస్తే అమోఘమైన ఫలితాలు వస్తాయి. తగిన విధంగా శిక్షించటం, వేదం చెప్పిన క్రతువుల్ని ఆచరించటం న్యాయాన్యాయాల్ని పరిష్కరించటం, సత్యవాక్యపాలన రాజధర్మాలు. పీడితులను రక్షించేరాజు, ఇహ పరాల్లో గొప్పవాడవుతాడు. గోబ్రాహ్మణ రక్షకుడు, యుద్ధరంగంలో మరణించినవాడూ అంతే. వీరందరూ అశ్వమేధయాగం చేసినవారు పొందే గొప్ప ఫలాన్ని స్వర్గంలో అనుభవిస్తారు.

దేవీ ! వైశ్యులు లోకాలు చల్లగా సాగటానికి సాధనాలు. ఇతరులు వారి మీద ఆధారపడి జీవిస్తారు. వారు ప్రత్యక్ష ఫలాల్ని అందిస్తారు. వైశ్యులు లేకపోతే మిగిలిన వర్ణాలవారు తమస్థితులను కోల్పోతారు.

పశుపాలన, వ్యవసాయం, వైశ్యునికి నియత ధర్మాలు, అగ్నికార్యం, దానం, అధ్యయనం, కూడా వైశ్యధర్మాలే. వ్యాపారం, సన్మార్గంలో నడవడం, అతిథుల్ని సేవించటం, శమం, దమం, విప్రుల్ని ఆదరించడం, దానం చెయ్యటం, ఇవి సనాతనమైన ధర్మాలు. సన్మార్గంలో వ్యాపారధర్మాన్ని నిర్వహిస్తున్న వైశ్యుడు నువ్వులను, గంధాలను, రసాలను విక్రయించరాదు. వైద్యుడు, బ్రాహ్మణక్షత్రియ వైశ్యులకు అర్హతమేరకు శక్తిననుసరించి ఆతిథ్యం ఇవ్వాలి. ద్విజాతులను సేవించటం శూద్రునికి పరమధర్మం. సత్యాన్నే పలకటం, ఇంద్రియాలను జయించటం, వచ్చిన అతిథుల్ని సేవించటం, వీని ద్వారా శూద్రుడు గొప్ప తపస్సును చేస్తున్నవా డవుతాడు. మంచి ఆచారవ్యవహారాలు, దేవతల్ని ద్విజుల్ని పూజించటం, వీని ద్వారా బుద్ధిమంతుడైన శూద్రుడు కోరుకొన్న ధర్మఫలాలను పొందుతాడు.

శూద్రులు అన్ని ధర్మాలను సాధించుకొంటారు. శూద్రులు లేకపోతే పనులు చేసేవారుండరు. మొదటి మూడు వర్ణాలవారు శూద్రుల కారణంగా తమతమ పనుల్ని నెరవేరుస్తారు. బ్రాహ్మణాది మూడు వర్ణాల్ని సేవించటం దాసధర్మంగా చెప్పబడింది. వాణిజ్యం, వడ్రంగం, శిల్పం, నాట్యం, ఇవి శూద్ర ధర్మాలు, అహింస, శుభాచారం, దైవద్విజ పూజ మొదలుగాగల ధర్మాల్ని శూద్రుడు పాటించాలి. స్వధర్మపరుడైన శూద్రుడు కోరిన ధర్మఫలాన్ని పొందుతాడు. ఇవి, మరికొన్ని శూద్రధర్మాలు చెప్పబడ్డాయి.

ఉమా! నాల్గువర్ణాలకు సంబంధించిన ధర్మాలన్నీ చెప్పాను. సుభగా! ఒక్కొక్క వర్ణం వారు ఏమేమి చెయ్యాలో చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు ?

ఉమ అన్నది - భగవంతుడా! దేవాదిదేవ! వృషభధ్వజ! నీకు నమస్కారం. ! ఆశ్రమధర్మాల్ని వినాలని భావిస్తున్నాను. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవి! ఆశ్రమధర్మాల్ని శ్రద్ధగా విను. బ్రహ్మవాదులు ఆశ్రమధర్మాల్ని ఈవిధంగా ప్రకటించారు. ఆశ్రమ స్వీకర్తలలో గార్హస్థ్యధర్మాన్ని ఆశ్రయించిన గృహస్థు

శ్రేష్ఠుడు. పంచమహాయజ్ఞాల్ని ఆచరించటం, లోపల బయట పవిత్రంగా ఉండటం, భార్యను సంతోషపెట్టడం, అలసత్వాన్ని వదలి పెట్టడం, ఋతుకాలంలో భార్యను సేవించటం, దానం, యజ్ఞం తపస్సు, దేశాలు తిరగకుండా ఉండటం, అగ్నికార్యం చెయ్యటం, వేదాధ్యయనం ఇవి గృహస్థ ధర్మాలు. ఆ విధంగానే వానప్రస్థులధర్మాలు కూడా అతిప్రాచీనాలుగా చెప్పబడ్డాయి. ఇంటిలో ఉండరాదు. మనస్సును నిశ్చలంగా ఉంచుకోవాలి. శుభప్రదాలైన ఆటవికాహారాలతోటే జీవనాన్ని గడపాలి ఇవి వానప్రస్థ ధర్మాలు. నేలమీద నిద్రించటం, జటలను గడ్డాల్ని మీసాల్ని నిలుపుకోవటం, దేవతల్ని అతిథుల్ని పూజించటం, ఎన్ని కష్టాలకు ఓర్చి అయినా సరే పూజించటం, అగ్నికార్యం చేయటం ముప్పూటలు స్నానం చేయటం - ఇవి వానప్రస్థుని నిత్యకార్యక్రమాలు బ్రహ్మచర్యం, సహనం, పవిత్రత ఇవి వానప్రస్థుని సనాతన ధర్మాలు. ఈ విధంగా జీవిస్తూ ప్రాణాలు కోల్పోయిన వానప్రస్థుడు దేవలోకంలో మహిమాన్వితుడై ప్రకాశిస్తాడు. యతిధర్మమీ విధంగా ఉంటుంది. యతి ఇంటిని విడిచి పెట్టి ఎక్కడో ఒక్కచోట పర్యటిస్తూ ఉండాలి. వస్తుసంగ్రహం చేయరాదు. అన్నివిధాలా సంకల్పాన్ని విడవాలి. పవిత్రంగాను, ఋజువుగాను ప్రవర్తించాలి. అన్నిచోట్ల భిక్షనే స్వీకరించాలి. ఎక్కడా మనస్సును లగ్నం చెయ్యరాదు. ఎల్లవేళలా ధ్యానపరుడుగా ఉండాలి. దోషాలకు దూరంగా ఉండాలి. సహనం, దయ, తత్త్వజిజ్ఞాస, సన్యాసి ధర్మాలుగా చెప్పబడ్డాయి. అలసి, దాహంతో, ఆకలితో వచ్చిన అతిథిని పూజించటం వల్ల గొప్ప ఫలితం లభిస్తుంది. ధర్మాన్ని కోరేవారు అతిథిగా వచ్చిన ఎవరినైనా యోగ్యునిగా భావించి దానం చెయ్యాలి. వచ్చిన అతిథి మనల్ని తరింపచేస్తాడని విశ్వసించాలి. భోజన సమయంలో ఆకలితో వచ్చిన వానిని వ్యాసభగవానునిగా సంభావించాలి. తన శక్తి మేరకు ప్రశాంత చిత్తంతో అతడిని పూజించాలి. మనస్సే ధర్మార్జనకు మూలం. ధర్మకారణంగా కీర్తి వస్తుంది. కనుక ఏదానమైనా అన్నివిధాలా ప్రసన్నతతో చెయ్యాలి. ప్రశాంతమైన మనస్సుతో చేసే దానం అత్యుత్తమమైనదంటారు. భూమిమీద పడిన చిన్న చిన్న నీటిబిందువులు సుక్షేత్రాలను, చెరువులను, సరస్సులను, నదులను ఊహించని విధంగా నీటితో నింపి వేస్తున్నాయి, ఆలాగే ఎంత చిన్నదయినా దానం క్రమక్రమంగా వృద్ధిని పొందుతుంది. గృహజనులకు కొంత ఇబ్బంది ఏర్పడినా సరే, దానం చెయ్యటమే గొప్పది. భార్యాపుత్రులకిచ్చిన ధన ధాన్యాలు చనిపోయిన జీవుని అనుసరించి రావు. ధనం ఉన్నట్లయితే దానం, భోగం మంచివి. దానం చేసినవారు ప్రభువు లవుతారు. భూమండలంలో దానంతో సమానమయిన వస్తువులేదు దానంవంటి గొప్పనిధి కూడా లేదు. సత్యంకంటె గొప్ప ధర్మమూ లేదు. అసత్యాన్ని మించిన పాపమూ లేదు. వానప్రస్థంలో ఉండి, కందమూలఫలాలను తింటూ, జటలతోను నారబట్టలతోను జీవిస్తూ సూర్యుని కభిముఖంగా ఉండి చేసే తపస్సు, హేమంత ఋతువులో కప్పలా నీళ్ళలో ఉండి చేసే తపస్సు, వేసవిలో పంచాగ్ని మధ్యాన చేసే తపస్సు, ఎంతచక్కగా శ్రద్ధగా చేసినా, గృహస్థాశ్రమ ఫలంలో 16వ వంతు కూడా ఈయజాలవు.

ఉమ అన్నది. గృహస్థాశ్రమంలో ఏ ఏ పనులు చెయ్యాలి? వ్రతాలు, నియమాలు దేవతా పూజలు, నిత్యం చేయవలసిన విధులేవి? గృహస్థు ప్రత్యేకతిథులయందు అమావాస్య పౌర్ణములందు వేటిని విడిచిపెట్టాలి? ఆ విషయాలన్నీ మీరు చెబుతుంటే నాకు వినాలని ఉన్నది. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు - దేవి! గృహస్థాశ్రమానికి మూలం ఏమిటో, ఫలం ఏమిటో ఇది ఉత్తమ ధర్మం ఎలా

అయిందో, దీనిలో ధర్మం నాల్గు పాదాలతో ఎలా ప్రతిష్ఠింపబడిందో, నెయ్యి పాలలోని సారమైనట్లే, గృహస్థాశ్రమం, సకలాశ్రమసారం ఏ విధంగా అయిందో నీకు చెపుతాను. శ్రద్ధగా వినుము. గృహస్థాశ్రమంలో ఎవరు తల్లితండ్రులకు సేవలు చేస్తారో, ఏస్త్రీ భర్తను సేవిస్తుందో, ఏద్విజులు అగ్నిహోత్రాన్ని ఆరాధిస్తారో వారు వారివారి పనుల వల్ల ఇంద్రాది దేవతలకు మిక్కిలి ప్రీతిని కల్గిస్తారు. పితృలోకంలో నున్న పితృదేవతలు వారి స్వధర్మ నిరతి చూసి పరమానందపడతారు ఉమ అన్నది – ప్రభో! తల్లిదండ్రులు లేని గృహస్థులు ఏమి చేయాలి? భర్తృహీలయిన స్త్రీలు ఏ ధర్మం ఆచరించాలి? మీరు దీన్ని చెప్పండి. శ్రీ మహేశ్వరుడన్నాడు – దేవతలకు అతిథులకు సేవ చెయ్యటం, గురువుల్ని పెద్దల్ని పూజించటం, సమస్త ప్రాణులపట్ల అహింసాభావం, లోభాన్ని వదలటం, సత్యసంధత, బ్రహ్మచర్యం, శరణు వేడినవారిని కాపాడటం, పవిత్రత, ముందుగా పలకరించటం, చేసిన మేలును మరువక పోవటం, పిసినారి కాకుండటం, నిత్యం ధర్మాచరణ, రెండు పూటలా స్నానం, దేవతల్ని పితృదేవతల్ని పూజించటం, ప్రతిరోజు గోపూజ, అతిథి సేవనం, దీపారాధన, కోరినవారికి ఆశ్రయం యివ్వటం, పాద్యం, ఆసనం సమర్పించటం ఈ ధర్మాలన్నీ ఆచరింపదగినవి. పంచమి, షష్ఠి, ద్వాదశి, అష్టమి, చతుర్దశి, పూర్ణిమ, అమావాస్య – ఈ రోజుల్లో బ్రహ్మచర్యం పాటించాలి. ఈ తిథుల్లో గడ్డం గీయటం, తలంటుకోవటం, కాటుక ధరించటం, దంతధావనం కూడనిపనులు, ఇలా చేస్తేవారు లక్ష్మీవంతులవుతారు. వ్రతోపవాసాలు చెయ్యటం శక్తిమేరకు దానం, ఆశ్రిత పోషణ, దీనులమీద దయ చూపటం పరుల భార్యలపట్ల విముఖత, స్వభార్యయందనురక్తి, వీనిని ఆచరించాలి. పూర్వం బ్రహ్మదేవునిచే దంపతుల శరీరం ఒకటిగానే చెయ్యబడింది కనుక తనభార్యయందు మాత్రమే అనురక్తుడు బ్రహ్మచారిగా చెప్పబడుతున్నాడు. స్వభావంతో, నడవడితో వినయశాలికి, జితేంద్రియునికి, తిన్నగా ప్రవర్తించేవానికి, అన్నిప్రాణుల పట్ల హితభావన కలవానికి, అతిథి సేవకునకు, సహనశీలికి, ధర్మంగా ధనార్జన చేసినవానికి, గృహస్థునకు, ఇతర ఆశ్రమాలతో అవసరమే లేదు. ఏ విధంగా సమస్త జీవులూ, తల్లిమీద ఆధారపడి జీవిస్తున్నాయో, అన్ని ఆశ్రమాలు గృహస్థాశ్రమం ఆధారంగా జీవిస్తున్నాయి. రాజులు, సమస్త సన్యాసులు, నటులు, పాములవాళ్ళు, దాంభికులు, దొంగలు, రాజభటులు, పండితులు, సర్వశీలవేత్తలు, సంశయ శీలురు, దూరప్రయాణాలు చేసేవారు, మార్గంలో తినుబండారాలు దొరకనివారు, మరికొందరు కూడా గృహస్థాశ్రమంలో ఉన్న వారినుండి సహాయాన్ని ఆశిస్తారు. దేవి! పిల్లులు, ఎలుకలు, కుక్కలు, పందులు, చిలుకలు, పావురాలు, కాకాదులు, పాములవాళ్ళు, అరణ్యాల్లో నివసించేవారు. మృగపక్షి సమూహాలు ఈ విధంగా స్థావరజంగమాల్లో అనేక విధాలైనవి, ఇళ్ళల్లో పొలాల్లో కలుగుల్లో, వందలకొలదీ వేలకొలదీ జీవులు గృహస్థు చేసేపనుల మూలంగా తమ జీవనాన్ని పొందుతున్నాయి నై చెప్పిన జీవుల్లో దేనికి ఉపయోగపడేదైనా సరే, దాన్ని సమకూర్చడానికి బుద్ధిమంతుడు విచారించడు. అదంతా ధర్మకార్యంగానే భావిస్తాడు. దానికి ఫలితం ఏమిటో చెప్తాను వినుము. అన్నయజ్ఞాలు చేశాక అశ్వమేధయాగం చేసినవాడు పొందే ఫలాన్ని, 12 వత్సరాలు ఇలా గృహస్థధర్మం పాటిస్తే పొందుతాడు.

ఉమ అన్నది – ప్రభూ! నాలుగు వర్ణాలవారికి విడివిడిగా ఏ ధర్మాలు చేయవలసినవో చెప్పారు. అన్నివర్ణాల వారికీ పనికివచ్చే ధర్మాలు మీరు చెప్పండి.

శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు - గుణపక్షపాతమైన బ్రహ్మదేవుడు లోకసారమంతటినీ సంగ్రహించి సర్వలోకాల్ని తరింపచేయటానికి మానవుల్లో భూదేవతలైన బ్రాహ్మణుల్ని సృజించాడు. కనుక బ్రాహ్మణధర్మాన్ని కర్మలను ఫలాలను చెప్తాను. బ్రాహ్మణులు ఆచరించే ధర్మం గొప్పధర్మం. బ్రహ్మదేవుడు భూమిమీద సృష్టిచేసే సమయంలోనే లోక రక్షణకోసం మూడు ధర్మాల్ని సృజించాడు. వాటిని కూడా విను. వేదోక్త ధర్మం అత్యుత్తమం. ధర్మశాస్త్రప్రతిపాదితం రెండవది. శిష్టాచారం రూపంగా ఉన్నది మూడవ ధర్మం. ఈ మూడు ధర్మాలు అత్యంత ప్రాచీనాలు. ఎవడు మూడు వేదాల్ని అధ్యయనం చేస్తాడో, విద్వాంసుడో, అధ్యయన అధ్యాపనాల ద్వారా జీవించడో, దాన, ధర్మ యజ్ఞాలనే మూడు కర్మలను చేస్తాడో, కామక్రోధలోభాల్ని విడిచిపెట్టి దయగలిగి ఉంటాడో వాడు నిజమైన బ్రాహ్మణుడు. బ్రహ్మ, బ్రాహ్మణుల జీవనంకోసం ఆరు ధర్మాల్ని ఉపదేశించాడు. ఇవి సనాతనాలు. వీటిని విను. యజ్ఞం చెయ్యటం, చేయించటం, దానం చేయటం, తీసుకోవటం, అధ్యయనం, అధ్యాపనం - ఈ ఆరు బ్రాహ్మణధర్మాలు. నిత్యం వేదాధ్యయనం ధర్మం. యజ్ఞం చేయటం సనాతన ధర్మం, దానం ప్రశంసింపదగింది. దాన్ని శక్తిమేరకు శాస్త్రప్రకారం చెయ్యాలి. సమస్త విషయాలనుండి మనస్సును మరలించటం శమం. ఇది పరమధర్మం. సత్పురుషులు దీన్ని నిత్యం ఆచరిస్తారు. దీనివల్ల విశుద్ధ గృహస్థులు ఎంతో ధర్మశీలురవుతారు. గృహస్థ పంచయజ్ఞాలు చేస్తూ ఆత్మశుద్ధిని పొందాలి. సత్యనిష్ఠ, అసూయ లేకపోవటం, దానం, బ్రాహ్మణులకు సత్కారం, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవటం, అహంకారాన్ని వదలటం, వక్రతను విడనాడటం, స్నేహంగా మాట్లాడటం, అతిథి అభ్యాగతుల పట్ల ప్రేమ, అతిథులు తినగా మిగిలిన అన్నాన్ని తినటం, అతిథులకు పాద్యం, అర్ఘ్యం, ఆసనం, పడక తగిన రీతిలో సమర్పించటం, దీపారాధన, ఆశ్రయదానం, ఇవన్నీ చేసినవాడు ధార్మికుడు. ఉదయాన్నే లేచి, ఆచమనం చేసి, బ్రాహ్మణుని భోజనానికి ఆహ్వానించి, సత్కరించి భోజనానంతరం కొన్ని అడుగులు అనుసరించి వీడ్కోలు పలకటం అన్నది సనాతన ధర్మం. శూద్ర గృహస్థునకు బ్రాహ్మణక్షత్రియ వైశ్యులకు నిరంతరం శక్తిననుసరించి సేవ చేయటం, ఆతిథ్యం ఇవ్వటం ధర్మంగా చెప్పబడింది. ప్రవృత్తి లక్షణమైన ధర్మం గృహస్థులకు విధించబడింది. సమస్తప్రాణిహితమూ, శుభమూ అయిన దాన్ని నీకు తెలియచేస్తాను. తరచు శక్తిమేరకు దానం చెయ్యాలి, తరచుగా యజ్ఞాలు చెయ్యాలి. సంపదను కోరేవాడు పుష్టిని కల్గించే పనులను చేస్తూనే ఉండాలి. ధనాన్ని ధర్మమార్గంలో సంపాదించాలి. దాన్ని మూడు భాగాలు చెయ్యాలి. మానవుడు ప్రయత్న పూర్వకంగా

ధర్మం కోసమే జీవించాలి. సంపదను కోరే గృహస్థు ధనంలో ఒక భాగంలో ధర్మార్థాల్ని సాధించాలి. మరొక భాగాన్ని సుఖభోగాలకు ఖర్చు చేయాలి. మూడవ భాగాన్ని అభివృద్ధి చేయాలి. దేవి! నివృత్తి రూపమైన ధర్మం మరొకటి ఉంది. అది మోక్షం కోసం ఉద్దేశింపబడింది. దాని స్వరూపాన్ని ఉన్నదున్నట్లు వివరిస్తాను విను. మోక్షార్థులు సర్వప్రాణుల పట్ల దయగలిగి ఉండాలి. ఒకేచోట స్థిరంగా నివసించరాదు. ఆశల బంధాల్ని వదిలించుకోవాలి. ఇవి ప్రశంసింపదగిన ధర్మాలు. మోక్షార్థికి, కుటీరం మీదగాని, నీటిమీద గాని, వస్త్రమందుగాని, ఆసనమందుకాని, త్రిదండమందుగాని, పడకయందు గాని, అగ్ని యందుకాని, నివాసస్థానమందు కాని సంగం (ఆసక్తి) ఉండరాదు. మోక్షార్థి మనస్సును ఆత్మయందే నిలపాలి. అదే సర్వస్వం కావాలి. ఆత్మగురించే ఆలోచించాలి. యోగాభ్యాసం చెయ్యాలి. తత్త్వ విచారం చేస్తూనే ఉండాలి. అతడు చెట్టునీడనే నివసించాలి. ఉండవలసి వస్తే ఖాళీగా ఉన్న ఇంటిలోనే నివసించాలి. నదుల్లో ఇసుక తిన్నెలమీద గడపాలి. నదీ తీరాలపట్ల ఆసక్తి ఉండాలి. సన్యాసి అయిన ద్విజుడు సమస్త సంగాలను వదలాలి. స్నేహబంధాలను వదలాలి. తన భావాలన్నీ ఆత్మయందే లగ్నం చేయాలి. ఏ సన్యాసి మోక్షానికి అనుకూలమైన శ్రవణ మనన నిదిధ్యాసనాది రూపమైన కర్మలనే ఆచరిస్తాడో, ఆహారాన్ని కూడా విడిచి, స్తంభంలా నిశ్చలుడౌతాడో అతడు మోక్షాన్ని, సనాతన ధర్మాన్ని పొందుతాడు. సన్యాసి ఒక ప్రదేశంపై, గ్రామంపై ఆసక్తుడు కాక, ఒకే ఇసుక దిబ్బమీద నిద్రించక, అన్ని సంగాలనూ విడిచిపెట్టి, సంచరిస్తూ, ముక్తిని పొందుతాడు. ఇది మోక్షార్థుల ధర్మం, వేదప్రోక్తం, సజ్జనులు ఆచరించినది, ఈ మార్గాన్ని అనుసరించినవారు తప్పక బ్రహ్మపదవిని పొందుతారు. సన్యాసులు నాల్గువిధాలుగా ఉంటారు. కుటీచకులు, బహూదకులు, హంసలు, పరమహంసలు అనివారి పేర్లు, వారిలో ఉత్తరోత్తరులు శ్రేష్ఠులు. ఈ పరమహంస ధర్మంలో ఆత్మజ్ఞానం పొందినవానికి, అంతకంటె గొప్పది కాని, తక్కువది గాని ఉండదు. ఈ స్థితిలో పరమాత్మ అదృశ్యుడు కాడు. ఇది సుఖదుఃఖాతీతమూ, అజరామరమూ, అవ్యయమూ అయిన గొప్ప స్థితి.

ఉమ అన్నది – ప్రభూ ! సజ్జనులు ఆచరించే గృహస్థ ధర్మాన్ని మోక్షధర్మాన్ని చెప్పావు. దానివల్ల జీవలోకానికి గొప్ప శ్రేయస్సు కల్గుతుంది. ధర్మజ్ఞా! దీనితర్వాత ఋషి ధర్మాన్ని గూర్చి వినాలనుకొంటున్నాను. తపోవనాల్లో నిత్యం నివసించే వారి విషయం తెలుసుకోవాలని నేను కోరుకొంటున్నాను. మహేశ్వర! నేతిహోమాల పొగరాని సువాసన తపోవనాలను ముట్టడిస్తున్నట్లు అన్పిస్తుంది. దాన్ని చూస్తే నాకెప్పుడూ మనస్సుకు ఆనందం

కల్గుతుంటుంది. విభూ! సర్వధర్మాలు తత్త్వాలు తెలిసినవాడా! దేవదేవా ! ముని ధర్మం విషయంలో నాకున్న సందేహాన్ని తీర్చవలసింది. మహాదేవ నాసంశయాన్ని ఉన్నదున్నట్లు చెప్పాను. శ్రీ భగవానుడిలా అన్నాడు - ఆహా! నీకు నేను అత్యుత్తమమైన ముని ధర్మాన్ని గూర్చి చెప్తాను. శుభురాలా! తపోరూపమైన ఈ ధర్మాన్ని ఆచరించటం వల్ల మునులు సిద్ధిని పొందుతారు. మహాభాగా ! ధర్మజ్ఞా! సత్పురుషులు, పాల నురగమాత్రం స్వీకరించే మునుల యొక్క ధర్మాన్ని మొదటినుండి విశదీకరిస్తాను. విను. పూర్వం బ్రహ్మ యజ్ఞం చేసే సమయంలో స్వర్గంలో ఉన్న అమృతాన్ని త్రాగాడు. దాన్ని బ్రాహ్మం అంటారు. దానికి సంబంధించిన నురుగును సేవిస్తూ జీవించేవారు మునులు. (పాలనురుగును కొందరు, గంజిని కొందరు ఫేనమని చెప్తారు దాన్ని స్వీకరించేవారు ఫేనపులు) తపోధనురాలా! ఇది విశుద్ధులయిన ఫేనపుల యొక్క మార్గం. వాలఖిల్య మహర్షులు సూచించిన ధర్మాచరణ మార్గాన్ని చెబుతాను విను. వాలఖిల్యమునులు తపస్సులచే సిద్ధిపొందినవారు. వారు ధర్మజ్ఞులు, సూర్యమండలంలో నివసిస్తారు. వారు పక్షులవలె కణాన్ని కణాన్ని ఏరుకుని దానిద్వారా జీవిస్తుంటారు. జంతువులు విడిచిన చర్మాల్నీ, నారచీరల్ని వస్త్రాలుగా ధరిస్తారు. వారు ద్వంద్వాలకు అతీతులు. సన్మార్గంలో సంచరించేవారు. వాలఖిల్యమునులు తపోధనులు. వీరు బొటనవ్రేలి కణుపు వరకు ఉండే పరిమాణం కలిగి ఉంటారు. వారి వారి ధర్మాలను ఆచరిస్తూ తపస్సు చేస్తారు. వీరి ధర్మఫలం చాలా గొప్పది. వారు దేవ కార్యసాధనకోసం దేవతలతో సమానులుగా వ్యవహరిస్తారు. సమస్త పాపాల్ని దహింపచేసుకొని, తమ వెలుగులతో దిక్కులన్నీ వెలిగిస్తారు. మరికొందరు విశుద్ధమనస్కులు, దయాసముద్రులు, ధర్మవరిష్ఠులు పవిత్రులుగా ఉండి, చక్రాల్లాగా సంచరిస్తూంటారు. మరికొందరు సోమలోకంలో తిరుగుతుంటారు. కొందరు పితృలోక సమీపంలో శాస్త్రోక్తంగా ఉంఛవృత్తితో జీవిస్తారు. కొందరు మునులు సంప్రక్షాలురు అంటే రేపటికి ఆహారాన్ని మిగుల్చుకోరు. కొందరు రోకలితో ధాన్యాన్ని దంచకుండా దంతాలతోనే నమిలి తినేవారు, వీరు దంతోలూఖలికులు. కొందరు తమ ఆహారధాన్యాన్ని రాళ్ళతో కొట్టి, పొట్టుతీసి తినేవారు. వారందరు భార్యలతో సహా జితేంద్రియులై ఉంఛవృత్తితో జీవిస్తారు. వారందరికీ అగ్నిహోత్రం, పితృదేవతారాధన, పంచయజ్ఞాలు చెయ్యటం ధర్మంగా చెప్పబడుతోంది. దేవీ ! దేవలోకంలో నివసించేవారు, చక్రాల్లా నిరంతరం తిరుగుతుండేవారు, చేసే ఋషి ధర్మాలను చెప్పుకొన్నాం. ఇతర ఋషుల ధర్మాలను కూడా చెప్తాను విను. సమస్తముని శ్రేష్ఠులకు జితేంద్రియులై ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నించటం సామాన్యధర్మం. కామక్రోధాల్ని జయించటం తరువాత ధర్మం -

అని భావిస్తాను. అగ్నిహోత్రం, ధర్మసత్రం చెయ్యటం, సోమయజ్ఞం చెయ్యటం, దానివిధివిధానాలు తెలుసుకోవటం, యజ్ఞంలో దక్షిణను ఇవ్వటం, ఈ అయిదు ఋషి ధర్మాలే.

భూమిమీద పడిన గింజలను పక్షుల్లా ఏరుకొని తినటం ఉంఛ వృత్తి, మునులు ఈ విధంగా జీవిస్తూ, దానితోనే యజ్ఞం, పితృదేవతార్చన అతిథి పూజ, మొదలయిన ధర్మాల్ని ఆచరించాలి. భోగాల్ని వదిలిపెట్టటం, గోరసాన్ని ఆహారంగా స్వీకరించటం, శమాన్ని సాధించటం, భూమి శయనం, గాలి, నీరు, నాచు ఆహారంగా స్వీకరించటం, ఫలాల్ని దుంపల్ని భుజించటం, ఇవి ఋషుల నియమాలు. వీటిద్వారా మీనులు ఎవరూ పొందలేని ఉత్తమ లోకాల్ని పొందుతారు. ఇంట్లో పొగపోయాక, రోకలి శబ్దం వినపడనప్పుడు, నిప్పులు ఆర్పబడినప్పుడు, అతిథులందరూ భోజనం చేశాక, వంటపాత్రల కదలికలు ఆగిపోయాక, భిక్షుకుల సంచారం సద్దుమణిగాక కూడా అతిథులు వస్తే బాగుండునని భావిస్తూ మిగిలిన పదార్థాన్ని భుజించే వాడు, సత్య ధర్మాలపట్ల ప్రేమ కలవాడు, శాంతుడు ఋషి ధర్మం కలవాడు. గర్వం అహంకారం లేనివాడు, ప్రసన్నుడు, ఆశ్చర్యం పొందనివాడు, మిత్ర శత్రువులను సమానంగా చూసేవాడు. దయకలవాడు, ధర్మాత్ముల్లో శ్రేష్ఠుడు.

142. ఉమామహేశ్వర సంవాదము - 2.

ఉమ అన్నది. అందమైన ప్రదేశాల్లో, నదులకు సంబంధించిన కొండవాగుల్లో, నదిగట్టున ఉన్న పొదరిళ్ళలో, పర్వతాల్లో అరణ్యాల్లో, పవిత్రప్రదేశాల్లో, ఫల మూలాలున్న తావుల్లో వ్రతనియమాల్ని ఆచరించే వానప్రస్థులు నివసిస్తుంటారు. శంకర, దేవేశ! అతికష్టం మీద తమ శరీరాల్ని పోషించుకొనే వాన ప్రస్థులయొక్క పుణ్యప్రదమైన ధర్మాల్ని వినాలని కోరుకొంటున్నాను. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవీ ! (గృహస్థులు) వానప్రస్థుల ధర్మాలను నేను వివరిస్తాను. శ్రద్ధగా ఏకాగ్రమైన మనస్సుతో విని, ధర్మాసక్తి కల్గియుండవలసింది. ఆయా నియమాల్ని పాటిస్తూ, సంసిద్ధులై వనవాసానికివచ్చిన సజ్జనులైన వానప్రస్థులు చేయవలసిన కార్యాల్ని చెప్తాను విను.

గృహస్థుముందుగా, పుత్రులను పొందటం ద్వారా పితృదేవతా ఋణాన్ని తీర్చుకొని, భార్య విషయంలో చేయవలసి విధులన్నీ పూర్తిచేసి ధర్మంకోసం గృహాన్ని విడిచిపెట్టాలి. ధైర్యంతో మనస్సు నిగ్రహించాలి. వనవాసానికి నిశ్చయించుకోవాలి. అప్పుడు ఒంటరిగా కాని భార్యతోగాని వనవాసానికి వెళ్ళాలి. పరమపవిత్రములు, నదులతో అరణ్యాలతో అందమైనవి, తీర్థాలతో దేవాలయాలతో ప్రకాశిస్తున్నవి. అజ్ఞానవినిర్ముక్తములు అయిన ప్రదేశాల్ని ఆశ్రయించాలి. అక్కడకు వెళ్ళి, పద్ధతులను

తెలుసుకొని, క్రమంగా దీక్షితులు కావాలి. దీక్షితులై ఏకాగ్రమైన మనస్సుతో పరిచర్యకుపక్రమించాలి. ఉదయాన్నే మేల్కొనటం, పవిత్రతను పాటించటం, దేవతలందరికీ నమస్కరించటం, శరీరాన్ని వేడరాసుకొని శుద్ధి చేసుకోవటం, దోషాల్ని ప్రమత్తతను విడిచిపెట్టడం, ఉదయసాయంత్రాల్లో స్నానం చెయ్యటం, శాస్త్రప్రకారం అగ్ని కార్యాన్ని నెరవేర్చటం, పవిత్రంగా ఉంటూ జటలను నారబట్టలను ధరించటం, ప్రతిరోజు సమిధలకోసం పువ్వుల కోసం వనంలో తిరగటం, నీవారధ్యానంతో నవ సస్యేష్టి మొదలగు కార్యాల్ని చెయ్యటం, కూరల్ని దుంపల్ని సంపాదించటం, ఇంటిని అన్నివేళలా పరిశుభ్రంగా ఉంచుకోవటం, యీ పనులన్నీ వానప్రస్థ ధర్మాలుగా చెప్పబడుతున్నాయి. అన్నివేళలా ఎదురేగి అతిథుల్ని ఆహ్వానించటం, వారియందు శ్రద్ధగలిగి ఉండటం, పాద్యాన్ని ఆసనాన్ని సమర్పించి పూజించటం, భోజనానికి పిలవటం, సమయానికి గ్రామ్యంకాని వనవాస భోజనాన్ని వండటం, పితృదేవతల్ని పూజించటం తర్వాత అతిథుల్ని భోజనాదులతో సత్కరించటం వానప్రస్థుని సనాతన ధర్మాలు. సద్వర్తనులై, ధర్మపీఠం అలంకరించిన వారిద్వారా ధర్మ అర్థ పురుషార్థ బోధకాలైన కథలను వినాలి. తమకు విడిగా నివాసాన్ని ఏర్పరచుకొని, భూమిమీద కాని రాతిమీద కాని పరుండాలి. (శయనించాలి). వ్రతాలు ఉపవాసాలు చెయ్యటం, సహనం, ఇంద్రియ నిగ్రహం రాత్రింబవళ్ళు యథాశక్తిగా పవిత్రతను పాటించటం, ధర్మాన్ని గూర్చి ఆలోచించటం చెయ్యాలి.

మూడు పూటలా స్నానం చెయ్యాలి. పితృదేవతల్ని పూజించాలి. అగ్నికార్యం చెయ్యాలి. ఇష్టహోమాన్ని చెయ్యాలి. వెదురు బియ్యాన్ని, పండ్లను, దుంపలను, ఉపయోగించాలి. శరీరావసరాలకోసం కాగు, ఆముదం నూనెలను సేవించాలి. యోగాన్ని అభ్యసించి, సిద్ధిని పొందాలి. (కామక్రోధాల్ని) విడిచి పెట్టాలి. వీరాసనంలో ఉండి, వీరస్థానాల్లో (చిక్కని అడవుల్లో) సంచరించాలి. మనస్సును ఏకాగ్రం చేసుకొని, యోగసాధనలు చెయ్యాలి. మంచి వానప్రస్థులు వేసవిలో పంచాగ్ని మధ్యాన తపమాచరించాలి. మండూక యోగాన్ని ఆచరించాలి. ఏ వస్తువునయినా న్యాయంగా స్వీకరించాలి. ఎప్పుడూ వీరాసనంలో కూర్చొనాలి. భూమిమీదే శయనించాలి. చలికాలంలో రాత్రి నీటిలో ఉండటం, వర్షాకాలంలో బహిరంగ ప్రదేశంలో ఉండటం, గ్రీష్మంలో పంచాగ్ని తపస్సు వంటివి. ధర్మబుద్ధి కలవారు చెయ్యాలి. నీటిని మాత్రం, వాయువును మాత్రం ఆహారంగా స్వీకరించటం, నాచును, భోజనం చెయ్యటం, రాళ్ళతో కొట్టిన ధాన్యాన్ని, దంతాలతో పొట్టు తీసిన దానిని, భుజించాలి. మరొక రోజునకు ఆహారాన్ని నిల్వచేసుకొనరాదు. శరీరం దిగువభాగాన్ని కప్పుకోవటానికి, నారచీరల్ని, పైభాగం కప్పడానికి మృగచర్మాన్ని ఉపయోగించాలి. పనులన్నీ సకాలంలో ధర్మబద్ధంగా శాస్త్రప్రకారం నిర్వహించాలి. నిత్యం అరణ్యంలో ఉండాలి. అరణ్యంలోనే తిరగాలి, అరణ్యంలోనే కన్పించాలి. అరణ్యాన్ని గురువులా భావించి వానప్రస్థులు జీవించాలి. హోమం చెయ్యటం, పంచయజ్ఞాలు ఆచరించటం, వానప్రస్థ ధర్మం. వారు వేదంలో

చెప్పిన విధంగా పంచయజ్ఞాలను విడివిడిగా కూడా ఆచరించాలి. అష్టమి తిథి నాడు, అష్టకాశ్రాద్ధాన్ని ఆచరించాలి. చాతుర్మాస్యవ్రతాన్ని చెయ్యాలి. పూర్ణిమ, అమావాస్యలయందు చేయదగిన యజ్ఞాలు చెయ్యాలి. అలాగే నిత్యయజ్ఞాన్ని వదలి పెట్టరాదు. భార్యాసంపర్కాన్ని విడవాలి. అన్నివిధాల సంకరాల్ని విడిచిపెట్టాలి. పాపవిముక్తులు కావాలి. ఈ విధంగా అరణ్యంలో మునులు నివసిస్తారు. వారు స్రుక్‌స్రువాలే ప్రధానాలుగా జీవించాలి. అగ్ని త్రయాన్నే శరణుపొందాలి. ఈ విధంగా సన్మార్గంలో నిత్యం చరించేవారు. పరమోత్తమ స్థితిని పొందుతారు. పుణ్యప్రదమైన బ్రహ్మలోకాన్ని, శాశ్వతమైన సోమలోకాన్ని సత్యధర్మాల్ని ఆశ్రయించి, సిద్ధిపొందిన మునులు చేరుకొంటారు. దేవి! వానప్రస్థులకు సంబంధించిన పవిత్రమైన ధర్మాన్ని విస్తారమైన దాన్ని, నేను స్థూలంగా నీకు వివరించాను.

ఉమ అన్నది. భగవంతుడా! సర్వప్రాణులకు అధీశ్వరుడా! సమస్త జీవుల వందనాల్నీ అందుకొనేవాడా, సిద్ధిని పొందిన ముని సంఘము యొక్క ధర్మాన్ని నీవు వివరించవలసింది. జ్ఞానగోష్ఠులతో సిద్ధిని పొందినవారిగా పేర్కొనబడేవారు. వననివాసులు ఒక్కరుగాను, భార్యతోను సంచరించేవారి ధర్మాన్ని నాకు తెలియపరచవలసింది. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవీ ! ఒంటరిగా కాని, భార్యతో కూడినవారు గాని అయిన వానప్రస్థులు నిత్యం తపస్సు చేస్తుంటారు. వారు గుండుగీయించుకుని కాషాయం కట్టుకుంటారు. స్త్రీలతో కలిసి ఉండేవారు మాత్రం రాత్రివేళల్లో ఆశ్రమంలో ఉంటారు. మిగిలిన వేళల్లో సంచరిస్తూంటారు. మూడుపూటలా స్నానం చెయ్యాలి. అగ్నికి హోమం చెయ్యాలి. సమాధిలో ఉండాలి. సన్మార్గాన్ని సేవించాలి. శాస్త్రోక్త కర్మలనే చెయ్యాలి. ఇదిగొప్ప ధర్మం. వీరుకూడా పూర్వం చెప్పిన వానప్రస్థ ధర్మాల్ని ఆచరించినట్లయితే తపస్సు చేసిన ఫలితాన్ని తప్పక పొందుతారు. ఎవరు దంపతులుగా ఉంటారో ఆ మునులు తమ భార్యయందే అభిరుచి కల్గిఉంటారు. ఋతుకాలంలో మాత్రమే భార్యతో సంగమిస్తారు. వేదవిహిత ధర్మాలన్నీ ఆచరిస్తారు. అటువంటి ధర్మాత్ములకు ఋషి ప్రోక్తమైన ధర్మఫలం లభిస్తుంది. ధర్మపరులైనవారు ఇతర భోగాలను కోరరాదు. సమస్త ప్రాణులకు అభయమనే దక్షిణను ఇచ్చి అహింసను ఆచరించేవాడు ధర్మఫలాన్ని పొందుతాడు. సమస్తప్రాణుల పట్ల దయగలిగి ఉండి ఋజుమార్గంలో ప్రవర్తిస్తూ ప్రాణులన్నిటినీ తమవలెనే భావించేవాడు ధర్మ ఫలాన్ని పొందుతాడు. సర్వవేదాల్లో నిష్ణాతులు కావటం ఎలాంటిదో, సమస్త ప్రాణులపట్ల ఋజుశీలంతో ఉండటం కూడా అలాంటిదే. రెండూ సమానమే. ఋజు శీలమే ఇంకా గొప్పది. ఋజువర్తనం ధర్మంగా చెప్పబడింది. వక్రమార్గంలో

ప్రయాణించటం అధర్మం. ఋజుత్వం కలిగిన మానవుడు తప్పక ధర్మఫలాన్ని పొందుతాడు. ఎల్లవేళలా ఋజుమార్గంలో ప్రవర్తించేవాడు దేవతా సన్నిధిలో ఉన్నట్లే. ధర్మఫలాన్ని ఆశించే వాడు ఋజుశీలంతో ఉండాలి. సహనం, ఇంద్రియనిగ్రహం, క్రోధాన్ని జయించటం, హింసకు దూరంగా ఉండటం, ధర్మాసక్తి, ఇవి కలిగినవాడు ధర్మఫలాన్ని పొందుతాడు. అలసత్వం లేనివాడు, ధర్మాత్ముడు, శక్తిమేరకు సన్మార్గంలో నడిచేవాడు, సచ్చరితుడు, జ్ఞాని బ్రహ్మతో సమానుడవుతాడు.

ఉమ అడిగింది. మహేశ్వరా ! నేను యాయావర ధర్మాన్ని తెలుసుకోవాలనుకుంటున్నాను. దయతో నాకు ఆ ధర్మాన్ని తెలుపవలసింది. శ్రీమహేశ్వరుడన్నాడు - భామినీ ! యాయావర ధర్మాన్ని చెప్తాను. శ్రద్ధగా విను. యాయావరులు వ్రతములతో ఉపవాసాలతో పవిత్ర శరీరులుగా ఉంటారు. వారు ధైర్యంగా ఉంటారు. సత్యవ్రతాన్ని ఆచరిస్తారు. ధర్మశాలులైన వారు పదిహేను రోజులు, ఒక మాసం కూడా ఉపవాసంలో ఉండి శరీరాన్ని కృశింపచేస్తారు. వర్షాలలో, శీతకాలంతో, ఎండలతో పరమతపస్సు చేస్తారు. శుచిస్మితా! వీరు కాలక్రమాన ఇంద్రలోకాన్ని చేరుతారు. అక్కడ వారు దివ్య భోగాల్ని అనుభవిస్తారు, దివ్య గంధాలతో దివ్యా భరణాలతో, శ్రేష్ఠ విమానాలతో, దివ్యస్త్రీలతో కూడినవారై యథేచ్ఛగా విహరిస్తారు. దేవి! యాయావరుల విషయం చెప్పాను. ఇంకా నీ వేమి వినాలను కొంటున్నావు ? ఉమ అన్నది - ప్రభో ! ఆచక్ర చరుల యొక్క ధర్మాన్ని వినాలని కోరుకుంటున్నాను శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు - శుభాంగీ ! శాకటిక ధర్మాన్ని వివరిస్తాను. విను. వారు అన్నివేళలా తమ శకటాల భారాన్ని భార్యతో పాటు మోస్తున్న వారై, సమయానికి శకటాలతో పాటు వెళ్ళి భిక్షను అర్థిస్తారు. నిరంతరం తపస్సు చేస్తుంటారు. తపస్సులో పాపాల్ని పోగొట్టు కుంటారు. ధీరులైనవారు కామక్రోధాల్ని విడిచి దిక్కులన్నీ పర్యటిస్తుంటారు. ఈ విధంగా తిరుగుతూనే వీరు కాలం వచ్చినప్పుడు స్వర్గాన్ని పొందుతారు. అక్కడ సమస్త సుఖాన్ని అనుభవిస్తూ సంతోషంగా కాలం గడుపుతారు ఈ విధంగా చక్రచరుల విషయాన్ని తెలియపరిచాను. ఇంకా నీవు ఏమి వినా లనుకొంటున్నావు?

పార్వతి అన్నది - ప్రభో ! నేను వైఖానస ధర్మాన్ని వినా లనుకుంటున్నాను. పరమేశ్వరుడిలా అన్నాడు. శుభనయనా! వైఖానసులు కూడా వానప్రస్థులే. వీరు తీవ్రమయిన తపస్సు చేస్తారు. తమ తపోతేజంతో ప్రకాశిస్తుంటారు. వీరు ధీరులు, సత్యవ్రతాన్ని ఆచరిస్తారు. నిష్కల్మషమైన తపస్సు చేస్తారు. వారిలో కొంత మంది రాతితో కొట్టగా లభించిన ఆహారాన్ని భుజిస్తారు. మరికొందరు దంతాలనే రోకళ్ళుగా చేసుకొని జీవిస్తారు. మరికొందరు రాలిన ఆకులను మాత్రమే భుజిస్తారు. కొందరు రాలిన ధాన్యపుగింజల్నే ఏరుకుని వాటితో జీవిస్తారు. కొంత మంది పావురాల్లాగా జీవన పద్ధతిని అవలంబిస్తారు. కొంత మంది పశువుల్ని అనుసరిస్తూ వాటిలాగే గడ్డిమేస్తూ జీవిస్తారు. మరికొంత మంది పాలనురగతో జీవితాన్ని గడుపుతారు. వీరు ఫేనపులు. కొందరు మృగాలతో పాటు తిరుగుతూ వాటి ఆహారాన్నే స్వీకరిస్తుంటారు. కొందరు నీటినే ఆహారంగా స్వీకరిస్తారు. కొందరికిగాలే ఆహారం. కొందరు ఏ ఆహారాన్ని తీసుకోరు. కొందరు విష్ణుపాదాలను పూజిస్తూ. జీవిస్తారు. వీరందరూ

వ్యాధి మృత్యువులను జయించి తీవ్రమైన తపస్సు చేస్తుంటారు. ఈ కారణంగా వీరు మృత్యువును కూడా భయపెడతారు. ఇంద్రలోకంలో వీరికి గొప్ప భోగసంపదలుంటాయి. వీరు దేవతాసమానులై. సమస్త దేవతాభోగాలను అనుభవిస్తారు. పూజ్యురాలా! చాలాకాలం అందమైన అప్సరసలతో భోగాల్ని అనుభవిస్తారు. వైఖానసుల విషయం నీకు విన్పించాను. ఇంకా నీవేమి వినాలనుకుంటున్నావు?

పార్వతి ఇలా అన్నది. భగవంతుడా! తపోధనులైన వాలఖిల్య మహర్షులను గూర్చి వినాలని ఉన్నది. పరమేశ్వరుడిలా అన్నాడు! దేవీ ! వాలఖిల్య మహర్షుల వలె చరించే ధర్మాన్ని విను. వీరు మృగాలు వదిలిన చర్మాన్ని ధరిస్తారు. శీతోష్ణాది ద్వంద్వాలకు అతీతులు, తపోధనులు, వీరి శరీరాలు బోటన వ్రేలు పరిమాణంలో ఉంటాయి. అన్ని అంగాలు దానిలోనే ఇమిడి ఉంటాయి. వారు ఉదయిస్తున్న సూర్యుడిని అనేక స్తోత్రాలతో స్తుతిస్తారు ధర్మజ్ఞులు, సత్యవాదులు అయిన వారు సూర్యకిరణాల్లాంటి తమ తేజస్సులతో దిక్కులన్నీ ప్రకాశింప చేస్తూ ముందుకు సాగుతారు. లోకం కోసం వారియందు విమలమైన సత్యం ప్రతిష్ఠింపబడి ఉంటుంది. దేవి! వారి తపోబలంచేతనే ఈ లోకమంతా బ్రతుకుతున్నది. శుచిస్మితా! పార్వతీ ! మహాత్ములతపస్సు చేత, సత్యం చేత, సహనం చేత, లోకాలు నిలబడుతున్నట్లు తెలుస్తోంది. ప్రజల కోసం, లోకాలకోసం ఈ మహాత్ములు తపస్సు చేస్తారు. తపస్సు చేత సమస్తం లభిస్తుంది. తపస్సు చేత ఫలాన్ని అయినా పొందవచ్చు. లోకంలో ఎంత పొందశక్యం కాని దాన్ని అయినా తపస్సు ద్వారా సాధించుకోవచ్చు.

ఉమ అన్నది - వానప్రస్థాశ్రమాసక్తులైన తపోధనులు ఏరకమైన తపస్సులు చేసి, తేజోవంతులవుతారో సెలవియ్యవలసింది. రాజులు, రాజపుత్రులు, ధనరహితులు మహాధనులు, ఏఏ కర్మలను ఆచరించి గొప్ప ఫలాలను పొందగల్గుతున్నారు. దేవా ! వానప్రస్థులు ఏ కర్మలను ఆచరించటం వల్ల నిత్యమైన స్థానాన్ని పొంది దివ్యచందనాలం కృతులవు తున్నారు? ముక్కంటీ ! తపశ్చర్యకు సంబంధించిన ఈ నా సంశయాన్ని సంపూర్ణంగా తీర్చ వలసింది. పరమేశ్వరుడిలా అన్నాడు. ఇంద్రియనిగ్రహం కలిగి హింస చేయని సత్యవాదులు ఉపవాసవ్రతాల ద్వారా సంపన్నులై మరణానంతరం రోగరహితులై గంధర్వులతో పాటు సుఖిస్తారు. యథాశాస్త్రంగా న్యాయాన్ని గురించి ఎవరు మండూక యోగాన్ని దీక్షతో చేస్తాడో, ఆధర్మాత్ముడు నాగలోకంలో నాగులతో ఆనందిస్తాడు. ఏ వానప్రస్థుడు, దీక్షతుడై సంతోషంగా మృగాలతో పాటు మృగాల ముఖం నుండి జారినపడిన గడ్డిని భుజిస్తాడో వాడు అమరావతిని పొందుతాడు. నాచునుగాని, రాలిన ఆకుల్నిగాని ఆహారంగా తీసుకొనే ప్రతిజ్ఞ స్వీకరించినవాడు. శీత యోగాన్ని (చలిలో నీటిలో ఉండి తపస్సు చేయటం) నిత్యమూ ఆచరించేవాడు గొప్ప ఉన్నతిని పొందుతాడు. గాలి భోంచేసేవాడు, నీరే భుజించే వాడు, పళ్ళను దుంపలను మాత్రమే స్వీకరించేవాడు యక్షులకు ప్రభువై అప్సరసల సముహంతో సంతోషా న్ననుభవిస్తాడు. శాస్త్రసహితంగా అగ్నియోగాన్ని పంచాగ్ని

మధ్య తపస్సు పన్నెండు సంవత్సరాలు చేసిన క్షత్రియుడు మహారాజు అవుతాడు. ఏ ముని పుష్కరకాలం ఆహారనియమాన్ని అవలంబిస్తూ చివరకు నీటిని కూడా వదలి, మరుసాధన చేస్తాడో అటువంటి క్షత్రియుడు మహారాజు అవుతాడు. పన్నెండు సంవత్సరాలు అన్ని వైపులా ఆకాశం ఉండేటట్లు విశాలమైదానాన్ని వేదికగా చేసుకుని, ఆహారం తీసుకోకుండా దేహత్యాగం చేసిన వాడు స్వర్గంలో సుఖంగా జీవిస్తాడు. భామిని! వైవిధంగా భూవేదికపై నివసించే వానికి గొప్ప వాహనాలు పడకలు, వెన్నెల వంటి విలువైన ఇళ్ళు లభిస్తాయి. ఒంటరిగా జీవిస్తూ నియమితాహారుడై ఉండి, చివరకు, నిరాహారిగా శరీరాన్ని పరిత్యజించే వాడు స్వర్గాన్ని పొందుతాడు. ఆత్మయందే రమిస్తూ పన్నెండు సంవత్సరాలు దీక్షితుడై మహాసముద్రంలో దేహాన్ని విడిచినవాడు వరుణ లోకాన్ని పొందుతాడు. ఆత్మారాముడు, ద్వంద్వాతీతుడు ఏమీ స్వీకరించనివాడు, ఆత్మను సాధించుకొన్నవాడు. అయి పన్నెండు సంవత్సరాల దీక్షను సాగించి, చివరి కాలంలో రాతితో కాళ్ళను పగులగొట్టుకుని మరణిస్తాడో వాడు గుహ్యకలోకంలో విహరిస్తాడు. ఎవరు స్వర్గాన్ని పొందాలని పన్నెండు సంవత్సరాలు వ్రత దీక్షనవలంబిస్తారో వారు స్వర్గాన్ని పొంది, దేవతలతో పాటు సుఖాల్ని పొందుతాడు. ఆత్మారాముడై ఎవడు పన్నెండు సంవత్సరాల దీక్ష తర్వాత తనను తాను అగ్నిలో హోమం చేసుకొంటాడో వాడు అగ్నిలోకంలో మహిమాన్వితుడౌతాడు. దేవీ ! ఏద్విజుడు న్యాయంగా దీక్షానియమాన్ని స్వీకరిస్తాడో; ఆతను ఆత్మయందే నియమించి, ధర్మాలాసుడై, అహంకారత్యాగం చేస్తాడో; మనస్సులోని దీక్షను పన్నెండు సంవత్సరాలు పాటిస్తాడో; అతడు తన అరణులను చెట్టు కొమ్మమీద వదలి, (అగ్ని పరిత్యాగం చేసి, వీర మార్గాన్ను సరిస్తూ వీరాసనంలోనే కూర్చొని వీరునివలెనిలబడి చివరకు వీరగతినే పొందుతాడు. అతడు ఇంద్రలోకం పొందుతాడు. అన్నివేళలా సమస్త కామాల్ని అనుభవిస్తాడు. దివ్యపుష్పాల మధ్య జీవిస్తాడు. దివ్యచందనంతో అలంకరింపబడతాడు. ఆధర్మాత్ముడు స్వర్గంలో దేవగణాలతో పాటు సుఖంగా నివసిస్తాడు. వీర లోకాన్ని పొందిన అతడు, నిత్యం వీరులతో సహజీవనం చేస్తాడు. ఎవడు సర్వాన్ని విడిచి, పవిత్రుడై నియమాన్ని స్వీకరించి, దీక్షితుడై, సత్త్వగుణాన్ని ఆశ్రయిస్తాడో, వీరమార్గాన్ని పొందుతాడో, అతడు సనాతనలోకాల్ని పొందుతాడు. అతడు కోరిక చొప్పున ప్రయాణించే విమానం మీద కోరిక మేరకు సంచరిస్తాడు. ఆ శ్రీమంతుడు రోగరహితుడై ఇంద్ర లోకంలో భోగాలను అనుభవిస్తాడు.

143. వర్ణప్రాప్తిలో కర్మప్రాధాన్యము.

ఉమ ఇలా అడిగింది. దక్షయజ్ఞవినాశకా ! నాయీ సంశయాన్ని తొలగించు. పూర్వం బ్రహ్మదేవునిచే బ్రాహ్మణక్షత్రియవైశ్య శూద్రవర్ణాలు సృజింపబడ్డాయి కదా! ఏ కర్మఫలితంగా వైశ్యుడు శూద్రునిగా జన్మిస్తాడు? వైశ్యుడు ఏమి చేస్తే క్షత్రియుడుగా పుడతాడు? బ్రాహ్మణుడు ఏ కర్మవల్ల క్షత్రియుడుగా పుడతాడు? ఇట్టి ప్రతిలోమ ధర్మాన్ని ఎలా నివారించాలి? ఏ కర్మవల్ల విప్రుడు శూద్రజాతియందు జన్మిస్తాడు? ఏ పనిచేస్తే క్షత్రియుడు శూద్రజన్మను పొందుతాడు ? నాయీ సందేహాన్ని నివారింపవలసింది. క్షత్రియాదులు ఏ స్వభావం వల్ల బ్రాహ్మణత్వం పొందుతారు? శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవీ ! బ్రాహ్మణత్వం పొందటం అసాధ్యం. స్వభావంవల్లనే బ్రాహ్మణులు కాని, క్షత్రియ వైశ్య శూద్రులు గాని తమ జన్మల్ని పొందుతారని భావిస్తున్నాను. విప్రుడు తాను చేసిన చెడ్డపనుల కారణంగా తన స్థానాన్నుండి దిగజారతాడు. ఆ కారణంగా అగ్రవర్ణుడుగా పుట్టిన బ్రాహ్మణుడు తన మర్యాదను రక్షించుకోవాలి. బ్రాహ్మణధర్మాన్ని ఆచరించినవాడు బ్రాహ్మణ సముడవుతాడు. క్షత్రియుడయినా వైశ్యుడయినా సరే బ్రహ్మ భావాన్ని పొందుతాడు. ఎవడు విప్రధర్మాన్ని విడిచి, క్షత్రియ ధర్మాన్ని ఆశ్రయిస్తాడో వాడు బ్రాహ్మణత్వం నుండి దిగజారి క్షత్రియునిగా జన్మిస్తాడు. ఏ విప్రుడు లోభమోహాల వల్ల దుర్లభమైన బ్రాహ్మణ్యం విడిచి వైశ్యకర్మను ఎల్లవేళలా స్వీకరిస్తాడో, ఆ అల్పబుద్ధి, వైశ్యునిగా జన్మను పొందుతాడు. ఆ ద్విజుడు వైశ్యుడిగాను, వైశ్యుడు శూద్రునిగాను, జన్మిస్తాడు. ధర్మాన్నుండి దిగజారిన విప్రుడు చివరకు శూద్రునిగాను జన్మించవచ్చు. ధర్మచ్యుతుడయిన బ్రాహ్మణుడు తన వర్ణాన్నుండి బహిష్కరింపబడి, మరణానంతరం నరకాన్ని పొందుతాడు. బ్రహ్మలోకాన్ని పొందలేడు. తిరిగి శూద్రునిగా జన్మిస్తాడు. క్షత్రియుడుగాని వైశ్యుడుగాని తమ ధర్మాన్ని విడిచి శూద్రకర్మలు చేసినట్లయితే వాడు వర్ణ సాంకర్యం కల్గించినవాడవుతాడు. తన స్థానాన్నుండి దిగజారతాడు. అటువంటి వాడు బ్రాహ్మణుడయినా క్షత్రియుడయినా వైశ్యుడయినా శూద్రునిగా జన్మిస్తాడు. ఎవడు స్వధర్మాన్ని తెలుసుకొంటాడో జ్ఞాన విజ్ఞానాలను పొందుతాడో, పవిత్రునిగా ఉంటాడో, ధర్మజ్ఞుడు, ధర్మాచరణ తత్పరుడు అవుతాడో, అతడు తప్పక ధర్మాచరణ శుభఫలాన్ని పొందుతాడు.

దేవి! మరొక విషయాన్ని బ్రహ్మదేవుడు స్పష్టంగా చెప్పాడు. ధర్మకాములయిన సత్పురుషులు నిష్ఠగా అధ్యాత్మతత్త్వాన్ని సేవిస్తారు. ఉగ్రస్వభావుని అన్నం, సమూహాన్నం,

శ్రాద్ధాన్నం, జన్మసూతకసమయంలోని అన్నం, దుర్గార్ముడు పెట్టిన అన్నం, శూద్రుని అన్నం, వీనిని ఎన్నడు భుజించరాదు. దేవీ ! దేవతలచే మహాత్ములచే శూద్రాన్నం గర్హితమని భావించబడుతోంది. ఈ విషయం బ్రహ్మదేవునిచే చెప్పబడింది. కాబట్టి ప్రమాణంగా భావిస్తున్నాను. ఏ ద్విజుడు శూద్రాన్నం తన జఠరంలో మిగిలిఉండగా మరణిస్తాడో అతడు ఆహితాగ్ని అయినా యజ్ఞం చేసినవాడయినా శూద్రజన్మను పొందుతాడు. ఆ శూద్రాన్న శేషం వల్ల, బ్రహ్మస్థానం పొందలేక, బ్రాహ్మణుడు కూడా శూద్రుడిగా జన్మిస్తాడు. ఈ విషయంలో సంశయం లేదు. ద్విజుడు జఠరంలో ఎవని ఎవని అన్నం మిగిలి ఉండగా మరణిస్తాడో, ఆయా వర్ణానికి చెందినవాడుగా జన్మిస్తాడు. మంగళప్రదమయిన దుర్లభమయిన బ్రాహ్మణ జన్మను పొంది, దాన్ని అవమానిస్తాడో, తినకూడని అన్నాన్ని తింటాడో అతడు బ్రాహ్మణత్వాన్నుండి దిగజారిపోతాడు. విప్రుడు మద్యాన్ని సేవించేవాడు, బ్రహ్మహత్య చేసినవాడు, నీచుడు, దొంగ, వ్రతభ్రష్టుడు, అపవిత్రుడు వేదాధ్యయన రహితుడు, పాపి, పిసినారి, మాయలాడు, రహస్యాపకారి, నియమరహితుడు, శూద్రస్త్రీని వివాహం చేసుకొన్నవాడు, భర్త ఉండగా జారునివల్ల జన్మించిన కుండుని ఇంట్లో తినేవాడు, సోమరసాన్ని అమ్మేవాడు, నీచుల్ని సేవించేవాడు, అయితే బ్రాహ్మణత్వం నుండి వంచింపబడతాడు. గురువు భార్యతో రమించేవాడై, గురువుకు అపకారం చేసినవాడై గురునిందయందాసక్తి కల బ్రాహ్మణుడు బ్రహ్మవిదుడయినా సరే బ్రాహ్మణత్వం నుండి దిగజారి పోతాడు.

దేవీ ! ఆయా శుభకర్మలను ఆచరించిన శూద్రుడు బ్రాహ్మణత్వం పొందుతాడు, వైశ్యుడు, క్షత్రియుడౌతాడు. సన్మార్గగామి అయిన శూద్రుడు న్యాయంగా, శాస్త్రప్రకారంగా శూద్రకర్మలనన్నిటినీ ఆచరించాలి. అందరిమాటలు వినాలి. సేవలు చేయాలి, బ్రాహ్మణుల విషయంలో ప్రయత్నపూర్వకంగా వీనిని చేయాలి. మనస్సులో కూడా విముఖత్వం ప్రదర్శించకూడదు. దేవతలను బ్రాహ్మణులను గౌరవించేవాడు, అందరికీ అతిథి సత్కారం చెయ్యటంలో దీక్ష వహించినవాడు, ఋతుసమయాన మాత్రమే భార్యతో సంగమించేవాడు, నియమవంతుడు, నియమితంగా తినేవాడు తాను పవిత్రుడై, పవిత్రమయిన జనులకోసం వెతుకులాడేవాడు, అతిథి భోజనానంతరం భుజించేవాడు, అకారణంగా మాంసాన్ని భుజించని వాడు అయితే వైశ్య జన్మను పొందుతాడు. సత్యవచనుడు, నిరహంకారి, ద్వంద్వాలకతీతుడు, ఇంద్రియనిగ్రహం కలవాడు, యజ్ఞాలు చేసేవాడు, నిత్యయజ్ఞాలు ఆచరించేవాడు, వేదాధ్యయన పరాయణుడు, పవిత్రుడు బాహ్యేంద్రియాలను నిగ్రహించినవాడు, బ్రాహ్మణులను గౌరవించేవాడు, సమస్త వర్ణాలవారి అభ్యుదయాన్ని కోరేవాడు, గృహస్థవ్రత నియమాల్ని

ఆచరించేవాడు, రెండు పూటలు మాత్రమే భుజించేవాడు, అతిథులకు పెట్టిన తర్వాత మాత్రమే తినేవాడు, ఆహారలాలసని జయించినవాడు, తన్ను తాను పొగడుకోనివాడు అగ్నిహోత్రాన్ని పూజించేవాడు, శాస్త్రోక్తంగా హోమాల్ని చేసేవాడు, అందరికీ ఆతిథ్యమిచ్చేవాడు, మిగిలిన భోజనాన్ని తినేవాడు, త్రేతాగ్నులకు మంత్రార్చనలు చేసేవాడు, ఈలక్షణాలు గల వైశ్యుడు చివరకు ద్విజుడవుతాడు.

అటువంటి వైశ్యుడు ముందుగా పవిత్రమయిన గొప్ప క్షత్రియ వంశంలో జన్మిస్తాడు. క్షత్రియ వంశంలో పుట్టిన అట్టి వైశ్యుడు, పుట్టినది మొదలు సంస్కరింపబడతాడు. ఉపనయనం చేసుకొని, వ్రతాలనాచరించి సర్వమాన్యుడయిన ద్విజునిగా మారిపోతాడు. దానాలు చేస్తాడు. యజ్ఞాలు చేస్తాడు. గొప్ప దక్షిణలిస్తాడు. వేదాధ్యయనం చేస్తాడు. స్వర్గాన్ని సాధించాలని త్రేతాగ్నులను ఎల్లవేళలా పూజిస్తాడు. పీడితులకు నిత్యం సహాయం చేస్తాడు. ప్రజలను ధర్మంగా పరిపాలిస్తాడు. సత్యాన్నే పలుకుతాడు. చెప్పినదాన్ని చేస్తాడు. అతని దర్శనం అందరికీ ఆనందం కల్గిస్తుంది. జనుల్ని ధర్మంగా శిక్షిస్తాడు. శిక్షించడం మానడు, ధర్మకార్యాలు జరిగేవిధంగా చూస్తాడు. చేసే పనులు సాధనాలు ధర్మబద్ధంగా ఉంచుతాడు. ఆరవ భాగాన్నే పన్నుగా స్వీకరిస్తాడు. అర్థకోవిదుడయిన క్షత్రియుడు కాముక ప్రవృత్తి కల్గిఉండడు. ధర్మాత్ముడు ఋతుకాలంలో మాత్రమే భార్యను పొందుతాడు. ఎల్లవేళలా తగినవిధంగా ఉపవాసవ్రతమాచరిస్తాడు. వేదాధ్యయనం చేస్తాడు. పవిత్రుడుగా ఉంటాడు. దర్భలు పరచిన అగ్నిగృహంలో నిత్యం శయనిస్తాడు. అందరికీ ఆతిథ్యమిస్తాడు. ధర్మార్థకామాలను తగువిధంగా సేవిస్తాడు. ఎల్లవేళలా మంచి మనస్సుతో ఉంటాడు. శూద్రులు అన్నం కావాలంటే ఎప్పుడయినా సిద్ధంగా ఉందని ఆహ్వానిస్తాడు. ధనాన్ని కాని భోగాన్ని కాని దృష్టిలో ఉంచుకొని ఏ విషయాన్ని పరిశీలించడు. పితృదేవతలు దేవతలు అతిథులు వీరి కోసం ప్రయత్నిస్తాడు. ఇలాంటివాడు సుక్షత్రియుడు. తన ఇంటిలోనే న్యాయంగా భిక్షను (భోజనాన్ని) చేస్తాడు. మూడు కాలాల్లోనూ శాస్త్ర ప్రకారం అగ్నిలో హోమం చేస్తాడు. అగ్నిత్రయమంత్రాలతో పవిత్రుడయిన ఆ క్షత్రియుడు, గోవుల బ్రాహ్మణుల సంక్షేమం కోసం యుద్ధంచేస్తూ చనిపోతే మరుజన్మలో బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. ఈ విధంగా క్షత్రియుడు తానాచరించిన శుభకర్మల కారణంగా ధర్మాత్ముడుగానుండి చివరకు జ్ఞానవిజ్ఞానాలు కల్గిన, సంస్కరింపబడిన వేదవిద్యా పారంగతుడైన విప్రునిగా జన్మిస్తాడు. దేవి! ఈ విధమైన శుభకర్మల్ని చెయ్యటం ద్వారా క్రింది తరగతిలో పుట్టిన శూద్రుడు కూడా సంస్కరింపబడి, వేద సంపన్నుడయిన విప్రునిగా అవతరిస్తాడు.

చెడ్డపనులు చేసి, సమస్త సంకరభోజనం చేసే బ్రాహ్మణుడు బ్రాహ్మణత్వాన్ని వదలి, శూద్రునిగా జన్మిస్తాడు. దేవీ ! పరిశుద్ధాత్ముడు జితేంద్రియుడు అయిన శూద్రుడు కూడా సత్కర్మలు చేస్తున్నట్లయితే బ్రాహ్మణునివలెనే సేవింపదగినవాడవుతాడని బ్రహ్మదేవుడు స్వయంగా చెప్పాడు. ఏ శూద్రునియందు మంచి స్వభావమూ, శుభకర్మాచరణమూ ఉంటాయో అటువంటి శ్రేష్ఠుడు, బ్రాహ్మణునికి కూడా గౌరవింప తగ్గవాడవుతాడు. పుట్టుకగాని, సంస్కారంగాని, శాస్త్రపాండిత్యం గాని, ఉత్తమసంతానం కాని, ద్విజత్వానికి కారణం కాదు, మంచి నడవడికయే దానికి కారణం. లోకంలో ఉన్న సమస్త బ్రాహ్మణులు వారి నడవడికను బట్టియే బ్రాహ్మణులుగా నిరూపింపబడతారు. మంచి నడవడికల్గిన శూద్రుడు బ్రాహ్మణత్వాన్ని పొందగల్గుతాడు. సమస్తప్రాణుల పట్ల సమత్వం బ్రాహ్మణస్వభావం నిర్గుణమూ నిర్మలమూ అయిన సమత్వభావన (బ్రహ్మ భావన) ఉన్నవాడే ద్విజుడవుతాడు. దేవి! ఈ వర్ణోత్పత్తి, వారివారి స్థానాలు, వారి కర్మలు, ఇవన్నీ వరదుడయిన బ్రహ్మదేవుడే సృష్టి సమయమందు స్వయంగా చెప్పాడు. బ్రాహ్మణుడు పాదాలు కల్గిన గొప్ప పంటభూమి వంటివాడు. ఆ క్షేత్రంలో నాటబడిన విత్తనం పరలోకంలో మంచి ఫలాన్నిస్తుంది. బ్రాహ్మణుడు నిత్యం అతిథి గృహజనుల భోజనం తర్వాత తాను భుజించాలి. సన్మార్గావలంబిగా ఉండాలి. ఉన్నతి కోరేవాడు బ్రాహ్మణ మార్గంలోనే సంచరించాలి. బ్రాహ్మణుడు వేదమంత్రాల్ని వల్లే వేయాలి. గృహస్థు తన ఇంటిలో నిత్యం శాస్త్ర చర్చలు చేయాలి. తన అధ్యయనాన్ని పొట్టపోసుకోవటం కోసం ఉపయోగించుకోకూడదు. ఈ విధమైన బ్రాహ్మణుడు మంచిమార్గంలో ప్రయాణిస్తూ అగ్నినారాధిస్తూ వేదాధ్యయన శీలుడై బ్రహ్మభావాన్ని పొందుతాడు. దేవి! బ్రాహ్మణత్వం పొందినవాడు ప్రయత్న పూర్వకంగా జితేంద్రియుడై దాన్ని రక్షించుకోవాలి, తెలి నవ్వులదానా! జన్మద్వారా, దానస్వీకారం ద్వారా, శుభకర్మాచరణ ద్వారా రక్షించుకోవాలి. రహస్యమయిన ఈ విషయమంతా నీకు చెప్పాను. శూద్రుడు బ్రాహ్మణుడు గాను, ధర్మభ్రష్టుడయిన బ్రాహ్మణుడు శూద్రుడు గాను ఎలా జన్మిస్తాడో వివరించాను.

144. బంధనాది కారణములయిన శుభాశుభకర్మలను వర్ణించుట.

ఉమ ఇలా అన్నది. ప్రభో! నరుల ధర్మాధర్మాలకు సంబంధించిన ఈ సంశయాన్ని నివారింపవలసిందిగా కోరుతున్నాను. ఎల్లవేళలా చేసే పనులచేత, ఆలోచనల చేత, మాటల చేత మూడు విధాలుగా నరుడు పాశముల చేత బంధింపబడుతున్నాడు. లేదా బంధముక్తిని పొందుచున్నాడు. ఈ లోకంలో మానవులు ఎటువంటి స్వభావం చేత,

పనుల చేత, నడవడిచేత చక్కగా ఆచరించటం చేత, సద్గుణాల చేత స్వర్గాన్ని పొందుతారు? శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవి! ధర్మార్థ సారమెరిగిన దానా! నిత్యం ధర్మాన్ని ఆచరించేదానా! ఇంద్రియనిగ్రహం పట్ల ఆసక్తి కలదానా! నీవడిగిన ప్రశ్న సమస్త ప్రాణులకు మేలుచేసేది. బుద్ధికి పదును పెట్టేది. చెప్తాను విను. నరులు సత్యమందు ధర్మమందు ఆసక్తికల్గి, ఆశ్రమ చిహ్నాలను విడిచి ధర్మబద్ధంగా లభించిన ధనం ద్వారా భోగాలనుభవిస్తే స్వర్గాన్ని పొందుతారు. సమస్త సందేహాలు తీరినవారు, సృష్టియొక్క ఉత్పత్తి ప్రళయం - వీటి తత్వం తెలిసినవారు. సర్వజ్ఞులు, సమస్తాన్ని సమంగా చూచేవారు ఎన్నడూ ధర్మంచేతగాని అధర్మం చేతగాని బద్ధులు కారు. ఎవరు త్రికరణశుద్ధిగా హింసను చేయరో, రాగానికి లోనుగారో, అటువంటి పురుషులు కర్మల వల్ల ఏర్పడే బంధనాలకు అతీతులౌతారు. దేనిమీదా ఆసక్తిని పెంచుకోనివారు కర్మలచేత బంధింపబడరు. ప్రాణిహింసను విడనాడినవారు, సచ్ఛీలురు. దయాశీలురు, ఎవర్నీ ప్రేమించటంగాని, ద్వేషించటం కాని చేయనివారు, ఇంద్రియనిగ్రహం కలవారు, సమస్త కర్మబంధనాల నుండి విముక్తులవుతారు.

సమస్త ప్రాణులపట్ల జాలికలవారు, సమస్త ప్రాణులయొక్క విశ్వాసాన్ని చూరగొన్నవారు, అన్నివిధాలైన హింసలను వదిలినవారు స్వర్గాన్ని పొందుతారు. పరుల సొత్తుపట్ల మమకారం లేనివారై పరులభార్యలవైపు దుర్భావంతో చూడనివారై, ధర్మార్జనతో భుజించే నరులు స్వర్గాన్ని పొందుతారు. పరుల భార్యల విషయంలో తల్లివలె, సోదరివలె, కుమార్తె వలె సద్భావంతో ఉన్న నరులు స్వర్గాన్ని పొందుతారు. తనకు లభించిన ధనంతోనే సంతృప్తిని పొందుతూ దొంగతనం చేయక, తనకున్న దానితోనే తృప్తిగా జీవించే నరులు స్వర్గాన్ని పొందుతారు. తన భార్యయందే అనురక్తిని పొంది ఋతుకాలంలో మాత్రమే భార్యాసంగమాన్ని పొందుతూ, గ్రామ్యసుఖ భోగాల పట్ల ఆసక్తులు కాని నరులు స్వర్గాన్ని పొందుతారు. పరుల భార్యల చరిత్రల పట్ల విముఖులై ఇంద్రియాల్ని జయించి మంచి నడవడిక కల్గిన నరులు స్వర్గాన్ని పొందుతారు. ఈ మార్గం దేవతలచేత నిర్మింపబడింది. రాగద్వేషాలకు అతీతులు కావటానికి ఉపయోగించేది. సమస్త నరుల చేత, పండితుల చేత ఎల్లవేళలా సేవించదగినదీ మార్గము. దానం, ధర్మం, తపస్సు, శీలం, పవిత్రత, దయ వీనితో కూడిన ఈ మార్గం. జీవిక కోసంగాని, ధర్మకోసం గాని, ఎల్లవేళలా నరులందరిచేత సేవింపబడవలసినది, స్వర్గవాసాన్ని కోరుకునేవారికి ఇంతకంటె ఉత్తమమార్గం లేదు. ఉమ యిలా అన్నది. ఏరకమైన మాటచేత బంధనాన్ని కాని ముక్తినికాని పొందగలడో, దానికి అనుగుణమైన పనులేమిటో దయతో తెలియచేయవలసినది.

శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. తమ కోసంగాని, పరులకోసం గాని పరిహాసం కోసం గాని, అసత్యాన్ని పలుకని నరులు స్వర్గాన్ని పొందుతారు. బ్రతకటం కోసం గాని, ధర్మంకోసంగాని, స్వేచ్ఛతోగాని, అసత్యాన్ని పలుకని మానవులు స్వర్గాన్ని పొందుతారు. మృదువైన తియ్యని, బాధను కల్గించని, పాపసంపర్కం లేని మాటలను స్వాగత పూర్వకంగా మాట్లాడే నరులు స్వర్గాన్ని పొందుతారు. పరుషంగా మాట్లాడక కఠినంగా కూడా మాట్లాడక లోభరహితులుగా ఉండే సత్పురుషులు స్వర్గాన్ని పొందుతారు. మిత్రభేదాన్ని కల్గించే లోభభూయిష్ఠమైన మాటలను పలుకక, సత్యాన్ని, మైత్రిని చాటే విధంగా మాట్లాడేనరులు స్వర్గాన్ని పొందుతారు. పరుషవచనాన్ని, ఇతరులకు ద్రోహం చెయ్యటాన్ని విడిచి సమస్తప్రాణులపట్ల సమభావం కలిగి జితేంద్రియులయిన మానవులు స్వర్గాన్ని పొందుతారు. మోసపూరితంగా మాట్లాడక విరుద్ధాంశాలను విడిచి ఎల్లప్పుడూ మృదువుగా మాట్లాడే నరులు స్వర్గాన్ని పొందుతారు. కోపంతో మనస్సును గాయపరిచే విధంగా మాట్లాడక క్రోధంతో ఉన్నా ప్రసన్నంగా మాట్లాడే మానవులు స్వర్గాన్ని చేరుకుంటారు. దేవీ ! ఇది మాటల విషయంలో సదా నరులాచరించవలసిన ధర్మం ఇది మంగళకరం. సత్యమైన గుణం, పండితులు అసత్యాన్ని వదిలి పెట్టాలి.

ఉమ ఇలా అడిగింది. దేవదేవా! ఏ మానసిక కర్మచే పురుషుడు సదా బద్ధుడవుతాడో దాన్ని నాకు వివరంగా చెప్పండి. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. కల్యాణీ ! మానస ధర్మాన్ని సదా ఆచరించే పురుషులు స్వర్గాన్ని పొందుతారు. ఈ విషయాన్ని విశదీకరిస్తాను విను. శుభాననా! దురాలోచనలతో కూడిన మనస్సు దుష్కార్యాలు చేయిస్తుంది. ఏ ఆలోచనలు మనస్సుకు బంధనాన్ని కల్గిస్తాయో ఆ వాక్యాన్ని నీవు శ్రద్ధగా విను. అరణ్యంలో జనాలు లేని ప్రదేశంలో ఉంచిన పరుల వస్తువు కంటబడినప్పటికీ ఎవరి మనస్సు చలించదో, ఎవరు మనస్సుతో కూడా హింస చేయరో ఆ నరులు స్వర్గాన్ని పొందుతారు. గ్రామంలోగాని ఇంటిలోగాని, విజనంలో ఉన్నా, పరద్రవ్యాన్ని చూచినా ఎప్పుడూ ఎవరు మోహపడరో ఆనరులు స్వర్గాన్ని పొందుతారు. ఆ విధంగానే పరులభార్యలను స్వేచ్ఛాచారిణులను ఏకాంతంలో చూసినా ద్రోహబుద్ధి కలుగని నరులు స్వర్గాన్ని పొందుతారు. శత్రువు పట్ల, మిత్రుని పట్ల కూడా నిత్యం సమభావంతో ఉండి, మైత్రీభావంతో కలిసి ఉండే నరులు స్వర్గాన్ని పొందుతారు. శాస్త్రజ్ఞులు దయగలవారు పవిత్రులు సత్యప్రతిజ్ఞలై తనకున్న ధనంతో తృప్తిని పొందే నరులు స్వర్గాన్ని చేరుకొంటారు. శత్రుత్వం లేనివారై, భేదాన్ని పొందక, మిత్రత్వము నందు పరమాసక్తి కలిగి, సమస్త ప్రాణుల పట్ల దయగల నరులు

స్వర్గాన్ని చేరుకొంటారు. నిత్యం, శ్రద్ధగల్గి దయగల్గి పవిత్రులై, పవిత్ర జనంపట్ల ఇష్టులై ధర్మాధర్మాల్ని తెలుసుకొని ప్రవర్తించే నరులు స్వర్గాన్ని పొందుతారు. శుభకర్మలను, అశుభకర్మలను చేసే సమయంలో వాటి పర్యవసానాన్ని తెలుసుకొని ప్రవర్తించే నరులు స్వర్గాన్ని పొందుతారు. ఏ నరులు సదా న్యాయంగా ఉంటూ, సుగుణాలతో ఉంటూ, దేవతలను బ్రాహ్మణులను ఆరాధిస్తూ, నిలబడి గౌరవించే నరులు స్వర్గాన్ని పొందుతారు. నేను సూచించిన శుభకర్మలనాచరించిన వారందరూ స్వర్గమార్గాన్ని పొందుతారు. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు ?

ఉమ ఇలా అడిగింది. ఓ మహేశ్వరా! మర్త్యుల విషయంలో నాకు మరొక గొప్ప సందేహం ఉన్నది. కనుక నీవు నేర్పుగా దాన్ని వివరించవలసింది. ప్రభో! పురుషుడు ఏ కర్మలను ఆచరిస్తే దీర్ఘాయువును పొందుతాడు? ఏ తపస్సు చేస్తే గొప్ప దీర్ఘాయువు పొందవచ్చు? మానవుడు ఈ భూమిమీద ఏ కర్మ చేస్తే ఆయుర్దాయాన్ని కోల్పోతాడు? అటువంటి కర్మలయొక్క ఫలితాన్ని చెప్పవలసింది. కొంతమంది ఎంతో భాగ్యశీలురు, మరికొంతమంది దురదృష్టవంతులు, కొంతమంది గొప్ప వంశంలో పుట్టరు. మరికొందరు గొప్ప వంశంలో జన్మిస్తారు. కొందరు మానవులు చెక్కతో చేసినట్లుగా ఉంటారు. వారిని చూడటమే కష్టం. కొందరు మానవులు ఇంకా ఇంకా చూడాలనిపించేటట్లు ఉంటారు. కొంతమంది జ్ఞానశూన్యులుగా కన్పిస్తారు. కొందరు పండితులుగా కన్పిస్తారు. కొందరు గొప్ప జ్ఞానులుగా ఉంటారు. మరికొందరు జ్ఞాన విజ్ఞానాలను చక్కగా తెలుసుకొని ఉంటారు. కొంతమంది పురుషులకు బాధలు తక్కువ. కొంతమందికి ఎప్పుడూ గొప్పబాధలే వస్తుంటాయి. ఇలా రకరకాలుగా కన్పించటానికి కారణమేమో సెలవియ్యవలసింది. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవీ ! మర్త్యలోకంలో నరులందరూ తమ తమ కర్మల ఫలితాన్ని అనుభవిస్తారు. ఏ కర్మల ఫలమెలా ఉంటుందో వివరిస్తాను. ఎవడు తీక్ష్ణంగా ఉంటాడో ప్రాణాలు తియ్యటంలో ఘనుడో, సదా చేతిలో మరణాయుధాలతో తిరుగుతుంటాడో, సమస్త ప్రాణులను సదా హింసిస్తూ ఉంటాడో, సర్వప్రాణులపట్ల నిర్దయగా ఉంటాడో, ఉద్వేగాన్ని కలుగ చేస్తుంటాడో, కీటకాలు చీమలపై కూడా దయచూపడో, మిక్కిలి క్రూరుడో, అటువంటి నరుడు, నరకాన్ని పొందుతాడు. పై నరునకు విరుద్ధంగా ఉండేవాడు ధర్మాత్ముడు, రూపశీలిగా పుడతాడు. ఎవడు హింసను అభిమానిస్తాడో, పాపాలు చేస్తుంటాడో అటువంటి నరుడు సమస్త ప్రాణులకు అనిష్టుడవుతాడు. అంతట అల్పాయువుగా జన్మిస్తాడు. హింసాస్వభావుడు నరకంలో పడతాడు. హింస చేయనివాడు

స్వర్గాన్ని పొందుతాడు. పాపి నరకంలో పడి భయంకరమైన యాతనలు పొందుతాడు. ఒకప్పుడు ఎవడో ఒకడు అలాంటి నరకాన్నుంచి బయటపడి మనుష్యుడుగా పుట్టినా, మళ్ళీ అల్పాయుష్కుడుగానే పుడతాడు. హింసా ప్రవృత్తిగల మానవుడు, తన పాపపు పనుల చేత బద్దుడై ప్రాణులందరికీ అనిష్టుడవుతాడు, మళ్ళీ అల్పాయుష్కునిగా పుడతాడు. దేవి! ఎవడు సత్కులంలో పుడతాడో, ప్రాణిహింసను చేయడో, ఆయుధాన్ని విడిచిపెడతాడో, శిక్షించడో, ఎప్పుడూ ఎవరినీ హింసించడో, చంపించడో, చంపడో, చంపేవారిని అభినందించడో, ఆమోదించడో, సమస్త ప్రాణుల పట్ల స్నేహభావంతో ఉంటాడో, అందర్నీ తనలాగే చూసుకొంటాడో, అటువంటి పురుషశ్రేష్ఠుడు దేవత్వాన్ని పొందుతాడు. సంతోషంగా జీవిస్తూ దొరికిన సమస్త భోగాల్ని చక్కగా అనుభవిస్తాడు. ఒకవేళ ఒకప్పుడు మనుష్యలోకంలో పుట్టినా, ఆనరుడు దీర్ఘాయువును పొందుతాడు. సుఖంగా జీవిస్తాడు. ఇది మంచి నడవడి కల్గి, సత్కర్మల నాచరించేవారు, ప్రాణిహింస చేయనివారు దీర్ఘాయువును పొందే మార్గంగా బ్రహ్మదేవుని చేత ప్రకటింపబడింది.

145. స్వర్గనరకాది ప్రాప్తికారణ వర్ణనము.

ఉమ ఇలా అడిగింది. "ఏ స్వభావం, ఏ ఆచరణ, కల్గిన పురుషుడు, ఏఏ కర్మలద్వారా ఏఏ దానాలద్వారా స్వర్గాన్ని పొందుతాడు ?" దేవి! బ్రాహ్మణుల్ని పూజించేవాడు, దీనులు, దుఃఖితులు, దరిద్రులు మొదలయిన వారికి, తినుబండారాలు, ఫలహారాలు, అన్నం, నీరు, గుడ్డలు ఇచ్చేవాడు, విశ్రాంతిస్థానాలు, ధర్మశాలలు, బావులు, దిగుడు బావులు, చెరువులు, నిర్మించేవాడు, నిత్యం ఉపయోగించే వస్తువులను, యాచకుల కోరిక మేరకు, ఆసనాన్ని, పడకను, వాహనాన్ని, ఇంటిని, రత్నాన్ని, ధనాన్ని, పంట భూముల్ని, గోవులను, పాలాల్ని, స్త్రీలను, సర్వవస్తువులను, ఏ మానవుడు ప్రశాంతమయిన మనస్సుతో దానంగా ఇస్తాడో, అటువంటి నరుడు దేవలోకంలో జన్మిస్తాడు. అక్కడ చాలాకాలం నివసించి, గొప్ప భోగాలను, అనుభవించి, అప్సరసలతో నందనాది ఉద్యానవనాల్లో విహరిస్తాడు. అలాంటి స్వర్గంనుండి క్రిందకు వచ్చి మళ్ళీ మనుష్యలోకంలో జన్మిస్తాడు. గొప్ప భోగాలున్న వంశంలో ధనధాన్యాలతో కూడి జన్మిస్తాడు. అక్కడ, కోరుకోదగిన సర్వగుణాలు కలవాడై, సంతోషంగా జీవిస్తూ, గొప్ప భోగాల్ని, గొప్ప ధనాన్నీ ఆ మానవుడు పొందుతాడు. దేవి! ఈమహానుభావులు దానశీలురుగాను, అందరికీ చూడాలనిపించేవారు గాను, ఉంటారని పూర్వం బ్రహ్మదేవుని చేత వివరించబడింది. దేవి! మరికొందరు మానవులు దానం

చెయ్యటంలో పరమదరిద్రులు, బుద్ధిహీనులు. వీరు తమకు తగినంత ఉన్నా బ్రాహ్మణుడు యాచించినా పైసా విదల్చరు. మరికొందరు తమ నాలుకకున్న దురాశచే నియంత్రింపబడి దీనులు, గ్రుడ్డివారు, దరిద్రులు భిక్షుకులు, అతిథులు, యాచించినా ఏమీ ఇవ్వకుండానే వెనుతిరిగిపోతుంటారు. వీరు ధనాన్నిగాని, వస్త్రాలనుగాని, భోగాలను కాని, బంగారాన్ని కాని, ఆవులను కాని, అన్న పదార్థాలను గాని ఎన్నడూ దానమివ్వరు. దేవి! బుద్ధిహీనులు, ఏ దానంలోను ప్రవర్తించనివారు, లోభులు, నాస్తికులు, దానమివ్వని వారు - వీరంతా నరకానికి పోతారు. ఈ అల్పబుద్ధులు కొంతకాలం గడిచాక మళ్ళీ భూమిమీద మనుష్యులుగా జన్మించినప్పుడు దరిద్రుల వంశంలో పుడతారు. వీరు ఆకలిచేత, దాహంచేత బాధింపబడుతూ, లోకులందరిచేత బహిష్కరింపబడి, ఆశలేని వారై, ఏ భోగాలు అనుభవించనివారై అధర్మమార్గాన్ని జీవికగా పొందుతారు. తక్కువ భోగాలున్న కులంలో పుట్టి, అల్పభోగాల పట్ల ఆసక్తులై, ఈ నరులు, వారుచేసుకొన్న దుష్కర్మల ఫలితంగా దరిద్రులుగా జీవిస్తారు.

మరికొందరు మనస్సులేనివారు, గర్వంచేత బిగుసుకు పోతారు. నిత్యం కోపంతో ఉండి పాపకార్యాల పట్ల ఆసక్తి కల్గిఉంటారు. వీరు పూజార్హుడు వచ్చినా కనీసం కూర్చోడానికి ఆసనాన్ని కూడా చూపించరు. కొందరు అల్పబుద్ధులు, మార్గాన్ని తెలుసుకోవా లనుకొనేవాడికి, తమకు తెల్సిన దారిని కూడా చూపించరు. తగినవాడికి కాళ్ళు కడుక్కునేందుకు నీటిని కూడా ఇవ్వరు. వీరు మందబుద్ధులు. పూజించదగినవారిని శాస్త్రానుసారం పూజించరు. విలువైన వస్తువులను గానీ కనీసం త్రాగటానికి నీటినికాని ఇవ్వని అల్పబుద్ధులు వీరు. ఎదురుగా వచ్చిన గురువును ప్రేమతో గురువుగా భావించి సత్కరించరు. వీరు గర్వమూలకమైన లోభంతో నిండి ఉంటారు. గౌరవించదగినవారిని గౌరవించరు. వృద్ధులను అవమానిస్తారు. దేవి ! ఇటువంటి నరులందరూ నరకానికి పోయేవారే. ఇటువంటి నరులు ఆ నరకం నుండి చాలా ఏళ్ళకు తప్పించుకో గలిగితే, మళ్ళీ భూమి మీద ఒక దుర్మార్గ వంశంలో జన్మిస్తారు. గురువులను పెద్దలను అవమానించేవారు, శ్వపాకులు, పుల్కసులు మొదలయిన మనస్సులేని కుత్సిత వంశాల్లో జన్మిస్తారు. ఎవడు గర్విష్ఠుడు దురభిమానీ కాడో, దేవతలను బ్రాహ్మణులను పూజిస్తాడో, లోకమంతటిచే గౌరవింపబడతాడో, అందరికీ నమస్కరిస్తాడో, తియ్యగా మాట్లాడుతాడో, అన్ని వర్ణాలవారికి మేలు చేస్తాడో, ఎల్లవేళలా సమస్త ప్రాణులకు హితాన్ని కోరుతాడో, ఎవర్నీ ద్వేషించడో, చూడదగిన ముఖం కలవాడుగా ఉంటాడో మృదువైన స్నేహపూర్ణమయిన మాటల్ని ఎల్లప్పుడూ మాట్లాడుతాడో, స్వాగతం చెప్తాడో, ఏ ప్రాణిని హింసించడో, అందర్నీ తగినవిధంగా సత్కారపూర్వకంగా పూజిస్తూ ఉంటాడో,

దారికోసం వెతికే వాడికి దారి చూపిస్తాడో, గురువును గురువుగా అర్చిస్తాడో, అతిథుల్ని ఆహ్వానించటానికి ఆసక్తుడవుతాడో, అభ్యాగతులను పూజిస్తాడో, అటువంటి నరుడు, స్వర్గాన్ని పొందుతాడు. అక్కడ నుండి మనుష్యత్వాన్ని పొంది, గొప్ప వంశంలో జన్మిస్తాడు.

అతడు అక్కడ కోరుకున్న భోగాల్ని అనుభవిస్తాడు. అన్ని శ్రేష్ఠవస్తువులను కల్గి ఉంటాడు. అర్హత మేరకు దానం చేస్తాడు. అర్హులకు సేవ చేసే వాడవుతాడు. ఏ నరుడయినా తాను చేసిన కర్మల ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. పై లక్షణాలున్నవాడు సమస్త ప్రాణులకు ఆమోద యోగ్యుడవుతాడు. అన్ని లోకాలచే నమస్కరింపబడతాడు. అటువంటివాడు గొప్ప కులంలో , గొప్ప జాతిలో, గొప్ప వంశంలో ఎప్పుడూ జన్మిస్తాడు. నేను చెప్పిన ఈ ధర్మం పూర్వం బ్రహ్మదేవునిచే స్వయంగా చెప్పబడ్డది. శుభురాలా! ఎవడు తీక్ష్ణమైన ఆచరణ కలిగి ఉంటాడో, అన్ని ప్రాణులకు భయంకల్గిస్తాడో, చేతులతో, కాళ్ళతో, త్రాళ్ళతో, కర్రతో రాళ్ళతో, స్తంభాలతో, ఆయుధాలతో జంతువులను బాధిస్తాడో హింసించడానికి మోసపూరిత విధానాలను అవలంభిస్తాడో, అందరినీ ఉద్వేగపరుస్తాడో, ఎల్లవేళలా జంతువులకు మనశ్శాంతి లేకుండా చేస్తాడో, నిత్యందాడి చేస్తాడో, అటువంటివాడు, తప్పక నరకాన్ని పొందుతాడు. అటువంటివాడు కాలక్రమాన మనుష్యలోకంలో పుడితే, అనేక విధాల బాధలకు ఆలవాలమయిన అధమ వంశంలో జన్మిస్తాడు. దేవి! ఇటువంటివాడు మనుష్యుల్లో, జ్ఞాతుల్లో బంధువుల్లో అధముడుగా పరిగణించబడతాడు. లోకానికి ద్వేష్యుడవుతాడు. ఈ పరిణామాలన్నీ అతడు చేసిన దుష్కర్మలచే వచ్చినవే. మరొకడు సమస్త ప్రాణులను దయతో చూస్తాడు. మిత్రునిలా ఉంటాడు. తండ్రిలా ఆదరిస్తాడు. ఎవరితోనూ వైరాన్ని పెట్టుకోడు. ఇంద్రియాలను జయిస్తాడు. ఏ ప్రాణికి ఉద్వేగాన్ని కల్గించడు, దేనినీ చంపడు కాళ్ళూ చేతులూ అదుపులో ఉంచుకొంటాడు. అందరికీ విశ్వాసం కల్గిస్తాడు. అన్ని ప్రాణులపట్ల విశ్వాసం కల్గి ఉంటాడు. త్రాళ్ళతో, కర్రలతో రాళ్ళతో, ఆయుధాలతో ప్రాణులకు భయాన్ని కల్గించడు. మృదువుగా ఉంటాడు. దయ గలిగి ఉంటాడు. ఇటువంటి శుభకర్మలనాచరించేవాడు స్వర్గంలో జన్మిస్తాడు. దివ్య భవనంలో నివసిస్తాడు. దేవునిలాగా సంతోషంగా కాలాన్ని గడుపుతాడు. అతడు పూర్వపుణ్యం నశించినా మనుష్యలోకంలో జన్మిస్తాడు. అల్పమైన బాధలు, ఆటంకాలు పొందుతాడు. ఆ నరుడు సుఖంగా జీవిస్తాడు. సర్వసుఖాల్నీ పొందుతాడు. శ్రమలేకుండా జీవిస్తాడు. దేవి! ఇది సత్పురుషుల మార్గం. దీనిలో బాధలననుభవించవలసిన పని లేదు."

"కొందరు మనుష్యులు ఊహాపోహాల్లో పండితులుగా ఉంటారు. జ్ఞానాన్ని,

విజ్ఞానాన్ని పొందుతారు. ప్రజ్ఞ కలవారవుతారు. కార్యసాధనలో నిపుణులుగా ఉంటారు. దేవా ! మరికొందరు చెడ్డ ప్రజ్ఞను కలిగి ఉంటారు. జ్ఞానం గాని విజ్ఞానంగాని వారికి ఉండదు. ఏ విశేషమైన కర్మను ఆచరించటం వల్ల పురుషుడు ప్రజ్ఞాశాలి కాగల్గుతాడు? విరూపాక్షా ! మానవుడు అల్పప్రజ్ఞుడు ఎలా అవుతాడు? సర్వధర్మాలు తెలిసిన వారిలో శ్రేష్ఠుడా! నా ఈ సంశయాన్ని తొలగించ వలసింది. కొందరు పుట్టు గ్రుడ్డివారు అలాగే మరికొందరు రోగపీడితులు. కొందరు నరులు నపుంసకులుగా కన్పిస్తున్నారు. ఈ భేదాలకు కారణం ఏమిటో తెలియ చెప్పవలసింది. వేదవిదులైన బ్రాహ్మణులను, యోగ సిద్ధులను, ధర్మవిదులను ప్రతిరోజు కుశలాన్ని అడుగు తుంటారు. తమ సంశయాల్ని నివారించు కొంటారు. అశుభకర్మలను విడిచిపెడతారు. శుభకర్మలను మాత్రమే ఆచరిస్తారు. అటువంటి వారు ఇహలోకంలో సుఖాన్ని అనుభవిస్తారు. అంతంలో స్వర్గాన్ని పొందుతారు. అతడు మనుష్యుడుగా మళ్ళి జన్మస్తే మేధావిగా పుడతాడు. అతని శాస్త్రజ్ఞానం, ప్రజ్ఞ మళ్ళీ లభిస్తాయి. దాని వల్ల శుభాలను పొందుతాడు.

ఎవరు పరుల భార్యలయందు దుర్మార్గపు చూపును ప్రసరింపచేస్తారో వారు, ఆ దుష్ట స్వభావం కారణంగా జాత్యంధులుగా పుడతారు. చెడ్డమనస్సుతో, వివస్త్రగానున్న స్త్రీని చూచిన నరులు దుర్మార్గులు, రోగార్తులవుతారు. ఎవరు మూర్ఖులో, దుర్మార్గులో, పశువుల మొదలైన వాటితో మైథునంలో ఆసక్తులో, అటువంటి దుష్ప్రజ్ఞగల పురుషులు నపుంసకులుగా పుడతారు. ఎవరు పశువుల్ని హింసిస్తారో, గురుభార్యను పొందుతారో, సంకరజాతి స్త్రీలతో రతి జరుపుతారో, అటువంటి నరులు నపుంసకులు అవుతారు. "దేవశ్రేష్ఠుడా! అసహ్యించుకొనదగిన కర్మఏది? అలాగే పూజ్యమైన కర్మ ఏది? దేన్ని చేస్తే మానవుడు శ్రేయస్సును పొందుతాడు ? శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "ఎవడు శ్రేయస్సునిచ్చే సన్మార్గాన్ని కోరుతూ బ్రాహ్మణుని ప్రశ్నిస్తాడో, ఎవడు ధర్మాన్ని నిరంతరం వెతుకుతుంటాడో, ఎవడు సుగుణాలను పెంపొందించుకోవా లనుకుంటాడో వాడు స్వర్గాన్ని పొందుతాడు. ఒకవేళ అటువంటివాడు, మనుష్య జన్మను పొందినా, మానవలోకంలో గొప్ప మేధస్సు, ధారణాశక్తి కలిగి జన్మిస్తాడు. దేవి! ఈ సత్పురుషులాచరించే ధర్మం సంపదను కల్గిస్తుంది. మానవుల మేలుకోసం దీన్ని నేను నీకు తెలియచేశాను."

పార్వతి యిలా అడిగింది. "కొందరు అల్పమయిన విజ్ఞానం కల్గి ఉంటారు. ధర్మాన్ని ద్వేషించేవారవుతారు. అటువంటి నరులు, వేదవిదులైనవారిని, బ్రాహ్మణులను సమీపించడానికి ఇష్టపడరు. కొంతమంది వ్రతాచరణ తత్పరులుగాను, శ్రద్ధాధర్మాలపై

ఆసక్తి కలవారుగాను ఉంటారు. మరికొంతమంది, ఏ వ్రతాన్ని అవలంబించరు. నియమభ్రష్టులై రాక్షసులుగా ప్రవర్తిస్తారు. కొందరు యజ్ఞాలు చేస్తారు. మరికొందరు ఏహోమం చెయ్యరు. ఏ కర్మఫలంగా వారు, ఈ విధంగా తయారవుతారో, నాకు చెప్పవలసింది. "శాస్త్రాలను, లోకధర్మాలను, మర్యాదలను, సమస్త సద్విషయాలను ప్రమాణాలుగా భావించి, కొందరు దృఢదీక్షతో పాటిస్తారు. కొందరు అజ్ఞానంలో కూరుకుపోయి, అధర్మాన్ని ధర్మమంటారు. ఏ దీక్షను అవలంబించరు. ఏ మర్యాదను పాటించరు. వారు బ్రహ్మ రాక్షసులుగా చెప్పబడుతున్నారు. ఆ మనుష్యులు కాలవశాత్తు మళ్ళీ మనుష్యలోకంలో జన్మిస్తే ఏ హోమాలు చెయ్యని, వషట్కారాలు (పితృదేవత పూజ) లేని నరాధములుగా జన్మిస్తారు. దేవీ ! దానినంతటినీ, నీకున్న సమస్త సందేహాలూ పొగొట్టడానికి చెప్పాను. నరులకు సంబంధించిన, నేర్పు కలిగిన, నేర్పులేనివారికి సంబంధించిన ధర్మ సాగరాన్ని వ్యాఖ్యానించాను."

రాజధర్మవర్ణనము.

పార్వతి అన్నది. "వృషభధ్వజుడా! నీ దయవల్ల నేను సమస్తాన్ని విన్నాను. నీవు చెప్పిన అమూల్యమయిన వాక్యాలను శ్రద్ధగా విన్నాను. అర్థాన్ని గ్రహించాను. ఇప్పుడు నాకు మనుష్యుల విషయంలో మరొక సందేహం వచ్చింది. ప్రాణాలు శిరస్సు శరీరం మొదలైనవన్నీ ఇతర మానవులతో సమానంగానే ఉన్నా ఈరాజు అనబడేవాడు అందరిలోను ప్రధానుడుగా కన్పిస్తున్నాడు. ఏవిధమయిన సత్కర్మలవల్ల ఇంతటి ప్రాధాన్యం రాజుకు లభించింది ? ఆ రాజు మనుష్యుల్ని శిక్షిస్తాడు. అనేకమందిని బెదరిస్తాడు. అటువంటి వాడు చనిపోయినప్పుడు పుణ్యకార్యాలు చేసే వాళ్ళు పొందే గొప్ప లోకాలను ఎలా పొందుతాడు? కనుక రాజు యొక్క నడవడిని నేను వినగోరుతున్నాను." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "శుభాననా! నీవడిగిన రాజధర్మాన్ని నీకు చెప్తాను. లోకపు శుభాశుభాలు, నడవడి అంతా రాజుమీద ఆధారపడి ఉంటుంది. గొప్ప తపస్సు ఫలితంగా రాజ్యం లభిస్తుందని పెద్దలు చెప్తారు. పూర్వకాలంలో రాజులేని దేశంలో గొప్ప సంక్షోభం ఏర్పడింది. ఆ సంక్షోభాన్ని గమనించి బ్రహ్మదేవుడు మనువును రాజుగా చేశాడు. అప్పటినుండి రాజులకు సంబంధించిన శుభాశుభకర్మలు ప్రారంభమయ్యాయి. పార్వతీ ! రాజుచేసే మంచి పని లోక క్షేమానికి ఉపయోగిస్తుంది. దాన్ని చెప్తాను విను. ఏమి చేస్తే మరణానంతరం స్వర్గం లభిస్తుందో, రాజుకు ఎటువంటి శక్తి కీర్తి ఉండాలో, చెప్తాను.

కాలక్రమంగా కాని, పోయిన రాజ్యంగాని, సంపాదించుకొన్న రాజ్యంగాని పొందినరాజు, రాజ్యధర్మాన్ని పాటిస్తూ శాస్త్రప్రకారం అనుభవించవలసి ఉంటుంది. రాజు ముందుగా తన్నుతాను వినయశీలునిగా రూపొందించుకోవాలి. తర్వాత సేవకుల్ని తర్వాత ప్రజల్ని వినయశీలురుగా చెయ్యాలి. శుభేక్షణా! ప్రజలు రాజును అనుకరిస్తారు. రాజును ఉపమానంగా భావిస్తారు. రాజులా ఉండాలనుకొంటారు. కనుకనే వారూ వినయసంపన్నులుగా తయారవుతారు. తనను తాను సంస్కరించుకోకుండా, ఏ రాజు ప్రజలకు వినయాన్ని నేర్పాలనుకుంటాడో, ఆ రాజు తనదోషాన్ని పరిశీలించుకోని కారణంగా

అపహాస్యం పాలవుతాడు. రాజు విద్యలనభ్యసించటం ద్వారా, పెద్దలను సేవించటం ద్వారా ముందుగా వినయాన్ని అలవర్చుకోవాలి. విద్య, ధర్మం, అర్థం అనే ఫలితాల్నిస్తుంది. ధర్మార్థవిదులు, విద్యావంతులు పెద్దలుగా భావింపబడతారు. వినయాన్నలవర్చుకున్నాక, రాజు ఇంద్రియాల్ని జయించాలి. జయించలేకపోతే అది గొప్ప దోషం అవుతుంది. అది చివరకు, రాజును పతనానికి తీసుకుపోతుంది. పంచేంద్రియాలను తన అధీనంలో ఉంచుకుని, రాజు ఇంద్రియార్థాలయిన రూపరసగంధ స్పర్శ శబ్దాలను, తుష్కింపచెయ్యాలి. వాటిపట్ల ఆసక్తిని వదులుకోవాలి. జ్ఞానం ద్వారా వినయం వల్ల వీలయినంత కామక్రోధలోభ మోహ మదమాత్సర్యాలనే ఆరు అంతశ్శత్రువులను విడిచిపెట్టాలి. శాస్త్ర దృష్టినలవర్చుకోవాలి. నీతి పరుడు కావాలి. అప్పుడు సేవకులను సంపాదించుకోవాలి. మంచి ప్రవర్తన పాండిత్యం, కులీనత ఉన్నవారిని, పరీక్షింపబడిన నీతి నిజాయితీలు కలవారిని, పరీక్షలలో విజయం సాధించినవారిని, జితేంద్రియులను, వారి అర్హతలకు తగ్గట్టుగా ఆయా పనులయందు అమాత్యులుగా నియమించాలి. బుద్ధిమంతులయిన మంత్రులు, జనప్రియమైన రాష్ట్రం, శత్రువులు ప్రవేశింపరాని శ్రేష్ఠమయిన దుర్గం, కష్టనష్టాల్ని ఓర్చగల్గిన కోశాగారం, సామోపాయాలద్వారా రాజుమీద భక్తి కలిగిన సేన, రెండవ పక్షాన్ని వహించని మిత్రుడు వినయతత్వ మెరిగినరాజు వీరిని సప్త ప్రకృతులంటారు. ప్రజలను చక్కగా రక్షించటానికి ఈ వ్యవస్థ ఏర్పరుపబడింది. రాజు వీటిని సాధనాలుగా చేసుకొని లోకానికి మేలు చెయ్యాలి.

రాజు తనను తాను రక్షించుకోవటం చాలా అవసరం. అది ప్రజల రక్షణకుపయోగిస్తుంది. కనుక రాజు ఎల్లవేళలా అప్రమత్తంగా తన్ను తాను రక్షించుకోవాలి. రాజు భోజనం, బట్టకట్టుకోవటం, స్నానం చెయ్యటం, బయటకు వెళ్ళడం, స్త్రీ సముదాయంతో మెలగడం, ఇన్ని విషయాల్లోను జితేంద్రియుడై ఉండి తనను తాను రక్షించుకోవాలి. జితేంద్రియుడై రాజు, తనవారినుండి, శత్రువులనుండి, ఆయుధాల నుండి, విషప్రయోగాల నుండి, భార్యాపుత్రులనుండి కూడా ఎల్లవేళలా తనను తాను రక్షించుకోవాలి. రాజు ఆత్మవంతుడై అన్నిస్థానాల నుండి తనను తాను రక్షించుకోవాలి. ప్రజలను రక్షించడం కోసం అప్రమత్తంగా ఉండి ప్రజలకు మేలు చెయ్యాలి. ప్రజల కార్యమే తన కార్యం కావాలి. ప్రజల సౌఖ్యమే రాజు తన సౌఖ్యంగా భావించాలి. ప్రజలకిష్టమయినదే తన యిష్టం కావాలి. ప్రజల మేలే తన మేలు కావాలి. రాజు సర్వస్వమూ ప్రజలకోసమే ఉపయోగించాలి. తనకోసం ఉపయోగించుకోకూడదు. తన ప్రకృతులను (అమాత్యాదులను) రక్షించుకోవటానికి, రాగద్వేషాల్ని విడనాడి, రాజు వివాదంలో రెండు పక్షాలవాదనలను యథాతథంగా వినాలి. విన్నాక స్వబుద్ధితో, నిజం నిగ్గు తేలేవరకు పరీక్షించాలి. రాజు తత్వమెరిగిన అనేకమంది నరశ్రేష్ఠులతో కూడి, దోషి, దోషం, దేశకాలాలు, నయానయాలు బాగా తెలుసుకొని, శాస్త్ర ప్రకారంగా దోషుల్ని శిక్షించాలి. రాజు ఈ విధమైన నిష్పక్షపాత వ్యవహారంవల్ల గొప్ప ధర్మఫలాన్ని పొందుతాడు. రాజు దేశంలో జరుగుతున్న మంచి చెడుల్ని స్వయంగా చూసి, ఆప్తులద్వారా, అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకోవాలి. నిర్ధారించుకోవాలి. గూఢచారుల ద్వారా, జరుగుతున్న పనులద్వారా, తెలుసుకొన్నదాన్ని పరిశీలించాలి. చెడ్డపనుల్ని వెంటనే నివారించాలి. మంచి పనుల్ని ఆహ్వానించాలి. వీవగించుకోవలసిన వారిని వీవగించుకోవాలి. మాన్యుల్ని పూజించాలి. శిక్షింపదగినవారిని శిక్షించి తీరాలి. ఇందులో తాత్సారం చెయ్యకూడదు. రాజు అవసరమయిన ప్రతి సందర్భంలో బుద్ధిమంతులయిన ఐదుగురు మంత్రులతో కలిసి కూర్చొని సమాలోచన చెయ్యాలి.

ఆ మంత్రులు కులీనులు, పండితులు, సచ్చరిత్రులై ఉండాలి. రాజు ఎల్లప్పుడూ ప్రజాక్షేమం కోసం రహస్య సమాలోచనలు చేస్తూనే ఉండాలి.

రాజు కేవలం తనకిష్టమయిన వారితోగాని, తనపట్ల విముఖులైన వారితోగాని మంతనాలు జరుపకూడదు. రాజు రాష్ట్ర సంక్షేమంకోసం ప్రజలచేత సత్యధర్మాలను ఆచరింపజేయాలి. దుర్గాధిప్రకృతులయందు, మంత్రులు మొదలయిన వారియందు, రాజు స్వయంగా శ్రద్ధ తీసుకోవాలి. దేశాభివృద్ధి చేసే సేవకులను రక్షించాలి. దేశాన్ని నాశనం చేసేవారిని, అప్రియంగా వ్యవహరించేవారిని విడిచిపెట్టాలి. ప్రతిరోజు తన సేవకుల యోగక్షేమాల్ని పరిశీలించాలి. రాజు ప్రసన్నవదనంతో మిక్కిలి ప్రియంగా ప్రజలతో వ్యవహరించాలి. ధర్మబద్ధంకాని, కఠినమైన, తీక్ష్ణమైన మాటల్ని పలుకరాదు. సజ్జనుల విషయంలో అవిశ్వాస్యులుగా ముద్ర వేయరాదు. ప్రతి వానిలోని గుణాల్నీ దోషాల్నీ చక్కగా తెలుసుకోవాలి. రాజు ధీరుడై తన చేష్టల్ని బయట పెట్టకూడదు. నీచమైన ఆలోచనలు, పనులు చేయరాదు. లోకుల చేష్టలను పసికట్టి వారితో వ్యవహరించాలి. రాజు తన ప్రజల్ని రాజభయాన్నుండి, శత్రుభయాన్నుండి, పరస్పర భయాన్నుండి, మానవేతర భయాలనుండి రక్షించాలి. లోభులు, కఠినాత్ములు, దొంగలు వీరిని ఏవిధంగానైనా సరే పట్టుకొని రాజు తప్పక శిక్షించాలి. రాజు తన కుమారులను పుట్టినప్పటి నుండే వినయశీలురుగా పెంచాలి. వారిలో తనవంటి సద్గుణసంపన్నుని యువరాజుగా చెయ్యాలి. పార్వతీ ! రాజ్యమెన్నడూ, క్షణమయినా రాజులేకుండా ఉండరాదు. కనుక తన తర్వాత రాజ్యాన్ని పాలించేవారిని యువరాజుగా చెయ్యటం తప్పని సరి.

సత్కులీనులు, వైద్యులు, వేదవిదులు, తాపసులు, ఆయా వృత్తులయందు నిపుణులు అయిన వారిని సత్కరించాలి. తనకోసం, రాజ్యక్షేమం కోసం, కోశాగారం కోసం పై వారిని సత్కరించాలి. తన ధనాన్ని నీతిమంతుడైన రాజు నాలుగు భాగాలుగా విభజించి, ధర్మానికి, సేవకులకు, తనకు దేశకాలాల వల్ల వచ్చే ఆపదల్లో రక్షణకు కేటాయించాలి. రాజు, సంధిని గాని, యుద్ధాన్ని గాని, ఇతర నీతి విశేషాల్ని గాని యథాతథంగా పరిశీలించి, న్యాయమైన దాన్ని ఆచరించాలి. రాజు, తన దేశంలో అనాథలను, వ్యాధిగ్రస్తులను, వృద్ధులను పోషించాలి. రాజు జనప్రియుడై తన దేశం నాల్గు చెరగులా పర్యటించాలి. మంచిపనులే అయినా ఒంటరిగా చేయకూడదు. రాజు, తనకు గాని, తనవారికి గాని ఆపద వస్తుందని ఊహించుకొని, రాగద్వేషాలవల్ల ధార్మికపురుషుల్ని, ఎన్నడూ అవమానించరాదు రక్షణ పొందటం ప్రజల ధర్మం, రక్షణ కల్పించటం రాజధర్మం, కనుక రాజు పీడకులైన రాజులనుండి ప్రజల్ని రక్షించాలి. రాజు నీతితోను, ధనవ్యయంతోను, అన్న సంకటాలనుండి సేనను రక్షించుకోవాలి. ప్రజల ప్రాణాల్ని రక్షించటం కోసం యుద్ధాన్ని వీలయినంతవరకూ విరమించాలి. మంచి యుద్ధంలో ప్రాణాలు కోల్పోయినా రాజుకు ధర్మఫలం లభిస్తుంది. తనదోషం వల్ల కాని, పరులదోషంవల్ల కాని యుద్ధాన్ని చెయ్యకూడదు. సరి అయిన కారణం ఉన్నప్పుడే యుద్ధం చేయాలి. బలవంతుడైన శత్రువుచే ముట్టడింపబడినప్పుడు రాజు, ఆపద్ధర్మంగా నివారణో పాయాన్ని ఆలోచించాలి. ప్రజల మేలు కోసం శత్రువునయినా అనునయించాలి. దేవి! రాజధర్మాన్ని సంగ్రహంగా నీకు తెలియజేశాను. ఈ విధంగా వ్యవహరించే రాజు, ప్రజలను దండించినా, భయపెట్టినా, తామరాకుకు నీటి బిందువు అంటనట్లు పాపంచేత దూషితుడు కాడు. ఇలాంటి రాజు కాలధర్మాన్ని పొందితే, అతడు స్వర్గంలో

దేవతలతో అమర సౌఖ్యాన్ని అనుభవిస్తాడు."

శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "రాజుచే సహాయంకోసం పిలవబడ్డ వీరుడు యుద్ధ సమయంలో ఆయుధాన్ని ధరించి సహాయపడాలి. రాజు, వివిధ భోగాలను కల్పించటం వస్త్రాలను అలంకారాలను ఇవ్వటం, తనతోపాటు భోజనం, ఆసనం కల్పించటం, పలుసత్కారాలు చేయటం వల్ల, వీరుడు రాజుకు సహాయపడటం ధర్మం అవుతుంది. యుద్ధరంగంలో తోటి వీరులు చంపబడుతుండగా శత్రువుల్ని చంపుతుండగా ఏ గాయాలు లేకపోయినా ఏ వీరుడు, వెన్ను చూపి, రాజాభీష్టానికి విరుద్ధంగా పారిపోతాడో, అతడు రాజుకు సంబంధించిన పాపాల్ని పొందుతాడు. పారిన వీరుడి పుణ్యం రాజుకు సంక్రమిస్తుంది. అహింసయే గొప్ప ధర్మం అని భావించి, ఏ సేవకులు, రాజువల్ల వివిధభోగాల్ని పొంది కూడా, యుద్ధ సమయంలో సహాయపడరో వారు ఘోరమయిన నరకాన్ని పొందుతారు. ఏ యోధుడు వీరులు పొందే ఉత్తమగతులను భావించి, తన ప్రాణాల్ని పణంగా పెట్టి ఆయుధ ధారియై, అగ్నిలో మిడత ప్రవేశించినట్లు నిర్భయంగా రణరంగాన్ని ప్రవేశిస్తాడో అతడు నిశ్చయంగా స్వర్గాన్ని పొందుతాడు. ఏ వీరుడు, తన నాయకుని రక్షించాలనే దృఢ సంకల్పంతో ఆయుధాన్ని ధరించి, భయంకరమైన యుద్ధరంగంలో ప్రవేశిస్తాడో, సింహం లేళ్ళ గుంపుని చీల్చి చెండాడినట్లు శత్రు సైన్యాలను కకావికలు చేస్తాడో, ఎవడు యుద్ధరంగంలో మధ్యాహ్న మార్తాండుడిలాగ ప్రతాపంతో దుర్నిరీక్ష్యుడిగా వెలుగొందుతాడో, ఆయుధాన్ని ధరించి శత్రువులను నిర్దయగా వధిస్తాడో, ఆవీరుడు పుణ్యాత్ముడు, సంగ్రామమనే గొప్ప యజ్ఞాన్ని ఆచరించినవా డవుతాడు.

ఆ వీరునికి కవచమే లేడిచర్మం, ధనుస్సే పళ్ళతోముపుల్ల, రథమే వేదిక, జెండాయే యూపస్తంభం, రథానికి సంబంధించిన త్రాళ్ళే దర్భలు, కోపగర్వ అహంకారాలే త్రేతాగ్నులు, చెర్నాకోలాయే స్రువం, సారథియే ఉపాధ్యాయుడు, ఆయుధాలే స్రుగ్భాండాలు, యజ్ఞోపకరణాలు, బాణాలే సమిధలు. ఆ కీర్తిశాలి శరీరం నుండి వెలువడే స్వేదమే మధువు. శత్రువుల శిరస్సులే పురోడాశాలు, రక్తమే ఆహుతి, అమ్ములపొది చరువు క్రొవ్వే వసుధార, మాంసాన్ని తినే ప్రాణి సంఘాలే బ్రాహ్మణులు, చంపబడ్డ మనుష్యులు, వీనుగులు, గుర్రాలే వారి భోజనపానాలు. చంపబడ్డ యోధులకు సంబంధించిన వస్త్రాలు, ఆభరణాలు బంగారం, యజ్ఞ దక్షిణలు అవుతాయి. అలాంటి యుద్ధరంగంలో వీనుగుమీద కూర్చుని యుద్ధం చేస్తూ చనిపోయినవాడు బ్రహ్మలోకాన్ని పొందుతాడు. యుద్ధరంగంలో రథంమీద గాని, గుర్రం మీద కాని కూర్చొని యుద్ధం చేస్తూ మరణించిన వాడు ఇంద్రలోకంలో గొప్ప స్థానాన్ని పొందుతాడు. యుద్ధంలో చంపబడ్డవారు స్వర్గంలో పూజించబడతారు. చంపిన వాళ్ళు ఇహలోకంలోనే పూజింపబడతారు. కనుక యుద్ధరంగంలో చంపినా, చచ్చినా వారు సుఖాన్నే పొందుతారు కనుక యుద్ధరంగంలో ఉన్నవాడు నిర్భయంగా శత్రు సంహారం చెయ్యాలి. సంగ్రామంలో ఆయుధాన్ని ధరించి నిర్భయంగా యుద్ధం చేసిన ధర్మాత్ముని నదులు సముద్రంలో ప్రవేశించినట్లు సమస్త ధర్మఫలాలు చేరుకొంటాయి. ఇందులో సందేహం లేదు. ధర్మాన్ని చంపివేస్తే, ఆ ధర్మం వాడిని చంపుతుంది. ధర్మాన్ని రక్షిస్తే, ఆ ధర్మం వాడిని రక్షిస్తుంది. కనుక ధర్మాన్ని చంపకూడదు రాజులకీ ధర్మం మిక్కిలిగా వర్తిస్తుంది. ఏ దేశంలో రాజు ధర్మబద్ధంగా పరిపాలన చేస్తాడో, ఏ దేశంలో పితరులు, దేవతలు, షట్కర్మపరులైన బ్రాహ్మణులు పూజింపబడతారో, ఆదేశంలో పునావృష్టి ఉండదు,

రోగాలుండవు. ఉపద్రవాలు రావు. రాజు ధర్మశీలుడయితే ప్రజలందరూ ధర్మశీలురుగా ఉంటారు. దేవి! ఎల్లవేళలా ధర్మబద్ధంగా వ్యవహరించేవాడు, శత్రువుల లోపాలను గ్రహించగలవాడు, అప్రమత్తుడు, శౌర్యశాలి అయిన రాజును ప్రజలందరూ కోరుకొంటూ ఉంటారు.

పార్వతీ! భూమి మీద రాజకార్యాల్ని నాశనం చేసే నీచులు చాలామంది తప్పక ఉంటారు. కనుక పండితుడయిన రాజు అన్నివేళలా అప్రమత్తంగా ఉండి తీరాలి. రాజు ఒకప్పటి మిత్రుల విషయంలో, మనుష్యుల విషయంలో, వీనుగుల విషయంలో, స్నాన, అన్న, పాన విషయాల్లో అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలి. దీన్ని విశ్వసించరాదు. రాష్ట్రానికి మేలు చెయ్యటానికి, గోబ్రాహ్మణులకు మేలు చేయటానికి, బంధింపబడ్డవారిని విడిపించడానికి, మిత్రులకోసం, విడువశక్యం కాని ప్రాణాలను విడిచిపెట్టినవాడు రాజుకు అత్యంత ప్రియుడవుతాడు. తన వంశపు కీర్తిని పెంపొందిస్తాడు. దేవి! అన్నికోర్కెలను తీర్చే ఆవుల్ని దానం చేసి లోకాల్ని రక్షించే పర్వత వనాలతో శోభిల్లే సంపదలతో నిండిన సముద్ర పర్యంత భూమండలాన్ని శ్రేష్ఠుడయిన బ్రాహ్మణునికి దానం చేసినవాడు పొందే పుణ్యం కంటే యుద్ధరంగంలో మరణించినవాడు పొందే పుణ్యం గొప్పది. ధన సంపదలున్నవాడు వేలకొలది యజ్ఞాలు చెయ్యవచ్చు అందులో ఆశ్చర్యమేమీ లేదు. ప్రాణత్యాగం మాత్రం అన్నింటికంటె కష్టతరమయినది. కనుక అన్నియజ్ఞాల్లోను ఈ ప్రాణత్యాగ యజ్ఞం పరమ ప్రశస్తమయింది. ఈ విధంగా సంగ్రామ యజ్ఞంలోని విశేషాలను నీకు తెలియచేశాను."

శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "రాజులు సేవకులతో పరిహాసాలాడరాదు. అలా చేస్తే రాజు చులకన అవుతాడు. అతని ఆజ్ఞ పరిపాలించబడదు. భృత్యులతో పరిహసించటం వల్ల రాజు అవమానాలు పొందుతాడు. సేవకులు అడగరానివి అడుగుతారు. చెప్పరానివి చెపుతారు. భృత్యులు ముందునుంచీ తగిన లాభాలను పొందుతున్నవారయినప్పటికీ వారు వానితో సంతోషించరు. కనుక రాజు భృత్యులతో పరిహాసాన్ని విడవాలి. రాజు తనను నమ్మనివారి వారిని నమ్మకూడదు. నమ్మినవారి విషయంలో కూడా భరోసా చూపించడం మంచిది కాదు. నమ్మినవారు తన గోత్రంలోనివారయితే, రాజు మరింతగా అప్రమత్తంగా ఉండదలి. విశ్వాసం ఎక్కువయితే భయం తప్పదు. వృక్షాన్ని పిడుగుపడి నాశనం చేసినట్లు అతి విశ్వాసం భయం కల్గిస్తుంది. రాజు ప్రమత్తత వల్ల దురాశవల్ల హింసను పొందుతాడు. కనుక రాజు ఎల్లవేళలా ప్రమతత్తను దురాశను దరికి చేరనివ్వకూడదు. రాజు ఎప్పుడూ భయార్తులను భయాలనుండి రక్షించాలి. వీనుల్ని అనుగ్రహించాలి. ఏది చేయవచ్చో ఏది చేయరాదో తెలిసికొని ఉండాలి. నిత్యం రాష్ట్రహితం కోసం శ్రమించాలి. రాజు ఎప్పుడూ రాజ్యంలోనే ఉండాలి. ప్రజాపాలనే పరమధ్యేయం కావాలి. దురాశ ఉండరాదు. న్యాయాన్ని మాట్లాడాలి. ఇటువంటిరాజు ఆరవవంతు పన్నుగా పొందటానికి యోగ్యుడవుతాడు. కార్యాకార్యభేదాన్ని రాజు చక్కగా తెలియాలి. అన్ని విషయాల్ని ధర్మబద్ధంగా పరిశీలించాలి.

తన రాష్ట్రంలోని వారందరి పట్ల దయ చూపాలి. చేయరాని పనులను ఎన్నడూ చేయరాదు. రాజు తనను ప్రశంసించిన వారినీ, నిందించిన వారినీ అపరాధాలు చెయ్యని శత్రువునీ కూడా మిత్రునివలె భావించాలి. దుర్మార్గుని, వాడు చేసిన తప్పుకు తగ్గవిధంగా శిక్షించాలి. రాజు దుష్టశిక్షణ చేస్తే ధర్మం చక్కగా నడుస్తుంది. రాజు సహనశీలిగా ఉన్నచోట అధర్మానికి తావుండదు. దుర్మార్గుల్ని

శిక్షించటం ధర్మం. సత్పురుషుల్ని రక్షించటం ధర్మం. రాజు చంపదగినవారిని చంపి తీరాలి. అవధ్యులను రక్షించాలి. బ్రాహ్మణులు, ఆవులు, దూతలు, తండ్రి, విద్యచెప్పిన గురువులు, పూర్వం ఉపకారం చేసినవారు, స్త్రీలు, అతిథుల్ని పూజించేవారు, వీరందరూ అవధ్యులు. రాజా, బ్రాహ్మణులకు, భూమి, గోవు, బంగారం, సిద్ధాన్నం నువ్వులు, నెయ్యి, ఈ వస్తువులను నిత్యం దానం చేస్తే రాజ్యపాలనవల్ల వీర్పడే పాపాలు తొలగిపోతాయి. పైవిధంగా ధర్మాన్ని ఆచరిస్తూ, నిత్యం రాష్ట్ర సంక్షేమం కోసం పరితపించే నరపాలుని రాష్ట్రం, ధనం, ధర్మం, కీర్తి వృద్ధి పొందుతాయి. అటువంటి రాజుకు పాపాలంటవు. ఆపదలు రావు. ఆరవవంతు పన్నుగా స్వీకరిస్తూ కూడా. ధర్మంచేత, శౌర్యంచేత స్వచక్ర పరచక్రాలనుండి ప్రజలను రక్షింపక, శత్రుదేశాన్ని నశింపచేయటానికి ప్రయత్నం చేయక నిలిస్తే శౌర్యం లేని ఆ రాజు యొక్క రాజ్యం శత్రువర్గం చేత పీడింపబడుతుంది. శత్రురాజులు తమ శత్రుదేశాల్ని ఆక్రమించుకోవటం వల్ల మూటకట్టుకొనే పాపాన్నే తన దౌర్బల్యం చేత స్వరాష్ట్రాన్ని రక్షించుకోలేని రాజు కూడా పొందుతాడు.

మేనమామ, బావగారు, తల్లి, మామగారు, గురువు, తండ్రి వీరిని విడిచివెట్టి, మరెవ్వరయినా, తనను నాశనం చెయ్యబోతే వారిని రాజు చంపివేయాలి. తన రాష్ట్రాన్ని రక్షించుకోవటానికి యుద్ధం చేస్తూ, శత్రుచక్రం చేత చంపబడిన రాజు ఎలాంటి ఉత్తమ గతులను పొందుతాడో, వినుము. పార్వతీ! సంగ్రామంలో సంహరింపబడ్డ శూరుడైన రాజు, విమానంలో అప్సరసలతో వరివేష్టితుడై, ఇక్కడనుండి ఇంద్రలోకం చేరుకొంటాడు. సుందరీ! అతని శరీరంలో ఎన్ని రోమకూపాలున్నాయో, అన్ని వేల సంవత్సరాలు ఇంద్రలోక భోగాలనుభవిస్తాడు. ఒకప్పుడారాజు భూమిమీద పుట్టవలసి వస్తే రాజుగాగాని, రాజ సమానుడుగా కాని పుడతాడు. వీర్యవంతుడవుతాడు. అందువల్ల రాజు తన రాష్ట్రాన్ని ప్రయత్న పూర్వకంగా రక్షించుకోవాలి. రాజుకు తగిన పనులు చెయ్యటం, గూఢచారులను నియమించుకోవటం, సత్యసంధత, అప్రమత్తత, సంతోషంగా ఉండటం, ప్రయత్నం చేసేటప్పుడు తీక్ష్ణతను చూపకపోవటం, సేవకుల్ని పోషించటం, వాహనాలను పోషించటం వీరుల్ని సత్కరించటం, పనిచేసిన ప్రతివాడికీ బహుమతులనివ్వటం, ఈ పనులు రాజులకు ఇహపరాల్లో శ్రేయస్సును కల్గిస్తాయి".

పార్వతి ఇలా అంది. "మహాదేవ! దేవదేవ! సర్వలోక నమస్కృత! ధర్మరహస్యాలు నేను వినాలని కోరుకొంటున్నాను." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు -"అహింస చాలా గొప్పధర్మం. అహింస చాలా గొప్ప సుఖం. ధర్మశాస్త్రాలు, అహింసను పరమపదంగా చెప్తున్నాయి. దేవీ! దేవతల్ని అతిథుల్ని పూజించడం, ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించటం, వేదాధ్యయనం, యజ్ఞాలు, తపస్సు, దానం ఇంద్రియ నిగ్రహం, ఆచార్యుల్ని, గురువుల్ని సేవించటం, తీర్థయాత్రలు చెయ్యటం, ఇవన్నీ అహింసా వ్రతంలో పదహారవ వంతుకు కొరగావు. ఇది పరమరహస్యం. అమూల్య విషయం. దీన్ని నీకు చెప్పాను. పంచేంద్రియాల్ని నిరోధించగల్గినవాడు సుఖపడతాడు. ఇంద్రియ నిగ్రహం, దానం, దమం, వీటి నాచరించిన మానవుడు, కోరుకొన్న వాటిని పొందుతాడు. వీయే విషయాలవల్ల హింస ఎక్కువవుతుందో, వాటిని దూరంగా ఉంచాలి. మద్యమాంసాలకు దూరంగా ఉంటే హింసను తగ్గించుకోవచ్చు. నివృత్తి గొప్ప ధర్మం. నివృత్తి గొప్ప సుఖం. అన్ని విషయాలనుండి మనస్సును మరలించినవారు గొప్ప ధర్మాన్ని పొందుతారు. ధర్మాధర్మాలన్నీ మొదట మనస్సులో పుట్టేవే. అందులో సందేహం లేదు. మానవుడు మనస్సు చేతే బంధింపబడతాడు. దానిచేతే విడిపింపబడతాడు. మనస్సును నిగ్రహిస్తే

స్వర్గం, మనస్సును విచ్చలవిడిగా వదిలితే అదే నరకం. ఇది నిశ్చయం. జీవులు పూర్వం తాము చేసిన శుభాశుభకర్మల ఫలితంగానే పశుపక్షి, సర్ప క్రిమికీటకాది జన్మలను పొందుతారు. జీవుడు పుట్టడానికి ముందే మృత్యువు పుట్టి ఉంటుంది. జీవి అనుభవించే సుఖమూ, దుఃఖమూ పూర్వం చేసిన కర్మల ఫలితాలే. జీవులెంత ప్రమత్తతలో నున్నా విధిమాత్రం జాగరూకతతో ఉంటుంది. విధికి ప్రియుడు కానీ, ద్వేష్యుడు కాని, మధ్యముడు కాని ఉండడు. కాలుడు అన్ని జీవుల పట్ల సమానంగా వ్యవహరిస్తాడు. అతడు ఆ జీవి కాలపరిమితి కోసం నిరీక్షిస్తాడు. ఏ జీవి ఆయువు ముగిస్తే ఆ జీవియొక్క జీవాన్ని ఎత్తుకొని పోతాడు."

శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు "ప్రియా! విద్య, వార్త, సేవ, శిల్పకళ, నాట్యం ఈ అయిదు మానవులు జీవించటానికి మార్గాలుగా చెప్పబడ్డాయి. దేవీ ! జనులందరికీ విద్యలను నేర్పటం మొట్టమొదటి విధి విద్య వల్ల ఏది చెయ్యాలో, ఏది కూడదో తెలుస్తుంది మరొక మార్గం లేదు. విద్యవల్ల జ్ఞానం వృద్ధి పొందుతుంది జ్ఞానంవల్ల యధార్థం తెలుస్తుంది. తత్త్వమెరిగినవాడు వినయశాలియై సమస్త ప్రయోజనాలు పొందగల్గుతాడు. విద్యలను నేర్చి వినయాన్నలవర్చుకొన్నవాడు లోకంలో సుఖంగా జీవిస్తాడు. కనుక ప్రతిమానవుడు ముందుగా విద్యలను నేర్వాలి తర్వాత జితేంద్రియుడై క్రోధాన్ని జయించి పరమాత్మను గుర్తించాలి. పరమాత్మను గూర్చి చింతించేవాడు లోకంలో సత్పురుషులకు కూడా పూజ్యుడవుతాడు. దానికోసం ముందు కులానుగుణమైన శుభాచారాలను పాటించాలి. ఒకవేళ విద్యద్వారా జీవనాన్ని సంపాదించుకోవాలని భావిస్తే రాజవిద్యలను గాని, లోక విద్యలను గాని నేర్వాలి. గురుశుశ్రూష మొదలైన మార్గాలనవలంబించాలి. గ్రంధాలను చదవటం ద్వారా అర్థాన్ని పరిశీలించటం ద్వారా నేర్చుకొన్నవానిని దృఢపరచుకోవాలి. దేవి! ఈ విధంగా విద్యలను నేర్వడం వల్లనే నరుడు సత్ఫలితాల్ని పొందుతాడు. వేరు మార్గం లేదు. న్యాయమార్గంలోనే విద్యలవల్ల ఫలితాలను పొందాలి. అధర్మాన్ని విడిచిపెట్టాలి వ్యవసాయం ద్వారా జీవికను పొందాలని భావిస్తే శాస్త్రీయంగా నీటి వసతి కల భూమిలో పంటలను పండించే విధంగా కృషి చెయ్యాలి. కాలాన్ననుసరించి, దేశాన్ననుసరించి వాణిజ్యం చెయ్యవలసి ఉంటుంది. వస్తువు ఖరీదు, లాభం, దానికి చెయ్యవలసిన శ్రమ ఆదాయ వ్యయాలు బాగా ఆలోచించుకోవాలి దేశంలోనివారు పశువుల పెంపకాన్ని వృత్తిగా స్వీకరించవచ్చు. పశువులు వాటి పెంపక విధానాలు అనేకరకాలుగా ఉంటాయి. వాటిని బాగా పరిశీలించాలి.

సేవను వృత్తిగా స్వీకరింపదలచిన బుద్ధిమంతుడు, మనస్సును నిగ్రహించుకొని, చెవికింపుగా మాట్లాడటం నేర్వాలి. ప్రభువు ఏమి చేస్తే సంతోషిస్తాడో, ఆయా పనులద్వారా అతడిని సంతోషపెట్టాలి. సేవకుని కుండవలసిన గుణాల్ని అలవర్చుకొని ప్రభువుకు ఆశ్రితునిగా పరిగణింపబడాలి. ప్రభువుకు ఎన్నడూ అపకారం చెయ్యకూడదు. అతడి నుండి విడిపడక పూర్వం, మరొక లక్ష్యాన్ని గూర్చి ఆలోచించకూడదు సేవ యొక్క స్వరూపం ఇలా ఉంటుంది. శిల్పకర్మ, నాట్యం తరచుగా నిమ్నజాతుల వారిచే వృత్తులుగా స్వీకరింపబడుతుంటాయి ఆ రెంటియందు కూడా, తాము చేసినపనికి తగ్గట్టు న్యాయంగా వేతనం స్వీకరించాలి ఋజుమార్గప్రవర్తకుల వద్ద, ఋజుమార్గంలోనే వేతనాన్ని పొందాలి. వక్రమార్గంలో వేతనాన్ని పొందితే అది పాపాన్నిస్తుంది. ఏ పనిని అవలంబించాలన్నా ముందుగా నీతి పూర్వకంగా ఆలోచించాలి. తన శక్తికి తగ్గ ఉపాయాలు, దేశకాలాలు, సాధనాలు వీటిని పరిశీలించాలి.

కారణాలు ప్రవాసాలు, ప్రక్షేపాలు ఫలితం పొందటం లాంటి విషయాలను యుక్తి పూర్వకంగా విచారించాలి. వీటన్నిటినీ పర్యాలోచించుకొనిన తరువాత దైవం అనుకూలంగా ఉన్న సమయంలో తనకు మేలని భావించిన పనిని ప్రారంభించాలి. ఈ విధంగా ఆలోచించి నిర్ణయించుకొన్న వృత్తిని ఎల్లవేళలా పరిపాలించాలి. దైవమానుష విఘ్నాలనుండి నశించకుండా చూసుకోవాలి.

వృత్తిని, రక్షించటం, పెంచటం, అనుభవించటం చేస్తూనే వినాశనాన్ని కల్గించకూడదు. పర్వతంలాంటి సంపదయినా కేవలం అనుభవిస్తుంటే హరించుకుపోతుంది. ఆయా వృత్తులనుండి ధనాన్ని పొందిన మానవుడు, దాన్ని నాల్గు విభాగాలు చెయ్యాలి. ధర్మ, అర్థ, కామాలకు, ఆపదల నుండి రక్షించుకోవటానికి, దాన్ని ఉపయోగించాలి. పార్వతీ ! నాలుగు విభాగాలకు సంబంధించిన విధానాన్ని విను. ధనంలో ఒక భాగాన్ని యజ్ఞం, అన్నదానం, దీనుల్ని ఆదుకోవటం, దేవబ్రాహ్మణపూజ, పితృపూజ, మూలరక్షణ, సత్పురుషుల నివాసానికి, నిత్యక్రియా శీలురయిన ధార్మికులు - వీటికోసం, ధర్మకార్యాలకుపయోగించాలి. ధర్మకార్యాలకు డబ్బు ఖర్చు చేసేటప్పుడు ఫలం ఎంత అని ఆలోచించరాదు. రెండవభాగాన్ని అర్థం కోసం వెచ్చించాలి. అధికార స్థానం పొందటం, రాజుకు ఇష్టుడవ్వటం, వ్యవసాయ ప్రారంభం, అమాత్య మిత్రులను సంపాదించటం, ఆమంత్రణం వివాహం, పూర్ణపురుషులకు జీవనం కల్పించటం, ఆదాయం నుండి ఆపదలనుండి రక్షించుకోవటానికి ఇలాంటి మరికొన్ని పనులకు రెండవ భాగం ధనాన్ని అర్థం కోసం వెచ్చించాలి. హేతుయుక్తమయిన అనుబంధం కోసం ధనాన్ని వెచ్చించాలి. అర్థం అనర్థాల నుండి రక్షిస్తుంది. అర్థం అర్థాన్ని సృష్టిస్తుంది. ధనరహితులు ఎన్ని ప్రయత్నాలు చేసిన ధనాన్ని పొందలేరు. కనుక ధనాన్ని చక్కగా రక్షించుకోవాలి. శాస్త్రప్రకారం దానమూ చెయ్యాలి. శరీర పోషణకోసం, ఆహారాదుల్ని సమకూర్చుకోవటానికి, ఇతర భోగాల కోసం, కామంకోసమైనా ధనాన్ని వెచ్చించాలి. పార్వతి! గుణదోషాల్ని విచారించుకొని ధర్మ అర్థ కామాలకు, ధనాన్ని వెచ్చించాలి. నాల్గవ భాగాన్ని మాత్రం ఆపత్కాలం కోసం సంరక్షించుకోవాలి. శుభప్రదా !రాజ్యభ్రంశం నుండి నివారణకు, దుర్భిక్షం కోసం, గొప్ప వ్యాధులనుండి విముక్తి కోసం, వార్ధక్యంలోని అవసరాలకు, శత్రువుల విషయంలో ప్రతీకారానికి, సాహసాలకు, కోపఫలితాలకు విదేశ యాత్రలకు, ఆపదల్లోంచి బయటపడటానికి - ఇలాంటి కారణాల కోసం నాల్గవభాగాన్ని ఎప్పుడూ సంరక్షించుకోవాలి.

లోకంలో ధనవంతులకు సుఖం లభిస్తుంది. ఆపదలు తొలగిపోతాయి. ధనం యశస్సును, ఆయుస్సును స్వర్గాన్ని సంపాదిస్తుంది. ధనమున్నవాడు ధర్మార్థకామాలను వశపర్చుకొంటాడు. ధనంవల్ల అందరూ సుఖపడతారు. ఈవిధంగా వ్యవహరించేవారు ఇహపరాల్లో మేలు పొందుతారు. శుభాచారాల్ని పాటించాలి. సకాలంలో మేల్కొనటం, పవిత్రత, దేవబ్రాహ్మణ భక్తి, గురుసేవ, బ్రాహ్మణులకు నమస్కరించటం, పెద్దలపట్ల గౌరవం చూపటం, దేవాలయాల్లో నమస్కరించటం, ఎదురేగి అతిథుల్ని పూజించటం, వృద్ధులనుండి ఉపదేశాన్ని గ్రహించటం, హితాన్ని పథ్యాన్ని తెలుసుకోవటం, అనునయ వాక్యాలు, దానం, పోషణం, వీటిచే భృత్యుల్ని సంతోషపర్చటం, అన్యాయాన్ని వదలి న్యాయమయిన పనుల్ని చెయ్యటం, తన భార్య విషయంలో సక్రమంగా ప్రవర్తించటం, తప్పులు రాకుండా చూసుకోవటం, పుత్రులకు వినయాన్ని గరపటం, ఆయా పనులు చేయించటం, అశుభకార్యాలు చెయ్యకుండా నిరోధించటం, మంచి పనులు చెయ్యటానికి ప్రోత్సహించటం, కులధర్మాల్ని ఉన్నదున్నట్లు పాటించటం, పురుష

ప్రయత్నంలో తన వంశాన్ని రక్షించుకోవటం, ఇవన్నీ శుభాచారాలుగా చెప్పబడుతున్నాయి. నిత్యం పెద్దల్ని సేవించాలి. వానివల్ల మేలు, జ్ఞానాభివృద్ధి జరుగుతుంది.

పరద్రవ్యాన్ని వారికి చెప్పకుండా తీసుకొనరాదు. ధీరుడు పరుల్ని యాచించడు. తన భుజ జలంతో సాధిస్తాడు. ఆహారం-ఆచారాల విషయంలో శ్రద్ధవహించి తన శరీరాన్ని నిరంతరం రక్షించుకోవాలి. ఆహారం హితకరమై శరీరానికి తగినదై తేలిగ్గా జీర్ణమయ్యేదిగా ఉండాలి. మితంగా భుజించాలి. దేవతలకు, అతిథులకు శాస్త్రప్రకారం పూజాదికాలు నిర్వహించి, పవిత్రుడై మిగిలిన ఆహారాన్ని భుజించాలి చెడ్డమాటల్ని పలుకరాదు. గృహస్థు అతిథులకు నివాసం, నీరు, భోజనం, ఫలహారం అన్నివిధాలా కల్పించాలి. గోపోషణ చేయాలి. మధ్యాహ్న సమయంలోగాని అర్ధరాత్రివేళ కాని, కారణం లేకున్నా, కారణమున్నాసరే బయటకు వెళ్ళటానికి నిశ్చయించుకోకూడదు. విషయాల్లో మునిగిపోకూడదు. శక్తిమేరకు ధర్మాచరణ చేయాలి. ఆదాయానికి తగిన విధంగా ఖర్చు చెయ్యటం గృహస్థునికి మంచి లక్షణంగా ప్రశంసింపబడుతున్నది. పరుల్ని పీడించటం, అపకీర్తిని కల్గిస్తుంది. ధనాన్ని నశింపచేస్తుంది. భయం వల్ల కాని, దురాశచేగాని ఎప్పుడూ ఇతరుల్ని బాధించరాదు. గుణదోషాల్ని చక్కగా బేరీజు వేసుకొని, బుద్ధిపూర్వకంగా పరిశీలించి, శుభకర్మను గాని అశుభ కర్మనుగాని ప్రారంభించాలి. తాను చేసిన మంచి చెడ్డలను అంతరాత్మసాక్షిగా పర్యాలోచించుకోవాలి. మనోవాక్కాయ కర్మలతో ఎన్నడూ పాతకం చెయ్యకూడదు.

ఉమ అన్నది. "మనుష్యుల్లో కొందరు గొప్పవాళ్ళు, కష్టాలకు గురికానివారు ఉంటారు. వారు వివిధ భోగాల్ని అనుభవిస్తారు. వారికి ఏ ఉపద్రవాలూ రావు. మరికొందరు కష్టాలనుభవిస్తారు. దరిద్రులు భోగరహితులుగా ఉంటారు. ఎందువల్ల మనుష్యులందరూ సమానంగా సృజింపబడలేదు? మహాదేవా ! ఈ విషయం తెలుసుకోవాలని, నాకు గొప్ప కుతూహలంగా ఉంది." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "జీవుడు ఏ కర్మ చేస్తాడో దానికి తగిన ఫలితాన్ని పొందుతాడు. ఎవడైనా తాను చేసిన కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. ఆ ఫలాన్ని మరొకరు అనుభవించరు. శుభనయనా! కొందరు ధర్మకామాలకు దూరమై, లుబ్ధులై, దయాశూన్యులై, స్వార్థం మీదనే ఆసక్తితో జీవిస్తారు. వారు మరణానంతరం, మరోజన్మలో దరిద్రులుగా పుట్టి కష్టాలననుభవిస్తారు. సంశయం లేదు." పార్వతి అన్నది. "మనుష్యులు కొందరు సంపన్నులుగా ఉంటారు. ధనధాన్యాలు సమృద్ధిగా ఉంటాయి. అన్ని భోగాలు ఉన్నా వారే భోగాన్ని అనుభవించలేదు. ఎందువల్ల ఈ విధంగా జరుగుతుందో నాకు చెప్పవలసింది." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "శుభురాలా! కొందరికి ధర్మంమీద శ్రద్ధ ఉండదు. పరుల బలవంతం మీద ధర్మకార్యాలు చేస్తారు. మళ్ళీ శోకిస్తారు. అటువంటివారు చనిపోయాక తిరిగి పుడతారు. వారు సంపదల్ని పొందుతారు, వృద్ధి చేస్తారు. నిధిపాలకులవలె రక్షిస్తారు. వాటిని అనుభవించటం మాత్రం కుదరదు."

ఉమ అన్నది. "మహేశ్వరా ! మరికొందరు నరులు డబ్బులేనివారు అయినా భోగాలు అనుభవిస్తారు. ఇలా ఎందుకు జరుగుతుందో చెప్పవలసింది." శ్రీ మహేశ్వరుడన్నాడు. "ధనరహితులయినప్పటికీ నిత్యం దానధర్మాలు చెయ్యాలని తహతహలాడే మానవులు చనిపోయాక, మళ్ళీ జన్మను పొందినప్పుడు ధనవిహీనులైనా నరే భోగాల్ని అనుభవించగల్గుతారు. కనుక ధర్మాన్నిగూర్చి

దానాన్ని గూర్చి ఎప్పుడూ ఉపదేశించాలి. అని పండితులు నిశ్చయించారు. దేవి! నీకు చెప్పవలసిన విషయాలన్నీ చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు."

ఉమ అన్నది "దేవా ! మనుష్యులు మూడు విధాలుగా కన్పిస్తున్నారు. కొందరు కూర్చొనే ఉంటారు. అనాయాసంగా గొప్ప స్థానాల్ని అధికారాల్ని భోగాల్ని పొందుతారు. మరికొందరు విశేష ప్రయత్నం చేస్తేగాని సుఖభోగాల్ని పొందలేరు. మరికొందరు ఎంత ప్రయత్నించినా దేన్నీ పొందలేరు ఏ కర్మ చేస్తే ఇలాంటి ఫలితాలు వస్తాయో నాకు దయతో చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "నీవు న్యాయమైన విషయాల్ని వినాలనుకొంటున్నావు. లోకంలో కొందరు దానధర్మ పరాయణులై యోగ్యతల నెరిగి, దూరంగా ఉన్న వారి అవసరాల్ని అయినా అంచనా వేసి శాస్త్రప్రకారంగా వారిని, సమీపించి వారికి కావలసిన దాన్ని అనునయ పూర్వకంగా సమర్పిస్తారు. వారు చేష్టలమాత్రం చేతనే అవసరాల్లో ఉన్నవారిని గ్రహిస్తారు. తెలియకపోయినా దానం చేస్తారు. అటువంటి ధన్యులు మళ్ళీ జన్మల్లో అప్రయత్నంగానే ఐశ్వర్య సుఖభోగాల్ని పొందుతారు. మరికొందరు యాచకులు యాచించినప్పుడు దానం చేస్తారు. మళ్ళీ ఎవరైనా యాచిస్తేనే దానం చేస్తూ ఉంటారు. ఇటువంటివారు మరు జన్మలో కొంత ప్రయత్నం చేశాక, వారి దానఫలంగా సుఖభోగాల్ని పొందుతారు. కొందరు ఎవరెంతగా యాచించినా చిల్లిగవ్వ ఇవ్వరు. వీరు దురాశాపరులు అసూయా గ్రస్తులు. వీరు మళ్ళీజన్మలో ఎంత ప్రయత్నించినా బహువిధోపాయాల్ని అవలంబించినా దేనినీ సాధించలేరు. విత్తువేయకుండా పంటరాదు. దాన ఫలం కూడా అలాంటిదే పురుషుడు దేన్ని దేన్ని దానం చేస్తాడో దానికి అనుగుణమయిన ఫలాన్ని పొందుతాడు. నీకు చెప్పవలసినదంతా చెప్పాను. ఇంకా నీవేమి వినగోరుతున్నావు?"

ఉమ అన్నది. "కొందరు ముసలి వాళ్ళవుతారు. అనుభవించే శక్తి సామర్థ్యాలుండవు. అప్పుడు భోగాల్ని ధనాన్ని పొందుతారు. వీరికి వార్ధక్యంలో ఎక్కడో ఒక్కచోట నుండి సుఖభోగాలు ప్రాప్తిస్తాయి. ఏ విధమయిన కర్మల్ని చేయటం వల్ల ఇటువంటి స్థితి వస్తుంది? దీన్ని తమరు చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "ఆహా మంచి ప్రశ్న. శ్రద్ధగా విను తత్వాన్ని చెప్తాను. వీరు ధనం కలిగి ఉండి చాలాకాలం పాటు ధర్మకార్యాల్ని విస్మరిస్తారు. ప్రాణాలు పోయే సమయం వచ్చినప్పుడు వ్యాధిపీడితులై దానధర్మాలు చేస్తారు. అటువంటివారు మరుజన్మలో దుఃఖాల్లో మునిగిపోతారు. యౌవనదశ గడిచాక, వార్ధక్యం, వచ్చాక, పూర్వం చేసిన దానధర్మాలు ఫలితాలు వీరు పొందుతారు. శుభలక్షణా! ఈ ధర్మఫలం కూడా చేసిన కాలానికి అనుగుణంగా ఉంటుంది."

ఉమ అన్నది. "మహాదేవా! కొందరు మానవులు భోగయుక్తులు. కాని వ్యాధులతో బాధపడుతుంటారు. వారికున్న భోగాల్ని వారనుభవించలేరు. ఎందుకిలా జరుగుతుంది?' శ్రీమహేశ్వరుడన్నాడు. "వ్యాధులచే బాధలు పొందిన మానవులు, తామింక బ్రతకమని భావించి, అప్పుడు దానధర్మాలు చెయ్యటం ప్రారంభిస్తారు. శుభలక్షణా! వారు మరుజన్మలో దానఫలాన్ని పొందుతారు. కాని వాటిని అనుభవించలేరు. శుభులారా! వారు రోగ పీడితులవుతారు."

ఉమ అన్నది. "కొందరు మానవులు గొప్ప సౌందర్యవంతులు. శుభలక్షణాలున్నవారు. అందరికీ చూడాలన్పించే విధంగా ఉంటారు. వారిలా జన్మించటానికి కారణం ఏమిటి ? నాకు చెప్పండి. శ్రీమహేశ్వరుడన్నాడు - దేవీ ! ఎంత బాగా అడిగావు. చెప్తాను శ్రద్ధగావిను. పూర్వం ఏ

మానవులు సిగ్గుపడుతుంటారో, తియ్యగా మాట్లాడుతారో. సమర్థులయినా స్వభావరీత్యా తియ్యగా వ్యవహరిస్తారో. సమస్త ప్రాణులపట్ల దయగల్గి మాంసభోజనం వర్జిస్తారో. ధర్మంకోసం, వస్త్రాల్ని ఆలంకారాల్ని దానం చేస్తారో, భూమిని పరిశుభ్రం చేస్తారో, ఏదో కారణంతో అగ్నిని పూజిస్తారో, అటువంటి నరులు, మరుజన్మలో గొప్ప సౌందర్యశాలులుగా పుడతారనటంలో సందేహం లేదు.

ఉమ ఇలా అన్నది - "మనుష్యుల్లో కొందరు వికృత రూపంలో కన్పిస్తున్నారు. దీనికి ఏ రకమైన కర్మపరిపాకం కారణం అవుతుందో చెప్పండి" శ్రీమహేశ్వరుడిలా అన్నాడు - "కళ్యాణి! నీవడిగిన ప్రశ్నకు సమాధానం చెప్తాను విను. పూర్వం ఏ మానవులు సౌందర్యశాలులై గర్వంతో అహంకారంతో అందంగా లేని వారిని చూసి, వ్యంగ్యంగా స్తుతిస్తూ, నిందిస్తూ, అపహాస్యం చేశారో, పరుల్ని బాధపెట్టారో, మాంసాహారాన్ని సేవించారో, అసూయా పరులయ్యారో, అపవిత్రులుగా ఉన్నారో, అటువంటివారు యమలోకంలో తగిన విధంగా శిక్షింపబడతారు. తరువాత ఎలాగో మనుష్యరూపం పొందగల్గినా, వారు వికృత రూపులుగా జన్మిస్తారు. ఇందులో సందేహం ఎంతమాత్రం లేదు."

ఉమ ఇలా అన్నది. "భగవన్! కొందరు మనుష్యులు అదృష్టవంతులవుతారు. అందం, భోగానుభవం వారికి లేకపోయినా వారు ప్రమదాప్రియులుగా ఉంటారు. ఏ రకమైన కర్మలు చేస్తేవారు ఇలాంటి ఫలితాన్ని పొందుతారు?" శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. - "దేవి! ఏ మానవులు పూర్వం మృదుశీలం కల్గిఉంటారో, తియ్యగా మాట్లాడుతారో, తన భార్యయందే తృప్తిని పొందుతారో, భార్యలందరి యందు సమభావాన్ని ప్రదర్శిస్తారో, ప్రియులుకాని భార్యలపట్ల కూడా, సమానంగా అనురాగాన్ని చూపిస్తారో, అందచందాలు మొదలయినవి లేకపోయినా నిరాదరించరో, సమయంలో అన్నపానీయాల్ని తియ్యనివాటిని ఇస్తారో, తమ భార్యలపట్ల మాత్రమే అనురాగాన్ని చూపించే వ్రతాన్ని చేస్తారో, ధైర్యవంతులుగాను, దుఃఖరహితులుగాను ఉంటారో, అటువంటి మానవులు, సౌందర్యవంతులవుతారు. ధనంలేకపోయినా దేవి! వారు స్త్రీలకు ఇష్టమయిన వారుగా ఉంటారు.

ఉమ ఇలా అన్నది - "కొందరు మానవులు శ్రేష్ఠులయినా భోగాలున్నవారయినా కురూపులుగా ఉంటారు. ఎటువంటి కర్మలఫలితంగా వారు ఇలా పుడతారో చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. దేవీ! నీవడిగినదాన్ని చెప్తాను. శ్రద్ధగా విను ఏ మానవులు పూర్వజన్మలో తన భార్యలపట్ల ఆసక్తిని చూపకుండా, స్వేచ్ఛగా సంచరిస్తారో. సిగ్గు మర్యాదాలేకుండా ప్రవర్తిస్తారో, మనోవాక్కాయకర్మల ద్వారా ఇతరుల్ని ద్వేషిస్తారో, అప్రియం చేస్తారో, ఇంటిపట్టున ఉండకుండా, అన్నాదులను స్వీకరించకుండా స్త్రీలకు మనోవేదనను కల్గిస్తారో, ఇలాంటి నరులు, మళ్ళీ జన్మించినపుడు కురూపులుగా పుడతారు. స్త్రీల మనసుల్లో ద్వేష్యులుగా ఉంటారు. వారికి తమ భార్యలతో కూడా సంసార సుఖం ఎంతమాత్రం ఉండదు."

ఉమ ఇలా అన్నది. "దేవదేవేశా! మనుష్యుల్లో కొందరు, జ్ఞాన విజ్ఞానాలు కల్గి ఉంటారు. బుద్ధిమంతులు వివేకం కల్గినవారవుతారు. వారు శాస్త్రప్రకారం పలుప్రయత్నాలు చేసినా, దురదృష్టవంతులుగానే ఉండిపోతారు. ఎలాంటి కర్మలు చెయ్యటం వల్ల, వారీవిధమయిన స్థితిని పొందుతారో చెప్పండి" మహేశ్వరుడిలా అన్నాడు. "కళ్యాణి! దీనికి కారణం చెప్తాను విను. పూర్వజన్మలో పండితులయినప్పటికీ ఎవరికీ ఆశ్రయం ఇవ్వకుండా అన్నాదులను సమర్పించకుండా, కేవలం తమ

పొట్ట నింపుకొనేవారు మళ్ళీ జన్మించినప్పుడు జ్ఞానం, బుద్ధి, కల్గినవారయినా ఏమీ లేనివారిగానే మిగిలిపోతారు. ఎందువల్లనంటే విత్తనం వెయ్యకపోతే మొలకరాదు కదా!"

ఉమ ఇలా అన్నది. "లోకంలో కొందరు మానవులు పరమమూర్ఖులవుతారు. చైతన్యం జ్ఞానం విజ్ఞానం వీరికుండవు. అయినా అన్నివిధాలుగా సమృద్ధిని కల్గి ఉంటారు. ఎలాంటి కర్మల ఫలితంగా ఈ విధమయిన ఫలితం వీర్పడుతుందో చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! పూర్వజన్మలో మూర్ఖులయినప్పటికీ, దీనుల్ని అనుగ్రహిస్తూ దానాల్ని చేస్తారో, ఏదో ఒక కారణంగా బుద్ధిలేకపోయినా దానం చేస్తూనే ఉన్నా మానవులు మరుజన్మలో కూడా దానఫలితాన్ని పొందుతారు. పండితుడయినా, మూర్ఖుడయినా దానం చేస్తే దాని ఫలాన్ని తప్పక పొందుతాడు. బుద్ధిపూర్వకంగానే దానం చెయ్యనక్కరలేదు. దానం ఎలా చేసినా, దాని ఫలితం తప్పక వస్తుంది."

ఉమ ఇలా అన్నది. "దేవదేవేశ ! కొందరు మానవులు మేధావులుగా ఉంటారు. వేదాన్ని వల్లిస్తారు. చక్కగా మాట్లాడతారు. వారు ఏం పుణ్యం చేస్తే ఈ విధమైన స్థితిని పొందుతారో చెప్పండి. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! ఏ మానవులు పూర్వజన్మలో మిక్కిలిగా గురుసేవ చేస్తారో, జ్ఞానంకోసం యదావిధిగా వివిధ తీర్థాల్ని సేవిస్తారో, పరులను కూడా యథావిధిగా జ్ఞానవంతుల్ని చేస్తారో, జ్ఞానం ఉన్నా తమను తాము ప్రశంసించుకోరో, ప్రశాంతంగా ఉంటారో, వాఙ్నియమం కల్గి ఉంటారో, ప్రయత్నపూర్వకంగా లోకంలో పాఠశాలలవంటి విద్యాసంస్థలను నిర్మిస్తారో, అటువంటివారు, మరణించాక, మళ్ళీ జన్మలో గొప్ప మేధావులుగా, పండితులుగా, చక్కగా మాట్లాడేవారుగా పుడతారు."

ఉమ ఇలా అన్నది. "దేవ! కొందరు మనుష్యులు అన్నివిధాలా ప్రయత్నం చేసినా, పాండిత్యం విజ్ఞానం బుద్ధి వాటిని పొందలేరు. ఏ కర్మ పరిపాకం వల్ల వారు ఈ విధంగా పడతారో చెప్పండి. మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! పూర్వజన్మలో ఏ మానవులు జ్ఞానంతో పాటు గర్వమూ కలిగి ఉంటారో, జ్ఞానాన్ని పొంది తమను తాము నిత్యం పొగుడుకుంటూ ఉంటారో, జ్ఞానవంతులమనే అహంకారంలో కన్ను మిన్నుకానక ప్రవర్తిస్తారో, తమకంటే జ్ఞానులనుచూసి అసూయను ప్రదర్శిస్తారో, ఇతరుల్ని సహించలేరో, అటువంటి మానవులు మరణించాక, చాలాకాలానికి మళ్ళీ జన్మలో మనుష్యులుగా పుట్టి, తెలివి లేనివారుగా ఉంటారు. వారు ప్రయత్నం చేసినా హీనమైన మేధనే కల్గి ఉంటారు.

పార్వతి ఇలా అడిగింది. "భగవంతుడా! కొందరు మనుష్యులు సమస్త శుభాలుకల్గి ఉంటారు. గుణవంతులయిన భార్యాపుత్రులు, దాసదాసీజనం, బంధువులు సకలసంపదలు, గొప్పస్థానం అధికారం అందం, రూపం, ఆరోగ్యం, బలం, కల్గి ఉంటారు. వారికి వ్యాధులు రావు. ఏ రకమయిన బాధలు ఉండవు. ధనధాన్యాలు నిండుగా ఉంటాయి. గొప్ప మేడలు, వివిధ వాహానాలు, సర్వభోగ్యవస్తువులు కల్గి ఉంటారు. ఆశ్చర్యకరమైన అందమైన వస్తువుల్ని సేకరిస్తారు. తమ బంధువులతో పాటు ప్రతిరోజూ నిర్విఘ్నంగా పరమానందాన్ననుభవిస్తారు. ఇలాంటి గొప్పస్థితిని ఎలాంటి శుభకర్మలు చేస్తే పొందగల్గుతారో సెలవియ్యండి". శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! నేనీవిషయం చెప్తాను సావధానంగా విను. ఏ నరులు పూర్వజన్మలో గొప్పవారయినా కాకపోయినా, పాండిత్యం సత్ప్రవర్తన కలవారో, దానం చెయ్యాలనే కోరికతో ఉంటారో పాండిత్యాన్ని అభిమానిస్తారో, పరుల మనస్సులను గ్రహిస్తారో, నిత్యం దానం చెయ్యాలనే నిశ్చయం కల్గిఉంటారో, సత్యసంధులు, సహనశీలురు, అజ్ఞానరహితులుగా ఉంటారో.

సత్పర్తత నెరిగి దానాలు చేస్తారో, వ్రతాలు, నియమాలు నెరవేరుస్తారో, పరుల దుఃఖాన్ని తమ దుఃఖంగా భావించి, పోగొట్టటానికి ప్రయత్నిస్తారో, మృదుశీలులో, సత్పవర్తన కలవారో, దేవబ్రాహ్మణుల్ని పూజిస్తారో, ఇటువంటి మానవులు మళ్ళీజన్మలో స్వర్గంలోగాని, భూలోకంలో గాని శుభకర్మఫలాన్ని అనుభవించటానికి పుడతారు. మనుష్యుల్లో పుట్టినా, నీవు చెప్పిన విధంగా గొప్పగా జన్మిస్తారు. సమస్త కళ్యాణ గుణాలు కలవారు. అన్ని భోగాలు అనుభవించేవారు అందరి వస్తువులు, బలం, ఆయువు, అధికారం, సంపద, కులం, పాండిత్యం ఇవన్నీ వీరికి లభిస్తాయి. ఇవన్నీ లభించాలంటే దానమే మార్గం. మరొకమార్గం లేదు. శుభాననా! తపస్సు దానం ఈ రెంటికీ సాటి వస్తువులేదు. సర్వం దీనివల్ల సాధింపబడుతుంది".

ఉమ యిలా అన్నది. "దేవా ! మనుష్యుల్లో కొందరు దురదృష్టవంతులు కన్పిస్తారు. అనేక కష్టాలు అనుభవిస్తారు. వారికి దానభోగాలుండవు. త్రివిధభయాలు వారిని పట్టి పీడిస్తాయి. వ్యాధి, ఆకలి భయం వీటితో అల్లల్లాడిపోతారు. చెడ్డ భార్యలవల్ల పరాభవింపబడతారు. ఎప్పుడూ విఘ్నాలే వస్తుంటాయి. ఎందువల్ల వారీ విధంగా పుడతారో చెప్పండి". శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! పూర్వజన్మలో ఏ మనుష్యులు రాక్షసభావంతో ఉంటారో, క్రోధం దురాశలతో ఉంటారో, అన్నాదులు లేనివారో, ఏ శుభకార్యం చేయరో, నాస్తికులో, దుర్మార్గులో, మూర్ఖులో, ఆత్మపరాయణులో, పరుల్ని బాధిస్తారో, ప్రాణుల పట్ల నిర్దయులుగా ఉంటారో, దేవి ఇలాంటివారు మళ్ళీ జన్మలో ఎలాగో మనుష్యులుగా పుట్టినా, దుఃఖపీడితులవుతారు. శుభురాలా! వీరు పూర్వం తాము చేసిన తప్పుడుపనుల వల్ల నీవు చెప్పినవిధంగా దురదృష్టవంతులుగా మారిపోతారు. దేవి! శుభకర్మ సుఖాన్ని, దుష్కర్మ దుఃఖాన్ని కల్గిస్తుంది. నీవడిగిందంతా చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు."

ఉమ ఇలా అన్నది. "ప్రీతివివర్ధనా ! కొంతమంది మానవులు పుట్టుగ్రుడ్డివారు, కొందరు పుట్టాక గ్రుడ్డివారవుతారు. ఏ దుష్కర్మవల్ల వారీస్థితిని పొందుతారో చెప్పండి". శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "ఏ మానవులు పూర్వజన్మలో కామంకోసం పరుల ఇళ్ళలో పడిగాపులు కాస్తారో, పరస్త్రీలను దుర్భావంతో చూస్తారో, క్రోధంతో దురాశతో ఎవరు పరులను గ్రుడ్డివారుగా చేస్తారో, రూపలక్షణాలు తెలిసినవారయినా, వాటిని తారుమారుగా ప్రదర్శిస్తారో, అలాంటి మానవులు మరణించాక, యమునిచే శిక్షింపబడతారు. చాలాకాలం నరకంలో ఉండిపోతారు. అయినా ఒకవేళ వాళ్ళు మనుష్యులుగా జన్మిస్తే పుట్టు గ్రుడ్డివారుగానో, పుట్టాక గ్రుడ్డివారుగానో అవుతారు లేదా కంటిరోగాలతో బాధల్ని పొందుతారు. ఇందులో సందేహం లేదు."

ఉమ ఇలా అన్నది. "దేవ! కొందరు మనుష్యులు ఎప్పుడూ ముఖరోగాలతో బాధపడుతుంటారు. దంతాలు, చెక్కిళ్ళు, కంఠం వీటికి సంబంధించిన వ్యాధులతో బాధపడుతారు. కొందరు పుట్టుకతోనే అలా ఉంటారు. కొందరు పుట్టాక యీ బాధలకు గురవుతారు. ఏ దుష్కర్మ వల్ల వారీవిధంగా అవుతారో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! ఎంత చక్కగా అడిగావు నేను చెప్తాను. శ్రద్ధగా విను. తమ నాలుకతో చెడ్డమాటల్ని, కఠినమయిన మాటల్ని పలికేవారు, అసత్యం, పరుషం, తీవ్రం, భయంకరం అయిన మాటల్ని గురువులతోను, పరులతోను పలికి బాధ కలిగించేవారు. తరచుగా అసత్యాన్ని పలికేవారు, లేదా అవసరమయినప్పుడల్లా అబద్దాలాడేవారు, నాలుక చుట్టుప్రక్కల

వీర్యడే రోగాలవల్ల బాధలు పొందుతారు. ఎప్పుడూ చెడునే వింటూ ప్రక్క వారి చెవులను బాధించేవారు మరుజన్మలో చెవికి సంబంధించిన రోగాలపాలవుతారు. అదేవిధంగా దంతరోగాలు, శిరోరోగాలు, కర్ణరోగాలు ఆయాదుష్కార్యల వల్ల వస్తుంటాయి. ఇతరమైన ముఖసంబంధమయిన రోగాలన్నిటికీ పూర్వజన్మలో చేసిన చెడ్డపనులే కారణం. వాటి ఫలితమే ఈ రోగాలు".

ఉమ ఇలా అన్నది. "దేవా! మనుష్యుల్లో కొందరు ఉదరసంబంధమైన రోగాలతో బాధపడుతుంటారు. తీవ్రమయిన ఉదర శూలలతో బాధపడుతుంటారు. ఏ దుష్కర్మలకారణంగా ఇలాంటి స్థితి వస్తుందో చెప్పండి. శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "దేవీ! పూర్వజన్మలో ఏ మానవులు కామక్రోధాలకు వశులై తమకోసం మాత్రమే వండుకొని తింటారో, ఎవరికీ పెట్టరో, తినకూడని ఆహారపదార్థాన్ని దానం చేస్తారో, నమ్మినవారికి విషప్రయోగం చేస్తారో, పనికిరాని తినుబండారాల్ని దానం చేస్తారో, పవిత్రంగా ఉండరో, శుభకార్యాలు చేయరో, అటువంటి మానవులు అతికష్టం మీద మనుష్యజన్మను పొందినప్పటికీ వ్యాధులచేత పీడింపబడతారు. పూర్వంచేసిన ఆయా దుష్కర్మల కారణంగా వ్యాధులతో దుఃఖాలతో బాధపడతారు పూర్వం వారు పెట్టిన బాధలనే తిరిగి వారు అనుభవించాల్సి వస్తుంది.

ఉమ ఇలా అన్నది. "దేవా! కొంతమంది మానవులు మర్మావయవ రోగాలతో బాధపడుతుంటారు. అశ్మరీ శర్కరాది వ్యాధులననుభవిస్తారు. ఏదుష్కర్మల కారణంగా వారావిధమైన బాధలనుభవిస్తారో చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "దేవీ! పూర్వజన్మలో ఏ నరులు పరుల భార్యలను హింసిస్తారో, కామంలో యథేచ్ఛగా నానా పశువులతో రమిస్తారో, కామంలో కళ్ళుమూసుకొనిపోయి కన్యలను, విధవలను బలాత్కరిస్తారో, అందం ఉన్నా నన్న గర్వంతో దుర్మార్గంగా ప్రవర్తిస్తారో, అటువంటి వారు, మర్మాంగ రోగాలతో మరుజన్మలో బాధపడతారు. ప్రియా, వారు తీవ్రమైన మేహనవ్యాధులతో దుఃఖిస్తారు."

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! కొందరు మానవులు బక్కచిక్కి ఉంటారు. ఏ దుష్కర్మలవల్ల వారీవిధంగా జన్మిస్తారో చెప్పండి". శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! పూర్వజన్మలో ఏ మానవులు మాంసలుబ్ధులో, భోగలోలుపులో, తమకోసం మాత్రమే తియ్యని పదార్థాల్ని సేకరిస్తారో, పరుల్ని బాధిస్తారో, పరుల భోగాల్ని నాశనం చేస్తారో, పరులనుభవించే భోగాలపట్ల అసూయ చెందుతారో అటువంటివారు, మళ్ళీజన్మనెత్తినప్పుడు ఎండిపోయే వ్యాధితో బాధపడతారు. బక్కచిక్కిపోతారు. వారు తమ పాపకర్మల ఫలితాలన్నిటినీ తప్పక అనుభవిస్తారు."

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! కొందరు మానవులు కుష్ఠురోగంతో బాధలను అనుభవిస్తారు. ఏ కర్మఫలితంగా వారీవిధంగా అవుతారో చెప్పండి. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! ఏ మానవులు పూర్వజన్మలో పరుల రూపాన్ని నశింపచేస్తారో, కొట్టడం, చంపడం, బంధించటం, అనవసరంగా శిక్షించటం. వంటి పనులు చేస్తారో, అజ్ఞానంతో నిండినవారై పరుల ఇష్టాల్ని నాశనం చేస్తారో, పథ్యంకాని ఆహారాన్ని దానం చేస్తారో, దుర్మార్గులయిన చికిత్సకులుగా ఉంటారో, ద్వేషంతోను, దురాశతోను కూడినవారై నిర్దయులుగా ప్రాణుల్ని హింసిస్తారో, అశుద్ధ పదార్థాన్ని దానం చేస్తారో, పరుల మనస్సుల్ని బాధిస్తారో, అటువంటి మానవులు ఒక వేళ మనుష్యులుగా జన్మిస్తే దుఃఖం

అనుభవిస్తారు. కష్టాలు పడతారు. వివిధములైన కుష్ఠురోగాలతోను, కొందరు చర్మరోగాలతోను, కొందరు గాయాలతో కూడిన కుష్ఠురోగాలతోను, మచ్చల కుష్ఠురోగాలతోను, రకరకాల కుష్ఠురోగాలతోను, బాధల్ని అనుభవిస్తారు. దేవి, **ఎవరు ఏవిధమయిన దుష్కర్మను చేస్తారో వారు ఆ విధమయిన దుష్కర్మ ఫలితాన్ని తప్పక అనుభవించి తీరుతారు.."**

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! మనుష్యుల్లో కొందరు అవయవలోపం కల్గిన వారుగా వికలాంగులుగా ఉంటారు. ఏ దుష్కర్మవల్ల ఈ విధమయిన స్థితి వస్తుందో చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు "దేవి! ఏ మనుష్యులు పూర్వజన్మలో దురాశతోను అజ్ఞానంతోను కూడినవారై, ప్రాణిహింస చేస్తారో, ప్రాణుల శరీరావయవాల్ని ఆయుధంతో పెకిలించివేస్తారో, ఇతరుల ఇష్టాల్ని నాశనం చేస్తారో, అటువంటి మానవులు మళ్ళీ జన్మించినప్పుడు అవయవ హీనులుగానే జన్మిస్తారు. పుట్టుకతోనే వికలాంగులు కాని, పుట్టాక వికలాంగులవటం గాని జరుగుతుంది."

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! కొందరు మానవులు కణుతులతోను బోదకాళ్ళతోను జన్మించి దుఃఖం అనుభవిస్తారు. దీన్నిగూర్చి నాకు చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! పూర్వజన్మలో ఏ మానవులు నరుల గ్రంధులను నరికేస్తారో, పిడి గుద్దులతో పరుషంగా వ్యవహరిస్తారో, నీచులుగాను, పాపపు పనులు చేసేవారుగాను ఉంటారో శరీరాన్ని చీల్చి చెండాడుతారో, శూలాలతో, హింసిస్తారో, అటువంటివారు మళ్ళీ జన్మించినప్పుడు కణుతులతోను బోదకాళ్ళతోను పుడతారు. మిక్కిలిగా దుఃఖిస్తారు. బాధల్ని అనుభవిస్తారు "

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! మనుష్యుల్లో కొందరు కాళ్ళకు సంబంధించిన రోగాలతో బాధపడుతుంటారు వారు ఎందువల్ల అటువంటి బాధల్ని అనుభవిస్తారో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవి! ఏ మానవులు పూర్వజన్మలో క్రోధంతోను, దురాశతోను కూడి ఉంటారో, లేదా దేవతస్థానాలను పాదాలతో తన్నుతారో, మోకాళ్ళతోను, మడమలతోను ప్రాణుల్ని హింసిస్తారో, అటువంటివారు మళ్ళీజన్మించినప్పుడు శ్లీపదాది పాదరోగాలతో జన్మిస్తారు. పలువిధాలుగా బాధపడతారు.

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! చాలామంది మానవులు ఈ లోకంలో, వాతరోగాలతో, పిత్త రోగాలతో, సంనిపాత రోగాలతో, రకరకాల రోగాలతో ఏకకాలంలో బాధల్ని అనుభవిస్తుంటారు. మిక్కిలి దుఃఖితులుగా ఉంటారు. ధనవంతులు కావచ్చు దరిద్రులు కావచ్చు సైన రోగాలన్నీ కాని, కొన్ని కాని ఉండి బాధలననుభవించటానికి ఎటువంటి కర్మలు కారణమవుతాయో చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "కల్యాణి! నీకు నేను కారణం చెప్తాను విను. జన్మలో రాక్షస భావంతో ప్రవర్తిస్తూ స్వచ్ఛందంగా వ్యవహరిస్తూ కోపంగా ఉంటూ, గురువుల్ని ద్వేషిస్తూ, మనోవాక్కాయ కర్మలతో పరులకు దుఃఖాన్ని కల్గిస్తూ, కొయ్యటం, నరకటం, హింసించటంలాంటి పనులు చేస్తూ నిర్దయగా ప్రవర్తించినవారు మరుసటి జన్మలో ఒకవేళ మానవులుగా పుడితే సై చెప్పిన రోగాలతో బాధల్ని అనుభవిస్తారు. ప్రియా! ఈ లోకంలో వారు బహువిధ రోగాలతో బాధపడ్తారు. కొందరు వమన రోగంతోను, కొందరు కాసరోగంతోను, కొందరు జ్వరాలతోను, మరికొందరు, అతిసారంతోను, కొందరు కోరికలతోను, కొందరు పాదరోగాలతోను, కొందరు శ్లేష్మదోషాలతోను, వ్రణకుష్ఠ, భగందరాది రోగాలతోను బాధపడతారు. గొప్పవారయినా, దరిద్రులు అయినా రోగాలబారిన పడక తప్పదు. ఈ

విధంగా వారు పూర్వజన్మలో తాము చేసిన కర్మల ఫలితాన్ని ఆయా ప్రదేశాల్లో అనుభవిస్తారు. ఎవరూ కూడా తాను చేయని కర్మకు ఫలితాన్ని అనుభవించటం జరుగదు. దేవి! నీకు ఈ విషయంలో చెప్పవలసిందంతా చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు."

ఉమ ఇలా అన్నది. "భూతపాల! నీకు నమస్కారం కొందరు మానవులు పొట్టివారు, కొందరు తీవ్రమైన శరీరావయవాలతో ఉంటారు. కొందరు గూనివారు, కొందరు మరుగుజ్జువారు కొందరు చేతుల్లో లోపాలున్నవారుగా కన్పిస్తారు. ఎలాంటి కర్మల ఫలితంగా వారు ఈ విధంగా అవుతారో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! పూర్వజన్మలో దురాశ అజ్ఞానం కారణంగా కొనటం అమ్మటం చేసేటప్పుడు కొలతపాత్రలను తారుమారు చేసినవారు కాటాలలో తూచేటప్పుడు పరులను నష్టపరిచేవిధంగా సగం బరువుతో వస్తువునివ్వటం వగైరా పనులు చేసినవారు, కోపంతో పరుల అవయవాల్ని నాశనం చేసినవారు మాంసాహారులుగా ఉంటూ మూర్ఖులై ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు భ్రమలు కల్పించినవారు మళ్ళీ జన్మలో పొట్టివారుగా, మరుగుజ్జులుగా, గూనివారుగా జన్మిస్తారు..'

ఉమ ఇలా అడిగింది. "భగవంతుడా! మనుష్యుల్లో కొందరు మనుష్యులు పిచ్చి వాళ్ళవుతారు. కొందరు పిశాచా లవుతారు. ఎటు పడితే అటు తిరుగుతుంటారు. ఏ కర్మఫలంగా వీరిలా పుడతారో చెప్పండి." శ్రీమహేశ్వరుడన్నాడు. "దేవి! పూర్వజన్మలో ఏ మానవులు గర్వంతోను అహంకారంతోను ప్రవర్తిస్తూ, పరుల్ని రకరకాలుగా విమర్శిస్తూ, అపహసిస్తూ, పిచ్చెక్కించే భోగాల్ని చూసి ప్రలోభపరుస్తూ, మూర్ఖత్వంతో, పెద్దలను గురువుల్ని వ్యర్థంగా అపహాస్యాలాడతూ, శాస్త్ర నిపుణులు పండితులు అయినప్పటికీ అసత్యం పలుకుతూ, బ్రతికిన వాళ్ళు పిచ్చివారు గాను పిశాచాలుగాను జన్మిస్తారనటంలో సందేహం లేదు."

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! కొందరు మానవులు సంతతిని పొందలేరు. చాలా బాధపడుతుంటారు. రకరకాలుగా ప్రయత్నించినా ఎప్పటికీ సంతతిని పొందలేరు. ఎందుకిలా జరుగుతుందో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవి! ఏ మానవులు పూర్వజన్మలో నిర్దయులుగా ఉంటారో, బాలురను పశువులను పక్షులను చంపుతారో, గురువుల్ని ద్వేషిస్తారో పరుల పిల్లల్ని చూసి అసూయపడతారో, శ్రాద్ధాదుల ద్వారా పితృపూజను ఎవరు చెయ్యరో, అటువంటి వారు, చాలాకాలం తర్వాత మనుష్యజన్మను పొందినప్పటికీ సంతతిలేనివారు అవుతారు. సంతతి ఉన్నా వారి కారణంగా శోకాన్ననుభవిస్తారు. ఇందులో సందేహం లేదు.

ఉమామహేశ్వర సంవాదము - విభిన్న మహత్త్వ విషయాల వివరణ.

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! కొందరు మనుష్యులు ఎప్పుడూ దుఃఖిస్తూ ఉంటారు. ఉద్విగ్నమైన గృహవాతావరణంలో జీవిస్తారు. ఎప్పుడూ ఉద్వేగంలో ఉంటారు. సంయమపూర్వకంగా వ్రతనియమాన్ని ఆచరించినా నిత్యం శోకిస్తూనే ఉంటారు. దరిద్రులవుతారు. ఎందుకిలా జరుగుతుందో చెప్పండి." శ్రీమహేశ్వరుడన్నాడు. దేవి! పూర్వజన్మలో ఎవరు లంచంకోసం నిత్యం పరుల్ని పీడిస్తారో, పరుల మనస్సుల్ని గాయపరుస్తారో, యదేచ్ఛగా దరిద్రులు తీసుకొన్న ఋణాల్ని ఆక్రమంగా పెంచివేస్తారో,

ఎవరు కుక్కలతో విహరిస్తూ అరణ్యంలో మృగాల్ని నిరంతరం భయపెడతారో, ఎవరి ఇళ్ళల్లో కుక్కలు ఇంటికొచ్చిన మనుష్యుల్ని భయానికి గురి చేస్తాయో, అటువంటివారు చనిపోయాక యమునిచే శిక్షింపబడతారు. ప్రియా! వీరు నరకంలోనే బహుకాలం ఉంటారు. అతికష్టంమీద మనుష్యులుగా జన్మించినా దుఃఖితులవుతారు. చెడ్డ ప్రదేశంలో, దుఃఖాలకు నిలయమయిన చోట, అనేక ప్రమాదాలకు నెలవైన చోట పుడతారు. అక్కడ శోకిస్తారు. అన్నివైపులనుండి భయాన్ని శంకిస్తారు. మనస్సులో ఉద్వేగంతో జీవిస్తారు.

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! కొందరు మానవులు క్లీబులు. నపుంసకులు, వేడివారిగా జన్మిస్తారు. నీచమైన పనులు చేస్తారు. నీచులుగా ఉంటారు. నీచ స్నేహాలు చేస్తారు. ఏ కర్మఫలంగా వారీవిధంగా జన్మిస్తారో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "కల్యాణి! నీవడిగిన దానికి కారణం చెప్తాను విను. పూర్వజన్మలో మనుష్యులయి ఉండి కూడా భయంకరమైన పనులు చేస్తూ, పశువుల పురుషత్వాన్ని నాశనం చెయ్యటమే వృత్తిగా జీవిస్తూ, అందులోనే క్రీడిస్తూ, ఉన్నవారు చనిపోయాక, యమునిచే దండింపబడతారు. ప్రియా! చాలాకాలం నరకంలోనే ఉంటారు. అటువంటివారు ఒకవేళ మనుష్యులుగా జన్మిస్తే క్లీబులుగా నపుంసకులుగా వేడివారిగా జన్మిస్తారు. పురుషుల విషయంలో లాగానే స్త్రీల విషయంలోను కర్మఫలానుభవం ఉంటుంది. దేవి! నీకీవిషయంలో చెప్పవలసినదంతా చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు.

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! కొందరు మనుష్యలోకంలో విధవలుగా ఉంటారు. వారు ఏ శుభకార్యాల్లోను పాల్గొనలేరు. ఏ దుష్కర్మ కారణంగా వారీవిధమయిన వైధవ్యాన్ని పొందుతారు. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! పూర్వ జన్మలో ఎవరయితే మోహబుద్ధి కల్గిఉంటారో, భర్తకుటుంబాన్ని వ్యర్థంగా నాశనం చేస్తారో, భర్తల విషయంలో నిర్దయగా ఉంటూ, విషాన్నివ్వటం, అగ్నిలో పడెయ్యటంలాంటివి చేస్తారో, ఏదో ఒక కారణంగా తన భర్తను ద్వేషిస్తూ పరభర్తలతో కులుకుతుంటారో, ఇటువంటి స్త్రీలు యమలోకంలో యమునిచే శిక్షింపబడతారు. చాలాకాలం నరక బాధ లనుభవించాక మనుష్యులుగా పుట్టి, ఏ భోగాలు లేని విధవలుగా జీవిస్తారు."

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! దేవదేవేశ మనుష్యుల్లో కొందరు దాస్యం చేస్తూ దాసులుగా ఉంటారు. అన్నివనుల్ని వారే చేస్తుంటారు. దెబ్బల్ని బెదిరింపుల్ని సహిస్తుంటారు అందరిచేత పీడింప బడతారు. వారు ఎందుకిలాంటి ఫలితాన్ని పొందుతారో చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "కల్యాణి! నీవడిగిన విషయాన్ని చెప్తాను విను. పూర్వజన్మలో ఏ మనుష్యులు పరుల సొత్తును అపహరిస్తారో ఇచ్చిన ఋణాన్ని ఘోరంగావెంచి చూపిస్తారో, పరులు న్యాసంగా దాచుకొన్న వస్తువుల్ని దొంగిలిస్తారో, ప్రమాదం వల్ల మరిచిపోయిన కనపడకపోయిన పరధనాన్ని అపహరిస్తారో, చంపటం, బంధించటం కష్టపెట్టడం వీటిద్వారా పరుల్ని బానిసలుగా చేసుకుంటారో, అటువంటివారు మరణానంతరం యమశాసనం చేత దండింపబడతారు. దేవి! అతికష్టంమీద వారు మనుష్యులుగా జన్మించినా, పుట్టుకతో బానిసలు అవుతారు. ఎవరి, ధనాన్ని దొంగిలించారో వారికి దాసులవుతారు. తమ పాపం పరిసమాప్తి చెందేవరకు వారు దాసులుగానే ఉంటారు. ఇది నిశ్చయం." మరికొందరు డబ్బు దొంగిలించినవారు పశువులుగా జన్మిస్తారు..పశువులుగా సేవల్ని చేయటంద్వారా వారు చేసిన

దుష్కర్మ ఫలితాన్ని వారు అనుభవిస్తారు. వారు దాస్యవిముక్తిని పొందాలంటే అన్నివిధాలా యజమానికి చక్కగా సేవ చేయాలి. తారుమారు చేసి దాస్యాన్నుంచి ముక్తిపొందినా, మరుజన్మలో మళ్ళీ దాస్యం చెయ్యక తప్పదు. దాస్యవిముక్తిని కోరేవాడు న్యాయంగా యజమానికి అన్నిసేవలూ చెయ్యాలి. యజమాని అనుగ్రహాన్ని పొందాలి. అన్ని కష్టనష్టాలను ఓర్పుతో సహించాలి. యజమాని నుండి ప్రేమతో దాస్యవిముక్తిని పొందినవాడు పవిత్రుడవుతాడు. అటువంటి దాసులను, యజమాని సర్వదా సంతోషపెట్టాలి. యజమాని దానునిచేత తగ్గపనులే చేయించాలి. సరియయిన కారణమున్నప్పుడే దండించాలి. వృద్ధులను, బాలురను, కృశించిన వారిని దాసులయినా రక్షిస్తే ధర్మఫలాన్ని పొందుతారు. దేవి! ఇంక నీవేమి వినాలనుకుంటున్నావు."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! ఈ భూమిలో రాజుచేత దండింపబడినవారు ఈ లోకంలోనే పాపాన్ని పోగొట్టుకుంటారా? లేదా ? ఈ నా సంశయాన్ని తమరు తీర్చండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! మంచి సందేహాన్ని వెలిబుచ్చావు. తత్వాన్ని చెప్తాను విను. భూలోకంలో రాజుచేత అపరాధం కారణంగా శిక్షింపబడినవారు తిరిగి యమలోకంలో శిక్షలను పొందరు. యమునిచే మళ్ళీ శిక్షింపబడరు. ఇక్కడ దండన పొందక, మిథ్యాదండనమాత్రమే పొందిన వారి విషయంలో యముడు తప్పక శిక్షను వేస్తాడు. ఎందుకంటే యముడు శిక్షివడిందా లేదా అన్న విషయం బాగా తెలిసినవాడు. శుభురాలా! పాపకర్మచేసిన మానవుడు యముని శిక్షను తప్పించుకోలేడు. రాజు యముడు వీరిద్దరూ శిక్షించటానికి సమర్థులు. ప్రియురాలా! ముల్లోకాల్లోను చేసిన కర్మల ఫలితాల్ని అనుభవించకుండా చేయగలవారు ఎవ్వరూ లేరు. ఈ విషయంలో సందేహం లేదు. నేనీ విషయంలో చెప్పవలసినదంతా చెప్పాను."

ఉమ ఇలా అంది. "పరమేశ్వరా! మనుష్యులు నిత్యం పాపాలు చేస్తూనే ఉంటారు. మళ్ళీ పాపాలు నశించటానికి ప్రాయశ్చిత్తాలు చేస్తుంటారు. అశ్వమేధం సమస్తపాపాల్ని పోగొడుతుందంటారు. మరికొన్ని ప్రాయశ్చిత్తాలకు దుష్కర్మలను నశింపచేసుకోవటానికి చేస్తారు. ఈ విషయంలో నాసందేహం తీర్చండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! సరియైన విషయంలో సందేహం వెలిబుచ్చావు. తత్వాన్ని చెప్తాను. విను. పూర్వికులయిన బుద్ధిశాలులకు కూడా ఈ సంశయం వచ్చింది. ఇది గొప్పసంశయమే." సత్పురుషులు, దుర్మార్గులు కూడా రెండు విధాలుగా పాపం చేస్తారు. కావాలని నిశ్చయించుకొని చేయటం, అనుకోకుండా చెయ్యటం అన్నవి రెండు పద్ధతులు. పట్టుదలతో నిశ్చయించుకొని పాపాన్ని చెయ్యాలని చేసినవారి దుష్కర్మకు ముల్లోకాల్లో ప్రాయశ్చిత్తం లేనేలేదు. నిశ్చయించుకొని చేసిన దుష్కర్మకు నిష్కృతి లేదు. అశ్వమేధ సహస్రాలు చేసినా, వందలాది ప్రాయశ్చిత్తాలు చేసినా దుష్కర్మ ఫలితం అనుభవించక తప్పదు. అలా కాకుండా అనుకోకుండా చేసినా, ప్రమత్తత వల్ల చేసినా అటువంటి దుష్కర్మను, ప్రాయశ్చిత్తాలు అశ్వమేధాదుల ద్వారా శ్రేయఃకర్మల వల్ల నశింపచేసుకోవచ్చు. ప్రియా! పాపకర్మల విషయంలో నేను చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం. సందేహం లేదు. నీకు చెప్పవలసిందంతా చెప్పాను. ఇంకేమి వినాలనుకొంటున్నావు?"

ఉమ ఇలా అంది. "భగవంతుడా! దేవదేవేశ మనుష్యులు ఇతర ప్రాణులు కూడా ఈ లోకంలో ఒకప్పుడు కారణంవల్ల మరొకప్పుడు కారణం కనపడకుండానే మరణాన్ని పొందుతున్నారు.

ఏ కర్మఫలం దీనికి కారణమో చెప్పండి. శ్రీ మహేశ్వరుడిలా చెప్పాడు. "దేవీ ! మనుష్యులు పూర్వజన్మలో ఇతర ప్రాణులను కారణం ఉన్నా లేకున్నా హింసించి ఉంటారు. అదే విధంగా వారు కూడా మరుజన్మలో ఆయా కారణాలవల్ల మరణించి, తాము చేసిన దుష్కర్మల ఫలితాన్ని పొందుతారు. విషమిచ్చి చంపిన హంతకులు విషంవల్లే మరణిస్తారు. ఆయుధాలతో చంపినవారు, ఆయుధాల వల్లే మరణిస్తారు. ఇది సత్యం. మరణకారణం ఈ విధంగానే ఉంటుంది. భూమిలోగాని స్వర్గంలోగాని, కర్మలు చేసి ఫలితాన్ని పొందనివాడెవ్వడూ లేడు. దేవ, దానవ మనుష్యుల్లో ఎవ్వరయినా కర్మను చేసి ఫలితాన్ని పొందకుండా ఉండటం అసాధ్యం. ఈ లోకం అంతా కర్మల మూలంగానే ఈ విధంగా మొదటినుండి ఉంటూ వస్తున్నది. కర్మల పరిణామం ఫలితాన్ని గూర్చి నేను సంగ్రహంగా చెప్పాను. నేను చెప్పని కర్మఫల విషయమేదైనా ఉంటే, దాన్ని చెప్పిన విషయాలు ఆధారంగా తర్కించుకొని తెలుసుకోనవలసి ఉంటుంది. నీవు వినాలని కోరుతున్నావు కనుక ఈ విషయాలు అన్నీ చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు?" ఉమ ఇలా అంది. "భగవంతుడా! భగదేవతా నేత్రాపహారకుడా. మనుష్యులు భూలోకంలో చేసే శుభాశుభ కర్మలన్నీ పూర్వజన్మల్లో చేసిన కర్మల ఫలితాలే అని తమరి మతంగా గ్రహించారు. లోకంలో కొందరు గ్రహనక్షత్రం కారణంగా శుభాశుభాలు జరుగుతున్నాయను కొంటారు. వాటి అనుగ్రహం కోసం ప్రయత్నిస్తుంటారు. దేవ! ఇందులో వాస్తవమెంతో తెలుసుకోవాలని ఉంది. దయతో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవీ! మంచి సందేహం వెలిబుచ్చావు. నక్షత్రాలు, గ్రహాలు మానవ జీవితంలో అనుభవించబోయే శుభాశుభాలను సూచిస్తాయి. అంతేకాని అవి శుభాశుభాన్ని స్వయంగా ఇవ్వలేవు. ఇది యథార్థమయిన తత్త్వం. ప్రజల మేలుకోసం రాబోయే శుభాశుభాలను జరిగినవాటినీ కూడా నక్షత్రగ్రహాలు సూచిస్తాయి. అందులో శుభకర్మల ఫలితాన్ని శుభగ్రహాలు సూచిస్తాయి. అశుభ కర్మల ఫలితాన్ని పాపగ్రహాలు తెలియపరుస్తాయి. అంతేగాని గ్రహనక్షత్రాలు స్వయంగా శుభాశుభాలకు కారణం కావు. ఏ ఫలితమయినా స్వకర్మలవల్ల వీర్పడేదే. గ్రహాలే చేస్తున్నాయి అన్నది ప్రవాదం మాత్రమే."

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! ప్రాణులు శుభాశుభ కర్మలను చేస్తాయి. వానిలో ముందుగా ఏ ఫలితాలను అనుభవించవలసి ఉంటుంది. శుభకర్మల ఫలితాలను మళ్ళీ జన్మలో ముందుగా అనుభవించాలా? లేక "దుష్కర్మల ఫలితాల్ని అనుభవించాలా? ఈ సందేహం తీర్చండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! మంచి సందేహం వెలిబుచ్చావు. చెప్తాను విను. కొంతమంది అశుభం ముందుగా అనుభవించాలన్నారు. మరికొందరు శుభఫలితాన్ని ముందుగా పొందుతారన్నారు. ఈ రెండు వాస్తవాలు కాదు ఇక్కడ తత్త్వాన్ని వివరిస్తాను విను. లోకంలో మానవులు శుభాన్ని అశుభాల్ని కూడా క్రమపద్ధతిలో అనుభవించటం కన్పిస్తుంది. అభివృద్ధి, నాశం, సుఖం, దుఃఖం, అభయం, భయం అన్నీ క్రమంగానే అనుభవంలోకి వస్తాయి. గొప్పవారూ దుఃఖాల్ని అనుభవిస్తారు. దరిద్రులు కూడా సుఖాల్ని పొందుతారు. కొందరు రెంటినీ ఏకకాలంలో అనుభవించేవారూ లోకంలో కన్పిస్తారు. ప్రియా! స్వర్గంలోనూ, నరకంలోనూ ఈ రకంగా ఉండదు. నరకంలో నిత్యమూ దుఃఖమే ఉంటుంది. స్వర్గంలో నిత్యం సుఖమే ఉంటుంది. అందులో కూడా ఏది ఎక్కువ ఫలితమో దాన్ని

ముందుగా అనుభవించవలసి ఉంటుంది. చిన్న పరిమాణం ఉన్న కర్మ ఫలితాన్ని తర్వాత అనుభవించాలి. శుభురాలా! ఇదంతా చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు."

ఉమ ఇలా అన్నది. "భగవంతుడా! లోకంలో ప్రాణులు ఎందుకు మరణిస్తుంటాయి. కొంతమంది పుట్టగానే మరణిస్తారు. మరికొందరు ఆలస్యంగా మరణిస్తారు. ఇలా ఎందుకు జరుగుతుందో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! యీ విషయంలో యథార్థమేదో చెప్తాను, శ్రద్ధగా విను. కర్మలు నశించటం కారణంగా ఆత్మ శరీరాన్ని ఏ విధంగా విడిచి వెడ్తుందో నీకు చెప్తాను విను. శరీరం ఆత్మ ఈరెంటి సమూహం ప్రాణిగా చెప్పబడుతోంది. ఆరెంటిలో ఆత్మనిత్యం. క్షేత్రమయిన శరీరం అనిత్యం అని చెప్తున్నారు. ఈ విధంగా కాలంవచ్చినప్పుడు ఏర్పడిన శరీరం, జీర్ణం కాగా పేనులు చెయ్యటానికి పనికిరానప్పుడు, ఆత్మ దాని నుండి విడివడి పోతుంది. నిత్యమైన ఆత్మ, అనిత్యమయిన శరీరాన్ని విడిచిపోవటాన్నే లోకంలో మరణంగా చెప్తున్నారు. దేవతలు, అసురులు మానవులు ఎవరయినా కాలాన్నీ, కాలుడినీ ఉల్లంఘించలేరు. ఆకాశంలో అచేతన పదార్థం కొద్దిసేపయినా ఏ విధంగా నిలిచి ఉండదో! అలాగే కాలం కూడా క్షణం కూడా నిలిచిపోదు. సాగిపోతూనే ఉంటుంది. ఆ ఆత్మ మళ్ళీ మరొక శరీరాన్ని పొందుతుంది. ఇది లోకంలో ఎప్పటినుంచో జరుగుతున్నదే.

ఉమ ఇలా అంది. "భగవంతుడా! కొంతమంది ప్రాణులు బాల్యంలోనే మరణించటం, అతివృద్ధులు చిరంజీవులుగా ఉండిపోవటం కన్పిస్తుంది. మహేశ్వరా! అందరికీ కాలంలోనే (వృద్ధావస్థలోనే) మరణం సంభవించటం లేదు. కనుక ప్రాణులు జీవించటానికి కారణమేమో తెలియచెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! ఈ విషయంలో ఒక్కటే కారణం. చెప్తాను శ్రద్ధగా విను. పూర్వజన్మలో చేసిన కర్మలఫలితం ఎంతవరకు ఉంటుందో అంతవరకే మానవుడు జీవిస్తాడు. కొందరు బాలురుగానే వారు చేసిన కర్మల ఫలితంగా మరణిస్తారు. వృద్ధులయిన వారు చేసిన కర్మలఫలితంగా చిరకాలం జీవిస్తారు. ఈ విషయంలో చెప్పవలసిందంతా చెప్పాను. ఇందులో సంశయించవలసిన పనిలేదు".

ఉమ యిలా అంది. "భగవంతుడా! ఏ పనులు చేస్తే వారు చిరంజీవులవుతారు. వేమి చేస్తే అల్పాయుష్కులుగా మానవులు జన్మిస్తారు. ఈ విషయం నాకు చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! మానవులు ఏ కర్మలను ఆచరించటంవల్ల చిరంజీవులవుతారో చెప్తాను. రహస్యము మానవులకు మేలు చేసే విషయం శ్రద్ధగా విను. అహింస, సత్యం పల్కటం, క్రోధం లేకపోవటం, సహనం, ఋజు శీలం, గురుశుశ్రూష, వృద్ధుల్ని పూజించటం, శుచిగా ఉండటం, అకృత్యాలు చెయ్యకపోవటం ఎల్లవేళలా మేలు చేసే ఆహారం భుజించటం, ఇలాంటి గుణాలు కల్గిన జీవనం మానవులకు చిరంజీవిత్వాన్నిస్తుంది. తపస్సు, బ్రహ్మచర్యం, రసాయనాలు సేవించటం, వీటివల్ల గొప్పబలం, వస్తుంది. స్వర్గంలోగాని మానవలోకంలో కాని, ధార్మికులు చిరకాలం జీవిస్తారు. పాపకర్ములు, అసత్యభాషణులు, హింసాప్రియులు గురువుల్ని ద్వేషించేవారు. శుభకర్మలు చేయనివారు, పవిత్రత లేనివారు, నాస్తికులు ఉగ్రకర్మలు చేసేవారు, ఎప్పుడూ మాంసాన్ని మద్యాన్ని సేవించేవారు, పాపాలుచేసేవారు, గురువులచే ద్వేషింపబడ్డవారు, కోపస్వభావులు కలహప్రియులు, ఇలాంటి అశుభకార్యాలనే చేస్తూ

ఉండేవారు, చాలాకాలం నరకంలోనే ఉండిపోతారు. పశుపక్ష్యాదులుగా జన్మిస్తారు. మానవులుగా జన్మించినా అల్పాయుష్కులవుతారు. అందువల్ల మర్త్యులు అల్పాయువులవుతారు. కూడని ప్రదేశాలకు వెళ్ళటం, కీడు చేసే ఆహారాన్ని భుజించటం, మనుష్యుల ఆయువును తగ్గిస్తాయి. అవి ఆయుష్షును తగ్గించేవే కదా! ఆయా కారణాలవల్ల అల్పాయువులవుతారు. అలా కానట్లయితే చిరంజీవులవుతారు. ఈ విషయమంతా చెప్పాను. దేవి! ఇంకా నీవేమి విన్నాలనుకొంటున్నావు."

ఉమ ఇలా అంది. "దేవదేవ! మహాదేవ! మీరు చెప్పిందంతా విన్నాను. ఆత్మకు స్త్రీజాతితోను, పురుషజాతితోను సంబంధం ఎలా వీర్పడుతుందో వినాలనుకొంటున్నాను. స్త్రీ ప్రాణమూ, పురుషప్రాణమూ ఒక్కటేనా? లేక వేరువేరా? దేవా! ఈనా సంశయాన్ని తీర్చాలి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "ఆత్మ ఎల్లవేళలా మార్పులేనిదిగా ఉంటుంది. స్త్రీత్వం, పురుషత్వం ఆత్మకు సంబంధించినవి కావు. చేసిన కర్మలవల్ల ఆత్మ ఆయాజాతుల యందు జన్మిస్తుంది. స్త్రీ అయినా పురుషుడిలాగా ప్రవర్తిస్తే మరుజన్మలో పురుష రూపాన్ని పొందుతుంది. పురుషుడయినా స్త్రీలాగా వ్యవహరిస్తే పనులు చేస్తే స్త్రీగా జన్మిస్తాడు."

ఉమ ఇలా అడిగింది. "భగవంతుడా! ఆత్మకర్మలను ఆచరించకపోతే, దేహంతో ఉన్న ఎవరు కర్మలను ఆచరిస్తారు. ఈ నా సందేహాన్ని తీర్చండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "భామిని! విను. ఆత్మ ఎన్నడూ కర్తకాదు. గుణాలతో కూడిన ప్రకృతియే నిత్యం అన్ని పనులకు కర్తగా ఉంటుంది. లోకంలో ప్రాణుల శరీరాలు వివిధంగా వాతపిత్త శ్లేష్మాలతో కూడి ఉంటాయో, అలాగే ప్రపంచమంతా సత్త్వరజస్తమోగుణాలతో పరివ్యాప్తమయింది. సత్త్వం, రజస్సు, తమస్సు ఇవి ప్రాణికి సంబంధించిన గుణాలు, వీనిలో సత్త్వగుణం ప్రకాశస్వరూపమయినది. రజోగుణం దుఃఖాత్మకం, తమోగుణం మోహాత్మకంగా ఉంటుంది. లోకంలో యీ మూడు గుణాలు కారణంగానే అన్ని కర్మలూ జరుగుతుంటాయి. సత్యం, ప్రాణిదయ, పవిత్రత, శ్రేయస్సు, ఆనందం, సహనం, ఇంద్రియనిగ్రహం, ఇలాంటివన్నీ సాత్త్విక కర్మలుగా చెప్పబడుతున్నాయి. సమర్థత, కర్మపరాయణత, దురాశ, చెయ్యవలసిన పనుల్లో అజ్ఞానం, భార్యాసంగం, తియ్యదనం, నిత్యం ఐశ్వర్యాభిలాష, ఈ రకమయిన భావాలు కర్మలు రాజసకర్మలుగా చెప్పబడుతున్నాయి. అసత్యం, కారిన్యం, ధైర్యం, ద్వేషించటం, హింస, అనృతం, నాస్తికత్వం నిద్ర, బద్ధకం, భయం, ఈ రకమయిన భావాలు పాపకార్యాలు తామస కర్మలుగా చెప్పబడ్డాయి. అందువల్ల శుభాశుభకార్యాలు ప్రారంభమంతా గుణాలమీద ఆధారపడి ఉంది. కనుక ఆత్మకర్తకాదు. వ్యగ్రమూ కాదు నశించేదీ కాదు అని తెలుసుకోవాలి. సాత్త్వికులైన మానవులు పుణ్యలోకాల్లోనూ, రాజసులు మనుష్యలోకంలోను, తామసనరులు నరకంలోను ఉంటారు.

ఉమ ఇలా అంది. "శరీరం నశించినప్పుడు ఆయుధంచే సంహరింపబడ్డప్పుడు ఈ ఆత్మ తనకు తానుగా ఎందుకు వెళ్ళిపోతుందో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "కల్యాణి! దానికి కారణం చెప్తాను విను. ఈ విషయంలో మిక్కిలి సూక్ష్మ బుద్ధికల్గిన పండితోత్తములు కూడా భ్రాంతిని పొందుతారు. జన్మను పొందిన ఏ ప్రాణికయినా తాను చెయ్యవలసిన కర్మలు లేనప్పుడు ఏదో ఒక కారణంగా శరీరానికి ఉపద్రవ మేర్పడుతుంది. ఆ కారణంగా శరీరి శరీరం నశించాక దాన్ని విడిచిపెట్టి వెళ్ళటం జరుగుతుంది. శరీరమే నశిస్తుంది. ఆత్మనశించదు. వేదనలతో అది చలించిపోదు.

కర్మఫలం అనుభవించవలసి ఉన్నంతకాలం శరీరంలో ఉండి, తర్వాత ఆది వెళ్ళిపోతుంది. మొదటినుండి లోకంలో ఆత్మగతి ఇలానే ఉంది. దేవి! ఈ విషయం అంతా నీకు తెలియచేశాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు. ?

ప్రాణుల్లో భేదాలు, పూర్వ జన్మస్మృతి, దైవం పురుషార్థం, పునర్జన్మల వివరణం.

ఉమ ఇలా అంది. "భగవంతుడా! దేవదేవేశ ప్రాణి తాను చేసిన శుభాశుభకర్మల కారణంగానే దానికి తగ్గట్లు ఫలితాన్ని పొందుతా డన్నది నిశ్చయం. వరులకు అప్రియంచేస్తూనే దేహి అదే జన్మలో శుభాల్ని పొందటం కన్పిస్తుంది. ఇలా ఎందుకు జరుగుతుందో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "మహానుభావులారా! నీవడిగినవిధంగా కూడా జరుగుతుంది. వరులకు మేలు చేయాలనే సంకల్పబలంతో పరులకు దుఃఖాన్ని కల్గించినా జీవి శుభాల్ని పొందగల్గుతాడు. రాజా ప్రజల్ని దండిస్తూ బెదిరిస్తూ పుణ్యాన్ని పొందుతాడు. గురువు శిష్యుల్ని బెదిరించినా, ప్రభువు సేవకుల్ని చెదిరించినా కూడా అది వారి మేలు కోసమే కనుక. వీరు శుభాన్నే పొందుతారు. చెడ్డమార్గంలో ప్రయాణిస్తున్న వారిని సంస్కరించటం కోసం శాసించినవాడు ధర్మఫలం పొందుతాడు. వైద్యుడు రోగికి రోగనివారణకు దుఃఖం కల్గించినా హితాన్నే పొందుతాడు. ఈ విధంగా మంచిమనస్సు కల్గిన ఇతరులు కూడా హింసకులయినా స్వర్గాన్ని పొందుతారు. ఒకర్ని చంపితే ఎక్కడ అనేకమంది సుఖంగా ఉంటారో అటువంటివారిని చంపటంవల్ల ధర్మమే లభిస్తుంది కాని పాతకం రాదు. సంకల్పబలం మంచిది కావటం వల్ల, ధర్మాచరణ గౌరవం గొప్పదికనుక హింసలాంటి పాపాల్ని చేసినా దానివల్ల దోషమెంత మాత్రం రాదు." ఉమ ఇలా అంది. "ఈ లోకంలో ఉన్న నాలుగురకాలైన ప్రాణులకూ జ్ఞానమెలా లభిస్తుందో చెప్పండి. చేసే ప్రయత్నాలవల్ల లభిస్తుందా? స్వభావసిద్ధంగానే లభిస్తుందా?" శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. ఈ ప్రపంచం స్థావరమనీ, జంగమమనీ రెండు విధాలుగా చెప్పబడింది. దానిలో క్రమంగా నాలుగు విధాలుగా పుట్టుకలు చెప్పబడ్డాయి. ఆ నాల్గింటిలో, వృక్షాలు తీగలు తృణధాన్యాలు ఉద్భిజ్జములని చెప్పబడ్డాయి. దంశములు పేలు మొదలయినవి స్వేదజాలుగా చెప్పబడ్డాయి. పక్షులు రంధ్రమాత్రంగానే చెవి ఉండే జాతులు అండజములనబడతాయి. మృగములు హింసకజంతువులు మనుష్యులు మొదలయిన ప్రాణులు జరాయుజాలనబడతాయి. ఈ విధమయిన నాల్గుజాతుల శరీరాలను ఆశ్రయించి ఆత్మ ఉంటుంది. ప్రియా! భూమి నీరు ఈ రెంటి సంపర్కం వల్ల ఉద్భిజ్జములు పుడతాయి. ప్రియా! శీతోష్ణముల సంయోగం వల్ల స్వేదజాలు పుడతాయి. క్లేద బీజములు సంపర్కంవల్ల అండజాలు జన్మిస్తాయి. పుక్ల శోణితాల కలయికవల్ల జరాయుజాలు ప్రాదుర్భవిస్తాయి. జరాయుజ జాతులన్నింటిలోను మనుష్యజాతి అత్యుత్తమమయింది.

దేవి! ఇక చీకటియొక్క ప్రాదుర్భావాన్ని గూర్చి చెప్తాను విను. లోకంలో రెండు రకాలయిన చీకట్లున్నాయి. మొదటిది రాత్రికి సంబంధించింది. రెండవది శరీరమందుండే చీకటి. వెలుగువల్ల రాత్రి సంబంధమయిన చీకటి నశిస్తుంది. శరీరమందుండే చీకటి మాత్రం సమస్తమయిన ఉపాయాలూ

అవలంబించినా పోయేది కాదు. లోకాల సృష్టికర్త బ్రహ్మదేవుడు దేహంలో ఉండే అజ్ఞానమనే చీకటి నశించే ఉపాయం కానరాక, దానికోసం గొప్ప తపస్సు చేశాడు. అలా తపస్సు చెయ్యగా అంగాలు అనుబంధాలు కల్గిన వేదాలు పుట్టాయి. వాటిని పొంది సృష్టికర్త బ్రహ్మ చాలా సంతోషించాడు. లోకాలకు మేలు జరుగుతుందని భావించాడు. దేహజమయిన ఘోరమయిన ఆ చీకటి వేదాల ద్వారానే నశింపజేయబడింది. ఇది చేయవచ్చు. ఇది చెయ్యరాదు, ఇది మాట్లాడవచ్చు. ఇది మాట్లాడరాదు. అని ప్రవర్తనను నిర్దేశించే వేదమే లేకుంటే, ఈ లోకంలో మనుష్యులు కూడా పశువుల్లాగా ప్రవర్తించి ఉండేవారు. యజ్ఞాదుల ప్రారంభం వేదాలవల్లనే విధింపబడింది. యజ్ఞాలఫలం కారణంగా దేవతా సమూహం సమృద్ధమవుతున్నది. ప్రీతినొందిన దేవతలు మనుష్యులకు మరల ఆనందాన్నిస్తారు. ఈ విధంగా మనుష్యలోకం స్వర్గలోకం ఒకరికారణంగా మరొకటి ఆనందాన్ని పొందుతారు. కనుక లోకానికి స్థితి హేతువు వేదమేనని తెలుసుకోవాలి. **ముల్లోకాల్లోనూ జ్ఞానంకంటే గొప్ప వస్తువు కానరాదు.** మానవుడు వేదాన్నంతటినీ గ్రహించి ధన్యుడవుతాడు. ఉన్నతోన్న తస్థితులను పొందుతూ దేవతల్లాగా ప్రకాశిస్తాడు. ఏ విధంగా బలమైన వాయువు మేఘాల్ని తరిమివేస్తుందో, అలాగే వేదం కూడా, కామం, క్రోధం, భయం, గర్వం, అజ్ఞానం వీటినన్నింటినీ తరిమివేస్తుంది. జ్ఞాని చేసిన స్వల్పమయిన కర్మకూడా గొప్ప ఫలాన్నిస్తుంది. గొప్ప కర్మను ఆచరించినా అజ్ఞానం కారణంగా అది నిష్ఫలమయ్యే ప్రమాదమున్నది."

ఉమ ఇలా అంది. "భగవంతుడా!! మనుష్యుల్లో కొందరు పూర్వజన్మస్మృతి కల్గిన వారై జన్మిస్తారు. ఈ విధంగా పూర్వజన్మ విషయాలెరిగి పుట్టడం ఎలా జరుగుతుంది ? శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవి! నీకు నేనావిషయాన్ని తత్త్వాన్ని చెప్తాను శ్రద్ధగా విను. ఏ మానవులు శీఘ్రంగా చనిపోయి వెనువెంటనే పుడతారో, వారికి కొంతకాలం జన్మాంతరస్మృతి ఉంటుంది. కనుక కొంతమంది పూర్వజన్మవాసనలు కల్గి బోధకల్గి జన్మిస్తారు. వారు కూడా ఎదగడం ప్రారంభించగానే క్రమంగా ఆ స్మృతి కలలాగా అదృశ్యమవుతుంది. కనుకనే చాలామంది మానవులు పరలోకపు ఉనికిని శంకిస్తున్నారు."

ఉమ ఇలా అంది. "కొందరు మానవులు చనిపోయిన వారుకూడా వెనువెంటనే తిరిగివచ్చి, పూర్వ దేహములందే జీవించి ఉంటున్నారు. ఇది ఎలా జరుగుతుంది? శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "ఈ విషయంలో కారణం చెప్తాను విను. ప్రాణాలు పోగొట్టుకొనేవారు నిత్యం చాలామంది ఉంటారు. అలాగే వారిపేర్లలో పోలికలు కూడా బాగా ఉంటాయి. కనుక యమదూతలు ఒకప్పుడు అజ్ఞానం వల్ల ఒకరిని తీసుకువెళ్ళడానికి బదులు మరొకర్ని యమలోకానికి తీసుకొని వెళ్ళటం జరుగుతుంది. అయితే యముడు మాత్రం ఎంతమాత్రం తబ్బిబ్బుకాకుండా ఉన్న దాన్ని ఉన్నట్లు గ్రహించగల్గుతాడు. కనుక కొంతమంది సంయమనీ పురాన్ని పొందికూడా, తిరిగి మిగిలిన తమ కర్మల ఫలాన్ని అనుభవించటానికి భూలోకం వస్తారు. ఎవరి కర్మఫలానుభవం పూర్తికాదో వారు మాత్రమే తిరిగి భూలోకానికి వస్తారు."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! ప్రాణులు నిద్రించినంత మాత్రంగానే కలల్ని చూస్తారు. ఇది ప్రాణులస్వభావమా? మరేమైనా కారణముందా ? చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "నిద్రించినవారి మనస్సు చేసే చేష్టలు కలలుగా చెప్పబడుతున్నాయి. సంచరించే మనస్సు ఒకప్పుడు భవిష్యత్తును, ఒకప్పుడు భూతకాలాన్ని కూడా చూస్తుంది." అందువల్ల కలలు, ప్రాణులు పొందిన

పొందబోయే సంఘటనలకు సూచికల వంటివవుతాయి. దేవి! ఈ విషయమంతా చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! సర్వభూతనాథా! లోకంలో కర్మలనాచరించేటప్పుడు కొందరు సమస్తమూ దైవంవల్లనే జరుగుతున్నదని నమ్ముతుంటారు. మరికొందరు జరిగే ప్రతిపనికీ పౌరుషమే కారణమని విశ్వసిస్తారు. మహాదేవ! ఇలా రెండు బలమైన అభిప్రాయాలున్నప్పుడు వీది నిజం? అనే సందేహం వస్తోంది. దీన్ని నివారించండి. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "నేను ఈ విషయాన్ని నీకు చెప్తాను శ్రద్ధగా విను. మనుష్యలోకంలో రెండు విధాలయిన కర్మలు కన్పిస్తున్నాయి. మొదటిది పురాకృతకర్మ. రెండవది ఇహలోకంలో చేసే కర్మ. వానిలో లౌకికకర్మ దైవమానుష నిర్మితంగా చెప్పబడుతోంది. వ్యవసాయంలో దున్నటం విత్తనాలు చల్లడం కన్పిస్తుంది. మొక్కలు పెట్టడం, పంటను కోయటమూ కన్పిస్తుంది. ఇదంతా పౌరుషకర్మమే. అయితే దైవం కారణంగా ఒకప్పుడు ఫలితం లభించకపోవచ్చు. మరొకప్పుడు పురుషప్రయత్నంలోని లోపాలూ కారణం కావచ్చు. దేవి! మంచి ప్రయత్నం చేస్తే సత్కీర్తి లభిస్తుంది. దుష్టయత్నాలవల్ల అపకీర్తి వస్తుంది. లోకంలో ఈరెండూ మొదటినుండీ కన్పిస్తున్నవే. నాట్లు వెయ్యటం, వంట కొయ్యటం. ఆలాంటివి మరికొన్ని పురుష ప్రయత్నాలే. సమయంలో వర్షాలు పడటం, పైరు బాగా వృద్ధిని పొందటం, దుబ్బు చెయ్యటం ఇలాంటివన్నీ దైవం ఆధీనంలో ఉంటాయి. పంచభూతాలు ఎప్పుడు ఎలా ఉంటాయి? గ్రహనక్షత్ర సంచారం ఎలా ఉంటుంది? మొదలయిన విషయాలు బుద్ధిగోచరాలు కావు. హేతువాదానికందవు. ఆలాంటివాటి కన్నిటికీ దైవమే కారణం. శుభమయినా అశుభమయినా దైవమే కారణం. వీపని దేనిచేత చెయ్యటానికి సాధ్యమవుతుందో అది మాత్రమే పౌరుషం అని చెప్పబడుతోంది. ప్రియా! ఫలాన్ని పొందటం అన్నది. కేవలం దైవం వల్లగాని, కేవలం పురుష ప్రయత్నంవల్ల కాని సాధ్యంకాదు. రెండూ కలిసినప్పుడే ఫలితం పొందడం జరుగుతుంది. ఆ రెండూ కలిసి పనిచేసినప్పుడు శీతోష్ణాలు రెండూ కలిసినప్పటిలా అవసరమయిన ఫలితాలు పొందవచ్చు. బుద్ధిమంతుడు ముందుగా పురుష ప్రయత్నం చెయ్యాలి. వీది దానంతట అదే జరుగుతుందో అటువంటి పనిని ప్రారంభించిన మానవుడు కీర్తిని పొందుతాడు. లోకంలో ఏ విధంగా భూమిని తవ్వటం వల్ల నీరు లభిస్తుందో, అరణుల్ని మధించటం వల్ల అగ్ని లభిస్తుందో. అలాగే పురుషప్రయత్నం ద్వారా దైవసంపద కలసివస్తుంది. ఏ పని చెయ్యని నరునికి దైవసంపద దరిచేరదు. కనుక ఏ పనికి సంబంధించిన ప్రారంభమైన దైవమానుషశక్తులచేతనే వీర్పడుతుంది."

ఉమ ఇలా అంది. "భగవంతుడా. సర్వలోకాధీశుడా. లోకనాథుడా! వృషభధ్వజుడా!! ఆత్మ కర్మభోక్త కాదు కదా! కనుక మృతుడైన ప్రాణి మళ్ళీ పుట్టడం ఎలా సంభవిస్తుంది ? ఏ విధంగా చెట్టునుండి పండు లభిస్తుందో అదే విధంగా స్వభావ సిద్ధంగానే సమస్తమూ పుడుతుంది. వీవిధంగా తరంగాలేర్పడతున్నాయో అదే విధంగా జగత్తుయొక్క స్వరూపమూ వీర్పడుతుంది. తపస్సు దానాలు మొదలైన పనులన్నీ వ్యర్థమే. మళ్ళీ జన్మించటం అన్నది జరుగనే జరుగదు. అని కొందరు విశ్వసిస్తున్నారు. ప్రత్యక్షంగా కానరాకపోవటం చేత, పరోక్షాలైన వేదాదివచనాలు మాత్రమే వినటం వల్ల, అదంతా లేదు లేదు అని కొందరు సందేహగ్రస్తులవుతున్నారు. ఈ రెండు పక్షాల్లో యధార్థమేమిటో

నాకు తెలియచెప్పండి. మీరు విడమర్చి చెప్పినదేదో ఆదే లోకంలో వాస్తవ స్థితి అవుతుంది." నారదుడన్నాడు. "ఆ సమయంలో రుద్రాణిఅడిగిన ఈ ప్రశ్నకు సమాధానం ఏమి వస్తుందా? అని సభాసదులందరు పరమకుతూహలంగా వినడానికి సన్నద్ధులయ్యారు. శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "మహానుభావురాలా! నాస్తికులు చెప్పే మాటల్లో యధార్థం లేదు. ఇదంతా వేదవిద్వేషులయిన శాస్త్రద్వేషులు చెప్పే మతం. ఇంతవరకు నేను నీకు వివరించిన విషయాలు అన్నీ సత్యాలు. కనుకనే మానవుల్లో పండితులు వేదాన్ని ఆధారంగా చేసుకుని, సమస్తమయిన పరిగ్రహలవంటి కోరికలను జయించి, ధైర్యాన్ని స్వీకరించి, ఉత్తమమైన ఆసనాన్ని స్వీకరించి, తపస్సు మొదలైన కర్మలను ఆచరించి తమ కర్మల యొక్క ఫలితాన్ని స్వర్గాది రూపంలో అనుభవిస్తూనే ఉన్నారు. ఇది వారందరికీ ప్రత్యక్షమయిన విషయమే. ఇహంలో శ్రద్ధవల్ల వరంలో చాలా గొప్ప ఫలం లభిస్తుంది. హితైషుల అభివృద్ధికి బుద్ధి, శ్రద్ధ, వినయం ఇవి కారణాలు. కనుక నరుల్లో కొందరు శ్రద్ధావంతులై స్వర్గాదిలోకాల్ని పొందుతున్నారు. ఇతరులు సాధనాలు లేక నాస్తిక్య భావంతో అలానే ఉండిపోతున్నారు. వేదాన్ని ద్వేషించేవారు. నాస్తికులు, దృఢమయిన నిశ్చయం లేనివారు. ఏ శుభకర్మలు చేయనివారు, ఎవరికీ ఒక్కముద్ద పెట్టనివారు. తప్పక అధమమయిన లోకాల్ని పొందుతారు. గొప్పవారైన కవులు కూడా పునర్జన్మ ఉన్నది లేదు అంటూ భ్రాంతిని పొందుతున్నారు. ఎన్నో వందల కొద్దీ హేతువాదాలు చేసినా ఈ విషయంలో ఏ రకమయిన నిశ్చయాన్నీ పొందలేకపోతున్నారు. ఇది బ్రహ్మచే నిర్మించబడ్డ మాయ. దేవాసురులకు కూడా తెలుసుకొనరానిది. ఇక మానవలోకంలో అల్పబుద్ధి కల్గినవారిచే ఎలా తెలుసుకొనబడుతుంది ? దేవి! కేవలం వేదోక్తవచనాలో అపరిమితమయిన శ్రద్ధ ఉంటేనే ఆస్తికు లవుతారు. వారే హితాన్ని పొందుతారు. దేవి! దేవతాసంబంధ విషయాలతో ముడిపడిన రహస్య విషయాల్లో హేతువాదమన్నది ఎందుకూ పనికిరాదు. హితాన్ని కోరేవాడు నాస్తికవాదాలపట్ల చెవిటి వాడిలాగా గుడ్డివాడిలాగా ఉండాలి. దేవి! ఈ విషయం అంతా రహస్యమయినది. ఋషి ప్రోక్తం, ప్రజలకు మేలు చేసేది. దీన్ని నీకు చెప్పాను.

యమలోక మార్గాలు - పాపుల నరకయాతనలు - వారి కర్మల ననుసరించి వేర్వేరు జన్మలు.

ఉమ ఇలా అంది. "శంకరా ! యముని దండనలు ఎలా ఉంటాయి. యముని భటులు ఎలాంటివారు ? చనిపోయిన ప్రాణులు యమలోకాన్ని ఏవిధంగా చేరుకొంటారు. యముని భవనం ఎలా ఉంటుంది? అతడు ప్రజల్ని ఎలా దండిస్తాడు. మహా దేవ! ప్రభో! ఈ విషయాన్నంతా వినాలనుకొంటున్నాను. నాకు చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "కల్యాణి! దేవి! నీకు మనస్సుకింపయిన విషయాన్నంతా చెప్తాను. శ్రద్ధగా విను. దక్షిణ దిక్కున యమసదనం ఉంది. అది చాలా పెద్దది. అది విచిత్రంగా ఉంటుంది. అందంగాను, అనేకభావాలతోను నిండి ఉంటుంది. పితృదేవతలు, ప్రేతసముదాయాలు, యమదూతలతో ఎప్పుడూ నిండి ఉంటుంది. కర్మాధీనులైన అనేకప్రాణి సంఘాలతో నిండి ఉంటుంది. అక్కడే లోకహితార్థియైన యముడు అపరాధులను శిక్షిస్తూ ఉంటాడు. యముడు

తన మాయ ద్వారా ప్రాణులు చేసే శుభాశుభాల్ని నిత్యం గమనిస్తూ ఉంటాడు. అతడు తన మాయ ద్వారా వివిధ పద్ధతుల్లో ప్రాణుల సమూహాన్ని సంహరిస్తూ ఉంటాడు. యముని మాయామయమైన పాశాల్ని గురించి సురలు అసురులు కూడా తెలుసుకొనలేరు. ఇక మనుష్యమాత్రుడు యముని చరితాన్ని తెలుసుకోవటం చాలా కష్టం. ఈ విధంగా యముడుంటే, అతని పరిచారకులు కర్మలు నశించిన ప్రాణులందరినీ పట్టుకుని యముని వద్దకు చేరుస్తుంటారు. వారు ఏదో కారణం చూపి ప్రాణుల్ని యమునివద్దకు చేరుస్తారు. లోకంలో వారు చేసిన కర్మలను బట్టి ఉత్తమ మధ్యమాధములుగా విభజించి, వారందరినీ వారికి తగిన విధంగా యమలోకానికి యమదూతలు తీసుకొని పోతుంటారు. ధార్మికులుత్తములు. వారు అమరులవలె స్వర్గసుఖాలనుభవిస్తారు. మధ్యములు తిరిగి మనుష్యలోకంలో జన్మిస్తారు. అధములైన నరులు పశుపక్ష్యాదిజాతుల్లోను నరకంలోను ఉంటారు. ప్రాణాలు పోయినవారు వరలోకానికి పోయేమార్గాలు, రమణీయం, నిరాబాధం, దుర్దర్శము అను పేర్లతో మూడు ఉన్నాయి. రమణీయమార్గం, రెపరెపలాడుతున్న జెండాలతో నిండి ఉంటుంది. అలికి ముగ్గులుపెట్టి, సుగంధ ధూపాలతో నిండి, పుష్పమాలలతో అలంకరింపబడి ఉంటుంది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారికి మనోహరంగా, చక్కని స్పర్శనిస్తూ ఉంటుంది. నిరాబాధమనే మార్గం లోకంలో ఉన్నట్లే ప్రశస్తంగా ఉంటుంది. మూడవదయిన దుర్దర్శ మార్గం దుర్గంధంతోను, చీకట్లతోను నిండి ఉంటుంది. పరుషంగాను, రాళ్ళతోను, కుక్క, కోరలతోను నిండి ఉంటుంది. క్రిమి కీటకాలుండి, ప్రయాణం చేసేవారు ముందుకుసాగటం కష్టమన్పిస్తుంది. ఈ విధంగా మూడు మార్గాల్లోను ఉత్తమాధమమధ్యముల్ని యమదూతలు కాలం రాగానే తీసుకుపోతుంటారు. ఆ వివరాల్ని విను.

యమదూతలు చక్కగా అలంకరించుకొని అనంతకాలంలో ఉత్తముల్ని రమణీయమనే మార్గంలో సుఖంగా తీసుకునిపోతారు. యమదూతలు యోధవేషధారులై, మధ్యముల్ని మధ్యమమైన నిరాబాధమార్గంలో తీసుకుపోతారు. ఇకయమదూతలు అధముల్ని మాత్రం చండాల వేషధారులై, బెదిరిస్తూ భయపెడుతూ పాశాలలో ఈడ్చుకుంటూ మూడవదయిన దుర్దర్శ మార్గంలో తీసుకొనిపోతారు. ఈ విధంగా యమదూతలు వివిధ మార్గాల ద్వారా యమలోకానికి తీసుకుపోతారు. మహాభాగా! తీసుకొనిపోయినవారిని యమదూతలు సభామధ్యాన సింహాసనారూఢుడు, తేజోవిరాజితుడు సభాధ్యక్షుడు, లోకపాలకుడు అయిన యమునికి చూపించి వారు చేసిన తప్పొప్పులను నివేదిస్తారు. యముడు ప్రాణులు చేసిన శుభాశుభాల్ని వింటూ, కొందరిని పూజిస్తూ, కొందరిని దండిస్తూ, బహుసహస్ర పరివృతుడై ఉంటాడు. వెళ్ళినవారిలో ఉత్తముల్ని యముడు పూజిస్తాడు. వారికి ఎదురేగి స్వాగతం చెప్పి కుశలమడిగి గౌరవిస్తాడు. యముడు వారిని కర్మలను ప్రశంసించి, వారు వెళ్ళవలసిన లోకాల్ని తెలియచేస్తాడు. ఈ విధంగా యముని అనుమతిపొందిన ఉత్తములు స్వర్గాన్ని చేరుకొంటారు. యముడు మధ్యముల విషయంలో వారు చేసిన కర్మలన్నీ యథాతథంగా విన్నాక, వారిని మళ్ళీ మనుష్యలోకంలోనే పుట్టండని ఆజ్ఞాపిస్తాడు. పాశబద్దులయిన అధముల్ని యముడు చూడడు. యమ భటులు భయంకరులు చండాలురిలాగా కనపడేవారు. యముని ఆజ్ఞననుసరించి వీరిని వివిధ బాధలకు గురిచేస్తారు. వారిని ముక్కలు చేస్తారు. హింసిస్తారు, అటూ ఇటూ ఈడుస్తారు. అరుస్తున్నవీరిని తలకిందులుగా చేసి గోతుల్లోకి పారవేస్తారు. ప్రియా! వీరి శిరస్సులమీద సంయామినీ శిలలు

పడతాయి. ఇనుప ముఖాలు కల్గిన భయంకరమయిన కంకవలపక్షులు వీరిని పొడుచుకు తింటాయి. మరికొందరిని కత్తులతో నిండిన భయంకరమయిన అసిపత్రవనంలో తిప్పుతారు. మరికొందరిని అక్కడే భయంకరమయిన పళ్ళున్న కుక్కలు తింటుండటం కన్పిస్తుంది. యమలోకంలో వివిధమయిన జలచరాలలో నిండిన వైతరణీ నది ఉంటుంది. ఆ నదిలో ప్రవేశించటం చాలాకష్టం అది భయంకరమైనది అందులో మూత్రం శోణితం ప్రవహిస్తూ ఉంటుంది. యమభటులు కొందరిని అందులో ముంచి తేలుస్తూ ఉంటారు. దాహమయితే ఆ నది నీటిని వారిచే త్రాగిస్తారు. మరి కొందరిని అక్కడే ఉన్న ముళ్ళ బూరుగు చెట్లమీదికి బలవంతంగా యమభటులు ఎక్కిస్తారు. నరకంతో కొందరు యంత్రచక్రాల మీద ఉంచబడి, నువ్వుల్ని గానుగలో వేసి నలగ్గొట్టినట్లు నలగ్గొడతారు. మరికొందరు పాపాత్ముల్ని కణకణలాడుతున్న నిప్పుల్లో వేసి కాలుస్తారు. కొందరు కుంభీపాక నరకంలో వండబడతారు. కొందరు మాడుతున్న ఇసుకలో హింసింపబడతారు. చెట్లను కోసినట్లు ముక్కలుచేసినట్లు కొందరిని రంపం వగైరాలలో ముక్కలుగా చేస్తారు. కొందరు శూలాలలో ముక్కలుగా చేయబడతారు. కొందరు వాడి సూదులతో గుచ్చబడతారు. నువ్విలా చేశావు. అందువల్ల నిన్ను శిక్షిస్తున్నాం. అని ప్రకటిస్తూ శిక్షల్ని వేస్తుంటారు. ఈ విధంగా యాతనలు భరించే లక్షణం కల్గిన నరకశరీరాల్ని పొందిన ప్రాణులు, వివిధములయిన యాతనలను పొంది తాము చేసిన తప్పుల్ని స్మరించుకుంటూ, సహించుకుంటూ, అరుస్తూ, ఏడుస్తూ ఉన్నప్పటికీ విడిచిపెట్టబడరు. తాము చేసిన తప్పులన్నీ స్మరిస్తారు. అక్కడ బాధల్ని అనుభవిస్తూనే ఉంటారు. ఈ విధంగా పాపాత్ములు పలువిధాలయిన శిక్షల్ని అనుభవిస్తారు. నరకంలో వివిధ యాతనలతో బాధింపబడతారు. కొందరు యాతనల్ని అనుభవించాక పాపాలనుండి బయటపడతారు. ఈ యాతనలు ప్రాణుల పాపాల్ని ప్రక్షాళన చేసేవిగా చెప్తారు. మిక్కిలిగా కాల్చబడిన లోహం ఏ విధంగా శుద్ధిని పొందుతుందో అదే విధంగా యాతనలు పొందిన జీవి పరిశుద్ధుడవుతాడు."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! పాపులు నరకంలో ఏ విధంగా దండింపబడతారు? మహేశ్వర! ఘోరమయిన నరకాలు ఎన్ని ఉన్నాయి? అవి ఎలాంటివి?" శ్రీ మహేశ్వరుడన్నాడు. "భామిని! నీవడిగిన దాన్ని విను. నరకాలు ఐదు రకాలు. అవి భూమికి అడుగున ఉంటాయి. భయంకరమయినవి, పాపాత్ముల కోసం నిర్మింపబడ్డాయి. **మొదటిది రౌరవ నరకం.** ఇది వందయోజనాలు పొడవు అంతే వెడల్పు కలిగి విశాలంగా ఉంటుంది. ఇది చీకట్లతో నిండింది. పాపులకు వీడలు కల్గించటానికి ఏర్పడింది. ఇది దుర్గంధంతో నిండినది, పరుషం, భయంకరమయిన పురుగులతో నిండినది. అతిభయంకరం. ఇలాంటిదని చెప్పలేం. అన్నీ ప్రతికూలాంశాలే ఉంటాయి. పాపులు చాలాకాలం అక్కడే ఉంటారు. అక్కడ పడకలు కుర్చీలు ఉండవు. పాపులు పురుగులచే భక్షింపబడతారు. ఆది మలగంధంలో నిండింది. పాపులు ఆ నరకంలో ఎంతవరకూ ఉంటాయి. అంతవరకు మామూలుగా అనుభవించే యాతనలకు పదిరెట్లు ఫలితాన్ని అక్కడ అనుభవించవలసి ఉంటుంది. శుభేక్షణా! అక్కడి దుఃఖం మిక్కిలి కష్టమయినది. అరుస్తూ, ఏడుస్తూ పాపులక్కడ దుఃఖాల్ని అనుభవిస్తారు. ఆ దుఃఖాన్ని పోగొట్టుకోవటానికి ప్రయత్నిస్తారు. ఎంత ఆలోచించినా ఉపాయం తెలియదు: కనీసం దుఃఖానికి దుఃఖానికీ మధ్య, విరామాన్ని పొందే ఉపాయం కూడా తెలియదు. **మహారౌరవం** అన్నది రెండవనరకం. ఇది ప్రమాణంలోను దుఃఖానుభవంలోను రౌరవంకటె రెండింతలు పెద్దది. మూడవనరకం

కంటకావనమని పేరు కలది. ఇది లోగడ చెప్పిన రెండు నరకాల ప్రమాణానికి దుఃఖానికీ రెట్టింపుగా ఉంటుంది. మహాపాతకాలు చేసినవారు భయంకరులు దీనిలో ప్రవేశిస్తారు. ప్రియే! నాల్గవ నరకం అగ్నికుండమని చెప్పబడింది. ఇది పూర్వనరకానికి రెట్టింపు ఉంటుంది. అక్కడి దుఃఖం చాలా గొప్పది. అది అమానుషం. పాపాత్ములు అక్కడికక్కడే దుఃఖాల్ని అనుభవిస్తారు. ప్రియా! పంచకష్టమనేది ఐదవ నరకం. అక్కడి దుఃఖం వర్ణించలేం. అతి భయంకరమయినది. దాన్ని ఇంతే అని చెప్పలేము. ఐదు ఇంద్రియాలు సహింపనలవి కాని దుఃఖమిచ్చేది కావటం వల్ల పంచకష్టంగా చెప్పబడింది. పాపాత్ములు ఆయాప్రదేశాల్లో ఇలాంటి దుఃఖాల్ని అనుభవిస్తారు. ఇచటి దుఃఖం అమానుషులకే తగింది. మహాభూతాల చేత ఇచ్చటిజీవులు తినబడతారు. మహాభూతములా జీవిని చిరకాలం హింసించి విడిచిపెడతాయి. పంచకష్ట నరకంతో పోల్చదగిన దుఃఖం ఈ ప్రపంచంలో లేదు. ప్రియా! ఇంతటి భయంకరమయిన దుఃఖస్థానం మరొకటి లేదు. ఈ విధంగా పాపాత్ములు, ఈ నరకాల్లో దుఃఖమనుభవిస్తారు. ప్రియా ! అవీచి మొదలయిన మరికొన్ని నరకాలు కూడా ఉన్నాయి. అరుస్తుంటారు, ఏడుస్తుంటారు, వేదనలలో గజగజలాడిపోతారు, కొందరు తిరుగుతారు. పారిపోతారు. అయినా బాధలు తప్పించుకోలేరు. పారిపోయే వాళ్ళను శూలధారులు అన్నివైపులనుంచీ వారిస్తారు. రోగాలతో బాధపడుతూ, దాహంలో దుఃఖిస్తూ పాపాత్ములు శిక్షింపబడతారు. పూర్వకర్మనశించనంతవరకూ ఎవరినీ విడిచిపెట్టరు. పురుగులచే తినబడతారు. వేదనలతో భయపడిపోతారు. త్రాగటానికి నీరుండదు. తాము చేసిన తప్పుల్ని స్మరించుకొంటారు. అయ్యో ఎంతపాపం చేశామో అనుకొంటారు. ఆక్రోశిస్తారు. అయినా పాపనాశం అయ్యేవరకూ అక్కడే ఉంటారు. ఈ విధంగా అన్నిపాపాల ఫలితం అనుభవించాకే ముక్తిని పొందుతారు."

పార్వతి అన్నది. "భగవంతుడా! పాపులు ఎంతకాలం నరకంలో ఉండవలసి ఉంటుంది. మహేశ్వరా ! దాన్ని తెలుసుకోవాలనుకొంటున్నాను చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "ప్రాణులు లక్ష సంవత్సరాలు మొదలుకొని ప్రలయాన్తం వరకు శిక్షలనుభవించవలసి ఉంటుంది."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! అందులో ఎవరు ఎంతకాలం ఉండాలో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. రౌరవనరకంలో లక్ష సంవత్సరాలుండటం జరుగుతుంది. మనుష్యఘాతకులు. కృతఘ్నులు, అసత్యవాదులు దానిలో ఉంటారు. అటువంటివారు రెండవ నరకంలో రెండు లక్షల సంవత్సరాలుంటారు. మహాపాతకాలు చేసినవారు మూడవ నరకంలో దుఃఖంపొందుతారు. నాల్గవ నరకం పొందినవారు యుగాంతం వరకు అక్కడ ఉంటారు. పంచకష్ట నరకంలోని దారుణమయిన కష్టాన్ని సహిస్తూ ఉండాలి. అక్కడ ఉండే దుఃఖముందు మనుష్యులనుభవించే దుఃఖాలన్నీ దిగతుడుపే. ఈ విధంగా ప్రాణులు వారివారి కర్మలకు తగ్గనరకాలను అనుభవించి, పాపాల్ని పోగొట్టుకొని, నరకాన్నుండి విముక్తిని పొంది క్రిమికీటకాలుగా జన్మిస్తారు. కొంతమంది ఉద్భేదజములయిన చెట్లు వగైరాలుగా పుడతారు. అక్కడ పాపాలు పోయాక, మృగాలుగా పక్షులుగా జన్మిస్తారు. మృగపక్షి జన్మల్లో అనుభవించవలసిన దాన్ని అనుభవించాక చివరకు మనుష్యులుగా జన్మిస్తారు."

ఉమ ఇలా అంది. "పాపాత్ములు వివిధజాతుల్లో ఎందువల్ల జన్మిస్తారు." శ్రీ మహేశ్వరుడిలా

అన్నాడు. శుభురాలా! నీవడిగినదాన్ని గూర్చి చెప్తాను విను. ఎల్లప్పుడూ ఆత్మకర్మాధీనం గానే వివిధ జాతుల్లో పుట్టడం జరుగుతుంది. ఎవడు నిత్యం మాంసాన్నిష్టపడతాడో వాడు కాకిగానో గ్రద్దగానో పుడతాడు. మద్యపాన ప్రియుడయిన నరుడు పందిగా పుడతాడు ఇది నిజం. తినకూడని పదార్థాలను తినే మనుష్యుడు కాక జాతిలోపుడతాడు. ఎవడు కోపంతో ఆత్మహత్య చేసుకుంటాడో వాడు ప్రేత జాతిలో పుడతాడు. కొండాలు చెప్పేవారు. అపవాదాలు వేసేవాళ్ళు కోడిజాతిలో పుడతారు. నాస్తికుడయిన మూర్ఖుడు. మృగజాతి యందు జన్మిస్తాడు. ఎప్పుడూ హింసనే విహారంగా చేసే నరుడు క్రిమికీటక జాతులయందు పుడతాడు. మిక్కిలి అభిమానంతో వ్యవహరించిన నరుడు చనిపోయాక మళ్ళీ గాడిదగా పుడతాడు. పొందరాని వారినిపొందినవాడు, పరదారలనను భవించినవాడు ఎలుకజాతిలో జన్మిస్తాడనటంలో సందేహం లేదు. కృతఘ్నుడు మిత్రుని హింసించినవాడు నక్కతోడేలు జాతుల్లో పుడతారు. కృతఘ్నుడు పుత్రుని చంపినవాడూ స్థావరంగా (కదలనిదానిగా) జన్మిస్తాడు. ఈ విధంగా అశుభకర్యాలు చేసిన నరులు నరకాన్ని పొందుతారు. తర్వాత తాము చేసిన కర్మలవల్ల దానికి తగిన జాతియందు మళ్ళీపుడతారు. ఈ విధంగా పాపాత్ములు కర్మానుసారం వివిధ జాతులయందు పుట్టాక, అతికష్టంమీద తర్వాత జన్మల్లో క్రమంగా మనుష్యజాతిని పొందుతారు. ఈ విధంగా బహుదుఃఖములతో తపింప చేయబడిన ఆత్మ బలాత్కారంగా శుద్ధిని పొందింపబడుతుంది. కనుక మనుష్య జన్మ జన్మల్లో ఎంతో దుర్లభమయిందిగా తెలుసుకోవాలి."

శుభాశుభకర్మలు - మద్యసేవన దోషము - మాంసభక్షణ దోషాదికము

ఉమ ఇలా అంది. "ప్రజలమేలుకోసం శుభకర్మలు, అశుభకర్మలు వీటిగురించి సంగ్రహంగా వినాలని కోరుకొంటున్నాను." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. శుభురాలా! ఈ విషయం నేను చెప్తాను. దాన్నంతటినీ విను. సుకృతమని, దుష్కృతమని సమస్త కర్మలు రెండు విధాలుగా విభజింపబడ్డాయి. ఆ రెంటిలో దుష్కృతకర్మ మళ్ళీ మూడు విధాలుగా విభజింపబడింది. మానసం, కాయికం, వాచికం, అని దుష్కృతం మూడు రకాలు. ఇవి బుద్ధియందున్న అజ్ఞానం కారణంగా పుడతాయి. ప్రియా! ముందు మనసా కర్మను గురించిన ఆలోచన జరుగుతుంది. ఆపై మాట దానిని బయటపెడుతుంది. తర్వాత క్రియారూపంలో అది కనిపిస్తుంది. అప్పుడది చేష్ట అవుతుంది. పరునికి ద్రోహం చెయ్యాలనుకోవటం, అసూయ, పరులసొత్తు కావాలని పించటం, ధర్మకార్యాలపట్ల అశ్రద్ధ, పాపకార్యాలపట్ల సంతోషం, మొదలయిన అశుభకర్మలన్నీ మానస దుష్కృతాలనబడతాయి. శంకరి! అసత్యం, పరుషవాక్యం, అనృతం, పరనింద, ఇవన్నీ వాగ్రూపమయిన పాపాలుగా చెప్పబడ్డాయి. పొందకూడనివారిని పొందటం, పరుల భార్యల ననుభవించటం. వధ, బంధనం, కష్టపెట్టడం, వీటిద్వారా పరుల ప్రాణాలను దుఃఖింపచేయటం, దొంగతనం, పరులసొత్తును అపహరించటం, నాశనం చెయ్యటం, తినకూడనివాటిని తినటం, వ్యసనాలయందు ఆసక్తి, గర్వంతో ఉద్ధతితో అభిమానంతో పరుల్ని పీడించటం, చెయ్యరాని పనులు చెయ్యటం, అశుచిగా ఉండటం, మద్యాన్ని సేవించటం, దుఃశీలం, పాపాత్ములతో స్నేహం, పాపపుపనులకు సహాయపడటం, ధర్మానికి దూరమై అపకీర్తిని కలిగించే పనుల్ని చేయటం, ఈరకమయిన

పనులన్నీ శరీరానికి సంబంధించిన పాపాలు. మానస పాపం కంటె వాగ్రూపమయిన పాపం పెద్దది. వాగ్రూపమయిన దానికంటె కాయికమయిన పాపం మరింత పెద్దది. ఈ విధంగా ముప్పిధములయిన పాపకర్మలు నరుడిని స్వస్థితినుండి పతనం పొందేటట్లు చేస్తాయి, పరులకు బాధ కలిగించటమన్నది మిక్కిలి గొప్ప పాతకంగా చెప్పబడింది. ఈ మూడు విధాలయిన పాపాలు కర్తను పాపపు జన్మలనొందింపచేస్తాయి. పాతకమయిన పని అయినప్పటికీ బుద్ధిపూర్వకంగా ఇలా చెయ్యటం నా కర్తవ్యం కనుక చెయ్యకతప్పదు అనుకొంటూ చేసినట్టయితే దాన్ని చేసినప్పటికీ ధర్మంకోసం చేశాడు కనుక ఆ పాపఫలం కర్తను అంటుకోదు."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! పాపకర్మమే అయినప్పటికీ ఏ సందర్భంలో దాన్ని చేసినప్పటికీ పాపాత్ముడు కాదో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "స్వయంగా నిరపరాధి అయిన మానవుడు తన ప్రాణరక్షణ కోసం ఆయుధం ధరించివచ్చిన శత్రువును హతమార్చినప్పటికీ హింసించినప్పటికీ వాడు పాపాన్ని పొందడు. అలాగే ముందుగా శత్రువుచే దెబ్బకొట్టబడ్డవాడు కూడా పాపాన్ని పొందడు. చోరుని వల్ల మిక్కిలి భయపడి అతన్ని ఎదుర్కొనే క్రమంలో నరుడు ఆ దొంగను చంపినా పాపాన్ని పొందడు. గ్రామమంతటి ప్రయోజనం కోసం, ప్రభువు ఋణం తీర్చుకోవటానికి, దీనులను రక్షించటానికి, చంపటం, బంధించటం, హింసించటం లాంటి పనులు చేసినవాడు పాపాన్ని పొందడు. దుర్భిక్షం వీర్పడినప్పుడు, తాను జీవించటానికి మార్గాంతరం లేనప్పుడు చెయ్యకూడని పని చేసినా, తినకూడని దాన్ని తిన్నా కూడా పాపమంటదు. మద్యాన్ని త్రాగి కొందరు నవ్వుతూంటారు. కొందరు వాగుతుంటారు, కొందరు ఆనందంతో నృత్యం చేస్తారు. కొంతమంది శుభాశుభాలను గానం చేస్తారు. వారు కలిపురుషుని కోరికను తీరుస్తుంటారు. ఒకరిని మరొకరు కొట్టుకుంటూ ఉంటారు. ఒక్కప్పుడు పరుగుపెడతారు. గబుక్కున జారిపోతారు. క్రిందపడిపోతారు. కూడని చాలామాటలు మాట్లాడుతారు. ఒకప్పుడు నగ్నంగా శరీరాల్ని పడేస్తారు. జ్ఞానరహితులుగా ఉంటారు. ఈ విధంగా చైతన్య రహితులై అనేక విధాలుగా ప్రవర్తిస్తుంటారు. ఎవరు మద్యాన్ని సేవిస్తారో, వారు గొప్ప అజ్ఞానంలో కూరుకుపోతారు. వీరందరూ పాపాత్ములే. మద్యం త్రాగితే ధైర్యం, సిగ్గు, బుద్ధి నశించిపోతాయి. కనుకవారు సిగ్గు ఎగ్గులు లేకుండా ప్రవర్తిస్తారు. మద్యపానం చేసినవాడు ఆ సమయంలో బుద్ధినశించిపోతుంది. కనుక కార్యం అకార్యం తెలుసుకోలేడు కనుక, స్వయంగా తనకు తోచిందంతా చేసేస్తూ ఉంటాడు కనుక, విద్వాంసులకు కూడా విధేయుడు కాడుకనుక, పాపాన్నే పొందుతాడు. మద్యమత్తుడు అవమానింపబడతాడు. మిత్రుల్లో వైరంకల్పించే వా డవుతాడు, ఎప్పుడూ అపవిత్రంగా ఉంటాడు. అన్నిటినీ తింటాడు. ఎల్లప్పుడు కలిపురుషుని భావాల్లో మునిగి తేలుతాడు. జ్ఞానం, పాండిత్యం నుండి వంచితుడవుతాడు, అన్నివేళలా పరుషంగా, కఠినంగా, భయంకరంగా మాట్లాడుతుంటాడు. మత్తుడు గురువుల్ని ఎదిరిస్తాడు. పరులభార్యల్ని బలాత్కరిస్తాడు. బాదరులతో స్నేహం చేస్తాడు. ఎవరు చెప్పినా హితాన్ని వినడు. శోభనా! ఈ రీతిగా త్రాగుబోతులో అనేక దోషాలుంటాయి. వారు నరకానికే వెళతారు. ఈ విషయంలో మరో ఆలోచన లేదు. కనుక సత్పురుషులు అన్నివేళలా మద్యాన్ని వర్జిస్తారు. వారు తమ మేలు కోసమే ఈ విధంగా చేస్తారు. సత్పురుషులు తమ శీలాన్ని

రక్షించుకోవటానికి మద్యాన్ని విడిచిపెట్టకపోతే ఈ ప్రపంచమంతా మర్యాదారహితంగాను, శుభారంభవిహీనంగానూ తయారయి ఉండేది. కనుక తమ బుద్ధి శక్తిని రక్షించుకోవటానికి సత్పురుషులచే మద్యపానం విడవబడుతుంది.

శుచిస్మితా! ఇక సుకృతం గురించి కూడా విను. దేవి! సుకృతం కూడా సంక్షేపంగా మూడు విధాలుగా ఉంటుంది. లోగడ చెప్పిన మనోవాక్ కాయ సంబంధమయిన మూడు దోషాల్ని విడిచిపెట్టిన నరుడు, సమస్త శుభఫలాల్ని పొందగల్గుతాడు. ముందుగా ఒకేసారి గాగాని విడివిడిగాగాని సమస్త దోషాల్ని విడిచి పెట్టాలి. అప్పుడు వాడు ధర్మఫలాల్ని పొందగల్గుతాడు. కాని దోషాల్ని విడిచిపెట్టడమన్నది అంత తేలికయిన పనికాదు. ధర్మంలో ఉండే సౌకర్యాన్ని చూడు. ఏ వని ప్రారంభించనప్పటికీ కేవలం దోషాల్ని విడిచిపెట్టిన మాత్రంచేతనే గొప్ప సుకృతం లభిస్తున్నది. అల్పబుద్ధులయిన మానవులెంత నీచులు ! తన చేతిలో ఉన్న దోషత్యాగాన్ని తెలుసుకోలేరు. అయినా ఆనందంగా ఉన్నామను కొంటారు. దుష్కృతాల్ని విడిచిపెడితే చాలు, ఉన్నత స్థానం పొందుతారు. పాపమంటే భయముంటే చాలు. దోషాల్ని విడిచిపెడితే చాలు. ఋజుమార్గంలో ప్రవర్తించేవాడు, ధర్మాపేక్షకలవాడు మంచివాడుగా మారిపోతాడు. ధర్మాత్ములనుండి మంచి ఉపదేశాన్ని శ్రద్ధగా వినటం వల్ల, ఇంద్రియాలను నిగ్రహించి తన అధీనంలో ఉంచుకోవటం వల్ల సంతోషంగా ఉండటం ధైర్యంగా ఉండటం చేత దోషాలన్నిటినీ విడిచిపెట్టవచ్చు. ప్రియా! దోషాల్ని విడిచిపెట్టటమే గొప్ప ధర్మమని చెప్తున్నారు. ప్రియా! ఇంద్రియ నియమనం వల్ల లభించే ధర్మం కంటె మేలయిన ధర్మం మరొకటి లేదు. నిగ్రహం చేత సన్యాసులు ఉత్తమమయిన స్థానాన్ని పొందుతున్నారు. సమర్థులయిన ప్రభువులకు కాని, దరిద్రులయిన మానవులకు కానీ దోషాల్ని విడిచిపెట్టటమన్నది దానం చెయ్యటం కన్నా, శుభకర్మలు చేయటం కన్నా కూడా ఫలప్రదమయిన గొప్ప ధర్మం. తపస్సు దానం కొద్దిదోషాన్ని మాత్రమే తొలగిస్తాయి. నిగ్రహం వల్ల లభించే సుకృతం గురించి చెప్తాను. సాధనాలు లేకపోయినా చేయగలిగిన శుభకర్మల గురించి ముందు వివరిస్తాను. లోకాలన్నీ సుఖంగా ఉండాలని భావించటం, సత్యం, పవిత్రత, అంతరింద్రియ నిగ్రహం, ఈ మొదలయినవివన్నీ నియమాల ఆధారంగా రూపొందిన సుకృత కర్మలు. భామిని ! వీటిలో విశేషాల్ని వివరిస్తాను, శ్రద్ధగా విను. **సముద్రాన్ని దాటటానికి నౌకవలె స్వర్గాన్ని పొందటానికి సత్యం గొప్ప సోపానం. సత్యంకంటె గొప్పదానం కాని తపస్సు కాని లేదు.** ఏదివిన్నామో, ఏమి చూశామో, ఏమి చేశామో, దాన్ని ఉన్నదున్నట్లుగా ఏ రకమయిన మార్పులూ లేకుండా చెప్పటం అన్నది సత్యం యొక్క లక్షణం. మోసపూరితంగా పైకి సత్యంలా కనపడేటట్లు చెప్పటం వ్యర్థమే. ఇహపరాలు ఎరిగినవాడు తప్పక సత్యాన్నే చెప్పాలి. సత్యం వల్ల దీర్ఘాయువు వీర్యవంతుతుంది. వంశం సంతతి రక్షింపబడుతుంది. దీనివల్ల మానవుడు లోకాన్ని రక్షించినట్లువుతుంది."

ఉమ ఇలా అంది. "మర్త్యుడు ఏవిధమయిన వ్రతాన్ని ఆచరించటం వల్ల శుభాలను పొందుతాడు ?" శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "పూర్వం చెప్పిన మూడురకాల దోషాల్ని మనోవాక్కాయ కర్మరూపమయిన వాటిని విడిచిపెట్టడం, వ్రతంలాగా ఆచారించటం తపోవ్రతమని చెప్పబడుతున్నది. మానవుడు పవిత్రమయిన తీర్థంలో చక్కగా స్నానం చేసి పరిశుద్ధ శరీరుడయి, పంచభూతాలను,

సూర్యచంద్రులను, ఉభయ సంధ్యలనూ, ధర్మాన్ని, యముడినీ, పితృదేవతలనూ నమస్కరించి, నేను ఈ విధంగా వ్రతం చెయ్యాలని భావిస్తున్నాను, అని వారికి నివేదించి వ్రతాన్ని ప్రారంభించాలి. వ్రతాన్ని చనిపోయే వరకు చేయవచ్చు లేదా ఏదో కొంతకాలాన్ని నియమంగా పెట్టుకోవచ్చు. కూరల విషయంలో పుష్పఫలాల విషయంలో నియమాన్ని స్వీకరించవచ్చు. బ్రహ్మచర్య వ్రతాన్ని ఉపవాస వ్రతాన్ని చేయవచ్చు. ఈ విధంగా హితాన్ని కోరుకొనేవాడు అనేక విషయాల్లో వ్రతాన్ని చెయ్యొచ్చు. పండితుడు వ్రత భంగం కాకుండా అన్నివిధాలా రక్షించుకోవాలి. వ్రతభంగం జరిగితే అది గొప్ప పాపమవుతుంది. అయితే ఔషధం కోసం, అజ్ఞానం వల్ల, గురువు ఆజ్ఞచేత, బంధువులను అనుగ్రహించటం కోసం, వ్రత భంగం చేస్తే అది దోషం కాదు. వ్రతం పూర్తయిన సందర్భంలో దైవ బ్రాహ్మణపూజ చెయ్యాలి. దీనివల్ల నరుడు వ్రతఫలాన్ని చక్కగా పొందగల్గుతాడు."

ఉమ ఇలా అంది. "పరమేశ్వరా! వ్రత సమయంలో శౌచవిధి ఏవిధంగా ఉండాలో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "బాహ్యాశౌచమని ఆభ్యంతర శౌచమని శౌచం రెండు విధాలుగా ఉంటుంది. మానసమయిన సుకృతానికి ఆభ్యంతర శౌచమని పేరు. ఎల్లప్పుడు విశుద్ధమయిన ఆహారాన్ని తినటం, శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవటం, ఆచమనాదుల ద్వారా పవిత్రతను పొందటం ఇదంతా బాహ్యాశౌచంగా చెప్పబడుతున్నది. పవిత్ర ప్రదేశంలోని మట్టి, ఆవుపేడ, మూత్రం, సుగంధ ద్రవ్యాలు, పుష్టికరమయిన ద్రవ్యాలు, వీటితో శరీరాన్ని తోముకోవటం మళ్ళీ మళ్ళీ నీటిలో శరీరాన్ని శుభ్రపరచుకోవటం ఇదంతా బాహ్యాశౌచం. స్నానం చెయ్యటం వల్ల ఏ నీరు అపవిత్రం కాదో, అంతటా వ్యాపించి ఉంటుందో, నిత్యం ప్రవాహరూపంగా ఉంటుందో, అటువంటి నీటిలో స్నానం చెయ్యాలి. ఇలా కాని చోట స్నానమాచరించరాదు. నిర్మలమైన నీటిలో ముమ్మారు ఆచమనం చెయ్యటం శ్రేష్ఠమయినపని. అలాగే మలమూత్ర శుద్ధిసమయంలో చాలామట్టితో శుద్ధి చేసుకోవటం ఉత్తమం. అదే విధంగా విశుద్ధమయిన జలంతోనే ఆచమనాదులు చెయ్యాలి. మట్టితోరుద్ది, నీటితో కడగటం ద్వారా మలమూత్రశుద్ధి జరుగుతుంది. అదేరీతిగా నీటిని నిర్మలంగా ఉంచుకోవాలి. నిర్మలజలంతో స్నాన ప్రక్షాళనాదులను చేయాలి. పేడతో భూమిని శుద్ధి చెయ్యాలి. లోహవస్తువులను బూడిదతో శుద్ధిచెయ్యాలి. చెక్కడం అరగదీయడం మొదలయిన వాటి ద్వారా చెక్కవస్తువులను శుద్ధి చెయ్యాలి. మట్టిపాత్రలను కాల్చటం వల్ల శుద్ధి జరుగుతుంది. మనుష్యులకు కష్టమయిన వ్రతాదులను చెయ్యటం వల్ల శుద్ధి ఏర్పడుతుంది. మిగిలిన వస్తువులకు దేవి! ఎండించటం వల్ల నీటితో కడగటం వల్ల శుద్ధి ఏర్పడుతుంది బ్రాహ్మణవాక్యాలను వినటంతో ఎల్లవేళలా పవిత్రత ఏర్పడుతుంది. దోషరహితమయిన వస్తువులను నీటితో శుద్ధి చేయవచ్చు. అలాగే ఆ వస్తువును ప్రశంసించటం వల్ల కూడా శుద్ధి చేయవచ్చు. ఇలాంటి విశుద్ధి ఆపత్కాలంలో మాత్రమే చెయ్యవలసి ఉంటుంది.

ఉమ ఇలా అంది. 'మహేశ్వర! దేవదేవ! ఆహారశుద్ధి ఏ విధంగా ఉంటుందో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "ఆహారం మాంసమద్యాలు లేనిది, తడవనిది, నిలవ ఉండనిది, మిక్కిలి కారం. పులుపు ఉప్పులేనిది, సువాసన కల్గినది, పురుగులు, వెంట్రుకలు మలినాలు లేనిది, చక్కగా కన్పించేది, మూతపెట్టబడినది దేవ బ్రాహ్మణులకు నివేదింపబడినది శ్రేష్ఠం. ఈ లక్షణాలు లేని ఆహారం అశుభమయినది. గ్రామాల్లో లభించే వస్తువులతో చేసిన దానికంటే, అరణ్యాల్లో లభించే

పదార్థాలతో చేసిన ఆహారం శ్రేష్ఠమని భావించు. ఎక్కువగా స్వీకరించిన దానికంటె కొద్దిగా మాత్రమే స్వీకరించబడిన ఆహారం విశుద్ధమవుతుంది. యజ్ఞశేషం, హవిశ్శేషం, పితృదేవతలకు నివేదించబడిన ఆహారం పవిత్రమయినది. దేవి! నీకంతా చెప్పాను. ఇంకా నీవేమి వినాలనుకొంటున్నావు?"

ఉమ ఇలా అంది. "కొందరు మానవులు మాంసాన్ని తింటారు. విభో! మరికొందరు మానవులు దాన్ని విడిచిపెడతారు. మహాదేవ! వీనిలో ఏది మంచిది? తినటమా తినకపోవటమా?" శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! మాంసం తినటం వల్ల ఏ దోషం వస్తుందో, తినక పోవటం వల్ల ఏ మేలు జరుగుతుందో, నీకు ఉన్నదున్నట్లు వివరిస్తాను విను. యాగాలు చేయటం, దానాలు చేయటం, వేదాధ్యయనం, యాగాలలో భూరిదక్షిణల నివ్వటం – ఇవేవీ మాంసాన్ని విడనాడటంలో పదహారవవంతు కూడా కావు. తనకు రుచికరమయిన ఆహారం కోసం, పరుల ప్రాణాలను హింసించే మానవుడు పెద్ద పులులు, నక్కలు, గ్రద్దలు, రాక్షసులు, వీరితో సమానుడే. పరమాంసంచేత స్వమాంసాన్ని పోషించుకోవాలనుకొనే నరుడు ఎక్కడ జన్మించినా సరే, ఉద్విగ్నతతోనే జీవిస్తాడు. తన మాంసాన్ని కోస్తే తనకు ఏవిధమయిన బాధ కలుగుతుందో, అలాగే మిగిలిన వాటి మాంసాన్ని కోసినప్పుడు కూడా వాటికి అదే విధమయిన బాధ కల్గుతుందని గ్రహించాలి. జీవితాంతం అన్నివిధాలయిన మాంసాహారాన్ని విడిచి జీవించినవాడు స్వర్గంలో గొప్ప స్థానాన్ని పొందుతాడనటంలో ఎలాంటి సందేహమూ లేదు. **వంద సంవత్సరాలు పూర్తిగా గొప్ప తపస్సు చేసినవాడు, జీవితకాలం మాంసాన్ని విడిచినవాడు - వీరిద్దరూ సమానులే. ఇంకా మాంసాన్ని వర్జించిన వాడే గొప్పవాడవుతాడు. లోకంలో ఏ జీవికయినా తన ప్రాణంకంటె ఇష్టమయిన వస్తువు ఉండదు. కనుక ప్రతివాడూ ప్రాణులపట్ల దయగలిగి ఉండాలి.** ఈ విధంగా ఋషులు మాంసభక్షణను చెయ్యకుండా ఉండటంలోని గుణాల్ని ప్రశంసించారు."

పార్వతి ఇలా అంది. "దేవా ! ధర్మాచరణ చేసేవారు గురుపూజను ఎలా చెయ్యాలో చెప్పండి". శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "శుభురాలా! గురుపూజను గూర్చి ఉన్నదున్నట్లు చెప్తాను విను. గురుపూజ అన్నది కృతజ్ఞత కల్గిన జనులందరికీ అత్యుత్తమమయిన ధర్మమని వేదం శాసిస్తున్నది." అందువల్ల ఏ మానవులకయినా గురువులు పరమపూజ్యులు. ఎందువల్లనంటే వారు ముందుగా ఉపకారం చేసినవారు, గురువులందరిలోను ముగ్గురు గురువులు చాలా గొప్పవారు లోకమంతటికీ పూజ్యులు. ఉపాధ్యాయుడు, తండ్రి, తల్లి – ఈ ముగ్గురూ గురువులలో మిక్కిలిగా పూజింపదగినవారు. తండ్రికి పెద్దవారయన సోదరులు, తండ్రికి తమ్ములయిన వారు, తండ్రికి తండ్రి. తండ్రి వీరందరూ పూజ్యులే. తల్లికి వయస్సులో పెద్దదయిన సోదరి (పెద్దమ్మ), చిన్నదయిన సోదరి (పిన్ని), తల్లితల్లి(అమ్మమ్మ) వెంచి పోషించినదాది – వీరందరూ తల్లులుగా చెప్పబడ్డారు. ఉపాధ్యాయుని కొడుకు, గురువు యొక్క గురువు, ఋత్విక్కు, తండ్రి ఉపాధ్యాయుడు ఈ అయిదుగురు గురువులుగా కీర్తింపబడ్డారు. జ్యేష్ఠ సోదరుడు, రాజు, మేనమామ, మామగారు, భయాన్ని పోగొట్టిన వాడు, భర్త వీరందరూ గురువులని చెప్పబడ్డారు. సాధ్వి! ఈ విధంగా గురువుల్ని గురించి వివరించాను. వారిని ఏ విధంగా అనుసరించాలో, పూజించాలో దాన్ని చెప్తాను శ్రద్ధగా విను. మేలునుకోరుకొనేవాడు, తల్లి, తండ్రి, ఉపాధ్యాయులను ఎల్లవేళలా గౌరవించాలి. పొరపాటున కూడా వారిని అవమానించరాదు. అలా చెయ్యటం వల్ల పితృదేవతలు

సంతోషిస్తారు. బ్రహ్మదేవుడు సంతోషిస్తాడు. తల్లిని పూజించినవాడు దేవమాతలనందరినీ పూజించినట్లే, ఉపాధ్యాయుని పూజించినవాడు బ్రహ్మదేవుని పూజించినట్లే పై గురువులకు అసంతృప్తిని కలిగించినవాడు తప్పక నరకం చేరుకొంటాడు. ఎప్పుడూ గురువులతో వైరం పెట్టుకోకూడదు. గురువులను సంతోషింపజేసిన వాడు పొరపాటున కూడా నరకాన్ని చేరుకోడు. గురువులకు ఇష్టంకాని పని చెయ్యకూడదు. ఇష్టంకాని మాటను కూడా మాట్లాడరాదు. విరోధించి మాట్లాడకూడదు. పోటీగా కూడా మాట్లాడకూడదు. గురువులు ఏమేమి కోరుకుంటారో దాన్ని అస్వతంత్రుడివలె ఆచరించి తీరాలి. వేదానుశాసనం వలె సర్వకాల సర్వావస్థలలోను గురువు వచనం కూడా పాటించవలసిందే. గురువులతో కలహాలను, వివాదాలను విడిచిపెట్టాలి. మోసాన్ని, పరిహాసాన్ని, కోపకథలను, కామప్రసంగాలను చెయ్యరాదు. అహంకార రహితుడై గురువుల ఆజ్ఞలను బద్ధకం లేకుండా నిర్వర్తించిన వాడికంటే మానవులందరిలో ఉత్తమోత్తముడు లేడు, పుణ్యశాలి లేడు. గురువును చూసి అసూయ చెందరాదు. నిందించరాదు. వారికి ప్రియాన్ని మేలును చెయ్యటానికి నిరంతరం అన్వేషించాలి. ఎల్లవేళలా సేవ చెయ్యాలి. గురుపూజను ఎల్లవేళలా చెయ్యటం వల్ల పొందే శుభఫలంతో యజ్ఞఫలం కాని, తపఃఫలితం గాని సాటిరావు. అన్ని ఆశ్రమాల్లోను గురుశుశ్రూషకంటె గొప్ప ధర్మం లేదు. అందువల్ల గొప్ప సహనంతో విసుగు చెందకుండా గురువుకు ప్రీతిని కల్గించాలి. వివేకి తన సొమ్మును, తన శరీరాన్ని గురువుకోసం త్యజించగలగాలి. మోహంతో, ధనప్రీతితో కానీ వారితో వివాదించరాదు. బ్రహ్మచర్యం, అహింస, వివిధములయిన దానాలు, గురువుచేత తిరస్కరింపబడినవాని విషయంలో సక్రమంగా ఫలించవు. ఉపాధ్యాయునికి, తండ్రికి, తల్లికి మనస్సుచేత కాని, పనులచేత, ద్రోహం చేస్తే వారి పాపం భ్రూణహత్యతో సమానమయింది. వారి కంటె లోకంలో పాపాత్ముడుండడు."

ఉమ ఇలా అంది. "పరమేశ్వరా! ఉపవాసవిధిని గూర్చి నాకు చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "శరీరంలోని మాలిన్యాలు తొలగిపోవటానికి, ఇంద్రియాల్ని నియమించడానికి, నరులు, ఏకభుక్త ఉపవాసాలను వ్రతాలుగా ఆచరిస్తుంటారు. ఆ విధంగా చెయ్యటం వల్ల ఆహారాన్ని తగ్గించటం కారణంగా గొప్ప ధర్మఫలాన్ని పొందుతుంటారు. తన కారణంగా చాలామందికి ఎట్టి విఘ్నమూ వీర్పడరాదు. అలాగే ఏ జీవికి ఏ చిన్నగాయం వీర్పడరాదు. ఆ విధంగా జీవించినవాడు ధన్యుడు. ఆ విధంగా చెయ్యటం వల్ల ఆహారాన్ని తగ్గించుకోవటం వల్ల మర్త్యుడు పుణ్యాన్ని పొందుతాడు. దీనిని గృహస్థులందరూ యథాశక్తిగా ఆచరించాలి అని పెద్దలు నిశ్చయించారు. శరీరం ఉపవాసం చేత పీడింపబడ్డప్పుడు ఆపద రాకుండా నీటిని, పాలను స్వీకరించటం వల్ల ఉపవాసానికి విరోధమేర్పడదు. అది కూడా బ్రాహ్మణానుమతితో చెయ్యాలి."

ఉమ ఇలా అంది. "దేవా! బుద్ధిమంతుడు బ్రహ్మచర్యాన్ని ఏవిధంగా రక్షించుకోవాలి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవి! ఆ విషయాన్ని చెప్తాను శ్రద్ధగావిను. బ్రహ్మచర్యం గొప్ప పవిత్రత. బ్రహ్మచర్యం గొప్ప తపస్సు. కేవలం బ్రహ్మచర్యాన్ని స్వీకరించటం వల్ల పరమపదాన్ని పొందవచ్చు. సంకల్పం, చూడటం, కామసంబంధంగా మాట్లాడటం, స్పృశించటం, సంయోగం ఈ అయిదు విధానాల ద్వారా బ్రహ్మచర్య వ్రతాన్ని రక్షించుకోవాలి. అకల్మషమైన బ్రహ్మచర్యాన్ని వ్రతంవలె స్వీకరించి నిత్యమూ సంరక్షించుకోవాలి. అది గృహస్థ విధి. గృహస్థులు కాలాన్ని, కారణాన్ని

మనస్సునందుంచుకొని ఈ వ్రతాన్ని పాటించాలి. జన్మనక్షత్రం వచ్చినప్పుడు, పుణ్యమైన రోజుల్లో, అమావాస్య పౌర్ణమి వంటి రోజుల్లో, దేవతాకార్యాల్లో ధర్మకార్యాల్లో పాల్గొనే సమయాల్లో గృహస్థులు బ్రహ్మచర్య వ్రతం పాటించాలి. ఎల్లవేళలా తన భార్యయందే అనురక్తుడయినవాడు బ్రహ్మచర్య వ్రతఫలాన్ని పొందుతాడు. బ్రహ్మచారి పవిత్రతను, ఆయువును ఆరోగ్యాన్ని పొందగల్గుతాడు.

ఉమ ఇలా అంది. "దేవ! ధర్మాన్ని కోరేవారు తీర్థచర్యావ్రతం చేస్తుంటారు. లోకంలో తీర్థాలంటే ఏమిటి ? నాకు తమరు చెప్పండి " శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "ప్రియా! ఆహా! నీకు తీర్థాల్లో స్నానమాచరించే పద్ధతిని వివరిస్తాను. తీర్థాలు పవిత్రతకోసం, పరిశుభ్రత కోసం బ్రహ్మదేవుని చేత పూర్వం నిర్మింపబడ్డాయి. లోకంలో మహానదులన్నీ తీర్థాలుగా చెప్పబడుతున్నాయి వాటిలో తూర్పుముఖంగా ప్రవహించే నదులు శ్రేష్ఠమయినవి నదులు పరస్పర సంగమ ప్రదేశాలు కూడా తీర్థాలే. సంగమాల్లో కూడా నదులు సాగరంతో కలిసే ప్రదేశాలు శ్రేష్ఠతమాలు వాటి రెండు గట్లు, బుద్ధిమంతులచేత, దేవతలచేత సేవింపబడిన ప్రదేశాలు పరమప్రశస్త తీర్థాలుగా చెప్పబడ్డాయి సముద్రం గొప్పతీర్థం అది పవిత్రమయినది పరమ శుభప్రదం. దాని గట్టున ఉన్న మహాత్ములచే సేవింపబడ్డ ప్రదేశాలు మరింత గొప్పవి ప్రియా! నదుల యొక్క పర్వతాలయొక్క తీరాలు. మహర్షుల చేత, మునుల చేత సేవింపబడినవి తటాకాలయినా కూడా గొప్ప తీర్థాలే. దేవి! ఆయా తపస్సుల యొక్క విశేష ప్రభావమున్న ప్రదేశాలు కనుక అవి తీర్థాలవుతున్నాయి. వారి నివాసాదులవల్లే అవి లోకహితం కోసం తీర్థాలుగా రూపొందించబడ్డాయి తీర్థాలీవిధంగా ఏర్పడతాయి. అచట స్నానం చేసే పద్ధతి చెప్తాను విను. పుట్టినదాదిగా వ్రతాలను చేసేవాడు, కోరికమేరకు తీర్థాలను దర్శించినప్పుడు మూడురోజులుపవాసముండాలి. కనీసం ఒక రోజయినా నియమపూర్వకంగా ఉపవాసం చెయ్యాలి పవిత్రమయిన మాసంలో పౌర్ణమియందు బయటనే పవిత్రుడయ్యాక ఆ తీర్థంలో యథావిధిగా స్నానం కోసం ప్రవేశించాలి. మూడుసార్లు తీర్థంలో మునిగి, బ్రాహ్మణులకు దక్షిణులను ఇచ్చి అక్కడున్న దేవాలయంలో పూజలు చేసి, తర్వాత వచ్చిన దారిన వెళ్ళాలి. అన్ని తీర్థాలందు స్నానం చేసే పద్ధతి ఈవిధంగానే ఉంటుంది దగ్గరగా ఉన్న తీర్థంలో స్నానం చెయ్యటంకంటె సుదూరంలో ఉన్న తీర్థంలో స్నానమాచరించటం విశేష ఫలప్రదమే. మొదటి నుండీ పవిత్రునకు, తీర్థస్నానం మరింత శుభాన్నిస్తుంది తపస్సుకోసం, పాపాలు పోవటానికి, పవిత్రులు కావటానికి జనులు తీర్థస్నానమాచరిస్తుంటారు. ఈ విధంగా పవిత్ర తీర్థాల్లో, తీర్థస్నానం శుభాన్నిస్తుంది ఇదంతా నియమపూర్వకంగా ఆచరిస్తే పుణ్యప్రదమవుతుంది."

ఉమ ఇలా అంది. "లోకంలో లభించే సర్వసామాన్యమయిన ద్రవ్యాన్ని దానంగా ఇస్తే నరునికి పుణ్యం ఎలా లభిస్తుందో చెప్పండి." శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "లోకంలో ఉండే ఏ ద్రవ్యమయినా పంచ భౌతికం, సర్వసాధారణం అయినా దాన్నే దానం చెయ్యటం వల్ల మానవుడు పుణ్యాన్ని పొందుతున్నాడు. దాత, దానగ్రహీత, ఇవ్వబడే వస్తువు, ఇచ్చే ప్రయత్నం, దేశం కాలం ఈ ఆరుదానగుణాలుగా చెప్పబడుతున్నాయి. వీనికి సంబంధించిన గుణవైభవాన్ని నేను తెలియచేస్తాను విను. మొదటినుండి మనోవాక్కాయ కర్మల ద్వారా శుద్ధుడు, సత్యవాది, క్రోధాన్ని జయించినవాడు, దురాశలేనివాడు, అసూయ లేనివాడు, శ్రద్ధకలవాడు, ఆస్తికుడు అయిన దాత గొప్పవాడుగా

ప్రశంసింపబడతారు. పవిత్రుడు, ఇంద్రియ నిగ్రహమున్నవాడు, క్రోధం లేనివాడు, గొప్ప వంశంలో పుట్టినవాడు, పాండిత్యం శీలం నిండుగా ఉన్నవాడు, పెద్దకుటుంబం ఉన్నవాడు, పంచయజ్ఞాలను నిత్యమాచరించేవాడు. శారీరక రుగ్మతలు లేనివాడు గొప్పదాన పాత్రుడని ప్రశంసింపబడుతున్నాడు. ఇలాంటి గుణాలున్నవాడు మంచి ప్రతిగ్రహీత. పితృదేవతారాధనసమయంలో, అగ్నికార్యాలు చేసే కాలంలో చేసిన దానం గొప్ప ఫలాన్నిస్తుంది లోకంలో ఎవడు ఏ వస్తువును స్వీకరించే యోగ్యతలున్నవాడో, ఆ దానానికి వాడు పాత్రుడవుతాడు ఆపదల్లో ఉన్నవాడు ఆపద నుంచి రక్షించటానికి యోగ్యుడవుతాడు. ఆకలి ఉన్నవాడు అన్నదానానికి యోగ్యుడు. దాహం వేసినవాడు జలదానానికి తగ్గవాడు. ఈ విధంగా దానాన్ని పట్టి పాత్రత రకరకాలుగా ఉంటుంది. ప్రియా! జారులు, చోరులు, నపుంసకులు, హింసించేవారు, నియమాన్ని చెడగొట్టేవారు, లోకులకు విఘ్నాన్ని కల్పించేవారు, ఆలాంటివారందరూ దానం పొందటానికి యోగ్యులు కారు. దేవీ ! పరులను హింసించటం వల్ల, దొంగతనం ద్వారాను, నిర్దయగా వ్యవహరించటం వల్ల, దుర్మార్గంగా ప్రవర్తించటం వల్ల, అధర్మం ద్వారా, ధనం పట్ల దురాశవల్ల, చాలామందికి హానికల్గించటం వల్ల, మానవుడు సంపాదించిన ధనం దానానికి అత్యంతం జుగుప్సితమని చెప్పబడుతోంది. భామిని! అటువంటి ధనాన్నుపయోగించి చేసినదానం నిష్ఫలం అవుతుంది. కనుక హితార్థి న్యాయార్జిత ధనాన్నే దానధర్మాలకు వినియోగించాలి. తన మనస్సుకు మిక్కిలి ఇష్టమయిన వస్తువునే ఇతరులకు దానంగా ఇవ్వటం మంచిది. ఇలాంటి దాన ప్రయత్నం దాతలకు గొప్ప మేలు చేకూరుస్తుంది. దాన యోగ్యుడు దూరంగా ఉన్నా సరే అతడిని సమీపించి, అనునయించి, దాత దానంచెయ్యాలి. ఆ దానంవల్ల గ్రహీత మిక్కిలిగా సంతోషించాలి. పై చెప్పిన దాన పద్ధతి పరమశ్రేష్ఠం గ్రహీతను ఆహ్వానించి చేసే దానం మధ్యమం. ప్రియా! ముందుగా గ్రహీత పాత్రతను తెలుసుకొని, పిలిపించి, విషయాన్ని వివరించి, పవిత్రంగా ఆచమన పూర్వకంగాను, శ్రద్ధగానూ దానం చెయ్యవలసి ఉంటుంది. యాచకులు వచ్చి యాచించినప్పుడు వారిని సమ్మాన పూర్వకంగా ఆహ్వానించి దేశకాలానుగుణంగా దానం చెయ్యాలి. మేలుకోరేవాడు అక్కడే ఉన్న అపాత్రులయిన యాచకులకు కూడా దానమివ్వాలి దాత పాత్రత నెరిగి దానం చెయ్యాలి. తన శక్తిని అతిక్రమించి చేసే దానం ఉత్తమం. శక్తిననుసరించి చేసే దానం మధ్యమం. శక్తికి తగినట్లు కాక కొంతమాత్రమే చేసేదానం మూడవరకమయినది. ముందుగా ఏమి ఇవ్వాలని సంకల్పించటం జరిగిందో, దాన్ని ఆ విధంగానే దానం చెయ్యాలి. పుణ్యక్షేత్రాల్లో, పుణ్య ప్రదసమయాల్లో చేయబడ్డదానం దేశ కాలాల మహత్మ్యం వల్ల చాలా గొప్పదిగా పరిగణించబడుతుంది.

ఉమ ఇలా అంది. "దేవ! మిక్కిలి పుణ్యతమమయిన ప్రదేశమేదో, కాలమేదో నాకు దయతో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "కురుక్షేత్రం మహానదులు, దేవర్షులచే సేవింపబడ్డ ప్రదేశాలు పర్వతశ్రేష్ఠాలు, తీర్థాలు, పూజ్యమయిన ప్రదేశాలు గ్రహీత ఎక్కడ దానాన్ని కోరతాడో ఆ ప్రదేశమూ ఇవి గొప్ప ఫలాన్నిస్తాయి. శరత్కాలం వసంతకాలం, పుణ్యమాసాలు, పక్షాలలో శుక్లపక్షం వర్షాకాలాల్లో పూర్ణిమ, పితృనక్షత్రం, దేవతా నక్షత్రం ఉన్న కారణంగా నిర్మలమయిన రోజు చంద్ర సూర్యగ్రహణ సమయాలు దానానికి తగిన సమయాలుగా పవిత్రమయినవిగా చెప్పబడ్డాయి దాత, దేయవస్తువు, దానయోగ్యుడు, దానానుగుణమయిన ప్రయత్నం దేశం, కాలం, ఈ ఆరు చక్కగా ఉంటే దాన్ని దాన సంపచ్ఛుద్ధిగా చెప్పారు. ఏకకాలంలో పై దానసంపదంతా సమకూడితే ఎంత

స్వల్పమయిన దానం చేసినా, అది షడ్గుణ సంపత్తి వల్ల గొప్పదిగా ఫలమిస్తుంది. ఆ దానం అనంతమయి, దోష వర్జితుడయిన ఆ దాతను స్వర్గానికి తీసుకుపోతుంది."

ఉమ ఇలా అంది. "ఇలాంటి గుణగణాలు కల్గిన దానం కూడా ఎపుడయినా నిష్ఫలం కావచ్చా?" శ్రీమహేశ్వరుడిలా అన్నాడు. "మహాభాగా! నరులు భావదోషం కారణంగా అలాంటి పరిస్థితి కూడా రావచ్చు. యథావిధిగా దానం చేసి కూడా ఎవడు పశ్చాత్తాపం పొందుతాడో, సభల్లో తాను చేసిన దానం గురించి ఎవడు ప్రశంసిస్తాడో అటువంటివాడు చేసిన దానం వ్యర్థమయ్యే ప్రమాదమున్నది. పుణ్యాన్ని కోరుకునే దాతలు పైన చెప్పిన దోషాల్ని విడవాలి. ఇది అత్యంత ప్రాచీనమయిన పద్ధతి సత్పురుషులు బహుకాలంగా ఆచరిస్తున్న విధానం. పరుల యొక్క మేలు కోసం దానం చెయ్యబడుతుంది. కాని గృహస్థుడు దాన్ని ఋణంగా భావించాలి. బుద్ధిమంతులు అటువంటి భావనతోనే దానం చెయ్యాలి. ఈ విధంగా నిత్యం దానం చెయ్యటం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుంది. సర్వసాధారణద్రవ్యమే అయినా ఇలా దానం చేస్తే గొప్ప ఫలితం లభిస్తుంది."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! మానవులు ధర్మంకోసం ఏ వస్తువులను దానం చెయ్యవలసి ఉంటుంది ? ఆ వస్తువులను గురించి వినాలనుకొంటున్నాను. తమరు చెప్పండి." శ్రీ మహాదేవుడిలా అన్నాడు. "ప్రియా! నిరంతరం చేసే ధర్మకార్యాలు కొన్ని, నిమిత్తాన్నిబట్టి చేసేవి కొన్ని ఉంటాయి. అన్నం, ఆశ్రయం, దీపం, నీరు, గడ్డి, ఇంధనం, నూనె, గంధద్రవ్యం, ఔషధం, నువ్వులు, ఉప్పు మొదలయిన వస్తువులు, మరికొన్ని కూడా అజస్రదానాలుగా చెప్పబడ్డాయి. మనుష్యులకు అన్నమే ప్రాణం. కనుక అన్నం పెట్టినవాడు ప్రాణమిచ్చినట్లే. కనుక మానవులు ఎల్లప్పుడూ అన్నదానం చెయ్యాలనుకొంటారు. యోగ్యుడైన బ్రాహ్మణునకు ఇష్టమైన అన్నం పెట్టినవాడు పరలోకంలో తన ఉనికి కోసం తరగని నిధిని దాచుకొన్నట్లే. మార్గాయాసంతో అలసిపోయి, ఇంటికి వచ్చినవాడు అతిథిని ప్రయత్నపూర్వకంగా పూజించాలి. అది వరాలనిచ్చే గొప్ప యజ్ఞం. చక్కటి వర్షం వల్ల కర్షకులు సంతోషించినట్లు, అతిథిపూజ చేసినవాడి పితృదేవతలు పరమానందం పొందుతారు. ఎవరి పుత్రుడు లేదా పౌత్రుడు శ్రోత్రియునికి భోజనం పెడ్తాడో వారి పితృదేవతలు గొప్ప ఆనందం అనుభవిస్తారు. చండాలునికి శూద్రునికి అన్నదానం చేసినప్పటికీ అది ఎంతమాత్రం నింద్యం కాదు. కనుక మాత్సర్యం లేనివాడై మానవుడు సమస్తప్రయత్నాల ద్వారా అన్నదానం చెయ్యాలి. పూజ్యురాలా! అన్నదాన ఫలంగా లభించే లోకాల్ని వర్ణిస్తాను. వారి భవనాలు స్వర్గంలో మిక్కిలి ప్రకాశిస్తూ ఉంటాయి. అనేకవందల అంతస్థులు కల భవనాలు, లోపలే తటాకాలు ఉద్యానవనాలు ఉన్నవి, వైడూర్యమణికాంతులలో ప్రకాశిస్తున్నవి. బంగారంతో చేయబడ్డవి, అనేక రూపాలు కల్గినవి, వివిధ రత్నమయాలు, చంద్రమండలంలాగా స్వచ్ఛంగా ప్రకాశించేవి. కింకిణీరవాలు చేసే జాలరులతో శోభించేవి, తరుణ సూర్యునివలె ధగధగలాడేవి, కదిలేవీ, కదలనివి, ఇచ్ఛానుసారం, భక్ష్య భోజ్యాలు సమకూర్చేవీ, గొప్పపడకలు కుర్చీలతో అలంకరింపబడ్డవి. కోరిన ఫలాలనిచ్చే వృక్షాలతో ప్రకాశించేవి. వేలకొలది దిగుడు బావులు, బావులు తటాకాలతో శోభించేవి ఇటువంటి భవనాలను స్వర్గంలో అన్నదాతలు పొందుతారు. ఆ భవనాల్లో నివసించే వారికి రోగ బాధలుండవు. శోకాలుండవు. ఆ భవనాలు శాశ్వతాలు, చిత్రవిచిత్రాలు ప్రాణదాతలకు స్వర్గంలో ఇలాంటి భవనాలు లభిస్తాయి. ప్రపంచంలో అన్నాన్ని పానీయాన్ని దానం చేసినవారు, వివస్వంతుడు,

చంద్రుడు, బ్రహ్మదేవుడు, ప్రజాపతికి చెందిన లోకాల్లో ప్రవేశిస్తారు. అక్కడవారు చిరకాలం అప్సరసల సమూహాలతో క్రీడిస్తారు. మళ్ళీ మనుష్యలోకంలో జన్మించినప్పుడు సమస్త కళ్యాణ గుణాలను కలిగి ఉంటారు. వారు గొప్ప బలం కల్గిన శరీరాలలో ఉంటారు. రోగాలు లేని వారవుతారు. చిరకాలం జీవిస్తారు. గొప్ప వంశంలో జన్మిస్తారు. బుద్ధిమంతులవుతారు. అన్నదానం చేసిన నరులు ఇలాంటి గొప్పగుణాలతో జన్మిస్తారు. అభివృద్ధిని కోరేవాడు విశేషంగా అన్నదానం చెయ్యాలి. అన్ని కాలాల్లో అందరికీ అన్నిప్రదేశాల్లో అన్నివేళలా అన్నదానం చేస్తూనే ఉండాలి.

సువర్ణదానం చాలా గొప్పది. స్వర్గాన్ని చేర్చేది. శుభాలనిచ్చేది. కనుక దాన్ని గురించి ఉన్నదున్నట్లుగా క్రమంగా వర్ణించి చెప్తాను. సువర్ణదానం పాపాత్ముడినీ క్రూరుడినీ కూడా ప్రకాశింపచేస్తుంది. మంచి మనస్సుతో బంగారాన్ని శ్రోత్రియునికి దానం చేసిన మానవులు దానిచేత సమస్త దేవతలను తృప్తిపరుస్తున్నారని వేదం చెప్తున్నది. దేవతలందరూ అగ్ని స్వరూపులు. సువర్ణమున్నూ అగ్ని స్వరూపమే. కనుక సువర్ణదానం వల్ల దేవతలందరూ సంతోషిస్తారు. అగ్ని దొరకనప్పుడు అగ్నిస్థానమందు బంగారాన్ని ఉంచి, కర్మలను చేస్తారు. కనుక స్వర్ణదానం చేసినవారు కోరిన కోరికలను పొందగల్గుతారు. సువర్ణదానంచేసినవారు సూర్యునియొక్క, అగ్నియొక్క బహుప్రకారములయిన శుభలోకాల్ని చేరుకొంటారనటంలో ఎంతమాత్రం సందేహం లేదు. కేవలం బంగారం కంటె, అలంకార రూపాన్ని పొందిన బంగారాన్ని దానం చెయ్యటం ప్రశస్తం. సరియయిన సమయంలో బంగారపు అలంకారాన్ని ధరింపచేసి బ్రాహ్మణునికి భోజనం పెట్టాలి. ఇంతటి గొప్పదయిన బంగారాన్ని ఆశ్చర్యకరమయిన దాన్ని దానం ఇచ్చినవారు మరుజన్మలో గొప్ప కాంతిని, మేధస్సును, అందమయిన శరీరాన్ని కీర్తిని పొందుతారన్నది ముమ్మాటికీ నిజం. కనుక మానవులు భూలోకంలో తమతమ శక్తిమేరకు సువర్ణదానం చెయ్యాలి. పాపాలనుండి విముక్తిని సాధించటానికి సువర్ణదానం కంటె గొప్పదానం ఈ లోకంలో లేదు.

పూజ్యురాలా! ఇకముందు ఆవుల్ని దానం చెయ్యటంలోని విశేషాల్ని వివరిస్తాను. ప్రియా! లోకంలో గోదానం కంటె పవిత్రమయిన దానముండదు. పూర్వం లోకాల్ని సృష్టించాలనుకున్న బ్రహ్మదేవుడు ముందుగా గోవులను సృష్టించాడు. ఈ గోవులు సర్వప్రాణుల జీవికకోసం నిర్మించబడ్డాయి కనుక తల్లులుగా కీర్తింపబడ్డాయి. లోకానికంతటికీ ముందుజన్మించినవి, లోకాలను జీవింపచెయ్యటానికి ప్రవర్తించేవి, నా అధీనంలో ఉండేవి, చంద్రుని అమృతద్రవంతో నిండినవి, సాత్త్వికాలు, పవిత్రాలు, కోరికలు తీర్చేవి, ప్రాణాన్నిచ్చేవి, కనుక గోవులు పుణ్యాభిలాషలయిన మానవులకు ఎంతగానో పూజింపదగినవి. సంతుష్టి కలిగించే మంచి స్వభావం కల్గి, మంచిదూడతో ఉన్న పాడి ఆవును దానం చేసిన మానవుడు, ఆ ఆవుకు ఎన్ని రోమాలుంటాయో అన్ని సంవత్సరాల కాలం స్వర్గఫలాల్ని అనుభవిస్తాడు. కొమ్ములను బంగారు తొడుగులతో అలంకరించి, శరీరాన్ని వస్త్రాలతో అలంకరించి, కంచుపాత్రతోపాటు కపిలగోవును దానం చేసినవాడు తన పుత్రులను, మనుమలను, వంశాన్ని అంతటినీ ఏడు తరాల వరకు పరలోకంలో తరింపచేస్తాడు. తమ పశువుల శాలలో జన్మించినవి, ఖరీదిచ్చికొన్నవి, ద్యూతంలో గెలుచుకొన్నవి, మరొక ప్రాణితో మార్పిడిచేసికొన్నవి. దానంగా తీసుకొన్నవి, జయించి సంపాదింపబడ్డవి, కష్టాల్లోంచి బయటకు తీసుకురాబడినవి, పోషణకోసం తమవద్దకు వచ్చినవి,

ఈ విధానాల ద్వారా సంపాదింపబడ్డ గోవులను దానంగా ఇవ్వాలి. బహుసంతానవంతుడై బక్కచిక్కి కూడా అగ్నికార్యాలు నెరవేర్చే శ్రోత్రియ బ్రాహ్మణునికి, ఆరోగ్యవంతమయిన ధేనువును సమర్పించినవాడు గొప్పలోకాలను పొందుతాడు. నీచునికి, కృతఘ్నునికి, దురాశాపరునకు, అసత్యవాదికి, హవ్యకవ్యాలకు దూరమయినవానికి గోవులను ఎప్పుడూ దానమియ్యరాదు. సత్స్వభావంగల పాడి ఆవును వస్త్రాలతో అలంకరించి, అదేరంగు గల దూడతోపాటు బ్రాహ్మణునికి దానంగా ఇచ్చినవాడు చంద్రలోకంలో ప్రవేశిస్తాడు. సత్స్వభావంగలిగి పాలిస్తున్న కర్రిఆవును వస్త్రాలతో అలంకరించి, అదేరంగు గల దూడతో పాటు దానం చేసినవాడు వరుణలోకాన్ని పొందుతాడు. బంగారు రంగు శరీరం కన్నులు గల పాడి ఆవును వస్త్రాలతో అలంకరించి, దూడతో, పాలు పితుకుకొనే కంచుపాత్రతో సహా దానం చేసినవాడు కుబేరుని నివాసాన్ని పొందుతాడు. వాయుధూళి రంగున్న ఆవును, దూడతో సహా, కంచు పాలపాత్రతో సహా, వస్త్రాలతో సహా దానం చేసినవాడు వాయులోకంలో గొప్ప స్థానాన్ని పొందుతాడు. సమాన రంగు కల్గిన దూడతో సహా, మంచి నడవడిగల తెల్లని పాడి ఆవును వస్త్రాలతో అలంకరించి, దానం చేస్తే అగ్నిలోకంలో గొప్పస్థానం లభిస్తుంది. యౌవనంలో బలంగా ఉన్న నల్లని ఎద్దును వంద ఆవులతో సహా శ్రోత్రియులయిన మహాత్ములకు దానం చేస్తే వారు ప్రతి జన్మలోను పరమైశ్వర్యవంతులవుతారు. ఆ వృషభానికి పెద్దకొమ్ములుండాలి. వానిని బంగారంతో అలంకరించాలి. గోవుల మూత్రాన్ని, పేడను ఎన్నడూ ద్వేషించరాదు. వీని మాంసాన్ని తినరాదు. ఎల్లవేళలా గోవులపట్ల భక్తి కల్గిఉండాలి. తాను ఆహారాన్ని స్వీకరించటానికి ముందు పవిత్రుడై పరుల గోవునకు సంవత్సరంపాటు పిడికెడు గడ్డిని సమర్పించినవాడు ఆ వ్రతఫలంగా అన్ని కోరికలను సఫలం చేసుకొంటాడు. ఉభయకాలాల్లోనూ గోవులకు మేలు జరగాలని కోరుకోవాలి. వాటి విషయంలో పాపపు ఆలోచనను చేయరాదు. ఇలా ధర్మవిదులు చెప్తున్నారు. గోవులు పరమ పవిత్రాలు గోవులమీద లోకస్థితి ఆధారపడి ఉంది. లోకానికి తల్లివంటి గోవులను ఎప్పుడూ అవమానించరాదు. అందువల్లనే గోదానం ప్రత్యేకమయిందిగా చెప్పబడింది. గోపూజ గోభక్తి నరునికి ఆయుష్షును పెంచుతుంది.

తర్వాత గొప్ప ఫలితాన్నిచ్చే భూదానం గురించి వివరిస్తాను భూదానంతో సమానమయిన దానం లోకంలో లేదు. నిశ్చయం. గృహంతో లేదా పైరుతో కూడుకొన్న భూమిభాగాన్ని దానం చెయ్యాలి. అది సుఖంగా అనుభవించేటట్టుండాలి. వివాదరహితంగా ఉండాలి. వాస్తుపూర్వకమయిన వసతులుండాలి. ప్రతిగ్రహీతను వస్త్ర పుష్పాలతోను చందనాదులతోను అలంకరించాలి. భృత్యులు కుటుంబసభ్యులతో సహా ప్రతిగ్రహీతను ఆహ్వానించి, అందరికీ భోజనం పెట్టి, దక్షిణతో సహా మూడుసార్లు ఆచమనపూర్వకంగా భూదానం చెయ్యాలి. మాత్సర్యాన్ని విడిచి ఈ విధంగా ఎవరు శ్రద్ధతో భూదానం చేస్తారో వారు ఆ భూమి ఉన్నంతకాలం దాన ఫలితాన్ని పొందుతూనే ఉంటారు. భూదానం చేసినవాడు స్వర్గంలో బహువత్సరాలు నివసిస్తాడు. చలించని నాశనం కాని, ఆ భూమి దాతకు సమస్తకామాలను అనుగ్రహిస్తుంది. నరుడు తన జీవనం కోసం చిన్న చిన్న పాపాల్ని చేసి ఉండవచ్చు. గో కర్ల ప్రమాణమంత భూమినిదానం చేయడం వల్ల ఆసమస్త పాపాలు తొలగిపోతాయి. బంగాతం, వెండి, వస్త్రం, మణులు, ముత్యాలు. ఇవన్నీ భూమిదానంలో అంతర్భూతంగా ఉంటాయి. (వాటిని కూడా దానం చేసినట్లే).

ప్రభువు మేలు కోసం. యుద్ధం చేసినవారు, యుద్ధరంగంలో ప్రాణాలర్పించినవారు, బ్రహ్మలోకాన్ని పొందబోయేవారు కూడా, భూమిదానం చేసినవాడు పొందే ఫలాన్ని మించి పొందలేరు. చక్కగా దున్నిన భూమిని విత్తనాలు చల్లినదాన్ని, ఫలాలతో నిండిన దాన్ని, బావులు వసతిగృహాలు కల్గిన దాన్ని దానం చేస్తే. ఆ దానం సర్వకామాలను పూరిస్తుంది. పండిన పైరు కల్గిన భూమిని బ్రాహ్మణునికి దానం చేసినవాడు. సమస్త పాపాల నుండి విముక్తుడై, శక్రలోకాన్ని పొందుతాడు. వివిధంగా తల్లి తన బిడ్డను తన పాలతో పెంచి పోషించినట్లు. భూదానం అన్నిఫలితాలను ఇచ్చి దాతను వృద్ధిపరుస్తుంది. మంచి శీలం కల్గి శుచివ్రతుడై ఆహితాగ్ని అయిన బ్రాహ్మణునికి భూదానం చేసిన దాత నరకానికిపోడు. చంద్రుడు రోజురోజూ వృద్ధిని పొందినట్లు భూదాన ఫలం పంట పంటకూ వృద్ధిని పొందుతుంటుంది. ఏ విధంగా భూమిమీద చల్లిన విత్తనాలు ప్రతిరోజు వృద్ధిని పొందుతాయో, ఆ విధంగానే భూమి దానం వల్ల సంపాదించబడిన గుణాలు వృద్ధిపొందుతుంటాయి. పితృలోకంలో ఉన్న పితృదేవతలు, స్వర్గంలోని దేవతలు, భూదానం చేసినవానిని, సమస్త భోగాలు కల్పించి ఆనందపరుస్తారు. భూమిదానం చేసినవాడు, గొప్ప ఆయుర్దాయాన్ని, శ్రేష్ఠమయిన శరీరాన్ని, విశాలమయిన సంపదలను, వరలోకంలో పొందుతాడు. భూమి దానానికి సంబంధించి నేను చెప్పిన గొప్ప ఫలితం సనాతనం, శ్రద్ధావంతులయిన నరులు నిత్యం దీన్ని వింటుండాలి.

ఇకముందు కన్యాదాన ఫలాన్ని వివరిస్తాను. మహాదేవి! తన కన్యకను గాని, పరులకుమార్తెను గాని కన్యను దానంగా ఇవ్వవచ్చు. మంచికులంలో పుట్టి పవిత్రవ్రతాచారాలు పాటించే అందమైన కన్యను యోగ్యుడయిన వరునికి దానమివ్వాలి. ఆ ప్రతిగ్రహీత ఆ కన్యను మిక్కిలిగా కోరుకొన్నవాడు కావాలి. ముందుగా బంధువులందరితో సంప్రదించి కన్యకను దానం చెయ్యటానికి నిశ్చయించాలి. ముందుగా దాసదాసీలను బంధువర్గాలను పిలిచి, ఇంటిని అలంకరించాలి. తరువాత వివిధ గృహోపకరణాలు, పశువులు, ధాన్యాలు మొదలయిన వాటన్నిటితో సహా కన్యకను చక్కగా అలంకరించి, తగిన వరునికి వివాహం ద్వారా అగ్ని సాక్షికంగా సమర్పించాలి. భవిష్యజ్జీవనానికి తగిన వసతులన్నీ కల్పించి, ఆదంపతులను మంచి గృహంలో ఉంచాలి. ఈ విధంగా కన్యాదానం చేస్తే, దాని గొప్పతనం వల్ల, చనిపోయాక, స్వర్గంలో దాత చిరకాలం జీవిస్తాడు. మళ్ళీ జన్మించినప్పుడు సౌభాగ్యాన్ని వంశాభివృద్ధినీ దాత పొందుతాడు దేవి! యోగ్యునకు విద్యాదానం చేస్తే మానవుడు, మరణానంతరం తిరిగి జన్మించినప్పుడు మేధనూ, వృద్ధినీ, ధైర్యాన్ని పొందుతాడు. తగిన యోగ్యతలున్న శిష్యునికి విద్యాదానం చేసినవాడు యథావిధిగా చేసిన ఆ దానానికి అనంతమయిన ఫలాన్ని దాతపొందుతాడు. శుభాననా! దరిద్రులకు ధనసహాయం చేసి విద్యను నేర్పించటం కూడా స్వయంగా విద్యాదానం చేసినదానితో సమానంగా భావించాలి. "మానిని! ఈ విధంగా మహాదానాలన్నిటి గురించి నీకు చెప్పాను. దేవి! నీవు మనస్సుకు ప్రీతికలిగే విధంగా ఇంకా ఏమి వినాలనుకొంటున్నావు."

ఉమ ఇలా అంది. "నువ్వులతో కూడిన దానం ఎలా చెయ్యాలి ? అలా చెయ్యటంవల్ల ఏమేమి ఫలితాలు లభిస్తాయో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "నువ్వుల దానం చేసే పద్ధతిని వివరిస్తాను శ్రద్ధగా విను. సంపదలు కలవారు గాని, లేనివారు గాని తప్పక నువ్వులను దానంగా ఇవ్వాలి. ఎందుకంటె నువ్వులు చాలా పవిత్రమయినవి, పాపాలను పోగొట్టేవి, మిక్కిలి

పుణ్యాలను సమకూర్చేవిగా చెప్పబడ్డాయి. పరిశుభ్రమయిన నువ్వులను చక్కగా శుద్ధిచేసి, శక్తినమసరించి, పర్వతాకారంగా నువ్వుల రాశిని సమకూర్చాలి. దానితోపాటు రత్నాలుకూడా దానమివ్వాలి. ఆ రాశి చాలా గొప్పదికావచ్చు, లేదా చిన్నదయినా కావచ్చు. దానితో పాటు ఇతర ద్రవ్యాలను కూడా ఇవ్వాలి. బంగారం వెండిగాని, మణులు, ముత్యాలు, పగడాలు మొదలయిన వస్తువులతో కాని తగినరీతిగా అలంకరించి, వేదికను, జెండాను తయారుచెయ్యాలి. అలంకారాలు వస్త్రాలు పడకలు, ఆసనాలు మొదలయినవాటిని కూడా సేకరించాలి. ఆశ్వయుజమాసం పౌర్ణమినాడు, అర్హులయిన అనేక మంది బ్రాహ్మణులకు యథావిధిగా భోజనం పెట్టి, దాత స్వయంగా ఉపవాసముండి, మంచి పవిత్రత నడవడికలవాడై ఆ తిలరాశికి ప్రదక్షిణచేసి, దక్షిణతోపాటు బ్రాహ్మణులకు సమర్పించాలి. ఈ దానం ఒక్క బ్రాహ్మణునకు గాని, అనేకమందికి గాని చేయవచ్చు. ఐశ్వర్యకాముడు చేసిన ఇటువంటి దానం యొక్క ఫలితం అగ్నిష్టోమ యాగ ఫలంతో సమానంగా ఉంటుంది. లేదా నువ్వులతోనే భూమిమీద గోవు ఆకారంలో రాశి నేర్పరిచి, వస్త్రాలతోను, రత్నాలతోను అలంకరించి, గోదాన ఫలాన్ని ఆశించేదాత, యోగ్యుడయిన బ్రాహ్మణునికి సమర్పించాలి. దీనివల్ల గోదాన ఫలితం లభిస్తుంది. నువ్వులతో నిండిన శరావాలను (పాత్రలను) బంగారంతో పాటు, సంవెంగ పుష్పాలతోపాటు, బ్రాహ్మణునికి దానం చేసినరాజు పుణ్యఫలాన్ని పొందుతాడు. ఈ విధంగా మేలుకోరే మానవుడు నువ్వులను దానంగా ఇవ్వాలి. దేవి! ఇక అనేక విధాల దానాలు చెయ్యటంవల్ల లభించే ఫలాన్ని వర్ణిస్తాను విను. అన్నదానం వల్ల మానవుడు బలాన్ని, ఆయుర్దాయాన్ని, ఆరోగ్యాన్ని పొందుతాడు. పానీయం దానం చెయ్యటంవల్ల అందం, రసజ్ఞానం లభిస్తుంది. వస్త్రదానం వల్ల, దాత శరీర సౌందర్యాన్ని అలంకారాలను పొందుతాడు. దీపదానంవల్ల బుద్ధివైభవాన్ని, కాంతిని శోభను నరుడు పొందుతాడు. గొడుగును దానం చేసినవాడు రాజవంశాన్నుండి ఎన్నడూ వేరుచెయ్యబడడు. దాసదాసీలను దానం చేసినవాడు కర్మపరంపరను అంతమొందిస్తాడు. మరణానంతరం మళ్ళీ జన్మించినప్పుడు సుగుణాలు కల్గిన అనేకమంది దాసదాసీలను పొందుతాడు. రథాదిప్రయాణ సాధనాల్ని, అశ్వాది వాహనాల్ని, అర్హునికి దానం చేసిన నరుడు, పాదరోగాలనుంచి విముక్తిని పొందుతాడు. వాయువేగం కల వాహనాల్ని పొందుతాడు. విచిత్ర రమణీయ రథాదులను, అశ్వాదులను పొందుతాడు. సేతువు, బావులు, చెరువులు మొదలయిన వాటిని నిర్మించిన మానవుడు దీర్ఘాయువును, అందాన్ని పొందుతాడు. మరణానంతరం ఉత్తమలోకాల్ని చేరుకొంటాడు. చెట్లను నాటి, నీడను, పూలను, పండ్లను జనులకిచ్చిన వాడు చనిపోయినప్పుడు, గొప్ప పుణ్యాన్ని పొందుతాడు. అందరికీ ఆదరణీయుడవుతాడు. నదుల్లో మెట్లు మొదలయినవి నిర్మించటం ద్వారా నీటిని తీసుకొని పోయేవారికి సౌకర్యాలు కల్పించేవాడు చనిపోయాక పుణ్యలోకాల్ని పొందుతాడు. అన్ని దుఃఖాలనుండి విముక్తుడవుతాడు. మార్గాలను నిర్మించినవాడు మరుజన్మలో కూడా మంచి సంతానవంతుడవుతాడు. తీర్థ ప్రదేశములందు మెట్ల పంక్తివంటి వానిని నిర్మించిన నరుడు శరీర సంబంధ దోషాలనుండి విముక్తిని పొందుతాడు. దయతో ఆర్తులకు మందులనిచ్చి రోగనివారణ చేసిన వారు వ్యాధిహీను లవుతారు, విశేషంగా దీర్ఘాయువును పొందుతారు. దయగలవాడై దీనుల్ని, గ్రుడ్డివారిని, అవిటివారిని, అనాథులను పోషించిన వాడు మరణానంతరం గొప్ప పుణ్యఫలాన్ని పొందుతాడు. సమస్త కష్టాలనుండి విముక్తిని పొందుతాడు. వేదగోష్ఠి ప్రదేశాలు, సభాభవనాలు, భిక్షులమఠాలు మొదలయినవి, నిర్మించినవాడు మరణానంతరం నిత్యమయిన

పుణ్యఫలం పొందుతాడు. అనేక విధాలయి, బహ్వాకృతులు కల్గి, భక్ష్యభోజ్యాలతో నిండిన అందమైన గోశాలలను నిర్మించి ఇచ్చిన నరుడు చనిపోయాక మేలయిన జాతిలో జన్మిస్తాడు. వ్యాధి రహితుడవుతాడు. అనేకవిధాల ద్రవ్యాలను అతడు దాన ఫలంగా పొందగల్గుతాడు. బుద్ధి, ఆయువు, ఆరోగ్యం, బలం, భాగ్యం, శాస్త్రం, ఈ ఏడు రూపాల్లోను మనుష్యులు చేసిన పుణ్యకర్మ ఫలిస్తుంది. ఇది నిశ్చయం."

ఉమ ఇలా అంది. "యజ్ఞం చాలా ప్రత్యేకమయినదని చెప్తారు. లౌకికం, వైదికంగా చెప్పబడే యజ్ఞాన్ని గూర్చి నాకు చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "దేవతలను ఆరాధించటమన్నది యజ్ఞాలద్వారానే జరుగుతుంది. యజ్ఞాల గురించి వేదాల్లో వివరించబడింది. వేదాలు బ్రాహ్మణుల నాశ్రయించి ఉంటాయి. ప్రియా! స్వర్గంలో కాని, భూమి మీద కాని ఉన్న సమస్త ద్రవ్యం లోకహితంకోసం, యజ్ఞసంపాదన కోసం సృష్టించబడిందని తెలుసుకోవాలి. ఈ విషయాన్ని గ్రహించి, విద్వాంసుడు భార్యతో కూడి నిత్యం యజ్ఞవిధిని చేస్తుంటాడో, అతడు బ్రహ్మప్రీతికరమయిన కర్మను ఏకాగ్రతతో చెయ్యటం వల్ల మరణానంతరం పుణ్యలోకాల్ని పొందుతాడు. వేదరూపమయిన బ్రహ్మ నిత్యం బ్రాహ్మణులయందే ఉంటుంది. కనుక విప్రులు శాస్త్రానుసారం, వేదప్రోక్త యజ్ఞకర్మల నాచరించి దేవతలను సంతోషపెట్టాలి. బ్రాహ్మణులు క్షత్రియులు యజ్ఞకర్మాచరణ కొరకు సృజించబడ్డారు. వేదాల్లో చెప్పబడ్డ అగ్నిష్టోమాది యజ్ఞాలు, పరిశుద్ధులయిన యజమానులచేత, ఋత్విక్కులచేత, నిర్మలమైన ద్రవ్యాలు, ఉపకరణాల చేత శాస్త్రప్రకారంగా నిర్వహింపబడాలన్నది నిశ్చయం. ఆ విధంగా యజ్ఞాలను నిర్వహించటంవల్ల దేవతలు సంతోషిస్తారు. సమస్త దేవతలు తృప్తిచెందితే యాగకర్త యజ్ఞ ఫలాన్ని పొందుతాడు. యజ్ఞాలవల్ల తృప్తినొందిన దేవతలు లోకాలను వృద్ధిపరుస్తారు. అందువల్ల, యాగం చేసినవాడు స్వర్గాన్ని పొంది దేవతలతో కూడి ఆనందిస్తాడు. యజ్ఞంతో సమానమయిన దానం గానీ, నిధిగానీ, లేదు. సర్వధర్మసమూహమూ యజ్ఞమందున్నది. ఇంతవరకు చెప్పినది యజ్ఞాలద్వారా దేవతలను పూజించే పద్ధతి. మరొక లౌకిక పద్ధతి కూడా ఉన్నది. విను. దేవతలను సత్కరించటానికి లోకంలో చేసే ఉత్సవాలు కూడా దేవతలకు ప్రీతిని కలిగించేవే. దేవాలయాన్ని చక్కగా సంస్కరించి, శుభ్రపరిచి, ఉత్సవాలను నిర్వహించి, యాగాలు చేసి, ఫలహారాలు సమర్పించి, పవిత్రుడై యదావిధిగా దేవతలను సంతోషపరచటం ద్వారా మానవుడు పుణ్యఫలాన్ని పొందుతాడు. దేవీ! మానవులు లోకంలో దేవతల ప్రీతికోసం రకరకాలుగా పూజలు చేస్తుంటారు. మంచి గంధాన్ని పూలమాలలను, అగురుధూపాలను, గొప్ప అన్నాదులను, వివిధస్తుతులను, నృత్యాలను, వాద్యాలను, సంగీత సభలను, కంటికింపయిన కార్యక్రమాలను చేస్తుంటారు. ప్రయత్నపూర్వకంగా వీని నాచరించినవారి భక్తి విశేషంచేత స్వర్గవాసులయిన దేవతలు పరమానందం పొందుతారు."

శ్రాద్ధవిధి - మూడు రకాల దానం - అయిదురకాల ఫలం.

ఉమ ఇలా అంది. "అందరికీ సర్వసంపదలను అనుగ్రహించే పితృదేవతలు పూజ్యులు కదా! దేవా! పితృయజ్ఞం ఏవిధంగా చెయ్యాలో నాకు చెప్పండి. శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. పితృమేధాన్ని గూర్చి ఉన్నదున్నట్లుగా చెప్తాను. దేవీ! శ్రద్ధగా విను. పితృమేధం ఏ ప్రదేశంలో ఏ కాలంలో చెయ్యాలి.

దానిలోని శుభాశుభాలేమిటి ఇవన్నీ వివరిస్తాను. సమస్తలోకాల్లోను దేవతలు పూజ్యులే. వారు దేవతలకు కూడా దేవతలే. వారు పరిశుభ్రులు, పవిత్రులు, పుణ్యాత్ములు, వీరు దక్షిణ దిక్కును ఆశ్రయించి ఉంటారు. భూమిమీద జీవించే సమస్త ప్రాణులు వర్షంకోసం ఎలా నిరీక్షిస్తుంటాయో, అలాగే పితృదేవతలు కూడా పితృమేధం కొరకు ఎదురు చూస్తుంటారు. పితృమేధం చెయ్యటానికి కురుక్షేత్రం, గయ, గంగ, సరస్వతి, ప్రభాసం, పుష్కరం, ఈ క్షేత్రాలు పరమయోగాలు, ఇక్కడ చేసినదానికి గొప్ప ఫలితం లభిస్తుంది. తీర్థాలు, పుణ్యనదులు, నిర్జనారణ్యాలు, నదీతీరంలోని ఇసుకనేలలు - ఈ ప్రదేశాలు శ్రాద్ధానికి తగినవి. మాసాల్లో మాఘ భాద్రపదమాసాలు శ్రాద్ధకర్మకు పరమశ్రేష్ఠాలు. పక్షాల్లో శుక్లపక్షం కంటె కృష్ణపక్షం ప్రశస్తమయింది. పితృదేవతలు, అమావాస్య, త్రయోదశి, నవమి, పాడ్యమి తిథుల్లో శ్రాద్ధాన్ని నిర్వహించటం వల్ల మిక్కిలిగా సంతోషిస్తారు. పగటి పూర్వభాగమందు, శుక్లపక్షమందు, రాత్రి, జన్మదినాన సరిరోజుల్లో పండితుడయినవాడు శ్రాద్ధకర్మను చేయరాదు. పితృశ్రాద్ధానికనుకూలమై ప్రశస్తమయిన కాలం. ఈ విధంగా చెప్పబడింది. ఏ సమయంలో యోగ్యుడయిన బ్రాహ్మణుడు భోక్తగా దొరుకుతాడో ఆ సమయం కూడా శ్రాద్ధయోగ్యంగా చెప్పబడింది. పంక్తిబాహ్యులయిన బ్రాహ్మణులను శ్రాద్ధభోజన సమయంలో విడిచిపెట్టాలి. పంక్తిని పవిత్రంచేసే బ్రాహ్మణులను పిలవాలి. శ్రాద్ధం సమయంలో పాపాత్ములకు భోజనం పెట్టినవాడు నరకం పొందుతాడు. మంచినడవడి, పాండిత్యం, వంశం, గుణగణాలున్న బ్రాహ్మణులను వారి భార్యలతోపాటు పిలవాలి. ఇటువంటి వారే శ్రాద్ధ యోగ్యులవుతారు బ్రాహ్మణులసంఖ్య బేసి సంఖ్య కావాలి. ఇటువంటి బ్రాహ్మణులను ముందురోజుగాని, అదే రోజు ప్రాతఃకాలమందుగాని శ్రాద్ధానికి నిమంత్రణ చేయాలి. తర్వాత శాస్త్రంలో చెప్పిన విధంగా శ్రాద్ధవిధిని ప్రారంభించాలి. శ్రాద్ధవిధిలో కుతపవేళ, కుమార్తెకొడుకు, నువ్వులు - ఈ మూడు పరమ పవిత్రాలుగా చెప్పబడ్డాయి. పవిత్రత/ శుభ్రత, క్రోధం లేకుండటం, తొందరపడకుండా ఉండటం ఈ మూడు క్రియలు మిక్కిలి ప్రశంసార్హాలు. కుతప వేళ, ఖడ్గపాత్రం, కుశలు, దర్భలు, తిలలు, తేనె, ఆ సమయంలో దొరికే కూరలు, గజచ్ఛాయ ఇవి శ్రాద్ధకర్మ యందు పవిత్రమయినవనిగా చెప్పబడుతున్నాయి. (పగటిని పదిహేను భాగాలుగా చేసినప్పుడు, ఎనిమిదవ భాగానికి 'కుతప' మని పేరు (మిట్ట మధ్యాహ్న మన్నమాట) గజచ్ఛాయ - అనగా శ్రాద్ధోచితమయిన సూర్యగ్రహణ సమయం) శుభురాలా! వివిధ వర్ణాలు కల నువ్వులను (శ్రాద్ధంలో ఉపయోగించాలి. అశుద్ధమూ, అపవిత్రమూ అయిన పదార్థం కూడా తిలలవల్ల శుద్ధి పొందుతుంది. శ్రాద్ధభోజనానికి నీలవస్త్రంగాని, కషాయవస్త్రంగాని ధరించిన వానిని, భిన్నవర్ణుని, అప్పుడే గాయమయినవాని, అవయవ లోపమున్నవానిని, అపవిత్రునిగాని పిలవరాదు. ఇటువంటివారిని దూరంగా ఉంచాలి. బ్రాహ్మణులకాహారం తయారుచేశాక వారిని చక్కగా పూజించాలి. ముఖక్షవరం, శిరఃస్నానం అయిన తర్వాత వారిని సముచితమయిన ఆసనం మీద కూర్చుండపెట్టాలి. సుగంధపుష్పమాలలు, ఆభరణాలు దండలతో వారిని అలంకరించాలి. అలంకరింపబడి, చక్కగా కూర్చొని ఉన్న బ్రాహ్మణులతో శ్రాద్ధవిధిని చేయనున్నట్లు నివేదించాలి తర్వాత దక్షిణ ముఖంగా దర్భల సమూహాన్ని పరచి, దాని సమీపంలో అగ్నిని ప్రజ్వరిల్లచేసి స్వధాకారాలతో హోమం చేయాలి. ముందుగా అగ్నికి సోమునకు ఆహుతులను సమర్పించాక, పితృదేవతలకు ఆహుతులను సమర్పించాలి. తర్వాత దక్షిణ ముఖంగా ఉండి, అపసవ్యంగా పితృదేవతల

పేర్లను గోత్రాన్ని ఉచ్చరిస్తూ మూడు పిండాలను దర్భలమీద ఉంచాలి. పిండాలను బొటనవేలితో తాకరాదు. ఈ విధంగా పితృదేవతలకు చేయబడిన పిండప్రదానం, అక్షయమవుతుంది. తర్వాత బ్రాహ్మణులను యథాశక్తిగా పవిత్రుడై పూజించాలి. దక్షిణలతో, వస్తుసామగ్రితో బ్రాహ్మణులు సంతోషపడేవిధంగా పూజించాలి. శ్రాద్ధకర్మ సమయంలో పరస్పర సంభాషణలు చేయరాదు. శరీరాన్ని మాటను కూడా నియంత్రించి, శ్రాద్ధకర్మను ప్రారంభించాలి. ఆ విధంగా పిండప్రదానాలు చేశాక, ఆ పిండాలను, బ్రాహ్మణులు అగ్ని, మేక, ఆవు వీటికి పెట్టాలి. లేదా నీటిలో కలపాలి. పుత్రులు కావాలని కోరిక ఉంటే మధ్యమ పిండాన్ని భార్యచేత తినిపించాలి. పితృదేవతలారా! నా గర్భంలో కమలాలమాలను ధరించిన కుమారుణ్ణి అనుగ్రహించండని కోరుకోవాలి. భుజించితృప్తి పడిన బ్రాహ్మణులు లేచిన తరువాత మిగిలిన అన్నమును వారి అనుమతితో కర్త ఇంటిలోని వారితో, సేవకులతో సహా భుజించాలి." ప్రాచీనమయిన పితృయజ్ఞం సంగ్రహంగా చెప్పబడింది. దీనివల్ల పితృదేవతలు సంతోషిస్తారు. కర్త సఫలుడవుతాడు.

మానవుడు తన శక్తిమేరకు ప్రతిరోజూ, ప్రతి మాసంలో, సంవత్సరానికి నాలుగుసార్లు, రెండుసార్లు కాని శ్రాద్ధవిధిని చెయ్యాలి. పితృమేధంవల్ల మానవుడు దీర్ఘాయువును, ఆరోగ్యాన్ని, పుత్రులను, బహుసేవకులను గొప్ప ధనధాన్యాలను పొందుతాడు. శ్రాద్ధం చేసేవాడు నిర్మలమై బహువిధమయిన స్వర్గాన్ని పొందుతాడు. రజోగుణ రహితమూ అప్సరోగణ సేవితమూ అయిన స్వర్గంలో నిరంతరం నివసిస్తాడు. పుష్టినికోరి శ్రాద్ధవిధిని చేస్తే పండితులకు వారి పితృదేవతలు పుష్టిని, సంతతిని సదా కల్గిస్తారు. బుద్ధిమంతులు శ్రాద్ధవిధిని, కీర్తి, ఆయువు, స్వర్గం, శత్రునాశం, కులవర్ధకంగా చేస్తారు. దేవి! దానవిధి విషయంలో ప్రమాణం ఏ విధంగా ఉంటుందో చెప్తాను విను. మానవుడు తన దగ్గరున్న సర్వస్వాన్ని దానం చేస్తే అది ఉత్తమం. శుభురాలా! దీన్నే సర్వదాన విధియని ప్రశస్తమని చెప్తారు. దరిద్రుని వద్ద ప్రస్థం (నాలుగుమానికలు) ద్రవ్యం ఉంటే, అది అతని సారం అవుతుంది. కోటిధనమున్నవాడి సారం కోటి ధనం అవుతుంది. ప్రస్థసారమున్నవాడు. ప్రస్థాన్ని, కోటిసారమున్నవాడు కోటిని దానం చేస్తే గొప్పస్థితిని పొందుతాడు. రెండూ గొప్పవే ఆ గొప్పతనం ఫలితంతో సమానమవుతుంది. ధర్మార్థ కామభోగములందు శక్తికి తక్కువగా చేసేదానం మధ్యమం తనకున్న దానిలో చాలా తక్కువ దానం చేస్తే అధమం అవుతుంది. దేవి! చేసినదానానికి ఐదురకాలయిన ఫలం లభిస్తుంది. వినుఆనంత్యం, మహత్ఫలం, సమం, హీనం, పాతకం, ఇవి ఫలాలు. దేవి! వాటిలోని తరతమ భేదాన్ని చెప్తాను, శ్రద్ధగా వినువిడిచిపెట్ట శక్యం కాని దాన్ని దానం చేస్తే వచ్చే ఫలం ఆనంత్యం. చేసినదానికి ఆరు రెట్లు ఫలం రావటాన్ని మహత్ఫలం అంటారు. తన శ్రద్ధననుసరించి, తగినవిధంగా దానం చేస్తే వచ్చే ఫలితం సమం. గుణహీనమయిన దానం హీనంగా చెప్పబడ్డది. ఆరుదాన గుణాలు తారుమారుగా చేసినదానం పాతకమని చెప్పబడుతుంది. దేవలోకంలో బహుకాలం నివసించటాన్ని ఆనంత్యఫలమంటారు. మహాదానం అంతకాలమూ స్వర్గంలో పూజలనందుకొనేది. సమదానం మనుష్య లోకంలో భోగాల్ని కల్గిస్తుంది. శుభురాలా! శుభక్రియావిరహితమయిన దానం హీనం. నిష్ఫలమవుతుంది. లేదా మ్లేచ్ఛ దేశాల్లో జన్మించి దాని ఫలాన్ని పొందవలసి ఉంటుంది. అశుభదానం చేసినవాడు మరణానంతరం నరకాన్నిపొంది, తిరిగి పశుపక్ష్యాదులలో జన్మిస్తాడు.

ఉమ ఇలా అంది. "అశుభమయిన దానానికి కూడా శుభమయిన ఫలితం ఎలా వస్తుంది." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "శుద్ధమయిన మనస్సుతో, నిష్కామభావనతో, క్రౌర్యం లేకుండా దయతో, ప్రీతితో వీరకమయిన దానాన్ని చేసినా దానివల్ల మానవుడు మంచి ఫలితాన్ని పొందుతాడు. శుభనయనా! అన్నిదానాలకు సంబంధించిన పరమరహస్యం ఇదే. సత్పురుషులు ఆచరిస్తూ వస్తున్న ఇతర ధర్మకార్యాలను గూర్చి చెప్తాను విను. ఉద్యానవనాలు, దేవాలయాలు, గోశాలలు, నీళ్ళరేవులు, బావులు, సరస్సులు, సభాభవనాలు, ధర్మశాలలు, వేదబాహ్యాలకు వసతులు, నీటివసతులు, గోగ్రాససమర్పణం, రోగులకు మందులివ్వటం, అనాధలను పోషించటం, అనాధమయిన శవానికి దహనాది కార్యాలు చెయ్యటం. తీర్థాలకు వెళ్ళే మార్గాలను బాగుపరచటం, దుఃఖసమయాల్లో ఆదుకోవటం, అందరికీ తోడ్పడటం, వీటన్నింటినీ సంగ్రహంగా ధర్మకార్యాలని చెప్తారు. శుభురాలా! మనుష్యుడయిన వాడు వీటిని తనశక్తిననుసరించి శ్రద్ధగా చెయ్యాలి. ఇలా చేసినవాడు మరణానంతరం గొప్ప పుణ్యాన్ని పొందుతాడు. సందేహం లేదు. రూపం, అందం, ఆరోగ్యం, బలం, సౌఖ్యం, ఇవన్నీ పొందుతాడు. మనుష్యలోకంలో గాని, స్వర్గంలో, గాని, ఆయా ధర్మకార్యాలవల్ల నరుడు సంతోషాన్ని పొందుతాడు.

ఉమ ఇలా అంది. "భగవంతుడా! ధర్మం ఎన్ని విధాలుగా ఉంది? సత్పురుషులు ధర్మవిషయంలో ఎన్ని విధాలను చూస్తున్నారో నాకు చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "శుభురాలా! స్మృతుల్లో చెప్పబడ్డ ధర్మాలు ఆచారాలుగా చెప్పబడుతున్నాయి. దేశధర్మాలు, కుల ధర్మాలు, జాతి ధర్మాలు, సమూహధర్మాలు, అని ధర్మాలు బహువిధాలుగా చెప్పబడ్డాయి. శరీరం, కాలం వీటిలో వచ్చిన దుఃస్థితి కారణంగా ఆపద్ధర్మాలు కూడా చెప్పబడ్డాయి. లోకవాసులు ఈ విధంగా ధర్మం బహురూపమని చెప్తున్నారు. ఆయా కారణాలు వీర్పడినప్పుడు ఆయాధర్మాన్ని ఆచరించిన నరుడు, ఆయా ఫలితాలను పొందుతాడు. దేవి! వేదోక్తధర్మాలు స్మృతిబోధిత ధర్మాలు, వీటిని ప్రకృత ధర్మాలంటారు. నీవడిగిన విషయాలన్నీ చెప్పాను. ఇంకా నీవేమి వినాలని భావిస్తున్నావు ?"

మరణించిన తరువాత శుభా శుభగతులు - లక్షణాలు కర్తవ్యపాలన మరణం మహాఫలం.

ఉమ ఇలా అంది. "మనుష్యులు జీవించియుండగానే మరణానంతరం వీమి గతిని పొందబోతున్నాడన్నది తెలుసుకోవటం సాధ్యమా? ఇతడు శుభగతినే పొందుతాడు, అశుభాన్ని పొందడు అనేది తెలుసుకోవటం ఎలా ? అన్న విషయాన్ని తమరు నాకు చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "నీవడిగిన విషయాన్ని జీవితపు యధార్థాన్ని చెప్తాను. లోకంలో దేవభావం కలవారు, రాక్షస భావం కలవారు అని జీవులు రెండు విధాలుగా ఉన్నారు." మనోవాక్కాయ కర్మల ద్వారా ఎవరు అందరికీ విరుద్ధంగా ప్రవర్తిస్తారో, అటువంటి మానవులు రాక్షసభావులు. వారు నరకాన్ని పొందుతారు. హింసించేవారు, దుర్మార్గులు, పరులభార్యలను పొందేవారు, నీచమైన పనులు చేసేవారు. పవిత్రత, శుభాచరణులకు దూరమయినవారు, పవిత్రతను పరిహసించేవారు, పాపాత్ములు, లోకచరిత్రకు మచ్చ తెచ్చేవారు, వీరందరూ జీవిస్తూ ఉన్నప్పటికీ నరకానికి పోయేవారుగా గుర్తించవచ్చు. లోకానికి

భయంకలిగించే పశువులు ప్రాకేప్రాణులు, ముళ్ళచెట్లు, పరుషవస్తువులు రాక్షస భావిష్యాలని తెలుసుకోవాలి. దేవి! మిగిలిన ప్రాణి సమూహాలన్నీ దేవపక్షానికి చెందినవిగా భావించాలి. శ్రద్ధగా విను. మనోవాక్కాయ కర్మలద్వారా సమస్త ప్రాణి కోటికి అనుగుణంగా ఉండేవారిని దేవ స్వభావులుగాను, స్వర్గాన్ని పొందబోయేవారు గాను తెలుసుకోవాలి. పవిత్రులై, ఋజుశీలురై, ధీరులై, పరులసొత్తునపహరింపక సమస్త ప్రాణులపట్ల సమభావంతో ఉండే ఆ నరులు స్వర్గాన్ని పొందుతారు. ధార్మికులు, పవిత్రాచారవంతులు, విశుద్ధులు, తియ్యగా మాట్లాడేవారు ఎన్నడూ అకార్యాల్ని మనస్సుతో కూడా తలపెట్టనివారు స్వర్గాన్ని పొందుతారు. దరిద్రులయినప్పటికీ, ఎవరు యాచించిన వారికి ప్రేమతో తమకున్నది దానం చేస్తారో, ఆ నరులు స్వర్గాన్ని పొందుతారు. ఆస్తికులు, శుభకార్యాలు చేసేవారు, వృద్ధుల్ని సేవించేవారు, నిత్యం పుణ్యకార్యాలు చేసేవారు, వీరందరూ స్వర్గాన్ని పొందుతారు. నిత్యం మమకారం, అహంకారం లేనివారు, బంధువులపట్ల దయగల వారు, దీనుల్ని కరుణించేవారు స్వర్గాన్ని పొందుతారు. పరుల దుఃఖానుభూతిని తమదిగా భావించేవారూ, గురువులకు సేవ చేసేవారూ, దేవ బ్రాహ్మణులను పూజించేవారూ, ఉపకారాన్ని మరువనివారూ, విద్యావంతులు అయిన నరులు స్వర్గాన్ని పొందుతారు. జితేంద్రియులై, క్రోధాన్నిజయించి, అభిమానాన్ని, గర్వాన్ని జయించి, దురాశ, మాత్సర్యం లేని మానవులు స్వర్గాన్ని పొందుతారు. యథాశక్తిగా పరులకు సహాయం చేసేవారు స్వర్గాన్ని పొందుతారు. వ్రతపరులు, దానశీలురు, ధర్మశీలురు, తిన్నగా ప్రవర్తించేవారు, మృదుస్వభావులు అయిన మానవులు స్వర్గాన్ని పొందుతారు. ఈ లోకంలో ప్రవర్తించే తీరుతెన్నుల ఆధారంగా పరలోక జీవితం ఎలా ఉంటుందో ఊహించవచ్చు. కనుక ఈ లోకంలో నైన చెప్పిన విధంగా జీవిస్తున్నవారందరూ స్వర్గాన్ని పొందుతారు. శుభురాలా! ఈ ప్రపంచంలో శుభకరమై, ప్రజలకు మేలు కలిగించే దానిని, ప్రజలకు హితాన్ని కలిగించే పశుపక్ష్యాదులను దేవపక్షానికి సంబంధించినవిగా భావించాలి. ప్రియా! ఈ లోకంలో కదిలేవి, కదలనివి సమస్త పదార్థాలు శుభా శుభరూపంగా వర్గీకరింపబడ్డాయి. శుభపదార్థాలు దైవాలని, అశుభపదార్థాలు రాక్షసాలని చెప్పబడ్డాయి."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! మృత్యుకాలం సమీపించిన మానవులు ఏ విధంగా ప్రాణాల్ని విడిచిపెడితే పరంలో మేలును పొందుతారో చెప్పండి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. దేవి! ఆహా చక్కగా అడిగావు. చెప్తాను శ్రద్ధగావిను. లోకంలో మరణం రెండు రకాలు స్వభావసిద్ధం, యత్నసాధ్యం. దేవి! వీనిలో స్వభావసిద్ధం అపాయరహితం, యత్న సిద్ధం ప్రయత్నసాధ్యం, శుభురాలా! వీటిని వివరిస్తాను. యత్నజమరణం రోగగ్రస్త శరీరం, ఆరుగ్నశరీరాలతో సంబంధం వల్ల రెండు విధాలుగా ఉంటుంది. యత్నజమంటే చనిపోవాలనే కోరికలో శరీరాన్ని విడిచిపెట్టటం. అసమర్థమయిన శరీరం వార్ధక్యంవల్ల, రోగం వల్ల వీర్యడుతుంది. అప్పుడు మరణించటానికి నాలుగు పద్ధతులున్నాయి. మహాప్రస్థానం, ప్రాయోపవేశనం, జలావగాహనం, చితిలో అగ్నిప్రవేశం అన్నవి నాలుగు పద్ధతులు, చనిపోవాలనుకొనేవారికి శరీరత్యాగం ఈ నాలుగు విధాలుగా చెప్పబడ్డది. శుభురాలా! కోరికమేరకు అనుసరించే ఈ పద్ధతుల విధానం విను. స్వధర్మాన్ననుసరించి, శాస్త్రప్రకారం బహుకాలం గృహస్థజీవితాన్ని గడిపి, దానిలో ఋణశేషం లేకుండా చేసుకుని, వార్ధక్యం, వ్యాధి కారణాలుగా చూపించి, తన అసమర్థతను, వ్యక్తపరచి, సంబంధమున్న వారందరిని అనుమతింపచేసి, బంధువులను సమస్తాన్ని విడిచిపెట్టి, సమస్త కర్మలనూ వదలి తనధర్మం కోసం దానాలను శాస్త్రప్రకారం చేసి, తియ్యని

మాటలతో ఆత్మీయులను ఒడబరిచి, కొత్త వస్త్రాన్ని ధరించాలి. దాన్ని దర్భత్రాడులో ముడివెయ్యాలి. ఆచమన పూర్వకంగా ప్రతిజ్ఞ చెయ్యాలి. ప్రయత్నపూర్వకంగా గ్రామ్యధర్మాల్ని విడిచిపెట్టాలి. దాని తర్వాత తన కోరిక మేరకు శరీరాన్ని విడిచిపెట్టాలి. మహాప్రస్థానం పొందదలుచుకొంటే ఉత్తరదిక్కునకు ప్రయాణించాలి. ప్రాణాలుపోయే వరకు ఆహారం స్వీకరించకుండా ప్రయాణం కొనసాగించాలి. చేష్టలుడిగినపుడు కదలకుండా పరుండి, పరమాత్ముని భావిస్తూ ప్రాణాలు వదలాలి. ఇలా చేస్తే పుణ్యాత్ములు పొందే విశుద్ధ లోకాల్ని మానవుడు పొందుతాడు. ప్రాయోపవేశం చెయ్యాలనుకొన్న మానవుడు కూడా ఇదే విధంగా చెయ్యాలి. పుణ్యతమ ప్రదేశంలో శ్రేష్ఠమయిన చోట, నిరాహారంగా ఉపవసించాలి. నరుడు పవిత్రుడై దానధర్మాలు చేశాక, ప్రాణాలు పోయేవరకు పరమాత్ముని సంస్మరిస్తూ నిరాహారుడుగా ఉండాలి. ఇది సనాతన ధర్మం. ఇలా శరీరాన్ని విడిచినవాడు స్వర్గంలో మహిమాన్వితుడవుతాడు. ఇదేవిధంగా అగ్నిప్రవేశాన్ని కోరేవాడూ చెయ్యాలి. పుణ్యక్షేత్రంలోగాని, నదీ తీరంలోగాని, కట్టెలతో చితిని వీర్పరుచుకోవాలి. దేవతలకు నమస్కరించి, అగ్నికి ప్రదక్షిణం చేసి, పవిత్రుడై నారాయణుడయిన శ్రీహరిని స్మరిస్తూ, దృఢనిశ్చయం కలవాడై, బ్రాహ్మణులకు నమస్కరించి అగ్ని ప్రవేశం చెయ్యాలి. ఇతడు కూడా పుణ్యాత్ములు పొందే లోకాన్ని పొందుతాడు. శుభురాలా! ఇదే విధానంలో జలప్రవేశం కూడా చెయ్యాలి. ప్రసిద్ధమైన పుణ్యతమ తీర్థంలో, సుకృతాన్ని స్మరించుకొంటూ మునిగిపోవాలి. ఇతడు కూడా స్వభావ సిద్ధంగానే పుణ్యాత్ములు పొందే లోకాలను పొందుతాడు.

ఇక సమర్థ శరీరుడు ప్రాణత్యాగం చేసే విధానం చెప్తాను విను. క్షత్రియుడు ప్రజలను రక్షించటానికి, వారి మేలు కోసం, యోధులు తమ ప్రభువు ఋణం తీర్చుకోవటానికి, బ్రహ్మచారులు గురువు ప్రయోజనంకోసం, అందరూ గోబ్రాహ్మణులకు మేలు చెయ్యటానికి, సమర్థశరీరులయినా ప్రాణాలను విడువవచ్చు. తన రాజ్యరక్షణకు, దుర్మార్గుడైన రాజునుండి ప్రజావిముక్తి చెయ్యటానికి, యుద్ధంలో శాస్త్రప్రకారం ప్రాణాల్ని విడువవచ్చు. కవచాదులతో సిద్ధమయి, నిశ్చయంతో యుద్ధరంగంలో ప్రవేశించి, వెన్ను చూపనివాడై మరణించినరాజు వెంటనే స్వర్గాన్ని పొందుతాడు. క్షత్రియునికి ఇటువంటి సుగతి మరొకటి లేదు. సేవకుడయినా సరే, పెంచి పోషించిన ప్రభువు కోసం, ప్రభువు కార్యం వచ్చినప్పుడు, తన ప్రాణాల్ని పణంగా పెట్టి ప్రాణాల్ని వదలిపెడితే అతడు పుణ్యలోకాల్ని పొందుతాడు దేవతాగణాలతో కోరుకోతగ్గ స్వర్గసుఖాల్ని పొందుతాడు. ఇందులో సందేహం లేదు. ఇదే విధంగా గోబ్రాహ్మణులకోసం, దీనుల కోసం శరీరాన్ని విడిచి పెట్టవచ్చు. అతడు కూడా దయాగుణం కారణంగా పుణ్యాన్ని పొందుతాడు. ఈ విధంగా శరీరత్యాగం చేసే పద్ధతులన్నీ నీకు వివరించాను. కామం కోసం క్రోధంతో, భయంతో శరీరాన్ని విడిచినవాడు ఆత్మహత్యచేసుకొన్న వాడవటం వల్ల అనంతమయిన నరకాన్ని పొందుతాడు. స్వభావమరణమన్నది. చనిపోయేవాడి కోరికతో సంబంధం లేనిది. స్వభావసిద్ధంగా చనిపోయిన వారి విషయంలో ఏమేం చెయ్యాలో చెప్తాను విను. ఈ స్వభావ సిద్ధమరణం కూడా మూర్ఖంగా చేసే ప్రాణత్యాగం కన్నా మేలయినదే. చనిపోయేవాడి శరీరాన్ని భూమిమీద పడుకోబెట్టాలి. చనిపోయిన వెంటనే శరీరాన్ని కొత్తగుడ్డతో కప్పాలి. భామిని! శరీరాన్ని పూలదండలు, సుగంధ ద్రవ్యాలు బంగారం, వీటితో అలంకరించాలి. చనిపోయిన శరీరాన్ని శ్మశానంలో దక్షిణ ప్రదేశంలో చితాగ్నిలో దహించాలి. లేదా భూమిలో ఖననం చెయ్యాలి. పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణం, ఇవి

చనిపోయే వారికి ప్రశస్తమయిన సమయాలు, ఇతర సమయాలు మంచివి కావు. చాలామంది చేత చెయ్యబడే జలప్రదానం, అష్టకాశ్రాద్ధం చనిపోయినవారికి తృప్తినిస్తుంది. పరలోకంలో మేలు చేస్తుంది. మనుష్యులకు మేలు చేసే ఈ విషయాలన్నీ నీకు వివరించాను." (దాక్షిణాత్య ప్రతిలో అధ్యాయం ముగిసింది) (మోక్షం యొక్క గొప్పతనం, జ్ఞానప్రాప్తి, వైరాగ్యం వీటి వివరణ).

ఉమ ఇలా అంది. "శంకర! దేవదేవ! కాలసూదన! నీకు నమస్కారం. లోకానికి సంబంధించిన వివిధ ధర్మాలు నీ అనుగ్రహం వల్ల విన్నాను. అన్నిధర్మాల్లోను ప్రత్యేకమయినది శాశ్వతం, నాశరహితమైన ధర్మమేది?" నారదుడిలా అన్నాడు. "పార్వతి ఇలా అడగ్గానే పినాకధారియయిన మహాదేవుడు సూక్ష్మమయిన, ఆత్మవిషయకమయిన జ్ఞానాన్ని తియ్యగా పలికాడు." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "మహాభాగా! నీవు న్యాయమయిన విషయాన్ని తెలుసుకోగోరుతున్నది నిశ్చయం ప్రియురాలా! నీవు నన్నీవిధంగా ప్రశ్నించటమే చాలా గొప్ప విషయం. అన్నిచోట్ల స్వర్గ రూపఫలాన్నందించే ధర్మాల విషయాలు చెప్పబడ్డాయి. అనేక ద్వారాలున్న ధర్మానికి సంబంధించిన ఏ కార్యమయినా ఎన్నడూ విఫలం కాదు. ఏ ఏ విషయమందు ఎవరెవరు నిశ్చయభావాన్ని పొందుతారో వారాయావిషయాలనే తెలుసుకొంటారు. ఇతర ధర్మాల్ని తెలుసుకోలేరు. దేవి! ధర్మానికి సంబంధించిన అనేక మార్గాల్లో మోక్షమనే ద్వారం అత్యుత్తమమయింది. అన్ని ధర్మాల్లోనూ ధర్మం ప్రత్యేకం శుభకరం నాశరహితం. **దేవి! ప్రపంచంలో మోక్షంకంటె గొప్పది లేదు. మోక్షంకంటె గొప్ప స్థితి ఉండదు. ఇది పరమసుఖం, శ్రేష్ఠం, వెనుకకు మరలిరానవసరం లేనిది.*** మోక్షంలో వార్ధక్యం లేదు. మృత్యువురాదు. శోకం, దుఃఖం దరికి రావు, చాలా గొప్పది. ఊహించలేనిది. దేవీ ! దీనంత గొప్పసుఖముండదు. జ్ఞానాలన్నిటిలోకి మోక్షజ్ఞానం ఉత్తమోత్తమమని పండితులు చెప్తున్నారు. ఋషులు దేవతాసమూహాలు దీన్నే సర్వోన్నత స్థానంగా భావిస్తున్నారు. ఇది నిత్యం, నాశరహితం, చలింపచేయరానిది, జయించబడేది కాదు. శాశ్వతం, శుభకరం, సురాసురులచే కూడా కోరబడే ఈ స్థానాన్ని ప్రాజ్ఞులు మాత్రమే పొందగలరు. ఈ సంసారం దుఃఖంతో ప్రారంభమయి దుఃఖంతోనే ముగిసిపోతుంది. శోకం, వ్యాధి, వార్ధక్యం, మరణం వీటన్నిటితో కూడుకున్నదీ సంసారం. ఏ విధంగా ఆకాశంలో గ్రహనక్షత్రసముదాయాలు తిరిగి తిరిగి వస్తూ పోతుంటాయో, ఈ లోకంలో జీవులు కూడా తిరిగి తిరిగి వచ్చిపోతుంటారు. శుభలక్షణాలున్నదానా! ఆ మోక్షానికి మార్గం చెప్తాను విను. బ్రహ్మ మొదలుకొని కదలని బండరాయి వరకు ఉన్న సమస్తమూ సంసారంగా చెప్పబడుతోంది. ఈ సంసారంలో ప్రాణులన్నీ తిరిగి తిరిగి వస్తుంటాయి. ఇటువంటి సంసార చక్రాన్నుండి విడిపడటం జ్ఞానం చేతనే సాధ్యం. ఆత్మవిషయకజ్ఞానమే నిజమైన జ్ఞానమనబడుతుంది. జ్ఞానులచే సంసారనివృత్తి హేతువయిన జ్ఞానం ఆచరణాత్మకంగా నిరూపించబడింది. దాన్ని యథాతథంగా చెప్తాను ఏకాగ్రమయిన మనస్సుతో విను.

బ్రాహ్మణుడుకాని క్షత్రియుడు గాని ముందుగా గృహస్థాశ్రమం స్వీకరించాలి. అచ్చట అన్నివిధాలుగా ఋణాన్ని తీర్చుకోవాలి. తర్వాత గృహాన్ని విడువాలి. గృహస్థాశ్రమం విడిచి నిశ్చయం

---

* నాస్తి మోక్షాత్ పరం దేవి నాస్తి మోక్షాత్ పరా గతిః ।
సుఖమాత్యంతికం శ్రేష్ఠమ్ అనివృత్తం చ తద్ విదుః ॥

చేసుకొని వనాలను ఆశ్రయించాలి. అరణ్యంలో గురువును ఒప్పించి శాస్త్రప్రకారం ఆయన అనుమతితో దీక్షను స్వీకరించాలి. దీక్ష పొందాక న్యాయంగా తన నడవడిని పరిరక్షించుకోవాలి. పూజ్యుడుగా మెలుగుతూ ఉపాధ్యాయుని వద్ద నుండి మోక్షజ్ఞానాన్ని పొందాలి. మోక్షజ్ఞానం సాంఖ్య, యోగరూపంగా రెండు విధాలుగా ఉంటుంది. ఇరువది అయిదు తత్త్వాలను గూర్చి తెలుసుకోవటం సాంఖ్యం అని చెప్పబడింది. ఈశ్వరత్వం, దేవతాసారూప్యం యోగశాస్త్ర ఫలంగా చెప్పబడ్డది. శిష్యత్వం స్వీకరించినవాడు తన కోరిక మేరకు ఈ రెంటిలో దేనినయినా స్వీకరించాలి. ఆ సమయంలో కాని, కాషాయంబరాలు ధరించకుండా గాని, కనీసం సంవత్సర కాలం గురుశుశ్రూష చెయ్యకుండా కాని, శ్రద్ధలేకుండా కాని, గురువు స్నేహపూర్వకంగా ఉపదేశించకుండా కాని, సాంఖ్య యోగాల్ని స్వీకరించటం సాధ్యం కానిది. మునివృత్తినవలంబించి శీతోష్ణ హర్షాదులను సమభావంతో సహించాలి. ఆకలి దప్పులను సహించాలి. ఉచితాలయిన వాటిని కూడా త్యజించాలి. సంకల్పం వల్ల ఏర్పడే ముడులనుండి బయటకు రావాలి. ఎల్లవేళలా భగవంతుని ధ్యానించాలి. హోమకుండం, కుండ, యజ్ఞపాత్ర, ఉట్టి, గొడుగు, కర్ర చెప్పులు, వస్త్రం - ఇటువంటివాని యందు కూడా స్వామ్యాన్ని వదలాలి. గురువుకంటె ముందు లేవాలి. ఆలస్యంగా నిద్రించాలి గురువుకు చెప్పకుండా, ఎంత అవసరమయిన దానికోసమయినా వెళ్ళరాదు. ప్రతిరోజు ఉభయ సంధ్యలయందు వస్త్ర సహితంగా స్నానమాచరించాలి. రోజుకు ఒకేసారి ఆహారం తీసుకోవాలి. ఈ నియమాలన్నీ పూర్వమే యతీశ్వరులచే బోధింపబడ్డాయి. అన్నిచోట్ల నుండి భిక్షను స్వీకరించాలి. రాత్రి భగవద్విషయాల్ని ఆలోచించాలి. ఎంతటి గొప్పకారణమున్నా కోపం రాకూడదు. **బ్రహ్మచర్యం, అరణ్యవాసం, పవిత్రత, పరిశుభ్రత, ఇంద్రియ జయం, సమస్త ప్రాణులపట్ల దయగలిగి ఉండటం - ఇవి ముముక్షువునకు సనాతన ధర్మాలు. సర్వపాపకార్యాలనుండీ విరమించాలి. అల్పంగా ఆహారం స్వీకరించాలి. ఇంద్రియాలను జయించాలి. ఆత్మవిచారణ చెయ్యటం ద్వారా సమస్త పాపవినాశకమయిన గొప్ప జ్ఞానాన్ని పొందాలి.*** ఎప్పుడు సాధకుడు సమస్త ప్రాణుల పట్ల పాపభావనను కూడా చెయ్యడో, మనస్సు, వాక్కు, శరీరం పాపానికి దూరంగా ఉంటాయో, అప్పుడు బ్రహ్మగా మారిపోతాడు. కారిన్యం, అహంకారం, ద్వంద్వాలు, మాత్సర్యం, శోకం, భయం, బాధ వీటన్నిటినీ వదలినవాడు మోక్షస్థానాన్ని పొందుతాడు. మునివృత్తినవలంబించి, నిందాస్తుతులందు సమభావం కలవాడై, రాతిని, మట్టిని, బంగారాన్ని సమ భావనతో చూడాలి. శత్రుమిత్రుల పట్ల సమానంగా మెలగాలి. అప్పుడు వాడు మోక్షాన్ని పొందుతాడు. ఇటువంటి ఆచార వ్యవహారాలు కలిగి, ఎల్లవేళలా ఆత్మను గురించే ఆలోచించేవాడు, ఆ విధమయిన జ్ఞానాన్ని నిరంతరం అభ్యసించటం వల్ల పరమపదాన్ని పొందగల్గుతాడు బుద్ధి ఉద్వేగానికి లోనుకాకుంటే ఈ సంసార చక్రంలో శోకం వ్యాధి, వార్ధక్యం, దుఃఖం, వీటితో మరణించే స్థితి రాదు. కనుక ఉద్వేగ కారణాలు,

---

* బ్రహ్మచర్యం వనే వాసః శౌచమింద్రియసంయమః ।
దయా చ సర్వభూతేషు తస్య ధర్మ్యః సనాతనః ॥
విముక్తః సర్వపాపేభ్యః లఘ్వాహారో జితేంద్రియః ।
ఆత్మయుక్తః పరాం బుద్ధిం లభతే పావనాశినీమ్ ॥

మనస్సును నియంత్రించే విధానం, దానికనుగుణమయిన జ్ఞానం గురించి నీకు చెప్తాను. ఎందువల్లనంటే జ్ఞానంవల్లే పరమపదం లభిస్తుంది. ఈ లోకంలో ప్రతిరోజూ మూర్ఖునికి మాత్రమే వేలకొలది శోకహేతువులు, భయస్థాన కారణాలు కన్పిస్తుంటాయి. పండితునికి ఇవి ఉండవు. ధనం, భార్య, పుత్రుడు, కొడుకు దూరమయినప్పుడు అబ్బో ఎంత దుఃఖమో - అనుకుంటూ మూర్ఖుడు, శోకిస్తూ ఉంటాడు. వస్తువులు పోయినప్పుడు వానిలోని మేలయిన గుణాల్ని స్మరించుకొంటూ విచారించకూడదు. వాటిని లెక్క పెట్టకుండా ఉన్నప్పుడే శోకం నశిస్తుంది. అల్పబుద్ధులయిన మానవులు, అనిష్టం వచ్చినప్పుడు, ఇష్టమయినది పోయినప్పుడు మానసికంగా దుఃఖాలతో క్రుంగిపోతారు. ఇష్టులు చనిపోయినప్పుడు, వస్తువు కోల్పోయినప్పుడు, దాన్ని గురించి శోకించినవాడు సంతాపాన్ని పొందుతూనే ఉంటాడు. దానినుండి వెనుకకురాడు. మనుష్య జన్మమెత్తినవానికి పుట్టినది మొదలు అనేకరకాలయిన దుఃఖాలూ వస్తాయి. సుఖాలూ వస్తాయి. సుఖదుఃఖాల్లో ఏదో ఒకటి, మనస్సును వంచిస్తుంది. అందువల్ల సుఖానికి సంతోషించటం, దుఃఖానికి చింతించటం చెయ్యకూడదు. ఎక్కడ స్నేహమేర్పడుతుందో అక్కడ తద్గతమయిన దోషాన్ని భావించాలి. దానివల్ల తనకనిష్టం వస్తుందని తెలుసుకోవాలి. ఈ విధంగా విరక్తిని పెంచుకోవాలి. **ఏ విధంగా మహాసాగరంలో రెండు కట్టెలు యాదృచ్ఛికంగా కలుసుకుంటాయో, యాదృచ్ఛికంగానే విడిపోతాయో, అలాగే జ్ఞాతులు కూడా కలుస్తారు విడిపోతారు. అని తెలుసుకోవాలి.*** వారందరూ అవ్యక్తంలోంచి వచ్చి అవ్యక్తంలోకి అదృశ్యమవుతున్నారు. కనుక వారి పట్ల స్నేహం అనవసరం. వారితో వియోగం తప్పించుకోగలిగింది కాదు. పండితుడు కుటుంబం, భార్య, పుత్రులు, శరీరం, ధనసంపద, అధికారం, ఆరోగ్యం, వీటిని చూసుకొని మురిసిపోకూడదు. స్వర్గంలోనయినా సరే ఇంద్రునికి కూడా కేవలం సుఖమన్నది దొరకదు. అక్కడా గొప్ప దుఃఖం చిన్నసుఖమే ఉంటుంది. **నిత్యం దుఃఖమూ ఉండదు. ఎప్పుడూ సుఖమూ ఉండదు. సుఖం తర్వాత దుఃఖం, దుఃఖం తర్వాత సుఖం వస్తూ పోతూ ఉంటాయి. మనం సంపాదించుకొన్నవన్నీ తప్పక నశిస్తాయి. గొప్ప ఉన్నతికి చివరి దశ పతనమే. కలయిక ఉంటే, వియోగమూ ఉన్నట్లే. జీవితమున్నదంటే మరణమూ ఉన్నట్లే. ఉన్నతులను, పతనాలను లోకంలో తన కళ్ళతో తాను చూసి, నమస్తమూ అనిత్యమే, దుఃఖమయమే - అని తెలుసుకోవాలి.****

---

* యథా కాష్ఠం చ కాష్ఠం చ సమేయాతాం మహోదధౌ ।
సమేత్య చ వ్యపేయాతాం తద్వజ్జ్ఞాతిసమాగమః ॥

**న నిత్యం లభతే దుఃఖం న నిత్యం లభతే సుఖమ్ ।
సుఖస్యానంతరం దుఃఖం దుఃఖస్యానంతరం సుఖమ్ ॥
క్షయాంతా నిచయాః సర్వే పతనాంతాః సముచ్ఛ్రయాః ।
సంయోగా విప్రయోగాంతా మరణాంతం చ జీవితమ్ ॥
ఉచ్ఛ్రయాన్ వినిపాతాంశ్చ దృష్ట్వా ప్రత్యక్షతః స్వయమ్ ।
అనిత్యమసుఖం చేతి వ్యవస్యేత్ సర్వమేవ చ ॥

డబ్బు సంపాదించటానికి దుఃఖం, దాచుకోవాలంటే దుఃఖం డబ్బు పోయినప్పుడు మరొక దుఃఖం ఖర్చయిపోయినప్పుడు దుఃఖమే. డబ్బు ఎంత దుఃఖం తెస్తుందో చూడండి. డబ్బున్నవాడిని నిత్యం ఐదుగురు శత్రువులు హింసిస్తూ ఉంటారు. రాజు, దొంగ, జ్ఞాతులు, ప్రాణులు, నాశం ఇవే ఆశత్రువులు. డబ్బున్నది సమస్త ఆపదలకు మూలమని.తెలుసుకోవాలి. డబ్బులేని నరుడికిన్ని బాధలుండవు. డబ్బు వచ్చిందంటే గొప్పదుఃఖం వచ్చినట్లే. ఏగాని లేకపోవటం గొప్ప సుఖం. ఉపద్రవాలొచ్చినప్పుడు ధనం పోతుంది. దుఃఖం రావటమూ నిశ్చయమే. ధనం పట్ల ఆశ ఉంటే కోరికలకు అంతుండదు. తృప్తిరాదు. దురాశకు ఆశ్రయం లభిస్తే ప్రజ్వరిల్లిన అగ్నిలా విజృంభిస్తూనే ఉంటుంది. సమస్త భూమండలాన్ని నాలుగు సముద్రాల వరకు జయించినప్పటికీ తృప్తి కలుగదు. సముద్రాల అవతల ఉన్నదాన్ని జయించాలన్పిస్తుంది. సందేహం లేదు. దేవి! వస్తు సంగ్రహమన్నది చాలాదోషం కల్గినది. చివరకు పురుషుడయినా సరే పరిగ్రహం ప్రారంభిస్తే బంధనంలో పడిపోతుంది. ప్రపంచాన్నంతటినీ శాసించే రాజయినా సరే ఏదో ఒక రాష్ట్రంలోనే నివసిస్తాడు. ఆ రాష్ట్రంలో కూడా ఏదో ఒక నగరంలోనే నివసించగలడు. ఆ నగరంలో కూడా ఏదో ఒక ఇల్లే అతని నివాసస్థానంగా ఉపయోగపడుతుంది. ఆ ఇంటిలో కూడా ఒకే గదిలో అతడు జీవిస్తాడు. అందులో కూడా ఒక పడకమీద మాత్రమే అతడు నిద్రించగల్గుతాడు. ఆ పడకలో కూడా సగభాగం మాత్రమే తనది, మిగిలిన సగభాగం భార్యది అవుతుంది. ఇదంతాచూస్తే మనిషికి అవసరమయినది. చాలా స్వల్పమేనని తేలుతుంది. మూర్ఖుడుమాత్రం ఇదంతా నాదే నని భావిస్తాడు. ఇలా చూస్తే సర్వవిధాలయిన భోగ్య వస్తువుల్లో నరుడు అనుభవించేది అత్యంత స్వల్పం మాత్రమే. నాలుగు మానికల ఆహారంతో ఏ ప్రాణికయినా జీవయాత్ర సాగిపోతుంది. అంతకంటె ఎక్కువ భోగాలుంటే దుఃఖానికి ఉద్వేగానికి మాత్రమే పనికి వస్తాయి.

దురాశకంటె దుఃఖంలేదు. త్యాగం కంటె సుఖమూ లేదు. అన్ని కోరికలూ విడిచిపెట్టినవాడే బ్రహ్మంలో తాదాత్మ్యాన్ని పొందుతాడు. దుర్బుద్ధులు కోరికల్ని విడువలేరు. మనిషి నశించినా కోరికలు నశించవు. కోరిక అన్నది ప్రాణాల అంతుచూసే రోగం. దాన్ని విడిచిపెడితేనే సుఖం వస్తుంది. ఎన్నడూ కోరికలను అనుభవించటంవల్ల వాటిని శాంతింపచెయ్యలేము. హవిస్సు వేసినకొద్దీ అగ్నిప్రజ్వరిల్లుతూనే ఉంటుంది. పండితుడు కోరికలు తీరకపోవటం వల్లనే శోకాన్ని విడిచిపెడతాడు. ప్రయాస అనే కొమ్మలతో, ఆకర్షణ అనే అరణులతో, ఇంద్రియ విషయాలద్వారా మోహింప చేసి, కామాగ్ని, మూర్ఖులను దహించివేస్తుంది. భూమిలోని సమస్త ధాన్యాలు, బంగారం, పశువులు, స్త్రీలు అన్నీ ఇచ్చినా ఒక్క పురుషుడికి కూడా అవి సరిపోవు. ఇంకా కావాలనే ఉంటుంది. ఈ సత్యాన్ని గ్రహించినవాడు మోహంలో పడడు. లోకంలో కోరికలు తీర్చుకోవటం వల్ల లభించే సుఖం, దివ్యలోకాల్లో లభించే అతి గొప్ప సుఖం - కోరికలు నశించటం వల్ల వచ్చే గొప్ప సుఖం ముందు పదహారవ వంతు కూడా కావని గ్రహించాలి. ధీరుడెప్పుడు పంచేంద్రియాలను వాటి విషయాలయిన రూపరసాదుల పట్ల లగ్నం చెయ్యకూడదు. మనస్సుతో సహా ఆరు ఇంద్రియాలను ఆత్మయందు లగ్నం చెయ్యాలి. ఇంద్రియాల్ని విడిచి పెడితే ఆత్మయందు లగ్నం చెయ్యాలి. ఇంద్రియాల్ని విడిచిపెడితే దోషాలు పెరిగిపోతాయి. వాటినే నియంత్రిస్తే గొప్ప మోక్షం సిద్ధిస్తుంది. ఆరింద్రియాలను ఆత్మయందు లగ్నం చెయ్యటంవల్ల గొప్ప ఐశ్వర్యం లభిస్తుంది. అట్టివివేకిని పాపాలు ఆపదలు దరిచేరవు. వివేకి ఎల్లవేళలా అప్రమత్తతో

ఇంద్రియాల్ని పరిరక్షించుకోవాలి. రక్షించకపోతే నరకపతనం తప్పదు. అవివేకి హృదయంలో కోరికల వృక్షం పుట్టిపెరుగుతుంది. విచిత్రమయిన ఆ కోరికల వృక్షానికి అజ్ఞాన సమూహమే కారణం. అజ్ఞానంవల్లే దానికాండం పెరుగుతుంది. కర్మలనాచరించాలనే తలపే దానికి నీరుపోయటం వంటిది. రోషలోభాలే గొప్ప స్కంధాలు. పూర్వంచేసిన పాపాల సమూహమే దానిలోని సారం. ఆయాసమే దాని కొమ్మలు. తీవ్రమయిన శోకమే దాని పుష్పం. భయమనే మొలకలు దానికుంటాయి. గొప్పదయిన దాహార్తిచేత అన్నివైపులా చుట్టబడి ఉంటుంది. తత్త్వజ్ఞుని హృదయంలో ఈ చెట్టు పుట్టదు. పుట్టినా వెంటనే నరికివేయబడుతుంది. అతి కష్టాలు అనిత్యాలు అయిన ఉపాయాలలో నిస్సార ఫలాలపై అంతులేని దుఃఖాలకు కారణాలైన కామయోగాలపై ఆసక్తి తుచ్ఛమయింది. ఇంద్రియాలు చివికి పోతున్నప్పుడు, ఆయుష్షు తరిగిపోతున్నప్పుడు, మృత్యువు ఎట్టెదుట నిలబడినప్పుడు, అన్నీ చూస్తున్నవానికి ఏరకమయిన శుభం కల్గుతుంది? నిత్యం శరీర సంబంధమయిన మనస్సంబంధమయిన వ్యాధులచే పీడింపబడుతున్న, అధన్యుడయిన నరునకు మరణం ఎదురుగా వస్తున్నప్పుడు ఎలాంటి సుఖం లభిస్తుంది? కోరికల విషయంలో తృప్తి చెందకుండానే, ధనం గురించే ఆలోచిస్తుండగానే మానవుడిని పెద్దపులి పశువును ఎత్తుకుపోయినట్లు మృత్యువు కబళిస్తుంది. జన్మ మృత్యువు వార్ధక్యం దుఃఖం వీటిచే నిత్యం పీడింపబడుతున్నా, సంసారంలో వండబడుతున్నా జనుడు పాపాలను అసహ్యించుకోలేక పోతున్నాడు.

ఉమ ఇలా అంది. భగవంతుడా! ఏ ఉపాయంవల్ల మానవుడు జరా మరణాల నుండి తప్పుకోగలడు? అటువంటి ఉపాయమున్నట్టయితే దాన్ని వెంటనే నాకు చెప్పండి. గొప్ప తపస్సు, గొప్ప కర్మలు, పాండిత్యం, రసాయన ప్రయోగం, వీనిలో దేని ద్వారా వార్ధక్యాన్ని మృత్యువును తప్పించుకోవచ్చు.'' శ్రీ మహేశ్వరుడన్నాడు. "మహాభాగా! జరామృత్యువులను తప్పించే ఉపాయమేదీ సర్వలోకాల్లోనూ కానరాదు. భామిని! మోక్షం మాత్రమే తరణోపాయం. ప్రాణులు ఒక్కమోక్షం ద్వారా మాత్రమే మరణాన్ని వారించగలరు. ధనం, రాజ్యం, గొప్ప తపస్సు వీని ద్వారా మరణం తొలగిపోదు. ముక్తిని సాధించకపోతే, వేలకొలది అశ్వమేధయాగాలు కాని, వందల కొద్దీ వాజపేయయాగాలు గాని, జరామృత్యువులను నివారించలేవు. ఐశ్వర్యం, ధనధాన్యాలు, విద్యలనార్జించటం, తపస్సులు, రసాయన ప్రయోగాలు - ఇవేవీ జరామృత్యువులను నివారించలేవు దేవ-దానవ-గంధర్వ-కిన్నర-ఉరగ-రాక్షసులందరినీ, కాలుడు తన అధీనంలో ఉంచుకొంటాడు. కాలునికి కనపడని ప్రాణిలేదు. గడచిన రోజులు, మాసాలు, రాత్రులు, తిరిగిరావు. ఈ కాలం ఎల్లవేళలా నిశ్చయంగా నాశరహితంగా ముందుకు సాగిపోతూనే ఉంటుంది. ఏ విధంగా నదీ జలం ముందుకు పోతూనే ఉంటుందో, తిరిగిరాదో, అదే విధంగా మానవుల ఆయుర్దాయాన్ని కాలం అహోరాత్రుల రూపంలో ఎప్పుడూ హరిస్తూనే ఉంటుంది. నాశరహితుడయిన ఆదిత్యుడు సర్వప్రాణుల ఆయుర్దాయాన్ని క్షీణింపచేస్తూ ప్రతిరోజూ ఉదయిస్తూ అస్తమిస్తూ కొనసాగిపోతుంటాడు. ఒక రాత్రి గడిస్తే జీవితంలో కొంతభాగం క్షీణించినట్లే. ప్రతిరాత్రి జీవితాన్ని అపహరిస్తుంది. లోతులేని నీటిల్లో చేప జీవితం ఎలాంటిదో మనిషి కౌమారమూ అలాంటిదే. శరీరానికి మరణం తప్పనిది. నిజమైనది, శరీరం అనంత కాలంలో క్షణం మాత్రమే నిలుస్తుంది. కాలాధీనంగా కరిగిపోతుంది. సర్వప్రాణులు, వార్ధక్యం పొందనట్లయితే, మృత్యువు దరిచేరకుంటే అనిష్టం ఏర్పడనట్లయితే ఈ లోకంలో శోకమే ఉండేది కాదు. ప్రమత్తులయిన

ప్రాణుల విషయంలో కాలం ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. ఆయువులేనివాడు అప్రమత్తమయిన కాలం చేతిలో నశించవలసిందే. ఈ ప్రపంచంలో ఎవడయినా ఎక్కడున్నా మృత్యువు ఒడిలో ఉన్నట్లే. కనుక రేపు చేయవలసిన పనిని ఈ రోజే చెయ్యాలి. మధ్యాహ్నంలో చేయవలసిన పనిని ప్రొద్దుటి పూర్తిచేయాలి. ఈ పనిని వర్షాకాలంలో చేస్తాను. ఆ పనిని గ్రీష్మవసంతాల్లో చేస్తాను. అని ఆవివేకి అనుకుంటాడు. రాబోయే విఘ్నాలనూహించలేడు. ఇది నాకు కావాలి. అది నాకు కావాలి, అనుకొంటుంటారు నరులు. కోరికలు తీరవు. కాని మరణానికి సన్నిహితులవుతారు. సర్వప్రాణులూ కాలుని పాశాలతో బంధింపబడ్డవారే. ప్రతిరోజూ విశీర్ణులయ్యేవారే. ఎప్పుడూ గతుకుల మార్గంలో ప్రయాణించే వారే. రేపేదో చేస్తాం అని విశ్వసించరాదు. యువకుడుగా ఉన్నప్పుడే ధర్మశీలాన్ని పెంపొందించుకోవాలి. బ్రతికే ఉంటూమనటానికి దృఢమయిన కారణమేదీ లేదు. ఎప్పుడయినా మృత్యువు రావచ్చు. వండిన పళ్ళకు పతనభయం ఎలా ఉంటుందో, ప్రాణులకూ మృత్యుభయం అలానే ఉంటుంది. మానవుడు మరణశీలుడు. భార్య, పుత్రులు, భోగాలు, ప్రియులు వీటన్నింటితో ఏం ప్రయోజనం? ఒక్కరోజు చాలు అన్నీ వదిలేసి మృత్యువును చేరటానికి. పుడుతూ ఉన్నవారిని, చనిపోతున్నవారినీ నిత్యం పరిశీలిస్తూ కూడా ఏ మానవుడు కలతనొందడో వాడు కట్టె వంటివాడు, రాయిలాంటివాడు. నాశనం తప్పని, శాశ్వత కాని, జీవితం కలప్రాణికి, బంధువులతోను, భార్యలతోను పని ఏమున్నది? ఒక్క క్షణం చాలు సమస్తం విడిచిపెట్టి వెళ్ళిపోవటానికి మళ్ళీ తిరిగి రావటం జరగనే జరుగదు. ఈ విధంగా నిరంతరం ఆలోచించేవాని మనస్సులో సర్వవస్తువులయొక్క అశాశ్వతత్వం అలజడి కల్గిస్తుంది. ఒకరిని చూస్తే మరొకరికి వైరాగ్యం పుడుతుంది. ఉద్వేగాలవల్ల మళ్ళీమళ్ళీ పదార్థాలను విమర్శించుకోవటం జరుగుతుంది. దానివల్ల సర్వ ద్రవ్యాలపట్ల విరక్తి ఏర్పడుతుంది. శుభురాలా! నిజమైన వైరాగ్యంవల్ల మానవులు గొప్ప శాంతిని పొందుతారు. మోక్షాన్ని పొందటానికి వైరాగ్యమే గొప్పసాధనమన్నది నిశ్చయం. దేవి! వైరాగ్యాన్ని కలిగించే మాటలన్నీ నీకు చెప్పాను. ఈ విధంగా ఆలోచించి ఆలోచించి ముముక్షువులు ముక్తిని పొందగల్గుతారు."

సాంఖ్యజ్ఞానము - అవ్యక్తము - చతుర్వింశతి తత్త్వాలు

శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "తెలినవ్వులదానా! సాంఖ్యులమతంలో జ్ఞానం ఎలాంటిదో వివరిస్తాను. దీన్ని తెలుసుకొన్న మానవుడు తిరిగి సంసారంలో ప్రవర్తించడు." సంన్యాస కోవిదులయిన సాంఖ్యులు జ్ఞానంవల్లనే ముక్తిని సాధిస్తారు. వారు శరీరంతో చేసే ఘోరమయిన తపస్సు నిష్ఫలమయిందిగా చెప్తారు. ఇరువది అయిదు తత్త్వాలకు సంబంధించిన విజ్ఞానమే వారి చేత జ్ఞానంగా పేర్కొనబడుతోంది. మూలప్రకృతి అవ్యక్తంగా చెప్పబడుతుంది. అవ్యక్తం నుండి మహత్తు పుట్టింది. మహత్తునుండి అహంకారం, దాన్నుండి పంచతన్మాత్రలు, వానినుండి కర్మేంద్రియాలు జ్ఞానేంద్రియాలు మనస్సు మొత్తం పదకొండు, వానినుండి పంచభూతాలు, పంచభూతాల నుండి శరీరం ఆవిర్భవించాయి. ఇది క్షేత్రం యొక్క సంగ్రహ స్వరూపం. దాని ఇరువది నాలుగు తత్త్వాల సమూహంగా చెప్తారు. పురుషునితో కలిసి మొత్తం ఇరువది ఐదు తత్త్వాలుగా చెప్పబడ్డాయి. సత్త్వ రజస్తమస్సులనే గుణాలు ప్రకృతి నుండి

జన్మిస్తాయి. ఈ గుణాల ద్వారా ప్రకృతి సమస్తలోకాల్నీ సృష్టిస్తుంది. ఇచ్ఛ, ద్వేషం, సుఖం, దుఃఖం, స్థూల శరీరం, చేతన, ధృతి, ఇవి ప్రకృతి యొక్క పరిణామ రూపాలుగా బుద్ధిమంతులు తెలుసుకోవాలి. ఈ తత్వాలన్నిటి యొక్క లక్షణాలను, వికల్పాలతో సహా మొదటి నుండి వేరువేరుగా విస్తారంగా వ్యాఖ్యానిస్తాను విను. నిత్యమూ, అద్వితీయమూ, సూక్ష్మస్వరూపమూ, వ్యాపకమూ, క్రియాహీనమూ జనకహేతు రహితమూ, సమస్త ఇంద్రియాలకు అతీతమూ అయినది అవ్యక్తమని చెప్పబడుతున్నది. అవ్యక్తం, ప్రకృతి, మూలం, ప్రధానం, యోని ఇవన్నీ ఈ అవ్యక్తానికే మారువేర్లు. అది అత్యంతం సూక్ష్మమయినది కాబట్టి మాటలతో చెప్పనలవికానిది. దాన్ని 'సత్' శబ్దంతో వ్యవహరిస్తారు. దాని కారణంగా సమస్త జగత్, తన్మూలంగా సృష్టి ఏర్పడ్డాయి. సత్వాదులు ప్రకృతికి సంబంధించిన గుణాలు. వాటిని వివరిస్తాను. సుఖం, తుష్టి, ప్రకాశం ఇవి సాత్వికి గుణాలు. రాగం, ద్వేషం, దుఃఖం, స్తంభం ఇవి రజస్సునకు సంబంధించిన గుణాలు. ప్రకాశాభావం, భయం, మోహం, బద్ధకం ఇవి తమోగుణాలు శ్రద్ధ, ప్రహర్షం, విజ్ఞానం, సమ్మోహం లేకపోవటం, దయ, ధైర్యం, ఇవి సత్వగుణం వృద్ధిపొందినప్పుడు వర్ధిల్లుతాయి. అలా కానప్పుడు విరుద్ధ గుణాలు వృద్ధి చెందుతాయి. రజోగుణం వర్ధిల్లినప్పుడు, కామం క్రోధం, మనస్సం తాపం, దురాశ, అజ్ఞానం, అసత్యం ఇవి వృద్ధిని పొందుతాయి. తమోగుణం వృద్ధిపొందినప్పుడు, విషాదం, సంశయం, అజ్ఞానం, బద్ధకం, నిద్ర, భయం ఇవి వృద్ధిని పొందుతాయి. ఈ విధంగా ఇవి పరస్పరం వృద్ధిక్షయాలను తిరిగి తిరిగి పొందుతుంటాయి. ఒకగుణంచే మరొకటి జయించబడటం జరుగుతుంది. ఇది నిత్యం జరిగే ప్రక్రియ.

వానిలో శరీరం మనస్సు ప్రసన్నంగా ఉన్నప్పుడు సత్వగుణం ప్రవర్తిస్తున్నదని భావించి ఉదాసీనంగా ఉండాలి. ఎప్పుడు సంతాపంతో పాటు మనస్సంక్షోభం ఏర్పడుతుందో అప్పుడు రజోగుణం ప్రవర్తిస్తున్నదని తెలుసుకొని ఉపేక్షా భావంతో ఉండాలి. ఎప్పుడు అజ్ఞానం విజృంభించి, ఊహించనివిధంగా, తెలియరాని పద్ధతిలో విషాదం చోటు చేసుకొంటుందో అప్పుడు తమోగుణం విజృంభిస్తున్నదని నిశ్చయించుకోవాలి. సంగ్రహంగా చెప్పాలంటే ధర్మం సత్వానికి, అర్థం రజస్సునకు, కామం, తమస్సునకు సంబంధించినవిగా భావించాలి. ఈ విధంగా త్రిగుణాలు త్రివర్గమందుంటాయి. బ్రహ్మ మొదలుకొని దేవతలవరకు ఉన్న సృష్టి సాత్విక సృష్టిగా చెప్పబడుతున్నది. మానవసృష్టి రజోగుణానికి సంబంధించినది. పశుపక్ష్యాది సృష్టి తమోగుణ సంబంధం వల్ల ఏర్పడ్డది. సత్వగుణశీలురు వైలోకాల్లోను, రాజసగుణశీలురు మధ్యలోను తామస గుణశీలులు క్రిందుగాను ప్రయాణిస్తుంటారు. దేవ, మనుష్య పశుపక్ష్యాది రూపంగా ఉన్న ఈ చరాచర ప్రపంచమంతా, ఈ మూడు గుణాల చేత పరివ్యాప్తమయి ఉంటుంది. ఇక మహదాదుల గురించి లక్షణ పూర్వకంగా చెప్తాను. విజ్ఞానం, వివేకం ఈ రెండు మహత్తునకు లక్షణాలు. మహత్తు, బుద్ధి, మతి, ప్రజ్ఞ ఇవి మహత్తునకు పర్యాయ పదాలు. లక్షణం ద్వారా సంక్షేపంగా అహంకారాన్ని గూర్చి తెలుసుకోవాలి. అహంకారంవల్లే అనేక విధాలయిన ప్రాణులయొక్క సృష్టి జరుగుతూ ఉంది. అహంకార నివృత్తి ఏర్పడితే నిర్వాణం (మోక్షం) సిద్ధిస్తుంది. ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి ఈ అయిదు పంచ మహాభూతాలు, ఈ పంచభూతాలకు ఉత్పత్తి వినాశాలుంటాయి. శబ్దం, శ్రోత్రేంద్రియం, ఖాళీ ప్రదేశం, ఈ మూడు ఆకాశ మహాభూతం నుండి పుట్టాయి. స్పర్శ కల్గిన ప్రాణుల చేష్టలన్నీ వాయువు యొక్క గుణాలుగా కీర్తింపబడ్డాయి. రూపం,

పరిణామం, నేత్రాలు, వెలుగు, ఈ నాలుగు తేజోగుణాలు. రసం, స్నేహం, నాలుక, చల్లదనం, ఈ నాలుగు నీటికి సంబంధించిన గుణాలు. గంధం, ఘ్రాణేంద్రియం, శరీరం, ఇవి భూమికి సంబంధించిన గుణాలు, పైన చెప్పినవన్నీ పంచభూతాలకు సంబంధించిన గుణాలుగా ప్రసిద్ధిని పొందాయి. పద్మాక్షి! పంచభూతాల్లో మొదటిదాని గుణాన్ని రెండవది, రెండవ దాని గుణాన్ని మూడవది, ఇలా పూర్వపూర్వ భూతగుణాన్ని తర్వాత భూతం పొందుతుంటుంది. కనుక పాంచ భౌతిక సృష్టి అనేక గుణాలు కలదిగా కన్పిస్తుంటుంది. అవివేకులు నీటిలోని గంధాన్ని గ్రహించి, గంధమన్నది నీటికి సంబంధించిన గుణమని భావిస్తారు. కాని ప్రాజ్ఞులు దీన్ని అంగీకరించరు. గంధం భూమిగుణమే అవుతుంది. నీటిది కాదు. భూమిలో గంధం, నీటిలో స్నేహం, నేత్రంలో వెలుగు ఉంటుంది. ప్రాణ, అపానములకు మూలం వాయువు, ప్రాణుల్లోని అన్ని ఖాళీ ప్రదేశాలకు మూలమయినది ఆకాశం. జుట్టు ఎముకలు, గోళ్ళు, దంతాలు, చర్మం, చేతులు, కాళ్ళు, శిరస్సు, వెనుకభాగం, పొట్ట, నడుము, కంఠం ఇవన్నీ భూతత్త్వాన్ని ఆశ్రయించినవి. ఈ శరీరంలో ధాతుదోషం, మలదోషం మొదలయిన వాటికన్నిటికీ పంచభూతాలే కారణం. ఈ దేహాలద్వారా పంచభూతాలే ప్రభువులుగా పని చేస్తుంటాయి. బుద్ధీంద్రియాలయిన చెవి, చర్మం, నేత్రం, నాలుక, ముక్కులు, కర్మేంద్రియాలయిన వాక్కు, చేతులు, కాళ్ళు; పురుషావయవం, గుదాలు, శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం, ఈ ఐదు ఇంద్రియార్థాలు పై తత్త్వాలన్నీ పంచభూతాల నుండి వచ్చినవే నని తెలుసుకోవాలి.

వాక్యం, చేష్ట, గమనం, ప్రీతి, విసర్జనం, ఈ ఐదు కర్మేంద్రియార్థాలు కూడా పంచభూతాల నుండి వచ్చినవే ఇంద్రియాలన్నిటికీ ప్రభువు మనస్సు. కోరుకొనే లక్షణం కల్గినది మనస్సుగా గుర్తించాలి. పురుషుడు (ఆత్మ) మనస్సును నియంత్రించడానికి, విడిచిపెట్టడానికి కారణం. ఇతడే మనస్సుతో సహా పంచభూతాలను నియమిస్తాడు. ఇంద్రియాలు, ఇంద్రియార్థాలయిన రూపరసాదులు, స్వభావం, చైతన్యం, ధైర్యం, భూతవికారాలు అభూతవికారాలు ఇవన్నీ కలిసి శరీరమని చెప్పబడుతోంది. జీవుడు శరీరం కన్నా భిన్నుడు. శరీరాన్ని ఆశ్రయించుకొని ఉంటాడు. శరీరానికి శరీరికి ఉన్న ఈ భేదాన్ని తెలుసుకొన్నవాడు సాక్షాత్తు మునియే. వివేకి రస, స్పర్శ, గంధ, రూప, శబ్దాలకు అతీతం, ఇంద్రియాతీతం శరీరభిన్నం అయిన శరీరిని తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. సమస్త శరీరాల్లోను అవ్యక్తంగా ఉంటూ మరణశీలురలో మరణ రహితుడిగా ఉన్న పరమాత్మను చూడగలవాడు, సమస్త బంధాలనుండి విముక్తిని పొందుతాడు. ఆ పరమాత్ముడొక్కడే సర్వప్రాణులయందు, స్థావరములందు జంగమములందు మహావీర్యశాలియై నానాభావ సమన్వితుడై నివసిస్తాడు. అతడు పైన, క్రింద, అడ్డంగా గాని, ఇంద్రియాలచేతగాని, బుద్ధిచేతగాని ఎన్నడూ గ్రహించబడే వాడు కాదు. అతడు తొమ్మిది ద్వారాలున్న పట్టణంలాంటి శరీరంలో ఎల్లవేళలా నియమపూర్వకంగా నివసిస్తాడు. ఆ ఈశ్వరుడు సర్వలోకాల్లోను, కదలని వాటిలోను కదలేవాటిలోను, ఎల్లప్పుడూ ఉంటాడు. అతడు అణువుకంటె సూక్ష్మమయిన వానిని గాని, మహత్తుకంటె మహత్తరునిగాను చెప్తున్నారు. అనేక విధాలుగా సర్వప్రాణుల్ని వ్యాపించి శాశ్వతంగా నివసిస్తాడు. క్షేత్రజ్ఞుని ఒకవైపు, సమస్తమయిన క్షేత్రాన్ని మరొక వైపు ఉంచి, జ్ఞానియైనవాడు ఇంద్రియాల్ని నిగ్రహించి, హృదయంలో ఎల్లప్పుడూ జడ చేతన భేదాన్ని విమర్శించుకోవాలి. పురుషుడు ప్రకృతియందున్నవాడై, ప్రకృతి సంభవాలయిన గుణాలను అనుభవిస్తుంటాడు. అయినా ఆయన

కర్తకాదు, దేనిచేత లిప్తుడు కాడు. నిత్యమైనవాడు, సమస్త కర్మల విషయంలోను మధ్యస్థుడే. కార్యమూ, కారణం - వీటిని పుట్టించటంలో ప్రకృతి కారణం. జీవుడు సుఖదుఃఖానుభవంలో హేతువుగా చెప్పబడ్డాడు. ఈ జీవుడు నశించువాడు కాదు. ఊహింపశక్య మయినవాడు కాదు. ప్రకటమయ్యేవాడు కాదు. కాని సనాతనుడు, మరికొందరు జీవుడు దేహంలో తేజోరూపంగా ఉంటాడని భావిస్తారు. కొందరు సర్వలోకాలను వ్యాపించి ఉన్న ఈశ్వరుడే జీవుడుగాను ఉన్నాడని చెప్తారు. కొందరు జీవుడు శరీరంలో నువ్వుల్లో నూనె ఉన్నట్టుగా వ్యాపించి ఉన్నాడని ప్రకటిస్తారు. మరికొందరు నాస్తికులు మాత్రం మూర్ఖులై, స్థూలలక్షణాలు లేనందున ఆత్మయే లేదని నిశ్చయించుకొంటారు. వీరు నరకాన్ని పొందుతారు. ఈ విధంగా మహేశ్వరుని అనేక విధాలుగా విమర్శించుకొంటుంటారు."

ఉమ ఇలా అంది. "భగవంతుడా! లోకంలో ఊహాశక్తి గల్గిన బ్రాహ్మణులు సమస్త శరీరాలలో నిత్యమూ, నాశరహితమూ, అవ్యయమూ అయిన ఆత్మ ఉన్నదని చెప్తారు, కాని దాని సత్యత్వాన్ని నిరూపించే హేతువులు దురవగాహాలుగా ఉన్నాయి." శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "ఋషులు దేవతలు కూడా అతనిని స్పష్టంగా చూడలేదన్నారు. అతడిని చూసినవాడు మళ్ళీ తిరిగి రావటమన్నది జరుగదు. కనుక ఆ పరమాత్ముని దర్శనంవల్లే ఎవరయినా పరమోత్తమ స్థితిని చెందగల్గుతారు. దేవి! ఈ విధంగా అత్యంత పురాతనమయిన సాంఖ్య ధర్మాన్నంతటినీ నీకు వివరించాను. కపిలాది ఆచార్యులచేత పరమర్షులచేత ఈ సాంఖ్యధర్మం విశ్వసించి ఆచరింపబడ్డది.

యోగధర్మ ప్రతిపాదన - ఫలము.

సాంఖ్యజ్ఞానమందు ప్రవర్తించేవారి సిద్ధాంతాన్ని ఉన్నదున్నట్లు నీకు చెప్పాను. ఇక నీకు యోగధర్మాన్ని బోధిస్తాను విను. బ్రహ్మ, దేవర్షి సమ్మతమయిన యోగధర్మం రెండు విధాలుగా ఉంటుంది. అయితే రెంటిలోను శాస్త్రోక్త ఆచారం మాత్రం సమానంగా ఉంటుంది. ఆ యోగ ధర్మం ఎనిమిది విధాలయిన అణిమాది ఐశ్వర్యాల కోసం, విధింపబడింది. సమస్త దేవతా సాయుజ్యం పరాశ్రిత యోగధర్మ ఫలంగా చెప్పబడింది. సమస్తమయిన యోగవిద్యకు జ్ఞానమే మూలమని నిశ్చయించుకోవాలి. వ్రతోపవాసాది నియమాలద్వారా జ్ఞానసముపార్జనా మార్గాలను వృద్ధి చేసుకోవాలి. ప్రాజ్ఞురాలా పార్వతీ ! నాశరహితమయిన పరమాత్మయందు బుద్ధి, మనస్సు ఇంద్రియాలన్నింటినీ ఏకాగ్రతతో లగ్నం చెయ్యటమే యోగులకు సంబంధించిన జ్ఞానంగా చెప్పబడుతున్నది. ఈ విధానంలో, బ్రాహ్మణులను, అగ్నిని, దేవాలయాలను అర్చించాలి. సత్త్వగుణాన్ని పెంపొందించుకొని అబహుభావమన్నది వీర్పడకుండా చూసుకోవాలి. దానం, అధ్యయనం, శ్రద్ధ, వ్రతాలు, నియమాలు, సత్యం, ఆహార విశుద్ధి, పవిత్రత, ఇంద్రియ నిగ్రహం, వీనినాచరించటం వల్ల తేజస్సు పెరుగుతుంది పాపాలు నశిస్తాయి. పాపాలు నశించిన తేజోవంతుడు, నిరాహారుడు, జితేంద్రియుడు, నిర్మలుడు, దాంతుడు, అమోఘశక్తియుక్తుడుగా ఉండి యోగాన్ని అభ్యసించాలి.

ఏకాంతంలో జనరహిత ప్రదేశంలో, అన్నివైపులా మూసి ఉన్న చోట, పవిత్రమయినచోట, మృదువయిన దర్భలతో చక్కని ఆసనాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఆ ఆసనంమీద కూర్చొని, శరీరాన్ని

శిరస్సును తిన్నగా నిలబెట్టాలి. వ్యగ్రత లేనివాడై, సుఖంగా కూర్చొని, శరీరావయవాల్ని కదలించరాదు. దిక్కులు చూడకుండా తన ముక్కు కొనను మాత్రమే చూస్తుండాలి. దేవి! మనస్సును నిశ్చలంగా ఉంచటమే యోగవిద్యకు పరాకాష్ఠ. కనుక సమస్త ప్రయత్నాల ద్వారా అన్నివేళలా మనస్సు చలించకుండా చూసుకోవాలి. పండితుడు, చర్మం, శ్రోత్రం, జిహ్వ, ముక్కు, నేత్రం ఈ ఐదు ఇంద్రియాలను తమ వ్యాపారాలనుండి మరల్చి, మనస్సునందే లగ్నం చెయ్యాలి. సర్వసంకల్పాలను తొలగించి, మనస్సును ఆత్మయందు లయింప చెయ్యాలి. ఎప్పుడు మనస్సు, ఐదు ఇంద్రియాలూ కూడా ఆత్మయందు నిలకడ చెందుతాయో. అప్పుడు ప్రాణాపానాలు కూడా వాడివశంలో ఉంటాయి. ప్రాణం వశమయితే యోగసిద్ధి జరిగినట్లే. శరీరంలో ప్రతిభాగాన్ని అత్యంత సమీపంగా పరిశీలించాలి. శరీరంలో ప్రాణాలు ఏ విధంగా సంచరిస్తున్నాయో పరిశీలించాలి. తరువాత శిరస్సు అగ్ని శరీరం వీటిని రక్షించుకోవాలి. శ్వాసరూపమయిన ప్రాణం శిరస్సునందు సంచరిస్తూ ఉంటుంది. ఎల్లవేళలా సంసిద్ధంగా ఆ ప్రాణమే సనాతన పురుషుడు, సర్వభూతాంతర్యామి, మనస్సు, బుద్ధి, అహంకారం, పంచభూతాలు, వాటివిషయాలు అన్నీ అతడే పొత్తికడుపు మూలభాగాన్ని, గుదభాగాన్ని అగ్నిని ఆశ్రయించి అపానవాయువు పని చేస్తుంటుంది. మూత్రపురీషాల్ని మోసుకుపోవటం, అపానవాయువు పని. దేహములందు క్రియా ప్రవృత్తిని కలిగించటం అపాన వాయువుపని. ఏ వాయువు సమస్తధాతువులను సైభాగానికి ప్రవర్తింపచేస్తుంటుందో దానిని ఉదానవాయువని ఆత్మవిద్యాకుశలులు భావిస్తారు. ప్రతి అవయవ సంధియందు ప్రవేశించి సమస్త చేష్టలను ప్రవర్తింపచేసే శరీరమందున్న వాయువును వ్యానమని చెప్తారు. ధాతువులందు అగ్నియందు వ్యాపించి ఉండే వాయువును 'సమాన'మని వ్యవహరిస్తారు. ఈ సమాన వాయువే ప్రాణోత్క్రమణ కాలంలో సర్వచేష్టలను అంతరింపజేస్తుంది.

పంచప్రాణాలు ఒకదానితోఒకటి కలియటం వేడిమియే అగ్నిగా చెప్పబడుతున్నది. ఆ అగ్నియే ఆహారాన్ని శక్తిగా పరిణామం చేస్తున్నది. ఆపాన ప్రాణాల మధ్యలో వ్యానోదానవాయువులు నెలకొని ఉంటాయి. సమాన వాయువుతో కూడిన అగ్ని ఆహారాన్ని చక్కగా జీర్ణింప చేస్తుంది. శరీరపు మధ్యభాగంలో నాభి ఉంటుంది. ఆ నాభియందు అగ్నినెలకొని ఉంటుంది. అగ్నియందు ప్రాణాలన్నీ కలుస్తాయి. ప్రాణాలయందు ఆత్మనెలకొని ఉంటుంది. నాభిక్రిందభాగంలో పక్వపదార్థాలతిత్తి ఉంటుంది. నాభిపై భాగంలో అపక్వపదార్థాల సంచి ఉంటుంది. శరీరం మధ్యలోనాభి, దానిలో సర్వప్రాణాలూ ఉంటాయి. అక్కడ ఉన్న ప్రాణాది వాయువులు, అన్నీ అడ్డంగానూ, పైకి క్రిందకు కదులుతూ ఉంటాయి. ప్రాణాలచేత అగ్నిచేత ప్రేరేపింపబడినవై పదినాడులు అన్నరసాలను శరీరమంతటా ప్రసరింపచేస్తుంటాయి. యోగులమార్గమంతా ఈ పంచ ప్రాణాలలోనే ఇమిడి ఉంటుంది. శ్రమను జయించిన యోగి, చక్కగా కూర్చొని మూర్ధయందు ఆత్మను ధరించాలి. ఆత్మను శిరస్సున, భ్రూమధ్యమున మనస్సును, నిలిపి ఉంచి, పంచప్రాణాల సంచారాన్ని నిరోధించి, యోగి పరమాత్ముని ధ్యానించాలి. ప్రాణవాయువును, అపానమందు, అపానాన్ని ప్రాణమందు సంయోగపరచాలి. ఈ విధంగా ప్రాణ అపాన వాయు సంచారాన్ని ఆపి, ప్రాణాయామపరుడు కావాలి. యోగి జనరహిత ప్రదేశంలో ఉండి పరిమితాహారాన్ని తీసుకొంటూ, మౌనంగా, గాలి పీల్చుకోకుండా, తనలోపలే అయిదు ప్రాణాలను కలపాలి. యోగి అవిశ్రాంతుడుగా పరమాత్ముని చింతించాలి. లేచినప్పటికీ మళ్ళీమళ్ళీ

ఆదే పనిచేస్తుండాలి. ఈ విధంగా బద్ధకాన్ని వదలి. నిలుచున్నా, నడుస్తున్నా నిద్రిస్తున్నా కూడా పరమాత్మునే ధ్యానించాలి. ఈ విధంగా అవిశ్రాంతంగా యోగాభ్యాసం చేస్తున్న యోగియొక్క మనస్సు పరమప్రశాంతమవుతుంది. ఆ ప్రశాంతమనస్సులో పరమాత్మ కనిపిస్తాడు. పొగలేని ప్రజ్వరిల్లిన అగ్నివలె, రశ్మిసంయుతుడైన ఆదిత్యునివలె ఆకాశంలో మెరుపు తీగలాగ, ఆశాశ్వత పురుషుడు కన్పిస్తాడు. అప్పుడు ఆ జ్యోతిని చూచిన మనస్సు అణిమాది ఎనిమిది ఈశ్వర గుణాలతో నిండిపోతుంది. దేవతలు కూడా మిక్కిలిగా కోరుకొనే ఉన్నతస్థానాన్ని మనస్సు చేరుకొంటుంది. పార్వతీ ! ఈ యోగమార్గంలో ప్రయాణించేవారు పరిహరించ వలసిన పది దోషాలున్నాయి. యోగులకు ఈ దోషాల కారణంగానే విఘ్నాలు ఏర్పడుతుంటాయి. క్రాంతదర్శులీవిధంగా ప్రకటిస్తున్నారు. కామం క్రోధం, భయం, స్వప్నం, స్నేహం, మిక్కిలిగా తినటం, వికలమనస్కత, వ్యాధి, బద్ధకం, దురాశ అన్నవి పదిదోషాలు. ఈ పది దోషాల కారణంగా యోగికి విఘ్నాలేర్పడుతుంటాయి. ఈ దోషాలు దైవం వల్ల ఏర్పడేవే కనుక ముందుగా ఈ దోషాలను నివారించుకొని, మనస్సును యోగాభ్యాసం వైపు మరల్చాలి. ఈ ఎనిమిందింటినీ, యోగ మార్గంలో గుణాలుగా చెప్తారు. ఈ ఎనిమిది గుణాలు సాధిస్తే దివ్యమయిన ఈశ్వరత్వం పొందవచ్చు. అణిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం, గరిమ, లఘిమ, ఈ ఎనిమిది యోగ గుణాలు. యోగిశ్రేష్ఠులు ఈ ఎనిమిది గుణాలను సాధించి లోకానికంతటికీ అధీశ్వరులవుతారు. దేవతలకంటె గొప్పవారవుతారు. ఈ యోగవిద్య, మిక్కిలిగా తినేవానికి, ఏ మాత్రం తిననివానికి, అతిగానిద్రించేవానికి, అతిగా మేలుకొనేవానికి లభించేది కాదు. ఆహార విహారాల్లో సమతూకం పాటించేవానికి, నియమబద్ధంగా కర్మలనాచరించే వానికి, క్రమబద్ధమైన నిద్ర, మెలకువలున్నవానికి, ఈ యోగవిద్య సుఖాన్నిస్తుంది. ఈ పద్ధతిద్వారానే ఇష్టదేవతా సాయుజ్యం లభిస్తుంది. దీన్ని సాధించాక కూడా యోగమార్గ తత్పరుడుగా ఉండాలి. దేవి! నిత్యం మారుమనస్సు లేనివాడై ఏకాగ్రంగా చాలాకాలం ప్రయత్నిస్తే గాని దేవతాసాయుజ్యం లభించేది కాదు. హవిస్సులతో, పూజలతో, నమస్కారాలతో, నిత్యం తలుస్తూ ఉండటం వల్ల, శక్తిమేరకు అర్చించటం వల్ల, సాధకులు తమ దేవతా సాయుజ్యాన్ని పొందుతారు. శుభనయనా! సాయుజ్యాలన్నిటిలోను శివసాయుజ్యం, విష్ణుసాయుజ్యమన్నవి పరమప్రశస్తాలు, ఈ రెండు సాయుజ్యాల్లో దేన్ని పొందినా, వారు తిరిగి జన్మించరు. దేవి! ఈ విధంగా సనాతనమయిన యోగధర్మాన్ని గూర్చి నీకు తెలియజేశాను. ఈ యోగధర్మం గురించి ప్రశ్నించటం నీకు మాత్రమే సాధ్యమయింది. ఇతరుల కట్టి అవకాశం ఉండదు."

పాశుపతయోగము - శివలింగపూజ.

పార్వతి ఇలా అంది. "త్రిలోచన! త్రిపురాంతక! లోకపాలవరప్రదా! నీకు నమస్కారం. నీవు నా ప్రార్థనను మన్నించి అత్యుత్తమమయిన ఆత్మవిజ్ఞానం వినిపించావు. ఆ విజ్ఞానం ఊహించనలవి కానిది. తెలియ శక్యం కానిది, సాంఖ్యయోగ రూపమయినది. అనేక శాఖలున్నది. ఇప్పుడు తమ సాయుజ్యాన్ని గూర్చి వినాలనుకుంటున్నాను. భక్తులు, పరమాప్తులయిన మిమ్మల్ని ఏ విధంగా సేవిస్తారు.

వారు చేసే క్రియలేవిధంగా ఉంటాయి? నీవు దేనితో తృప్తి చెందుతావు? ఈ విషయం అంతా తమరే స్వయంగా చెప్తుంటే వినటానికి నాకు చాలా బాగుంటుంది."

శ్రీ మహేశ్వరుడిలా అన్నాడు. "ఆహా! దేవి! ఆశ్చర్యకరమయిన నా సాయుజ్యం గూర్చి నీకు చెప్తాను, పరమయోగులు నా సాయుజ్యాన్ని పొందుతారు. వారు తిరిగి వెనుకకుపోవటం ఉండదు. పూర్వం మోక్షకాములై తపస్సులు చేసిన ఋషులకు కూడా నేను ఊహింపశక్యం కానివాడను. ప్రకటం కానివాడను సాంఖ్య యోగాలు నా చేతనే సృజింపబడ్డాయి. ఈ చరాచర జగత్తంతా నాసృష్టియే. నేను అందరికీ పూజ్యుడను. నేను ఈశ్వరుడను, నాశరహితుడను, అత్యంత సనాతనుడను, ప్రసన్నమయిన నేను నా భక్తులకు దేవతత్వాన్ని కూడా అనుగ్రహిస్తాను. నా స్వరూపాన్ని దేవతాసమూహాలుగాని, తపోధనులయిన ఋషులుకాని తెలుసుకోలేరు. దేవి! కేవలం నీ సంతోషం కోసం నా వైభవాన్ని తెలియచేస్తున్నాను. బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రయాలనుండి నా భక్తులు విశుద్ధులు పవిత్రులు తపశ్శీలురు అయిన బ్రాహ్మణుల్ని రావించి దేవి! వారికి నేను గొప్ప పాశుపతయోగాన్ని ఉపదేశించాను. ఆ పాశుపతయోగం, వారందరిచేత నా దక్షిణముఖం నుండి వెలువడి చక్కగా గ్రహించబడ్డది. వారందరు దాన్ని, ముల్లోకాల్లోను చక్కగా నెలకొల్పారు. ఇప్పుడు దాన్ని గురించి నీవడిగావు కనుక నీ కోసం మళ్ళీ వివరిస్తున్నాను. ఏకాగ్రమైన మనస్సుతో విను. నేను పశుపతిని, నా భక్తులందరూ పాశుపతులు. పాశుపతులయిన మానవులందరూ శరీరమంతటా భస్మాన్ని అలంకరించుకొంటారు. ఈ విభూతిని, రక్షణకోసం, శుభంకోసం, పవిత్రతకోసం పాశుపతులుగా గుర్తింపుకోసం, పూర్వం నా భక్తులందరికీ ఇచ్చాను. దానితో సమస్త దేహాన్ని అలంకరించుకొన్న బ్రహ్మచారులు. కొందరు జటలుధరించి, కొందరు కేశరహితులుగాను, మరికొందరు వివిధాకృతులు కల్గిన శిరోజాలతోను యీ లోకమంతా తిరుగుతున్నారు. కొందరు వికృత వేషధారులు, కొందరు రాగిరంగువారు. కొందరు దిగంబరులు, కొందరు రకరకాల వేషాలతో ఉన్నవారు. వీరందరూ భిక్షాటన చేస్తూ జీవిస్తారు. అన్ని విషయాల్లోనూ కోరిక లేనివారుగా ఉంటారు. ఏ వస్తువులనూ స్వీకరించరు. చేతమట్టి పాత్ర ఉంటుంది. ఎల్లవేళలా నన్నే ధ్యానిస్తుంటారు. వారు నా భక్తులు సమస్తలోకం పర్యటిస్తారు. నాకు ఆనందం కల్గిస్తారు నా అమూల్యమైన, దివ్య పాశుపత యోగశాస్త్రాన్ని గూర్చి అన్నిలోకాల్లోను సూక్ష్మాంశాలతో సహా చర్చించుకొంటూ తిరుగుతుంటారు పాశుపతులు. ఈ విధంగా నిత్యం నాగురించే యోచించే నా భక్తులు నా వద్దకు చేరుకొనే ఉపాయాన్ని నేను ఆలోచిస్తుంటాను. ముల్లోకాల్లోనూ, నేను నా ప్రతినిధిగా శివలింగాన్ని స్థాపించాను. కేవలం శివలింగానికి నమస్కరిస్తే సమస్త పాపాలు తొలగిపోతాయి. యాగాలు, దానాలు, చదువులు, యజ్ఞాలు బహుదక్షిణలు, అన్నీ కూడా శివలింగ ప్రణామంలో పదహారవ వంతు ఫలితాన్ని కూడా ఇవ్వవు.

ప్రియురాలా! కేవలం శివలింగాన్ని పూజిస్తే నేను సంతోషిస్తాను. శివలింగాన్ని పూజించే విధానం కూడా చెప్తాను విను. నా శివలింగాన్ని ఆవుపాలతో, వెన్నతో పూజించిన వారు అశ్వమేధయాగం చేసినవారు పొందే ఫలితాన్ని పొందుతారు. నెయ్యితో ప్రతిరోజు శివలింగాన్ని పూజించేవారు నిత్యాగ్నిహోత్రం చేసే బ్రాహ్మణుడు పొందే ఫలితాన్ని పొందుతారు. నా లింగాన్ని కేవలం నీళ్ళతో స్నానం చేయించిన నరుడు కూడా పుణ్యం పొందుతాడు, ప్రియాన్ని పొందుతాడు. శివసన్నిధిలో నెయ్యితో కూడిన

గుగ్గులు మిశ్రితమయిన ధూపాన్ని వేసిన నరుడు గోసవయజ్ఞం, చేసిన ఫలాన్ని పొందుతాడు. కేవలం గుగ్గులు ధూపం మాత్రమే వేసినవాడు కూడా సువర్ణదానం చేసిన ఫలితాన్ని పొందుతాడు. నానావిధ పుష్పాలతో శివలింగాన్ని పూజించినవాడు వేయి ఆవులు దానం చేసినవాడు పొందే ఫలం పొందుతాడు. మరొక దేశానికి వెళ్ళి శివలింగాన్ని ఆరాధించినవాని కంటె ఇష్టమయినవారు నాకెవరూ ఉండరు. ఈ విధంగా అనేక విధాలయిన ద్రవ్యాలతో శివలింగాన్ని పూజించిన నరుడు నాతో సమానుడవుతాడు. మరణానంతరం తిరిగి జన్మించడు. భక్తులు పూజలతో, నమస్కారాలతో స్తోత్రాలలో ఫలహారాలతో, బద్ధకంవదలి నా శివలింగాన్ని నిత్యం పూజించాలి. మోదుగ, మారేడుదళాలు రాజ వృక్షపూలమాలలు, జిల్లేడు పూలు పవిత్రమయిన పూలు ఇవి నాకు మిక్కిలి ప్రీతిని కల్గిస్తాయి. పండుగాని, కూరగాని, పువ్వుగాని, చివరకు నీరయినా సరే, దేవి! నామీద మనస్సు నింపి నా భక్తులు సమర్పిస్తే నేను చాలా సంతోషిస్తాను. నేను సంతోషిస్తే భక్తుడు పొందలేని ఫలమేదీ ఉండదు. కనుకనే నా భక్తులు ఎల్లవేళలా నన్నే పూజిస్తూ ఉంటారు. నా భక్తుల పాపాలు నశిస్తాయి. నా భక్తులు ఎన్నడూ నశించరు. నా భక్తులు అన్నిలోకాల్లోనూ పూజింపబడతారు. వందయజ్ఞాలు చేసినవారే, నన్నుగానీ, నా భక్తుల్నిగానీ ద్వేషించే మానవులందరూ ఘోరమయిన నరకాన్ని పొందుతారు. దేవి! గొప్పదయిన పాశుపతయోగాన్ని గూర్చి నీకు చెప్పవలసినదంతా చెప్పాను. నా భక్తులయిన మానవులు ప్రతిరోజూ దీన్ని వినాలి. ఎవడు ఈ పాశుపతయోగాన్ని గూర్చి చదువుతాడో వింటాడో, వాడు నరుల్లో శ్రేష్ఠుడవుతాడు. స్వర్గం, కీర్తి, ధనం ధాన్యం అన్నీ పొందుతాడు. ఈ ధర్మం వల్ల గొప్ప ఫలితం లభిస్తుందనటంలో సందేహం లేదు.

146. పార్వతి చేసిన స్త్రీ ధర్మవర్ణనము.

నారదుడిలా అన్నాడు. ప్రభువయిన మహాదేవుడు, అలా పలికి తన ప్రక్కనే ఉన్న అనుకూలవతి అయిన భార్య పార్వతితో ఇలా అన్నాడు. భూతభవిష్యత్తులనెరిగిన దానా! ధర్మజ్ఞురాలా! తపోవనంలో నివసించే దానా! సాధ్వి! అందమయిన కనుబొమలదానా! సుకేశి! హిమరాజపుత్రి! సమర్థురాలా! శమదమసంపన్నురాలా! నిరహంకారిణి, ధర్మాచరణశీలా! వరారోహా! నిన్నొక విషయం అడుగుతాను. దాన్ని చెప్పు. దేవి! నీవు పతివ్రతలనందరినీ సేవించావు. వారినుండి అనేక విషయాలు తెలుసుకొన్నావు. బ్రహ్మదేవుని పత్నిసావిత్రి, ఇంద్రుని భార్య శచి, విష్ణుని ప్రియభార్య లక్ష్మి, యముని భార్య ధృతి, మార్కండేయుని భార్య ధూమోర్ణ, కుబేరుని భార్య బుద్ధి, వరుణుని భార్య గౌరి, సూర్యుని భార్య సువర్చల, చంద్రుని భార్య రోహిణి, అగ్నిదేవుని భార్య స్వాహాదేవి, కశ్యపుని భార్య అదితి, వీరందరూ పతిని దేవునిగా భావించిన సాధ్వీమణులే. వారందరినీ నీవు సేవించావు. ధర్మజ్ఞురాలా! ఆ కారణంగా నిన్ను అడుగుతున్నాను. నీ నుండి ఆద్యంతమూ స్త్రీ ధర్మాన్ని సోదాహరణంగా వినాలనుకొంటున్నాను. నీవు నా సహధర్మచారిణివి. సమానమయిన

శీలంతో వ్రతాచరణ చేసేదానివి. సమానమయిన సారమూ, వీర్యమూ కలదానివి. గొప్ప తపస్సు చేశావు. నీవు చెప్పేవిషయం ఎంతో గుణగణాలు కలిగి ఉంటుంది నీవు చెప్పిన దానిని లోకం ప్రమాణంగా అంగీకరిస్తుంది. సుశ్రోణీ! స్త్రీ లే స్త్రీలకు ఆదర్శప్రాయులుగా ఉంటారు. గౌరిని లోకంలో ఉన్న స్త్రీలందరూ నిత్యం అనుసరిస్తుంటారు. నాశరీరంలో సగభాగం నీ శరీరసగభాగంతో నిర్మించబడింది. నీవు దేవతల కార్యాలను చేస్తావు. లోకంలో ప్రజలను నీవు వృద్ధి చేస్తావు.

పూజ్యురాలా! స్త్రీలు చెప్పిన విషయం స్త్రీల చేత గౌరవింపబడ్డంతగా , పురుషులు చెప్పిన విషయం గౌరవింపబడదు.

నీకు శాశ్వతమైన స్త్రీ ధర్మ మంతా తెలుసు. కనుక సమస్త స్త్రీ ధర్మాన్ని నాకు వివరంగా చెప్పు. ఉమ ఇలా అంది. 'త్రికాల వేదీ ! నీ ప్రభావం వల్ల నాకు చెప్పదగినమాటలు స్ఫురిస్తున్నాయి. సమస్త తీర్థోదకాలతో నిండిన ఈ సమస్త నదులు, నీ పాద స్పర్శ కోసం నిన్ను సమీపిస్తున్నాయి. ఈ నదీ దేవతలతో సంప్రదించి, స్త్రీధర్మాన్ని యథాక్రమంగా వివరిస్తాను. సమర్థుడయినా అహంకార రహితుడే శ్రేష్ఠుడవుతాడు. స్త్రీలెప్పుడూ స్త్రీలనే అనుసరించిపోతుంటారు. ఈ నదీ దేవతలందరూ నాచే ఆదరింపబడతారు. ఈ సరస్వతీ నది పవిత్రమయిన నదుల్లో పరమ శ్రేష్ఠమైనది. మొదటి నది. సాగరాన్ని చేరుకొనేది. విపాశ, వితస్త, చంద్రభాగ, ఇరావతీ, శతద్రువు, దేవిక, సింధువు, కౌశికి, గౌతమి, యమున, నర్మద, కావేరి కూడా ఇక్కడ ఉన్నాయి. ఈమె గంగానది. సమస్త తీర్థాలతోను కూడినది. ఆకాశం నుండి భూమికి దిగివచ్చింది. నదుల్లో పరమశ్రేష్ఠురాలు. ఇలా పలికి దేవదేవుని పత్ని అయిన పార్వతి, చిరునవ్వుతో ఆ నదీ దేవతల నందరిని పలుకరించినది. ధర్మవత్సల, పరమేశ్వరుని పట్టమహిషి అయిన పార్వతి, స్త్రీ ధర్మంలో నిపుణులయిన గంగాది నదీ దేవతలను ప్రశ్నించింది.

" సర్వపాపవినాశికలారా! పవిత్రనదీమతల్లులారా! జ్ఞాన విజ్ఞాన సంపన్నులారా! నా మాటను మీరు వినండి. పరమేశ్వరుడు స్త్రీ ధర్మానికి సంబంధించిన ప్రశ్నను వేశాడు. మీతో సంప్రదించి శంకరునికి సమాధాన మివ్వా లనుకొంటున్నాను. స్వర్గంలో, భూమండలంలో, విజ్ఞాన మంతా ఒకనికే తెలిసి ఉంటుందనుకోను. కనుక నదులారా! మిమ్మల్ని గౌరవపురస్సరంగా అడగా లనుకొంటున్నాను. ఈ విధంగా పార్వతి పవిత్రలు, శుభతమ లయిన నదీమాతలను ప్రశ్నించింది. అప్పుడు దేవనది గంగ, పార్వతిని అభినందించింది. ఆ గంగ గొప్ప బుద్ధివిశేషాలు గలది. స్త్రీధర్మాలను తెలుసుకొన్నది. అందమయిన చిరునవ్వు

కల్గినది. పవిత్ర, పాపభయాపహ అయి, గొప్ప బుద్ధితో, వినయంతో నిండి, సర్వధర్మాలు తెలిసి, బహుబుద్ధి విశేషాలు కల్గిన గంగ చిరునవ్వుతో ఇలా పలికింది.

"దేవీ ధర్మ పరాయణా ! నీవు నదినయిన నన్ను గౌరవించావు నేను ధన్యురాలను. నీచే అనుగ్రహింపబడ్డాను. సమర్థుడై ఉండికూడా, నిర్మలమయిన మనస్సుతో ఎవరు ఇతరులను గౌరవిస్తారో, ప్రశ్నిస్తారో వారు పండితులు. జ్ఞాన విజ్ఞాన సంపన్నులను, ఊహా - అపోహల విషయంలో నిపుణులను, మంచి వక్తలను అడిగి తెలుసుకొనేవాడు ఎన్నడూ ఆపదను పొందడు. బహువిధ బుద్ధివిశేషాలున్నవాడు సభలో మాట్లాడిన మాట గొప్పగా ఉంటుంది ! దురహంకారి చెప్పిన మాట దుర్బలంగానే కన్పిస్తుంది. దివ్యజ్ఞానా! పార్వతీ ! నీవుమాత్రమే మా అందరికీ స్త్రీ ధర్మాలను గూర్చి చెప్పగలుగుతావు." తర్వాత, గంగచేత పలువిధాలుగా గుణగానంతో పూజింపబడిన దివ్యసుందరి - పార్వతి సమస్తమయిన స్త్రీధర్మాన్ని వివరించింది.

ఉమ ఇలా అంది. "నాకు ఏది స్త్రీ ధర్మంగా భాసిస్తోందో, దాన్నంతటినీ, యథావిధిగా వివరిస్తాను. నీవు ప్రసన్నురాలివై ఉండు. స్త్రీధర్మం పూర్వమే వివాహవేళలో బంధువులందరిచేత అగ్ని దేవుని సమక్షంలో చెప్పబడింది. భర్తకు సహధర్మచారిణి కావాలన్నదే దాని సారం. మంచి స్వభావం అందమయిన మాటలు, చక్కని నడవడి, చూడాలనిపించటం, మనస్సు భర్తయందే లగ్నం కావటం, ఈ గుణాలున్న భార్య ధర్మచారిణి. ఆమె ధర్మాన్నే పరమంగా భావించాలి. ధర్మంలో భాగస్వామి కావాలి. భర్తను ఎల్లప్పుడు దైవంలా చూసుకోవాలి. చెప్పిన మాట వింటూ, దేవునికి చేసినట్లు సేవలు చేస్తూ, మరొక భావం గానీ, విముఖత గాని లేనిదై మంచి వ్రతదీక్షకల్గి చూడాలన్పించేటట్లున్న భార్య ధర్మాన్ని పొందుతుంది. పుత్రుని ముఖం చూసినట్లు భర్తను నిరంతరం ప్రేమగా చూస్తూ, నియమితంగా భుజించే భార్య ధర్మచారిణి అవుతుంది. దంపతులాచరింప దగ్గ ధర్మాన్ని తెలుసుకొని, అందులో తన భాగాన్ని చక్కగా నిర్వహిస్తూ, ధర్మమే ముఖ్యమని భావిస్తూ, భర్తవ్రతమే తన వ్రతంగా పాటించే భార్య సాధ్వి. పతివ్రత ఎల్ల వేళలా భర్తను దేవతలాగా పూజించాలి. దంపతులకు సంబంధించిన ఈ సహధర్మాచరణాలు మిక్కిలి శుభకరం. భర్త చెప్పిన మాటను చక్కగా వినటం, దేవతలతో సమానంగా ఉపచారాలు చెయ్యటం, భర్తకు వశురాలుగా ఉండటం, మంచిమనస్సు, చక్కటి వ్రతం, ప్రసన్నమయిన ముఖం, ఏకాగ్రచిత్తత, ఉన్న సుముఖి ధర్మచారిణి అవుతుంది. పరుషంగా నిందించినా, కోపంగా చూసినా, తనముఖాన్ని ప్రసన్నంగా ఉంచుకొని భర్తను సేవించే స్త్రీ పతివ్రత.

భర్తను తప్ప అన్యులను పురుషభావంతో చూడని స్త్రీ ధర్మచారిణి. చంద్రసూర్యులనుగాని, చివరకు చెట్టునుకూడా పురుషభావంతో చూడరాదు. భర్త దరిద్రుడయినా, వ్యాధిగ్రస్తుడయినా, మార్గపరిశ్రాంతుడయినా కృశించినా అతడిని తన పుత్రునివలె సేవించే స్త్రీ ధర్మాన్ని పొందుతుంది. సమర్థతకల్గి, పుత్రవంతురాలై, పతిని ఇష్టపడుతూ ప్రాణంగా భావించే ఆమె ధర్మ చారిణి అవుతుంది. ఏ స్త్రీ ఎల్లవేళలా శుశ్రూష, పరిచర్యలను నిండుమనస్సుతో చేస్తుందో, విశ్వాసం, వినయం కలిగి ఉంటుందో ఆమె ధర్మచారిణి అవుతుంది. భర్తను కుటుంబాన్ని నిత్యం అన్నాదులతో తృప్తి పరుస్తూ, కోరికలు, భోగాలు, అధికారం, సుఖం, వీటిపట్ల ఆసక్తి లేక పతియందే ఆసక్తి కలిగి ఉన్న స్త్రీ ధర్మచారిణి. ఉదయాన్నేలేచి, ఇంటి పనుల్ని చేసుకొని, ఇంటినంతా శుభ్రం చేసి, చక్కగా ఆవుపేడతో అలికే స్త్రీ ధర్మచారిణి. నిత్యం అగ్నికార్యాసక్తురాలై పుష్పబలులను సమర్పిస్తూ; దేవతలకు, అతిథులకు, సేవకులకు, భర్తకు తృప్తిని కలిగించేది ధర్మచారిణి. అందరూ తినగా మిగిలిన దానిని తింటూ, న్యాయంగా, శాస్త్రప్రకారం ప్రవర్తిస్తూ, తృప్తిచెంది, పుష్టినొందిన కుటుంబం కలిగిన స్త్రీ ధర్మాన్ని పాటించిన దవుతుంది. అత్తమామలపాదం సేవించే సుగుణశీలయై, తల్లితండ్రులపై శ్రద్ధగల స్త్రీ తపోధనురాలుగా చెప్పబడింది. బ్రాహ్మణుల్ని, దుర్బలుల్ని, అనాథులైన దీనులను, గ్రుడ్డివారిని దయనీయులను, అన్నదానంతో తృప్తి పరిచే స్త్రీ పతివ్రత. నిత్యం శీఘ్రంగా దుశ్చరమైన, వ్రతనియమాల్ని పాటిస్తూ పతిని ధ్యానిస్తూ, పతిహితాన్ని కోరే స్త్రీ పతివ్రత అవుతుంది. ఈ ధర్మమే పుణ్యం. ఇదే తపస్సు. ఇదే స్వర్గం, ఇదే ప్రాచీనం. ఏస్త్రీకి భర్తే సర్వస్వమో, అట్టి భర్తృవ్రత అయిన సాధ్వి పతివ్రత. స్త్రీలకు భర్తయే దైవం, బంధువు, గతి. భర్తతో సమానమయిన మరొక గతిగాని, దైవంగాని స్త్రీలకు లేదు. స్త్రీకి స్వర్గంకూడా భర్త అనుగ్రహంతో సమానం కాదు. మహేశ్వరా! నీవు ప్రీతి చెందితే స్వర్గమయినా నేను కోరుకోను. భర్త దరిద్రుడయినా, రోగి అయినా, ఆపదలో ఉన్నా, శత్రువుకు బందీ అయినా, బ్రహ్మ శాపాన్ని పొందినా, ఆ భర్త చెప్పిన పనిని భార్య ఆపద్ధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని ఏమాత్రం శంకించకుండా చెయ్యాలి. ఆపని చెయ్యకూడనిదయినా, అధర్మం అయినా, ప్రాణనాశకమయినా ఆచరించు. దేవా! నీవు అడిగినందువల్ల స్త్రీ ధర్మాన్ని నేను వివరించాను. ఏ స్త్రీ ఈ విధమైన ధర్మాన్ని పాటిస్తుందో ఆమె పతివ్రతగా కీర్తింపబడుతుంది.

భీష్ముడిలా అన్నాడు. ఇలా పార్వతి చెప్పాక పరమేశ్వరుడు ఆమెను అభినందించాడు. అనుచరులందరితో సహా, వివిధలోకాలవారిని పంపించి వేశాడు. తర్వాత

సమస్త భూతగణాలు, నదులు వచ్చినట్లు గానే తిరిగి వెళ్లాయి. గంధర్వులు, అప్సరసలు, శివునికి నమస్కరించి సెలవు తీసుకొన్నారు.'

147. శ్రీకృష్ణమాహాత్మ్యము.

ఋషులిలా అన్నారు. పినాకపాణీ ! శంకరా ! వాసుదేవుని యొక్క గొప్పతనాన్ని మేము వినాలనుకొంటున్నాము.' ఈశ్వరుడిలా అన్నాడు. "శ్రీహరి బ్రహ్మదేవుని కంటె గొప్ప వాడు. శాశ్వతుడయిన పురుషుడు. మేలిమి బంగారు వర్ణంవాడు. మేఘాలు లేని ఆకాశంలో ఉదయించినసూర్యుడు. పది చేతులవాడు. గొప్ప తేజశ్శాలి. దేవతల శత్రువులకు నాశకుడు. శ్రీవత్స చిహ్నమున్నవాడు. హృషీకేశుడు. సర్వదేవతలకు పూజ్యుడు. బ్రహ్మ శ్రీహరి ఉదరంనుండి పుట్టాడు. నే నాయన శిరస్సునుండి ఉద్భవించాను. తలవెంట్రుకలనుండి నక్షత్రాలు, రోమాలనుండి దేవతలు పుట్టారు. ఋషులందరూ శ్రీహరి దేహంనుండి పుట్టారు. శాశ్వతలోకాలు ఆయన దేహంనుండే పుట్టాయి. ఆయన బ్రహ్మదేవునికి, సర్వదేవతలకు ఆశ్రయస్థానం. చరాచరాత్మకమయిన భూమండలానికంతటికీ, సమస్త ప్రాణులకూ ఆయనయే సృష్టికర్త, రక్షకుడు, ప్రళయ కారకుడు. ఆయన ముల్లోకాలకు అధీశుడు. ఆయన దేవతాశ్రేష్ఠుడు. దేవతలకు ప్రభువు. శత్రుంజయుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, అన్ని వైపులా ముఖా లున్నవాడు. ఆయనయే పరమాత్మ, హృషీకేశుడు, సర్వవ్యాపకుడు, మహేశ్వరుడు. ఆయన కంటే గొప్ప వ్యక్తి ముల్లోకాల్లోనూ లేడు. ఆయన సనాతనుడు, మధుహంతకుడు, గోవిందుడుగా చెప్పబడ్డవాడు. అహంకారనాశకుడయిన ఆయన సమస్త పార్థివులను చంపగలడు. దేవకార్యం కోసం ఆయన మనుష్య శరీరం స్వీకరించాడు. ఆ త్రివిక్రముడే లేకపోతే దేవగణాలు ఏపనీ చెయ్యలేరు. భూమిలో నాయక వర్జితులైన దేవతలు ఏపనీ చెయ్యలేరు. ఆయన సర్వదేవతల చేత నమస్కరింపబడేవాడు. సర్వప్రాణులకు నాయకుడు. దేవతలకు ప్రభువు, దేవతా కార్యసాధకుడు, బ్రహ్మాత్మకుడు, బ్రహ్మర్షుల కాలంబనం అయినవాడు శ్రీహరి. ఆయన శరీరంలో గర్భమందుండి బ్రహ్మదేవుడు సుఖంగా ఉంటాడు. ఆయన శరీరమందే శర్వుడు సుఖంగా కాలక్షేపం చేస్తాడు. సమస్త దేవతలు ఆయన శరీరాన్ని ఆశ్రయించుకొనే సుఖంగా ఉంటారు. ఆయన పుండరీకాక్షుడు. లక్ష్మిని తనలో ఇముడ్చుకొన్నవాడు, ఆమెతో కలసి జీవించేవాడు.

ధనుస్సు, సుదర్శన చక్రం, కౌమోదకీ ఖడ్గం. గరుడధ్వజం కలవాడు. ఆయనలో

ఉత్తమశీలం, శమం, దమం నెలకొని ఉంటాయి. ఆయన పరాక్రమం, బలం, దర్శనీయమయిన శరీరం, ఔన్నత్యం, ప్రమాణం, ఆర్జవ సంపద నిండుగా ఉన్నవాడు. శ్రీహరి దయ రూపం బలం ఉన్నవాడు. అద్భుతంగా కన్పించే దివ్యాస్త్రాల సంపదతోను, ఇతర ఆయుధాలతోను కూడుకొన్నవాడు. శ్రీహరి యోగమాయ కలవాడు, వేలకన్నులవాడు, ప్రమాదరహితుడు, గొప్పమనస్సున్నవాడు, వీరుడు, మిత్రులను ప్రశంసించేవాడు, జ్ఞాతులకు బంధువులకు ప్రియమయినవాడు. ఆయన సహనశీలి, అహంకారం లేనివాడు, బ్రాహ్మణ భక్తుడు, వేదోద్ధారకుడు, భయార్తుల భయం పోగొట్టేవాడు. మిత్రుల కానందం కల్గించేవాడు. సర్వప్రాణులకు శరణమిచ్చేవాడు, దీనుల్ని రక్షించటంలో సదా ఆసక్తుడు, పండితుడు, ధనవంతుడు, సమస్త ప్రాణివంద్యుడు. శ్రీహరి తన్ను ఆశ్రయించిన శత్రువులకు కూడా వరాలిచ్చేవాడు. ధర్మవేది. నీతిశాలి, నీతి పూర్వకంగా ప్రవర్తించేవాడు, బ్రహ్మవాది, జితేంద్రియుడు. పరమబుద్ధి శాలియయిన శ్రీహరి, దేవతల ప్రయోజనం కోసం ధర్మ సంస్కృతమై, ప్రజాపతి సంబంధం కలిగిన మనువంశంలో పుడతాడు. గోవిందుడు మహానుభావు డయిన మనువువంశంలో, మనుపుత్రుడుగా అంగుడనేపేరుతో పుడతాడు. అతడినుండి అంతర్ధాముడు పుడతాడు. అంతర్ధామునినుండి హవిర్ధాముడనే ప్రజాపతి జన్మిస్తాడు. ఆ హవిర్ధామునికి ప్రాచీన బర్హి అనే పేరుగల గొప్పవ్యక్తి జన్మిస్తాడు. ఆయనకు ప్రచేతసుడు మొదలయిన పదిమంది కొడుకులు పుడతారు. ప్రాచేతసుడికి దక్షప్రజాపతి జన్మిస్తాడు. దక్షునికుమార్తె అదితికి ఆదిత్యుడు జన్మిస్తాడు. ఆదిత్యునికి మనువు పుడతాడు. మనువుకు 'ఇలా' అనే కుమార్తె జన్మించి, సుద్యుమ్ననిగా కొడుకుగా పరిణతి పొందుతుంది. కన్యావస్థలో ఆమె బుధునితో సమాగమంవల్ల పురూరవుడిని కంటుంది. పురూరవుడి కుమారుడు ఆయువు. ఆయువు కొడుకు నహుషుడు. నహుషుని కొడుకు యయాతి. యయాతికి గొప్ప బలంకల క్రోష్టుడనే పుత్రుడు జన్మిస్తాడు.క్రోష్టునికి వృజినీవంతుడు అనే గొప్ప కొడుకు పుడతాడు. వృజినీవంతునికి, పరాజయమెరుగని ఉషంగుడు పుడతాడు. ఉషంగునికి శూరుడయిన చిత్రరథుడు పుత్రుడుగా జన్మిస్తాడు. చిత్రరథుని చిన్నకొడుకుగా శూరుడు పుడతాడు. ఆ విధంగా, ప్రసిద్ధ పరాక్రమం, చరిత్ర, గుణగణాలున్న వంశంలో యాగకర్తలు, పరమవిశుద్ధులు, బ్రాహ్మణ సమ్మతులు అయిన వారి వంశంలో పుట్టిన శూరుడు క్షత్రియుల్లో శ్రేష్ఠుడు, గొప్ప కీర్తికలవాడు. ఆయన తన వంశాన్ని విస్తరిస్తూ, శత్రువుల మానాన్ని ఖండించే వసుదేవుని కంటాడు. ఆయనకు 'ఆనక దుందుభి' అనే మరో పేరు ఉంటుంది. ఆయన పుత్రుడిగా నాలుగు బాహువులున్న వాసుదేవుడు జన్మిస్తాడు.

వాసుదేవుడు బ్రాహ్మణ భక్తి కలవాడు, బ్రహ్మసమానుడు, విపులయందనురక్తుడు. ఆ యాదవరాజు మాగధుడయిన జరాసంధునిచే బంధింపబడ్డ రాజులందరినీ విడిపిస్తాడు. ఆ శ్రీహరి, జరాసంధమహారాజును ఆయన రాజగృహంలోనే జయిస్తాడు. పరాక్రమవంతుడయిన ఆయన సర్వ పార్థివుల చేత రత్నాదులతో సత్కరింపబడతాడు. ఆ శ్రీకృష్ణుడు భూమండలంలో సాటిలేని, తిరుగులేని పరాక్రమంకలవాడు, మహాబలశాలి. సర్వపార్థివులకు పార్థివుడు. దేవీ ! నయశాలి అయిన శ్రీకృష్ణుడు శూరసేనదేశంలోని ద్వారకాపట్టణంలో నివసిస్తూ, భూమండలాన్నంతటినీ జయించి, పరిపాలిస్తాడు. శాశ్వతుడైన ఆయనను మీరందరూ చేరుకొని, స్తుతులతో, పూలమాలలతో గొప్ప సత్కారాలతో, బ్రహ్మదేవుని పూజించినట్లు న్యాయబద్ధంగా పూజించండి. ఎవరు నన్ను గాని, బ్రహ్మనుగాని చూడాలనుకొంటారో, వారందరూ ప్రతాపవంతుడయిన వాసుదేవ భగవానుని దర్శించాలి. ఆయనను చూస్తే నన్ను చూచినట్లే. ఇందులో సందేహం లేదు. అలాగే పితామహుని చూసినట్లే. ఈ విధంగా తపోధనులారా మీరు తెలుసుకోండి.

ఎవరిపట్ల పుండరీకాక్షుడు ప్రీతి చెందుతాడో, అతని పట్ల బ్రహ్మాది దేవతా సమూహమంతా ప్రీతి చెందినట్లే. ఎవడు మానవలోకాన్ని ఆశ్రయించిన కేశవుని ఆశ్రయిస్తాడో అతనికి కీర్తి, జయం, స్వర్గం అన్నీ సిద్ధిస్తాయి. అతడు ధర్మోపదేశకు డవుతాడు. ధర్మవంతుడవుతాడు. ధర్మశాలురందరూ ఆ దేవాధి దేవునికి ఎల్ల వేళలా లేచి, నమస్కరించాలి. ఆ మహాప్రభువును అర్చిస్తే వచ్చే ధర్మం చాలా గొప్పది. ఆ దేవుడు గొప్ప తేజశ్శాలి. ప్రజల మేలు కోసం, ధర్మం కోసం ఆ పురుష వ్యాఘ్రుడు ఋషి సమూహాల్ని సృష్టించాడు. ప్రభువైన ఆయన సృష్టించినవారు గంధమాదన పర్వతం మీద సనత్కుమార ప్రముఖులుగా, తపఃపరాయణులుగా జీవిస్తున్నారు. ఓ ద్విజపుంగవులారా ! ధర్మజ్ఞుడు, వాగ్మి అయిన శ్రీకృష్ణుడు నమస్కరింప దగ్గవాడు.

దేవలోకంలో ప్రభువు, భగవంతుడు, నారాయణుడు అయిన శ్రీహరి పరమశ్రేష్ఠుడు. అతడు నమస్కరించిన వారందరికీ నమస్కరిస్తాడు. గౌరవిస్తే గౌరవిస్తాడు. పూజిస్తే ప్రతిపూజ చేస్తాడు. మీరు చూస్తే ప్రతిరోజూ మిమ్ము చూస్తాడు. ఆశ్రయించిన వారికి ఆశ్రయమిస్తాడు. మీరు అర్చిస్తే ఆయన మిమ్ము అర్చిస్తాడు. ద్విజశ్రేష్ఠులారా ! అతడు దేవతా శ్రేష్ఠుడు. ఇది పరమ పూజ్యుడయిన ఆ విష్ణువు యొక్క గొప్ప వ్రతం. ఆయన ఆదిదేవుడు. గొప్పవాడు. ఆయన వ్రతం సజ్జనుల కాదర్శ ప్రాయం. సనాతనుడైన ఆయన ఈ ప్రపంచంలో దేవతలందరి చేత పూజింపబడేవాడు. ఆయన ననుసరించినవారికి

తగ్గ విధంగా అభయం లభిస్తుంది. ద్విజులందరూ మనో వాక్కాయ కర్మలతో శ్రీహరిని పూజించాలి. ప్రయత్న పూర్వకంగా సమీపించి ఆ దేవకీ ! సుతుని దర్శించాలి. ఓ మునిసత్తములారా ! మీరు అనుసరించవలసిన మార్గాన్ని చెప్పాను. ఆయనను మీరు చూస్తే సర్వ దేవతలనూ చూచినట్లే. మహా వరాహ రూపధారి, సర్వలోక పితామహుడు అయిన ఆ దేవుని, జగత్పతి అని, నేను కూడా నిత్యం నమస్కరిస్తుంటాను. శ్రీ కృష్ణుని చూస్తే బ్రహ్మ విష్ణు మహేశ్వరులను ముగ్గురిని చూచినట్లే. సందేహంలేదు. దేవతలమయిన మేమందరమూ ఆయన శరీరంలోనే నివసిస్తున్నాం.

కైలాస పర్వతంలా తెల్లగా మెరిసిపోయేవాడు, హల ధారి, పర్వత సమానుడు, బలరాముడుగా ప్రసిద్ధి చెందేవాడు, ఆయనకు అన్నగా జన్మిస్తాడు. ఆ బలరాముని రధంమీద దివ్యమై, సువర్ణ మయమైన మూడుతలల తాటిచెట్టు జెండాగా అమరి ఉంటుంది. సర్వలోకేశ్వరుడు, మహాబాహువు అయిన ఆ బలరాముని శిరస్సు గొప్ప పడగలుగా, గొప్ప సర్పాలతో కూడి ఉంటుంది. స్మరించినంత మాత్రాన సమస్త శస్త్రాస్త్రాలు ఆయనను చేరుకొంటాయి. భగవంతుడు, నాశరహితుడు, హరి యొక్క రూపాంతర మయిన అనంతునిగా ఆయనను పేర్కొంటారు. పూర్వం దేవతలు ఈ అనంతుని రూపాన్ని దర్శించవలసిందిగా కశ్యపాత్మజుడు, బలశాలి, మహావీర్యుడు అయిన గరుడుని కోరారు. కాని గరుడుడా రూపాన్ని సంపూర్ణంగా దర్శించలేక పోయాడు. ఆ ఆదిశేషుడు పరమానందంతో తన పడగలతో భూమండలాన్ని ఆక్రమించి, కౌగిలించుకొని, పాతాళంలో నివసిస్తాడు. భూమిని ధరించిన భగవంతుడయిన అనంతునికి, విష్ణువుకు, బలరామునికి, హృషీకేశునికి, అచ్యుతునికి భేదమే లేదు. ఈ విధంగా బలరామ శ్రీకృష్ణులుగా అవతరించిన దివ్య పరాక్రములయిన పురుష శ్రేష్ఠులు, హల చక్రధారులు, దర్శింప దగ్గవారు, పూజింపదగ్గవారు. తపోధనులారా ! మీరు కోరిన విషయాన్ని చెప్పాను. మీరందరూ ప్రయత్న పూర్వకంగా యదు శ్రేష్ఠుని పూజించండి.'

148. శ్రీకృష్ణుని మహిమను వర్ణించుట

నారదుడిలా పలికాడు 'తరువాత ఆకాశంలో గొప్ప శబ్ద మేర్పడింది. దానితో పాటు మెరుపులు, మేఘాలు వచ్చాయి. ఆకాశమంతా కారు మబ్బులలో నిండి పోయింది. వర్షాకాలంలో లాగ మేఘుడు నిర్మలమైన నీటిని వర్షించాడు. ఆకాశమంతా దట్టమైన చీకట్లు కమ్ముకొన్నాయి. దిక్కుల్లో వెలుగు కానరాలేదు. అప్పుడు సనాతనమూ, పుణ్యమూ,

రమ్యమూ అయిన దేవగిరి మీద శంకరుడు, భూతసంఘాలు, మునులు ఎవ్వరూ కానరాలేదు. మళ్ళీ క్షణ కాలంలో ఆకాశంమంతా మేఘ రహిత మయింది. విప్రులు తీర్థయాత్రలకు బయలు దేరి వెళ్లారు. ఇతరులు కూడా వచ్చిన దారినే వెళ్ళారు. వారందరూ ఆశ్చర్యకరమూ, అనూహ్య మయిన దాన్నంతా చూసి, విన్నబోయారు. నీకు సంబంధించిన ఉమా శంకరుల సంవాదం పరమాశ్చర్యకరం కదా ! పురుష శ్రేష్ఠ ! శంకరుడు చెప్పిన బ్రహ్మభూతుడయిన సనాతనుడవు నీవే. మహాత్ముడయిన శంకరుడు నీదర్శనం చేసుకోమనే మహా పర్వత పృష్ఠం మీద సెలవిచ్చాడు.

కృష్ణ ! నీ తేజస్సువల్ల మరొక అద్భుత ఘటన నేడు జరిగింది. దాన్ని చూసి మేమంతా మిక్కిలి ఆశ్చర్యపోయాం. ఆనాటి శంకరుని పలుకులు నేడు మళ్ళీ గుర్తుకువచ్చాయి. ప్రభూ ! మహాబాహూ ! జనార్దన ! కపర్ది ! దేవ దేవుడు, గిరీశు డయిన శంకరుని మాహాత్మ్యమంతా నీకు విన్నవించాను. తపోవన వాసు లందరిచేత ఇలా చెప్పబడ్డ దేవకీ నందనుడు - కృష్ణుడు ఆ ఋషు లందరినీ చక్కగా గౌరవించాడు. అప్పుడు ఋషులందరూ పరమానంద భరితులై, కృష్ణునితో పలికారు 'ఓమధు సూదనా ! నీవీ విధంగా నీదర్శనాన్ని పదే పదే అనుగ్రహించు. విభో ! మాకు నీ దర్శనం మీదున్న కోరిక, స్వర్గం మీద కూడా లేదు. భగవంతుడైన శంకరుడు చెప్పినదంతా నిండు సత్యం. శత్రు నాశక ! రహస్యమయిన ఈ విషయమంతా నీకు విన్నవించాం. నీవే పదార్థతత్త్వం ఎరిగినవాడవు. నిన్నడిగితే మళ్ళీ మమ్ము ప్రశ్నిస్తుంటావు. అందువల్ల నీ ప్రీతికోసం రహస్యమయిన యీ విషయమంతా చెప్పాం. ముల్లోకాల్లోనూ నీకు తెలియని విషయమంటూ ఏదీ ఉండదు. నీవు భూమిపై అవతరించటం, దేవకీ గర్భంలో జన్మించటం, దాని కారణం అంతా నీకు తెలుసు. మేము మాత్రం చాపల్యం వల్ల రహస్యం రక్షించే శక్తి లేనివారం. కనుక నీవు ఎదురుగా నిలిచి ఉండగా, మా లఘుత్వం వల్ల ఏదో ఏదో వాగుతున్నాం ఈ ప్రపంచంలో నీకు తెలియని వింత గాని, విశేషం గాని, ఆశ్చర్యం కాని ఉండదు దేవా ! స్వర్గంలో కానీ, భూమిమీద కానీ సమస్తం నీకు తెలుసు. స్వర్గంలో గాని, భూమిమీద కాని సమస్తం నీకు తెలుసు. కృష్ణ ! మేమింక వెళ్ళి వస్తాం. గొప్ప బుద్ధిని, విష్ణుని నీవు పొందవలసింది. ఆర్యా ! త్వరలో నీకు గొప్ప ప్రభావ శాలి అయిన కొడుకు పుడతాడు. అతడు సమర్థుడై వంశానికి వన్నె తేగలవాడు. అతడు నీ అంతవాడో, నిన్ను మించినవాడో కాగలడు.'

భీష్ముడిలా అన్నాడు 'అప్పుడా మహర్షులందరూ దేవేశుడు, పురుషోత్తముడు అయిన శ్రీకృష్ణునికి నమస్కరించి, ప్రదక్షిణం చేసి, వెళ్ళిపోయారు. ఆ శ్రీమంతుడయిన

నారాయణుడే గొప్ప కాంతితో కూడి, అనుకొన్న వ్రతాన్ని యథావిధిగా పూర్తి చేసి, ద్వారకకు తిరిగి వచ్చాడు. పది మాసాలునిండాక ఈయనకు రుక్మిణి యందు, శూరుడు వంశోద్ధారకుడు అయిన కుమారుడు జన్మించాడు. రాజా ! సమస్త ప్రాణుల యొక్క భావ మందూ, దేవ రాక్షసుల యొక్క హృదయాంతరాళాల్లో ఎల్ల వేళలా సంచరించే కాముడే ఇతని కుమారుడు. ఆ కృష్ణుడే పురుషోత్తముడు, మేఘవర్ణశరీరుడు, చతుర్భుజుడు. ప్రేమతో పాండవుల దరి చేరినవాడు. మీరు ఈయనను శరణుజొచ్చారు. ఈ విష్ణుదేవు డెక్కడ ఉంటాడో, అక్కడ కీర్తి, లక్ష్మి, ధృతి, స్వర్గ మార్గం అన్నీ లభిస్తాయి. ఈయనయే త్రివిక్రముడు. ఇంద్రాది ముప్పది మూడు దేవతల స్వరూప మీయనయే అనటంలో సందేహం లేదు. ఈయన ఆదిదేవుడు, మహాదేవుడు, సమస్త ప్రాణులకు ఆశ్రయ మయినవాడు. ఆద్యంతాలు లేనివాడు, అవ్యక్తుడు, మహాత్ముడు, మధుదైత్య మర్దనుడు, గొప్ప తేజస్సుగల ఈయన దేవతల ప్రయోజనం కోసమే జన్మ ఎత్తాడు. మిక్కిలి దురవగాహాలయిన అర్థ తత్త్వాలను నిర్మించినవాడు, వివరించగలగినవాడూ మాధవుడే. పార్థ! నీవు సాధించిన విజయం, సాటిలేని కీర్తి ఈయన వల్లనే. నీకు లభించిన ఈ సమస్త భూమండలం నారాయణుని ఆశ్రయించటం వల్ల లభించినదే. ఈయనయే నాథుడు. ఊహకందని వాడు. ఆయనయే చరమ గతి. రాజా ! నీవు స్వయంగా హోతవై, యుగాంతాగ్ని సమానుడైన కృష్ణు డనే గొప్ప స్రువంతో రణాగ్నియందు రాజులందరినీ హోమం చేశావు.

దుర్యోధనుడు బుద్ధి హీనుడు. విచారించదగ్గవాడు. వాడు పిచ్చికోపంతో కృష్ణార్జునులతో వైరం పెట్టుకొని, పుత్ర సోదర బంధుసమేతంగా నశించాడు. మహాశరీరాలు, మహాబలం గల దైతేయులు, దానవేంద్రులు కూడా దావాగ్నిలో శలభాలు మాడినట్లు, సుదర్శనాగ్నిలో మాడిపోయారు. పురుషశ్రేష్ఠ ! సత్త్వ శక్తి బలాదులచే పరమహీను లయిన మానవ మాత్రులు ఎవరూ యుద్ధ రంగంలో ఈయనకు ఎదురు నిలబడలేరు. రాజా ! పార్థుడుకూడా యోగి. యుగాంతాగ్ని వంటివాడు. సవ్య సాచి రణాగ్రమందు నిలిచి, సమస్త సుయోధన బలాన్ని తన తేజస్సుతో చంపాడు. ఏ రహస్యాన్ని వృషభాంకుడయిన మహేశ్వరుడు కైలాస పర్వతం మీద మునులకు నివేదించాడో, ఆ ప్రాచీన రహస్యాన్ని చెప్తాను, విను. రాజా ! అర్జునునియందు ఏ పుష్టి, తేజస్సు, పరాక్రమం ప్రభావం, వినయం ఉన్నదో అది శ్రీకృష్ణుని యందు మూడు రెట్లు ఎక్కువగా నెలకొని ఉంది. ఈ ప్రపంచంలో నేను చెప్పిన విషయాలు మరొక విధంగా నిరూపించే అవకాశమేలేదు.

ఎక్కడ కృష్ణ భగవాను డుంటాడో అక్కడ ఉత్తమోత్తమమయిన పుష్టి ఉంటుంది. మనమందరం అల్ప బుద్ధులం, పరాధీనులం, మనోవైకల్యం కలవారం. తెలిసి తెలిసి, నాశరహితమయిన మృత్యు మార్గంలో పడిపోతున్నాం. ధర్మ రాజా ! నీవు ఋజుశీలునివి. ప్రతిజ్ఞాపాలనంలో ఆసక్తి ఉన్నవాడివి. పూర్వం ప్రజాపాలన చేస్తానని చెప్పి రాజవృత్తాన్ని వదలాలనుకొంటున్నావు. రాజా ! ఈలోకంలో ఆత్మహత్య చేసుకోవటమే మంచిదని నీవు భావించినా, పూర్వం చేసిన ప్రతిజ్ఞను విడవడం మంచిది కాదు. ఈయుద్ధ రంగంలో చనిపోయిన జనులంతా కాలం చేతనే చంపబడ్డారు. నేను కూడా కాలంచేతనే చంపబడ్డాను. కాలమే పరమేశ్వరుడు. రాజా ! నీవు కాలజ్ఞుడవు. కాలంచేత స్పృశింపబడినవాడవైనప్పటికీ నీవు విచారింపరాదు. శ్రీకృష్ణుడే ఎర్రని కన్నులతో దండించే సనాతన కాలస్వరూపుడు.

ధర్మజా ! అందువల్ల చనిపోయిన జ్ఞాతుల కోసం నీవు విచారింపరాదు. నీవెల్లప్పుడూ క్రోధ రహితుడవై ఉండాలి. ఈ మాధవుని గొప్పతనం నీకు విన్నది విన్నట్లుగా చెప్పాను. సజ్జనుడు విశ్వసించటానికి నేను చెప్పింది చాలు. వ్యాసుని మాట విని, ధీమంతుడయిన నారదుని మాట విని, స్వయంగా తెలుసుకొని, అర్జునులో పరమ శ్రేష్ఠుడు, ఋషి శ్రేష్ఠుడు అయిన కృష్ణుని యొక్క మాహాత్మ్యాన్ని, ఉమామహేశ్వరుల సంవాదాన్ని నీకు చక్కగా తెలియజేశాను. ఎవరు శ్రీకృష్ణు డనే మహాపురుషునికి సంబంధించిన గొప్పతనాన్ని శ్రద్ధగా వింటాడో, గుర్తుంచుకుంటాడో, చెప్తాడో, వాడు గొప్ప శ్రేయస్సును పొందుతాడు. అతనికి సంబంధించిన సమస్తమైన కోరికలు నెరవేరుతాయి. చనిపోయాక తప్పక స్వర్గాన్ని పొందుతాడు. ఇందులో సందేహం లేదు. రాజా ! శ్రేయస్సును పొందాలనుకొనేవాడు జనార్దనుని ఆశ్రయించటమే న్యాయం. విప్రులచేత సదా స్తుతింపబడే అక్షయుడయిన జనార్దను డీయనయే. మహేశ్వరుడు స్వయంగా చెప్పిన ధర్మగుణాలు రాత్రింబవళ్ళు నీవు మనస్సులో ధ్యానించుకోవాలి. ఈ విధంగా వ్యవహరిస్తూ ప్రజలను న్యాయబద్ధంగా దండిస్తూ, ప్రజాపాలనలో దక్షుడివిగా ఉంటే, నీకు స్వర్గం లభిస్తుంది. రాజా ! సదా ప్రజలను ధర్మమార్గంలో ఉండేలా రక్షించాలి. రాజు ప్రజలకు విధించే దండం కూడా గొప్ప ధర్మంగా కీర్తింపబడింది. రాజా ! సత్పురుష సన్నిధిలో ఉమామహేశ్వరుల మధ్య ధర్మసంబద్ధంగా జరిగిన సంవాదాన్ని నీకు చెప్పాను. దీన్ని విన్నవాడు, వినాలను కొన్నవాడు, పరమ పవిత్ర భావంతో తన మేలు కోరుకొన్నవాడై వృషభధ్వజుడైన శంకరుని అర్చించాలి.

పాండవ ! పరమ పూజ్యుడు, మహానుభావుడు అయిన నారదుని సందేశ

మిది. ఆయన మహాదేవుని పూజించమన్నాడు. నీవు అలాగే చెయ్యి. కుంతీపుత్ర ! ఈ అత్యద్భుత మయిన, వాసుదేవ శంకరుల స్వభావాలకు సంబంధించిన పరమ పవిత్ర వృత్తాంతం పుణ్య ప్రదమైన కైలాసంలో జరిగింది. ఈ శ్రీకృష్ణుడు శాశ్వతుడు. ఈయన పదివేల సంవత్సరాలు గాండీవధారియైన అర్జునునితో పాటు (నరనారాయణులుగా) బదరికావనంలో చాలా గొప్ప తపస్సు చేశాడు. ధర్మజా ! కమల నయనులయిన వాసుదేవ ధనంజయులు గడచిన మూడు యుగాల్లో జన్మించటంవల్ల త్రియుగులుగా చెప్పబడుతున్నారు. నారదవ్యాసు లిది చెప్పారు. పుండరీకాక్షుడు, మహాబాహువు అయిన శ్రీకృష్ణుడు బాలుడుగా ఉండగానే జ్ఞాతులను రక్షించటం కోసం కంసునితో గొప్ప యుద్ధం చేశాడు. యుధిష్ఠిర ! సనాతనుడు, శాశ్వతుడు, పురాణపురుషుడు అయిన వాసుదేవుని యొక్క అద్భుత కర్మలన్నీ లెక్కపెట్టిచెప్పటం సాధ్యమయ్యేది కాదు. నాయనా ! నీకు పరమోత్తమమయిన శ్రేయస్సు ఏర్పడుతుంది. నిజం. ఎందువల్లనంటే పురుష శ్రేష్ఠ డయిన జనార్దనుడు నీకు మిత్రుడు. రాజా ! దుర్బుద్ధి అయిన దుర్యోధనుడు చనిపోయాడు. అయినా అతని గురించే విచారిస్తున్నావు. అతని కారణంగా గుర్రాలు, ఏనుగులతో పాటు భూమండల మంతా నాశనమయింది. దుర్యోధన, కర్ణ, శకుని, దుశ్శాసను లనే నలుగురు దుర్మార్గుల అపరాధం వల్ల కురువంశీయులంతా చనిపోయారు.' వైశంపాయనుడిలా అన్నాడు. 'ఈ విధంగా పురుష శ్రేష్ఠుడైన గంగాసుతుడు - భీష్ముడు మాట్లాడుతూ ఉండగా, మహాత్ముల సన్నిధిలో ఉన్న ధర్మజుడు మౌనంగా ఉండిపోయాడు. ఈ సంభాషణ విన్న ధృతరాష్ట్రాదులు పరమాశ్చర్యంలో మునిగిపోయారు. అందరూ చేతులు జోడించి, మనస్సులో కృష్ణుని పూజిస్తూ ఉండిపోయారు. అచట ఉన్న నారదాది మునులందరూ భీష్ముని వాక్యాన్ని అభినందించి పూజించారు. ఈసమస్త వృత్తాంతాన్ని, భీష్మానుశాసనాన్ని ధర్మరాజు తన సోదరులందరితో కూడి విన్నాడు. యుధిష్ఠిరుడు గంగాసుతుని మళ్ళీ ఇలా ప్రశ్నించాడు."

149. శ్రీవిష్ణు సహస్రనామస్తోత్రము

ఏ విష్ణువును స్మరించినంత మాత్రాన జన్మరూపమయిన సంసార బంధాన్నుండి విముక్తి చెందుతాడో, సమస్తానికి మూల కారణమెవ్వడో ఆ విష్ణువునకు నమస్కారం. సమస్త ప్రాణులకు మొదటివాడు, భూమిని భరించేవాడు, అనేక రూపాలు ధరించినవాడు, సర్వసమర్థుడు అయిన విష్ణువుకు నమస్కారం.

వైశంపాయనుడిలా అన్నాడు. "యుధిష్ఠిరుడు, సర్వధర్మాలను, పవిత్ర విషయాలను విన్నాక శంతనుపుత్రుడైన భీష్మునితో మళ్ళీ ఇలా అన్నాడు. "ఈలోకంలో ఒకే ఒక్కదైవం

ఎవరు ? లోకాని కంతటికీ గొప్ప మార్గం ఎవరు ? ఎవర్ని స్తుతిస్తూ, పూజిస్తూ మానవులు శుభాన్ని పొందుతారు ? అన్ని ధర్మాల్లోనూ నీకేధర్మం పరమ ధర్మ మన్పిస్తోంది ? దేన్ని జపిస్తే ప్రాణి జన్మ సంసార బంధాన్నుండి ముక్తి పొందుతాడు ?"

భీష్ముడిలా అన్నాడు "సమస్త ప్రపంచానికి ప్రభువు, ఇంద్రాదులకూ దేవుడు, అనంతుడు, పురుషోత్తముడు అయిన విష్ణువును వేయి నామాలలో స్తుతించిన పురుషుడు నిరంతరం అభ్యుదయాన్ని పొందుతాడు. నాశరహితుడయిన ఆ పురుషుణ్ణే నిత్యం భక్తితో పూజించాలి, ధ్యానించాలి, స్తుతించాలి, నమస్కరించాలి. ఆద్యంతాలు లేనివాడు, సర్వవ్యాపకుడు, సమస్తలోకాధీశుడు, లోకాధ్యక్షుడు అయిన విష్ణువును నిత్యం స్తుతించినవాడు సమస్త దుఃఖాలను దాటినవాడవుతాడు. అతడు బ్రాహ్మణ ప్రియుడు. సర్వధర్మవేత్త. లోకాల కీర్తిని పెంచేవాడు. లోకాలకు ప్రభువు. సమస్త ప్రాణులకు స్రష్ట, గొప్పవ్యక్తి, విష్ణు అర్చనమే సర్వధర్మాల్లోను ప్రశస్త ధర్మంగా నేను భావిస్తున్నాను. నరుడు సర్వదా భక్తితో పుండరీకాక్షుని స్తుతిస్తూ పూజించాలి. రాజా ! అతడు పరముడు, గొప్ప వెలుగు. అత్యంత మహత్తరమైన తపస్సు. మిక్కిలి గొప్పదైన బ్రహ్మపదార్థం, పరమగతి. మహావిష్ణువు పవిత్రమైన వాటికన్నిటికీ పవిత్రుడు, శుభకరమైన వాటికన్న శుభకరుడు, దేవతలందరకూ పరమదైవం, ప్రాణులందరికీ నాశరహితుడైన తండ్రి. ధర్మజా ! విష్ణువునుండే మొదటి యుగం యొక్క ప్రారంభంలో సమస్తప్రాణులూ ఉద్భవిస్తాయి. యుగక్షయ సమయాన అతనిలోనే లభిస్తాయి. లోకాలన్నిటిలో ముఖ్యతముడు, జగత్తునకు ప్రభువు అయిన మహావిష్ణువు యొక్క పాప భయాలను పోగొట్టే సహస్ర నామాలను చెప్తాను, విను. ధర్మజా ! ఏనామాలు విష్ణుని గుణగణాల్ని తెలియ చేస్తాయో, ఏవి ప్రసిద్ధాలో, ఏనామాలు, ఋషులచే పదేపదే కీర్తింపబడ్డాయో వాటిని పరమైశ్వర్య సిద్ధికోసం చెప్తాను.

'ఓం' విరాట్రూపుడు, అంతట వ్యాపించినవాడు, యజ్ఞస్వీకర్త, త్రికాలాధీశుడు, ప్రాణిస్రష్ట, ప్రాణిభర్త, పుట్టినవాడు, భూతాంతర్యామి, భూతాభివృద్ధి కరుడు. పవిత్రాత్ముడు, పరమాత్ముడు, ముక్తినొందినవారు పొందు పరమగతి, నాశరహితుడు, పురనివాసి, సాక్షి, క్షేత్రజ్ఞుడు, చ్యుతి లేనివాడు. యోగరూపుడు, యోగవిదులకు ప్రభువు, ప్రకృతి పురుషుల కధీశుడు, నరసింహస్వామి, శ్రీమంతుడు, త్రిమూర్తి స్వరూపుడు, క్షర అక్షర పురుషుల కన్న పరమోత్తముడు. సర్వరూపుడు, లయకర్త, కల్యాణ స్వరూపుడు, స్థిరుడు, ప్రాణులకాది కారణుడు, నాశరహితమైన నిధి, కోరికమేరకు పుట్టేవాడు, భోక్త, భర్త, గొప్పగా జన్మించేవాడు, అందరికీ స్వామి, ఉపాధిరహిత పరమైశ్వర్యశాలి. తానుగా పుట్టినవాడు, శుభదుడు,

ఆదిత్యుడు, కమలనయనుడు. వేదరూపుడు, జన్మమృత్యురహితుడు, విశ్వాన్ని ధరించేవాడు, కర్మ ఫలప్రదాత, ధరించేవారిలో శ్రేష్ఠుడు. ప్రమాణాలకందనివాడు, ఇంద్రియాధీనుడు, నాభియందు పద్మమున్నవాడు, దేవతలకు ప్రభువు, విశ్వనిర్మాత, మనువు, ప్రాణిక్షయకరుడు, స్థూలుడు, పెద్దవాడు, స్థిరుడు. తెలియరానివాడు, శాశ్వతుడు, చిత్తాకర్షకుడు, ఎర్రని కన్నులవాడు, లయకర్త, జ్ఞానాదిగుణ సమృద్ధుడు, పైన మధ్య క్రింద దిక్కులకు ఆశ్రయుడు, పవిత్రుడు, శుభుడు. సర్వభూతనియామకుడు. ప్రాణదాత, ప్రాణ స్వరూపుడు. అందరికీ పెద్దవాడు, శ్రేష్ఠుడు, ప్రజాపతి, బ్రహ్మాండ వ్యవస్థాపకుడు, భూమిని ధరించినవాడు, లక్ష్మీపతి, మధునాశకుడు. సర్వశక్తిశాలి, పరాక్రమశాలి, ధానుష్కుడు, మేధావి, గరుడగమనుడు, క్రమ వికాస కర్త, పరమ శ్రేష్ఠుడు, తిరస్కరింపరానివాడు, ఉపకారాన్ని మరువనివాడు, ధన్యుడు, ఆత్మజ్ఞాని.

దేవతాధీశుడు, రక్షకుడు, పరమానందరూపుడు, విశ్వకారణుడు, ప్రజాస్రష్ట, వెలుగు, సంవత్సరం, ఆదిశేషుడు, ఉత్తమ బుద్ధిగమ్యుడు, సర్వాన్నీ చూసేవాడు. పుట్టినవాడు, ఈశ్వరులకీశ్వరుడు, నిత్యసిద్ధుడు, ఆదికారణుడు, చ్యుతిలేనివాడు, ధర్మపరమ రూపుడు, కొలవశక్యంకానివాడు, సమస్తయోగాలచే తెలియదగినవాడు. నివాస భూతుడు, ఉదారమనస్కుడు, సత్యస్వరూపుడు, ప్రాణులందరియందూ సమానంగా ఆత్మగా ఉన్నవాడు, కొలవబడనివాడు, వికార రహితుడు, ఫలదాత, కమలనయనుడు, ధర్మకర్ముడు, ధర్మసంస్థాపకుడు. రుద్రుడు, బహుశిరస్కుడు, భరించేవాడు, విశ్వకారణుడు, నిర్మలకీర్తిశాలి, మరణరహితుడు, శాశ్వతంగా ఉండేవాడు, నివృత్తరహిత స్థానమయినవాడు, తపస్వి. కారణరూపంలో అంతటా ఉన్నవాడు, సర్వజ్ఞప్రకాశరూపుడు, శత్రుసేనను కకావికలు చేసేవాడు, జనార్దనుడు, వేదస్వరూపుడు, వేదార్థవిదుడు, వైకల్య రహితుడు, వేదాలే అంగములయినవాడు, వేదవిచారకుడు, సర్వజ్ఞుడు. లోకాధిపతి, సురాధిపతి, ధర్మాధిపతి, కార్య రూపంలో కర్త, కారణ రూపంలో అకర్త, బ్రహ్మరూపుడు, సృష్టి స్థితి లయ రక్షణ వ్యూహుడు, నాల్గు దంతాలవాడు, నాలుగు బాహువులున్నవాడు. ప్రకాశమయుడు, జ్ఞానులకాహారమయినవాడు, యజమానరూపుడు, సహన శీలి, హిరణ్య గర్భరూపుడు, పాపరహితుడు, జ్ఞానాది గుణమయుడు, జయశీలుడు, విశ్వకారణుడు, అవతరించువాడు. ఇంద్రుని అనుజుడు, వామనావతారుడు, త్రివిక్రముడు, సఫలక్రియుడు, పావనుడు, మహాబలి, ఇంద్రాధికుడు, ప్రలయంలో సమస్తాన్ని బీజమయంగా ధరించేవాడు, సృష్టికారణుడు, స్వేచ్ఛా శరీరుడు, నియామకుడు, మనస్సులో ఉండి నియమించేవాడు. తెలుసుకొనదగినవాడు,

అన్ని విద్యలెరిగినవాడు, ఎల్ల వేళలా యోగమందుండువాడు, వీరసంహర్త, మాధవుడు, తియ్యనివాడు, ఇంద్రియాతీతుడు, గొప్పమాయావి, ఉత్సాహి. మహాబలుడు.

గొప్ప బుద్ధికలవాడు, గొప్ప పరాక్రమ శాలి, గొప్ప శక్తిమంతుడు, కాంతిమంతుడు, అనిర్వాచ్యశరీరుడు, ఐశ్వర్యయుతుడు, కొలవలేని స్వరూపమున్నవాడు; మందరాన్ని, గోవర్ధన గిరిని పైకెత్తినవాడు. గొప్ప ధనుస్సున్నవాడు, భూమికి రక్షకుడు, లక్ష్మీనివాసుడు, సత్పురుషాశ్రయుడు, నిరోధింపబడనివాడు, దేవానందకుడు, వేదంద్వారా పొందబడేవాడు, వేదవిదుల కాశ్రయుడు. తేజశ్శాలి, యమ రూపంలో నిగ్రహించేవాడు, హంసరూపుడు, గరుడుడు, ఆదిశేషుడు, బంగారు నాభికలవాడు, గొప్పతపస్వి, పద్మంవంటి నాభికలవాడు, ప్రజాపాలకుడు. మరణ రహితుడు, సర్వదర్శి, దుష్టుల్ని హింసించేవాడు, ఫలదాత, యజ్ఞతపఃఫల భోక్త, స్థిరుడు, జన్మరహితుడు, సహింపరానివాడు, శాసకుడు, ప్రసిద్ధ రూపుడు, దేవతా శత్రునాశకుడు. సర్వవిద్యోపదేష్ట, గురువులకు గురువు, జగదాశ్రయుడు, సత్యస్వరూపుడు, అమోఘ పరాక్రముడు, ముకుళితలోచనుడు, మీనరూపుడు, వైజయంతీమాలాధారి, వాక్పతి, ఉదారబుద్ధి, మోక్షప్రాపకుడు, ప్రాణినేత, సుందరుడు, ప్రమాణాశ్రయుడు, జగత్తును నడిపించేవాడు, శ్వాసరూపంలో సంచరించేవాడు, వేల శిరస్సులవాడు, విశ్వానికాత్మ అయిన వాడు. వేల కన్నులవాడు. వేల పాదాలవాడు. సంసార చక్ర భ్రామకుడు, నిత్యముక్తుడు, యోగమాయచే ముకుళితుడు, రుద్రాది రూపాల్లో శిక్షించేవాడు, దినప్రవర్తకుడు, అగ్ని, ప్రాణవాయురూపుడు, వరాహ, ఆదిశేషుల రూపంతో భూమిని మోసేవాడు. మంచిగా అనుగ్రహించేవాడు. ప్రసన్న స్వభావుడు, విశ్వభర్త, విశ్వపాలకుడు, సర్వవ్యాపి, సత్కర్త, సాధువు, లయకర్త, జలశాయి, భక్తులను మోక్షాన్ని పొందించేవాడు. లెక్కపెట్టలేనన్ని గుణాలున్నవాడు, కొలవరాని స్వరూప మున్నవాడు, గొప్పవాడు, శ్రేష్ఠుల్ని తయారుచేసేవాడు. నిర్మలుడు, కృతకృత్యుడు, సిద్ధసంకల్పుడు, సిద్ధిని అనుగ్రహించేవాడు, సిద్ధికి సాధనమైనవాడు. యజ్ఞాత్మకుడు, ముక్తఫలదుడు, సత్త్వాత్మకుడు, ధర్మబీజుడు, ధర్మాన్ని ధరించినవాడు, వృద్ధినొందించేవాడు, సంసార రూపంలో వృద్ధిపొందేవాడు, సంసారాతీతుడు, వేదసాగరుడు.

అందమైన భుజాలవాడు, ధరించనలవికానివాడు, వేదోత్పాదకుడు, ఈశ్వరేశ్వరుడు, ధనదుడు, ధనం, బహురూపి, విశ్వరూపుడు, రవికిరణాంతర్గతుడు, ప్రకాశకుడు. ఓజస్సు తేజస్సు కాంతులను ధరించేవాడు, ప్రకాశరూపుడు, సూర్యాది రూపాన తపింపజేయువాడు, జ్ఞానాదిసంపన్నుడు, ఓంకారరూపుడు, మంత్రస్వరూపుడు, చల్లని కిరణాలవాడు, సూర్య

తేజుడు. చంద్రోత్పత్తి హేతువు, ప్రకాశించువాడు, చంద్రాత్మకుడు, దేవతాధీశుడు, సంసార రోగానికి మందు, జగత్తునకు వారధి; సత్య, ధర్మ పరాక్రమమూర్తి త్రికాలాధిపుడు, వాయు రూపుడు, పావనుడు, అగ్ని రూపుడు, కోరికల్నిచంపేవాడు, కోరికలు తీర్చేవాడు, త్రిమూర్త్యాత్మకుడు, భక్తవరదుడు, సమర్థుడు. యుగ ప్రారంభకుడు, యుగ చక్రాన్ని త్రిప్పేవాడు, బహుమాయావి, సంహర్త, ఇంద్రియాగోచరుడు, నిరాకారుడు, వేలమందిని జయించువాడు, అనంత విజయుడు. సర్వప్రియుడు, విశేషణ రహితుడు, శిష్టజన ప్రియుడు, పింఛధారి, మాయాబంధనుడు, వరదుడు, క్రోధ నాశకుడు, క్రుద్ధనాశకుడు, అన్ని వైపులా బాహువులున్నవాడు, భూధరుడు. ఆరు భావవికారాలు లేనివాడు, ప్రసిద్ధుడు, హిరణ్యగర్భాత్మకుడు, ప్రాణాల్ని నిలబెట్టేవాడు, ఇంద్రానుజుడు, సముద్రుడు, ఉపాదాన కారణ రూపుడు, ప్రమాద రహితుడు, మహిమాన్వితుడు. కుమార స్వామి, ధర్మమార్గధారకుడు, భారం వహించేవాడు, వరా లిచ్చేవాడు, వాయువుల్ని ప్రసరించే వాడు, భూతాంతర్యామి, సూర్య స్వరూపుడు, ఆది దేవుడు, పురందరుడు. శోకరహితుడు, తరింపచేసేవాడు, భయాన్ని పోగొట్టేవాడు, పరాక్రమ శాలి, వసుదేవ సుతుడు, అనుకూలుడు, వందల అవతారాలైనవాడు, పద్మం కలవాడు, పద్మనయనుడు. హృదయ కమలనివాసి, కమలలోచనుడు, హృదయ కమలంలో ధ్యానింపదగ్గవాడు, అన్ని రూపాలలో శరీర పోషణ చేసేవాడు, గొప్ప సంపద కలవాడు, సమృద్ధుడు, సనాతనుడు, విశాలలోచనుడు, గరుడ ధ్వజుడు.

సాటిలేనివాడు, జీవాత్మగా ప్రకాశించేవాడు, పాపులకు భయంకరుడు, సమయ మెరిగినవాడు, హవిర్భోక్త, మంచిలక్షణాలున్నవాడు, లక్ష్మిని ధరించినవాడు, యుద్ధ విజేత. నాశరహితుడు, మీనావతారుడు, ఆనంద ప్రాప్తి మార్గమయినవాడు. సంసార హేతువు, యశోదచే ఉదర భాగాన కట్టబడినవాడు, అపరాధాల్ని సహించేవాడు, భూమిని మోసేవాడు, గొప్ప భాగ్యశాలి, వేగం కలవాడు, ప్రళయంలో సర్వాన్ని భక్షించేవాడు. జగదుత్పత్తికి ఉపాదానకారణం, సంచరింపజేయువాడు, ప్రకాశమానుడు, ఐశ్వర్యవంతుడు. చక్కని శాసకుడు, జగత్తునకు అసాధారణకారణం, ఉపాదాన నిమిత్త కారణుడు, కర్త, పొందరానివాడు, రహస్యమైనవాడు. ప్రయత్న స్వరూపుడు, వ్యవస్థల నేర్పరచినవాడు, ప్రలయస్థానమైనవాడు, స్థానమిచ్చేవాడు, చలించనివాడు, శ్రేష్ఠసంపదలున్నవాడు, జ్ఞాన స్వరూపుడు, ఆనందమయుడు, దర్శనం చేత శుభాల నివ్వగలవాడు. యోగిజన క్రీడాశ్రయుడు, ప్రళయంలో ప్రాణులకు విశ్రాంతినిచ్చేవాడు, సత్యమయుడు, మార్గుడు, జ్ఞాన ప్రాప్యుడు, నియామకుడు, స్వతంత్రుడు,

పరాక్రమశాలి, శక్తిమంతులలో గొప్పవాడు, ధర్మస్వరూపుడు, ధర్మవిదులలో శ్రేష్ఠుడు. వైకుంఠ స్వరూపుడు, విశ్వ శరీరంలో శయనించేవాడు, ప్రాణరూపుడు, ప్రాణదాత, ఓంకార స్వరూపుడు, విరాడ్రూపుడు, హిరణ్యగర్భబ్రహ్మ, శత్రునాశకుడు, కారణ రూపంగా వ్యాపించినవాడు, వాయువు, అవికార రూపుడు. ఋతువు, సులభదర్శనుడు, కాలస్వరూపుడు, గొప్పమహిమకలవాడు, శరణ్యుడు, భయంకరుడు, భూతావాసుడు, సమర్థుడు, మోక్షస్వరూపుడు, విశ్వాన్ని దక్షిణగా పొందినవాడు. విస్తారాశ్రయుడు, కదలనివాటి కాధార భూతుడు, ప్రమాణ భూతుడు, అవినాశకారణుడు, ప్రార్థనీయుడు, ప్రయోజనం కోరనివాడు, గొప్ప నిధి, సుఖనిధి, నిక్కమైన ధనరూపుడు. నిరాశలేనివాడు, విరాడ్రూపుడు, జన్మలేనివాడు, ధర్మస్తంభం వంటివాడు, యజ్ఞస్వరూపుడు, నక్షత్రాలకు కేంద్రమైనవాడు, చంద్రరూపుడు, సమర్థుడు, జగన్నివాసుడు, ఇచ్ఛాశక్తిరూపుడు. విష్ణువు, పూజనీయుడు, మిక్కిలి ఉపాసనీయుడు, స్తంభం ఉంచే యజ్ఞం రూపంగా కలవాడు, సత్పురుష రక్షకుడు, సత్పురుషులకు పరమగతియైనవాడు, సర్వులను చక్కగా చూసేవాడు, నిత్యముక్తుడు, సర్వజ్ఞుడు, ఉత్తమ జ్ఞాన స్వరూపుడు.

మంచివ్రతాలను ఆచరించేవాడు, అందమైన ముఖంకలవాడు, సూక్ష్మరూపుడు, చక్కని ధ్వని చేసేవాడు. సుఖప్రదుడు, స్నేహితుడు, సుందరుడు, క్రోధరహితుడు, వీర్యవంతమైన బాహువులున్నవాడు, చీల్చి చెండాడేవాడు. ప్రళయంలో ప్రాణులను నిద్రింపజేసేవాడు, స్వతంత్రుడు, వ్యాపించినవాడు, బహురూపుడు, బహుకర్మలను ఆచరించేవాడు, నివాసస్థానుడు, భక్తవత్సలుడు, దూడలున్నవాడు, రత్నాలను తనలో ధరించిన వాడు, సమస్త ధనాలు ఉన్నవాడు. ధర్మరక్షకుడు, ధర్మకర్త, ధర్మాత్ముడు, సద్రూపుడు, అసద్రూపుడు, నాశరహితుడు, భూతాత్మకుడు, విజ్ఞాతకంటె భిన్నుడు, సూర్య స్వరూపుడు. విధాత, శుభలక్షణుడు. కిరణాలకు వెనుకనున్న సూర్యమండల స్వరూపుడు, సత్త్వమయుడు, నృసింహస్వామి, ప్రాణులకు ప్రభువు, మొదటి దేవుడు, జ్ఞానైశ్వర్యాది మహిమాన్వితుడు, దేవతలకు ప్రభువు, గురువు. తారకుడు, గోరక్షకుడు, రక్షకుడు, జ్ఞానలభ్యుడు, సనాతనుడు, శరీరాధార భూతాలను భరించేవాడు, ఆనందాత్మకుడు, కపులకు ప్రభువు, అనేక దక్షిణలిచ్చువాడు. యజమానుడుగా సోమాన్ని త్రాగేవాడు, అమృతా స్వాదకుడు, చంద్రుడు, విజయి, పురుష శ్రేష్ఠుడు, దుష్ట శిక్షకుడు, జయస్వరూపుడు, సత్య సంధుడు, దాశార్హకులజుడు, యాదవ పతి. క్షేత్రజ్ఞుడు, శరణు వేడినవారికి ప్రత్యక్షమయ్యేవాడు, ముక్తిప్రదాత, అమిత పరాక్రముడు, సముద్రుడు, అనంత రూపుడు,

మహోదధిలో నిదురించేవాడు, లయకర్త. పుట్టనివాడు, గొప్పయోగ్యుడు, స్వభావంచేతనే పుట్టనివాడు, స్మరణ మాత్రంచే ఆనందమిచ్చేవాడు, ఆనందాత్మకుడు, సంతోషింపజేసేవాడు, ఐశ్వర్య సంపన్నుడు, ధర్మాది గుణయుక్తుడు, త్రివిక్రముడు. కపిల మహర్షి, మేలును గుర్తించేవాడు, పృథివీపతి, మూడు పాదాలున్నవాడు, దేవాధ్యక్షుడు, గొప్ప కొమ్ములున్నవాడు, కర్మనాశకుడు. ఆదివరాహమూర్తి, భూమిని ఉద్ధరించినవాడు, గొప్పసైన్యమున్నవాడు, బంగారు భుజకీర్తులవాడు, హృదయ గుహయందున్నవాడు, గంభీర స్వభావుడు, అలభ్యుడు, మనోవాగతీతుడు, చక్రగదాధారి.

అన్నీ నియమించేవాడు, కార్యపోషకుడు, జయింపబడనివాడు, శ్యామ సుందరుడు, సామర్థ్యాన్నుండి దిగజారనివాడు, సంకర్షణుడు, వరుణదేవుడు, వశిష్ఠస్వరూపుడు, అశ్వత్థ వృక్షరూపుడు, కమలలోచనుడు, గొప్ప మనస్సున్నవాడు. విద్యావిద్యల నెరిగినవాడు, ఐశ్వర్యాపహారకుడు, సుఖభోక్త, వైజయంతీ ధరుడు, బలరామస్వరూపుడు, వామన రూపుడు, జ్యోతి స్స్వరూపుడైన ఆదిత్యుడు, ద్వంద్వసహుడు, ఉత్తమగతియైనవాడు. గొప్ప ధనుస్సున్నవాడు, పరశురామావతారుడు, భయంకరుడు, సంపదనిచ్చేవాడు, అంతటా వ్యాపించినవాడు, అందర్నీ దర్శించే వ్యాసరూపుడు, విద్యాస్వరూపుడు, స్వయంభువు. మూడుసామాల చేత స్తుతింపబడేవాడు, సామవేదగాయకుడు, సామవేదాత్మకుడు, ఆనంద స్వరూపుడు, ఔషధరూపుడు, వైద్య స్వరూపుడు, సంన్యాస నిర్మాత, శమస్వరూపుడు, ప్రశాంతుడు, అధిష్ఠానమైనవాడు, శాంతస్వరూపుడు, ప్రాప్యస్థానమైనవాడు. శుభశరీరుడు, శాంతినిచ్చేవాడు, సృష్టికర్త, భూమి మీద లీలలను ప్రదర్శించేవాడు, అనంతశాయి, గోవులకు మేలు చేసేవాడు, గోస్వామి, రక్షకుడు, కామప్రదుడు, ధర్మ ప్రియుడు. మడమతిప్పనివాడు, విషయవినివృత్తుడు, ప్రళయంలో విశ్వాన్ని సంక్షేపించేవాడు, క్షేమమిచ్చేవాడు, శుభదుడు, శ్రీవత్సాంకుడు, లక్ష్మీనివాసుడు, లక్ష్మికి భర్త, త్రిమూర్తులలో శ్రేష్ఠుడు. సంపదలచ్చేవాడు, లక్ష్మికి ప్రభువు, సంపదలకు నిధి, సంపదలు పెంపొందించేవాడు. లక్ష్మిని హృదయంపై ధరించినవాడు, సంపదలను సృష్టించేవాడు, శ్రేయోరూపుడు, శ్రీమంతుడు, ముల్లోకాలకు ఆశ్రయమైనవాడు. అందమైన కన్నులవాడు, శుభాంగుడు, వందలవిధాలైన ఆనందాలున్నవాడు, పరమానందరూపుడు, నక్షత్ర సముదాయాధీనుడు, మనస్సును జయించినవాడు, అనిర్వచనీయ స్వరూపుడు, గొప్ప కీర్తి కలవాడు, సందేహాలు లేనివాడు. శ్రేష్ఠుడు, అన్నివైపులా చూడగలవాడు, తానే ప్రభువైనవాడు, నిర్వికారుడు, భూమి మీద పరున్నవాడు, భూమికి అలంకారమైనవాడు, విభూతుల కాధారుడు, శోక రహితుడు, శోకనాశకుడు. వెలుగులకు వెలుగు, బ్రహ్మాదులచే

పూజింపబడ్డవాడు, నివాసస్థాన భూతుడు, విశుద్ధమనస్కుడు, మనస్సును శుద్ధి చేసేవాడు, అనిరుద్ధ స్వరూపుడు, అడ్డగింపబడనివాడు, ఎదురులేనివాడు. ప్రద్యుమ్నుడు, అమేయ పరాక్రముడు, కాలనేమి విజేత, వీరుడు, శూరవంశజుడు, శూరుల కధిపతి, త్రిలోకాలకు అంతర్యామి, ముల్లోకాలకు అధీశుడు, త్రిమూర్త్యాత్మకుడు, కేశిరాక్షసుని చంపినవాడు, పాపాల్ని హరించేవాడు. పురుషార్థప్రదాత, ముక్తుల కామాలను పాలించేవాడు, కోరేవాడు, శాస్త్రకర్త, అనిర్వాచ్యశరీరుడు, వ్యాపకుడు, అనంతుడు, అర్జున రూపుడు. బ్రాహ్మణ భక్తుడు, జ్ఞానాదులకు కర్త, బ్రహ్మ, సచ్చిదానందాత్మకుడు, తపస్సు మొదలైనవానిని పెంపొందించేవాడు, వేదవిదుడు, సమస్తాన్నీ బ్రహ్మగా చూచేవాడు, జ్ఞానాద్యధిష్ఠానం, వేదవిజ్ఞాత, బ్రాహ్మణ ప్రియుడు. వేగంగా వెళ్ళేవాడు, గొప్ప గొప్ప పనులు చేసినవాడు, వెలుగుల్ని వెలిగించేవాడు, వాసుకి స్వరూపుడు, గొప్ప యజ్ఞం వంటివాడు, గొప్ప యజ్ఞకర్త, జపయజ్ఞాది స్వరూపుడు, గొప్ప హవిస్సు. స్తుతింపదగినవాడు, స్తోత్రాల నిష్టపడేవాడు, స్తోత్ర స్వరూపుడు, స్తోత్రం చేసేవాడు, రణాన్ని ఇష్టపడేవాడు, పరిపూర్ణుడు, పవిత్రుడు, పవిత్రమైన కీర్తికలవాడు, రోగరహితుడు. మనోవేగుడు, సమస్త విద్యోపదేశకుడు. హిరణ్మయ పురుషుడు. మోక్షరూప ధన ప్రదాత, వసుదేవసుతుడు, అంతఃకరణంలో నివసించేవాడు, సమానంగా అందరి మనస్సుల్లో ఉండేవాడు, హవిస్స్వరూపుడు. సాధువులకు గతియైనవాడు, రక్షాదికార్యాలు చేసేవాడు, ఎప్పుడూ ఉండేవాడు, అనేక రూపాలలో ఉండేవాడు, సత్పురుషులకు ప్రాప్తి స్థానం, శూరులైన హనుమదాది సేనలున్నవాడు, యాదవశ్రేష్ఠుడు, సత్పురుషాశ్రయుడు, యమునా తటవాసులైన గోపాలురలో అందగాడు. సమస్త ప్రాణులకు నివాస స్థానమైనవాడు, వసుదేవకుమారుడు, సర్వప్రాణులకు ఆధారమైనవాడు, అపార శక్తిసంపదలున్నవాడు, గర్వహంత, భక్తులకుత్సాహప్రదుడు, నిత్యానంద మగ్నుడు, ధరింపశక్యం కానివాడు, అపరాజితుడు, విశ్వ స్వరూపుడు, పెద్ద రూపమున్నవాడు, ప్రకాశ స్వరూపుడు, నిరాకారుడు, అనేక రూపాలున్నవాడు, ప్రకటంకానివాడు, శతరూపుడు, శతముఖుడు. ఏకుడు, అనేకుడు, సోమయజ్ఞాత్మకుడు, సుఖస్వరూపుడు, బ్రహ్మస్వరూపుడు, స్వతఃసిద్ధుడు, విస్తరించేవాడు, పరమపద స్వరూపుడు, ప్రాణి బంధువు, లోకనాథుడు, లక్ష్మీపతి, భక్తుల పట్ల ప్రేమకలవాడు. బంగారు వర్ణంకలవాడు, బంగారు శరీర భాగాలున్నవాడు, శ్రేష్ఠమైన శరీరావయవాలున్నవాడు, చందనాన్ని అంగదాల్ని ధరించేవాడు, అసురనాశకుడు, సాటి లేనివాడు, విశేషణ రహితుడు, ఆశ్రితుల కాశీస్సులిచ్చేవాడు, అచలుడు, చలుడు. మానాన్ని కోరనివాడు, ఇతరులకు మానాన్నిచ్చేవాడు, పూజ్యుడు, లోకప్రభువు, ముల్లోకాల్ని ధరించేవాడు, గొప్ప మేధావి,

యజ్ఞంలో వ్యక్తమయ్యేవాడు, ధన్యుడు, సత్యబుద్ధికలవాడు, అనంత రూపంలో భూమిని మోసేవాడు. తేజస్సును వర్షించేవాడు, కాంతిమంతుడు, ఆయుధ ధారులలో శ్రేష్ఠుడు, భక్తుల కాన్కలు స్వీకరించేవాడు, నిగ్రహించేవాడు, భక్తుల కోర్కెలు తీర్చటంలో లగ్నమయ్యే వాడు, శబ్దబ్రహ్మస్వరూపుడు, గదునికి అన్న. రామాది చతుర్మూర్తులున్నవాడు, నాలుగు బాహువులున్నవాడు, వాసుదేవ ప్రద్యుమ్న అనిరుద్ధ సంకర్షణ వ్యూహాలున్నవాడు, సాలోక్యాది నాలుగు పరమగతుల స్వరూప మున్నవాడు, మనో బుద్ధి అహంకార చిత్త రూపుడు, పురుషార్థోత్పాదకుడు, నాల్గు వేదాలు ఎరిగినవాడు, ఒకే అంశంలో జగత్తంత వ్యాపించే వాడు. సంసార చక్రాన్ని త్రిప్పేవాడు, జయింపరానివాడు, దాటి పోలేనివాడు, తేలిగా పొంద శక్యంకానివాడు, తెలుసుకొన శక్యం కానివాడు, కష్టం మీద తెలియబడేవాడు, హృదయంలో ధరించాలంటే ప్రయాస పెట్టేవాడు, దుష్ట శత్రు హంతకుడు. శుభమైన కరచరణాదులున్నవాడు, లోక సారాన్ని గ్రహించేవాడు, మంచి విశ్వతంతువు కలవాడు, జగత్సూత్రాన్ని పెంపొందించేవాడు, ఇంద్రసమానంగా కర్మలు చేసేవాడు, గొప్పపనులు చేసేవాడు, కృతకృత్యుడు, అవతారరూపుడు. స్వేచ్ఛగా పుట్టేవాడు, అందమైనవాడు, కరుణామయుడు, రత్నంవంటి నాభికలవాడు, అందమైన కళ్ళున్నవాడు, బ్రహ్మాది పూజ్య పూజ్యుడు, యాచకులకోర్కెలు తీర్చేవాడు, ప్రళయంలో కొమ్ములున్న మీనంగా ఉండేవాడు. జయశీలుడు, అన్నీ తెలిసినవాడు, అందర్నీ జయించేవాడు. ఓంకారాత్మకుడు, క్షోభను పొందనివాడు, బ్రహ్మాదులందరికీ స్వామి, పరమానంద సరస్సు, గొప్ప రథమున్నవాడు, ఎప్పటికీ నశించని వ్యక్తి, అందరికీ నివాసస్థానం. భూమిని సంతోషింపజేసేవాడు, అందగాడు, భూదానం చేసినవాడు (పరశురామావతారంలో), మేఘంలాగా అభీష్టాలను వర్షించేవాడు, పవిత్రుల్ని చేసేవాడు, నిత్య ప్రబుద్ధుడు, అమృత భక్షకుడు, అమృత శరీరుడు, సర్వజ్ఞుడు, అన్ని వైపులా ముఖాలున్నవాడు. భక్త సులభుడు, మంచి వ్రతమున్నవాడు, సమస్త సిద్ధులున్నవాడు, శత్రజేత, శత్రుబాధకుడు, మర్రిచెట్టు, కారణ రూపంగా ఆకాశం కంటే పైనున్నవాడు, రావిచెట్టు, చాణూరు డనే ఆంధ్రుని చంపినవాడు.

సూర్యరూపుడు, ఏడు నాల్కలున్న అగ్ని స్వరూపుడు, ఏడు జ్వాలలున్న అగ్ని, సప్తాశ్వాలున్న సూర్యుడు, నిరాకారుడు, పాపరహితుడు, అనూహ్యుడు, భయంకరుడు, భయం పోగొట్టేవాడు. అణురూపుడు, బృహద్రూపుడు, లావైనవాడు, గుణవంతుడు, నిర్గుణుడు, గొప్పవాడు, ధరింపబడనివాడు, తనను తానే ధరించే వాడు, అందమైన ముఖమున్నవాడు, వంశాలన్నిటికీ ముందున్నవాడు, వంశాలను పెంచి పోషించేవాడు.

భూభారాన్ని ఆది శేషాది రూపాలతో మోసేవాడు, కీర్తింపబడ్డవాడు, నిత్యసమాధిశీలి, యోగులకు ప్రభువు, సమస్త కోర్కెలు తీర్చువాడు, విశ్రాంతిప్రదుడు, దుష్ట సంతాప కర్త, ప్రలయకాలంలో క్షయకర్త, వేదా లనే అందమైన ఆకులున్న సంసార వృక్షం, వాయువును నడిపించేవాడు. ధనుర్ధరుడైన శ్రీరాముడు, ధనుర్వేదవిశారదుడు, దండరూపుడు, యమాది రూపంతో శిక్షించేవాడు, పరాజయం లేనివాడు, దేన్నైనా సహించగలవాడు, నియామకుడు, నియమాలచే బంధింపబడనివాడు, శాసనరహితుడు, బలవీర్య సామర్థ్యాలున్నవాడు, సత్త్వప్రధానుడు, సత్యమైనవాడు, సత్యధర్మాల్ని ప్రోత్సహించేవాడు, కోరబడేవాడు, ప్రియ వస్తువుల నివ్వదగ్గవాడు, యోగ్యుడు, ప్రియంచేసేవాడు, ప్రీతిని పెంచేవాడు. ఆకాశంలో వెళ్ళేవాడు, వెలుగు, కాంతిమంతుడు, హవిస్సును గ్రహించే అగ్ని రూపుడు, సర్వవ్యాపి, రవి, కాంతి ప్రసారకుడు, సూర్యుడు, సవిత, రవిలోచనుడు. అంతరహితుడు, హుతభోజి, జగత్పాలకుడు, సుఖదాత, ఎన్నో అవతారాలు ఎత్తేవాడు, ఆదిపురుషుడు, నిర్వేదరహితుడు, క్షమాశీలుడు, లోకాధారుడు, ఆశ్చర్యమయుడు. అనంత కాలస్వరూపుడు. అత్యంత సనాతనుడు, కపిలమహర్షి, సూర్యదేవుడు, లయస్థానమైనవాడు. పరమానందప్రదుడు, కల్యాణకరుడు, కల్యాణ మయుడు, భక్తులకు శుభాల్ని పెంచేవాడు, శుభాల నిచ్చే సామర్థ్య మున్నవాడు. ప్రశాంతుడు, కుండల శోభమానుడు, చక్రాయుధ ధరుడు, పరాక్రమశాలి, గొప్ప శాసనం చేసేవాడు, శబ్దాతీతుడు, కఠోరశబ్దాన్ని సహింపగలవాడు, చల్లనివాడు, రాత్రినిచ్చేవాడు. క్రూరభావాలు లేనివాడు, మనోవాక్కాయ కర్మలచే సుందరుడు, సమర్థుడు, సంహారకారి, క్షమావంతుల్లో శ్రేష్ఠుడు, విద్వాంసులలో శ్రేష్ఠుడు, భయ రహితుడు, పవిత్రమైన నామశ్రవణ కీర్తనంతో కూడినవాడు.

సంసార తారకుడు, దుష్కర్మనాశకుడు, పవిత్రుడు, దుఃస్వప్నాలను పారద్రోలేవాడు, వీరులను చంపగలవాడు, రక్షించేవాడు, సాధు స్వరూపుడు, ప్రాణరూపుడు, విశ్వమంతా వ్యాపించినవాడు. అనంతమైన రూపాలున్నవాడు, అనంతమైన సంపదలున్నవాడు, క్రోధాన్ని జయించినవాడు, భయాలను పారగొట్టేవాడు, కల్యాణమూర్తి, గంభీరరూపుడు, వివిధఫలాలిచ్చేవాడు, ఆదేశాలచ్చేవాడు, వేద రూపుడుగా ఫల నిర్దేశం చేసేవాడు. ఆది లేని కారణ స్వరూపుడు, భూమి కాధారం, శోభాస్వరూపుడు, అందమైన అంగదాలు ధరించినవాడు, గొప్పవీరుడు, ఉత్పత్తి కారకుడు, జన్మకు మూలకారణమైనవాడు, భయంకరుడు, భయంకర పరాక్రముడు. ఆధారాలకు ఆధారభూతుడు, ఉత్పాదక శూన్యుడు, పువ్వులా నవ్వేవాడు, నిత్యప్రబుద్ధుడు, అందరికంటె ఉన్నతంగా ఉండేవాడు, మర్యాదా

పురుషోత్తముడు, ప్రాణాలు ఇచ్చేవాడు, ఓంకార రూపుడు, యోగ్య వ్యవహారకర్త, ప్రమాణ స్వరూపుడు, ప్రాణాలకు ఆధార భూతుడు, ప్రాణులకు పోషకుడు, ప్రాణాల ద్వారా జీవింపచేసేవాడు, సారం, సారవేది, అద్వితీయుడు, జన్మమృత్యు వార్ధక్య రహితుడు. భూఃభువః సువః రూపమైన సంసారం, సంసార సాగర సముద్ధర్త, ఉత్పాదకుడు, బ్రహ్మకు తండ్రి, యజ్ఞం, యజ్ఞపతి, యాజకుడు, యజ్ఞరూపమైన అవయవాలున్నవాడు, యజ్ఞాలను జరిపించేవాడు. యజ్ఞాలను భరించేవాడు, యజ్ఞాలు చేయించే వాడు, యజ్ఞాలకు సంగమస్థానం, యజ్ఞభోక్త, యజ్ఞాలే ప్రాప్తిసాధనాలయినవాడు, యజ్ఞఫలమిచ్చేవాడు, నిష్కామ యజ్ఞ స్వరూపుడు, అన్నం, అన్నాదుడు. తనకు తానే కారణమైనవాడు, స్వయంగా పుట్టినవాడు, వరాహావతారుడు, సామగానం చేసేవాడు, దేవకి కొడుకు, సృష్టికర్త, ప్రభువు, పాపనాశకుడు. శంఖధారి, నందక ధారి, శార్ఙపాణి, గదాధరుడు, చక్రధారి, క్షోభింపశక్యం కానివాడు, సర్వాయుధాలు ఉన్నవాడు.

ఇంతవరకు కీర్తించదగ్గ మహాత్ముడయిన కేశవుని సహస్రదివ్య నామాలను పరిపూర్ణంగా కీర్తించాను. ఈ సహస్రనామాన్ని నిత్యమూ విన్నవారు, కీర్తించినవారు అశుభాలను పొందరు. ఇహ పరాల్లో సుఖిస్తారు. బ్రాహ్మణుడు వేదాంతాన్ని తెలుసుకొంటాడు. క్షత్రియుడు విజయం పొందుతాడు. వైశ్యుడు ధన సమృద్ధిని పొందుతాడు. శూద్రుడు సుఖ పడతాడు. ధర్మాన్ని కోరేవాడు ధర్మాన్ని పొందుతాడు. ధనాన్ని కోరేవాడు ధనాన్ని పొందుతాడు. కోరికలున్నవాడు కోరికలు తీర్చుకొంటాడు. సంతానార్థి సంతానాన్ని పొందుతాడు. మానవుడు ఎల్లప్పుడు లేచి, శుచియై, మనస్సును దానియందుంచి, భక్తితో వాసుదేవుని నామ సహస్రాన్ని కీర్తించాలి. దీనివల్ల మానవుడు గొప్ప కీర్తిని పొందుతాడు. జ్ఞాతుల్లో ప్రధానుడవుతాడు. నశించని సంపదను పొందుతాడు. గొప్ప శ్రేయస్సును పొందుతాడు. ఎక్కడా భయం కలుగదు. వీర్యాన్ని, తేజస్సును పొందుతాడు. రోగాలు రావు, కాంతి పెరుగుతుంది. బలం, రూపం, సద్గుణాలు లభిస్తాయి. రోగ పీడితుడు రోగవిముక్తు డవుతాడు, బంధింపబడ్డవాడు బంధనాన్నుండి ముక్తిని పొందుతాడు. భయపడ్డవాడు భయాన్నుండి దూర మవుతాడు, ఆపదల్లో ఉన్నవాడు వాటిని దాటేస్తాడు. మానవుడు నిత్యం భక్తితో సహస్రనామాలతో పురుషోత్తముని స్తుతిస్తే శీఘ్రంగా దాటరానివాటిని కూడా దాటివేస్తాడు. వాసుదేవుని ఆశ్రయించిన మర్త్యుడు, వాసుదేవుని పరమ గతిగా భావించినవాడు, అన్ని పాపాల నుండి ముక్తుడై సనాతన బ్రహ్మమును చేరుకొంటాడు. వాసుదేవ భక్తులకు ఎలాంటి అశుభం ఎక్కడా కలుగదు. జన్మ, మృత్యువు, వార్ధక్యం,

వ్యాధి వీటివల్ల భయం రాదు. శ్రద్ధా భక్తులతో ఈ స్తోత్రాన్ని పఠించినవాడు, ఆత్మ సుఖం, సహనం, సంపద, ధైర్యం, బుద్ధి కీర్తులను పొందుతాడు. పురుషోత్తముని యందు భక్తికల్గిన పుణ్యాత్ములకు క్రోధం, మాత్సర్యం లోభం, దుర్బుద్ధి ఇవి ఎన్నిటికీ కలగవు.

మహాత్ముడైన వాసుదేవుని శక్తిచేతనే, అంతరిక్షం, చంద్ర సూర్యులు, నక్షత్రాలు, ఆకాశం, దిక్కులు, భూమి, మహాసముద్రం ఇవన్నీ నిలబడుతున్నాయి. సురలు, అసురులు, యక్షులు, ఉరగులు, రాక్షసులు, చరం, అచరం - ఈ సమస్త జగత్తు వాసుదేవుని అధీనంలో ఉంది. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, సత్వం, తేజస్సు, బలం, ధైర్యం, క్షేత్రం, క్షేత్రజ్ఞుడు - ఇవన్నీ వాసుదేవ స్వరూపాలేనని పెద్దలు చెప్తున్నారు. సమస్త శాస్త్రాలకు ఆచరణమే జీవగర్ర. ఆచారంవల్లే ధర్మం ఏర్పడుతుంది. ఆ ధర్మానికి ప్రభువు అచ్యుతుడు. ఋషులు, పితృదేవతలు, దేవతలు, భూమ్యాది పంచభూతాలు, ధాతువులు, కదలేవి, కదలనివి - ఈ సమస్త జగత్తు నారాయణుని నుండే పుట్టింది. యోగవిద్య, జ్ఞానం, సాంఖ్యవిద్య, విద్యలు, శిల్పం, మొదలయిన పనులు, వేదాలు, శాస్త్రాలు, సమస్త విజ్ఞానం జనార్దనుని నుండి వచ్చినవే. విష్ణువు ఒక్కడే మహాభూతం. అతడే అనేక భూతాలుగా రూపాలు ధరిస్తాడు. ముల్లోకాలు వ్యాపిస్తాడు. ప్రాణుల హృదయాల్లో ఉండి, విశ్వాన్ని అవ్యయుడై భోగిస్తాడు. భగవంతుడైన విష్ణువునకు సంబంధించి వ్యాసుడు ప్రవచించిన ఈ సహస్ర నామస్తోత్రాన్ని శ్రేయస్సును, సుఖాలను పొందాలనుకొన్నవాడు చదవాలి, కోరుకోవాలి. విశ్వానికి ప్రభువు, పుట్టుక లేనివాడు, ప్రకాశమానుడు, జగత్తునకు ఉత్పత్తి లయాలను చేసేవాడు, కమలనేత్రుడు అయిన విష్ణువును స్తుతించే వారికి పరాభవంరాదు."

150. గాయత్రీ జప ఫలము

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'మహాప్రాజ్ఞుడా ! తాతా ! దేన్ని నిత్యం జపిస్తే జపించినవానికి గొప్ప ధర్మఫలం లభిస్తుంది ? ప్రయాణకాలంలో, ప్రవేశకాలంలో, పనులు జరుగుతున్నప్పుడు, దేవతా యజ్ఞంలో శ్రాద్ధ సమయంలో ఏ జపం కార్యసాధక మవుతుంది ? శాంతి, పుష్టి, రక్ష, శత్రుజయం, భయనాశనం అయిన దేది ? ఏది వేదంతో సమానం ? అలాంటి జపనీయ మంత్రం చెప్పండి' భీష్ముడిలా అన్నాడు 'రాజా ! వ్యాస ప్రోక్తమైన ఈమంత్రాన్ని ఏకాగ్రంగా విను. ఇది సావిత్రీదేవి చెప్పింది. దివ్యమయినది, వెంటనే పాపాల్ని తొలగించేది. అనఘా ! మంత్ర విధానాన్ని పరిపూర్ణంగా చెప్తాను విను. దీన్ని వింటే నీవు అన్ని పాపాలనుండి విముక్తి పొందుతావు. ధర్మరాజా ! రాత్రి, పగలు దీన్ని

జపించేవాడు పాపాలకు ఆశ్రయంకాడు. అటువంటి మంత్రాన్ని చెప్తాను. ఏకాగ్రతతో విను. దీన్ని వింటే ఆయుష్మంతు డవుతాడు. పురుషుని సమస్త కార్యాలు సిద్ధిస్తాయి. ఇక్కడ, పరలోకంలోను ఆనందం పొందుతాడు. రాజా ! పూర్వం రాజర్షి శ్రేష్ఠ లందరూ దీన్ని ఎల్లప్పుడూ సేవించారు. సత్యవ్రత పరాయణులు, క్షత్ర ధర్మపరులు దీన్ని నిత్యం జపించేవారు. నియమ పరాయణులై శ్రద్ధతో దీన్ని ప్రతిరోజూ జపించే రాజులు గొప్ప సంపదను పొందుతారు. గొప్ప వ్రతశీలుడైన వసిష్ఠునికి నమస్కారం, వేదనిధి అయిన పరాశరునికి నమస్కారం. ఉరగశ్రేష్ఠుడైన అనంతునికి నమస్కారం, అక్షయ సిద్ధులకు నమస్కారం. ఋషులకు నమస్కారం. పరాత్పరుడు, దేవాధిదేవుడు, వరదాత అయిన పరమేశ్వరునకు, సహస్ర శీర్షుడయిన శివునకు, సహస్రనాముడైన జనార్దనునకు నమస్కారం.

అజైకపాద్, అహిర్బుధ్న్య, పినాకీ, అపరాజిత, ఋత, పితృరూప, త్ర్యంబక, మహేశ్వర, వృషాకపి, శుంభు, హవన, ఈశ్వరులు పదకొండుమంది రుద్రులుగా చెప్పబడ్డారు. వీరు త్రిభువనాలకు ప్రభువులు. వేదంలోని శత రుద్ర సంహితలో, మహాత్ముడయిన రుద్రుని శతనామాలు చెప్పబడ్డాయి. అంశుడు, భగుడు, మిత్రుడు, వరుణుడు, జలేశ్వరుడు. ధాత, అర్యముడు జయంతుడు, భాస్కరుడు, త్వష్ట, పూష, ఇంద్రుడు, విష్ణువు - ఈ పన్నెండు కశ్యపపుత్రులయిన ఆదిత్యుల నామాలు ధరుడు, ధ్రువుడు, సోముడు, సావిత్రుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు - ఈ ఎనిమిది మంది అష్టవసువులుగా కీర్తింపబడ్డారు. నాసత్యులు, దస్రులు ఇవి అశ్వినీ దేవతలనామాలు. వారిద్దరూ మార్తాండుని కుమారులు. నాసిక నుండి బయటకు వచ్చారు. ఇప్పుడు లోకాల కర్మలకు సాక్షిభూతులయిన వారిని చెప్తాను. సమస్త ప్రాణులు చేసే యజ్ఞాలను, దానాలను, పుణ్యకర్మలను, త్రిదశేశ్వరులు అదృశ్యరూపులై నిత్యం పరిశీలిస్తుంటారు. మృతువు, కాలం, విశ్వేదేవతలు, పితృగణాలు ప్రాణుల శుభాశుభాలను నిత్యం పరిశీలిస్తుంటారు. తపోమోక్ష పరాయణులైన మునులు, సిద్ధులు. తమ నామాలను కీర్తించే నరులకు ప్రసన్నమైన చిరునవ్వుతో శుభాలను ప్రసాదిస్తుంటారు. వీరందరూ ప్రజాపతి నిర్మించిన ఈలోకా లన్నింటిలో దివ్యమైన తేజస్సుతో నివసిస్తుంటారు. అన్ని శుభాశుభాకర్మలను, శుద్ధభావంతో పరిశీలిస్తారు. మనుష్యుడు నిర్మలమైన భావంతో ప్రాణాధీశ్వరులయిన వీరందరినీ నిత్యం కీర్తించటం ద్వారా ధర్మార్థ కామాలను విస్తారంగా పొందుతాడు. వారు విశ్వేశ్వరుడు కల్పించిన పుణ్యలోకాల్ని పొందుతారు. పైన చెప్పిన ముప్పది మూడు మంది దేవతలు, సమస్త భూతగణాలకు ప్రభువులు.

నందీశ్వరుడు, మహాకాయుడు, గ్రామణి, వృషభధ్వజుడు సర్వలోకేశుడు గణేశ,

వినాయకులు, సౌమ్యగణ, రుద్రగణ , యోగగణ, భూతగణ, నక్షత్ర, నదులు, ఆకాశం, పతగాధిపుడై, గరుడుడు భూమి మీదున్న తపస్సిద్దులు, కదలనివీ, కదిలేవి, హిమవంతుడు, సర్వపర్వతాలు, నాలుగు సముద్రాలు, శివతుల్య పరాక్రములైన శివుని అనుచరగణాలు, విష్ణుదేవుడు, జిష్ణువు, స్కందుడు, అంబిక - వీరందరిని కీర్తించినవారు సమస్తపాప విముక్తులవుతారు. ఇకముందు మానవలోకంలోని ఋషిసత్తములను గూర్చి చెప్తాను. యవక్రీతుడు, రైభ్యుడు, అర్వావసువు, పరావసువు, ఉశిజపుత్రుడు, కక్షీవంతుడు, అంగిరసుని పుత్రుడు బలుడు, మేధాతిధిపుత్రుడు కణ్వుడు, బర్హిషదుడు ఈ ఋషులందరూ బ్రహ్మ తేజస్సు కలవారు, లోకాలను పవిత్రం చేసేవారు. వీరిని కీర్తించాలి. వీరు రుద్ర అగ్ని వసు సమాన ప్రభావ శాలురు. వీరు భూమి మీద గొప్ప శుభకర్మల నాచరించి, స్వర్గంలో దేవతలతోపాటు ఆనందిస్తున్నవారు.

మహేంద్రుని గురువులయిన ఏడుగురు ఋషులు తూర్పుదిక్కున నివసిస్తుంటారు. శుద్ధ భావంతో వీరిని కీర్తించినవారు ఇంద్రలోకాన్ని పొందుతారు. ఉన్ముచుడు, ప్రముచుడు, శక్తిశాలి స్వస్త్యాత్రేయుడు, దృఢవ్యుడు, ఊర్ధ్వబాహువు, తుణ సోమాంగిరసుడు, మిత్రావరుణుల పుత్రుడు, తేజోవంతుడైన అగస్త్యుడు - ఈ ఏడుగురు యమధర్మరాజు ఋత్విజులు. వీరు దక్షిణాన. నివసిస్తారు. దృఢేయుడు, ఋతేయుడు, కీర్తివంతుడైన పరివ్యాధుడు, సూర్యసదృశతేజస్సులైన ఏకతుడు, ద్వితుడు, త్రితుడు; ధర్మాత్ముడు, అత్రిపుత్రుడైన సారస్వత మహర్షి - వీరు ఏడుగురు వరుణుని ఋత్విజులు - వీరు పశ్చిమాన నివసిస్తారు. అత్రి, వసిష్ఠ భగవానుడు, కశ్యపమహర్షి, గౌతముడు, భరద్వాజుడు, కుశిక పుత్రుడైన విశ్వామిత్రుడు, ఋచీకనందనుడు, ప్రతాపశాలి, ఉగ్రుడు అయిన పరశురాముడు - ఈ ఏడుగురు కుబేరుని గురువులు. ఉత్తర దిక్కున నివసిస్తారు. వీరుకాక అనేకమంది మునులు అన్ని దిక్కులయందు నివసిస్తున్నారు. వారందరూ కీర్తిని, శుభాన్ని అనుగ్రహించగలవారు. లోకాలను పవిత్రం చేసేవారు. వీరిని కీర్తించాలి.

ధర్ముడు, కాముడు, కౌలుడు, వసువు, వాసుకి, అనంతుడు, కపిలుడు - ఈ ఏడుగురు భూమిని మోస్తుంటారు. పరశురాముడు, వ్యాసుడు, ద్రోణపుత్రుడైన అశ్వత్థామ, లోమశుడు - ఈ నలుగురు దివ్యమునులు. వీరిలో ప్రతి ఒక్కరు ఏడుగురు మునులతో సమానులు, దిక్పాలురు లోకానికి శాంతిని, శుభాన్ని కలిగించే వారుగా చెప్పబడ్డారు. ఏ దిక్పాలకు డే దిక్కున ఉంటాడో, ఆ దిక్కుగా తిరిగి శరణువేడాలి. సమస్త ప్రాణులకు సృష్టి కర్తలుగాను, లోకాలను పవిత్రం చేసేవారిగానూ ఈ ఏడుగురు

కీర్తింపబడ్డారు. సంవర్తుడు, మేరుసావర్ణి, ధార్మికుడయిన మార్కండేయుడు, సాంఖ్యుడు, యోగుడు, నారదుడు, దుర్వాసమహర్షి – వీరందరూ గొప్పతపస్సులు, జితేంద్రియులు, సర్వలోక ప్రసిద్ధులు. మరికొందరు రుద్ర సమానులయిన మహర్షులున్నారు. వారిని కీర్తిస్తే బ్రహ్మలోకానికి పంపించగల సమర్థులు. వీరిని కీర్తించటంవల్ల పుత్ర హీనులు పుత్రుల్ని, ధనహీనులు ధనాన్ని పొందుతారు. అలాగే నరుడు ధర్మార్థకామాల సిద్ధిని పొందుతాడు. వేనకుమారుడు, పృథ్వితండ్రి అయిన పృథుడు ప్రజాపతియైన సార్వభౌమమహారాజు వీరిని కీర్తించాలి. ఆదిత్యవంశ సంజాతుడు, ఇంద్ర సదృశ పరాక్రముడు, ఇలా బుధుల ప్రియపుత్రుడు, త్రిభువన విఖ్యాతుడు అయిన పురూరవ మహారాజును కీర్తించాలి. మూడులోకాల్లో ప్రఖ్యాతుడు, కృతయుగంలో గవామయ యజ్ఞంచేసినవాడు అయిన భరతుని కీర్తించాలి. విశ్వజిద్యాగం, తపస్సు చేసినవాడు; శుభలక్షణయుక్తుడు, లోకాలచే పూజింపబడే వాడు, పరమతేజస్వి, మహాదేవు డయిన రంతిదేవుని కీర్తించాలి. సగరకుమారులను గంగాజలంతో అభిషేకించి, తరింపచేసి, పరమ తేజశ్శాలియై, శ్వేతుడనే పేరు పొందిన భగీరథరాజర్షిని కీర్తించాలి. పై చెప్పిన రాజులందరూ అగ్ని సమానులు, గొప్ప రూప సంపద, తేజస్సు కలిగినవారు. గొప్ప శరీరం, బలం కలవారు. వీరిని కీర్తించిన వారి కీర్తి పెరుగుతుంది.

దేవతలను, ఋషి సమూహాలను జగదీశ్వరులయిన రాజులను, సాంఖ్యయోగ హవ కవ్య సర్వవేద ఆధార భూతమయిన పరబ్రహ్మను, సర్వ ప్రాణులకు శుభాన్ని కల్గించేవారిని, పవిత్రులైన వారిని విరివిగా స్మరించాలి. వీరందరూ వ్యాధులను రూపు మాపేవారు, శ్రేష్ఠులు, అన్ని క్రియలకు పుష్టి కల్గించేవారు. వారిని పరిశుద్ధుడై ప్రాతఃసాయం సమయాల్లో కీర్తించాలి. ఈ దేవతలు లోకాల్ని రక్షిస్తారు. వర్షిస్తారు. ప్రకాశిస్తారు, వాయువులను ప్రసరింపజేస్తారు, సృష్టిని చేస్తుంటారు. వీరు నాయకులు, శ్రేష్ఠులు, సమర్థులు, శాంతులు, జితేంద్రియులు. వీరందరూ నరులకు సంబంధించిన అశుభాల్ని పోగొడతారు. లోక సాక్షులయిన మహానుభావులు. పాప పుణ్యాలను పరిశీలిస్తుంటారు. వీరిని ఉదయాన్నే లేచి, కీర్తిస్తే శుభం కలుగుతుంది. అగ్ని భయం, దొంగ భయం ఉండదు. మార్గంలో ఎవరూ అడ్డగించరు. వీరిని కీర్తించిన వారికి పీడకలలు రావు. సర్వపాపాలనుండి విముక్తిని పొందుతారు. సుఖంగా ఉంటారు, ఇళ్ళకు తిరిగి వస్తారు. ద్విజుడు దీక్షా సమయాల్లో శుచియై, న్యాయంగా ఆత్మవంతుడై, అసూయారహితుడై, శమదమయుతుడై, వీరిని కీర్తించాలి. రోగార్తుడు గాని, గొప్ప వ్యాధి బారినపడ్డవాడు కాని వీరిని కీర్తిస్తే దాన్నుండి

ముక్తిని పొందుతాడు. ఇంటి మధ్యన వీరిని కీర్తిస్తే వంశానికి ఎంతో మేలు జరుగుతుంది. పాలం మధ్యలో ఉండి వీరిని కీర్తిస్తే పైరు చక్కగా పెరుగుతుంది. గ్రామాంతరం వెడుతూ చదివితే మార్గంలో క్షేమంగా ఉంటాడు. తనను, పుత్రులను, భార్యను, ధనాన్ని, విత్తనాలను, ఓషధులను చక్కగా రక్షించుకోవటానికి వీరిని కీర్తించాలి. యుద్ధ సమయంలో క్షత్రియుడు వీరిని కీర్తిస్తే శత్రువులు నశిస్తారు. కీర్తించినవాడు క్షేమంగా ఉంటాడు. వీరిని, యజ్ఞాదుల్లోను, శ్రాద్ధాది కర్మలలోను కీర్తించిన పురుషుడు సమర్పించిన హవ్య కవ్యాలను దేవతలు, పితృదేవతలు చక్కగా స్వీకరిస్తారు. వ్యాధుల భయం, క్రూర మృగభయం, ఏనుగుభయం ఉండదు. దొంగ భయం ఉండదు. శోకం తగ్గుతుంది. పాపపు కార్యాల నుండి ముక్తిని పొందుతాడు.

ఉత్తమమయిన గాయత్రీ మంత్రాన్ని పఠిస్తే గొప్ప సిద్ధిని పొందుతాడు. నౌకాదియాన పాత్రలో, ప్రయాణ సాధనంలో ఉన్నప్పుడు ప్రవాసంలో, రాజగృహంలో ఎక్కడ ఉన్నా దీనివల్ల సిద్ధి కల్గుతుంది. గాయత్రీ మంత్ర జపపరునికి రాజభయం గాని, పిశాచ, రాక్షస భయం కాని అగ్ని, జలం, వాయువు, సర్పం - వీటి భయం కానీ ఏర్పడదు. ఉత్తమమయిన గాయత్రీ మంత్రాన్ని పరించినవాడు నాలుగు వర్ణాల వారికి, నాలుగు ఆశ్రమాల వారికి ఎల్లవేళలా శాంతిని చేకూర్చినవాడవుతాడు. గాయత్రి జపంచేసిన చోట అగ్ని ప్రమాదం ఉండదు. ఆ ఇంట్లో బాలురు మరణించరు. అక్కడ పాములు నివసించవు. వారికి దుఃఖ ముండదు. గొప్ప ఉత్తమ గతులను పొందుతారు. సావిత్రీ రూపమయిన పరబ్రహ్మగుణ కీర్తన విన్నవారికీ ఈ ఫలాలు లభిస్తాయి. ఆవుల మధ్య దీన్ని పఠిస్తే ఆవుల పరంపర వృద్ధి చెందుతుంది. ప్రయాణంలో, ప్రవాసంలో అన్ని అవస్థలలోను దీన్ని పఠించాలి. రాజా ! నియమవంతులై నిత్యం జపం, హోమం చేసే ఋషులు జపించే గొప్ప రహస్య మంత్రం ఇదే..ఇది సిద్ధిని పొందిన వేదవ్యాస మహర్షి చెప్పిన యథార్థ మయిన ఇతిహాసం. గతంలో ఇంద్రుడు కుపదేశించిన దివ్య పరాశరమంత్రం దీనిలో ఇమిడి ఉన్నది. నీకీ విషయమంతా చెప్పాను. ఈ గాయత్రీ మంత్రం సత్యమైనది. సనాతన బ్రహ్మస్వరూపమయినది. ఇది సమస్త ప్రాణి హృదయాలలో నివసించే సనాతన వేదం. సూర్యచంద్ర వంశీయులయిన రాఘవులు, కురువులు కూడా ఈగాయత్రీమంత్రాన్ని శుచీభూతులై, నిత్యం పఠిస్తుంటారు. ఇదే ప్రాణు లందరికీ పరమగతి అయిన మంత్రం. ప్రతి రోజూ దేవతలను, సప్తర్షులను, ధ్రువుని స్మరించటం అభ్యసిస్తే సర్వ కష్టాలనుండి విముక్తి లభిస్తుంది. అశుభం రాదు. కాశ్యప, గౌతమ, భృగు, అంగిరస, అత్రి, శుక్ర,

అగస్త్య, బృహస్పతి మొదలయిన వృద్ధ మహర్షులందరూ సదాగాయత్రీ మంత్రం జపిస్తుంటారు. భారద్వాజ మతము ఋచీకతనయులచే పొందబడింది. శక్రవసువులు వసిష్ఠ మహర్షి నుండి, దీనిని పొంది, దానవులను జయించారు. బంగారు కొమ్ములతో కూడిన వంద ఆవులను వేదవిదుడయిన, బహు శాస్త్ర పండితుడయిన విప్రునికి దానంచేసినవాడు; దివ్యమైన భారత కథను నిత్యం పరులకు వినిపించినవాడు – వీరిద్దరూ సమాన మయిన గొప్ప ఫలితాన్ని పొందుతారు. భృగుమహర్షిని కీర్తిస్తే ధర్మం వృద్ధి చెందుతుంది. వసిష్ఠునికి నమస్కరిస్తే శక్తి వస్తుంది. రఘువుకు నమస్కరిస్తే యుద్ధ విజయం లభిస్తుంది. అశ్వినులను కీర్తిస్తే రోగాలు ఉండవు. భారత ! శాశ్వత బ్రహ్మరూపిణి అయిన సావిత్రిని గూర్చి నీకు చెప్పాను. రాజా ! నీవింకేమైనా వినాలనుకొంటే అవి కూడా చెప్తాను.'

151. బ్రాహ్మణ మహిమను వర్ణించుట.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'పితామహా ! ఎవరు పూజ్యులు ? ఎవరు నమస్కరించదగినవారు ? ఎవరిపట్ల ఎలాప్రవర్తించాలి ? ఎటువంటి వారిపట్ల ఎలా వ్యవహరించాలి ? ఏంచేస్తే హాని కల్గదు ?' భీష్ముడిలా అన్నాడు 'బ్రాహ్మణులను అవమానిస్తే దేవతలకు కూడా దుఃఖం ఏర్పడవచ్చు. బ్రాహ్మణులకు నమస్కరించటంవల్ల హానికల్గదు. బ్రాహ్మణులు పూజ్యులు. నమస్కరింపదగినవారు. వారిపట్ల కుమారునివలె వ్యవహరించాలి. ఆ బుద్ధిమంతులు ఈలోకాలన్నిటినీ ధర్మంలో నిలబెడతారు. అన్నిలోకాల్లోనూ బ్రాహ్మణులు గొప్పవారు. ధర్మవారధులు. ధనాన్ని త్యాగం చెయ్యటం వల్ల సుందరమయినవారు, వాఙ్నియమాన్ని పాటించేవారు. ప్రాణులందరికీ అందమయినవారు, నిధివంటివారు. వ్రతాల నాచరించేవారు. వారులోకాలను ముందుకు నడిపిస్తారు. శాస్త్రాలను రచించేవారు, కీర్తిమంతులు. తపస్సు వారిదగ్గరున్నగొప్ప ధనం. వాక్కు వారి గొప్పబలం. వారు ధర్మాలకు ఉత్పత్తిస్థానాలు, ధర్మవిదులు. సూక్ష్మంగా దర్శించగలవారు. బ్రాహ్మణులు ధర్మాసక్తి కలవారు. ధర్మాన్ని ఆచరించేవారు, పుణ్యకర్మలు చేసేవారు. ధర్మానికి వారధులవంటి వారు. నాలు వర్ణాల ప్రజలు వారిని ధర్మ విషయాల్లో ఆశ్రయించి జీవిస్తారు. వారు ధర్మమార్గాలు, అందరినీ ముందుకు నడిపించేవారు. యజ్ఞాలను చేస్తూ, చేయించేవారు. ప్రాచీనులు తండ్రితాతల నుండి వచ్చిన గొప్ప ధర్మ సంప్రదాయ భారాన్ని వహిస్తున్నవారు. గొప్ప ఎద్దులు తాము వహించే భారం విషయంలో అలసత్వం వహించనట్లే కార్యభారం విషయంలో దుఃఖించరు. వారు దేవతలకు, పితృదేవతలకు, అతిథులకు ముఖాల వంటివారు. హవ్య

కవ్యాలను విందుగా స్వీకరించతగ్గవారు. బ్రాహ్మణులు కేవలం భోజనం చేసినంతమాత్రం వల్లనే మూడులోకాలను గొప్ప భయం నుండి రక్షించగలరు. వీరు లోకాని కంతటికీ దీపాలు. కళ్ళున్నవారికి కూడా కళ్ళవంటివారు. బ్రాహ్మణులు అందరికీ శిక్షణ నిచ్చేవారు. వేద మనే ధనమున్నవారు. నేర్పరులు. మోక్షాన్ని దర్శింపగలవారు. క్రియల ఫలిత మెరిగిన వారు. ప్రాణులందరికీ ఆత్మ విషయోన్నతిని గుర్తించి యోచించేవారు.

ఏ పనికయినా ఆది మధ్య అంతాలను తెలిసినవారు. సంశయ రహితులు. ఇహపర విశేష జ్ఞాన మున్నవారు. మోక్షాన్ని పొందేవారు. వారు బంధ విముక్తిని పొందువారు. పాపాలను పోగొట్టుకొంటారు. ద్వంద్వాలకతీతులు. పరిగ్రహాన్ని ఇష్టపడనివారు. జ్ఞానం కలిగిన మహాత్ములందరి చేత గౌరవించబడ్డవారు. గౌరవానికి అర్హులు. గంధాన్ని, మాలిన్యపు బురదను; భోజనాన్ని, భోజనం లేకపోవటాన్ని సమానంగా భావించగలవారు. వారికి మామూలు వస్త్రం, పట్టువస్త్రం, చర్మం కూడా సమానమే. ఆహారాన్ని తీసుకోకుండా చాలా రోజులు ఉండగలరు. ఇంద్రియ నిగ్రహంకలిగి, వేదాధ్యయనాదులతో శరీరాన్ని శుష్కింప చేయగలవారు. దైవం కానిదానిని దైవంగా మార్చగలరు. దైవాన్ని అదైవం గాను చెయ్యగలరు. లోకపాలకులై కోపంవస్తే వేరే లోకాలను సృష్టించే సామర్థ్యమున్న వారు. ఆ మహానుభావుల శాపం కారణంగా సాగరజలం త్రాగరానిదిగా మారిపోయింది. వారి కోపాగ్ని దండకారణ్యంలో నేటికీ ప్రజ్వరిల్లుతున్నది. బ్రాహ్మణులు దేవతలకు కూడా దేవతలు. కారణానికి కారణమైన వారు. ప్రమాణానికి ప్రమాణత్వాన్ని సమకూర్చేవారు. పండితు డెవడూ వారిని అవమానించడు. బ్రాహ్మణులలో వృద్ధుడు, బాలుడు, సర్వులు మానార్హులు. తపోవిద్యలలోని విశేషాల ననుసరించి, వారు పరస్పరం గౌరవించుకొంటారు. విద్వాంసుడు కాకపోయినా బ్రాహ్మణుడు దేవుడే. పాత్రుడయితే గొప్ప పవిత్రతను సమకూర్చగలడు. విద్వాంసుడు గొప్ప దేవుడు. నిండు సముద్రునివంటివాడు. విద్వాంసుడయినా కాకపోయినా బ్రాహ్మణుడు గొప్ప దేవతతో సమానుడు. సంస్కార పూర్వకంగా స్థాపించబడినా, లేకున్నా అగ్ని గొప్ప దైవత మయినట్లుగా బ్రాహ్మణులూ దేవ సమానులే. తేజశ్శాలి అయిన అగ్ని శ్మశానంలో ఉన్నా దుష్టం కాదు. యజ్ఞంలో హవిస్సులనందు కొంటున్నప్పుడు, శాస్త్రప్రకారం గృహంలో పూజించబడుతున్నప్పుడు మరింత శోభిస్తుంది. ఈ విధంగా అనిష్టకర్మలయందు ప్రవర్తిస్తున్నవాడయినప్పటికీ అన్నివిధాలా బ్రాహ్మణులు మాన్యులే. వారు పరదేవతలే."

152. కార్తవీర్యార్జనుడు దత్తాత్రేయుని వలన వరాలు పొందటం.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'మహారాజా ! ఏ ప్రత్యేక ఫలాన్ని ఆశించి, ఏ కర్మాభ్యుదయాన్ను ద్దేశించి,బ్రాహ్మణ పూజను చేస్తున్నావు ?' భీష్ముడిలా అన్నాడు. 'భారత ! ఈ విషయంలో పెద్దలు కార్తవీర్యార్జునునికి, వాయుదేవునికి మధ్య జరిగిన సంవాద రూపమయిన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు.

పూర్వం మాహిష్మతీ పురంలో వెయ్యి బాహువులున్న మహాబలుడు, శ్రీమంతుడు అయిన కార్తవీర్యార్జునుడనే రాజు ఈలోకానికంతటికీ ప్రభువై పరిపాలిస్తుండేవాడు. హైహయవంశీయుడై, సత్యమైన పరాక్రమంకలిగిన ఆ రాజు, సాగరమే వస్త్రంగా కలిగిన సమస్త భూమండలాన్ని సముద్రాలతో, ద్వీపాలతో సహా పరిపాలించేవాడు. ఒక సమయంలో కార్త వీర్యార్జునుడు, క్షత్రియ ధర్మాన్ని, వినయాన్ని, పాండిత్యాన్ని ముందుంచుకుని, దత్తాత్రేయ మహర్షిని చిరకాలం ఆరాధించి, అతనికి తనసమస్త ధనాన్ని సమర్పించాడు. దత్తాత్రేయ మహర్షి మిగుల సంతసించి, మూడు వరాలు కోరుకోమన్నాడు. వరాలిస్తానన్న దత్రాత్రేయునితో కార్య వీర్యార్జునుడిలా అన్నాడు. 'నేను రణరంగంలో సేనామధ్యంలో వెయ్యిబాహువులున్న వాడుగా ఉండాలి. ఇంటిలో మాత్రం మామూలుగా ఉండాలి. యుద్ధంలో సైనికులందరూ నన్ను వెయ్యి బాహువులున్నవానినిగా చూడాలి. ఈ విధంగా, విక్రమంతో నే నీ సమస్త భూమండలాన్ని జయించాలి. క్షత్రియ ధర్మంతో భూమండలాన్ని పొంది, అలసత్వం లేకుండా దాన్ని పాలించాలి. ద్విజశ్రేష్ఠ ! నాలుగవ వరాన్ని కూడా అనుగ్రహించు. పూజ్యుడ ! సాధువులు నేను మార్గం తప్పి ప్రవర్తించినప్పుడు నీ ప్రాపులో ఉన్న నన్ను సన్మార్గంలో ప్రవర్తింపచేయాలి. దీన్ని కూడా అనుగ్రహించు.' కార్తవీర్యుని ప్రార్థనను విన్న దత్తాత్రేయ మహర్షి ఆవరాలన్నీ ఇచ్చాడు. ఈ విధంగా గొప్ప పరాక్రమవంతుడైన అతనికి వరాలన్నీ సమకూడాయి. అన్ని వరాలను పొందాక, సూర్యాగ్ని సమానంగా వెలిగిపోతున్న రథాన్ని ఎక్కి, బలమదంతో కార్తవీర్యుడు 'ఈ ప్రపంచంలో నాకు సమాను డెవ డున్నాడు ? అని ప్రశ్నించాడు. ధైర్యం, వీర్యం, యశస్సు, శౌర్యం, విక్రమం, ఓజస్సు వీటిలో నాతో సమానుడెవ్వడు ?' అన్నాడు. అతని వాక్యం ముగియగానే అంతరిక్షంనుండి అశరీర వాణి ఇలా పలికింది 'మూర్ఖుడా ! క్షత్రియుని కంటె బ్రాహ్మణుడు శ్రేష్ఠుడని తెలుసుకోలేక పోతున్నావు. క్షత్రియు డెప్పుడూ బ్రాహ్మణునితో కలసి మాత్రమే ప్రజాపాలన చెయ్యగల్గుతున్నాడు.'

అర్జునుడన్నాడు. "నేను సంతోషిస్తే భూతాలను సంతృప్తిపరుస్తాను. నేను కోపిస్తే నాశం కల్పిస్తాను. మనో వాక్కాయ కర్మలలో నా కన్న గొప్ప ద్విజుడుండడు.

బ్రాహ్మణుడు గొప్పవాడన్న వాదం పూర్వ పక్షం. క్షత్రియుడు శ్రేష్ఠుడన్నది సిద్ధాంతం. ఇద్దరూ కలసి ప్రజాపాలన చేస్తారన్నావు. అందులోను తేడా కన్పిస్తోంది. బ్రాహ్మణులు క్షత్రియులను ఆశ్రయించుకొని జీవిస్తారు. క్షత్రం బ్రాహ్మణు నాశ్రయించదు. బ్రాహ్మణులు వేదాల నడ్డుపెట్టుకొని క్షత్రియుల నాశ్రయించి జీవిస్తున్నారు. ప్రజా పరిపాలన రూపమైన ధర్మం క్షత్రియుల చేతిలోనే ఉంది. క్షత్రియుడిని ఆశ్రయించి బ్రాహ్మణుడు జీవిస్తాడు. మరి విప్రు డెందుకు శ్రేష్ఠుడు ? విప్రులు సర్వప్రాణుల్లో ప్రముఖులు. బిచ్చమెత్తుకొని జీవిస్తూ కూడా, తమను తామే గొప్పవాళ్ళనుగా చెప్పుకొనే ఆ విప్రులను నేటినుండి నా అదుపులో ఉంచుకొంటాను. అంతరిక్షంలో ఉన్న ఈ గాయత్రీ కన్య అసత్యాన్ని పలుకుతున్నది ఈ ప్రపంచంలో ఉన్న చర్మ ధారులయిన బ్రహ్మణుల నందరినీ నేను తప్పక జయిస్తాను. అవశుల్ని చేస్తాను. ఈ ముల్లోకాల్లో ఎవ్వడూ కూడా నా పదవి నుండి నన్ను తొలగించలేడు. దేవు డయినా సరే మనుష్య డయినా సరే నన్నేం చెయ్యలేడు. నేను ద్విజుని కంటె అందుకే శ్రేష్ఠుడను. నేటి వరకు బ్రాహ్మణ ప్రధానమయిన లోకాన్ని క్షత్రియ ప్రధానంగా చేస్తాను. యుద్ధరంగంలో నాబలాన్ని ఎవ్వడూ సహించలేడు.

అర్జునుని మాటలు విన్న రాక్షస స్త్రీలు భయంకంపిత లయ్యారు. ఇది విన్న వాయుదేవుడు అంతరిక్షం నుండి ఇలా అన్నాడు. 'అర్జునా ! పాప భావాన్ని విడిచి పెట్టు. బ్రాహ్మణులకు నమస్కరించు. వారిపట్ల పాపంగా ప్రవర్తిస్తే దేశమంతా సంక్షోభంలో మునిగిపోతుంది. అయినా మహారాజ ! శక్తిశాలు రయిన ద్విజులే నిన్ను ప్రశాంతుని చేస్తారు, వారిని హింసిస్తే వారు నిన్ను దేశాన్నుండి బహిష్కరిస్తారు.' కార్తవీర్యుడు నీవెవ్వరని ప్రశ్నించాడు. అప్పుడు వాయువు 'నేను వాయువును. దేవతల దూతను. నీకు నేను హితం చెప్తున్నాను' అన్నాడు. అర్జును డన్నాడు "నీవు విప్రులయందు భక్తిరాగాన్ని ప్రదర్శించావు. ఆహా ! బాగుంది. భూదేవితో సమానమయిన సహనమున్న బ్రాహ్మణుని గూర్చి తెలిస్తే చెప్పు. వాయువు, జలం, అగ్ని, సూర్యుడు, ఆకాశం, వీటితో సమానుడయిన బ్రాహ్మణోత్తము డుంటే అతడిని గూర్చి చెప్పు.'

153. బ్రాహ్మణ మహిమను వర్ణించుట

వాయుదేవుడిలా అన్నాడు "మూడుడా ! మహాత్ములయిన బ్రాహ్మణుల గుణగణాలను కొన్నింటిని విను. నీవు చెప్పిన వారందరికంటే బ్రాహ్మణులే శ్రేష్ఠులు. ఒకప్పుడు అంగ మహారాజుతో వివాద మేర్పడిన కారణంగా భూదేవి తనమహీధర్మాన్ని

విడిచిపెట్టింది. అలాంటి భూమిని విప్రుడయిన కశ్యపుడు తన తపోబలంతో నిలబెట్టాడు. రాజా ! భూమిలో కాని, స్వర్గంలో కాని ఎల్లవేళలా బ్రాహ్మణులు అజేయులే. ఒకప్పుడు అంగిరసుడు తన తేజస్సుతో జలాన్నంతా పాలనుత్రాగి నట్లు త్రాగివేశాడు. రాజా ! మళ్ళీ తృప్తి లేనివాడై, మహాప్రవాహంలో భూమినంతటినీ నీటితో ముంచివేశాడు. ఒకసారి అతడికి నామీద కోపం వచ్చింది. అప్పుడు నేను ఈలోకాన్ని విడిచి పోయాను. అంగిరసుని భయంవల్ల అగ్ని హోత్రంలోనే దాగి ఉండిపోయాను. గౌతమ మహర్షిచేత అహల్యను కామించిన ఇంద్రుడు శపింపబడ్డాడు. అయితే ధర్మాన్ని దృష్టిలో ఉంచుకొని గౌతముడు ఇంద్రుని హింసించలేదు. పూర్వం సముద్ర జలాలెంతో తియ్యగా ఉండేవి. బ్రాహ్మణుల శాపం కారణంగానే ఆ జలం ఉప్పగా మారిపోయింది. పూర్వం అగ్ని బంగారు రంగుతో పొగలేకుండా పెద్ద జ్వాలలతో వెలిగిపోతుండేది. కోపించిన అంగిరసుని శాపానికి గురియై అగ్ని తన గుణాలను కోల్పోయింది. సగర పుత్రులు యజ్ఞాశ్వాన్ని అన్వేషిస్తూ, భూమిని త్రవ్వి, సాగరంగా మార్చేస్తూ, పాతాళంలో కపిల మహర్షిని సమీపించారు. అతని శాపంవల్ల వారందరూ బూడిదగా మారిపోయారు. రాజా ! నీవు బ్రాహ్మణులతో సముడవు కాదు. దీన్ని తెలిసికొంటే నీకే మంచిది. రాజైనవాడు గర్భస్థమయిన బ్రాహ్మణ పిండానికి కూడా నమస్కరించాలి. ప్రస్తుతం దండకారణ్యంగా చెప్పబడుతున్నదంతా ఒకప్పుడు గొప్ప సామ్రాజ్యం. బ్రాహ్మణ శాపం వల్ల అరణ్యంగా మారిపోయింది. తాలజంఘుడనే గొప్ప క్షత్రియుడిని ఓర్వుడనే బ్రాహ్మణుడొక్కడే నాశనం చేశాడు. రాజా ! నీవు కూడా దుర్లభమయిన విప్రుల రాజ్యాన్ని, బలాన్ని, పాండిత్యాన్ని, దత్తాత్రేయ మహర్షి అనుగ్రహం చేతనే పొందగలిగావు.

బ్రాహ్మణుడే కదా అగ్ని దేవుడు. అతడిని నీవెందుకు నిత్యం పూజిస్తున్నావు ? అతడు సమస్తలోకాల హవ్యాన్ని తీసుకొని వెళ్ళేవాడనే సంగతి నీకు తెలియదా ? అయినా, బ్రాహ్మణ శ్రేష్ఠుడు, ఆశ్రితపాలకుడు, జీవలోకాన్ని సృష్టించినవాడు అయిన బ్రహ్మ దేవుని ఎరిగి కూడా నీవెందుకు అజ్ఞానంలో మునిగి పోతున్నావు ? అలాగే ప్రజాపతి అయిన బ్రహ్మదేవుడు అవ్యక్తుడు, నాశరహితుడు, ప్రభువు. అతనిచేతనే ఈ చరాచరవిశ్వం సృష్టించబడింది. కొంత మంది మూర్ఖులు అండాన్నుండి బ్రహ్మ జన్మించా డనుకొంటారు. అండాన్నుండే పర్వతాలు, దిక్కులు, నీరు, భూమి ఆకాశం ఉద్భవించాయని భావిస్తారు. కానీ ఇది నిజంకాదు. బ్రహ్మ పుట్టుకలేని వాడు. అండం నుండి వచ్చినవాడు కాదు. ఈ ఆకాశాన్ని అండమంటుంటారు. దాన్నుండి ప్రకటితమైనాడు కనుక బ్రహ్మను అండజు

డంటారు. ఆకాశాన్నుండి బ్రహ్మ వ్యక్త మయ్యా డంటే అతడికి ఆధారమేదీ లేదు కదా అనవచ్చు. అతడు సర్వతేజోగతుడు. అహంకార రూపుడు. నిజానికి అండ మనేదే లేదు. ఆ బ్రహ్మదేవుడు లోకానికి ఆధార భూతుడు.' ఇలా వాయువు చెప్పగానే అర్జునుడు మారు పలుకలేదు.

154. బ్రాహ్మణోత్తముడైన ఉతథ్యుని ప్రభావము.

వాయుదేవు డిలా అన్నాడు. పూర్వం అంగుడనే రాజు ఈ భూమి నంతటినీ బ్రాహ్మణులకు దక్షిణగా ఇవ్వాలనుకొన్నాడు. అప్పుడు భూదేవి ఇలా ఆలోచించింది. "ఈ రాజు బ్రహ్మదేవుని కుమార్తె నయిన నన్ను, సమస్త భూతాల్ని భరించే నన్ను ఎలాగో పొంది. మళ్ళీ నన్ను బ్రాహ్మణులకు దానంగా ఎందు కివ్వాలనుకొంటున్నాడు ? ఇలాంటి రాజు, రాష్ట్రం ఉండకూడదు. నేను భూమి ధర్మాన్ని వదలి, బ్రహ్మలోకానికి వెళ్ళి పోతాను" అంటూ భూదేవి బయలుదేరింది. దేవత రూపంలో వెళ్ళిపోతున్న భూమిని గమనించి, కశ్యపమహర్షి తన యోగ శక్తితో శరీరాన్ని వదలి, భూమియొక్క స్థూల శరీరంలో ప్రవేశించాడు. రాజా ! మహర్షి ప్రవేశించగానే భూమి అంతా ఇబ్బడి ముబ్బడిగా తృణౌషధులతో నిండిపోయింది. ధర్మ సంపన్నమయింది. భయంపోయింది. గొప్ప వ్రతం కల్గిన కశ్యప మహర్షి ఇలా ముప్పది దివ్య వర్ష సహస్రాలు అప్రమత్తుడైబీజ భూమిగా ఉండి పోయాడు. మహారాజా ! అప్పుడు భూదేవి బ్రహ్మలోకాన్నుండి తిరిగి వచ్చి, కశ్యపునికి నమస్కరించి, అతని ఆశీస్సులతో కుమార్తెగా చెలామణి అయ్యింది. కశ్యపుడు ఇంతటి గొప్ప బ్రాహ్మణుడు. ఈ కశ్యపుని కంటె గొప్పవాడయిన క్షత్రియుడిని ఒకడిని నువ్వు చెప్పగలవా ?' అప్పుడు కార్తవీర్యుడు మారుమాట్లాడలేదు. 'అంగిరసుని వంశంలో జన్మించిన ఉతథ్యుని కథ చెప్తాను' అంటూ వాయు దేవుడు ఇలా చెప్పాడు.

"సోముని యొక్క కుమార్తె గొప్ప సౌందర్యవతి. భద్ర అని ప్రఖ్యాతి చెందింది. సోముడు ఆమెకు ఉతథ్యుడు తగిన వరుడని భావించాడు. తండ్రి నిశ్చయాన్ని విన్న మహానుభావురాలు, కీర్తిశాలిని, అందమైన అవయవాలతో ఒప్పారే ఆ భద్ర ఉతథ్యుని పొందటం కోసం గొప్ప నియమాలున్న తీవ్రతపస్సు చేసింది. ఆతర్వాత సోముని తండ్రి అత్రిమహర్షి ఉతథ్యుని ఆహ్వానించి, కీర్తిమతి అయిన భద్రను భార్యగా అతనికి భూరి దక్షిణలతో ఇచ్చాడు. అతడు కూడా విధివిధానంతో ఆమెను స్వీకరించాడు. ఆ భద్రను శ్రీమంతు డయిన వరుణుడు ముందుగానే కామించాడు. అతడు ఆశ్రమ సమీపంలో

భద్ర యమునానదిలో స్నానానికి వచ్చినప్పుడు ఆమెను అపహరించాడు. జలేశ్వరుడైన వరుణుడామె నపహరించి, తన పట్టణానికి తీసుకొని పోయాడు. ఆయన పట్టణం ఆరువేల కొలనులతో నిండినది. మిక్కిలి ఆశ్చర్య కరమయిన విశేషాలున్నది. ఆ పట్టణంకంటె అందమయిన గొప్ప పట్టణ మెక్కడా ఉండదు. మేడలతో, అప్సరసలతో, దివ్య భోగాలతో అందమైనదా పట్టణం. అచట వరుణదేవుడు ఆమెతో పాటు సుఖంగా క్రీడించాడు. తర్వాత ఈ విషయం – భార్య సపహరించటం – ఉతథ్యునికి చెప్పబడింది. దాన్నంతటినీ నారదుని ద్వారా విన్న ఉతథ్యుడు నారదునితో 'నీవు వరుణుని వద్దకు వెళ్ళి, నామాటగా పరుష వాక్కులలో అతనితో ఇలా చెప్పు' అన్నాడు. 'నేను చెప్తున్నాను నాభార్యను విడిచిపెట్టు. ఎందుకు నీ వామెను దొంగిలించావు ? నీవులోక పాలుడవు. రక్షించటం నీధర్మం. కాని లోకానికి ఆపదకల్పించే వాడవు కాకూడదు గదా ! సోమునిచేత నాకు భార్యగా ఈమె ఇవ్వబడింది. ఆమెను నీవు అపహరించావు.' ఈ విధంగా ఉతథ్యుని మాటలను నారదుడు వరుణుడికి చెప్పాడు. ఉతథ్యుని భార్యను ఎందుకు అపహరించావని అడిగాడు. నారదుని మాటవిని వరుణుడు 'ఈమె నాకు చాలా ఇష్టమైన భార్య. ఈమెను విడిచిపెట్టడానికి ఇష్టపడను' అన్నాడు. ఇలా వరుణుడు చెప్పగా విన్న నారదుడు ఆ మాటను అసంతృప్తితో ఉతథ్యునికి చెప్పాడు. 'ఓమహామునీ ! నన్ను వరుణుడు మెడపట్టి గెంటి వేశాడు. నీభార్యను ఇవ్వనన్నాడు. కనుక నీవు చేయాలనుకొన్న పని చెయ్యవలసి'దన్నాడు ఉతథ్యునితో నారదుడు.

నారదుని మాటలు విని మహాతేజస్వి, అంగిరుని కొడుకు అయిన ఉతథ్యుడు కోపంతో మండిపడ్డాడు. తన తేజస్సుతో నీటినంత త్రాగి వేశాడు. సలిలాధిపతి వరుణుడు ఈ విధంగా త్రాగ బడుతున్నప్పటికీ, స్నేహితులు చెప్పినప్పటికీ భద్రను ఉతథ్యునికివ్వ లేదు. దాంతో క్రుద్ధుడైన ఆ బ్రాహ్మణోత్తముడు ఉతథ్యుడు భూమితో "శుభురాలా ! నాకు ఆరువేల హ్రదాలున్న స్థలాన్ని చూపించ" మని అడిగాడు. తర్వాత సముద్రుడు తొలగిపోగా ఆప్రదేశం కన్పించింది. విప్రోత్తముడు ఆప్రదేశాన్నుండి సరస్వతి నదిని తొలగిపోవలసిందని చెప్పాడు.

"భయపడేదానా ! నీవు ఎవరికంటపడకుండా మరుప్రదేశాలకు తరలివెళ్ళు. శుభురాలా ! నీచేత విడువబడ్డ ఈ ప్రదేశం అపవిత్ర మవుతుంది" అన్నాడు. ఆప్రదేశమంతా ఎండి పోగా, వరుణుడు భద్రను తీసుకొనివచ్చి, ఉతథ్యునికిచ్చి ఆయన్ను శరణు వేడుకొన్నాడు. ఆ భార్యను పరిగ్రహించి ఉతథ్యుడు సంతోషించాడు. కార్తవీర్యుడా ! జగత్తును, వరుణుని

దుఃఖాన్నుండి విడిపించాడు. ధర్మ విదుడయిన ఉతథ్యుడు భార్యను పొంది, వరుణునితో ఇలా అన్నాడు. గొప్ప తేజోవంతుడయిన ఆ ఉతథ్యుడు చెప్పిన మాటలు విను. 'వరుణుడా ! నీవు ఆక్రోశిస్తున్నా సరే, తపోబలంతో ఈమెను నేను భార్యగా పొందాను' అంటూ ఆమెను తీసుకొని, తననివాసానికి వెళ్ళాడు ఉతథ్యుడు. రాజా బ్రాహ్మణ శ్రేష్ఠుడైన ఉతథ్యుడు ఇంతటి శక్తి కలవాడు. నేను అడుగుతున్నాను. ఇంతకంటె గొప్ప క్షత్రియు డెవడో చెప్పగలవా ?'

155. అగస్త్య వశిష్ఠుల ప్రభావవర్ణన.

భీష్ముడిలా అన్నాడు. "ఈ కథను విన్న కార్త వీర్యార్జునుడు మూగబోయాడు. తర్వాత వాయుదేవుడు 'రాజా ! బ్రాహ్మణుడయిన అగస్త్యుని యొక్క మాహాత్మ్యాన్ని చెప్తాను విను' అన్నాడు. అసురులచేత దేవతలు జయించబడ్డారు. వారందరూ నిరుత్సాహానికి గురయ్యారు. యజ్ఞాలు, పితృకార్యాలు అపహరింపబడ్డాయి. అర్జునా ! మానవుల కర్మలన్నీ దానవుల వల్ల నష్టపరచబడ్డాయి. తర్వాత ఐశ్వర్య హీనులయిన దేవతలందరూ భూమిని చేరుకొన్నారని చెప్తారు. అటు తర్వాత ఒకపుడు దేవతలు రాజా! తేజోవంతుడై వ్రతాలనాచరిస్తూ సూర్యతేజస్సుతో ప్రకాశించే అగస్త్యుని చూశారు. జనాధిపా ! దేవతలందరూ అగస్త్యునికి నమస్కరించి, కుశలమడిగారు. ఆ మహాత్మునితో సరియైన సమయంలో ఇలా అన్నారు. "ముని శ్రేష్ఠా! యుద్ధంలో దానవులచే జయింపబడ్డాం. ఐశ్వర్యవిహీనులమయ్యాం. మమ్మల్నీ ఈ భయం నుండి తమరే రక్షించాలి." దేవతలిలా చెప్పగా విన్న అగస్త్య మహర్షి కుపితుడయ్యాడు ప్రళయకాలంలో ప్రజ్వరిల్లే అగ్నివలె ఆ మహాతేజస్వి మండిపోయాడు. ఆ మహర్షి క్రోధజ్వాలల్లో దానవులంతా తగలబడిపోయారు "మహారాజా! వారంతా వేలకొలదీ అంతరిక్షం నుండి పారిపోయారు. అగస్త్యుని తేజస్సుతో తగలబడి పోతున్న దైత్యులందరూ రెండు లోకాలను విడిచి పెట్టి, దక్షిణ దిక్కుగా పారిపోయారు. బలిమాత్రం భూమిమీద ఉండి అశ్వమేధ యాగం చేస్తున్నాడు. పాతాళంలోనూ, భూమిమీద ఉన్న మహాసురులు మాత్రం దహించబడలేదు. రాజా! తర్వాత భయరహితులయిన దేవతలు తమలోకాలను పొందారు. అపుడు దేవతలు అగస్త్య మహర్షిని భూమి మీద ఉన్న అసురులందరినీ చంపమని ప్రార్థించారు. రాజా! ఇలా దేవతలచే ప్రార్థింప బడ్డ అగస్త్యుడు "భూమిమీద ఉన్న అసురులను దహింప లేను. నాతపస్సు ఇంకా నశించిపోతుంది" అన్నాడు. రాజా! అగస్త్య మహర్షి ఆత్మవిజ్ఞాని భగవంతుడు తన తేజస్సుతో దానవులందరినీ అలా దహించి వేశాడు. పాపరహితుడా! ఇంత గొప్పవాడయిన అగస్త్యుని గురించి చెప్పాను. నేనింకా

చెప్పగలను. ఇంతకంటే గొప్ప క్షత్రియుడుంటే నువ్వు చెప్పు" అన్నాడు వాయుదేవుడు. భీష్ముడిలా అన్నాడు. "వాయువు ఇలా చెప్పగానే కార్తవీర్యుడు మౌనం దాల్చాడు. వాయుదేవుడు రాజా! కీర్తిశాలి అయిన వశిష్ఠమహర్షి యొక్క గొప్ప కార్యాన్ని చెప్తాను విను" అన్నాడు. "అదితిపుత్రులయిన దేవతలు ఒకప్పుడు మానస సరోవరం దగ్గర సత్రయాగం చేయసంకల్పించారు. వశిష్ఠ మహర్షి గొప్పతనం తెలుసుకొన్న వారు ముందుగా ఆయనకు నమస్కరించారు. యజమానులై యాగదీక్షవల్ల కృశించిన దేవతలను చూచి ఖలీనులనే పర్వతాకార దానవులు, దేవతలను చంపాలను కొన్నారు. ఆ ప్రదేశానికి సమీపంలోనే మానస సరోవరం ఉంది. బ్రహ్మవరం వల్ల దానవులు చనిపోయినప్పటికీ అందులో మునిగితే తిరిగి జీవిస్తారు. దానవులు అతి భయంకరమైన పర్వతాలను, పరిఘలను, చెట్లను తీసుకొని దేవతలను బాధించారు. మానస సరోవర జలాన్ని వందయోజనాలు ఎగిసిపడేటట్లు సంక్షోభింప చేశారు. పదివేల సంఖ్యలో ఉన్న దానవుల ధాటికి తట్టుకోలేక దేవతలు పారిపోయారు. బాధితులైన దేవతలు ఇంద్రుని శరణు జొచ్చారు. వారిమాటలు విని బాధపడ్డ శక్రుడు వశిష్ఠుని శరణువేడాడు. భగవంతుడయిన వశిష్ఠుడప్పుడు వారికి అభయాన్ని ప్రసాదించాడు. ఆ సమయంలో దుఃఖితులైన దేవతలను చూచిన కరుణామయుడైన వశిష్ఠమహర్షి తన తపస్సువల్ల ఏర్పడ్డ తేజస్సుతో అనాయాసంగా పదివేల మంది ఖలీన దానవులను దహించివేశాడు. అంతేకాకుండా మహా తపస్వి అయిన వశిష్ఠుడు కైలాసానికి బయటలుదేరి వెడుతున్న గంగానదిని ఆ సరోవరంలోకి రప్పించాడు. గంగతో నిండిపొంగిపొర్లిన ఆ సరోవరం నుండి బయలు వెడలిన ప్రవాహం సరయూనదిగా రూపొందింది. ఖలీన దానవులు చనిపోయిన ప్రదేశం ఖలనమని ప్రఖ్యాత మయింది. ఈ విధంగా దేవతలు, ఇంద్రుడు కూడా వశిష్ఠ మహర్షి చేత రక్షింపబడ్డారు. ఆ మహాత్ముని చేత బ్రహ్మ వరాన్ని పొందిన దైత్యులు కూడా చంపబడ్డారు. అనఘా! వశిష్ఠుడు చేసిన అద్భుత కార్యాన్ని నీకు చెప్పాను. నేనడుగు తున్నాను. వసిష్ఠునికంటె గొప్ప క్షత్రియుడుంటే నువ్వు చెప్పు."

156. అత్రి చ్యవన మహర్షుల ప్రభావము.

భీష్ముడిలా అన్నాడు. "ఈ విధంగా వాయువు చెప్పింది విని కార్తవీర్యార్జునుడు మారుపలకలేదు. "హైహయవంశ శ్రేష్ఠుడా! మహాత్ముడైన అత్రిమహర్షి గొప్పతనాన్ని చెప్తాను విను. ఒకప్పుడు దేవదానవులు చిమ్మచీకటిలో యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో

రాహువు సూర్య చంద్రులను గాయపరిచాడు. రాజశ్రేష్ఠ! చీకట్లో కూరుకుపోయిన దేవతలు బలవంతులయిన దానవులచే చంపబడుతున్నారు. అసురులచే బాధింప బడుతున్న దేవతలు ప్రాణాలు కడబట్టినవారై తపోధనుడు, విప్రుడు అయిన అత్రిమహర్షి తపస్సు చేస్తుండగా చూశారు. జితేంద్రియుడు క్రోధరహితుడు అయిన అత్రి మహర్షితో దేవతలిలా అన్నారు. 'మహర్షీ! లోకానికి వెలుగిచ్చే సూర్యచంద్రులిద్దరూ అసురులచేత గాయపరచబడ్డారు. లోకమంతా చీకట్లు కమ్మినవేళలో మేమంతా అసురులచేత బాధింపబడుతున్నాం. మాకు శాంతిలేదు. ప్రభో! ఈ భయాన్నుండి మమ్మల్ని రక్షించండి.' అత్రి మహర్షి అన్నాడు! "దేవతలారా! నేను మిమ్మల్ని ఏమి చేసి రక్షించాలి ?" దేవతలన్నారు. "నీవు సూర్యచంద్రుల రూపాన్ని ధరించాలి. దేవతలిలా అనగానే అత్రిమహర్షి చీకట్లను పారద్రోలే చంద్రుని రూపాన్ని పొందాడు. ప్రసన్న భావంతో చంద్రుని లాగానే ప్రియదర్శనుడయ్యాడు. రాజా! చంద్రుడంత కాంతి మంతుడు కాదని భావించి, అత్రి తన తపః ప్రభావంతో యుద్ధరంగంలో సూర్యుని రూపాన్ని ధరించి లోకాన్ని ప్రకాశవంతం చేశాడు. చీకట్లు పారద్రోలాడు. దేవతలకు శత్రువులయిన దానవ సంఘాలను తన తేజస్సుతో దహించేశాడు. అత్రిచే దమింపబడుతున్న మహాసురులను చూస్తూ దేవతలు అత్రి రక్షితులై పరాక్రమించే అసురుల్ని సంహరించారు. సూర్యుడు ప్రకాశించాడు. దేవతలు రక్షింపబడ్డారు. దానవులు చంపబడ్డారు. రాజర్షీ! కేవలం ఫలాహారి అయిన అత్రిమహర్షి ఇంత పని చేశాడు. మహాత్ముడయిన అత్రిమహర్షి చేసిన అద్భుతం నీకు చెప్పాను. నేనడుగుతున్నాను. ఇంతకంటే గొప్పక్షత్రియుని చెప్పు." దాన్ని విన్న అర్జునుడు తిరిగి సమాధానమివ్వలేదు. అప్పుడు వాయుదేవుడిలా అన్నాడు. "రాజా! చ్యవన మహర్షి చేసిన గొప్ప కార్యాన్ని చెప్తాను, విను. చ్యవన మహర్షి అశ్వినులు కూడా సోమపాన భాగాన్ని పొందేటట్లు చెయ్యమని చెప్పాడు. ఇంద్రుడన్నాడు "మాకు అశ్వినులు నింద్యులు, వారు సోమపానం ఎలా చేస్తారు ? వారు దేవతల సాటివారు కారు. కనుక నీ వివిధంగా అడగవద్దు. మహావ్రత! అశ్వినులతో కలిసి మేము సోమపానాన్ని చెయ్యటానికిష్టపడము. ఇది కాక మరేమిచెప్పినా నీమాటను పాటిస్తాను." "సురాధిపా ! వారిద్దరూ సూర్యపుత్రులు, దేవతలే ఈ అశ్వినులు. మీ అందరితోపాటు సోమపానం చెయ్యటానికి అర్హులే. దేవతలారా! నేను చెప్పినట్లు మీరు చెయ్యండి. ఇలా చేస్తే మీకు మేలు జరుగుతుంది. ఇలా చెయ్యపోతే మీకు శుభం జరుగదు." ఇంద్రుడన్నాడు. "విప్రోత్తమా ! ఈ అశ్వినులతో కలిసి నేను సోమాన్ని త్రాగను. ఇతర దేవతలు త్రాగితే త్రాగవచ్చు. నేను మాత్రం దానికి సమ్మతించను."

చ్యవనుడన్నాడు. "బలసూదన! నేను చెప్పింది నువ్వు చెయ్యకపోతే నేనే ఆ పనిని యజ్ఞంలో మంత్రపూర్వకంగా నీచేత బలాత్కారంగా చేయిస్తాను." వాయువు చెప్పాడు. "వెంటనే అశ్వినులమేలుకోసం చ్యవనునిచేత గొప్ప యజ్ఞం ప్రారంభింపబడింది. వేదమంత్రాలతో దేవతలంతా బలాత్కరింపడ్డారు. ప్రారంభింపబడ్డ యజ్ఞాన్ని చూసి దేవేంద్రుడు క్రోధావిష్టుడై ఒక పెద్ద కొండను ఎత్తి చ్యవనుని మీదకు లంఘించాడు. తపశ్శాలి అయిన చ్యవన మహర్షి కోపంతో ఎర్రబడిన కన్నులు కలవాడై వజ్రంతో సహా మీదకు వస్తున్న ఇంద్రుడిని చూసి నీళ్ళుచల్లి, వజ్రాయుధపర్వతాలతో సహా ఇంద్రుని స్తంభింపజేశారు. అంతేకాకుండా ఇంద్రుడికి అతి భయంకరుడైన గొప్ప శత్రువుని సృష్టించాడు. ఆ మహాముని మదము అనే పేరు గల్గిన ఆహుతి స్వరూపుడని వానిని సృష్టించాడు. వాడికి వంద యోజనాలు వ్యాపించిన వేయిదంతాలున్నాయి. అతడి కోరలు పరమ భయంకరమైనవి. రెండువందల యోజనాలు వ్యాపించినవి. అతని ముఖం స్వర్గంలో ఉంటే దవడలు భూమి మీద ఉన్నాయి. సమస్త దేవతలు ఇంద్రునితో సహా అతని జిహ్వామూలంలో ఇమిడిపోయారు. వారంతా మహా సముద్రంలో తిమింగలం నోట్లో పడ్డ చేపల్లా ఉన్నారు. అప్పుడు దేవతలందరూ మాట్లాడుకొని అందరూ కలిసి దేవేంద్రునితో ఇలా అన్నారు. "ఇంద్రుడా! ఈ చ్యవన మహర్షికి నమస్కరించు. మనమందరం అశ్వినులతో కలిసి సోమరసం త్రాగుదాం. ఏ ఆపదా రాకుండా ఉందాం" అప్పుడు ఇంద్రుడు చ్యవనమహర్షికి నమస్కరించాడు. ఆయన చెప్పినట్టే చేశాడు. చవ్యవనమహర్షి, అశ్వనీ దేవతలను సోమపానం పొందేటట్లు చేశాడు. తరువాత ఆమదాన్ని అనేక చోట్ల ఉండేటటట్లుగా విభిజించాడు. పాచికలు, వేట, మద్యం, స్త్రీలు వీరున్నచోట నియమించాడు. రాజా! ఈ దోషాలున్నవారు నశించిపోతారు కనుక నరుడు ఈ దోషాలు తన దగ్గర లేకుండా చూసుకోవాలి. రాజా! చ్యవన మహర్షి చేసిన కార్యాన్ని నీకు వివరించాను. నేనడుగుతున్నాను. ఇంతకంటే శ్రేష్ఠుడయిన క్షత్రియుని గురించి తెలిస్తే చెప్పు.

157. బ్రాహ్మణులు స్వర్గమాక్రమించిన కపులను బూడిద చేయుట.

అర్జునుడు మౌనంగా ఉండిపోయాడు. మళ్ళీ వాయుదేవుడిలా అన్నాడు. 'రాజా! బ్రాహ్మణులే చేసిన మరొక ముఖ్యకార్యం చెప్తాను. విను. ఇంద్రుడు, సమస్త దేవతలు మదుని నోటికి చిక్కినప్పుడే చ్యవనునిచేత వసుంధర హరించబడింది. రెండులోకాలూ అపహరింపబడ్డాయని భావించే దేవతలు పరమ దుఃఖితులై, శోకావిష్టులై మహోత్ముడైన

బ్రహ్మదేవుని శరణువేడుకొన్నారు. దేవతలన్నారు. "మేము మదుని ముఖంలో ఉండిపోయినప్పుడు భూమిని చ్యవనుడు అపహరించాడు. స్వర్గాన్ని కపులు ఆక్రమించారు." బ్రహ్మ అన్నాడు! "ఇంద్రసహితుడైన దేవతలారా! మీరు విప్రులను శరణు పొందండి. వారిని అనునయించి, పూర్వంలాగే రెండు లోకాలను పొందండి." ఇంద్రుడు దేవతలు విప్రులను శరణు వేడారు. వారన్నారు "ఎవర్ని జయించాలి ?" అని, దేవతలు కపులను జయించమన్నారు. బ్రాహ్మణులు భూమి మీద ఉన్న కపులను జయిస్తామని చెప్పారు. తర్వాత బ్రాహ్మణులు కపి నాశనాన్ని కోరియజ్ఞం ప్రారంభించారు. ఆది విన్న కపులు బ్రాహ్మణుల వద్దకు ధని అనే దూతను పంపారు. ఆ ధని బ్రహ్మణులను సమీపించి కపులు చెప్పిన మాటలు చెప్పాడు. 'అయ్యా! కపులందరూ మీవంటివారే ! భేదం లేదు. అందరూ వేదవిదులే ప్రాజ్ఞులే. అందరూ యజ్ఞాయాగాలు చేసేవారే. కపులందరూ సత్యవ్రతులే. అందరూ మహర్షి సములే. వారియందు లక్ష్మి నివసిస్తుంది. వారు కూడ లక్ష్మిని నిలబెట్టుకొంటారు. కపులు ప్రయోజనం లేకుండా భార్యల చెంతకు చేరరు. వృధాగా మాంసాన్ని తినరు. అగ్నికి హోమం చేస్తారు. గురువు చెప్పిన మాటను నెరవేరుస్తారు. అందరూ ఆత్మనిగ్రహం కలవారే. బాలురకు భాగమిచ్చేవారే. సమీపించి మెల్లగా నడుస్తారు. రజస్వలతో భోగించరు. స్వర్గాన్ని చేరుకొంటారు. ఎప్పుడూ శుభకర్మలు చేస్తుంటారు. గర్భిణులు, వృద్దులు తినకుండా భోజనం చేయరు. పగటి ముందు భాగంలో జూడమాడరు. పగలు నిద్రించరు. ఇవేకాక ఇంకా ఎన్నో గుణ గణాలున్న కపులను జయించాలని ఎందు కనుకొంటున్నారు ? ఈ ప్రయత్నం మానండి ! అప్పుడు మేము సుఖంగా ఉంటాం." బ్రాహ్మణులన్నారు. "కపివంశాన్ని జయిస్తాం. ఎందుకంటే దేవతలకూ, మాకూ తేడాలేదు. కనుక కపులు మాకు వధింపదగ్గవారే. ధనీ ! నీవు వచ్చినట్లుగానే తిరిగివెళ్ళు." ధని వెళ్లి కపులకు చెప్పాడు. 'ఈ విప్రులు మనకు ప్రియం చేయరు.' అప్పుడు కపులు ఆయుధాలు ధరించి, విప్రుల మీదకు దండెత్తారు. గొప్ప ధ్వజాలతో వస్తున్న కపుల్ని చూసి విప్రులందరూ కపుల ప్రాణాల్ని హరించే అగ్నులను వారి మీదకు వదిలారు. రాజా! బ్రాహ్మణులు సృష్టించిన ఆ సనాతనాగ్నులు కపులను చంపి, ఆకాశంలో మేఘాలవలె ప్రకాశించాయి. దేవతలందరూ కలిసి యుద్ధ రంగంలో దానవులందరినీ సంహరించారు. కాని బ్రాహ్మణులచేత కపులు సంహరింపబడ్డ రన్న విషయం వారికి తెలియదు. విభో! అపుడు తేజశ్శాలి అయిన నారదమహర్షి దేవతలను సమీపించి బ్రాహ్మణులచేత కపులు సంహరింపబడ్డ విషయాన్ని వర్ణించి చెప్పాడు. నారదుని మాటలు విన్న దేవతలందరూ పరమానంద

భరితులయ్యారు. కీర్తిమంతులయిన బ్రాహ్మణులను, ద్విజులను మిక్కిలిగా ప్రశంసించారు. అప్పుడు దేవతల తేజస్సు, బలం బాగా పెరిగింది. వారు ముల్లోకాల్లోను పూజింపబడే అమరత్వాన్ని పొందారు.' ఇలా వాయుదేవుడు చెప్పిన మాటలన్నీవిన్న కార్తవీర్యార్జునుడు వాయువుతో ఇలా అన్నాడు. 'యుధిష్ఠిరా! అర్జునుడు వాయువును సమ్మానించి చెప్పిన మాటలు చెప్తాను విను. అర్జునుడన్నాడు "ప్రభో! నేను ఎల్లవేళలా బ్రాహ్మణుల ప్రయోజనం కోసమే జీవిస్తాను. నేను బ్రాహ్మణ భక్తుడను. నిత్యం బ్రాహ్మణులకు నమస్కరిస్తాను. దత్తాత్రేయుని అనుగ్రహం వల్లే నాకీ గొప్ప బలం వచ్చింది. లోకంలో గొప్ప కీర్తి వచ్చింది. గొప్ప ధర్మాన్ని నెరవేర్చగల్గుతున్నాను. వాయుదేవా! నీవు చెప్పిన అద్భుతమయిన బ్రాహ్మణకార్యాలన్నీ పరిపూర్ణంగా శ్రద్ధగా విన్నాను.' వాయువన్నాడు. 'రాజా! నీవు క్షేత్రదర్శనంలో బ్రాహ్మణులను, ఇంద్రియాలనూ అన్నివేళలా రక్షించుకుంటూ ఉండు. అయినా నీకు భృగువంశీయులవల్ల తీవ్రమయిన భయం కాలాన్ని బట్టి వస్తుంది.

158. కృష్ణుని మహిమను వర్ణించుట

యుధిష్ఠిరుడడిగాడు. 'రాజా! వ్రతనిష్ఠలయిన బ్రాహ్మణులను నీవు నిత్యం పూజిస్తుంటావు. ఏరకమయిన అభ్యుదయం కోసం నీవిలా చేస్తున్నావు ? మహావక్తా! బ్రాహ్మణ పూజవల్ల భవిష్యత్తులో ఏ శుభం కల్గుతుందని ఆశిస్తున్నావు ? మహాబాహు! దాన్నంతటినీ నాకు వివరించు." భీష్ముడు చెప్తున్నాడు. 'రాజా ! మహాబుద్ధిశాలి ఈ కేశవుడు మహావ్రతుడు. బ్రాహ్మణపూజవల్ల భవిష్యత్తులో లభించే అభ్యుదయాన్ని గూర్చి సమస్తం చెప్పగలడు. నా బలం, వాక్కు, చెవులు, మనస్సు, నేత్రాలు, విశుద్ధమయిన విజ్ఞానం అన్నీ నాకు తెలియచేస్తున్నాయి. అనతి కాలంలోనే నాశరీరాన్ని విడిచి పెట్టడం జరుగుతుంది. నేడు సూర్యుడు అధిక వేగంగా నడవటం లేదు. పార్థా! రాజా పురాణాల్లో చెప్పిన గొప్ప ధర్మాలు విప్రులు, క్షత్రియులు, వైశ్యులు శూద్రులు, ఉపాసించే ధర్మాలు నేను చెప్పాను. మిగిలిన వాటిని నీవు కృష్ణుని నుండి విను. నేను ఈ కృష్ణుని యధార్థ తత్వాన్ని ఎరిగిన వాడను. ఈయన ఎవరో, ఈయన ప్రాచీనమైన బలమెంతో, ఈయన ఎంతగా కొలతకందని మహాత్ముడో, కౌరవేంద్రా! నాకు తెలుసు. ఈయన నీ సమస్త సందేహాలు తీరుస్తాడు. ఈకృష్ణుడే భూమిని, ఆకాశాన్ని స్వర్గాన్ని సృజించాడు. కృష్ణుని దేహం నుండే భూమి పుట్టింది. భీమబలుడయిన ఆదివరాహ మీయనయే. పర్వతాలను, దిక్కులను సృష్టించిన దీయనయే. ఈయన క్రిందనే అంతరిక్షం, స్వర్గం, నాలుగు

దిక్కులు, నాలుగు విదిక్కులు ఉన్నాయి. ఈయన చేతనే సమస్త సృష్టి చేయబడింది. అతిప్రాచీనమయిన ఈ విశ్వాన్ని నిర్మించిన దీయనయే. ధర్మజా! పూర్వమీయన నాభినుండే పద్మ ముద్భవించింది. దాన్నుండి మహాప్రభావశాలి బ్రహ్మ వ్యక్తమయ్యాడు. అతడు ఘోరాంధకారాన్ని నశింప చేశాడు. ఆ అంధకారం సముద్రం ఆవలి వరకు వ్యాపించే ఉండేది. కృతయుగంగలో ధర్మం పరిపూర్ణంగా ఉండేది త్రేతాయుగంలో అది పూర్ణజ్ఞాన రూపంలో ఉంది. రాజా! ద్వాపర యుగంలో ధర్మబలం కృష్ణరూపంలో ఉంది. కలియుగంలో అధర్మమే భూమిమీద ఉండబోతున్నది. ధర్మజా! పూర్వం కృష్ణుడే దైత్యుల నందరినీ చంపాడు. ఆయనయే దేవతలకు పూర్వుడయిన బలి చక్రవర్తిగా ఉన్నాడు. ఈయనయే సమస్త ప్రాణి రక్షకుడు. ఈయనయే విశ్వానికి ఆత్మ, రక్షకుడు. ధర్మం నశించినప్పుడు కృష్ణుడే దేవతల్లోను, మనుష్యుల్లోను జన్మిస్తాడు. తాను ధర్మబద్దంగా ఉండి, ఆత్మవంతుడై పరాపరలోకాలను రక్షిస్తాడు. పార్థా ! విడిచిపెట్టదగిన దాన్ని కృష్ణుడు విడిచిపెడతాడు. అసురుల్ని నశింప చేస్తాడు. ఈయనయే కార్యం, కారణమూ కూడా. భూతభవిష్యద్వర్తమానరూపుడు. రాహువు, చంద్రుడు, ఇంద్రుడు, కూడా ఈయనయే. రాజా! ఈయన విశ్వరక్త, ఆయన విశ్వరూపుడు, విశ్వలయకర్త. విశ్వవిజేత. ఆయన శివుడు, శూలాన్ని, శోణి త కపాలాన్ని ధరించినవాడాయనయే. తన పనుల ద్వారా ప్రపంచ ప్రఖ్యాతినొంది పొగడబడువాడే ఈయన. రాజా! గంధర్వులు అప్సరసలు, విబుధులు నిత్యం వందల్లో ఈయననే సేవిస్తుంటారు. రాక్షసులు ఈయనను సంప్రదిస్తారు. ధనరక్షకుడు విజేత ఈయన. ఈయననే యజ్ఞంలో స్తుతిపారకులు స్తుతిస్తారు. సామ గాన కోవిదులు రథన్తర సామాలద్వారా ఈయననే స్తుతిస్తారు. ఆయననే బ్రాహ్మణులు వేదమంత్రాలో ప్రశంసిస్తారు., అధ్వర్యువులు హవిస్సులర్పిస్తారు. భారతా! ఈయన పురాతనమైన బ్రహ్మగుహను ప్రవేశించి, భూమిని కులంబులయ మొందిన దానినిగా దర్శించాడు. ఈయన శ్రేష్ఠకర్ముడు, దైత్య దానవోరగులను జయించి భూమినుద్ధరించిన వాడీయనయే. భారతా! వ్రజభూమిరక్షణకు గోవర్ధనపర్వతాన్నెత్తినపుడు ఇంద్రాది దేవతలాయననే ప్రస్తుతించారు. సమస్త పశువులకు అధిపతి ఈయన. ఈయనయే నానావిధ భక్ష్యాలు నివేదింపబడతాయి. ఆయనయే రణరంగంలో వాహనరూపుడు. శాశ్వతుడయిన ఆయన ఆధీనంలోలోనే అంతరిక్షం, భూమి స్వర్గమూ ఉన్నాయి. ఆయననయే కుంభమందు వీర్యాన్నుంచి వశిష్ఠ మహర్షిని సృష్టించాడు. ఆయనయే వాయుదేవుడు, ప్రభువు అశ్వమూ, సర్వవ్యాపకుడు, రశ్మిమంతుడైన సూర్యుడు. ఆదిదేవుడ ఆయన చేతనే సమస్త అసురులు

జయింపబడ్డారు. ఆయన పరాక్రమం వల్లే ముల్లోకాలు జయింపబడ్డాయి. ఈ శ్రీకృష్ణుడే దేవతల మనుష్యుల, పితృదేవతల ఆత్మ స్వరూపుడు. యజ్ఞవిదు లాయనే యజ్ఞమని పిలుస్తారు. ఆయనే కాలాన్ని రాత్రింబవల్లుగా ఉత్తర దక్షిణాయనాలుగా విభజించాడు. ఆయన కిరణాలే పైన క్రింద అడ్డంగా ప్రకాశిస్తుంటాయి. ఈయనయే భూమిని ప్రకాశింపచేసేవాడు. వేదవిదులైన బ్రాహ్మణులాయననే సేవిస్తారు. ఆయన కాంతివల్లే సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఆ యజ్ఞకర్త కృష్ణుడు ప్రతిమాసం యజ్ఞమాచరిస్తాడు. ప్రతి యజ్ఞంలోను, బ్రాహ్మణులతనినే స్తుతిస్తారు. ఇతడే మూడు నాభులు, మూడు ధామాలు, సప్తాశ్వాలున్న కాల చక్రాన్ని ధరిస్తాడు. పార్థ! ఆయన మహాతేజస్వి, సర్వవ్యాపకుడు, సర్వసహుడు. ఆయనొక్కడే సమస్తలోకాలను నిలబెడతాడు. నీవీ కృష్ణునే అంధకార నాశకునిగా సమస్తానికీ కర్తగా గ్రహించు. మహాత్ముడై ఒకసారి అగ్నిరూపుడై ఖాండవవనాన్ని దహించి, పూర్ణ తృప్తిని పొందినవాడు. సర్వవ్యాపకుడై రాక్షసుల్ని నాగుల్ని జయించి, సర్వాన్నీ అగ్నికి ఆహుతి చేసినవాడు. ఆయనయే అర్జునునికి తెల్లని గుర్రాలిచ్చాడు. అశ్వాలనే కాదు సర్వాన్నీ సృష్టించిన వాడాయనయే. ఆయనయే సంసారరథాన్ని బంధించినవాడు. సత్త్వరజస్తమస్సులే ఆ రథానికి చక్రాలు. దీనిగమనం పైకి, క్రిందకు, మధ్యకు ఏర్పడుతుంది. కాలం, అదృష్టం, ఇచ్ఛ సంకల్పాలు నాలుగుగుర్రాలు. తెల్లని నల్లని ఎర్రని కర్మలే నాభులు, ఈ సంసార రథం శ్రీకృష్ణుని ఆధీనం. పంచభూతాశ్రయుడైన కృష్ణుడే ఆకాశాన్ని సృజించాడు. భూమిని, స్వర్గాన్ని, అంతరిక్షాన్ని, అరణ్యాల్నీ, పర్వతాల్నీ నిర్మించాడు. అమిత దీప్తాగ్ని స్వరూపుడయిన హృషీకేశు డాయనయే. ఆయనయే వజ్రధారియై చంపబోతున్న శుక్రుని సంహరించడానికి అనేక నదులను లంఘించాడు. ఈ మహేంద్రుడే బ్రాహ్మణులచేత యజ్ఞాల్లో వేలకొలది ప్రాచీన ఋక్కులచేత స్తుతింపబడేవాడు. తేజశ్శాలి అయిన దూర్వాసుని తన గృహంలో ఉంచుకోగల్గిన శక్తిశాలి శ్రీకృష్ణుడొక్కడే. రాజా! ఆయన పురాణఋషి, విశ్వకర్త. తన స్వరూపంతోనే సమస్త పదార్థాలు నిర్మించాడు. రాజా! దేవతలకు కూడా దేవుడయినప్పటికీ వేదాల్ని అధ్యయనం చేసినవాడు. ప్రాచీన ఆచారవిధుల్ని పాటించేవాడు. లౌకిక వైదిక కర్మలు, వాని ఫలితాలు శ్రీకృష్ణుడు. అన్నిలోకాల్లోని తెల్లని వెలుగు, ముల్లోకాలు, లోకపాలురు, మూడు అగ్నులు, మూడు వ్యాహృతులు, సమస్త దేవతలు కూడా దేవకీసుతుడే. రాజా! సంవత్సరం, ఋతువు, పక్షం, రాత్రి పగలు, కలలు, కాష్ఠలు, మాత్రలు, ముహూర్తాలు, లవాలు, క్షణాలు, ఇవన్నీ శ్రీకృష్ణుడే అని భావించు. పార్థ! సూర్య చంద్రులు, గ్రహాలు, నక్షత్రాలు తారలు, అమావాస్యలు, పౌర్ణములు,

నక్షత్రయోగాలు, ఋతువులు అన్నీ శ్రీకృష్ణుని నుండి ఉద్భవించినవే. రుద్రులు, ఆదిత్యులు, వసువులు, అశ్వినులు, సాధ్యులు, విశ్వేదేవులు, మరుద్గణాలు, ప్రజాపతి, దేవమాత అదితి, సప్తర్షులు అందరూ కృష్ణుని నుండి ప్రభవించినవారే. కృష్ణుడే వాయువుగా ఉండి ప్రపంచానికి స్పందననిస్తాడు. అగ్నియై విశ్వాన్ని దహిస్తాడు. విశ్వరూపుడు. నీరుగా ఉండి సమస్తాన్ని ముంచేస్తాడు. బ్రహ్మయై అంతటినీ సృష్టిస్తాడు. కృష్ణుడే స్వయంగా వేద్యుడు అయినా వేదాల ద్వారా తత్వాన్ని తెలుసుకొంటాడు. వివిధరూపుడై ఉండి కర్మల నాచరిస్తాడు. ధర్మం, వేదం, బలం వీటిలో ఉంటాడు. ఈ చరాచరజగత్తు కృష్ణ స్వరూపమే. విశ్వరూపుడయిన కృష్ణుడే వెలుగై సూర్యుడుగా తూర్పున ఉదయిస్తాడు. విశ్వాన్ని ప్రకాశింప చేస్తాడు. సర్వప్రాణి కారణుడయిన ఇతడే నీతిని సృజించి, మిగిలిన విశ్వాన్ని సృష్టించాడు. ఋతువులు, ఉత్పాతాలు, అద్భుత పదార్థాలు, మేఘాలు, మెరుపులు ఐరావతం, సమస్త చరాచర జగత్తు కృష్ణుని నుండే ఉద్భవించింది. సమస్త విశ్వానికి ఆత్మ విష్ణువు. కృష్ణుడే విశ్వానికి నివాస స్థానం, గుణరహితుడు ఈ వాసుదేవుడే. జీవ సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధరూపాల్ని ధరించాడు. అకారణుడై అంతటినీ ఆజ్ఞాపిస్తాడు. పార్థ! దేవ, అసుర, మనుష్య, పితృ పశుపక్ష్యాది రూపమయిన పంచవిధ జగత్తును నిర్మింప దలచి, పంచభూతాలను ప్రేరేపించాడు. భూమి, వాయువు, ఆకాశం, నక్షత్రాలు, నీరు సృష్టించాడు. కృష్ణుడే జరాయుజాదిరూపంగా నాల్గువిధాలైన, స్థావర జంగమాత్మకమయిన ఈలోకాన్ని సృజించాడు. చతుర్విధ ప్రాణి సమూహం, కర్మ అనే ఐదు బీజాలున్న భూమిని నిర్మించాడు. ఆకాశరూపుడై భూమిమీద గొప్పవర్షం కురిపించాడు. రాజా! ఆయన చేతనే ఈ విశ్వం చెయ్యబడింది. తనకు తానే కారణమయిన కృష్ణుడే అన్నిటినీ జీవింపచేస్తున్నాడు. దేవతలు, అసురులు, మానవులు, లోకాలు, ఋషులు, పితరులు, ప్రజలు, అందరూ ఆయనవలె జీవిస్తారు. అన్నిలోకాల్ని విధి విధానంతో సృజించే భూతపతి తానే. రాజా! శుభాశుభాలు, చరాచరాలు అన్నీ విష్వక్సేనుని నుంచి వచ్చినవే. ఇప్పుడున్నది రేపు రాబోయేది కేశవుడే. ప్రాణుల అంతకాలంలో కృష్ణుడే మృత్యురూపుడవుతాడు. కృష్ణుడే శాశ్వతుడయిన ధర్మరక్షకుడు. ఈ ప్రపంచంలో వాసుదేవుని నుండి వెలువడని ప్రాణి ఏదీ లేదు. అంతా వాసుదేవ సంభవమే. ఈ లోకంలో ఏది ప్రశస్తమో, పవిత్రమో, శుభమో, అశుభమో అదంతా కేశవుడే, అయన అచింత్యుడు. ఆయనకు భిన్నమయినదాన్ని భావించటం విపరీతబుద్ధి. కేశవు డింతటివాడు. ఆయనయే నారాయణుడు, పరముడు, నాశరహితుడు. జగత్తుకు ఆదిమధ్యాంతాలు, పుట్టబోయే వారి జన్మకు కారణం, అవికారి అయిన పరమాత్మ తానే.

159. దుర్వాసుని చరిత్రము.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "మధుసూదనా! బ్రాహ్మణ పూజవల్ల లభించే అభ్యుదయాన్ని గూర్చి చెప్పు. ఈ విషయం నీవు చక్కగా తెలిసినవాడవు. నాతాత భీష్ముడు కూడా అలాగే చెప్పాడు. వాసుదేవుడిలా అన్నాడు. "కురుశ్రేష్ఠా ! ధర్మారాజా! భరతసత్తమా ! ద్విజుల గుణాలను యథార్థంగా చెప్తాను. శ్రద్ధగా విను. పూర్వం ఒకపుడు ద్వారవతీ నగరంలో చక్కగా కూర్చొని ఉన్న నన్ను బ్రాహ్మణులచే కోపింపబడి ప్రద్యుమ్ను డీ విధంగా అడిగాడు. 'మధుసూదన! బ్రాహ్మణులను పూజిస్తే లభించే ఫలితం ఎలాంటిది ? ఇహపరాల్లో బ్రాహ్మణులు ఎందుకు శ్రేష్ఠులుగా చెప్పబడుతున్నారు ? మానవా! ఎల్లవేళలా విప్రులను పూజించటంవల్ల ఏం ఫలం లభిస్తుంది ? ఈ విషయంలో నాకు గొప్ప సందేహం ఉన్నది. దీన్నంతటినీ నాకు స్పష్టంగా చెప్పు.' మహారాజా! ఇలా ప్రద్యుమ్నుడు నన్ను అడిగినప్పుడు నేను చెప్పిన సమాధానాన్నే మళ్ళీ చెప్తాను. నీవు ఏకాగ్రతతో విను. 'ప్రద్యుమ్నా! బ్రాహ్మణ పూజలవల్ల లభించే అభ్యుదయాన్ని గూర్చి చెప్తాను విను. వీరు రాజైన చంద్రుని వంటివారు. ఇహపరాల్లో సుఖ దుఃఖాలను ఇవ్వటానికి సమర్థులు. రుక్మిణీ పుత్ర! ఇహపరాల్లో బ్రాహ్మణుని వంటి శాంత స్వభావుడు మరొకడు లభించడు. ఇందులో సందేహంలేదు. బ్రాహ్మణులను పూజించటం వల్ల ఆయువు, కీర్తి, యశస్సు, బలం పెరుగుతాయి. అన్నిలోకాలు, లోకాధీశ్వరులు అందరూ కూడా బ్రాహ్మణులను పూజించే వారే.

ధర్మార్థకామాలు, మోక్షం, యశస్సు, లక్ష్మి పూజ, రోగశాంతి, దేవపూజ, పితృపూజల సమయాల్లో మనం బ్రాహ్మణులను సంతోషింపచేయాలి. పుత్రుడా! నేను ప్రభువునని వారిని గౌరవించకుండటం తగదు. మహాబాహూ ! ద్విజుల విషయంలో కోపం పనికిరాదు. ఈ లోకంలోను, పరలోకంలోను కూడా బ్రాహ్మణులే గొప్పప్రాణులు. అన్నిటినీ ప్రత్యక్షంగా దర్శించగల వీరు కోపిస్తే లోకాన్ని భస్మం చేయగలరు. క్రొత్తలోకాలను లోకపాలకులకును సృజింప సమర్థులు, గొప్ప తేజోవంతులయిన వారిని గూర్చి తెలిసినవారు వారిపట్ల వినయంతోనే ఉంటారు. నాయనా! నా ఇంట్లో ఒకప్పుడు హరితపింగల వర్ణుడు, నారబట్ట ధరించిన వాడు, మారేడుదండాన్ని ధరించినవాడు, పొడుగు గడ్డాలవాడు, చిక్కిన శరీరమున్న బ్రాహ్మణుడుండే వాడు. ఈ భూమి మీద బాగాపొడవైన వారికంటే ప్రమాణంలో పొడగరి. అతడు స్వేచ్ఛగా మనుష్యలోకంలో, దివ్యలోకాల్లో తిరిగేవాడు. వెళ్లిన ప్రతిచోట, నాల్గురోడ్ల కూడళ్ళలో సభల్లో ఇలా ప్రకటిస్తూ ఉండేవాడు. "దుర్వాసుడనే ఈ బ్రాహ్మణుని సత్కరించి

తన గృహంలో ఉంచుకొనే శక్తి ఎవరికుంది ? అయితే నాకు కోపమెక్కువ, చిన్న అపకారం చేసినా ఎవరి మీదయినా కోపిస్తాను. నా నియమాన్ని అంగీకరించి, ఎవరు నాకు ఆశ్రయం ఇస్తారు? నన్ను అతిధిగా అంగీకరించినవాడు, నా విషయంలో ఎన్నడూ కోపించరాదు. లోకంలో ఎవరూ అతడికి ఆశ్రయం ఇవ్వలేదు. అందువల్ల నేను అతడిని నా ఇంట్లో నివసించమని ప్రార్థించాను. అతడొకసారి వేలమందికి సరిపడే ఆహారాన్ని ఒక్కడే తింటాడు. ఒకప్పుడు చాలా తక్కువ తింటాడు. ఒకప్పుడు ఇంటికి తిరిగిరాడు. అకస్మాత్తుగా పెద్దగా నవ్వుతాడు. హఠాత్తుగా పెద్దపెట్టున ఏడుస్తాడు. ఆరోజుల్లో ఆయనకు సమవయస్కుడు భూమిమీద లేడు. ఒకప్పు డతడు తన విడిది గృహానికి వెళ్లాడు. అక్కడున్న పడక, దాని మీద పరిచిన పరుపులు, అలంకరింపబడిన కన్యలు అందరినీ కాల్చేశాడు. ఎక్కడికో వెళ్లిపోయాడు. అటు తర్వాత వ్రతధారి అయిన ఆ మహాముని తిరిగి వచ్చి కృష్ణా నేను పాయసం తినాలనుకొంటున్నాను. తొందరగా తెప్పించు అన్నాడు. అంతకు ముందే నేను మహర్షి మనస్సును గ్రహించి, ఇంటిలోని వారికి, అన్నాలు, పానీయాలు, తినుబండారాలు రకరకాల పదార్థాలు సిద్ధంగా ఉంచమని చెప్పాను. ముందే చెప్పాను. కనుక సిద్ధంగా బాగా వేడిగా ఉన్న పాయసాన్ని అతడికి నివేదించాను. అతడు దాన్నంతా త్రాగాడు. వెంటనే ఈ పాయసం నా శరీరావయవాలన్నిటికీ రాసుకో అని ఆజ్ఞాపించాడు. నేనేమీ ఆలోచించుకోకుండానే ఆయన చెప్పిన దాన్ని యథాతథంగా చేశాను. అతడు ఎంగిలి చేసిన పాయసాన్ని సమస్త శరీరానికి శిరస్సుకు బాగా పూసుకొన్నాను. ఆ సమయంలో ప్రక్కనే ఉన్న నీతల్లి అందమైన రుక్మిణిని ఆ మహర్షి చూశాడు. చిరునవ్వుతో ఉన్న ఆమె శరీరానికి కూడా పాయసం పట్టించాను. ఆ మహర్షి పాయసం పూయబడిన రుక్మిణిని రథానికి కట్టాడు. ఆ రథమెక్కి నా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అగ్ని వర్ణుడయిన బుద్ధిమంతుడు, ఆ మహర్షి, రథానికి గుర్రంలా కట్టబడిన బాలిక రుక్మిణిని, నేను చూస్తుండగానే చెర్నాకోలాతో బాదాడు. ఆ సమయంలో అసహనం వల్ల వచ్చే దుఃఖం నాకు ఈషణ్మాత్రమూ కలుగలేదు. అతడు అలాగే రాజమార్గంలో బయటకు ప్రయాణించాడు. దాన్ని చూసి యాదవులందరూ కోపించారు. ఆశ్చర్యపోయారు. కొంతమంది పరస్పరం ఇలా మాట్లాడుకోవటం ప్రారంభించారు. ఇతడు బ్రాహ్మణుడే అయి ఉంటాడు. ఇతర వర్ణం వాడు కాడు. ఇలాంటి రథాన్ని ఎక్కిన మరొక పురుషుడు ఎలా బ్రతికి ఉంటాడు ? కాల సర్పవిషం చాలా భయంకరం. అంతకంటే ద్విజుడు ఉగ్రుడు. బ్రాహ్మణ సర్పంచే కాటు వేయబడ్డవానికి లోకంలో చికిత్సకు దుండడు. ఆ

మహర్షి అలా ప్రయాణిస్తుండగామార్గంలో రుక్మిణి కొంచెం తొట్రుపడింది. శ్రీమంతుడయిన ఆముని దాన్ని సహించలేదు. వేగంగా వెళ్ళమని తొందరచేశాడు. తర్వాత ఆ బ్రాహ్మణుడు మిక్కిలిగా కోపించి, రథంనుంచి దిగి పోయాడు. కాళ్ళతో నడుస్తూ రాజమార్గం వదలి దక్షిణాభిముఖంగా వెళ్లిపోయాడు. ఆ విధంగా ప్రక్క దారిలో పోతున్న ఆబ్రాహ్మణుని వెంట నేను కూడా పరుగెత్తాను. పాయసం పూసుకుని ఉండి కూడ 'భగంతుడా అనుగ్రహించు' అంటూ ప్రార్థిస్తూన్నాను. తర్వాత ఆ తేజస్వి అయిన బ్రాహ్మణుడు నన్నుచూసి, ఇలా అన్నాడు. 'కృష్ణ! మహాభుజ! నీవు స్వభావ సిద్ధంగానే కోపాన్ని జయించావు. సువ్రతుడా! నీవు నాపట్ల చేసిన అపరాధ మేదీలేదు. గోవిందుడా! నీపట్ల ప్రసన్నుడనయ్యాను. నీకు కావలసిన కోరికలు కోరుకో ! నాయనా! నేను ప్రసన్నుడ నయ్యాను. దీనివల్ల లభించే అభ్యుదయాన్ని చూడు. ఈ ప్రపంచలో మనుష్యులకు అన్నంపట్ల ఆసక్తి ఉన్నట్లే నీమీదా భక్తిభావ ముంటుంది. అంతకాలమూ పుణ్యలోకాల్లో నీకీర్తి ప్రకాశిస్తుంది. అంత వరకు ముల్లోకాల్లో నీవు ప్రత్యేకతను పొందుతావు. జనార్దనా! అన్నిలోకాలవారికి ఇష్టుడవవుతావు. నీకు సంబంధించి ముక్కలయింది, తగలబడింది, నశించి పోయింది, ఏది ఉన్నా సరే. జనార్దనా! అంతా పూర్వమున్నట్లే ఉంటుంది. లేదా అంతకంటే గొప్పగా ఉంటుంది. మధుసూదన! ఈ పాయసాన్ని నీ శరీరమంతా పూసుకొన్నావు. కనుక నీకు మృత్యుభయంలేదు. అచ్యుతా! నీవు కొరుకొన్నపుడే మృత్యువు వస్తుంది. పుత్రకా! నీవు అరిపాదాలకు పాయసాన్ని ఎందుకు రాసుకోలేదు? ఇదినాకు రుచించలేదు' అని నాతో సంతృప్తిగా అన్నాడు. ఆయన అలా చెప్పగానే నాశరీరం ఎంతో కాంతిమంతం కావటం చూశాను. ఆయన రుక్మిణితో అన్నాడు. 'స్త్రీలందరిలో నీవు గొప్ప కీర్తిని పొందుతావు. నీకు వార్ధక్యం రోగం, రంగుతగ్గటం ఏమీ ఉండవు. ఎప్పుడూ ఇలాగే ఉంటావు. నీవు పవిత్రమైన సువాసనలు కల్గి శ్రీకృష్ణుని సేవిస్తూ ఉంటావు. కేశవుని పదహారు వేలమంది భార్యలలో నీవు శ్రేష్ఠురాల వవుతావు. ఎప్పటికీ భర్త ఉన్న లోకంలోనే నివసిస్తావు.' ఇలా రుక్మిణితో 'గొప్ప తేజస్సు కల దుర్వాస మహర్షి అగ్నిలా ప్రకాశిస్తూ బయలుదేరి 'కేశవా! నీకు బ్రాహ్మణులపట్ల ఎప్పటికీ ఇలాంటి గౌరవమే ఉండాలి!' అన్నాడు. పుత్రా! ఇలా చెప్పి ఆమహర్షి ఆక్కడే అదృశ్యుడయిపోయాడు. ఆయన అంతర్ధానం కాగానే నేను ఈ వ్రతాన్ని రహస్యంగా ఆచరిస్తున్నాను. బ్రాహ్మణుడు ఏమి చెప్పినా సరే! దాన్ని తప్పక నెరవేరుస్తాను. పుత్రకా! నేను దాన్ని వ్రతంగా స్వీకరించి, పరమానందంగా నీతల్లితోపాటు ఇంటిలో ప్రవేశించాను. ప్రవేశించగానే ఇల్లంతా క్రొత్తగా కనిపించింది. పుత్రకా! ఆ మహర్షి బ్రద్దలు చేసినది,

తగులబెట్టినది అంతా క్రొత్తగానే కనిపించింది. అప్పుడు నేను అన్నీ క్రొత్తగానూ, గట్టిగానూ ఉండటం చూసి ఆశ్చర్యపోయాను. రుక్మిణీ కుమారా! నేనెప్పుడూ మనసా ద్విజులను ఆరాధిస్తూనే ఉంటాను. భరతశ్రేష్ఠా! రుక్మిణి కొడుకు అడిగినప్పుడు ఈ విషయమంతా అనికి చెప్పాను. ద్విజోత్తముడైన దుర్వాసుని గొప్పతనమంతా చెప్పాను. కౌంతేయా! రాజా! అదే రీతిగా నీవు కూడా బ్రాహ్మణులను ఎప్పుడూ పూజించు. మాటలతో, దానాలతో నిత్యము ఆ మహాభాగులను అర్చించు. ఈ విధంగా బ్రాహ్మణానుగ్రహం వలన నేను మహాభ్యుదయాన్ని పొందాను. భరతశ్రేష్ఠా ! నా గురించి ఈ భీష్ముడు చెప్పిన దంతా యథార్థం.'

160. శ్రీకృష్ణుడు శంకరుని మహాత్మ్యమును వర్ణించుట.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. 'మధుసూదనా ! దుర్వాసుని అనుగ్రహం వల్ల నీవు పొందిన విజ్ఞానాన్ని గూర్చి నాకు వివరంగా చెప్పుము. బుద్ధిమంతులలో పరమశ్రేష్ఠుడా! ఆ మహానుభావుని మహాభాగ్యం అతనిపేర్లు, అన్నీ నీ నుండి వినాలని ఉన్నది.' వాసుదేవుడన్నాడు. 'ఆహా! పరమశివునికి నమస్కరించి నీకవన్నీ చెప్తాను. నేను పొందిన శ్రేయస్సు, సంపాదించిన కీర్తి అన్నీ తెలియచెప్తాను. రాజా! నేను ప్రాద్దుటే లేచి, నియమవంతుడనై అంజలి ఘటించి, శతరుద్రీయాన్ని పఠిస్తాను. అందువల్ల నేను చేప్పేది శ్రద్దగా విను. మహాతపస్వి అయిన ప్రజాపతి తపస్సు ముగిశాక శతరుద్రీయాన్ని సృజించాడు. శంకరుడు స్థావర జంగమ ప్రాణులను సృష్టించాడు. మహారాజా! మహాదేవుని కన్నా గొప్ప వ్యక్తి ప్రపంచంలో లేడు. ఈలోకంలోగాని, ముల్లోకాల్లోకాని అతనివంటివాడు లేడు. సమస్త ప్రాణులకు ఆయన ఉత్పత్తి కారణం. మహాత్ముడయిన శంకరుని ముందు ఎవరూ నిలబడలేరు. అతనితో సమానమయినప్రాణి ముల్లోకాల్లోను కన్పించదు. శంకరుడు యుద్ధంలో కోపించినపుడు అతని వాసన తగిలినా కూడా శత్రువులు వణికిపోతారు పడిపోతారు. చచ్చిపోతారు. యుద్ధంలో అయిన గర్జన పరమ ఘోరంగాను, మేఘనాదంలాగాను ఉంటుంది. దాన్ని వింటే దేవతల హృదయం కూడ బ్రద్దలయిపోతుంది. పినాకధారి అయిన శంకరుడు ఘోరమయిన రూపంతో క్రోధంగా చూస్తే చాలు సురలు, అసురులు, గంధర్వులు, ఉరగులు, గుహల్లోదాగి ఉన్నాసరే సుఖంగా ఉండలేరు. దక్షప్రజాపతి చేస్తున్న గొప్పయజ్ఞంలో కుపితుడయిన శంకరుడు నిర్భయంగా ధనస్సులో బాణాన్ని సంధించి విడిచాడు. పెద్దగా గర్జించాడు. దాన్ని విన్న దేవతలు సుఖశాంతులు కోల్పోయారు.

దుఃఖంలో మునిగిపోయారు. మహేశ్వరుడు కోపించగా యజ్ఞమంతా భగ్నమయింది. అతని వింటి నారి ధ్వనులతో సమస్తలోకాలు గందర గోళంలో పడ్డాయి. ధర్మారాజా ! సురలు, అసురులు వివశులయ్యారు. విషాదం పొందారు. నీరు క్షోభించింది. భూమి కంపించింది పర్వతాలు స్రవించాయి. అంతరిక్షం వెళ వెళ లాడింది. లోకాలన్ని చిమ్మచీకట్లలో మునిగి పోయాయి. వెలుగన్నదే లేదు. నక్షత్రకాంతులు మసకబారాయి. సూర్యుడు కూడా కాంతిహీనుడయ్యాడు. అప్పుడు ఋషులందరూ సమస్త ప్రాణుల యొక్క, తమయొక్క మేలు కోసం శాంతి మంత్రాలు, స్వస్తి వచనాలు పరించారు. వారు కూడా భయపడి పోయారు. భయంకర పరాక్రముడైన రుద్రుడు దేవతల మీద పడ్డాడు. క్రుద్ధుడై భగుని నయనాన్ని పెకలించాడు. పాదంతో పూషుని ఎగర గొట్టాడు. పురోడాశం తింటున్న అతని పళ్ళను పెకలించాడు. అప్పుడు దేవతలందరూ గడగడవణికిపోతూ శంకరునికి నమస్కరించారు. రుద్రుడు అగ్ని సమానమైన మరొక వాడి బాణాన్ని సంధించాడు. రుద్రుని పరాక్రమం చూసి భయపడ్డదేవతలు మహర్షులతో పాటు, పండితోత్తములందరూ శర్వుని అనునయించటం ప్రారంభించారు. అప్పుడు దేవతలందరూ శతరుద్రీయాన్ని జపించారు. దేవతలందరిచేత స్తుతింపబడుతున్న మహేశ్వరు డప్పుడు ప్రసన్నుడయ్యాడు. రాజా! భయపడ్డ దేవతలందరూ శంకరుని శరణువేడారు. రుద్రునికి యజ్ఞంలో ప్రత్యేకమయిన భాగాన్ని కల్పించారు. రుద్రుడు సంతోషించి, యజ్ఞాన్ని మళ్లీ నెలకొల్పాడు. అపహరింపబడి నశించిన సమస్తాన్ని మళ్లీ ఉజ్జీవింపచేశాడు. పూర్వం వీర్యవంతులైన అసురులకు అంతరిక్షంలో మూడు పురాలుండేవి. ఇనుము, వెండి, బంగారాలతో అవి నిర్మింపబడ్డాయి. దేవేంద్రుడు ఎన్ని ఆయుధాలు ప్రయోగించినా వాటిని జయింపలేకపోయాడు. అప్పుడు దేవతలందరూ బాధలకు గురిఅయి రుద్రుని శరణుజొచ్చారు. మహాత్ములైన దేవతలందరూ కలిసి వచ్చి 'భగవంతుడా! రుద్రుడా! మేము చేసే ప్రతిపనికి భయంకరులైన అసురులు అడ్డు తగులుతున్నారు. మానదా! ఈ అసురులందరినీ వారి పురాలలో సహా చంపి, లోకాలన్నిటినీ రక్షించండి.' రుద్రు డలాడగే నన్నాడు. విష్ణువును బాణంగాచేసి, అగ్నిని శల్యంగా చేసి, వివస్వంతుని కుమారుడైన యముని బాణానికి పుంఖంగాచేసి, వేదాలను ధనువుగా మలచి, సావిత్రిని అల్లెత్రాడుగాచేసి, బ్రహ్మను సారథిగాచేసి, మూడు కణుపులూ, మూడు ములుకులూ ఉన్న ఆ బాణంతో మూడు పురాలను బ్రద్దలు చేశాడు. భరతా! సూర్యకాంతి, ప్రళయాగ్నిపరాక్రమం గల ఆబాణంతో ఆరాక్షసులు తమపురాలతోపాటు రుద్రునిచే దహింపబడ్డారు. మళ్లీ అతడే పంచశిఖలు ధరించిన బాలునిగా పార్వతి ఒళ్ళో కన్పించాడు.

అప్పుడు పార్వతి దేవతలలో 'ఇతడెవరో చెప్పండి' అంది. అసూయతో ఇంద్రుడు ఆ బాలుడిని వజ్రాయుధంతో కొట్టా లనుకొన్నాడు. కాని ఆ బాలుడు వజ్రాయుధాన్ని పట్టిన పరిఘవంటి బాహువును స్తంభింపచేశాడు. దేవతలందరూ అతడిని భువనేశ్వరుడని గ్రహించలేక పోయారు. ప్రజాపతులు కూడా బాలరూపుడయిన ఆ ఈశ్వరుని పట్ల అజ్ఞానులుగానే ఉండిపోయారు. అప్పుడు భగవంతుడైన బ్రహ్మ ధ్యానంచేసి, మహాతేజస్వి ఈయన పరమశ్రేష్ఠుడయిన ఉమాపతి యని భావించి నమస్కరించాడు. అప్పుడు దేవతలందరూ రుద్రునీ, పార్వతినీ ప్రసన్నంచేసుకొన్నారు. ఆ తర్వాత ఇంద్రుని బాహువు పూర్వంలాగే పనిచెయ్యటం ప్రారంభించింది. అతడు కూడా దుర్వాసుడనే పేరుతో వీర్యశాలి అయిన బ్రాహ్మణుడై ద్వారకా నగరంలో నాఇంట్లో చాలాకాలం నివసించాడు. నాఇంట్లో ఉండి ఎన్నో అపకారాలను నామీద ప్రయోగించాడు. అతిదుఃసహులయిన వాటినన్నింటినీ నేను ఉదారంగా సహించాను. ఆయనయే రుద్రుడు, శివుడు, అగ్ని, సమస్తమూ సర్వాన్ని జయించినవాడు. ఆయనయే ఇంద్రుడు, వాయు, అశ్వినులు, విద్యుత్తు. ఆయనయే చంద్రుడు, ఈశానుడు, సూర్యుడు, వరుణుడు కాలుడు, అంతకుడు, మృత్యువు, యముడు, పగలు, రాత్రి. మాసాలు, పక్షాలు, ఋతువులు, సంధ్యలు, సంవత్సరాలు ధాత, విధాత, విశ్వకర్మ, సర్వజ్ఞుడు. ఆయనయే నక్షత్రాలు, గ్రహాలు, దిక్కులు, విదిక్కులు. అన్నీ ఆయనయే. ఆయన విశ్వమూర్తి, కొలవశక్యం కానివాడు. భగవంతుడు, పరమ ప్రకాశమానుడు. ఒకడిగా, ఇద్దరిగా, చాలామందిగా, వందలమందగా, వేలమందిగా, లక్షమందిగా రూపాలు కలిగినవాడు ఆ మహాదేవుడు. ఇంకా, గొప్పవాడు. ఆయన గుణగణాలను వర్ణించటానికి వందల సంవత్సరాలు సరిపోవు.'

161. శంకరుని మాహాత్మ్య వర్ణన.

వాసుదేవుడన్నాడు. 'యుధిష్ఠిరా! మహాబాహు! మహాత్ముడు, బహురూపుడు, బహునామధేయుడు అయిన రుద్రుని గొప్పతనం చెప్తాను. విను ఈ మహాదేవుని అగ్ని, స్థాణువు, మహేశ్వరుడు, ఏకాక్షుడు, త్రిలోచనుడు, విశ్వరూపుడు, శివుడు అని చెప్తారు. వేదవిదులయిన బ్రాహ్మణులు ఆ దేవునికి రెండు శరీరాలున్నట్లు చెప్తారు. ఒక శరీరం ఘోరమయినది. మరొక శరీరం శివ మయినది. అవి రెండూ కూడా మళ్ళీ అనేకంగా ఉంటాయి. ఉగ్రమై ఘోరమయిన ఆయన తనువు అగ్నిగా, విద్యుత్తుగా, భాస్కరునిగాను ప్రకాశిస్తున్నది. ప్రసన్నమైన శివరూపమయిన తనువునకు ధర్మం, నీరు, చంద్రుడు అనే

రూపాలున్నాయి. ఆయన శరీరంలో సగభాగం అగ్ని. మరొక సగభాగం చంద్రుడు. శివరూపమయిన ఈయన శరీరం బ్రహ్మచర్యాన్ని పాటిస్తుంది. అలాగే ఘోర శరీరం జగత్ సంహారం చేస్తుంది. ప్రభువు కనుక, గొప్పవాడు కనుక ఆయనను మహేశ్వరుడంటారు. దహించటం, భయంకరంగా ఉండటం, వాడిగా ఉండటం, మాంస శోణిత మజ్జలను తినటం కారణంగా ఈయన రుద్రుడుగా చెప్పబడ్డాడు. దేవతల్లో ఎంతో గొప్పవాడు కావటం ఈయనకు సంబంధించి ఎన్నో గొప్ప విషయాలుండటం, విశాల విశ్వాన్ని పాలించటం కారణంగా ఈయన మహాదేవుడుగా చెప్పబడుతున్నాడు. ఈయన కేశరూపం బూడిదరంగులో ఉండటంవల్ల ధూర్జటిగా చెప్పబడ్డారు. అనేక రకాల కర్మల ద్వారా సర్వులకు ఉన్నతిని కల్పించటం, మనుష్యులకు శుభాన్ని ప్రసాదించటం వల్ల శివుడయినాడు. ఊర్ధ్వభాగమందుండి మనుష్యుల ప్రాణాలను హరిస్తాడు కనుక, స్థిరంగా ఉంటాడు కనుక, లింగ విగ్రహం మార్పు లేనిది కనుక ఈశ్వరుడు స్థాణువుగా చెప్పబడుతున్నాడు. భూత భవిష్యద్వర్తమానాల్లో ఈయనకు సంబంధించిన బహువిధాలయిన చరాచర రూపాలు ప్రకటితమవుతుంటాయి. కనుక ఆయన్ను బహురూపుడంటారు. సమస్త దేవతలు ఆయన శరీరమందే ఉంటారు. కనుక ఆయన్ను విశ్వరూపుడనీ అంటారు. ఈయన నేత్రం నుండి తేజస్సు ప్రసరిస్తుంది. కనుక పరమేశ్వరుని సహస్రాక్షుడనీ, ఆయుతాక్షుడని, సర్వతోక్షిమయుడని అంటారు. నిజానికి ఈయన నేత్రసంఖ్యకు అంతులేదు. ప్రాణులనన్ని విధాల రక్షిస్తాడు. వాటితో క్రీడిస్తాడు. ప్రాణులందరికీ అధిపతి. ఇందువల్ల ఈశ్వరుడు పశుపతిగా పిలువబడుతున్నాడు. మనుష్యులు బ్రహ్మ చర్యాన్ని పాటిస్తూ ఈయన స్థిర లింగాన్ని పూజిస్తే మహాత్ముడయిన శంకరుడు ప్రసన్నుడవుతాడు. శివుని విగ్రహాన్ని పూజించినా,మహాత్ముని లింగాన్ని పూజించినా నరుడు గొప్ప సంపదను పొందుతాడు. నిత్యం లింగాన్ని పూజించేవాడు ఆయనకు ఇష్టుడు. ఋషులు, దేవతలు, గంధర్వులు, అప్సరసలు నిత్యం లింగాన్ని ఆరాధిస్తుంటారు. ఆ లింగం ఊర్ధ్వలోకంలో నెలకొని ఉంటుంది.

ఆ లింగాన్ని పూజిస్తే మహేశ్వరుడు మిక్కిలి సంతోషిస్తాడు. భక్తవత్సలుడైన మహేశ్వరుడు సంతోషించి, తన భక్తులకు సుఖాన్ని అనుగ్రహిస్తాడు. ఈయనయే శ్మశానాల్లో అగ్నిరూపంలో దహనాన్ని చేస్తుంటారు. అక్కడ ఈయన నారాధించినవారు వీరులు పొందే ఉత్తమలోకాలు పొందుతారు. ఆయన సర్వప్రాణుల శరీరాల్లోను మృత్యురూపుడై ఉంటాడు. ప్రాణాపాన శరీరుల్లో వాయురూపంగా ఆయన సంచరిస్తుంటాడు. ఆయనకు

అనేక రూపాలున్నాయి. అవి ఘోరమైనవి. ప్రజ్వరిల్లేవిగా ఆరూపాలన్నీ పూజ్యాలే. పండితులకు ఆరూపాలన్నీ తెలుసు. ఈశ్వరుని గొప్పతనం, సర్వవ్యాపకత్వం, దివ్యమైన కర్మలు కారణంగా దేవతల్లో అనేక యథార్థనామాలు ప్రచారంలో ఉన్నాయి. వేదంలో శతరుద్రీయమన్నది చాలగొప్పస్తుతిగా విప్రులు చెప్తారు. వ్యాసుడు కూడా పరమేశ్వరుని గొప్పగా స్తుతించాడు. ఆయన మహాత్ముడు. ఈశ్వరుడు సమస్తలోకాలకు అభీష్టాలను ప్రసాదించేవాడు. ఈ గొప్ప విశ్వమంతా ఆయనరూపమే. బ్రాహ్మణులు, ఋషులు పరమేశ్వరుని సర్వజ్యేష్ఠునిగా చెప్తున్నారు. దేవతల్లో ఈయనయే ప్రధానుడు. తన ముఖాన్నుండి ఈయన అగ్నిని సృష్టించాడు. నానావిధ గ్రహబాధ లనుభవిస్తున్నవారి ప్రాణాలను విడిపించే వాడీయన. ఈ పుణ్యాత్ముడు శరణ్యుడు. శరణాగతుల నెన్నడూ విడువడు. ఆయువు, ఆరోగ్యం, అధికారం, ధనం, కోరికలు వీటన్నిటినీ మనుష్యులకు ధారళంగా ప్రసాదిస్తాడు. ఆయనయే వాటినిస్తాడు. ఆయనయే వాటిని తిరిగి తీసుకొంటాడు. శక్రాదిదేవతలు కూడా ఆయన ప్రభుత్వానికి లోబడి ఉంటారు. ఆయనయే ముల్లోకాలకు నిత్యం శుభాలను, అశుభాలను ప్రసాదించేవాడు. అన్ని కోరికలకు అధీశ్వరుడు కావడంవల్ల ఆయనను ఈశ్వరుడంటారు. అన్ని లోకాలకు ఈయన ప్రభువు. గొప్ప వారికి కూడా ఈశ్వరుడు ఆయన. ఆయనయే వివిధ రూపాలలో ప్రపంచం అంతటా వ్యాప్తమై ఉన్నది. సముద్రంలోని బడవానలం ఆయనక మరొక ముఖమని చెప్తారు.'

162. ధర్మాధర్మఫలము - శిష్టాచార స్వరూపము.

వైశంపాయనుడు చెప్తున్నాడు. దేవకీనందనుడైన కృష్ణుడు ఇలా శంకర మహాత్మ్యం వర్ణించాడు. తర్వాత యుధిష్ఠిరుడు శంతను పుత్రుడైన భీష్ముని ఇలా ప్రశ్నించాడు. 'ధర్మవిదులలో శ్రేష్ఠుడా! మహాబుద్ధిశాలీ! ఏవిషయంలో అయినా చక్కని నిర్ణయం తీసుకోవడటంలో ప్రత్యక్షాన్ని ప్రమాణంగా భావించాలా! శాస్త్రాన్ని ప్రమాణంగా భావించాలా!' భీష్ముడన్నాడు. 'ప్రాజ్ఞుడా! ఇక్కడ నిజానికి సందేహించవలసిన అవసరంలేదని నా ఉద్దేశం. నీవు చక్కగా అడిగావు. దాన్ని వివరిస్తాను. వినుసంశయం రావటం తేలికే. నిర్ణయం తీసుకోవటం కష్టమయిన పని. ప్రత్యక్షమూ, శాస్త్రమూ రెండూ అనంతమైనవే. రెంటిలోను సందేహం మిగిలే ఉంటుంది. బుద్ధిమంతులుగా భావించుకొనే హేతువాదులు ప్రత్యక్షాన్ని చూస్తూ, కనపడని సత్యాన్ని కూడా లేదని నిశ్చయించుకుంటారు. లేదా సందేహిస్తుంటారు. వీరు బాలురు. పండితుల మనుకొంటారు కాని పండితులు కారు. వారు సత్యాన్ని

నమ్ముతున్నారు. నిజాన్ని తెలుసుకోవటానికికే ఒక్క ప్రమాణముండాలి. అది ఏమిటి అంటావా? భారత! దాన్ని తప్పకుండా తెలుసుకోవచ్చు. దానికి ఎంతో కాలం వేచి ఉండాలి. యోగాభ్యాసం చెయ్యాలి. బద్ధకముండకూడదు. అనేక విధాలయిన ప్రయత్నాలను చెయ్యాలి. ఆ పరమేశ్వర సాక్షాత్కరం, దానియందే మనస్సు లగ్నం చేసినవానికి కల్గుతుంది. హేతువుల అంతం చూసిన తరువాతనే ఉత్తమ విశాల జ్ఞానం సిద్ధిస్తుంది. ఆ జ్ఞానమే సమస్తలోకానికీ వెలుగు. హేతువుని బట్టి పొందే జ్ఞానం నిజమైన జ్ఞానం కాదు. అది ప్రామాణికమూ కాదు. వేదంలో చెప్పబడనిది జ్ఞాన మనిపించుకోదు.' యుధిష్ఠిరుడిలా అన్నాడు. "తాతా! ప్రత్యక్ష ప్రమాణం లోకమంతా అంగీకరించేది. అనుమానం, శిష్టాచారం, ఆగమంలాంటి ప్రమాణాలు కూడా ఉన్నాయి కదా! వాటి గురించి చెప్పండి" భీష్ముడన్నాడు "నాయనా! బలవంతులైన దుర్మార్గులు ధర్మాన్ని నాశనం చేస్తున్నపుడు సామాన్యులు ఎన్నో ప్రయత్నాలు చేసినా అవి విఫలమవటం కన్పిస్తోంది. యుధిష్ఠిరా! ఒకప్పుడు అధర్మం ధర్మంగా చలామణి అవుతుంది. గడ్డిచే కప్పబడ్డ బావిలా కన్పిస్తుంది. దానివల్ల ధర్మం నష్టమవుతుంది. దాన్ని విను. చరిత్రహీనులు, వేదమార్గాన్ని విడిచినవారు, ధర్మాన్ని ద్వేషించేవారు, మందబుద్ధుల సదాచారానికి భంగం కల్గిస్తారు. కనుక ప్రత్యక్ష ఆగమ, సదాచారాలు మూడు విడిగా విశ్వసనీయలా? అన్న సందేహం వస్తోంది. వేద ప్రమాణాన్ని అంగీకరించేవారు, సాధువులు, సంతుష్టి నొందినవారు, పరాన్ని పరమంగా భావించేవారు శ్రేష్ఠులు. వారినుపాసించాలి, ప్రశ్నించాలి. లోభ మోహాలు మూలకారణంగా ఉన్న కామార్థాలను విడిచి ధర్మమే ప్రధానమని భావించేవారు శ్రేష్ఠులు. వారి నుపాసించాలి. ప్రశ్నించి తెలుసుకోవాలి. అలాంటివారు తమ ఆచారాన్ని వదలరు. యజ్ఞాలు, వేదాధ్యయనం చేస్తూనే ఉంటారు. వారిలో ఆచారం, ఆగమం, ధర్మం మూడు ఒక్కచోటే నెలకొని ఉంటాయి" యుధిష్ఠిరుడన్నాడు. "తాతా! మళ్లీ నాబుద్ధి సంశయమనే అజ్ఞానంలోనే ఉండిపోతున్నది. ఆవలి ఒడ్డుకానరాని సముద్రంలో ఎంత వెతికినా గట్టును చేరుకోలేకపోతున్నాను. వేదం, ప్రత్యక్షం, ఆచారం ఈ మూడు కలసి ప్రమాణం కదా! వీటిలో ఒకప్పుడు భేదం కన్పిస్తోంది. ధర్మం ఒక్కటే కదా! మూడు విధాలు కాదుకదా!' భీష్ముడన్నాడు "రాజా! బలవంతుడైన దుర్మార్గులు ధర్మాన్ని నాశనం చేసినప్పుడు, ఆ ధర్మమేది అనే విషయాన్ని పై మూడు విధానాల ద్వారా తెలుసుకోవలసి ఉంటుంది. మూడు పద్ధతుల్లో ధర్మాన్ని దర్శించినా ఆ ధర్మమనేది ఏకరూపమే అని తెలుసుకోవాలి. మూడు ప్రమాణాలు భిన్న ధర్మాన్ని చెప్పుతాయని నేను భావించను. రాజా! మూడు ప్రమాణాలు ధర్మానికి సంబంధించిన మార్గాన్నే చెప్తున్నాయి.

వాటిని యథాతథంగా అనుసరించు. హేతుబుద్ధితో ధర్మాన్ని నిశ్చయించాలనే జిజ్ఞాస మంచిదికాదు. భరతశ్రేష్ఠ! నీకు ఈ విషయంలో ఎప్పుడూ సంశయంవద్దు. గ్రుడ్డివానిలా, జడునిలా, శంకలేనివానిలా నేను చెప్పినదాన్ని ఆచరించు. అజాతశత్రుడా! అహింస, సత్యం, క్రోధరాహిత్యం, దానం యీ నాలుగు సనాతన ధర్మాలు, వీటిని చక్కగా ఆచరించు ! మహాబాహూ ! బ్రాహ్మణుల పట్ల నా పితృ పితామహు లే విధంగా ప్రవర్తించారో దాన్ననుసరించు. బ్రాహ్మణులు ధర్మోపదేశకులు. పండితుడు కానివాడు ప్రమాణాన్ని ప్రమాణంకాదని వాదిస్తాడు. అతని వాదం ప్రమాణం కాదు. వివాదాలు కల్పించడమే అతని ఉద్దేశం. బ్రాహ్మణులనే సేవించు. సత్కరించు. గౌరవించు. వారియందే సమస్తలోకాల అభ్యున్నతి ఇమిడి ఉన్నదని గ్రహించు.' యుధిష్ఠిరుడన్నాడు. 'తాతా! ధర్మాన్ని సహించనివారు ఏలోకాలను పొందుతారు ? ధర్మపరాయణులు ఏ లోకాలను చేరుకుంటారు ? దీన్ని నాకు చెప్పు!' భీష్ముడన్నాడు. "రజస్సు తమస్సులతో నిండిన మనసున్నవారు, ధర్మాన్ని ద్వేషించే జనులు నరకాన్ని పొందుతారు. మహారాజా! ధర్మాన్ని చక్కగా ఉపాసిస్తూ, నిత్యం ఋజుమార్గంలో ప్రయాణించే నరులు, సత్పురుషులు. వారు స్వర్గాన్ని పొందుతారు. ఆచార్యుని ఉపాసించటంవల్ల మానవుడు ధర్మ సహాయాన్ని పొందుతాడు. ధర్మాన్నుపాసించినవారు దేవలోకాన్ని పొందుతారు. లోభద్వేషాలను విడిచిపెట్టి, శరీరాన్ని తపింపచేసి, ధర్మాన్ని ఆచరించేవారు మానవులయినా, దేవతలయినా సుఖాన్ని పొందుతారు. బుద్ధిమంతులు ధర్మాన్ని బ్రహ్మదేవుని జ్యేష్ఠపుత్రునిగా వర్ణిస్తారు. తినేవాడికి పండినపండు ఎలా రుచిస్తుందో, ధర్మశీలురకు ధర్మం అలా రుచిస్తుంది." యుధిష్ఠిరు ,డన్నాడు. "దుర్మార్గులు ఏ రూపంతో ఉంటారు? సాధువులు ఏం చేస్తుంటారు? సదసత్పురుష స్వభావాన్ని నాకు చెప్పండి" భీష్ముడు చెప్తున్నాడు. 'దుర్మార్గులు చెడ్డపనులు చేస్తారు. ఉగ్రులుగా ఉంటారు. వారి ముఖం చూడాలనిపించదు. సత్పురుషులుచక్కని నడవడితో ఉంటారు. ఇదే శిష్టాచారుల లక్షణం. రాజశ్రేష్ఠ! రాజమార్గంలోను, గోవుల మధ్యన, ధాన్యం మధ్యలో ధర్మాత్ములు మూత్రపురీషాలను విడవరు. దేవతలు, పితృదేవతలు, ప్రాణులు, అతిథులు కుటుంబసభ్యులు వారికి భోజనం పెట్టిన తరువాతనే సత్పురుషులు భుజిస్తారు. భోజన సమయంలో మౌనంగా ఉంటారు. తడిచేతులతో నిద్రకుపక్రమించరు. ధార్మికులు అగ్నికి, ఎద్దుకు, దేవునికి, గోశాలకు, నాలుగురోడ్లకూడలికి, బ్రాహ్మణునికి, ధార్మికునికి, వృద్ధునికి గౌరవంగా ప్రదక్షిణం చేస్తారు. ధార్మికులు వృద్ధులకు, బరువులు మోసేవారికి, స్త్రీలకు,అధికారులకు బ్రాహ్మణులకు, గోవులకు, రాజులకు ముందుగా

దారినిస్తారు. సత్పురుషులు అతిథులకు, భృత్యులందరికీ, తన బంధువులకు, తనను శరణువేడిన వారికి రక్షకులుగా ఉంటారు. స్వాగతం చెప్తారు. మనుష్యులకు ఉదయం, సాయంత్రం మాత్రమే ఆహారాన్ని స్వీకరించటం దేవతలచే నిర్దేశింపబడింది. మిగిలిన సమయంలో భోజనం చెయ్యరాదు. ఉపవాసం చెయ్యాలి. హోమకాలంలో అగ్నిదేవుడు హోమ ద్రవ్యం కోసం నిరీక్షించినట్లు స్త్రీలు ఋతుకాలంలో భర్తకోసం నిరీక్షిస్తారు. ఋతుకాలంలో తప్ప మిగిలిన సమయంలో భార్యా సంగమం చేయనివాడు బ్రహ్మచారిగా చెప్పబడ్డాడు. అమృతమూ, బ్రాహ్మణులూ, గోవులు ఈమూడు ఒకేవిధంగా పవిత్రమైనవి. కనుక గో బ్రాహ్మణులను నిత్యం యథావిధిగా పూజించాలి. యజ్ఞస్సులతో సంస్కరింపబడిన మాంసాన్ని తినటం దోషంకాదు. పృష్ట మాంసమూ, అవనవసర మాంసమూ, పుత్ర మాంసంలా సేవించకూడనివి. స్వదేశంలో కాని, పరదేశంలోగాని అతిథిని ఉపవాసముంచకూడదు. గురువులు చెప్పిన పనిని పూర్తిచేసి, పూర్తి అయినట్లు వారికి తెలియచెయ్యాలి. గురువు వచ్చినప్పుడు ఆసనం చూపించాలి. నమస్కరించాలి. పూజించాలి. గురువును పూజిస్తే ఆయుస్సు, కీర్తి, సంపద పెరుగుతాయి. వృద్ధుల నవమానించరాదు. వారిని పనులకు పంపరాదు. వారు నిలుచుని ఉండగా తాము కూర్చోరాదు. ఇలాచేస్తే ఆయువు క్షీణించదు. వివస్త్ర అయిన స్త్రీని గాని, పురుషుని గాని చూడకూడదు. మైథునాన్ని, ఆహారాన్ని రహస్యంగానే సేవించాలి. తీర్థాలన్నిటిలోను గురువే గొప్ప తీర్థం. పవిత్రమైన వాటిలో హృదయం నిర్మలమయింది. దర్శనాలన్నిటిలో జ్ఞాన దర్శనం శ్రేష్ఠం. సంతోషమే గొప్ప సుఖం. ఉదయం సాయంత్రం పెద్దలు చెప్పే ఉపదేశాలు శ్రద్ధగా వినాలి. వృద్ధుల్ని సేవించటంవల్ల నరుడు గొప్ప పాండిత్యాన్ని పొందుతాడు. అధ్యయన సమయంలోను, భోజనసమయంలోనూ కుడిచేతి నుపయోగించాలి. వాక్ మనస్సు ఇంద్రియాలూ అదుపులో ఉంచుకోవాలి. చక్కని పాయసం, హల్వా, పులగం (నువ్వులు, బెల్లం శ్రాద్ధంలో) హవిస్సు మొదలయిన వాటిలో దేవతలకు, పితృదేవతలకు అష్టకాశ్రాద్ధము చెయ్యాలి. నవగ్రహాలను పూజించాలి. క్షవర కాలంలో మంగళమైన శబ్దాలు పల్కాలి. తుమ్మినపుడు చిరంజీవ అంటూ అభినందించాలి. రోగులకు మేలు జరగాలని కోరాలి. గొప్ప వాడిని ఎప్పుడూ నీవు అని సంబోధించకూడదు. ఆపదలో ఉన్నా అలా అనరాదు. నీవు అనటం చంపటంతో సమానం. తనకంటే చిన్న వారిని, సమానులను, శిష్యులను, నువ్వు అనటం తప్పుకాదు. పాపాత్ముల హృదయాలే వారి పాపపు పనులను గుర్తుచేస్తాయి. దుర్మార్గులు తెలిసి చేసిన తప్పులను కప్పి పుచ్చుకొంటారు. మహాత్ముల సమక్షంలో తెలిసి కూడా కప్పి

పుచ్చినవారు నశించి పోతారు. నా పాపాలను మానవులు చూడలేదు. దేవతలూ చూడలేదు, అనుకొనేవాడు పాపాత్ముడై పాపపు జన్మలు పొందుతాడు. వడ్డీ వ్యాపారి చేతిలో వడ్డీలు పెరుగుతుంటాయి. కాని పాపాన్ని ధర్మంతో కప్పివేస్తే ధర్మమే పెరుగుతుంది. లవణాన్ని నీటిలో వేస్తే ఎలా కరిగిపోతుందో అలాగే ప్రాయశ్చిత్తం వల్ల చేసిన పాపాలు నశిస్తాయి. కనుక పాపాన్ని రహస్యంగా దాచుకోకూడదు. అలాచేస్తే అది పెరిగిపోతుంది. దాన్ని గురించి సాధువులకు చెప్పాలి. దాన్ని వారు తగ్గిస్తారు. దురాశతో సంపాదించిన ధనం అవసరమైనప్పుడు అనుభవంలోకి రాదు. ఆ జీవి పోయినప్పుడు ఆ ధనాన్ని ఇతరులు పొందుతారు. బుద్ధిమంతులు, ధర్మాన్ని సమస్త ప్రాణులకు హృదయం వంటిదంటారు. కనుక సర్వప్రాణులూ ధర్మాన్నే ఆశ్రయిస్తాయి. ఒంటరిగానే ధర్మకార్యాలు చెయ్యాలి. ధర్మాన్ని ప్రచారం చేసుకోరాదు. ధర్మాన్ని ప్రచారం చెయ్యటం జీవికగా చేసుకొన్నవారు ధర్మాన్ని వ్యాపారంగా మార్చినవా రవుతారు. దేవతలను దంభం వదలి పూజించాలి. గురువుల విషయంలో కపటం లేకుండా ప్రవర్తించాలి.పరలోకం కోసం దానమనే నిధిని ఏర్పరచాలి.'

163. అదృష్టప్రాధాన్యము - భీష్ముని వివరణము.

యుధిష్ఠిరుడు అన్నాడు. 'అదృష్టహీనుడు ఎంత బలవంతుడయినా ధనాన్ని పొందలేడు. అదృష్టవంతుడు చిక్కినవాడైనా, బాలుడైనా ధనాన్ని పొందుతాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కాలం కలిసిరానపుడు దేన్నీ పొందలేడు. లాభకాలంలో ప్రయత్నం చెయ్యకపోయినా విపుల ధనాన్ని పొందుతాడు. ప్రయత్నాలు చేసినా ఫలితం పొందని నరులు వందలాదిగా ఉన్నారు. ప్రయత్నం లేకుండా వృద్ధిని పొందుతున్నవారు ఎందరో ఉన్నారు. ప్రయత్నమే ఫలితానికి కారణమయితే ప్రయత్నంచినవారందరూ ఫలాన్ని పొందాలి. భరతసత్తమా! ప్రారబ్ధం వల్ల అలభ్యమైనది లభించటం లేదు. ప్రయత్నం చేసి కూడా ఫలితం పొందనినరులు కన్పిస్తున్నారు. వందమార్గాలన్వేషించినా కొందరు ధనాన్ని పొందలేరు. మరొకడు దుర్మార్గం చేసి సుఖంగా ఉంటాడు. పదేపదే అకార్యాలు చేసినవారు ఎంతమంది ధనరహితులయ్యారు? తన విధ్యుక్త కర్మలనాచరించినవారు, ధనహీనులుకానివా రెందరు లేరు! ఒకడు నీతి శాస్త్రాన్ని చదువుకొంటాడు. నీతిమంతుడు కాడు. నీతి శాస్త్రం తెలియనివాడు మంత్రిగా చెలామణి అవుతాడు. దీనికి కారణమేమిటి ? విద్యావంతుడు,విద్యారహితుడు, దుర్మార్గుడు కూడా ధనవంతులవుతున్నారు. ఒకవేళ విద్యలనార్జిస్తేనే మనిషి సుఖాల్ని

పొందగల్గితే, విద్వాంసుడు జీవనం కోసం విద్యావిహీనుని ఆశ్రయించవలసిన పరిస్థితి రాకూడదు. పురుషుడు నీటిని పొందినప్పుడు దాహార్తిని జయిస్తున్నాడు. విద్యలవల్ల ప్రయోజనం సిద్ధిస్తుంటే ఏ నరుడూ విద్యలను విడిచిపెట్టడు. వందలాది బాణాలు తగిలినా పోయేకాలంరానివాడు చావడు. కాలంమూడిన వాడు గడ్డి పరక తగిలినా చస్తాడు". భీష్ముడన్నాడు. "ఎన్నో ప్రయత్నాలు చేసినా కోరుకొన్నా ధనం పొందలేనివాడు, తీవ్రమయిన తపస్సు చెయ్యాలి. విత్తనం లేకుండా మొక్కరాదు. దానంచేస్తే భోగి అవుతాడు. వృద్ధుల్ని సేవిస్తే మేధావిగా మారతాడు. హింసను వదలితే దీర్ఘాయువు పొందుతాడు అని బుద్ధిమంతులు చెప్తున్నారు. కనుక దానం చెయ్యాలి. యాచించకూడదు. ధార్మికులను పూజించాలి. చక్కగా మాట్లాడేవాడు. ప్రియాన్ని చేసేవాడు. ప్రశాంతుడు సర్వ ప్రాణులయందు అహింసా భావమున్నవాడు పరమధన్యుడు. యుధిష్ఠిరా! దోమలు, కీటకాలు, చీమలు అవి ఆయా జన్మఎత్తడానికి ఆయా ప్రమాణంకల సుఖదుఃఖాల అనుభవానికి వాటి స్వభావమే కారణం కనుక స్థిరంగా ఉండు.'

164. భీష్ముడు ధర్మానుష్ఠానమును సమర్థించుట.

నాయనా! మనుష్యుడు శుభాశుభకర్మలను చేస్తాడు. చేయిస్తాడు. వానిలో శుభకర్మ చేయటం వల్ల మంచి ఫలితాలను పొందుతాననే విశ్వాసముండాలి. అశుభకర్మలవల్ల శుభం జరగదని విశ్వసించాలి. కాలమే మానవులకు నిగ్రహాన్ని, అనుగ్రహాన్ని ఇస్తుంటుంది. కాలం బుద్ధిలో ప్రకాశించటంవల్లనే ధర్మప్రవృత్తి, అధర్మ ప్రవృత్తి కలుగుతుంది. మానవుడు ధర్మఫలాన్ని పొందినప్పుడు దాని మీద అతనికి ఆసక్తి ఏర్పడుతుంది. ధర్మాత్ముడు దాన్ని విశ్వసిస్తాడు. దృఢబుద్ధిలేనవాడు విశ్వసించడు. ధర్మాధర్మాలు తెలిసినవాడు కాలాన్ని బట్టి ప్రారబ్ధమే అనుభవించవలసి వచ్చినా యథాశక్తిగా ధర్మాన్నే ఆచరించాలి. ప్రాణుల్లో ప్రాజ్ఞులకుండే గొప్ప లక్షణమిదే. ధార్మికులు గొప్ప ఐశ్వర్య మేర్పడినప్పటికీ రజోగుణంతో కలుషితులు కారు. అలాగే తమ ప్రయత్నాలద్వారా ఆత్మకు మరింత ఉన్నతిని సాధిస్తారు. కాలం కూడా ధర్మానికి ఏ పరిస్థితుల్లోనూ అధర్మ ఫలాన్నివ్వదు. కనుక తనను తాను విశుద్ధునిగాను, ధర్మపరాయణునిగాను మలచుకోవాలి. తెలుసుకోవాలి. ధర్మం మండుతున్న అగ్నివంటిది. ధర్మం. కాలంచేత రక్షింపబడుతుంది. దాన్ని చెడగొట్టే శక్తి అధర్మానికుండదు. విశుద్ధత, పాప స్పర్శ లేకుండటం ఈ రెండూ ధర్మకార్యాలే. ధర్మం విజయాన్నిస్తుంది. ముల్లోకాలమనుగడకు ధర్మవిజయ మనే కాంతియే కారణం. ఎంతటి బుద్ధిశాలి అయినా

మరొక మానవుణ్ణి చెయ్యిపట్టుకొని ధర్మం వైపు నడిపించలేడు. ధర్మబద్ధంగా, ధర్మ ఫలాన్ని, లోకభయాన్ని గూర్చి చెప్పబడ్డ మానవుడు క్రమంగా ధర్మంవైపు ప్రయాణిస్తాడు. నేను శూద్రుడను. నాకు బ్రహ్మచర్యాది ఆశ్రమాలను సేవించే అధికారం లేదు అని కొందరు భావిస్తారు. మరి కొందరు సాధువులు అంతరాత్మలో ఏ రకమయిన వంచనకు అవకాశమివ్వరు. బ్రాహ్మణాది నాలుగు వర్ణాల వారి యొక్క లక్షణాన్ని విశేషంగా చెపుతాను. అందరి శరీరాలు పాంచభౌతికాలే. అందరి ఆత్మ ఒక్కటే. అయినా వారిలో లౌకిక ధర్మంలోను, విశేష ధర్మంలోను భేదం చెప్పబడింది. దాని ఉద్దేశం ఎవరికి వారు తమ తమ ధర్మాన్నిపాటించి మళ్లీ ఏకత్వాన్ని పొందాలన్నదే. ధర్మం శాశ్వతంగా చెప్పబడుతోంది. దాని వల్ల లభించే స్వర్గాదులు అశాశ్వతాలు కదా! ఇది సమంజసమా? దీనికి సమాధానం- ధర్మ సంకల్పం శాశ్వతమైతే దాని ఫలితం కూడా సనాతనమే అవుతుంది. అందరూ సమాన శరీరులే, అందరు ఒకేవిధమైన ఆత్మ కలవారు అయినా ధర్మ సంకల్పంతో కూడిన కాలం వారిలో విశేషాన్ని ఏర్పరుస్తుంది. సమస్త క్రియలకూ అదే గురువు. ఇలాంటప్పుడు ప్రాణులు వివిధ ధర్మాల్ని సేవించటంలో తప్పేమీ లేదు. పశుపక్షాదుల్లో పుట్టినా ధర్మసంకల్పమే కర్తవ్యాకర్తవ్యాలను నిర్ణయిస్తుంది. గురు వౌతుంది.'

165. నిత్యస్మరణీయ దేవాతాదులు.

వైశంపాయనుడిలా అన్నాడు "పాండుకుమారుడు, కురుశ్రేష్ఠుడు అయిన యుధిష్ఠిరుడు హితకరమై పాపాన్ని పోగొట్టే మార్గాన్ని తెలుసుకొన గోరి శరతల్పగతుడైన భీష్మునితో ఇలా అన్నాడు. 'పురుషునికి ఏది శ్రేయస్సునిస్తుంది ? ఏంచేస్తే సుఖపడతాడు ? దేనివల్ల పాపరహితుడవుతాడు? ఏది కల్మషాన్ని నశింపచేస్తుంది.' వైశంపాయనుడన్నాడు. 'శంతనుకుమారుడైన భీష్ముడు వినాలనే కోరికతో ఉన్న యుధిష్ఠిరునితో న్యాయబద్ధంగా దైవ వంశం గురించి వివరించాడు. 'ఋషి వంశంతోకూడిన దైవత వంశంగూర్చి మూడు సంధ్యల్లోను కీర్తిస్తే పుత్రా! అది కల్మషాలను తొలగిస్తుంది. పురుషుడు పగలు, రాత్రి, సంధ్యల్లో ఇంద్రియాలతో, తెలిసోతెలియకో చేసిన సమస్త పాపాలనుండి దైవత వంశ కీర్తనం వలన విముక్తిని పొందుతాడు. పవిత్రు డవుతాడు. అతడు గ్రుడ్డివాడు, చెవిటివాడు కాడు. సమస్త శుభాలను పొందుతాడు. అటువంటివాడు పశువుగా పుట్టడు. నరకానికి పోడు. సంకరజాతిలో పడడు. అతనికి దుఃఖముండదు. మరణకాలంలో వ్యాకుల పాటు కలగదు. దేవదానవ గురువు, సమస్త ప్రాణివంద్యుడు, అనూహ్యుడు, వాగతీతుడు,

అందరికీ ప్రాణమైనవాడు, అయోనిజుడు, జగత్పాలకుడయిన బ్రహ్మదేవుడు; అతని భార్య పతివ్రత సావిత్రి; వేద స్మర్త, ప్రభువు, విష్ణువు అయిన నారాయణుడు; పార్వతీపతి అయిన త్రిలోచనుడు, నేనాపతియైన కుమారస్వామి, అగ్ని, వాయువు, చంద్రుడు, వెలుగునిచ్చే సూర్యుడు, శచీపతియైన ఇంద్రదేవుడు, ధూమోర్ణతో కూడిన యమరాజు, ధర్మపత్ని గౌరితో కూడిన వరుణుడు, బుద్ధి సహితుడైన కుబేరుడు, ప్రసన్నమైన కామధేనువు, మహర్షి విశ్రవసుడు, సంకల్పం, సాగరం, గంగాది నదులు, మరుద్గణం, తపస్సిద్ధులైన వాలఖిల్యులు, వ్యాసభగవానుడు, నారదుడు, పర్వతుడు, విశ్వావసువు, హా హా, హూ హూ, తుంబురుడు, చిత్రసేనుడు, విఖ్యాతుడైన దేవదూత, మహాసౌభాగ్యవతులైన దేవకన్యలు, అప్సరసల సమూహాలు, ఊర్వశి, మేనక, రంభ మిశ్రకేశి, అలంబుష, విశ్వాచి, ఘృతాచి, పంచచూడ, తిలోత్తమ, ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినులు, పితృదేవతలు, ధర్మం, శాస్త్రజ్ఞానం, తపస్సు, దీక్ష, వ్యవసాయం, పితామహుడు, రాత్రులు, పగళ్ళు, మరీచినందనుడైన కశ్యపుడు, శుక్రుడు, బృహస్పతి, కుజుడు, బుధుడు, రాహువు, శనైశ్చరుడు, నక్షత్రాలు, ఋతువులు, మాసాలు, పక్షాలు, సంవత్సరాలు, వినతాసుతుడైన గరుడుడు, సముద్రాలు, కద్రువసంతతి అయిన ఉరగులు, నదీమతల్లులైన శతద్రు, విపాశ, చంద్రభాగ, సరస్వతి, సింధు, దేవిక, ప్రభాసం, పుష్కరం, గంగా, మహానది, వీణ, కావేరి, నర్మద, కులంపున, విశల్య, కరతోయ, అంబువాహిని, సరయు, గండకి, ఎర్రని నీరున్న మహానదం వేత్రవతి, పర్ణాశ, గౌతమి, గోదావరి, వేణ్య, కృష్ణవేణ, అద్రిజ, దృషద్వతి, కావేరి, చక్షు మందాకిని, ప్రయాగ, ప్రభాసం పవిత్రమై విశ్వేశ్వరావాసమై స్వచ్ఛ సలిలమున్న కురుక్షేత్ర పుణ్యతీర్థం, ఉత్తమ సముద్రం, తపస్సు, దానం, జంబూమార్గం, హిరణ్యం, విత్తస్త, ప్లక్షవతీనది, వేదస్మృతి అయిన వేదవతి, మాలవ, అశ్వవతి, పవిత్రమైన భూభాగాలు, గంగాద్వారం (హరిద్వార), ఋషికుల్య సముద్రాన్ని చేరుకొనే పవిత్ర నదులు, పవిత్రమైన చర్మణ్వతీనది, కౌశికి, యమున, భీమరథి, బాహుద, మహానది,మాహేంద్రవాణి, త్రిదివ, నీలిక, సరస్వతి, నంద, అపరనంద తీర్థమైన మహాహ్రదం, గయ, ఫల్గుతీర్థం, దేవతాస్థానమైన ధర్మారణ్యం, దేవనది, బ్రహ్మనిర్మితమై పవిత్రమై త్రిలోక విఖ్యాతమయి, సర్వపాప హరమై, శుభకరమయిన సరస్సు (పుష్కరతీర్థం). దివ్యౌషధులున్న హిమవత్పర్వతం, ఔషధాలు ధాతురాగాలు గల వింధ్య పర్వతం, మేరువు, మహేంద్రం మలయం, వెండితో కప్పబడిన శ్వేత పర్వతం, శృంగవత్పర్వతం, మందర, నీల, నిషధ, దుర్దర, చిత్రకూట, అజనాభ, గంధమాదన పర్వతాలు, పవిత్రమైన సోమగిరి, ఇతర పర్వతాలు, దిక్కులు,

విదిక్కులు, భూమి, సమస్తమక్షాలు, విశ్వేదేవతలు, అంతరిక్షం, నక్షత్రాలు,గ్రహాలు ఇవన్ని మాకు ఎల్లవేళలా రక్షణ నివ్వాలి. నాచే కీర్తింపబడిన, కీర్తింపబడని దేవతలందరూ రక్షించాలి. వీరిని కీర్తిస్తున్న నరుడు సర్వపాపాలనుండి విముక్తిని పొందుతాడు. వీరిని స్తుతిస్తూ, అభినందిస్తూ నరుడు అన్ని భయాలనుండి విముక్తిని పొందుతాడు. దేవతాస్తవాన్ని విని, సంతోషించినవాడు సర్వ సంకరాల నుండి, పాపాలనుండి దేవతల తర్వాత తపస్సుచేసి, సిద్ధి పొంది, అధికంగా విముక్తిని పొందుతాడు. తపస్సు చేసిన విప్రులుగా చెప్పబడిన వారిని, సర్వ పాపాలనుండి విడిపించే వారిని గూర్చి కీర్తిస్తాను. యవక్రీతుడు, రైభ్యుడు, కక్షీవంతుడు, ఔశిజుడు, భృంగువు, అంగీరసుడు, కణ్వుడు, ప్రభావ శాలిఅయిన మేధాతిథి, గుణసంపన్నుడయిన బర్హి, వీరందరూ తూర్పు దిక్కున నివసించేవారు. ఉల్కుచుడు, ప్రముచుడు, ముముచుడు, శక్తిశాలియైన స్పస్త్యాత్రేయుడు, మిత్రావరుణుల పుత్రుడు, ప్రతాపవంతుడయిన అగస్త్య మహర్షి, ధృడాయువు, ఊర్ధ్వబాహువు వీరందరూ దక్షిణ దిక్కునందు నివసించే మహోర్షులు. పశ్చిమ దిక్కునందు నివసించే మహర్షులను గూర్చి చెప్తాను, విను. తన సోదరులతో కూడిన ఉషంగుడు, శక్తి శాలి అయిన పరివ్యాధుడు, దీర్ఘతమహర్షి గౌతముడు, కాశ్యపుడు, ఏకతుడు, ద్వితుడు, త్రితమహర్షి, అత్రిపుత్రుడు, ధర్మాత్ముడు అయిన దుర్వాసుడు, ప్రభావశాలియైన సారస్వతడు. ఉత్తరదిక్కున ఉండే మహర్షులను గూర్చి చెప్తాను, విను. అత్రి, వసిష్ఠుడు, శక్తి, పరాశరనందనుడు. శక్తిశాలి అయిన వ్యాసుడు విశ్వామిత్రుడు, భరద్వాజుడు, ఋచీకపుత్రడు జమదగ్ని, పరశురాముడు, ఉద్దాలకపుత్రుడు శ్వేత కేతువు, కోహలుడు, విపులుడు, దేవలుడు, దేవశర్మ, ధౌమ్యుడు, హస్తికాశ్యపుడు, లోమశుడు, నాభికేతుడు, లోమహర్షణుడు, ఉగ్రశ్రవుడు, భృగునందనుడైన చ్యవనుడు. ఋషులు, దేవతల సముదాయం చాలా గొప్పది. రాజా! దీన్ని కీర్తిస్తే సర్వపాపాలు నశిస్తాయి. ఇక రాజర్షుల పేర్లు చెప్తాను. విను. నృగువు, యయాతి, నహుషుడు, ప్రత్నాప్రశాలి అయిన పూరువు, ధుందుమారుడు, దిలీపుడు, ప్రతాపశాలి అగు సగరుడు, కృశాశ్వుడు, యవనాశ్వుడు, చిత్రాశ్వుడు, సత్యవంతుడు, దుష్యంతుడు, మహాయశస్వి, చక్రవర్తి అయిన భరతుడు, పవనుడు, జనకుడు, దుష్టరధమహారాజు, నరశ్రేష్ఠుడైన రఘుమహారాజు, ధశరథుడు, రాక్షసహంత, వీరవరుడు అయిన శ్రీరాముడు, శశబిందువు, భగీరథుడు, హరిశ్చంద్రుడు, మరుత్తు దృఢరథుడు, మహోదర్యుడు, అలర్కుడు, ఇలుడు, నరశ్రేష్ఠుడగు కరంధముడు, నరాధిపుడైన కధ్మోరుడు, దక్షుడు, అంబరీషుడు, కురురుడు, మహాయశస్వి అగు రైవతుడు, కురువు, సంవరుణుడు, సత్యపరాక్రమయుడు అయిన మాంధాత,

రాజర్షి అగుముచుకుందుడు, గంగాసేవితుడైన జహ్నువు, ఆదిరాజు, వేననందను డైన పృథువు, మిత్రభానుడు. త్రసద్దస్యుడు శ్వేతడు, ప్రసిద్ధుడైన మహాభిషుడు, నిమిరాజు, అష్టకుడు, ఆయువు, రాజర్షి అగు క్షుపుడు, కక్షేయుడు, ప్రతర్దనుడు, దివోదాసుడు, కోసలనరేశుడు అయిన సుదాసుడు, ఇలుడు, నలుడు, రాజర్షి అగు మను ప్రజాపతి, హవిర్ధ్రుడు, పృషధ్రుడు, ప్రతీపుడు, శాన్తనుడు, అజుడు, ప్రాచీనబర్హి, గొప్ప కీర్తికల ఇక్ష్వాకుడు అనరణ్యుడు, జానుజంఘుడు, కక్షసేనరాజర్షి, రాజులు పురాణాదుల్లో కీర్తింపబడ్డ ఇతర రాజులు వీరందరినీ ఉదయమే లేచి, ఉదయాస్తమయ సంధ్యల్లో పవిత్రుడై కీర్తిస్తే గొప్ప ధర్మ ఫలాన్ని మానవుడు పొందుతాడు. దేవతలు, దేవర్షులు, రాజర్షులు, స్తుతింపబడినవారై పుష్టిని, ఆయువును, కీర్తిని,స్వర్గాన్ని కల్గిసారు. 'విఘ్నాలు రారాదు. పాపమంటకూడదు. శత్రులుండరాదు. నాకు నిత్యం జయమే లభించాలి. పరలోకంలోకూడా ఉత్మ గతి ఏర్పడాలి' అని ప్రార్థించు.

166. భీష్ముని అనుమతితో యుధిష్ఠిరుడు హస్తినకు చేరుట.

జనమే జయుడిలా అన్నాడు. "కౌరవ దురంధరుడైన భీష్ముడు శరతల్పంమీద ఉండగా, వీరులకు తగ్గశయ్యమీద పరుండి యుండగా, పాండవులంతా సమీపమందున్నప్పుడు మహాప్రాజ్ఞుడు, నాకు పూర్వపితామహుడు అయిన యుధిష్ఠిరుడు, ధర్మోపదేశం విని, సర్వసంశయాలను పోగొట్టు కొని, దానాలు ఎలా చెయ్యాలో తెలుసుకొని, ధర్మార్థాల విషయంలో సందేహాలను నివృత్తిచేసుకొని, తర్వాత ఏమి చేశాడో, నాకు వివరించండి.' వైశంపాయనుడిలా అన్నాడు. 'భీష్ముడి విధంగా పలికి మౌనం ఆశ్రయించగానే, అక్కడున్నరాజు సమూహమంతా చిత్రపటంలో ఉన్నవారివలె మౌనంగా ఉండిపోయారు. సత్యవతీసుతుడైన వేదవ్యాసుడు క్షణకాలం ధ్యానించిడు, గంగాసుతుడైన భీష్మమహారాజుతో ఈ విధంగా పలికాడు. 'రాజా! కురురాజైన యుధిష్ఠిరుడు ప్రశాంతుడయ్యాడు. అతడు సోదరులతోను, ఇతర రాజులతోను అనుయాయులతోనూ నరశ్రేష్ఠా! కృష్ణునితో సహా నిన్ను సేవిస్తున్నాడు. ఇతడిని ఇప్పుడు హస్తినాపురానికి వెళ్ళడానికి అనుమతించవలసింది. భగవంతుడైన వ్యాసునిచే ఇలా ప్రేరేపింపబడిన గంగా సుతుడు అమాత్యులతో కూడిన యుధిష్ఠిరునకు హస్తినాపురానికి వెళ్ళడానికి అనుమతిని ప్రసాదించాడు. శంతను పుత్రుడు యుధిష్ఠిర మహారాజుతో తియ్యగా ఇలా అన్నాడు! 'రాజా! పట్టణంలో ప్రవేశించు. నీ మనస్సులో ఉన్న కలతలన్నీ తొలగిపోవాలి. వివిధ యోగాలను చెయ్యి. అనేకమందికి అన్నదానం, భూరిదక్షిణలు

ఇవ్వు. రాజేంద్ర! శ్రద్ధా దమాలతో కూడిన వాడివై యయాతిలాగే నీ విధులను నిర్వహించు. పృథాకుమారుడా! క్షత్రియ ధర్మ మందాసక్తుడవై దేవతలను పితృదేవతలను తృప్తిపరచు, నీకు మేలు జరుగుతుంది. మనస్సులో కలత చెందకు. ప్రజలందరినీ ఆనందింపచెయ్యి. అమాత్యాదులను ఓదార్చు. స్నేహితులందరినీ, వారివారికి తగ్గ విధంగా గౌరవించు. నాయనా! నీ మిత్రులు, మంచి హృదయమున్నవారు, నిన్నుసరిస్తూ చక్కగా కాలక్షేపంచెయ్యాలి. దేవమందిర ప్రాంగణంలో ఉన్న చెట్టును పక్షులు ఆశ్రయించినట్లు నిన్ను స్నేహితులందరూ ఆశ్రయించారు. రాజా! ఇప్పుడు వెళ్ళి నాకు వెళ్ళేసమయం వచ్చినపుడు తిరిగి రావలసిది. దినకరుడు దారి మార్చుకొని ఉత్తరంగా ప్రయాణించే ఉత్తరాయణ కాలంలో తిరిగి రావలసిది.' కుంతీపుత్రుడు 'అలాగే' అన్నాడు. తాతగార్కి నమస్కరించి తన పరివారంతో కూడి హస్తినాపురానికి వెళ్ళిపోయాడు. పతివ్రతయైన గాంధారిని, ధృతరాష్ట్రుని ముందుంచుకొని, ఋషులందరితోను, కేశవునితోను, సోదరులతోను కూడి పురజనులలో, వృద్ధ మంత్రులతో కలిసి కురుశ్రేష్ఠుడైన ధర్మజుడు హస్తినాపురిలో ప్రవేశించాడు.

167. భీష్ముడు ధర్మజునకు కర్తవ్యము నుపదేశించుట.

వైశంపాయనుడిలా అన్నాడు. " హస్తినాపురం చేరుకొన్న తరువాత కుంతీసుతుడైన ధర్మరాజు పురజనులందరినీ తగిన విధంగా గౌరవించి, వారి ఇళ్లకు పంపివేశాడు. వీరులు చనిపోయిన కుటుంబాలలోని స్త్రీలను అనునయించాడు. అప్పుడు ధర్మరాజు వారందరికీ విపులంగా ధనాదుల నిచ్చాడు. మహాప్రాజ్ఞుడైన యుధిష్ఠిరుడు రాజ్యాభిషిక్తుడయ్యాడు. అమాత్యులందరినీ ఆ యా పనుల్లో నియమించాడు. ధర్మరాజు గుణవంతులయిన బ్రాహ్మణశ్రేష్ఠులకు, వేదవిదులకు సత్కారాలుచేసి, వారి ఆశీస్సులను స్వీకరించాడు. పురుషశ్రేష్ఠుడు, శ్రీమంతుడు అయిన ఆ ధర్మజుడు హస్తినాపురంలో ఏబది రోజులున్నాడు. అప్పుడు భీష్ముడు నిర్దేశించిన సమయాన్ని స్మరించాడు. ధర్మరాజు, పురోహితులతో కూడినవాడై సూర్యుడు దక్షిణ గమనాన్నుండి నివృత్తి నొంది, ఉత్తరాయణంలో ప్రవేశించాడని గ్రహించి, హస్తినాపురం నుండి బయలుదేరాడు. యుధిష్ఠిరుడు నెయ్యి, పుష్పమాలలు, సుగంధద్రవ్యాలు, పట్టుబట్టలు, చందనం, అగరు ధూపం, మొదలయిన ఆసమయంలో అవసరమైన సమస్తద్రవ్యాలను సేకరించాడు. కుంతీ సుతుడు భీష్ముని శరీర సంస్కారానికి పనికి వచ్చే ద్రవ్యాలన్నీ, పూలదండలు, శ్రేష్ఠమైన వివిధ రత్నాలతో సహా ముందే పంపించాడు. పురుష శ్రేష్ఠడైన ధృతరాష్ట్రుని, కీర్తిమంతి గాంధారిని, తల్లి కుంతిని, పురుష శ్రేష్ఠులైన

సోదరులను ముందుంచుకొని కౌరవ్యుడు, శ్రీకృష్ణుడు, విదురుడు, యుయుత్సువు యముధానుడు వీరందరినీ కలుపుకొన్నాడు. రాజా! మహాతేజస్వి అయిన యుధిష్ఠిరుడు, గొప్ప రాజ భోగాలతో, సమస్త సంభారాలతో, జనులచే స్తుతింపబడుతూ భీష్ముడర్పించే అగ్నులను ముందుంచు కొన్నారు. హస్తినాపురం నుండి దేవేంద్రునివలె బయలుదేరాడు. తర్వాత కురుక్షేత్రంలో ఉన్న శంతను కుమారుని భీష్ముని చేరుకొన్నాడు. రాజర్షీ! బుద్ధిశాలి పరాశరసుతుడు అయిన వ్యాసనిచేత, నారదునిచేత దేవలునిచేత, అసితునిచేత సేవింపబడుతున్న భీష్ముని సమీపించాడు. చనిపోగా మిగిలిన మహారాజులచేత, నానాదేశాలనుండి వచ్చిన రక్షక భటులచేత అన్నివైపులనుండి అన్నివిధాలుగా రక్షింపబడుతున్న భీష్ముని సమీపించాడు. అప్పుడు ఆ యుధిష్ఠిరుడు రథం దిగి, సోదరులతో కూడి వీరశయ్య నలకంరించిన భీష్ముని దర్శించాడు. కౌంతేయుడు తాతగారికి క్వైపాయనాదులకు, విప్రులకు నమస్కరించి, వారిచేత అభినందింపబడ్డాడు. ధర్మజుడు బ్రహ్మ సమానులైన ఋత్విక్కులతో, సోదరులతో కూడి ఋషులచే చుట్టిముట్టబడిన, శరతల్పగతుడైన భీష్ముని సమీపించాడు. ధర్మరాజు యుధిష్ఠిరుడు సోదరులతోకూడి, పడుకొని ఉన్న గంగాసుతుడు, భరతశ్రేష్ఠుడు అయిన భీష్మునితో ఇలా అన్నాడు. 'గంగాసుతుడా! మహారాజా! నేను యుధిష్ఠిరుడను మహాబాహూ, నామాట వింటున్నట్లయితే నేను ఏమి చెయ్యాలో చెప్పు' అన్నాడు. "ప్రభో! రాజా! నీ అగ్నులను తీసుకొని నీవు చెప్పిన సమయానికి వచ్చాను. ఆచార్యులు, బ్రాహ్మణులు, ఋత్విక్కులు, సోదరులు అందరు వచ్చారు. మహాతేజస్వీ ! నీకుమారుడైన ధృతరాష్ట్ర మహారాజు వారి మంత్రులు, శక్తి శాలి అయిన వాసుదేవుడు నీ సన్నిధికి వచ్చారు. కురుజంగల దేశీయులు చనిపోగా మిగిలిన వారందరూ వచ్చారు. నరశ్రేష్ఠ ! నీ నేత్రాలుతెరు. వారందరినీ చూడవలసింది. ఇక్కడ నేను చేయదగిన కర్తవ్యమంతటినీ చక్కగా సుమకూర్చాను. నీవు చెప్పిన దానినంత సకాలంలో ఏర్పాటు చేశాను. వైశంపాయను డిలా అన్నాడు. కుంతీపుత్రుడు ధర్మజుడితో పలుకగానే గాంగేయుడు, తనను చుట్టుముట్టి ఉన్న భరత వంశీయులందరినీ చూచాడు. అప్పుడు బలవంతుడైన వాగ్మి భీష్ముడు యుధిష్ఠిరుని విశాలమైన భుజాని పట్టుకొని, ఉదయిస్తున్నమేఘనాదంతో కాలానికి తగ్గ మాట పల్కాడు. "కుంతీపుత్ర యుధిష్ఠిర! దైవంవల్ల నీవు అమాత్యులతో కూడి సరియయిన కాలంలో వచ్చావు. దినకరుడైన సహస్రాంశువు తనగమనాన్ని మార్చుకొన్నాడు. ఉత్తరాయణం వచ్చింది. నేడు వాడియైన ఈ బాణాలములుకుల మీద ఏబది ఎనిమిది రోజులు శయనించాను. ఈరోజులన్నీ వంద సంవత్సరాల్లా భారంగా

గడిచాయి. యుధిష్ఠిరా ! పరమశుభప్రదమైన మాఘమాసం వచ్చింది. ఇది శుక్ల పక్షం దీనిలో రెండు భాగాలు గడిచి, మూడవ భాగం వచ్చింది. "గాంగేయుడు ధర్మపుత్రుడైన యుధిష్ఠిరునితో ఇలా చెప్పి ధృతరాష్ట్రుని దగ్గరకు పిలిచి కాలానుగుణంగా మాట్లాడాడు. భీష్ముడిలా అన్నాడు "రాజా! అన్ని ధర్మాలు తెలిసినవాడవు. అర్థసంశయాలను చక్కగా నిర్ణయించేవాడవు. నీవు బహుశ్రుతులైన విప్రులను సేవించావు. రాజా! సమస్త వేదశాస్త్రాలను, ధర్మాలను, నాలుగువేదాలను, సమస్త విషయాలను చక్కగా గ్రహించావు. కౌరవ్య! నీవు శోకించవద్దు. జరిగిందంతా అలాగ జరగవలసి ఉంది. నీవు వ్యాసుని నుండి దేవ రహస్యం విన్నావు. రాజా! నీకు పాండుసుతులు ధర్మాన్నిబట్టి నీకుమారులే. వారు పెద్దలను సేవించేవారు. నీవు ధర్మమార్గంలో ఉండి వారందరినీ రక్షించు ధర్మరాజు నిర్మలాంతఃకరణుడు. నీ ఆజ్ఞను పాటిస్తాడు. ఇతడు దయాశాలి.పెద్దలపట్ల గౌరవం ఉన్న వాడు. నాకు తెలుసు నీ కుమారులు క్రోధలోభాలకు లొంగిపోయిన దుర్మార్గులు ఈర్ష్యకలవారు. చెడ్డపనులనేకంచేశారు. వారిని గురించి శోకించకు." వైశంపాయనుడిలా అన్నాడు. "బుద్ధిమంతుడైన ధృతరాష్ట్రునితో ఇలా అన్నాక భీష్ముడు, మహానుభావుడైన వాసుదేవునితో పలికాడు. భీష్ముడిలా అన్నాడు. "భగవంతుడా! దేవాదిదేవ సురాసుర పూజిత! త్రివిక్రముడా! శంఖచక్రగదాధర! నీకు నమస్కారం చేస్తున్నాను. నీవు వాసుదేవుడవు. హిరణ్యస్వరూపుడవు. పురుషోత్తముడవు. సూర్యుడవు. విరాడ్రూపుడవు. జీవాత్మవు. సనాతనమైన పరమాత్మవు నీవే. పుండరీకాక్ష! వైకుంఠ! పురుషోత్తమ! నన్ను నిత్యం నీవే రక్షించాలి. కృష్ణ! నన్ను శరీరం విడవడానికి అనుమతించు. నీకు పాండు సుతులు సదా రక్షింపదగినవారు. వారికి నీవే దిక్కు. అప్పుడే మందబుద్ధి, దుర్బుద్ధి అయిన దుర్యోధనునితో చెప్పాను. కృష్ణుడెటు ఉంటే ధర్మమటు ఉంటుంది. ధర్మం ఉన్న వైపే జయం లభిస్తుంది. పుత్ర ! వాసుదేవుడు గొప్ప తీర్థసమానుడు. అతని ద్వారా పాండవులను ఉపశమింపచేసి సంధి చేసుకోవటానికి ఇదే మంచి కాలం. ఇలా నేను పదేపదే చెప్పాను. మందబుద్ధి, మూర్ఖుడు, నామాట వినలేదు. పృదివినంతను చంపి, తను చచ్చాడు. కృష్ణా! నీవు సనాతన ఋషివని, దేవుడవని నాకు తెలుసు, నీవు నరునితో కూడి బదరికావనంలో బహు కాలం తపస్సు చేసిన వాడవని గ్రహించాను. ఈ విషయం నీకు నారదుడు, మహా తపస్వి వేదవ్యాసుడు కూడా చెప్పారు. మనుష్యులుగ జన్మించిన కృష్ణార్జునులే నరనారాయణులు. కృష్ణ! అటువంటి నువ్వు నన్నను గ్రహించు. ఈ కళేబరాన్ని విడిచిపెడతాను. నీవు నన్ను అనుమతిస్తే పరమోత్తమలోకాల్ని పొందుతాను." వాసుదేవుడిలా అన్నాడు. "మహారాజా! భీష్మ ! నిన్నను

మతిస్తు న్నాను. నీవు వసువులను చేరుకొంటావు. మహాద్యుతిమంతుడా! ఈలోకంలో నీవు చేసిన పాపమేదీ లేదు. రాజర్షీ! నీవు మార్కండేయుడిలా పితృభక్తుడవు. ఆకారణంగా మృత్యువు నీవద్ద సేవకునివలె వంగి ఉంటుంది." వైశంపాయనుడు అన్నాడు. శ్రీకృష్ణుడిలా చెప్పగానే గాంగేయుడు పాండవులను ధృతరాష్ట్రాదులను సమస్త స్నేహితులను ఉద్దేశించి ఇలా అన్నాడు. "ఆర్యులారా! ప్రాణాలను విడవాలనుకొంటున్నాను. మీరందరూ అనుమతించండి. ఎప్పుడు సత్యం కోసం ప్రయత్నించండి. సత్యమే గొప్పబలం. దయగలిగి ఉండండి. సదా ఆత్మసంయమనం కలిగి ఉండండి. భరతవంశీయులారా ! బ్రాహ్మణభక్తులు గాను, ధర్మశీలురుగాను, తపస్సు చేసేవారు గాను ఉండండి." స్నేహితులందరికీ ఈ విధంగా చెప్పి వారిని కౌగిలించుకొని, ధీమంతుడైన భీష్ముడు యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "రాజా ! నీవు ఎల్లప్పుడూ ప్రాజ్ఞులైన బ్రాహ్మణులను విశేషంగా పూజించు. గురువులను, ఋత్విక్కులను పూజించు."

168. భీష్మ నిర్యాణము.

వైశంపాయనుడన్నాడు. "శంతనపుత్రుడు, అరిందముడు, కౌరవ శ్రేష్ముడు అయిన భీష్ముడు కురువంశీయులతో అలా పలికి ముహూర్తకాలం మౌనంగా ఉండిపోయాడు. ఆత్మను క్రమాన్ననుసరించి అనుసంధానం చెయ్యటం ప్రారంభించాడు. అతనిచే క్రమమార్గంలో నిరోధింపబడ్డ ప్రాణాలు ఊర్ధ్వమార్గంలో ప్రయాణించాయి. ఎందరో మహాత్ములు, మహర్షులు, వ్యాసాదులు ఉన్న ఆ ప్రదేశంలో ఆశ్చర్యకరమైన విషయం జరిగింది. శంతనుకుమారుడు భీష్ముడు యోగాభ్యాసంలో ఏయే శరీరభాగాల నుండి ప్రాణాలను సంహరించాడో ఆయా శరీర భాగం శల్యవిముక్తమయ్యింది. అందరూ చూస్తుండగానే క్షణకాలంలో భీష్ముడు సమస్త శల్యాల నుండి విముక్తుడయ్యాడు. దాన్ని చూసి అక్కడున్న వ్యాసాదిమునులందరితో పాటు వాసుదేవాది ప్రముఖులందరూ ఆశ్చర్యపోయారు. రాజా ! ఆ సమయంలో అన్ని శరీర భాగాల నుండి చక్కగా నియమించబడ్డ భీష్ముని ప్రాణాలు శిరస్సును చీల్చికొని స్వర్గానికి ఎగిరిపోయాయి. దేవదుందుభులు మ్రోగాయి. పుష్పవర్షం కురిసింది. సిద్ధులు, బ్రహ్మర్షులు "భళా భళా" అని అభినందించారు. భీష్ముని శిరః ప్రదేశం నుండి గొప్ప ఉల్కవలె గొప్ప వెలుగు వెలికివచ్చి, ఆకాశంలో కన్పించి అంతర్ధానమైంది. రాజశ్రేష్ఠ ! ఈ రీతిగా భరతవంశాన్ని ఉద్ధరించిన భీష్మనరపాలుడు కాలానికి వశమయ్యాడు. తర్వాత చెక్కలను, గంధద్రవ్యాలను, బహువిధ శ్రేష్ఠ వస్తువులను పేర్చి, మహాత్ములైన పాండవులు

గొప్ప చితిని ఏర్పరిచారు. వారిలో యుయుత్సుడు కూడ కలిశాడు. ఇతరులందరూ ప్రేక్షకులయ్యారు. యుధిష్ఠిరుడు, మహామతి విదురుడు, కురువంశీయుడైన భీష్ముని పట్టుబట్టలతో, మాలలతో కప్పివేశారు. యుయుత్సుడు ఉత్తమమైన ఛత్రాన్ని భీష్మునికి పట్టాడు. భీమసేనార్జునులు చామరాలతో వీచారు. మాద్రీ పుత్రులిద్దరూ తలపాగాలు ధరింప చేశారు. కౌరవేశ్వరుని స్త్రీలందరూ, కురుకుల శ్రేష్ఠుడైన భీష్మునికి విసనకర్రలు పట్టుకొని అన్నివైపుల నుండి వీచారు. తర్వాత ఆ మహాత్మునికి శాస్త్రప్రకారం పితృకార్యాన్ని నిర్వర్తించారు. అగ్నిలో హోమద్రవ్యాలను పుష్కలంగా ఆహుతి చేశారు. సామవేత్తలు సామగానం చేశారు. తర్వాత గంధపు కట్టెలతో ఆ కాలానికి తగిన వస్తువులతో కాలాగురువంటి ద్రవ్యాలతో, రకరకాల గంధద్రవ్యాలతో గాంగేయుని కప్పి వేసి, చితికి నిప్పంటించారు. ధృతరాష్ట్రాదులందరూ మండుతున్న చితికి ప్రదక్షిణం చేశారు. కురుశ్రేష్ఠులందరూ గాంగేయునికి అగ్ని సంస్కారం చేశారు. కురుశ్రేష్ఠులప్పుడు పవిత్రమయిన గంగానదికి వెళ్ళారు. ఆ నది ఋషుల చేత సేవింపబడేది. వ్యాస, నారద, అసిత మహర్షులు వారి ననుసరించారు. కృష్ణుడు, భరతవంశ స్త్రీలు, వచ్చిన పురజనులు అందరూ మహాత్ముడయిన గాంగేయునికి తిలోదకాలు సమర్పించారు. క్షత్రియ శ్రేష్ఠులు, అక్కడకు వచ్చిన జనమంతా శాస్త్రప్రకారం ఉదకం సమర్పించాక, గంగానది ప్రవాహం నుండి బయటకు వచ్చింది. ఆ నీటి నుండి బయటకు వచ్చిన గంగాదేవి శోకంతో నిండి, విలపిస్తూ, ఆక్రోశిస్తూ కౌరవులతో ఇలా అంది. "పూజ్యులారా ! నేను జరిగిందంతా చెప్తాను వినండి. రాజుల నడవడికలవాడు, గొప్ప ప్రజ్ఞ కలవాడు, సద్వంశసంజాతుడే భీష్ముడు. కురువృద్ధులను సత్కరించేవాడు. తండ్రిపట్ల భక్తి కలవాడు. గొప్ప వ్రతాన్ని ఆచరించినవాడు. పరశురాముని చేత కూడా పూర్వం పరాజయం పొందనివాడు. దివ్యాస్త్రాలు కల్గిన మహావీరుడు. నేడు శిఖండి చేత చంపబడ్డాడు. రాజులారా ! నా హృదయం రాయిలా కఠినంగా మారిపోయింది. నాకు ప్రియమైన పుత్రుని చూడకుండా జీవిస్తున్నానంటే నాది రాతి గుండె మాత్రమే. కాశీపురంలో స్వయంవర సమయంలో క్షత్రియ సమూహమంత కలిసి దండెత్తి వచ్చారు. ఒంటరిగా ఒకే ఒక్క రథంలో భీష్ముడు వారందరినీ జయించి, కన్యలందరినీ తీసుకుని వచ్చాడు. భీష్మునితో సమాన బలం కల వాడీ భూమండలంలో లేడు. అటువంటి భీష్ముడు శిఖండిచేత చంపబడ్డాడని విని, నా హృదయం బ్రద్దలు కాలేదు. కురుక్షేత్రంలో యుద్ధంలో మహాత్ముడైన పరశురామునితో జయింపబడనివాడు. నేడు పెద్ద ప్రయత్నం లేకుండా శిఖండిచే చంపబడ్డాడు." ఈ విధంగా రకరకాలుగా ఆక్రోశిస్తున్న గంగాదేవిని

కృష్ణుడనునయించాడు. విభుడయిన దామోదరుడు గంగాదేవి నిలా అనునయించాడు. "శుభురాలా ! బాధపడకు. శుభదర్శనా ! విచారించకు. నీ కొడుకు పరమోత్తమలోకాలను పొందాడు. సందేహం లేదు. శుభురాలా ! ఈయన వసువులలో ఒకడు. మహాతేజస్వి. శాపదోషం వల్ల భూమి మీద జన్మించాడు. శాపం వలన మనుష్యత్వం పొందిన వానిని గూర్చి విచారించకు. ఆ వసువే ఈయన. రణభూమిలో క్షాత్రధర్మంతో పోరాడాడు. ఈయనను అర్జునుడు చంపాడు కానీ శిఖండి కాదు. కురుశ్రేష్ఠుడైన ఈ భీష్ముడు మహాసంగ్రామంలో బాణాలనెత్తి నిలిస్తే ఈయనను చంపటానికి సాక్షాత్తూ మహేంద్రుడూ కూడా చాలడు. శుభాననా ! నీ కొడుకు తన ఇష్టం మేరకు స్వర్గానికి వెళ్ళాడు. ఆయనను యుద్ధరంగంలో సమస్త దేవతలూ కలిసి చంపలేరు. దేవి ! ఈ నీ పుత్రుడు వసువులతో కలసిపోయాడు. నీవు కలత చెందకు." వైశంపాయనుడిలా అన్నాడు. ఈ విధంగా కృష్ణుడు, వ్యాసుడు చెప్పగా ఆ శ్రేష్ఠనది గంగ, మహారాజా ! శోకాన్ని విడిచిపెట్టి తన నీటిలో ప్రవేశించింది. రాజా ! కృష్ణుడు మొదలయిన రాజులందరూ గంగకు పూజలు చేసి, ఆమె అనుమతి నొంది వెనక్కు మరలారు."

ఇది అనుశాసనపర్వం



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకి తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీక్ష్ణబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.